# పాతివ్రత్యం నుండి ఫెమినిజం దాకా

(ఆత్మకథ)




## మల్లాది సుబ్బమ్మ

భారతదేశంలో ఆడవారి
ఆత్మకథలు అరుదుగా కన్పిస్తాయి.
ఆత్మకథ విశిష్టమైన సాహితీ ప్రక్రియ.
జీవిత కథలో కథానాయకుల
జీవిత కాలంలోని ఉద్యమాలు,
సామాజిక పరిస్థితులు ప్రతిబింబిస్తాయి.
అదనంగా ప్రధాన పాత్రధారి మనోగత
విషయాలు ఆత్మకథలో వెలికి వస్తాయి.

ప్రసిద్ధుల ఆత్మకథల పఠనం వల్ల
వారెందుకు, ఎలా ప్రముఖులయ్యారో విదిత
మవుతుంది. తద్వారా చదువరులు
ప్రభావితులవుతారు. సామాజిక సేవకు,
సామాజిక విప్లవ సాధనకు గడంగుతారు.

మల్లాది సుబ్బమ్మగారు పేరెన్నికగన్న
మహిళోద్యమ కార్యకర్త. ఆమె జీవిత చరిత్రలో
ఆనాటి స్త్రీల స్థితిగతులు. సామాజిక పరిణామంలోనే
దశలు, సంస్కరణ కార్యక్రమాలు, విప్లవోద్యమాలు
ముఖ్యంగా ఫెమినిస్టు విప్లవం, హేతువాద ఉద్యమం,
మానవవాద కృషి, ప్రజాస్వామిక ప్రయత్నం,
పత్రికా ప్రబోధం, సేవాదృక్పథం, నిర్మాణాత్మక
చర్యల ఆవశ్యకత, జాగృతి చైతన్యాల ఉద్దీపన,
మానవ విలువలపట్ల అవగాహన, కార్యశీలత
దర్శనమిస్తాయి.

స్త్రీ స్వేచ్ఛ మానవ సమాజానికి ఎందుకు
అవసరమో, దానిని సాధించడానికి ఆమె కృషి
ఏపాటిదో, ఆమె ఎంతవరకు కృతకృత్యులయ్యారో
తెలుస్తుంది.

సామాజిక భద్రత, ఆర్థిక
స్వాతంత్ర్యం వున్నా, స్త్రీలు న్యూనతాభావంలో
మునిగి తేలుతుంటే స్వేచ్ఛకు వారు దూరమవుతారనే
పచ్చి నిజాన్ని గ్రహిస్తారు చదువరులు. స్వేచ్ఛ
అవిభాజ్యం అని, స్వేచ్ఛా సమానత్వాలు స్త్రీల
జన్మహక్కని చాటిచెప్పేదే ఈ గ్రంథం.

# పాతివ్రత్యం నుండి ఫెమినిజం దాకా

(ఆత్మకథ)

మల్లాది సుబ్బమ్మ

మల్లాది సుబ్బమ్మ ట్రస్టు
9, ఎం.ఐ.జి. హెచ్. కాలనీ, మెహిదీపట్నం,
హైదరాబాదు – 500 028.

మల్లాది సుబ్బమ్మ ట్రస్టు నెం. 8
**పాతివ్రత్యం నుండి ఫెమినిజం దాకా**
గ్రంధకర్త: మల్లాది సుబ్బమ్మ

ప్రధమ ముద్రణ : ఆగస్టు 1991
ప్రతులు : 2000

గ్రంథంలో సర్వహక్కులూ
మల్లాది సుబ్బమ్మ ట్రస్టువి.
9, ఎం.ఐ.జి. హెచ్. కాలనీ
మెహిదీపట్నం, హైదరాబాదు -500 028
ఫోను: 35429

ముఖచిత్రం: శ్రీ భావరాజు వి. సత్యమూర్తి

సోల్ డిస్ట్రిబ్యూటర్సు:
**విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్**
విజ్ఞాన భవన్, హైదరాబాదు-500 001

ప్రతులకు:
విశాలాంధ్ర బుక్ హౌస్
హైదరాబాద్, విజయవాడ, అనంతపురం,
కాకినాడ, విశాఖపట్నం, తిరుపతి,
గుంటూరు, హనుమకొండ.

ముద్రణ:
**కళాజ్యోతి ప్రాసెస్ ప్రైవేట్ లిమిటెడ్**
హైదరాబాదు-500 020.

సాదా ప్రతి రు. 80:00
మేలు ప్రతి రు. 150:00



# మల్లాది సుబ్బమ్మ


| | | |
|---|---|---|
| స్థాపక అధ్యక్షులు | : | మహిళాభ్యుదయ సంస్థ |
| డైరెక్టరు | : | స్త్రీ విమోచన |
| ప్రధాన కార్యదర్శి | : | అభ్యుదయ వివాహ వేదిక |
| సంచాలకులు | : | కుటుంబ సలహా కేంద్రం |
| సంపాదకులు | : | స్త్రీ స్వేచ్ఛ |
| స్థాపక ట్రస్టీ | : | మల్లాది సుబ్బమ్మ ట్రస్టు |
| | : | మహిళాభ్యుదయ ట్రస్టు |
| కార్యదర్శి | : | శ్రామిక మహిళా సేవ |
| సమావేశకర్త | : | వరకట్న హింసల దర్యాప్తు కమిటీ |
| కార్యదర్శి | : | సుబ్బమ్మ షెల్టరు |



పెళ్ళిచూపుల అలంకరణ



కాపురానికి వచ్చిన కొత్తలో (1939)



కామేష్‌తో (1942)



విజయతో (1950)



పిల్లలు (1963)



కుటుంబం (1967)

# ఈ గ్రంథంలో ఇదీ వరుస


| | | | |
|---|---|---|---|
| 1. నమస్సుమాంజలులు | | | 13 |
| 2. అభినందన | | | 16 |
| 3. శుభాశీస్సులు | | | 17 |
| 4. స్వయంసిద్ధ | | | 18 |
| 5. శుభాకాంక్షలు | | | 21 |
| 6. కరుణా తరంగిణి | | | 22 |
| 7. మడమ తిప్పని మహిళా ప్రస్థానం | | | 24 |
| 8. మధ్య తరగతి సంస్కారానికి గీటురాయి / సానరాయి | | | 27 |
| **భాగం I** | | **ఉపక్రమణిక** | 31 |
| **భాగం II** | | **నేను : నా కుటుంబం** | 39 |
| అధ్యాయం | 1. | అనుభవాలు : జ్ఞాపకాలు | 42 |
| | 2. | నా చిన్ననాటి స్థితిగతులు | 59 |
| | | మూఢాచారాల ముసుగులో | |
| | | ఆనాటి సొసైటీ | |
| | | అమ్మమ్మ గారి ఊరు | |
| | | మనువుకు వారసురాలు మా అమ్మమ్మ | |
| | 3. | నా పెళ్ళి ప్రయత్నాలు | 68 |
| | | నా పెళ్ళి సంగీతం | |
| | | తప్పిపోయిన నా పెళ్ళి సంబంధం | |
| | 4. | సాంస్కృతిక కార్యక్రమాలు | 71 |
| | 5. | మెట్టినిల్లు | 73 |
| | | సంప్రదాయాల బలిమి | |
| | | నా భర్త నిర్లిప్తత | |
| | | మాదంపతుల మధ్య సఖ్యత | |
| | | దాంపత్య జీవితం | |
| | | ఆదర్శ దంపతులంటే | |
| | 6. | నా సంతానం | 82 |
| | | యోగ్యులయిన నా బిడ్డలు | |
| | | పిల్లల పెళ్ళిళ్ళు | |
| | | కోడళ్ళతో అనుబంధం | |
| | 7. | నా అత్తమామలు | 93 |
| | | మామగారు | |
| | | పుణ్యలోకాలకు నా అత్తగారి ఆరాటం | |

| | | | |
|---|---|---|---|
| **భాగం III** | | **జాగృతి : చైతన్యం** | **100** |
| అధ్యాయం | 1 | జాగృతి | 101 |
| | 2 | సేవా కార్యక్రమం | 103 |
| | | సేవాభావ ఆవిర్భావం | |
| | | మహిళా మండలులు | |
| | 3. | విద్య | 106 |
| | | విద్యాసక్తి | |
| | | విద్య : శిక్షణ | |
| | | కాలేజీలో చేరని కాలేజీ చదువు | |
| | | అష్టకష్టాలుపడి నేర్చుకున్న అష్టపదులు | |
| | 4. | సోషల్ వర్కర్సు శిక్షణానుభవం | 112 |
| **భాగం IV** | | **ఆందోళనలు – ఉద్యమాలు** | **116** |
| అధ్యాయం | 1 | ప్రత్యేక ఆంధ్రోద్యమం | 121 |
| | 2 | కుల వ్యతిరేక కృషి | 130 |
| | | కులతత్వ భావన ఎలా పోయింది | |
| | | కులనిర్మూలనోద్యమంలో | |
| | 3 | సామాజిక కార్యక్రమాలు | 134 |
| | | నిర్మాణాత్మక చర్యలు | |
| | | కుటుంబ నియంత్రణోద్యమం | |
| | | హేతువాద ఉద్యమం | |
| | | వివిధ ప్రగతి నిరోధాలు | |
| | | సిద్ధాంత వ్యతిరేకత | |
| | 4 | రాజకీయ ఉద్యమాలు | 144 |
| | | రాజకీయాలలో | |
| | | ఎమర్జెన్సీ ప్రభావం | |
| | | రాడికల్ హ్యూమనిస్టు సంఘం | |
| **భాగం V** | | **నా సాహితీ యాత్ర** | **154** |
| అధ్యాయం | 1 | వ్యాస రచన | 155 |
| | 2. | పత్రికా నిర్వహణ | 159 |
| | 3 | సాహితీ రూపాలు | 167 |
| | | విమర్శ గ్రంథాలు, చరిత్ర | |
| | | నవలలు, కథలు, కథానికలు | |
| | | రేడియో నాటకం | |
| | | ఇతర సారస్వత కృషి | |

| | | | |
|---|---|---|---|
| | | నా సాహిత్యానికి కేంద్రం స్త్రీ | |
| | | నా భావాల రూపమే నా సాహిత్యం | |
| **భాగం VI** | | **సంస్థల నిర్మాణం** | **183** |
| అధ్యాయం | 1. | నాంది | 184 |
| | | హైదరాబాదు రాక : అభివృద్ధి పథకాలు | |
| | | వికాస కేంద్రస్థాపన | |
| | 2 | మహిళాభ్యుదయ సంస్థ : దాని శాఖలు | 187 |
| | | కుటుంబ సలహా కేంద్రం | |
| | | సుబ్బమ్మ షెల్టరు | |
| | | వరకట్న హింసల దర్యాప్తు సంఘం | |
| | | స్త్రీ విమోచన శిక్షణా కేంద్రం | |
| | 3 | అభ్యుదయ వివాహ వేదిక | 198 |
| | 4 | ఇతర సంస్థలు | 202 |
| | | శ్రామిక మహిళా సేవ | |
| | | మహిళాభ్యుదయ గ్రంథాలయం | |
| | | మహిళా హక్కుల పరిరక్షణ కేంద్రం | |
| | 5 | ధర్మ సంస్థలు | 207 |
| | | మల్లాది సుబ్బమ్మ ట్రస్టు | |
| | | మహిళాభ్యుదయ ట్రస్టు | |
| **భాగం VII** | | **మాటలు : చేతలు** | **210** |
| అధ్యాయం | 1 | వక్తృత్వం | 211 |
| | 2 | ఇతరులతో సమిష్టి కృషి | 214 |
| భాగం **VIII** | | అవీ : ఇవీ | 219 |
| అధ్యాయం | 1 | ఆడవారి ఆత్మకథలు అరుదేమో! | 220 |
| | | ఎందుకీ ఆత్మకథ | |
| | 2 | పరిగణన : పురస్కారాలు | 223 |
| | 3 | ప్రశంసలు : అభిశంసనలు | 227 |
| | 4 | షష్టిపూర్తికి పొందిన స్ఫూర్తి | 236 |
| | 5 | నా యూరపు పర్యటనానుభవాలు | 238 |
| | 6 | పేరు మార్చుకోవాలనే ప్రాకులాట | 243 |
| | 7 | ఇంగ్లీషు మాట్లాడాలనే అభిలాష | 245 |
| | 8 | నా ఆపరేషన్ల హంగామా | 247 |
| | 9 | ఆర్థికంగా నా స్థితిగతులు | 249 |
| | | ఆడంబరాలు, ఆభరణాల పై మోజు | |

| | | | |
|---|---|---|---|
| | | ఆర్థికంగా నా దశలు | |
| | | నా పొదుపరితనంతోపాటు త్యాగం | |
| | | వీలునామా | |
| | 10 | తరాలు : ఆశయాలు | 254 |
| | | తరాల అంతరం | |
| | | అత్తగా నా ఆశయాలు | |
| | 11 | సంఘ సేవ | 257 |
| | | నా నేత్ర దానం | |
| | | సంఘ సేవలో స్వానుభవాలు | |
| | | వ్యక్తిగత సమస్యలు : సమాధానాలు | |
| | | లక్ష తెచ్చిన దశాబ్ది సావనీరు | |
| | 12 | నేటి సమాజం | 266 |
| | | సాంఘిక విషదంష్ట్రలలో ఎందరో | |
| | | సామాజిక రీతి | |
| | | విచిత్ర ధోరణులు : వింత మనస్తత్వాలు | |
| | 13 | సినిమా ప్రపంచం | 272 |
| | | ఫిల్మోత్సవం | |
| | | సినిమాల్లో నా నటనానుభవం | |
| | 14 | ఆత్మ పరిశీలన | 274 |
| | | సాహిత్యా భిరుచి | |
| | | నాయకత్వ లక్షణాలున్నాయా | |
| | | విస్మరించలేని నాలోని లోపాలు | |
| **భాగం IX** | | **కృతజ్ఞత** | **280** |
| అధ్యాయం | 1 | నా వెన్నుతట్టి లేపిన ఆ మహిమాన్వితుడు | 281 |
| | 2 | రామ్మూర్తిగారి వ్యక్తి చిత్రణ | 284 |
| | 3 | భర్త తోడ్పాటు అనౌచిత్యమా? | 286 |
| **భాగం X** | | **అనాగరిక దశనుండి ఆధునికతవైపు** | **288** |
| అధ్యాయం | 1 | నేను నేనుగా ఎలా రూపొందాను? | 293 |
| | 2 | జర్నలిస్టునెలా అయ్యాను | 294 |
| | 3 | రేషనలిస్టుగా ఎలా పరిఢవిల్లాను | 298 |
| | 4 | ఫెమినిష్టునెందుకు అయ్యాను | 301 |
| | 5 | ఎలా హ్యూమనిష్టునయ్యాను? | 304 |
| | 6 | నేను | 307 |
| | | ఎస్కేపిస్టును కాను | |

| | | | |
|---|---|---|---|
| | | నేనెవరు. నా ఫిలాసఫీ ఏమిటి? | |
| | | నా భవిష్యత్తు గురించి | |
| | | ఇది ఆత్మస్తుతి అంటారా? | |
| | | సందేశం | |
| | | ఆలస్యం అమృతం విషం | |
| | | వెనుక చూపు | |
| **భాగం II** | | **స్పందన : ప్రతి స్పందన** | **317** |
| అధ్యాయం | 1 | సమర్పణ | 318 |
| | 2 | నిర్ధార్యమాణం | 321 |
| భాగం **XII** | | అనుబంధం | 325 |
| అధ్యాయం | 1 | తెలుగు గ్రంధాలు | 326 |
| | 2 | తెలుగు కరపత్రాలు | 327 |
| | 3 | ఆంగ్లంలో తర్జుమాలు | 328 |
| | 4 | మళయాళంలో భాషాంతరీకరణలు | 328 |
| | 5 | భేటీలు | 329 |
| | 6 | జీవిత చిత్రణలు | 330 |
| | 7 | సన్మానాలు, సత్కారాలు | 331 |
| | 8 | రేడియో | 333 |
| | 9 | టి.వి. | 336 |
| | 10 | సంచికలలో వ్యాసాలు | 337 |
| | 11 | సెమినార్లలో పరిశోధనా పత్రాలు | 338 |
| | 12 | 'ప్రశ్నలు – సమాధానాలు' శీర్షిక | 341 |
| | 13 | 'మహిళా వికాసం' శీర్షిక వ్యాసాలు | 341 |
| | 14 | పత్రికలలో వ్యాసాలు | 341 |
| | 15 | మసా సభలు | 349 |
| | 16 | వివాహాలు | 352 |
| | 17 | ఉద్యమాలు | 354 |
| | 18 | సభలు : ఉపన్యాసాలు | 354 |
| **అభిప్రాయాలు** | | | **355** |

# మల్లాది సుబ్బమ్మ
# ఆత్మకథ ఆవిష్కరణ సభ
# పాతివ్రత్యం నుండి ఫెమినిజం దాకా

**తే. 1-8-91 సాయంత్రము గం. 5-30 ని.లకు గురువారము**
**త్యాగరాయ గానసభ (చిక్కడపల్లి)**

| | | |
|---|---|---|
| అధ్యక్షులు | : | శ్రీ ఆవుల సాంబశివరావు<br>(ఆం.ప్ర. హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి) |
| గ్రంథ ఆవిష్కరణ | : | డా॥ సి. నారాయణ రెడ్డి<br>(ఉపాధ్యక్షులు, తెలుగు విశ్వవిద్యాలయం) |
| గ్రంథకర్త పరిచయం | : | శ్రీ పోలు సత్యనారాయణ<br>(డైరెక్టరు, ఇందిరా గాంధి జాతీయ<br>సార్వత్రిక విశ్వవిద్యాలయం) |
| ఆశీస్సులు | : | శ్రీ దేవులపల్లి రామానుజరావు<br>(ప్రసిద్ధ సాహితీవేత్త) |
| శుభాకాంక్షలు | : | డా. ఆర్.వి.ఆర్. చంద్రశేఖరరావు<br>(ఉపాధ్యక్షులు, ఆం. ప్ర. సార్వత్రిక విశ్వవిద్యాలయం) |
| అభినందన | : | డా. వనజా అయ్యంగార్<br>(మహిళా విశ్వవిద్యాలయ మాజీ ఉపాధ్యక్షులు) |
| | : | శ్రీ పిరాట్ల వెంకటేశ్వర్లు<br>(ప్రముఖ పాత్రికేయులు) |
| | : | శ్రీమతి సూర్యదేవర రాజ్యలక్ష్మమ్మ<br>(సర్వోదయ నాయకులు) |
| పుస్తక పరిచయం | : | శ్రీ జ్వాలాముఖి<br>(ప్రజా విప్లవ కవి) |

మహిళోద్యమ, మానవవాద, హేతువాద, ప్రజాస్వామ్య ఉద్యమాల అభిమానులు, సత్యాన్వేష కులు, స్వేచ్ఛా పిపాసులు, సారస్వత ప్రియులు, సహృదయులు ఎల్లరూ రా కోరుతాం

9, ఎం.ఐ.జి. హెచ్.
మెహిదీపట్నం, హైదరాబాదు
పిన్: 500 028 ఫోన్: 35429

**మల్లాది సుబ్బమ్మ ట్రస్టు**
**స్త్రీ విమోచన శిక్షణా కేంద్రం**

# నమస్సుమాంజలులు

ఒక్క తాజ్ మహల్ కట్టాలంటే ఒక్క శిల్పి మాత్రమే చాలడు. కట్టడాన్ని ఊహించేవారు, ప్లాను వేసేవారు, రాళ్ళు మోసేవారు, కట్టుబడి చేసేవారు, రూపురేఖలకు మెరుగులు చేకూర్చే వారు, జీవకళను పొదిగేవారు అందరూ కలిసి సామూహిక సహకారం అందిస్తేనే శిల్పి కళాఖండాన్ని సమాజానికి సమకూర్చగలడు. అలాగే నా ఆత్మకథకు ప్రేరణ కలిగించినవారు, ఉత్తేజాన్ని అందించినవారు, ప్రోత్సాహ పరచినవారు, ఆసాంతం చేదోడుగా ఉన్నవారు ఎందరో ఉన్నారు.

నా ఆత్మకథలో నా జీవితగాథ ప్రతిబింబిస్తుంది. అది అరువది సంవత్సరాల కథ. అందులో ఎన్నో పాత్రలు వచ్చాయి. మరెన్నో మరుగున పడిపోయాయి. ఎన్నో సంఘటనలు జరిగాయి. ఇంకెన్నో ఆటుపోట్లు సంభవించాయి. నా సామాజిక సేవకు, సారస్వత కృషికి అవ్యాజంగా ఆదరాభిమానాలను, సహాయ సహకారాలను అందించిన వారెందరో ఉన్నారు. వారందరినీ పేర్కొని వ్రాస్తే ఒక చిన్న పుస్తకం తయారవుతుంది. అందువల్ల ఆ ప్రయత్నాన్ని విరమించి కొందరిని మాత్రమే పేర్కొని సంతృప్తి పడతాను.

సుబ్బమ్మ గారి లాంటి విదుషీమణులు లక్షకు ఒక్కరుంటే దేశ స్వరూపమే మారిపోతుంది' అని నన్ను గురించి వ్రాసిన నార్లవారు నా స్మృతి పథంలో మెదులుతున్నారు. మహిళోద్యమ కార్యకర్తలను తీర్చి దిద్దటంలో సాటిలేని మేటి కనుపర్తి వరలక్ష్మమ్మ గారిని, సంఘ సేవ సందర్భంగా నా ఏకలవ్య గురువు దుర్గాబాయ్ దేశ్ ముఖ్ ను, కుటుంబ సంక్షేమ కార్యకర్తగా నాకు అవకాశం కల్పించిన ప్రేమలతా గుప్తను నేను నా జీవితంలో మరచిపోలేను. నా పై గల వాత్సల్యంతో తమ సిద్ధాంతాలను కూడా త్రోసిరాజని నా విద్యకు, అభ్యున్నతికి తోడ్పాటు నిచ్చిన నా అత్తమామల ఋణం తీరేది కాదు. తన జీవిత విధానం వల్ల నన్ను ఒక హ్యూమనిస్టుగా మలచిన తార్కుండేను ఈ సందర్భంగా గుర్తు చేసుకుంటున్నాను. మహిళోద్యమానికి మార్గదర్శకురాలిగా వుంటూ నా ఫెమినిస్టు భావాలకు ఉత్తేజం కలిగించిన వీణామజుందారు నాకు గురుతుల్యులు.

నను, అభిమానించి గౌరవించిన మానవవాదుల జంట వెక్సలర్ దంపతులు, ఛార్లెస్ బ్రాడ్ లా స్థాపించిన నేషనల్ సెక్యులర్ సొసైటీ కోశాధికారి జి.ఎన్. దేవదేఖర్ లాంటివారు ఈ సమయంలో నా దృష్టికి దూరం కాలేరు. నాకు అవార్డు ప్రదానం చేసిన తెలుగు విశ్వవిద్యాలయం, అభినందన సంస్థ, ఆలిండియా ఉమెన్స్ కాన్ఫరెన్సు, ప్రజా ఆలోచనా వేదిక లాంటి సంస్థలు విస్మరించరానివి.

నా పుసకాలు ఇతర భాషలలో రావాలని కోరుతూ నన్ను ప్రోత్సహించడమే కాక, నా చేత సీ, శిక్షణా కేంద్ర స్థాపన చేయించిన క్రాసు అధిపతి శ్రీ ఎం. కురియన్ నాకు చెందజేసిన బలాన్ని జ్ఞాపకం చేసుకోవలసిన తరుణమిది.

నా ఇంగ్లీషు పుస్తకాలను ప్రింటు చేసి నాకెంతో ఘనతను సంపాదించి పెట్టిన పబ్లిషర్సులో ముఖ్యులు స్టెర్లింగు, ఇండియన్ ఎథీస్టు, అజంతా పబ్లిషర్సు, ఆలిండియా ఉమెన్స్ కాన్ఫరెన్స్, తెలుగు ప్రచురణకర్తలు / పబ్లిషర్సు, స్త్రీ విమోచన, బాలభవన్, మల్లాది పబ్లిషర్స్ ను నేను ఈ సందర్భంగా పేర్కొనడం ఉచితం. నా గ్రంధాన్ని ప్రచురిస్తున్న తెలుగు అకాడమీవారి మేలును మరిచిపోవడం క్షంతవ్యం కాదు.

నా జీవిత గమనాన్ని పరిశీలిస్తూ, నాలుగు గంటలలో నాకు అరువది ఏడు ఏండ్ల నిండిపోతున్న సమయంలో నా గ్రంధావిష్కరణ చేసిన జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీత డా. సి. నారాయణ రెడ్డిగారు నాకు పూజనీయులు. చిరకాలంగా నా శ్రేయోభిలాషులుగా వుంటున్న న్యాయమూర్తి ఆవుల సాంబశివరావుగారు నాకు వందనీయులు. ఇన్నాళు ్ళగా నన్ను ప్రోత్సహిస్తున్న సోదరుడు పోలు సత్యనారాయణ, నా మేలును కోరే డా॥ కేతు విశ్వనాధరెడ్డిగారలకు నేను కృతజ్ఞురాలిని.

వారికెంతో కార్యభారము ఉన్నా నేనడిగినదే తడవుగా నా కోర్కెను మన్నించి నా గ్రంధం పై అభిప్రాయాలను వెలిబుచ్చిన విద్వద్వరేణ్యులకు, గ్రంధావిష్కరణ సభలో పాల్గొని ప్రసంగించిన పెద్దలకు నా కృతజ్ఞతాపూర్వక వందనములు.

1964 నుండి నా వ్యాసాలను ప్రచురిస్తూ, మహిళల మాస పత్రిక 'వనితా జ్యోతి'లో 'కాలమ్' ఇచ్చి నేను రచయిత్రిగా, సాహితీపరురాలిగా రూపొందటానికి సహాయపడిన 'ఆంధ్రజ్యోతి' పత్రికా సంపాదకులు నండూరి రామమోహన రావుగారు చిరస్మరణీయులు. నా స్త్రీ జన సేవాభిలాషను గుర్తించి 'మహిళా వికాసం' శీర్షికను 'కలువబాల' లో నాకు కేటాయించిన 'ఆంధ్రపత్రిక' సంపాదకులు శివలెంక రాధాకృష్ణగారిచ్చిన అండదండలను కొనియాడకుండా' ఉండలేను.

సభలకు, సమావేశాలకు, చర్చలకు, సెమినార్లకు నన్ను ఆహ్వానించి నా ప్రసంగాలకు, ఉపన్యాసాలకు, సమాలోచనలకు ప్రాధాన్యత ఇచ్చిన మహిళా సమాజాలను, స్వచ్ఛంద సంస్థలను, ప్రభుత్వ సంస్థలను, విశ్వవిద్యాలయాలను, కళాశాలలను నేను మర్చిపోవటం ధర్మం కాదు. నాకు విశేష ప్రజాదరణను కలిగించిన ఆకాశవాణి, దూరదర్శన్ ల సాయం శ్లాఘనీయం. నా సంస్థలలోని కార్యకర్తలను నేను విస్మరించలేను. అనేక ఉద్యమాలలో నాకు బాసటగా నిలిచి నన్ను ఆదరించి గౌరవించిన మిత్రులు నాకు అందించిన అండదండలు నాకు కొండంత బలాన్ని చేకూరుస్తున్నాయి.

నా ఈ గ్రంధానికి కావలసిన సమాచారాన్ని నా డైరీల నుండి సేకరించిన ఎన్. సంధ్యారాణి, వ్రాత ప్రతి తయారుచేయడంలో సహాయపడిన డి. సత్యవతీదేవి, నా గ్రంధాన్ని టైపు చేసిన ఎ. అనసూయను, నా జీవితంలోకి ఒక ఆశాజ్యోతిగా ప్రవేశించి గ్రంధ ముద్రణకు అన్ని దశలలో నాకు కుడి భుజంగా నిలిచిన సంఘసేవాభిలాషిణి డి. స్వాతికి నేను ధన్యవాదాలు తెలుపుకుంటున్నాను.

తన కళా కౌశల్యాన్ని నా రేఖా చిత్రంలో పొదిగి, ముఖచిత్రాలు గీసి ఇచ్చిన ప్రసిద్ధ చిత్రకారుడు భావరాజు వి. సత్యమూర్తిగారికి, సకాలంలో పుస్తకాన్ని సర్వాంగ సుందరంగా ముద్రించి ఇచ్చిన మిత్రులు కళాజ్యోతి అధిపతులు సర్వశ్రీ రవీంద్రనాథ్, దేవేందర్, బాపన్నగార్లకు, నా గ్రంథాన్ని ఎడిట్ చేసి దానికి తుది రూపును సమకూర్చిన నా జీవిత సహచరుడు రామమూర్తి గారిని ప్రస్తుతించకపోతే అనౌచిత్యం అవుతుంది. నాకు విశేషమయిన సహాయ సహకారాలందించిన నా బిడ్డలను అభినందిస్తున్నాను. నేను స్థాపించిన సంఘాలలోని సభ్యుల సాయాన్ని, నేను నడుపుతున్న ఉద్యమాలలోని సహచరుల తోడ్పాటును ఎల్ల వేళలా నా ఎరుకలో ఉంచుకుంటాను. పుస్తక ముద్రణకు ఆర్థిక సహాయం చేసిన తెలుగు విశ్వవిద్యాలయం వారికి నా ధన్యవాదాలు.

ఈ గ్రంథ కథ తేదీల ప్రకారం చెప్పలేదు, కాలమానం ప్రకారం సాగలేదు. ఆ మాటకు వస్తే అది ఉద్యమాల పరంగా కూడ నడవలేదు. అంటే వరుస క్రమమూ లేదు, కేవలం విషయ ప్రధానమూ కాదు. రెండింటి కలగలుపు. అయినా కథ కుంటుపడలేదు. ఈ అంశాన్ని చదువరులు గ్రహిస్తారని ఆశిస్తున్నాను.

ముఖ్యంగా ఒక్కమాట చెప్పాల్సి వస్తున్నది. నాకుండే విశేష కార్యక్రమాల జోరులో ఈ గ్రంథాన్ని వ్రాయడానికి నాకు సంవత్సర కాలం పట్టడం, అదీగాక దానిని అనేక దఫాలుగా, అనేక శీర్షికలతో వ్రాయవలసి రావడంవల్ల అక్కడక్కడా పునరుక్తి దోషం కనిపిస్తుంది. కనుక గ్రంథంలోని లోపాలను త్రోసివేసి మంచిని స్వీకరించమని పాఠకులను అభ్యర్థిస్తున్నాను.

**– మల్లాది సుబ్బమ్మ**

# తెలుగు విశ్వవిద్యాలయం

ప్రొ. సి. నారాయణరెడ్డి, ఎం.ఎ., పిహెచ్.డి, డి. లిట్.

వైస్–ఛాన్సలర్.

లలిత కళా క్షేత్రం
పబ్లిక్ గార్డెన్సు,
హైదరాబాదు–500 004.

## అభినందన

ఎదురీదే చేతులుంటే ఏరు దారియివ్వక ఏం చేస్తుంది పయనించే అడుగులుంటె బాట చేతులెత్తక ఏం చేస్తుంది" అన్నాను నా 'ప్ర' పంచపదుల్లో. అక్షరాలా శ్రీమతి మల్లాది సుబ్బమ్మ గారికి అనువర్తించే పంక్తులివి. వాలును బట్టి గాలిని బట్టి సాగిపోయిన వ్యక్తి కాదు ఆవిడ. పరమ సాంప్రదాయిక పరిధిలో పుట్టి పెరిగి, ప్రయోగాత్మక వాతావరణంలో సరికొత్త జీవన ప్రమాణాలను స్వీకరించి, పరిణత స్థాయిలో నమ్మిన ఆదర్శాలకు ప్రతీకగా నిలిచిన వ్యక్తిత్వం ఆమెది. వ్యక్తిదశనుంచి వ్యక్తిత్వదశ వరకు ఎదిగిపోయిన సుబ్బమ్మ గారి క్రమ వికాసానికి శ్రీ రామ్మూర్తిగారు చేసిన దోహదం ఒక భర్తగా మాత్రమేనని అనుకుంటే అది రామ్మూర్తిగారి ఆశయనిబద్ధతను తక్కువ చేసినట్టవుతుంది. ఒక మంచి మిత్రుడిగా, ఆదర్శవాదిగా, కార్యశీలిగా సుబ్బమ్మ గారి జీవన గమనంలో ఆయన నిర్వహించిన నిర్మాణాత్మక పాత్ర అది.

సుబ్బమ్మ గారంటేనే సూటిమాటకూ, తేటమనసుకూ మరో పేరు. సంఘ సంస్కరణ రణంలో ఆవిడ ఝుళిపించిన హేతువాద ఖడ్గం, సాధించిన మానవతావాద విజయం చరిత్రకెక్కిన సత్యాలు. చిత్తశుద్ధితో ఉద్యమిస్తే లక్ష్యసిద్ధి లభించక తప్పదు. కర్మ యోగానికి కాస్తాత్యాగం అంటుకుని వుంటే తప్ప కార్యసాఫల్యం సాధ్యం కాదు. ఈ మహిత గుణాలన్నీ సుబ్బమ్మ గారిలో నిండుగా వున్నాయి.

దళిత మహిళా జనోద్ధరణకు, మానవీయ మూల్యాల పరిరక్షణకు రాజీలేని పోరాటం సాగించి, తన కళ్లముందే వాటి సత్ఫలితాలను చూస్తూ, ఇంతటితో ఆగిపోని ప్రస్థానానికి ఇంకెన్నో అడుగులను శ్రుతి చేసుకుంటున్న శ్రీమతి సుబ్బమ్మ రాసిన ఈ ఆత్మకథా గ్రంథం సంస్కరణ ప్రియులందరికీ తమ తమ నిజాయితీ ప్రతిబింబాలను చూపే విలువైన నిలువుటద్దం.

ఆదర్శప్రాయమైన జీవితాన్ని కొనసాగిస్తూ, తమ అనుభవాలను ఈ పుస్తకం రూపంలో అందిస్తున్న శ్రీమతి మల్లాది సుబ్బమ్మ గారికి నా హార్దిక అభినందన.

**– సి. నారాయణరెడ్డి**

**వి.ఎం. తార్కుండె**
బార్-ఎట్-లా, సీనియర్ ఎడ్వకేటు,
సుప్రీం కోర్టు

ఫోను: 8925248
ఎం-16, సెక్టరు-11,
నోయిడ-201 301.

# శుభాశీస్సులు

మల్లాది సుబ్బమ్మ స్త్రీ విమోచనోద్యమ కార్యకర్త. భారత ప్రజల స్వేచ్ఛాభ్యుదయాలకు స్త్రీ విమోచనకన్నా ప్రాముఖ్యత గల అంశం మరొకటి లేదు. దేశ జనాభాలో సగంమంది స్త్రీలు కావడం మాత్రమే ఇలాంటి ఆలోచనకు కారణభూతం కాదు. పిల్లల మానసిక నైతికాభివృద్ధికి దోహదం చేసేది తల్లులుగా స్త్రీలే కనుక స్త్రీ విమోచన ప్రాముఖ్యతను సంతరించుకుంటున్నది. ఈనాడు భారతదేశంలో సనాతనత్వాన్ని, మూఢవిశ్వాసాలను బలపరిచేది, పోషించేది తల్లుల హోదాలో స్త్రీలు మాత్రమేనని గుర్తించడం అవసరం. ఏ ప్రజానీకం యొక్క స్వేచ్ఛ అభ్యుదయానికైనా హేతువాదం అవసరం కనుక భారత పునర్వికాస ఉద్యమానికి స్త్రీ విమోచన తప్పనిసరి.

అనేక ఇతర సమాజాలవలె భారత సమాజంకూడా పురుషాధిపత్యంతో మనుగడ సాగిస్తున్నది. శారీరక బలంలోనూ, ఆర్థిక విషయంగాను పురుషాధిక్యత మాత్రమే స్త్రీల దాస్యానికి ముఖ్యకారణం కాదు. ఇంటిపని, వంటపని, పిల్లల పెంపకం స్త్రీలకు మాత్రమే కేటాయించే సంప్రదాయం స్త్రీల న్యూనతకు కీలక కారణం. ఈ సంప్రదాయాన్ని స్త్రీ పురుషులిద్దరూ ఆదరిస్తున్నారు. అందువల్లనే భార్యాభర్తల మధ్య పరస్పర ప్రేమాభిమానాలు విలసిల్లిన కుటుంబాలలో కూడా స్త్రీలను తక్కువ చూపు చూడటం తటస్తిస్తున్నది.

శారీరక సంక్షేమం, మానసికాభివృద్ధి ఈ రెంటికీ అవకాశమిచ్చే జీవితాన్ని సాగించటానికి శక్తి, అవకాశాలు కలిగివుండటంలోనే స్వేచ్ఛ ఇమిడి వున్నది. మానసిక అభివృద్ధి, అంటే మేధోపరమైన నైతిక, కళాత్మక అభివృద్ధికి గల అవకాశం మాత్రమే, పశుజాతికి, మానవజాతికి తేడాను సూచించే లక్షణం. మానసికాభివృద్ధికి అవకాశాలు లేనందువల్లనే స్త్రీలు మన సమాజంలో స్వేచ్ఛను అనుభవించడం లేదు. ఈనాటి స్త్రీల బానిసత్వం, న్యూనత వీటి యొక్క ప్రధాన లక్షణం ఇదే. పురుషులతో సమదీటుగా మేధోపర, నైతిక, కళాత్మక అభివృద్ధికి అవకాశాలు కల్పించడమే స్త్రీ విమోచన ఉద్యమంలో ఇమిడివున్న ప్రక్రియ.

భారత మహిళోద్యమంలో ఉజ్వల తార మల్లాది సుబ్బమ్మ. ఆమె స్వయం కృషితో అభ్యున్నతి సాధించిన మహిళ. మహత్తర ఆటంకాలను అధిగమించి విద్యను పూర్తిచేసుకున్న ఆమె కుల నిర్మూలన, కుటుంబ నియంత్రణ, హేతువాదం, ఛాందస వ్యతిరేక పోరాటం, మూఢ విశ్వాస నిర్మూలన, స్త్రీ జనోద్ధరణలాంటి అనేక అభ్యుదయ ఉద్యమాలలో ఆమె పనిచేయటం ప్రారంభించారు. అనేక గ్రంథాలను, వ్యాసాలను ఆమె వ్రాశారు. అభ్యుదయ ఉద్యమం ఆమెకున్న ఆసక్తి, ఉత్సాహం ఇతరులను ప్రేరేపిస్తుంది. అసంఖ్యాక యువతులు అతివలకు ఆమె ఆత్మకథ ఉత్తేజాన్ని, ప్రోత్సాహాన్ని కలుగజేస్తుందని నేను దృఢంగా విశ్వసిస్తున్నాను.

తేది: 14-7-1991

**- వి.ఎం. తార్కుంటే**

న్యాయమూర్తి ఆవుల సాంబశివరావు (రిటైర్డు) కావూరి హిల్స్,

హైదరాబాదు.

# స్వయం సిద్ధ

ఇది ఒక స్వయం సిద్ధ జీవిత గాథ. మల్లాది సుబ్బమ్మ గారి అత్మకథనం.

హేతుత్వ పథాన పయనించి ఒక మామూలు మనిషి ఒక ఉద్యమనేతగా పరిణమించిన రీతికి దర్పణం ఈ గ్రంథం.

మానవవాద తాత్వికత ఆచరణీయమేనని నిరూపించే జీవితం గ్రంథకర్తది. అట్టి జీవితాన్నీ, దాని క్రమ పరిణామాన్ని వివరించి చెప్పే చరిత్ర ఇది.

సుబ్బమ్మ గారి జీవిత గమనం:

శ్రోత్రియం నుండి శాస్త్రీయతకు,
శుద్ధ ఛాందసం నుండి హేతుత్వంలోకి,
ఆచార బంధం నుండి అకలంకమైన స్వేచ్ఛ వైపుకు,
మత బద్ధత నుండి మానవవాదంలోకి,
కుటుంబ శ్రేయస్సు నుండి సమాజ శ్రేయస్సుకు,
అబలత్వం నుండి సబలత్వం లోనికి

సుబ్బమ్మ గారి ఈ పయనం ఒంటరి గమనం. వికాస మూర్తి రామమూర్తి ఆమె జీవిత భాగస్వామి. విద్యార్థి దశలోనే చిన్న వయసులోనే ప్రజా ఉద్యమాలకు అంకితమై జీవించిన వ్యక్తి ఆయన. అయినా సుబ్బమ్మగారు తన స్వంత బాటలోనే జీవితం సాగించారు.

దంపతుల అన్యోన్యతకు, అవగాహనకు ఏ మాత్రమూ భంగం వాటిల్లకుండా జరిగిన జంట జీవిత యాత్ర వారిది. ఆదిలో ఇద్దరి దారులూ వేరుగావున్నా, హేతుత్వ కూడలిలో సమ ఉజ్జీలుగా సమకూడి, మానవవాద రంగంలో భావైక్యతను పొందారు. ఈ ఐక్యతను సంతరించు కొనడానికి కూడా ఎవరి స్వేచ్ఛ వారిదే.

సుబ్బమ్మ గారు పుట్టి పెరిగిన వాతావరణం మెట్టినింటి జీవిత విధానం, రెండూ, శుద్ధ శ్రోత్రియానికి అలవాటు పడి ఉన్నవే. ఆచార ఛాందసం పెచ్చు స్థాయిలో ముదిరిన కుటుంబాలు రెండూ కూడా. అటువంటి కుటుంబంలో పుట్టి, పదేండ్లు పెరిగి, మరొక అలాంటి కుటుంబంలోకి కోడలుగా వెళ్ళిన సుబ్బమ్మ గారు స్వేచ్ఛగా ఊపిరి పీల్చుకోడానికి వీలుగాని విధంగా పెరిగింది.

కొంచెమే చదువు కూడా.

వీటికి తోడు లేత ప్రాయంలోనే బహు సంతానం. తల్లిగా తన బాధ్యతల్ని నిర్వహించడంలో ఎవరికీ తీసిపోని రీతిలో బిడ్డల్ని సాకింది.

ఈనాడు జగమెరిగిన సుబ్బమ్మ గారు ఆనాటి శ్రోత్రియానికి చుక్కెదురైన విప్లవ వనిత. ధీరోదాత్త. ఈనాటి తన వ్యక్తిత్వాన్ని సుబ్బమ్మ గారు తనకు తానుగా మలుచుకొన్నది. తానే తన జీవిత విధాత అయింది. అందుకు అవసరమైన మానసిక పరిణామంలో ఎవరి ఆసరాలు లేవు. సుగమ గమనాలు లేవు. కాకపోగా ఆమె మార్గం కంటకమయం. ఆచారాలు, సంప్రదాయాలు కల్పించిన అవరోధాలు, ఆటంకాలు కోకొల్లలు.

సుబ్బమ్మ గారిలోని లక్షణాలు, శక్తులు వీటినన్నిటినీ అధిగమించే స్ఫూర్తినీ, బలాన్నీ ఆమెకిచ్చాయి. సడలని స్వయం కృషి, దీక్ష, పట్టుదల, దేనికీ జంకని సాహసం. ఆమె సాధనాలు. సత్యాన్వేషణ, విజ్ఞాన సముపార్జన యెడల తీరని ఆర్తి, హేతుత్వ దృష్టితో సుబ్బమ్మ గారు అలవరచుకున్న లక్షణాలు.

స్త్రీకి భారతీయ సమాజంలో జరుగుతున్న అన్యాయం ఆమెలోని పూర్వ భావాలను కూకటి వేళ్లతో పెకిలించి వైచింది. నూతన స్ఫూర్తిని, కొంగ్రొత్త శక్తిని ఆమె నాడులలో ప్రవహింపజేసింది. తన పాత బ్రతుకునకు తిలోదకాలు ఇచ్చి, సుబ్బమ్మగారు నూతన అవతారాన్ని తాల్చింది.

విప్లవ కారిణి అయింది. తిరుగుబాటు ధ్వజాన్ని ఎగురవేసింది. స్త్రీ స్వేచ్ఛా ఉ ద్యమానికి కార్యకర్త, నేత అయింది.

తాను ఎంపిక చేసుకున్న స్త్రీ స్వేచ్ఛా ఉద్యమ వ్యాప్తికి, మానవవాద భావ వికాసోద్యమానికి పట్టు కొమ్మ అయింది. ఆ ఉద్యమ ప్రచారానికి బహుళ గ్రంధకర్త అయింది. ఉత్తేజకరమైన వక్త అయింది. అభాగినులకు ఆధారమైంది. స్త్రీ శక్తికి, మానవ ప్రతిభకు ప్రతీక అయింది.

కుటుంబం కొరకు కాక, సుబ్బమ్మ గారు ఇప్పుడు సమాజం కొరకు జీవిస్తున్నారు. ఉద్యమ నిర్వహణకు, తన వ్యక్తిగత జీవితానికి వేరు వేరు ఎల్లలు, హద్దులు లేవు.

ఈ స్థితిని, ఈ స్థాయిని సుబ్బమ్మ గారు స్వయంగా సాధించి సిద్ధించుకున్నారు. ఆమె స్వయం సిద్ధ.

అటువంటి ఉత్తేజకరమైన జీవితం సుబ్బమ్మ గారిది. ఆ జీవిత ఆత్మకథనం ఈ రచన. కనుక ఈ ఆత్మకథ చదివిన వారికి ఎంతటి స్ఫూర్తినిస్తుందో వేరే చెప్పనక్కరలేదు.

స్త్రీ స్వేచ్ఛకు, వ్యక్తి స్వేచ్ఛకు, హేతుత్వానికి అగ్రస్థానాన్ని ఇచ్చే వ్యక్తిలో

ప్రేమానురాగాలు, మానవత్వం లోపిస్తాయా? లోపించవు సరికదా, మానవత మానవవాదానికి ఉన్న ప్రధాన లక్షణాలలో ఒకటి. ఆ సత్యాన్ని అక్షరాలా మానవవాదీ, వ్యక్తిపరమైన గుర్తింపును కోరే సుబ్బమ్మ గారు రుజువు చేస్తున్నారు. ముఖ్యంగా "స్పందన లో తన ఈ ఆత్మకథను తన జీవిత భాగస్వామి రామమూర్తిగారికి అంకితమిస్తూ అనురాగం, ఆత్మీయతతో నిండిన తన హృదయాన్ని ఆమె ఆవిష్కరించారు.

"నిన్ను మించిన కీర్తి నాకిచ్చి
నా వెనుకనుండి స్ఫూర్తి నిచ్చి
నీ అండ దండల నందించి
నీతిగ నిల్చింది నీవే రామయ్యా.
............................
............................
............................
నా అభిమానానికి, అనురాగానికి
నా కృతజ్ఞతకు సూచికగా
నా కృతిని, జీవిత స్మృతిని
జీవిత భాగస్వామివి
నీ కందిస్తున్నాను రామయ్యా"

ఇది అనురాగ రంజితమైన సుబ్బమ్మగారి హృదయ రాగం. చదువరి గుండెలను ఆర్ద్రతతో నిండించగలదు.

తెలుగు పాఠక లోకాన్ని ఈ పుస్తకం ఆకట్టుకుంటుందనడానికి నాకెట్టి సందేహమూ లేదు.

అంతే కాదు. మారుతున్న మన సమాజాన్ని సమూలంగా మార్చే ఉద్యమంలో సుబ్బమ్మ గారి ఆత్మకథ ఒక సమర శంఖారావంగా ప్రతిధ్వనిస్తుందనడానికి నాకు ఎట్టి అనుమానమూ లేదు.

స్ఫూర్తి దాయకమైన ఇటువంటి రచన చేసిన సుబ్బమ్మ గారికి నా అభినందనాలు అందిస్తున్నాను.

**తేది: 22-7-191** **– ఆవుల సాంబశివరావు**

# యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్

**ప్రొ. బి. హెచ్. కృష్ణమూర్తి** సెంట్రల్ యూనివర్సిటీ,
బి.ఎ. ఆనర్స్ (ఆంధ్ర), ఎం.ఎ. పి.హెచ్.డి. (పెన్సిల్వేనియ) హైదరాబాదు-500 134.
వైస్-ఛాన్సలర్

## శుభాకాంక్షలు

పూజ్యురాలు శ్రీమతి మల్లాది సుబ్బమ్మ గారు సాధారణంగా కనిపించే అసాధారణ వ్యక్తి. వారి ఆత్మకథ భావితరాల వారికి కనువెలుగునిచ్చే అపూర్వ రచన.

ఈ గ్రంథానికి కనీసం నాలుగు ప్రయోజనాలు ఉన్నాయని నా అభిప్రాయం: 1) సాంప్రదాయిక జీవితం నుంచి బయటపడి ప్రగతి మార్గంలో దూసుకుపోయిన వారి ఆత్మీయత, ఆలోచనా విధానం తెలుగు స్త్రీలకు ఆత్మగౌరవాన్ని, ఆత్వ విశ్వాసాన్ని కలిగిస్తాయి. 2) సమాజ శ్రేయస్సుకు వారు చేపట్టిన కార్యక్రమాలు, అందుకోసం వేసుకొన్న ప్రణాళికలు, చేస్తున్న త్యాగం, ప్రభుత్వం చెయ్యలేని పనులను, నిజాయితీ ఉన్న సామాన్య వ్యక్తులు ఎలా సాధించగలరో మనకు ప్రత్యక్షంగా చూపిస్తుంది. 3) జరిగిన ఆరేడు దశాబ్దుల సాంఘిక చరిత్రకు ఈ పుస్తకం ప్రతిబింబం 4) సుబ్బమ్మ గారి వివిధ రచనలు (ఆత్మకథతో సహా) చదివిన వారికి తెలుగులో ఒడుపుగా రాయటం మాట్లాడటం అలవడుతుంది. ఈ పుస్తకం చదువుతున్నప్పుడు శ్రీమతి సుబ్బమ్మ గారి లాంటి వ్యక్తులు కోటికి ఒక్కరున్నా మన సమాజం ఈనాడు ఇంత దుస్థితిలో ఉండేది కాదేమో అనిపిస్తుంది.

ఇది అందరూ చదివి - ఆనందించవలసిన గ్రంథం కాదు - ఆలోచించవలసిన గ్రంథం.

తేది: 25-7-1991 **- భద్రిరాజు కృష్ణమూర్తి**

డా॥ రావూరి భరద్వాజ
169/2 ఆర్.టి. విజయనగర్ కాలనీ,
హైదరాబాద్ - 500 457

# కరుణా తరంగిణి

నమస్కారం!

మీ పేరు చాలా కాలంగా వింటున్నాను. వారూ వీరూ మీ గురించి చెప్పుకోవడమూ విన్నాను. మీ రచనలు కూడా వొకటి రెండు చదివినట్టు గుర్తు. అనుకోకుండా మనం కలుసుకొన్నాం. ఆకాశవాణి ప్రాంగణంలోనో, అదేదో సభా ప్రాంగణంలోనో!

అంతకు ముందే కొంత మంది "సంఘ సేవకులు" - 'ప్రజా సేవకులు" తెలుసు. ఇక కవులు, కవయిత్రులు, రచయితలు, రచయిత్రులు... సరేసరి! వారి మాట తీరూ, నడక తీరూ వేరు. వాటికి బాగా అలవాటు పడిపోయాను. వారంటే నా మనసులో వో బొమ్మ మెరుస్తుంది. అలాంటి మెరుపు వొచ్చిందా - "ఇక వారే" నన్న మాట!

"ఆకాశవాణి ప్రాంగణంలోనో, అదేదో సభా ప్రాంగణంలోనో, అనుకోకుండా కలుసు కొన్నాం" అన్నాను చూడు, అలా కలుసుకొన్నప్పుడు, మామూలుగా నాలో మెరవవలసిన మెరుపు పలకలేదు. అప్పుడనుకొన్నాను - ఈ సుబ్బమ్మ తల్లి అందరి లాంటిది కాదూ - అని!

అలా అనుకొన్నాకనే, తరచుగా, మీ ఇంటికి రావడం ప్రారంభించాను. మీ ఆశయాలు "వచో స్థాయిలో"నే ఉన్నాయా, "ఆచరణ స్థాయి" దాకా వొచ్చాయా - అన్నది ఇంకెవరో నాకు చెప్పలేదు, నేనే స్వయంగా చూశాను. నాకా నమ్మకం కలిగాకనే నిన్ను "అమ్మమ్మా!" అని పిలవడం ప్రారంభించాను.

చిత్ర మేమిటంటే - మా అమ్మమ్మ పేరూ, సుబ్బమ్మ! ఆమె కూడా నీకు మల్లే (అమ్మమ్మవు గదా! 'మీరు' అనడం మానేశాను) కొంచెం పొట్టిగా ఉంటుంది. సంస్కార దృష్టితో నువ్వు మాంగల్యాన్ని తీసేశావు. ఆర్థికం కారణంగా ఆమె పసుపు కొమ్ముతోనే జీవితమంతా గడిపింది. ఆ సుబ్బమ్మ, నాకు చాలా కథలు చెప్పింది. నువ్వు - నాకు యథార్థ గాథలు చాలా చెప్పావు - పేర్లు జాగ్రత్తగా దాచేసి!

కొంతమందికి నువ్వు పెనుగాలివి. ఇంకొంత మందికి మలయ మారుతానివి. కొంత మందికి నువ్వు తుఫానువు. ఇంకొంత మందికి తొలకరి వానవు. నీ దయా స్పర్శతో సేద దీరిన వారు నాకు తెలుసు. నీ చేయూతతో ఊపిరి పీల్చుకొన్న వారూ నాకు తెలుసు. అవతలి వారు ఏమనుకొంటారో నన్న సంకోచం లేకుండా, నువ్వు చెప్పవలసిందేదో చెబుతావు, చెయ్యవలసిందేదో చేస్తావు.

ఇవన్నీ – అంతో ఇంతో నాకు తెలిసినా – నీ ఆత్మకథ చదివినప్పుడు, ఇంకా చాలా చాలా తెలుసుకొన్నాను.

పదేళ్ళ వయసులో ఉన్న మీ కామేష్ బత్తాయిలమ్ముకొనే ముసలమ్మకు, ఒక రూపాయి అదనంగా ఇచ్చాడని చదివినప్పుడూ –

1987లో విశాఖలో ఏర్పాటుచేసిన సతీ సహగమన వ్యతిరేక మహాసభను అధికార అర్థాంతరంగా ఆపివేసినప్పుడు, నువ్వు ప్రదర్శించిన ధైర్యమూ, తెగువా, సాహసమూ –

ఒక అంధ యువకుడూ, యువతీ రాత్రి 9 గంటల వేళ మీ ఇంటికొచ్చి, వివాహం జరిపించమని నిన్ను అడిగాక, నువ్వు పెళ్ళి చేశాక, ఆ యువకుడు, తన అర్ధాంగి నోటికి తీపి తినిపించడం కోసం పడిన యాతనను చూసి నీవు స్పందించిన తీరూ

ఆభరణాల మీదా, ఆడంబరాల మీదా నీకు చిన్నప్పుడున్న మోజును గురించి చెబుతూ – "కష్టాలలో పుట్టి పెరిగిన వారు, దారిద్ర్యాన్ని అనుభవించిన వారు, సుఖాలు వచ్చినా, సంపద కలిగినా అనుభవించలేని మానసిక దౌర్బల్యం అనాసక్తత వారిలో జీర్ణించి ఉంటుంది" అనినిర్భయంగా అంటున్నప్పుడూ

అసలైన సుబ్బమ్మ కనిపించింది. ఈ పుస్తకం చదువుతుంటే, నీతో మాట్లాడుతున్నట్లూ నీ అంత రంగంతో కబుర్లు చెబుతున్నట్లూ నాకనిపించింది.

అమ్మమ్మా!

నీ జీవితం విశాలమయింది. వైవిధ్యపూరితమయింది.

కొండంత జీవితాన్నీ ఆ జీవితంలోని రకరకాల అనుభవాల్నీ నువ్వు, బాగా కుదించి ఉన్నట్లుంది! లేకపోతే– ఈ 315 పేజీల్లోకి – అది ఇమడదు గాక ఇమడదు. ఇంకెన్ని వాల్యూమ్స్ వ్రాయాల్సి వచ్చేదో!

ఇరుకు చీకటిలోంచి తొలుచుకొంటూ, అడ్డంకులను వొలుచుకుంటూ ఇక్కడి దాకా వచ్చావు. ఇప్పుడు – నీ ముందో విశాల ప్రపంచం పరచుకొని ఉంది!

తెలుగులో 'ఆత్మకథ' లున్నాయి. సరే – మహిళలు రాసినవీ ఉన్నాయా? నాకు తెలీదు. ఇంతవరకెవ్వరూ లేకపోతే, నువ్వు మొదటి దానివవుతావు. ఇంకెవరన్నా ఉంటే – ఆ తరువాతి దానివవుతావు. రైలులో–ఏ బోగీలో కూచున్నామన్నది ముఖ్యం కాదు, అసలు రైలెక్కామా లేదా అన్నదే ముఖ్యం !

నువ్వు రైలెక్కావు. అది – నిన్ను గమ్యస్థానం చేరుస్తుంది!

**తేదీ: 25–7–1991** **– రావూరి భరద్వాజ**

డా॥ జి.వి. సుబ్రహ్మణ్యం

తెలుగుశాఖ ప్రొఫెసరు,
హ్యుమానిటీస్ డీన్
హైదరాబాదు విశ్వవిద్యాలయం,
హైదరాబాదు–500 134.

# మడమ తిప్పని మహిళా ప్రస్థానం

సోదరి మల్లాది సుబ్బమ్మగారి 'ఆత్మకథ' మొదటినుండి చివరిదాకా ఒక్క బిగ్రున చదివాను. కాదు, కాదు ఆమె (రచన) చదివించింది. సజీవనధార ప్రవహిస్తుంటే అందులో దానితోపాటు కొట్టుకొనిపోతున్న అనుభూతి కలిగింది. ఆ ప్రవాహంలో జలపాతాలున్నాయి, సుడిగుండాలున్నాయి, కల్లోల మాలిక లున్నాయి, సమతల సౌందర్యాలున్నాయి – అన్నీ కలిసి ఒక ప్రవాహం తోసుకుని ముందుకు ఉద్యమిస్తున్న వేగం, వేడి ఎగజిమ్ముతూ ఉంది. నీరు శరత్కాల నిర్మల గంగ కాకపోవచ్చు కాని నేలతల్లి రంగును ఒంటినిండా పులుముకొన్న శ్రావణమాసపు గోధుమ వన్నె గోదావరి. తెలుగు పౌరుషం తెట్టలుకట్టిన తరంగ పంక్తి, ఆత్మకథలో సుబ్బమ్మ గారు నదిలా పొంగింది.

ఆత్మకథలో అన్నింటికంటే ఆసక్తిని కలిగించేది శీర్షిక – 'పాతివ్రత్యం నుండి ఫెమినిజం దాకా'. ఆధునికస్పృహ లేకపోతే ఈ శీర్షిక అపార్థం కలిగించే ప్రమాదం ఉ ంది. పురుషాధిపత్య వ్యవస్థలో అజ్ఞానంతో అదే స్వర్గమని బ్రతికిన జీవనవిధానం నుండి హేతువాద విజ్ఞానంతో పురుషాధిపత్య వ్యవస్థను వ్యతిరేకిస్తూ స్త్రీ స్వేచ్ఛా సమానత్వాలకై పోరాటం సాగించే జీవన విధానం వరకూ సాగిన ప్రస్థానంగా శీర్షికను అర్థం చేసుకోవాలి. ఇందులో మరో విశేషం కూడా ఉంది. పాతివ్రత్యం పాతకాలం మాట. ఫెమినిజం మోడరన్ టెరమ్. అయితే ఈ శీర్షికలో వాడిన పాతివ్రత్యం ఫెమినిజం వ్యాఖ్యానించే అర్థంలో వాడింది. అంటే, పాతకాలపు పారిభాషిక పదాన్ని క్రొత్తకాలపు వ్యాఖ్యానంతో వాడటం ఇందులో విశేషమన్నమాట.

ఈ విశేషం శీర్షికలోనే కాదు ఆత్మకథలో అంతటా వ్యాపించి ఉంది. ఎలాగంటే – ఆమె పుట్టు పూర్వోత్తరాలను ఎప్పటివప్పుడు జరిగినట్లు చెపుతున్నా, ఆనాటి వాస్తవాలను ఏకరవు పెడుతున్నా, వెంటనే వాటిని ఆమెకు ఇప్పుడున్న దృక్పథంతో వ్యాఖ్యానించింది. అంటే ఆమె తన జీవితాన్ని ఒక హేతువాదిగా, ఫెమినిస్టుగా చేసుకొన్న వ్యాఖ్యానమే ఈ ఆత్మకథ.

ఈ కథలో గతం వర్తమానంలో బ్రతుకుతున్నట్లుంటుంది. అందులోని జీవశక్తి కూడా అదే.

ఆత్మకథ స్వీయనాయకమే కాబట్టి, తనకథ చెప్పుకొనే వ్యక్తికి మొదట ఒక ఆత్మ విశ్వాసం ఉండాలి, దాన్ని వివేచించి చెప్పే విజ్ఞతతోపాటు నిజాయితీ, చిత్తశుద్ధి ఉ

ండాలి. ఈ లక్షణాలు ఈ రచనలో అడుగడుగునా గోచరిస్తాయి. సుబ్బమ్మ గారికి తాను ఒక గొప్ప వ్యక్తినౌతాననే నమ్మకం చిన్నప్పటినుండి ఉండేది. వారి నాన్నగారు ఆమాట పదేపదే చెప్పి ఆమెలో ఆత్మవిశ్వాసం పెంచారు కూడా. ఆమెలో అవసరమైనప్పుడు దానిని ఆరిపోకుండా రక్షించి, భర్త రామమూర్తిగారు కూడా పోషించారు. ఆమె పుట్టినింటా మెట్టినింటా అదృష్టం కలిసివచ్చిన ఇల్లాలు. వారి సంప్రదాయంలో వారు పాటించే ఆచారాలకు అర్థాలు దొరకలేదు, అరాలు చెప్పేవారు దొరకలేదు, దాని వెనుక కారణాలను చెప్పే వారు, వాటి తత్వాలను లక్ష్యాలను వివరించేవారు దొరకలేదు. అటువంటి అవస్థలో ఉన్న వ్యవస్థ మూఢాచార వ్యవస్థగా పేరు పొందుతుంది. ఆచారానికి అర్థం లేకపోతే అనర్థం కలిగిస్తుంది. హేతువాదం అర్థం లేని ఆచారాన్ని బహిష్కరిస్తుంది. అర్థవంతమయ్యే మార్గముంటే సంస్కరిస్తుంది. సంస్కరణ హేతువాదాల సంధియుగంలో పుట్టిన రెండు పరస్పర విరుద్ధశక్తులు సుబ్బమ్మగారి అత్తగారు, భర్తగారు. ఈ రెండింటి మధ్య ఏదో ఒకశక్తిని తాను తేల్చుకోవలసి వచ్చింది. భర్తగారు కదా అని అవసరం కొద్దీ రామమూర్తిగారి మార్గాన్ని ఎన్నుకోలేదు సుబ్బమ్మ గారు. అత్తగారి జీవనవిధానం లోని అర్థం ఆమెగారు చెప్పలేదు. భర్తగారి జీవనవిధానంలోని అర్థాన్ని ఆయన చెప్పగలుగుతున్నారు. అందువలన ఆమె భర్త మార్గాన్ని అనుసరించింది. ఇది పాతివ్రత్యంలో భాగంగా కాదు హేతువాద దర్శనంలో నమ్మకంగా. సుబ్బమ్మగారు తెలుసుకొన గలిగినంతవరకు హేతువాదాన్ని ఆశ్రయించి తెలుసుకొన్నారు. ఎంతవరకు తెలిసిందో అంతవరకు చిత్తశుద్ధితో ఆచరిస్తున్నారు. ఆమె అభిప్రాయాలన్నింటితో మనం ఏకీభవించకపోవచ్చు, మరికొన్ని అంశాలమీద ఆమె ఇంకా ఆలోచించవలసింది ఎంతో ఉన్నదని మనకు అనిపించవచ్చు, అయినా ఆమె నిజాయితీని మనం మెచ్చుకోకుండా ఉండలేం.

"ఏ వ్యక్తి అయినా తాను ఒక ఘనకార్యం తల పెడితే అది తప్పక నెరవేరుతుంది. అది జయించలేకపోయామంటే ముఖ్యంగా అది మన ప్రయత్నంలోపమే కాని దానికి మరొక కారణం వుండదు. ఇది నా జీవితానుభవం నుండి నేర్చుకొన్న మొదటి సత్యం. చదువుకోవాలని పట్టుపట్టడం, హేతువాదిగా బ్రతకాలనుకోవటం, వ్యక్తిత్వం, స్వేచ్ఛా, సమానత్వాలు ముందుగా నిలబెట్టుకోవాలనుకోవడం, మహిళాభ్యుదయానికి మార్గదర్శకత్వం వహించాలనుకోవడం, సంస్థలను నిర్మించి తద్వారా స్త్రీ హిత కార్యక్రమాలు నిర్వహించాలనుకోవటం, సాహిత్యం ద్వారా ప్రబోధించడం లాంటివి నాపట్టుదలకు పడికట్టురాళ్లు, నిదర్శనాలు" (పు. 262, 263).

బహుశః ఈమాట ఈ ఆత్మకథ అంతరార్థాన్ని వ్యక్తం చేస్తున్నాయి. మానవ యత్నంమీద సుబ్బమ్మ గారికి ఉన్న అచంచల విశ్వాసమే ఆమె జీవితాన్ని ఒక ఉ ద్యమంగా మార్చింది. సొంత పిల్లలను పెంచి పెద్దవాళ్లనుచేసి, వాళ్ల యిష్టప్రకారం పెండ్లి పేరంటాలుచేసి, అందరినీ మంచి గౌరవస్థానాల్లో ఉంచిన తరువాత సుబ్బమ్మ

గారికి కొత్తరకం సంతానం పుట్టుకొచ్చింది. అవి సంస్థలు. వాటినీ తల్లిలా పోషిస్తున్నారామె. కన్న పిల్లలు రక్తాన్ని పంచుకొంటారు, సేవా సంస్థలు ఆత్మలక్షణాలను పంచుకొంటాయి. సుబ్బమ్మ గారు ఒక సంఘ సేవకురాలుగా వ్యక్తం చేసిన ఈ క్రింది మాటలు భగవద్గీతలో చెప్పిన కర్మయోగానుభవానికి దగ్గరగా ఉన్నాయి.

"సంఘ సేవ చేయాలనేది ఒక ఆర్తి – ఒక బలవత్తరమైన వాంఛ. అది ఆ మనిషి యొక్క వ్యక్తిత్వంలో భాగం. నిరంతరం ఆ భావం వెన్నాడుతూనే వుంటుంది. కనుక పొగడ్తలకు, తెగడ్తలకు చలించరాదని చెపుతున్నాను. ఒక్కసారిగా పొంగిపోవటం, కృంగిపోవటం కూడని చర్యలు. నిశ్చలంగా, నిబ్బరంగా, కృతనిశ్చయంతో మంచిది అనుకున్న దానిని చేసుకుంటూ పోవటమే నాకర్తవ్యంగా భావించుకున్నాను" (పు. 230).

ఇంతవరకూ తెలుగునాట స్త్రీ జనోద్ధరణం కోసం కృషిచేసిన సంస్కర్తల, సేవాకర్తల సేవా మార్గాలన్నీ ఒకచోట కలిసి, ఆధునికంగా అభ్యుదయపథంలో సాగుతున్న సమకాలీన స్త్రీ జనసముద్ధరణ సేవా చైతన్యం మూర్తి కట్టినట్లుగా ఉంటుంది ఈ ఆత్మకథా నాయకురాలు సుబ్బమ్మ గారు.

ఈ ఆత్మకథ వట్టి స్వీయజీవిత చరిత్రమాత్రమే కాదు. సమకాలీన స్త్రీ జీవిత సామాజిక స్థితిగతులను వివరంగా తెలుపుతోంది. ఈ శతాబ్ది స్త్రీ, అస్తిత్వ, వ్యక్తిత్వాలలో వచ్చిన పరిణామాలను, వాటికి దోహదం చేసిన స్వచ్ఛంద సేవాసంస్థలను, కార్యకలాపాలను, ప్రజల స్పందనలను గురించి ఎవరైనా ఒక చరిత్ర వ్రాయదలచుకుంటే విలువైన ఆకరగ్రంథంగా పనికి వస్తుంది. సమకాలీన సాంఘిక వాస్తవాలను ఎన్నింటినో ఆల్బంలో ఫోటోల్లాలా తన ఆత్మచరిత్రలో సుబ్బమ్మ గారు అమర్చి భద్రపరిచారు.

సుబ్బమ్మ గారు వివిధ ప్రక్రియలను శక్తివంతంగా తీర్చిదిద్దిన రచయిత్రి, కవయిత్రి. ఆంధ్రప్రదేశ్ మహిళోద్యమ చరిత్ర వ్రాసి ప్రామాణిక రచయిత్రిగా పేరుగాంచారు. నవలలు, కథలు, నాటకాలు, కవితలు – ఎన్నో వ్రాశారు, వ్రాస్తున్నారు. అన్నింటికీ 'స్త్రీ' కేంద్రబిందువు. ఆమె సేవను ఎంత సీరియస్ గా తీసుకొంటుందో రచనను కూడా అంత బాధ్యతగా నిర్వహిస్తుంది. "సాహిత్యం నాకు 'హాబీ' కాదు.... నాకథల వెనుక రచనల వెనుక సామాజిక అవగాహన, స్త్రీల అసహాయత నిండి నిబిడీకృతమై వుంటాయి" – అన్నారు ఆమె (పు. 151, 152). సామాజికంగా స్త్రీలు పొందే వేదననుండే ఆమె రచనలు పుట్టాయి.

షష్టిపూర్తినాడు యావదాస్తినీ ధర్మ సంస్థలకు దానంచేసి, తానిప్పుడు ట్రస్టు ఇంట్లో ఉంటున్న అనుభవం పొందుతోంది సుబ్బమ్మ గారు. 68వ జన్మదినోత్సవంనాడు తన ఆత్మకథను జీవిత భాగస్వామికి అంకిత మిచ్చి తన ఫెమినిజానికి ఒక పరిపూర్ణత కల్పించుకొంటున్నది. ఆమె నడిగే ప్రశ్నలకు ఆమె జీవితమే సమాధానం!

హైదరాబాదు
25-7-1991

**– జి.వి. సుబ్రహ్మణ్యం**

**కేతు విశ్వనాథరెడ్డి**

ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విశ్వవిద్యాలయం
హైదరాబాద్.

# మధ్య తరగతి సంస్కారానికి గీటురాయి, సానరాయి

మన మధ్యతరగతి, అది పుట్టినప్పటి నుంచి మేలిమి బంగారం కాదు. దానిలో సకల సనాతన మత, వర్ణ, కుల దుర్లక్షణాలూ వర్గ అవలక్షణాలూ పుట్టుకతోనే కలసి పోయాయి. అందువల్ల ఈ కల్తీ పాళ్లను తెలుసుకోడానికి గీటురాళ్ల అవసరం నిత్యం ఉంది. కల్తీ మరీ ఎక్కువైందనుకున్నప్పుడల్లా పుటం పెట్టాల్సి ఉంటుంది. ఆంధ్రదేశంలో మధ్యతరగతి కేంద్రంగా వచ్చిన సాంఘిక రాజకీయ ఉద్యమాలను ఎప్పటికప్పుడు గీటురాళ్ల మీద పరీక్షించి, ఆ తర్వాత పుటం పెట్టుకుంటూ వస్తేనే కొంత భావ సంస్కారం ఈ తరగతికి అబ్బింది. దాని మూలంగా సమాజంలో ఆధునిక భావాలు మరీ ముఖ్యంగా స్త్రీ వికాసానికి దోహదం చేసేవి వ్యాప్తిలోకి వచ్చాయి.

మల్లాది సుబ్బమ్మ గారి ఆత్మకథ ఆ రకంగా ఒక గీటురాయి. 67 ఏండ్లు తన చుట్టు జీవితంతోనూ, తనతోనూ ఘర్షణ పడి, ఆత్మ పరిశీలన చేసుకుంటూ "మంచి పనులు......" ఎంత "భారమయినా" దృఢ సంకల్పం ఉంటే చెయ్యగలమని" తన పరిధిలో ఆమె నిరూపిం చారు. 30 ఏండ్లు సనాతన వాతావరణంలో పెరిగి, నలిగి, ఇమిడి, ఇమడక బాధలు పడి సేవా కార్యక్రమాల్లో జాగృతమై లౌకికీకరణం సాధించి, ఒక మహిళోద్యమ సారథిగా ఆమె రూపొందించిన క్రమం మనల్ని ఆశ్చర్యపరుస్తుంది. అద్భుత పరుస్తుంది, ఆత్మ పరిశీలనకు పురికొల్పు తుంది, ఆమె ఆశిస్తున్న భావ సంస్కారంపట్ల ఆలోచనల్ని రేకెత్తిస్తుంది. "బాహ్య దృష్టితో (ఆబ్జక్టివ్ గా), నిజాయితీగా, ఆత్మ విశ్లేషణ చేసుకోగల ఆత్మస్థయిర్యం కలవారే ఆత్మ కథా రచనకు అర్హులు (33వ పేజీ). "మొత్తం మీద నాకు విశాల హృదయం లేదు. అసహనం లేకపోలేదు. నేను నేర్చుకోవాల్సిన మంచి లక్షణాలు ఎన్నో మిగిలిపోయాయి" (236వ పేజీ) అని సమాజ సార్థకమైన పనుల్ని చేసిన సుబ్బమ్మ గారే అంటూ ఉంటే, సాధారణంగా స్వీయాత్మక ధోరణిలో మగ్గే మనం ఆత్మ లోకంలో ఎంత దివాళాతనాన్ని వదిలించుకోవాలో అని గింజుకుంటాం. అందువల్లనే మన సంస్కారానికి ఈ ఆత్మకథను ఒక గీటురాయిగా భావించటం.

సుబ్బమ్మ గారి ఆత్మకథ ఒక రకంగా కందుకూరి వీరేశలింగం సంస్కరణోద్యమానంతరం వచ్చిన తెలుగు స్త్రీల జీవిత చరిత్ర. చైతన్యవంతులైన మహిళల ఆత్మకథ కూడా, సనాతనత్వం, కందుకూరి తెచ్చిన ఆధునికత్వం, మళ్లీ సనాతనత్వం, మళ్లీ ఆధునికత కోసం ఉద్యమాలు, రెండు ప్రపంచ యుద్ధాల మధ్యా, ఆ తర్వాత

తెలుగువాళ్ల జీవితంలో వచ్చిన మార్పులు, వీటి మధ్య గ్రామీణ పట్టణ నగర సమాజాల్లో వచ్చిన పరిణామాలు, భావ సంఘర్షణలు – వీటి కథా కమామిషు ఈ ఆత్మకథలో దర్శన మిస్తుంది. లౌకికీకరణ మన సమాజంలో ఎంత కష్టమో కష్టమైన వ్యక్తులుగా దాన్ని సాధించటానికి కృషి, పట్టుదల ఎంత ఉండాలో ఈ ఆత్మకథ నిరూపిస్తుంది, మనిషికి అర్థజ్ఞానంతో పాటు, అనుభవ జ్ఞానం అవసరమని నొక్కి చెబుతుంది. 'నా చిన్న నాటి స్త్రీల స్థితిగతులు,' 'కుల వ్యతిరేక కృషి' "నేటి సమాజం" 'నేను నేనుగా ఎలా రూపొందాను'? ఆ అధ్యాయాలను చదవండి మీకే తెలుస్తాయి. సుబ్బమ్మ గారి పరిణామ ప్రక్రియ, దాని మూలాలు, మూలాలను తెలుసుకోకుండా దేన్నీ మార్చలేం.

ఈ ఆత్మకథకు కీలకం సుబ్బమ్మ గారి "శ్రమించి మంచిని పెంచగలమనే విశ్వాసం", ఏ మంచి పని చెయ్యాలన్నా పట్టుదల, ధైర్యం, సహనం, నీతి, నిజాయితీలు కావాలనే ఆమె అనుభవ జ్ఞానం. మల్లాది సుబ్బమ్మ గారంటున్న అర్థజ్ఞానం, అనుభవ జ్ఞానం మన సమాజంలోని పితృస్వామిక దురహంకారులకు అంత సులభంగా అర్థం కాకపోవచ్చు. అర్థమైతే రామమూర్తి గారి లాగా 'అర్ధాంగి' వ్యక్తిత్వానికి ప్రత్యక్షంగానో, పరోక్షంగానో దోహదం చేస్తారేమో. అట్లా చేసినప్పుడు పురుషుడి కార్యక్షేత్రానికి ఉన్నంత ప్రాధాన్యతే స్త్రీ, కార్యక్షేత్రానికి ఏర్పడుతుంది. అప్పుడు స్త్రీల ఆత్మకథలు చాలా అరుదుగా ఉన్నాయనే సాహిత్యంలోని ఒక అపఖ్యాతి మాసిపోతుంది.

ఆత్మకథలోని ప్రతి అక్షరం చదివాక, నాకైతే మన స్త్రీ వాదపు వెనుక ఉన్న మన సమాజ మూలాలు మరింత స్పష్టయయ్యాయి. ఏనాటి నుంచో వస్తున్న స్త్రీల సమస్యల పరిష్కారానికి సుబ్మమ్మ గారిది ఒక పటిష్టమైన మార్గమని అవగతమైంది. అయితే ఈ ఆత్మకథను పునరుక్తులు లేకుండా ఎడిట్ చేసి, కాలక్రమంలో జీవిత దశల్నీ సంఘటిత పరచినట్లయితే బావుండేది. అంతలోనే ఆమె వయసు, ఆమెకు లేని తీరిక, ఆమె స్పాంటేనిటీ గుర్తుకొచ్చి అయితే నేం అన్పించింది. అట్లాగే ఆంధ్రోద్యమంలో సుబ్బమ్మ గారి పాత్రను హర్షించలేకపోయాను. ఆమె నిజాయితీని మాత్రం శంకించలేను.

సుబ్బమ్మ గారూ! మా సంస్కారానికి మీ ఆత్మకథ గీటురాయే కాదు, సానరాయి కూడా. మా బంగారంలో బంగారం పాలెంతో తెలుసుకోనివ్వండి. మా జీవితాలు అంతో ఇంతో విలువ ఉన్న రాళ్లయితే సానపట్టుకోనివ్వండి. మీ దీర్ఘకాలిక భావ సంస్కార పోరాటం అప్పుడు మరింత ముందుకు పోతుందేమో, మీ కిప్పుడు అభినందనలు అక్కరలేదు. సహచరులు కావాలి – ముఖ్యంగా మహిళోద్యమ రంగంలో.

**హైదరాబాదు** **– కేతు విశ్వనాథరెడ్డి**

**25 జూలై 1991**

# కటిక రాతి నేలను చీల్చుకొని తలెత్తి చూసే మొక్క

**డా॥ నండూరి రామమోహనరావు**

ఎడిటర్, ఆంధ్రజ్యోతి

ఎమర్జెన్సీ విధించిన తొలి రోజుల నాటి మాట. ఒకనాడు మల్లాది సుబ్బమ్మ గారు ఏదో రచన అందజేయడానికి ఆంధ్రజ్యోతి కార్యాలయానికి వచ్చారు. ఆమె ఇచ్చిన వ్యాసం గురించి, అప్పటి రాజకీయ పరిస్థితుల గురించి, కొంత సేపు మాట్లాడుకున్న తర్వాత రామ్మూర్తిగారెలా వున్నారని అడిగాను. "ఆయన్ని అరెస్టు చేశారుగా! జైల్లో వున్నారు. ఎప్పుడు విడుదల చేస్తారో అసలు విడుదల చేస్తారో లేదో, ఎన్నాళ్ళో నాకీ కష్టాలు" అంటూ సుబ్బమ్మ గారు వణుకుతున్న గొంతుతో, గుడ్ల నీరు కుక్కుకుని విసవిసా నడిచి వెళ్ళిపోవడం నాకు ఇప్పటికీ బాగా గుర్తు. ఎప్పుడూ గలగలా బోళా బోళీగా మాట్లాడుతూ నిర్విచారంగా, తనూ, తాను చేస్తున్న సేవా కార్యక్రమాలు తప్ప మరో ప్రపంచం ఎరగనట్టుగా, ఎన్ని చిక్కులు, ఎన్ని సమస్యలు ఎదురైనా ఒంటరిగా ఎదుర్కొనగల స్థయిర్యం కల వ్యక్తిగా కనబడే సుబ్బమ్మ గారు ఆ రోజున అలా కంట తడి పెట్టడం చూసి నాకూ కళ్ళ నీరు తిరిగింది.

ఈ పుస్తకానికి పీఠిక వ్రాయవలసిందిగా కోరడానికి సుబ్బమ్మగారు, రామ్మూర్తిగారూ ఈ మధ్య నా వద్దకు వచ్చారు. సంతోషంగా అంగీకరించాను. ఈ దంపతులతో రెండు దశాబ్దాలకు పైగా పరిచయం. ఇండియన్ ఎక్స్ ప్రెస్‌లో రామ్మూర్తిగారు వ్రాసే 'లెటర్స్ టు ది ఎడిటర్' ఘాటుగానూ, ఆసక్తికరంగానూ ఆలోచనా ప్రేరకంగానూ వుండేవి. అప్పుడప్పుడు ఆంధ్రజ్యోతికి కూడా వ్రాసేవారు. ఒకసారి నార్లగారి ఒక సంపాదకీయాన్ని ఎటాక్ చేస్తూ రామ్మూర్తిగా సంపాదక లేఖ వ్రాశారు. అది నార్లగారికి చూపిస్తే దానికి సమాధానంగా నార్లగారు సంపాదకీయం వ్రాశారు. ఒకసారి సుబ్బమ్మ గారి వ్యాసం వచ్చింది. వెంటనే దాన్ని ప్రచురించాము. ఆమె చాలా కాలంగా రచనలు చేస్తున్నారని, చేయి తిరిగిన రచయిత్రి అని తప్ప మేము ప్రచురించిందే ఆమె తొలి వ్యాసమని అనుకోలేదు. ఆ విషయం ఆ సుబ్బమ్మగారు చెబితే తెలిసింది. ఆ పిదప ఆంధ్రజ్యోతి దినపత్రికలోను, వనిత మాసపత్రికలోను ఆమె వ్యాసాలు చాలా ప్రచురించాము. అన్నిటిలోను ఆ సుబ్బమ్మగారి గాఢావగాహన, నిశితమైన పరిశీలన, సమస్యల పరిష్కారం వ్యక్తమవుతాయి. ముఖ్యంగా ఇటీవల ఆమె వ్రాస్తున్న వ్యాసాలలో సమాజంలో స్త్రీలు పడుతున్న అగచాట్లపై ఆమె గాఢావేదన, స్త్రీ విముక్తిపట్ల ఆమె తహ తహ మరింతగా ప్రస్ఫుటమవుతున్నాయి.

సరిగా ఈ తరుణంలో వచ్చిన "పాతివ్రత్యం నుండి ఫెమినిజం దాకా" అనే ఈ గ్రంథం శ్రీమతి సుబ్బమ్మ గారి అపూర్వ విశిష్ట వ్యక్తిత్వానికి అద్దం పడుతున్నది. ఇది ఆమె ఆత్మకథ. ఆసాంతం ఒక నవల చదివినంత ఆసక్తితో చదివాను. ఈ పుస్తకంలో ఆమె పట్ల నా గౌరవం రెండవసారి ఇనుమడించింది. Truth is stranger than fiction అన్నారు. సుబ్బమ్మగారి జీవిత కథ కల్పితకథ కంటే ఎక్కువ ఆశ్చర్యం కలిగిస్తుంది. తన తాతల,

అమ్మమ్మ నాయనమ్మల వద్ద కథ ఎత్తుకుని తన చిన్ననాటి సంఘ పరిస్థితులను, ముఖ్యంగా గ్రామాలలో మధ్యతరగతి బ్రాహ్మణ కుటుంబాలలో సంప్రదాయాలు, నైష్ఠికత పేరుతో జరిగే అర్థం లేని, కాల దోషం పట్టిన ఆచార వ్యవహారాలు, వాటితో చిన్నతనంలో తాను ప్రభావితురాలైన తీరు, ఆ తర్వాత కాలంలో వాటి ప్రభావం నుంచి బయటపడటానికి ప్రయత్నించి విజయం సాధించిన తీరు సుబ్బమ్మ గారు పూసగుచ్చినట్టు వర్ణించారు. ఆ పరిస్థితుల చెరసాల నుంచి సుబ్బమ్మ గారు ఎలా బయపడ్డారో, బయటపడగలిగారో, వేలమందిలో ఒక ప్రత్యేక విశిష్ట వ్యక్తిగా ఎలా గుర్తింపు పొందారో ఆశ్చర్యం.

సుబ్బమ్మ గారిది బాల్య వివాహం. అయిదో క్లాసు వరకు చదివాక చదువు ఆగిపోయింది. మళ్లీ రెండు క్లాసులు చదివాక మరోసారి ఆగిపోయింది. అయితే ఆ తర్వాత కాలంలో భర్త ప్రోత్సాహంతో దీక్షగా చదువుకుని, కేవలం స్వయంకృషితో (ప్రైవేటుగా మెట్రిక్, ఇంటర్, బి.ఎ. వరకు చదివారు. మధ్యతరగతి బ్రాహ్మణ మహిళలు సాధారణంగా గడపదాటని పరిస్థితులలో సుబ్బమ్మ గారు ప్రత్యేకాంధ్రోద్యమంలో పాల్గొని జైలుకు వెళ్ళడం, ఎన్నో మహిళా సంఘాలలో బాధ్యతాయుత పదవులు నిర్వహించడం, స్వయంగా ఎన్నో సంస్థలు స్థాపించడం, హేతువాద ప్రచారానికి, స్త్రీ విముక్తికి అంకితమైన రెండు పత్రికలను నడపడం, గడచిన రెండున్నర దశాబ్దాలుగా ఎన్నో పత్రికలకు రకరకాల రచనలు పంపి ఉత్తమ రచయిత్రిగా పేరుపొందడం, వందలాది సభలలో పాల్గొనడం, ఎన్నో సన్మానాలు సత్కారాలు పొందడం, ఒక గొప్ప వ్యక్తిగా గుర్తింపు పొందడం ఇవన్నీ ఈ పుస్తకంలో సుబ్బమ్మ గారు చాలా కుతూహల కరంగా రచించారు.

సుబ్బమ్మ గారి జీవిత కథ చదువుతుంటే ఒక మసక చీకటి గదిలో పెట్టిన మొక్క, సన్నని కిటికి సందులలోనుంచి పడే సూర్యకిరణం కోసం అర్రులు చాస్తూ ఎదిగే మొక్క, జ్ఞాపకం వస్తుంది. ఆమె కటిక రాతి నేలను చీల్చుకుని విశాలాకాశంలోకి తలెత్తి చూసే మొక్కలాగా కూడా అనిపిస్తుంది. ఆ మొక్క ఈనాడు శాఖోపశాఖలుగా, ఫల పుష్ప భరితంగా విలసిల్లుతున్న మహా వృక్షం.

ఆమె జీవితం అందరికి ఆదర్శప్రాయం. ముఖ్యంగా సంఘ సేవారంగంలో, అందులోను మహిళా విముక్తి రంగంలో పనిచేస్తున్న వారికి, చేయదలచిన వారికి, ఆ రంగంపట్ల అభిరుచి, ఆసక్తి కల వారికి ఆమె జీవిత కథ అవశ్యం పఠనీయమైంది.

సుబ్బమ్మ గారి శైలికి ఒక్కబిగిన చదివించే శక్తి వున్నది. ఆమె గళం వలె కలం కూడా అనర్గళం. ఆత్మకథ వ్రాయాలనే ఆలోచన ఆమెకు రావడం, దానిలో తాను చిన్నప్పుడు పడిన కష్టాలు, ఎదుర్కొన్న సమస్యలు, వాటిని ఏవిధంగా అతిక్రమించి ఈనాడు ఒక విశిష్ట వ్యక్తిగా రాష్ట్రంలోను, దేశంలోను గుర్తింపు పొందారో అదంతా ఒక కథలా పూస గుచ్చినట్టు వివరించడం జరిగింది. సుబ్బమ్మ గారు ఇంకా చిరకాలం మహిళోద్యమంలో ద్విగుణీకృతోత్సాహంతో, శక్తితో పాల్గొని, మరిన్ని ఔన్నత్యాలు అందుకోగలరని ఆకాంక్షిస్తున్నాను.

# భాగం – I

# ఉపక్రమణిక

# ఉపక్రమణిక

"మీరొక ఫెమినిస్టుగా ఎందుకు మారారు? మీ పెళ్ళికి పూర్వమే మీకిలాంటి తిరుగుబాటు మనస్తత్వం, అభ్యుదయ భావాలు వున్నాయా? ఉంటే మీ ఆయన ఎలా వివాహమాడారు?" అని ఒక జర్నలిస్టు అడిగాడు. "మీరిద్దరూ యాభయి ఏళ్ళుగా కలిసి సహజీవనమెలా సాగిస్తున్నారు?" ఇది ఒక అమెరికన్ లేడీ ప్రశ్న. "పురుషాధిపత్యం పై మీ విమర్శలకు, స్త్రీ స్వేచ్ఛా సమానత్వాలకై మీ పోరాటాలకు కారణాలేమిటి? మీ భర్తకు మీకు సయోధ్య లేదా? మీరు కూడా బాధితులేనా?" అని ఒక పృచ్ఛకుని సందేహం. అసలు మీరు "హేతువాదిగా ఎలా మారారు?" అని ఒక విప్లవకారిణి అడగ్గా "హ్యూమనిష్టుగా ఎలా పరిఢవిల్లా" రని మరో సంస్కర్త అడిగాడు. "గత 40 ఏళ్ళుగా సాగిస్తున్న మీ ప్రబోధం వల్ల కాని, మీ రచనల వల్లకాని, స్త్రీ పురుషులలో చెప్పుకోతగ్గ మార్పు వచ్చిందా" అని ఒక మేధావి ప్రశ్నించగా, "అంత ఘాటుగా నిప్పులు కురిపిస్తూ స్త్రీ సమస్యల పై మీ రచనలెందుకు సాగుతున్నాయి" అని ఒక కాపిటలిస్టు అడిగితే "అసలు మీ వ్యక్తిత్వమే అర్థం కావడం లేదు" అని అనేకమంది ఆశ్చర్య పోతున్నారు. ఫెమినిస్టుననీ, రివల్యూషనరీనని, పురుష ద్వేషినని, స్త్రీ పక్షపాతినని, కుటుంబ శాంతి విధ్వంసకురాలినని తిడుతున్నారు, దుమ్మెత్తి పోస్తున్నారు. ఇంకా మహిళాభ్యుదయ రథ సారధినని, స్త్రీ జనాభ్యుదయ వాదినని, ఈ సమాజం పై పన్నీరు చల్లి వారి కన్నీరు స్వీకరిస్తున్న ఒక ఆశాజ్యోతినని ఇలా ఎన్నో, మరెన్నో ఆలోచనలు, విమర్శలు, అభినందనలు నా గురించి వున్నాయి. అందువల్ల నాలో ఒక విధమైన సంచలనం కలిగింది. ప్రజల్లో నాకొక విధమైన గుర్తింపు వున్నదని, నా జీవిత విధానాన్ని గురించి ఆలోచిస్తున్నారని అనిపించింది. ఈ ప్రశ్న పరంపరలను గురించి దీర్ఘంగా ఆలోచించా. నాలో లోపం లేనప్పుడు, నేను తప్పుడు మార్గాన పోనప్పుడు, నేనెవరికి అపకారం చేయనప్పుడు, ఏదో మంచిని పది మందికి పంచి పెడదామని, మోడువారిన వారికి ఉపయోగ పడేపని చేద్దామనే సంకల్పం కలదాన్నయినప్పుడు, అది నిజంగా ఆదర్శమయితే, నా జీవిత సత్యాన్ని పదిమందికి తెలియజెప్పటం సమంజసమనిపించింది.

ఇక ఏదో చెప్పాలనే తపన నన్ను వేధించింది. అసలు ఈ విషయాలన్నీ ఎలా చెప్పాలి, ఎవరికి చెప్పాలి, ఎందుకు చెప్పాలి అని మొదట్లో కొంత తిక మక పడ్డా. దీర్ఘంగా ఆలోచించి ఏదో కొంత మహిళాభ్యుదయాన్ని, బరువు బాధ్యతలను గత 40 ఏళ్ళుగా నా భుజాల పై మోస్తున్నాను కదా? అదంతా ఎందుకు చెప్పకూడదు. చెప్పుకోలేని పని అయితే అసలు ఆ పని ఎందుకు చేస్తున్నట్లు? చెప్పుకోలేని పని చేస్తే గదా చెప్పుకోటానికి సంశయం? అని దీర్ఘంగా స్థిరచిత్తంతో ఆలోచించుకొని ఒక నిర్ణయానికొచ్చా. ఆ పని ఎందుకు చేశానో నాకే తెలియదు. 1962 నుండి నేను మెట్రిక్ పాసయ్యాక దినచర్య వ్రాయటం అలవాటయింది. ఒక డైరీని మా పెద్దబ్బాయి

నాకిచ్చి వెళ్ళాడు. ఆ వెంటనే దానిమీద నా పేరు వ్రాసి రామ్మూర్తి గారు ఒక నెలంతా నా దిన చర్య వ్రాశారు. ఆ తర్వాత సిగ్గుపడి నేనే వ్రాయటం మొదలెట్టా. ఆ సంవత్సరం పెద్ద కార్యక్రమాలు లేకపోయినా ఏ రోజయినా ఒక ఘనకార్యం చేస్తే మహానందంతో ఉప్పొంగిపోతూ, మహా ప్రవక్తలా ఆది శంకరుని 'లెవెల్లో' పోజు పెట్టి వ్రాసేదాన్ని. అలా ప్రారంభించిన నేను ఈనాటి వరకు (1991) వ్రాస్తూనే వున్నా. రాను రాను కార్యక్రమాలు పెరిగిపోతూ వుండేవి. ఏమి చెయ్యని కొన్ని రోజులు తెల్లకాగితాలుగా మిగిలిపోతూ వుంటే వాటి వంక జాలిగా, బాధగా, అసంతృప్తిగా తిరగేస్తూ వుండేదాన్ని. అలా నా డైరీలు 30 దాకా వుండబట్టి నా ఆత్మ కథకు ఎంతో ఉపకరించాయి. అవి లేకపోతే ఈ పని సాధ్యపడేది కాదు. ఆ చరిత్ర అంతా వ్రాస్తే అదే ఒక ఉద్గ్రంథమవుతుందే! అయినా ఫరవాలేదు. అది తప్పక నా సహచరులకు, అభిమానులకు, ఆత్మీయులకు, విమర్శకులకు వినిపించాలనే పట్టుదల నాలో పెరిగింది. కాని నా చరిత్రనే చెప్పినందువల్ల అది చదివిన వారికి లాభమేమిటి? 'టైము', శ్రమ, ధనము వృధా కదా అనే మరో ఆలోచన నన్ను చుట్టుముట్టింది. అంత వృధా అయిన పని అయితే అసలు ఎందుకు చేసినట్లు? ఒక పని చేసినందువల్ల ఎవరికో ఒకరికి ఎంతో అంత ఉపయోగం వుండనిదే ఏ వ్యక్తీ శ్రమ పడదు. ఆఖరికి పశు పక్ష్యాదులు సైతం తమ బిడ్డల కోసం గూళ్ళు కడతాయి. తమ బ్రతుకు కోసం పనిచేస్తాయి. అది ప్రకృతి లక్షణం అయినప్పుడు సర్వశక్తి సంపన్నత గల మానవ శక్తికి ఏదో ఒక ఆశాజ్యో తి లేనిదే, ఏదో ఒక భవిష్యత్ ఊహా దర్శనం లేనిదే మానవులు ఎందుకు తమ శక్తి సామార్థ్యాలను, కాలాన్ని వ్యయప్రయాసల కోర్చి వెచ్చిస్తారు? అందులోనూ తమ స్వార్థానికి కాక పరహితార్థం కోసం తపన పడటంలో ఎంతో కొంతయినా, ఎంత కాలానికైనా తమ శ్రమ ఫలిస్తుందని, తమకోర్కెలు నెరవేరతాయని నమ్మి త్యాగాలు చేస్తారు. అడుగు ముందుకు వేస్తారు. అది మానవ నైజం, విజ్ఞుల ఆశయం, వివేకవంతుల లక్షణం కూడాను. ఆ దృష్టితోనే ఈ కార్యభారాన్ని నెత్తినేసుకున్నానేమో అనిపించింది. అందువల్లే నేను నమ్మిన సత్యాన్ని, సద్బుద్ధితో, సదాశయంతో, చిత్తశుద్ధితో నాటినుండి నేటివరకు, ఆ మాటకొస్తే అంతిమ దశ దాకా చెయ్యాలనే దృఢ సంకల్పం కలదాన్ని, ఆ విషయాలన్నీ బహిర్గత పరచటానికి మొహమాటం ఎందుకు? అసలు నేను ఎందుకు ఈ పని చేశానో, చేస్తున్నానో, ఇంకా చెయ్య బోతున్నానో, ఈ కార్య భారంలో ఎన్నో అడ్డంకులు, సమస్యలు ఎదురయినా ధిక్కరించి ముందుకు సాగిపోతున్నానో దాని ఫలితం భవిష్యత్ మహిళా లోకానికి ఎలా లాభిస్తుందో అనే విషయాలు నా జీవిత చరిత్ర ద్వారా వెలికి తేవాలనే ఆకాంక్షతోనే ఈ పనికి సాహసించడానికి పూనుకున్నా. ఇందులో లోపాలు, పొరపాట్లు, అతిశయోక్తులు దొర్లవచ్చు. కొందరికి మనః క్లేశము కలుగవచ్చు. కాని అంత మాత్రాన దానిని దాచటమెందుకు అని స్థిమితపడి చెప్పాలనిపించింది. అంతవరకూ నా చరిత్ర వ్రాయాలని నేనెప్పుడూ అనుకోలేదు. అసలు వ్రాయాల్సి వస్తుందని కూడా ఏనాడూ తలంచలేదు.

రకరకాలయిన ప్రశ్నలవారు, 'ఇంటర్వ్యూ ల వారు వెంటపడి అడుగుతుంటే మొత్తంమీద వ్రాద్దాం అనే స్థిర సంకల్పం కలిగింది. అది త్వరగా అంటే మృత్యువుతో ముఖాముఖీ పోరాడేలోగా నేనే వ్రాసి నా అనుయాయులకు, భావి పౌరులకు అందివ్వాలనే తపనే నన్ను ఈ బృహత్తర కార్య రంగంలోకి దింపింది. నా ఆలోచనలకు, ఊహలకు ఒక రూప కల్పన ఇవ్వాలనే తాపత్రయం పెరిగింది. అది ఉపయోగకరమైనా కాకపోయినా ప్రజలు వద్దన్నా, కద్దన్నా నా కథ వ్రాయాలని స్థిరీకరించుకున్నా. అంతే కాదు. కందుకూరి లాంటి ప్రతి సంస్కర్త, అభ్యుదయవాది, సంఘ సేవిక జీవితంలోను ఏదో ఒక సందేశం, ఆదేశం వుంటుందని, అది భావితరాలను ప్రభావితం చేస్తుందనే ఆత్మ విశ్వాసం నాలో వుండబట్టి ఈ కార్య భారాన్ని నెత్తినేసుకోవడం జరిగింది.

తన్ను గురించి వ్రాసుకునే ముందు రచయిత తన జీవితాన్ని అర్థం చేసుకోవాలి. తాను పరిపూర్ణంగా అంటే సార్థకమైన జీవితం అనుభవించాలి. అసలు ప్రతి వ్యక్తికి రెండు లక్షణాలు వుంటాయి. బాహ్య ప్రపంచంతో కొంత అనుభవిస్తాడు, ఆంతరంగిక శక్తులతో మరికొంత ఘర్షణ పడతాడు. అది అనుభవైక్య వేద్యం. ఇదొక విధమైన బాహ్య అంతర్గత శక్తుల మేళవింపు. ఈ రెంటినీ సమన్వయ పరచి సమ పాళ్ళలో రంగరించి వ్రాయగలగాలి. అందువల్ల ఆత్మకథా రచయితకు ఉన్నతాదర్శాలు వుండాలి. వాటిని కార్యరూపంలో సాధించ గలగాలి. ఆ సాధనలో కలిగే సమస్యలను, కష్టాలను ఎదుర్కోగల ధైర్యం వుండాలి. ఈ 'ప్రాసెస్'లో కలిగే తృప్తిని, ఆనందాన్ని చిత్రించ గలిగినప్పుడే ఆత్మకథకు సరిఅయిన రూపకల్పన చేయగలం. సిసలయిన ఆత్మకథ చదువరులను ఉత్తేజితుల్ని చేసి ఉన్నత మార్గాన పయనింప జేయగలగాలి. ఏ ఒక్కరి లోనయినా స్పందన కలిగించాలి. "ఆత్మకథ వ్రాసే స్థాయి మీకు వుందా? మీరు ఏం ఘనకార్యం సాధించారని వ్రాశారు? ఎవరిని వుద్ధరిద్దామని మీ కథ వ్రాయాల్సి వచ్చింది? మీరేం గొప్ప తత్వవేత్తలా? కార్యశూరులా? సంస్కర్తలా? నూతన మార్గాన్వేషకులా? రాజకీయ వేత్తలా? లేక సంఘ సేవకులా? ఈ రచనలో క్రొత్త సందేశాన్ని గాని, క్రొత్త సిద్ధాంతాన్ని గాని ఏమయినా ప్రతిపాదించారా? అలా లేనిదే ఏమని వ్రాస్తున్నారు? ఎందుకు ఈ పనికి పూనుకున్నారు" అని అడిగేవారు లేక, ప్రశ్నించేవారు వుండవచ్చు. సబబేకాని "నీరము తప్త లోహమున నిలిచి అనామకమై నశించు, ఆ నీరమే శుక్తిలో (ముత్యపు చిప్ప) బడి మణిత్వము (ముత్యం) గాంచు" నని స్మృతి కర్తలు చెప్పినట్లు అన్ని చినుకులూ స్వాతి చినుకులు కాకపోవచ్చు. అలాగే వ్యక్తులందరూ ముత్యం లాంటి విశిష్టతను రూపొందించుకోలేక పోవచ్చు. ఒక్కొక్క వ్యక్తిలో ఒక్కొక్క గొప్ప గుణం వుంటుంది. తద్వారా చదివిన వారు పరహితార్థాన్ని పాటిస్తారు, ఉత్తేజితులవుతారు. అలా ఏ ఒక్కరిలో ఆశలు చిగురించినా సేవా దృక్పథం పొడచూపినా, ముందడుగు చేసినా కథకుని శ్రమ ఫలించినట్లే. అదే ఆత్మకథ ఇచ్చే సందేశం. అందుకే ఆత్మకథలు

వ్రాయటం. ఆత్మకథ వ్రాసుకోవాలనుకునే వ్యక్తి తన జీవితాన్ని పూర్తిగా విశ్లేషించి, అర్థం చేసుకొని, అందులో ఏదో ఒక సందేశం, ఉదాత్తత వుంటేనే వ్రాయాలి. ఆ రచయిత జీవిత ఘట్టాల ద్వారా చదువరులు ప్రభావితులు అవుతారు. ఏ వ్యక్తికయినా తన జీవితం గురించి తానే వ్రాయడం చాలా కష్టమైన పని. బాహ్య దృష్టితో (ఆబ్జక్టివ్ గా) నిజాయితీగా, ఆత్మ విశ్లేషణ చేసుకోగల ఆత్మస్థయిర్యం కలవారే ఆత్మకథా రచనలకు అర్హులు. అసలు ఆత్మకథ ఎందుకు వ్రాయాలి? ఎవరికోసం వ్రాయాలి? తన గొప్పతనాన్ని చాటుకోటానికా లేక తన లోపాలను, ప్రలోభాన్ని, నైజాన్ని బహిర్గతం చెయ్యటానికా? అంటే మంచీ చెడూ రెండూ చెప్పుకోగలిగితేనే నిజంగా ఆ రచన అసాధారణమవుతుంది, దానికి శాశ్వతత్వం వుంటుంది. అలా చెప్పుకోగలవారు ధన్యులు. చేసిన పాపం చెపితే పోతుందంటారు. అంటే ఆ రచన వల్ల చదువరులు తమ చెడు నడతను విడనాడి వివేకాన్ని పొంది ధర్మాత్ములు కావచ్చు. స్వార్థ త్యాగులయి పరహితార్థం కొరకు జీవించే అవకాశం వుంది. అలాంటి అనుభూతి వీరేశలింగంగారి ఆత్మకథ చదివాక నాలో కలిగింది అని చెప్పటానికి గర్వపడుతున్నా. నాకు మితిమీరిన బాధ కలిగినప్పుడు కందుకూరి కథ చదివితే దుఃఖోపశమనం కలిగేది. ఒక అర్భకుడు, బడిపంతులు, అర్థబలం, అంగబలం, అధికార బలం లేనివాడు పైగా చేపట్టిన కార్యరంగం సంస్కరణ. అది మహా విప్లవాత్మకమయిన దని, ఎదురు దెబ్బలు వస్తాయని తెలుసు ఆయనకు. అయినా స్థిర చిత్తంతో నిలబడ్డ మహాపురుషుడు. ఆనాడు ఆ సమాజంలో ఒంటరిగా నిలబడి ఇటు సాహిత్యం చేపట్టి వాడి వాడి పద జాలంతో వ్రాసి ప్రజలను ఉత్తేజపరిచాడు. బాల వితంతువుల పాలిట కల్పతరువై నిలిచాడు. మరి ఈనాడు మనకు ఎన్నో అవకాశాలు వున్నాయి. ఎందుకు చెయ్యరాదని.

ఆయన ఆ కష్టాలను సుఖాలుగా స్వీకరించ లేదా అని ఆత్మ సంతృప్తి చెందేదాన్ని. అలా కందుకూరి ఆత్మకథా ప్రభావం ఆనాడు అనేక లక్షల మందిని ఉద్వేగపరచింది. అంత ప్రభావం మనలో వున్నా లేకున్నా మన తాహతు మనకుంది. ముఖ్యంగా నే చేపట్టిన కార్యరంగం కూడా అసాధారణమయినది. సగభాగమైన మహిళాభ్యున్నతికి పాటుపడటం, ఆ ఉద్యమానికి మనమే సారథులం కాకపోయినా మన పాత్ర మనకుంది. దానిని నా తదనంతరమైనా ప్రజలు గ్రహిస్తే చాలు. మనమీద ముందుగా చల్లేది మురికినీరే. వ్యక్తి మరణానంతరమే అతన్ని గుర్తించటం అతని సాహిత్యం పై 'రిసెర్చి' చేయటం మనవారి ప్రత్యేకత.

"ఇన్ని సంస్థలు స్థాపించారు, ఇన్ని సంవత్సరాల నుండి పని చేస్తున్నారు, ఇంత సాహిత్యం సృష్టించారు, మీ తరువాత ఈ సంస్థలన్నీ ఎవరు చూస్తారు? మీరెవరినైనా తయారు చేశారా? వారసత్వం లేని వుద్యమాలు కాని ఆస్తులు కాని చెల్లాచెదురయి పోతాయి గదా! అప్పుడు మీ శ్రమంతా దండగే గదా!" అని పలువురు ప్రశ్నించినప్పుడు,

దృఢ చిత్తంతో, కార్యదీక్షతో ఒక కార్యరంగాన్ని సృష్టించుకొన్నప్పుడు, ఆ పని మంచిదని తలచినప్పుడు, అది పది మందికీ ఉపయోగపడుతుందని భావించినప్పుడు, తాను ఏదో మంచి పని చేయాలనిపించినప్పుడు సంస్కర్తలు వెనుకా ముందు ఆలోచించరు. దీనికి వారసులు వున్నారా లేరా అని చూడాల్సిన పనిలేదు. వారసుల్ని చూచి సంఘాలు సృష్టించం కదా! మనం చేస్తున్న పని మంచిదయితే, అది ప్రజలకు ఉపయోగించేదయితే మనం చేసుకుంటూ పోవడమే. అది వద్దన్నా కద్దన్నా పది కాలాలు నిలుస్తుంది. ఆ పనిని ఆమోదించిన ప్రజలే మన దగ్గరికొస్తారు. లేదా మన తర్వాతనయినా నెత్తినేసుకుంటారు. అది చెయ్యమంటే చేసే పని కాదు. వద్దంటే ఆగేది అంతకన్నా కాదు.

వీరేశలింగం విధవా వివాహ ఉద్యమం నడిపినప్పుడు చాలా వ్యతిరేకత వచ్చింది. విమర్శలు, తిట్లు, తిరుగుబాట్లు వచ్చాయి. అయినా ఆపలేదు, ఆగిపోలేదు. చాతనయినంత వరకూ చేసి పోయాడు. ఆ తర్వాత ఆ ఉద్యమం ప్రజా ఉద్యమం అయింది. ఎవరాపగలిగారు? ఆనాడు ఆయన్ని తిట్టిన ఆ ప్రజలే, ఆనాడు ఆయనకు చేయూత నివ్వని ఆ ప్రజలే ఈనాడు ఆయన చేసిన పనికి జోహార్లు ఇస్తున్నారు. అలా జరుగుతుందని ఆయన ఊహించాడా? కొన్ని ఊహాతీతంగా వుంటాయి. ఇక్కడొక ఉదాహరణ చెప్పక తప్పదు. ఒకసారి ఒక రచయిత విశ్వనాథవారి వద్దకు వెళ్ళి "అయ్యా! నేనొక కావ్యాన్ని వ్రాశాను. దీనికి మీరు ముందుమాట వ్రాయండని" అభ్యర్థించాడట. అప్పుడా మహా కవి "అయ్యా! నీ కావ్యంలో విలువ ఉంటే అది పది కాలాలు నిలుస్తుంది. ప్రజా మన్నన లభిస్తుంది. అందులో సాహిత్యపు విలువగాని, విశ్వ శ్రేయస్సుకాని లేకపోతే నేను పీఠిక వ్రాసినా బ్రతకదు నాయనా!" అని గౌరవంగా మందలించాడట. అది అక్షరాలా నిజమని ఒప్పుకోక తప్పదు. అలాగే నేను చేస్తున్న సేవా రంగ కార్యక్రమం ప్రజోపయోగమయితే దాన్ని ప్రజలే గౌరవించి ఆదరిస్తారు, లేదా మనమెంత మొత్తుకున్నా జరగదు. గుర్రాన్ని చెరువుదాకా తేగలం కాని గుక్కెడు నీళ్ళు దానిచేత త్రాగించలేము. అలాంటిదే ప్రజా వాహిని. అసలు నే చేసేపని సందర్భంగా ముందొక ఆలోచన, ఊహ కలిగి "నా ఆత్మకథ వ్రాసి 'ప్రింటు' చేయించాక నేను చాలా కాలం బ్రతికి మరికొన్ని ఘనకార్యాలు చేస్తే ఆ భాగం ఎలా బహిర్గత మవుతుందండీ! మళ్ళీ మరో భాగం వ్రాయగలనా? ఎలాగండీ? "అని రామ్మూర్తిగారిని ప్రశ్నించా. "నీ ఆత్మకథ పుస్తకం పూర్తి అయ్యాక మరి నీవింక బ్రతకకూడదు." అని ఛలోక్తి విసిరారు. మనిషి ఉన్నత దశకు చేరుకున్నప్పుడే ఆత్మకథ వ్రాయాలని వారి భావంగా నేను గ్రహించాను. మనకు ఆలోచన వున్నప్పుడే వ్రాయగల సాధన సంపత్తులు వున్నప్పుడే, ఆపని చేసి తృప్తి చెందాలి. కాని ఆ తర్వాత ఎవరయినా చేస్తారో లేదో అని ఆశించకుండా చేయడం మంచిది, అలా చేయకపోతే అది బహిర్గతం కాదు.

నా జీవిత చరిత్రలో నా భావాలు, లక్ష్యాలు, ఆదర్శాలు చోటు చేసుకుంటాయి. నా అనుమతి లేకుండానే నాకలం లాక్కెడుతుంది. అందులో నిత్య సత్యాలెన్నో వుంటాయి. కొందరు దాన్ని భరించలేక పోవచ్చు. నాకు మాత్రం దురుద్దేశ్యం లేదు. అందులో పురుషనింద, స్త్రీల దాస్యం గోచరిస్తూనే వుంటాయి. అది పూర్తిగా పురుష జాతిని ద్వేషించడం మాత్రం కాదు. హెచ్చుశాతం మంచి చెడును వివరించి దానిని సూత్రీకరించి కథను నడిపించడమే రచయిత ధ్యేయం. కాని ఎవరినీ ఉద్దేశించి కాదని పాఠకులు గ్రహించాలి. అసలు మంచి చెడుల ప్రసక్తి వచ్చినప్పుడు ఏ వ్యక్తి నూరుపాళ్ళు చెడుగాని మంచిగాని అయి వుండదు. షేక్స్పియర్ 350 పాత్రలను సృష్టించినా, వ్యాసుడు భారతంలో వేల సంఖ్యలో వ్యక్తుల గుణ గణాలు చిత్రించినా ధర్మరాజులో లోపాలు, దుర్యోధనుడిలో మంచి లక్షణాలు కాదనలేనివి కొన్ని వున్నా – అతడు ధర్మాత్ముడు ఇతడు దుష్టాత్ముడు అని ఎలా అంటున్నామో అలాగే – మొత్తంమీద స్త్రీలు బాధితులు, పురుషులు బాధించేవారు అని అనాల్సి వస్తోంది. కనుక కేవలం పురుష ద్వేషినని స్త్రీ, పక్షపాతిని అని భావించకండి. సమాజంలోని తీరు తెన్నులు గత 40 ఏళ్ళుగా పరిశీలన చేస్తున్నాను. కనుక నాది అనుభవ జ్ఞానం కాని అర్థజ్ఞానం కాదు. ఇక నా విషయంలో నేను బాధితురాలినని చాలమందికి అనుమానం. ఆనాటి సంప్రదాయ బలిమి వల్ల కూపస్థ మండూకాన్ని అయ్యా గాని పురుషాధిపత్యం, యాజమాన్యం నన్ను అంతగా బాధించలేదు. కార్యశూరులు ఎప్పుడూ తన గురించిన దానికన్నా లోకాన్ని తిలకించి, లోపాలను గ్రహించి, బాధలకు ద్రవించి, ఆ బాధా సర్పదష్టుల కన్నీరు తుడిచి పన్నీరు చల్లటానికి తన సర్వ శక్తులు వాడి తమ జీవితాలద్వారా ఉత్తేజ పరుస్తారు.

“మా కొద్దీ తెల్ల దొరతనం” అనే ఒక్క కలం పోటుతో కోట్ల భారతీయులను కార్య రంగంలోకి దింపి వారి త్యాగాలతో స్వరాజ్యం పొంద గలిగాము అంటే కత్తికంటే కలం గొప్పదనేది కాదనలేని నిత్య సత్యం. ఆ దృష్టితోనే స్త్రీల సమస్యలను ప్రజాదృష్టికి తెచ్చేటప్పుడు పురుష నింద తప్పదు. అయినా పురుషులంతా ద్రోహులని నేను స్పష్టీకరించడం లేదు. అలా చెప్పడం మహా దారుణం కూడా. హెచ్చు శాతం పురుషాధిపత్య భావంతో వున్నారని చెప్పక తప్పదు. అలాంటి భావ విష వృక్షాలను కూలంకషంగా పడగొట్టటంలో నా స్పష్టమయిన భావాలను వివరించాల్సి వస్తున్నది.

కలం బలంతో ప్రజలను కదిలించగల ఆ శక్తి సామర్థ్యాలు మీకు వున్నాయా అంటే దేని శక్తి దానిది. ఎవరి పరిధి వారిది. ఇదొక అనంత భూగోళం. ఇందులో కొన్ని కోట్ల జీవరాసులు మనగల్గు తున్నాయి. అందులో మానవులు జిజ్ఞాసాపరులు. వారిని మళ్ళీ నాలుగు రకాలుగా విభజించవచ్చు. ఉన్నతులు, మధ్యములు, అధములు, అధమాధములు. ఎవరి శక్తి సామర్థ్యాలు వారివి. ఎవరి ఆదర్శాలు వారివి. ఎవరి లక్ష్యాలు వారివి. అయితే అందరిలోనూ తొణికిసలాడేది మానవత్వం, ఆర్తి, సోదర భావం. అవి లేనివారు పశుతుల్యులు. ఆ చివరి కోవలోకి పోవటం నాకిష్టం లేదు.

అందువల్లే అంతో ఇంతో చేయాలనే ఆవేదన నా జీవిత పయనాన్ని నిర్దేశించింది.

ఆడవారి అగచాట్లు విని, చూచి, ద్రవించి చాతనయినంత చేసి వారికి చేయూత ఇవ్వటంలో ఒక మెట్టు ఎక్క గలిగాను. 'ఎవరెస్టు' అధిరోహించలేక పోయినా కొంతదూరం మాత్రం నా పయనం సాగిపోయిందని చెప్పటానికి సాహసిస్తున్నందుకు మన్నించాలి. ఏ పుట్టలో ఏ పాము వుందో, ఏ కథలో ఏ సన్నివేశం చదివి ఎవరు స్పందించి మారిపోతారో ఎవరు చెప్పగలరు! ఆ దృష్టితో రాసిందే నా ఆత్మకథ. నా కోరిక తీరింది. పాఠకులు ఎవరి అభిరుచిని బట్టివారు కథా సారాన్ని ఆస్వాదిస్తారు.

అందరూ మహాత్ములు కాకపోవచ్చు. ప్రతి ఒక్కరూ ఐన్ స్టీన్, మార్క్స్, లింకను, గాంధీలు కాకపోవచ్చు. అందరూ సముద్రంలాంటి రత్నాకరులు కాలేక పోవచ్చు. కాని పిల్ల కాలువలు లేకుండా, వాగులు పారకుండా, నదులు ప్రవహించకుండా సముద్రాలు ఎలా ఏర్పడతాయి? ఒక సంస్కరణ కాని, అభ్యుదయాన్ని కాని ప్రవేశ పెట్టాలంటే ఎంతో కష్టం. ఒక జీవితం చాలదు. వ్యతిరేకత అనంతంగా వుంటుంది. మాకు చాతకాదని కొందరు, మాకు అవకాశాలు లేవని మరికొందరు, మాకు వయస్సు పండిపోయిందని, డబ్బులేదని, దరిద్రమని, అనారోగ్యమని, అసలు తీరికే లేదని సవాలక్ష సాకులు చెప్తూ వుంటారు. అవన్నీ అర్ధ సత్యాలని నా విశ్వాసం. అసలు ముఖ్యంగా ఆడవారి జీవితాలు వడ్డించిన విస్తళ్ళు కానే కావు. పైగా అవాంతరాలు మెండు, వ్యతిరేకత అనల్పం. దారి పొడవునా వున్న ముళ్ళ పొదలు మన పాదాలలో దిగబడుతూనే వుంటాయి. వాటిని నరుక్కుంటూ పోతేనే గమ్య స్థానాన్ని చేరగలం. అందుకెంతో స్థిరచిత్తం కావాలి. మనకు మనమే మన స్థానాన్ని, స్థాయిని, హోదాను పెంచుకోవటానికి ప్రయత్నించాలని నా జీవితానుభవం నాకు నేర్పిన విద్య. నా అనుభవాన్ని నేను మీకు విన్నవించుకుంటే మీరూ మీ బాటలో పయనించగలరనే నమ్మకం నాకుంది. మీరేదో అజ్ఞానులని, నేనేదో మహా ప్రవక్తనని నేను చెప్పటం లేదు. మనందరి అనుభవాలను కలబోసుకొని అందరం పురోగమించాలనే నా ఈ ప్రయత్నమంతా అని మీరు అర్ధం చేసుకుంటే నా శ్రమ ఫలించినట్లే.

సమాన అవకాశాలే లేని ఈ సమాజంలో అనేక అడ్డంకులను ఎదుర్కొని పైకి రావాలంటే దాని వెనక ఎంతటి కృషి, పట్టుదల, ధైర్య సాహసాలు వుండాలో తెలుసుకుని ముందడుగు వేయగల స్ఫూర్తిని పొందటం నా మొదటి మెట్టు. అజ్ఞానం, అవిద్య, అసమానతలనే గాఢాంధకారంలో కొట్టుమిట్టాడుతున్న స్త్రీ జాతికి కొంత వరకైనా వెలుగు, దారి చూపించాలని, అందుకు నా కథ చిరుదివ్వెగా నైనా ఉపయోగపడాలనే సదుద్దేశంతో నా జీవిత చరిత్ర వ్రాయాలనే సంకల్పం కలిగింది. పాఠకులు, విమర్శకులు నన్ను అర్ధం చేసుకుంటే నా కృషి ఫలించినట్లే. ఆ ఆనందమే ఏనుగంత బలం. ఆ సంతృప్తితోనే ఇక నా కథ ఉపక్రమిస్తాను. మరి వింటారా!

# భాగం – II

# నేను : నా కుటుంబం



తల్లి అన్నపూర్ణమ్మ




తండ్రి సత్యనారాయణ



అత్తగారు కామేశ్వరమ్మ



మామగారు సోమసుందరం




హైదరాబాద్ చదువుకు ముందు (1962)



కుటుంబ నియంత్రణ శిబిరం (1965)



మున్సిపల్ ఎన్నికలలో (1968)




ఆంధ్రోద్యమ సత్యాగ్రహ నాయకత్వం (1972)



జై ఆంధ్ర రాష్ట్ర మహిళాసభ
అధ్యక్షవర్గంలో (1973)



ఫిలిం సొసైటిలో మృణాల్ సేన్‌తో (1975)




కూరగాయల ఎగుమతి నిషేధ ఉద్యమం (1979)



అధిక ధరలపై అత్యాచారాలపై సమిష్టి
ఆందోళన (1979)

# 1. అనుభవాలు - జ్ఞాపకాలు

నాకప్పటికి ఆరేళ్ళు. అది 1929వ సంవత్సరం అక్టోబరు 29వ తేది. ఆ రాత్రి 12 గంటలకు శారదా యాక్టు అంటే బాల్య వివాహ నిరోధశాసనం అమల్లోకి వస్తుంది. ఆరోజు అర్ధరాత్రిలోగా ఏ ఇంట్లోనూ కన్యలు వుండరాదని, కన్నెచెర విడిపించి తల్లిదండ్రుల కుటుంబాలను అంటే ఇటు ఏడుతరాలు అటెడుతరాలకు స్వర్గలోక నివాసం కలిగించాలనేదే ఆనాటి ఆచారం. ""అష్ట వర్షాత్ భవేత్కన్యా" అనేది ధర్మ శాస్త్రజ్ఞుల నిర్వచనం. రజస్వలానంతరం వివాహం నిందార్హమే కాదు ధర్మశాస్త్ర విరుద్ధం కూడా. పుట్టబోయే పిల్లలకు, గర్భస్థ పిండాలకు పెళ్ళిళ్ళు కుదిర్చే రోజులవి. 8 సంవత్సరములు నిండేలోగా పెళ్ళిచేయని తల్లిదండ్రులను వెలివేసేవారు. మన వాళ్ళు చట్టాన్ని ఎలా అధిగమించాలో, చట్టాల్లో ఏ లోపాలు వున్నాయో, శాసనాన్ని ఎలా త్రోసిరాజనాలో అవన్నీ ముందుగానే ఆలోచించడం ఈనాడే కాదు ఆనాడూ వుంది. అందువల్ల ఆ బిల్లు పాసయి చట్టరూపం ధరించేలోగా కొన్ని లక్షలమంది కన్యలకు కన్యాదానాలు జరిగాయి. పదిరోజుల పసిపిల్లనుండి ఎనిమిది సంవత్సరాల ఆడపిల్ల వరకు ఏ ఇంట్లోనూ మిగలకుండా పెళ్లిళ్లు చేశారు. కొన్ని సందర్భాలలో అబ్బాయి పసుపుతాడు ముడివేయలేకపోతే పురోహితుడే ఆ పనినెరవేర్చేవాడు. చివరి రోజున అంటే 29-10-29న అర్ధరాత్రి 12 గంటలలోగా కొన్ని వందల సంఖ్యలో పెళ్ళి వూరేగింపులు జరిగాయి. ఈ ఉత్సవాలు, వేడుకలు చూస్తుంటే నేను కూడా అలాగే పూసల పల్లకి ఎక్కాలని, బ్యాండు మేళంతో వూరేగాలని, మహా సరదా పడేదాన్ని. లడ్లు, జిలేబీలు తినాలని, బుగ్గన నల్లని చుక్కతో, నుదుట కళ్యాణపు బొట్టుతో, పాదాల పారాణితో, కళ్ళకు కాటుక పెట్టుకొని తిరగాలని, ఎవరూ కని పెట్టకుండా దొంగచాటుగా వరుణ్ణి చూడాలని మహా ముచ్చటగా వుండేది. బంతులాట ఆడుకోవాలని కలలు కంటూ వుండేదాన్ని. నగలంటే ఎంతో మోజుగా వుండేది. అందరు నాన్నలు అమ్మాయిలకు పెళ్ళిళ్లు చేస్తుంటే నాన్న నాకెందుకు చెయ్యడు అనుకున్న నేను ఒకనాడు "నాన్నా! నా పెళ్ళెప్పుడు చేస్తావని "ధైర్యంగా అడిగేశా. "నీవింకా చిన్న పిల్లవు కదా! కాస్త పెద్దయ్యాక మంచి మగణ్ణి తెచ్చి వైభవంగా నీ పెళ్ళి చేస్తానమ్మా!" అంటూ నా తల నిమిరాడు. అప్పుడు సిగ్గంటే ఏమిటో తెలియని వయస్సు నాది.

ఆరోజు సంవత్సరాది పండుగ. కొత్త బట్టలు కట్టుకొన్న నేను మహా గర్వంతో "మేము ఇప్పుడు చాలా భాగ్యవంతులయి పోయాం. మా నాన్న బోలెడన్ని డబ్బులు సంపాయిస్తున్నాడు. అందుకని మేము పెద్ద మేడలోకి వెళ్ళిపోతున్నాం" అని నా నెచ్చెలి పిచ్చమ్మతో మహా గొప్పగా గర్వంతో చెప్పడం మా నాన్న విన్నాడట. వెంటనే బైటికొచ్చి నన్నెత్తుకొని ముద్దాడి మా నాన్న తన క్లయింటు గౌరీనాథ శాస్త్రితో "విన్నావటయ్యా! నా కూతురెంత ఆలోచనాపరురాలో, ఎంత హుందా, ఎంత దర్పంగల పిల్లో. విన్నావా దాని మాటల తీరుతెన్నులు. నీకు తెలుసుకదా! అది పుట్టాకనే నేనొక మనిషినయ్యాను.

రెండు పూటలా కడుపునిండా తింటున్నా. అది నాలాంటి వాడి కడుపున పుట్టడం నా అదృష్టం. నా తల్లి గొప్ప అదృష్టవంతురాలు. దానికి మహాయోగం వుంది. ఓ మహా జాతకుణ్ణి తెచ్చి దాని పెళ్ళి జమిందారీ స్థాయిలో జరిపిస్తానయ్యా" అని అన్నాడు. ఆనాటి ఆ అభినందన వాక్యాలను ఆయన తన 52వ ఏట చనిపోయేదాకా సంతోషంతో చెప్పుకుంటూనే వుండేవాడు.

నేనంటే మా నాన్నకెంతో ఇష్టంగా వుండేది. నన్ను 'అమ్మా – అమ్మా' అని పిలిచే ఆయన నన్ను ఏనాడూ కొట్టిగాని, తిట్టిగాని ఎరుగడు. పదేళ్ళ దాకా పక్కలో పడుకోబెట్టుకొని ముద్దాడేవాడు. మా నాన్న తన తండ్రి పేరు వెంకటప్పయ్య, మా అమ్మ తన తల్లి పేరు సుబ్బమ్మ, ఈ రెండు పేర్లూ కలిపి నాకు "వెంకట సుబ్బమ్మ" అని పేరు పెట్టారు. అదీగాక మా అమ్మకు కలలో వెంకటేశ్వర్లు, సుబ్రహ్మణ్యస్వామి నేను పుట్టిన పదవ రోజున కనబడి తమ పేర్లు పెట్టమన్నారని, లేకపోతే నాకు బాలారిష్టాలు తప్పవని చెప్పారట. సోది అవ్వ కూడా పెద్దల పేరు పెట్టమని చెప్పిందట. సరేనని మొక్కు కునేటంత వరకు నేను పాలు త్రాగక ఏడ్చానని, మొక్కుకున్నాక తేరుకున్నానని మా అమ్మ చెబుతూ వుండేది. అలా దైవాజ్ఞతో నా పేరు పెట్టారట. చిన్నప్పుడు నన్నంతా "సుబ్బా – గబ్బా – సబ్బా" అంటూ ఎగతాళిగా పిలిచేవారు. మహా మాటకారినట. కొందరు క్లయింట్లు, బంధువులు నన్ను 'మాటల పుట్ట' అనే వారు.

## నా జన్మ భూమి

నా జన్మస్థానం గుంటూరు జిల్లా పోతార్లంక. 2–8–1924 రక్తాక్షి నామ సంవత్సర శ్రావణ శుద్ధ విదియ శనివారం ఉదయం గం౹౹ 8–36 ని౹౹ లకు ఆశ్లేష నక్షత్రంలో నేను పుట్టాను. నేను పుట్టినప్పుడు భూనభోంతరాలు దద్దరిల్లలేదు. ప్రళయ మారుతాలు వీయలేదు. పోనీ స్వర్గం నుండి పుష్ప వృష్టి కాదు గదా కనీసం జడివాన అయినా కురియ లేదు. చాలా సాధారణంగా, మామూలుగా నేను ఈ భూమి మీదకు వచ్చానట. ఇది 67 ఏళ్ళ క్రిందటి చరిత్ర.

## మా తాతగారి కుటుంబ పరిస్థితి

మా నాన్నగారిది అతి పేద కుటుంబం. ఇంటి పేరు 'కొండూరి', శాండిల్యస గోత్రం. వెలనాటి వైదిక బ్రాహ్మణులు. మా తాత గుంటూరు జిల్లాలో ఇటికంపాడు గ్రామ నివాసి. కుటుంబ జీవనాధారానికి ఒకటిన్నర ఎకరాల పొలం మాత్రం వుండేది. మా తాతకు ఆరుగురు మగ సంతానం. ఒక ఆడపిల్ల. ఏ జీవనాధారం లేక కేవలం చీట్ల పేకాటతో కుటుంబాన్ని పోషించేవాడు. రోజూ సాయంత్రానికి రూపాయి పావలా దాకా చిల్లర తెచ్చే వాడట. ఒక అణాకు వీ సెడు వంకాయలు, ఒక అణా పెట్టి ఒక సోలెడు కందిపప్పు, ఒక కానీ (మూడు పైసలు) తోటకూర వగైరాలు సాయంత్రానికి

ఇంటికి తెచ్చేవాడు. పండిన వడ్లను మా నాయనమ్మ దంచి అన్నం వండి పెట్టేది. అలా అష్టకష్టాలుపడి కుటుంబాన్ని పోషిస్తూ చీట్లాటలో మిగిలిన చిల్లర దాచి తిరిగి మరో ఎకరం పొలం 100 రూపాయలు పెట్టి కొన్నాడట మా తాత. ఆరుగురు కొడుకులలో ఇద్దరిని పెంపుడు ఇచ్చారు. ఒక కొడుకు చెట్టుమీద నుండి పడి చనిపోయాడు. మా నాన్న రెండో కొడుకు. పేరు సత్యనారాయణ. మా పెద్ద నాన్న రాజగోపాలం ఐదు క్లాసులు (ఆ రోజుల్లో ప్రయిమరీ) చదివి ఎలిమెంటరీ స్కూలు టీచరై తర్వాత హెడ్ మాస్టరయ్యాడు. మా నాన్న చాలా అందమైన వాడు. చక్కని ముక్కు, సన్నని పలు వరుస, బంగారు ఛాయ, మంచి రూపసి, మెరిసి పోతుండేవాడట. మా నాన్న తన చదువు కోసం ప్రక్క వూరు అప్పికట్లకు రోజూ రెండు మైళ్ళు నడిచి వెళ్ళి 5 క్లాసులు పాసయినాడు. ఇంక పై చదువు ఆ గ్రామంలో లేదు. కాబట్టి చదువు మానుకొని పొలం పని చూసుకోమన్నాడు తాతయ్య. మా నాయనమ్మ తన కొడుకు పెద్ద ఆఫీసరు కావాలని కోరుకునేదట. అందుకోసం మా తాతయ్యతో రోజు దెబ్బలాడి ఏడు మైళ్ళ దూరంలో గుంటూరు జిల్లా బాపట్లలో కాపురం పెట్టి చదివించమని మొండి పట్టుపట్టి ఏడ్చి, ఆఖరికి ఉపవాసాలు వుండి నెగ్గిందట. ఇటికెంపాడు నుండి బాపట్లకు ఎద్దుల బండి మీద ధాన్యం, సామాను మాత్రం పెట్టి పంపి తాము పోవడానికి డబ్బులు లేక బిడ్డలను నడిపించుకుంటూ మధ్య, మధ్య ఎత్తుకుంటూ బాపట్ల చేరారు. దారి పొడవునా మా తాత మా నాయనమ్మను కొడుతూ, తిడుతూ సాధిస్తూనే వచ్చాడు. సిటీకి వస్తే కాపురం నేనేం భరించగలను అంటూ వాపోయాడు. ఎలాగైతేనేం బాపట్లలో ఒక పోరంబోకులో 1905లో చిన్న తాటాకుల ఇల్లు కట్టుకొని కాపురం పెట్టారు. కాని ఇల్లు గడిచేదెలా? మళ్ళీ మా తాత బస్తీలో కూడా చీట్ల పేక ఆఫీసు తెరిచాడు. ఏనాడూ ఓటమి ఎరుగని తాతయ్య రోజూ రెండు రూపాయల దాకా తెచ్చేవాడు. అది చాలక మా నాన్న, మా బాబాయి వారాలు చేసుకొని చదువుకొనేవారు. అలా స్కూలు ఫైనలు అవ్వబోతుండగా ఒకనాడు మా అమ్మ తండ్రి ముష్టి రామయ్య బాపట్ల కోర్టులో పని వుండి వచ్చాడు. అది బ్రహ్మాండం బాపయ్య గారిల్లు. ఆయన తెలుగు ప్లీడరు. వారింట్లో మా నాన్నకు ఆరోజు వారం. అంటే విద్యార్థికి మూడు పూట్లా ఉచితంగా అన్నం పెట్టేవారు వదాన్యులు. అది పుణ్యమని ఆ రోజుల్లో విద్యార్థులకు సంపన్నులు వారాలు ఇచ్చేవారు. ఏడు రోజులూ ఏడుగురు తిని వెళ్ళి వేద విద్యగాని, లేక లౌకికపరమైన వృత్తి విద్యగాని నేర్చుకొని బ్రతుకుతెరువు పొందేవారు. ముఖ్యంగా బ్రాహ్మణులు. అలా విద్యార్జన కొరకు అష్టకష్టాలు పడ్డవారిలో మా నాన్న ఒకరు. కిరసనాయిలు కొనలేక ఆముదపు ప్రమిద చుట్టూ కూర్చుని పిల్లలు చదువుకొనేవారు అని మా నాయనమ్మ చనిపోయేదాకా వాళ్ళ కథలన్నీ మాకు చెప్తూ వుండేది. మా రోజులు నాటికి కిరసనాయిలు లాంతరు, తరువాత పెట్రోమాక్సు లైట్లు వెలిశాయి. ఆ తర్వాత గుంటూరులాంటి పట్టణాల్లో 1940 నాటికి కరెంటు వచ్చింది.

మా అమ్మ పేరు అన్నపూర్ణమ్మ. ఆమెకు విద్యా విజ్ఞానాలు చాలా తక్కువ. వాళ్ళది

రేపల్లె తాలూకా పోతార్లంక. మా అమ్మమ్మకు ముగ్గురు అమ్మాయిలే. మా అమ్మ మూడో ఆమె. మా తాత ముప్పి రామయ్య ఆవూళ్ళో గొప్ప పేరు ప్రఖ్యాతులున్న ధనవంతుడే కాదు, ముప్పై ఎకరాల మాగాణి భూమి, స్థిరచరాస్తులు కలిగి వూరి పెద్దగా, పెద్దమనిషిగా చలామణి అయ్యేవాడు. వాళ్ళది వెలనాటి వైదిక బ్రాహ్మణ కుటుంబం. కృష్ణ వొడ్డున భూములున్న గొప్ప సంపన్న కుటుంబం. అంతో ఇంతో వున్నంతలో దానధర్మాలు, అతిథి అభ్యాగతులను ఆదరించే అంతస్తు, ఔదార్యాలున్నవారు. నోములు, వ్రతాలు, సంతర్పణలు, సమారాధనలు యధోచి తంగా చేస్తూ ఆ గ్రామస్తులందరికి తలలో నాలుకలా మెలిగేవారు. ఆ కుటుంబంలో పెద్దమ్మాయి లక్ష్మీ నరసమ్మ, రెండో అమ్మాయి లక్ష్మాయమ్మలకు దగ్గర బంధువులలోనే సంబంధాలు చూసి పెళ్ళి చేశారు. మూడో అమ్మాయి పెళ్ళి కోసం అలోచిస్తున్న సమయంలో బాపట్ల పనిమీద వచ్చిన మా తాత మా నాన్నను చూచాడు. వెంటనే మా తాత మనస్సు ఆకర్షింపబడ్డది. కొంత సేపు మా నాన్నతో మాట్లాడదామనిపించి ఆయనతో సంభాషించడం జరిగింది. ఆ వినయ విధేయతలు, అంద చందాలు, తెలివితేటలు చూచి ముగ్ధుడై బీదవాడని, వారాల వాడని, తిరస్కరించక అతనికి తన పిల్లనిచ్చి పెళ్ళిచేద్దామని, తన బిడ్డ అతనికి భార్య అయితే మంచి భవిష్యత్తు వుంటుందనే గంపెడాశతో కొండూరివారి కోడల్ని చెయ్యాలని నిశ్చయించుకొ న్నాడు. బ్రహ్మాండం బాపయ్య గారిని మా నాన్న వ్యవహారం గురించి, వారి కుటుంబ సంస్కారం గాంచి విచారించాడట. ఆయన మా నాన్న గురించి చాలా నెమ్మది వాడని, తెలివిగల వాడని, బహుబుద్ధిమంతుడని, ఇన్నింటినీ మించిన అందమూ, సౌశీల్యమూ వున్నాయని వివరించి చెప్పాడు. వెంటనే స్కూలుకెళ్ళి ప్రోగ్రెస్ రిపోర్టు ఇతర అలవాట్లు తెలుసుకొన్నాడు. సంతృప్తి పడ్డాడు. భార్యను, కూతుర్ని అడగాల్సిన అవసరం ఆరోజుల్లో అసలే లేదు. కనుక తానే వెళ్ళి మా తాతయ్యతో మాట్లాడి వియ్యమందటానికి ఒడంబడికలు చేసుకొని ఇంటికి వెళ్ళాడు. మా నాయనమ్మ, తాతయ్యలు పరమానందభరితులయ్యారు. గోత్రాలు, జాతకాలు, అన్నీ చూపించి ముహూర్తపు తేదీని నిశ్చయించి తెలియజేశాడు. ఆ వెంటనే వారి వివాహం జరిగింది. మా తాతయ్య తను ముగ్గురు కూతుళ్ళకు తలా ఒక ఆరు ఎకరాల మాగాణి వ్రాసి ఇచ్చాడు. పెద్దమ్మాయి కొడుకు దౌహిత్రుడికి తమ కర్మకాండలు జరిపే నిమిత్తం మరో ఆరెకరాలు వ్రాసి ఇచ్చాడు. భార్యకు మరో ఆరెకరాలు వ్రాసి ఇచ్చి అందులో మూడు ఎకరాలు ఆమె ఇష్టానుసారం గాను, మిగిలినది అమ్మమ్మ తదనంతరం తన ముగ్గురి కుమార్తెలకు వచ్చేలా వ్రాశాడు. మిగిలిన వెండి, బంగారం, ఇంటి సామాన్లూ, ఇళ్ళు, ఇళ్ళ స్థలాలు అందరికీ సమంగా వ్రాసి ఇచ్చాడు అంతేకాక మరో వాగ్దానం చేశాడు. అదేమిటంటే మా నాన్న ఎంత చదువు చదివినా చదివిస్తానని, తానెప్పుడూ వెనుతీయనని పెళ్ళిరోజున పదిమంది సమక్షంలో చెప్పాడు.

## మా నాన్న డిగ్రీల చదువు

మామగారి వాగ్దానం విని మా నాన్న తల్లిదండ్రులు తమ కుమారుని కష్టాలు

పోయాయని పరమానందభరితులయ్యారు. పల్లె విడిచి పట్టణం రాబట్టే గదా నా కొడుకు అదృష్టం ఫలించింది అని మా నాయనమ్మ తాతయ్యను ఎత్తి పొడిచిందట కూడా. ఆ సంతోషమంతా తృటిలోనే మాయమయింది. మా నాన్న స్కూలు ఫైనలు కాగానే మా తాత (అమ్మ తండ్రి) చనిపోయాడు. చదువెలాగా అని హడలిపోయ్యారు మా నాన్న, వాళ్ళ నాన్న కూడా. మా అమ్మ అక్కల భర్తలు మా నాన్నను చదివించటానికి వ్యతిరేకించారు. మా అమ్మమ్మ ఏ అధికారం లేని అడమనిషిగా, అసమర్థురాలిగా మిగిలిపోయింది. చాటుగా బంగారం గొలుసు మాత్రం మా అమ్మకు ఇచ్చింది. ఇక మా నాన్నకు మళ్ళీ కష్టాలు మొదలయ్యాయి. బాపట్లలో ఇంటరూ, బి.ఏ. కాని, బి.ఎల్. కాని ఏమీ లేవు. మద్రాసుపోయి చదవాలి ఎలా? పెళ్ళి చదివింపులు, అమ్మమ్మ ఇచ్చిన గొలుసు, తన తండ్రి ఇచ్చిన 200 రూ॥ తీసుకొని నాన్న ఇంటర్ చదువుకు మద్రాసు వెళ్ళాడు. మొదటి సంవత్సరం 300 రూపాయలతో గడిచింది. రెండో సంవత్సరం తలాకాస్తా చుట్టాలు, స్నేహితులు సహాయం చేసి చదివించారు.

## మా తాత పరోపకార పారీణత

మా తాతకు మంచి ధనవంతులయిన స్నేహితులు వుండేవారు. అదీ కాక మా తాత మహా పరోపకారి. ఎవరికి ఏ సహాయం కావాలన్నా, డబ్బు తప్ప, ఇంటికెళ్ళి చేసేవాడు. ఎవరింట్లో జబ్బు చేసినా, ఆఖరికి ఎవరు చనిపోయినా వెళ్ళి శవాన్ని మోసి అంత్యక్రియలు చేయించే వాడు. మహా బలవంతుడు కావడంవల్ల ఒక్కడూ మనిషిని మోసి క్రింద పెట్టడంలాంటి శారీరక శ్రమ ఎంత అయినా చేసి అందరికీ తలలో నాలుకలా వుండే వాడు, పైగా వున్నంతలో త్యాగం కూడా వుండేది. ఎవరైనా పండితులు, ఘనాపాఠీలు అతిథులుగా వస్తే పిలిచి తనతోపాటు కడుపారా పెట్టి పంపేవాడు. మా నాయనమ్మ తను చేయలేనని తిట్టేది. అప్పుడు తానే స్వయంగా కొల్లాయి కట్టుకొని వండి పెట్టేవాడు. ఒకనాడు ఒక స్వాముల వారిని పిలిచి చీకట్లో దొడ్లో చెట్టు కనిపించక కర్వేపాకుకు బదులు వేపాకు వేసి కందిపచ్చడి రుబ్బి పెట్టాడు. ఆ అతిథి మాట్లాడకుండా ఆ చేదు పచ్చడి తినివెళ్ళాడు. మిగిలిన వాళ్ళు అది తిని తెల్లపోయారు. అలాంటి త్యాగి అయిన తాతయ్య పై గల విశ్వాసంతో కొందరు కొడుకు చదువుకు అప్పులిచ్చి వెళ్ళారట. అంటే అది తిరిగి రాదనే వాళ్ళ నమ్మకం. ఇక అమ్మ నగలమ్మి బి.ఏ. పూర్తి చేశాడు. బి.ఎల్.కు ఏ ఆర్థిక సహాయం లభించలేదు. బాపట్లలో ఒక పెద్ద ప్లీడరును అర్థిస్తే ఆయన 14 వందలు అప్పుగా ఇస్తే చదివి ఫస్టు క్లాసులో పాసయ్యాడు. ఈ లోగా ముగ్గురు పిల్లలు కలిగారు.

## మా నాన్న ప్రాక్టీసు

ఇక ప్లీడరు ప్రాక్టీసు ఎలా ప్రారంభించాలా అన్న ప్రశ్న ఒక్కటే నాన్నను

వేధించసాగింది. ఒకప్రక్క కుటుంబ భారం, మరో ప్రక్క ఆఫీస్ ఖర్చులు మా నాన్నను పీడించాయి. రెండు బల్లలు, రెండు కుర్చీల కోసం, ఇంటి అద్దె ఆరు రూపాయల కోసం ఒక పెద్దమనిషి ఇంటికెళ్ళి నోటు వ్రాసి రెండు వందలు తెచ్చాడు మా నాన్న. మా అమ్మ పొలం పంట అమ్మితే ఒక వంద చేతికి వచ్చింది. అలా అష్టకష్టాలు పడి ప్రాక్టీసు మొదలు పెట్టాడు. ప్రాక్టీసు కొద్ది కొద్దిగా పెరిగి అమోఘంగా విస్తరిల్లింది. దానికి కారణం మా నాన్న తెలివితేటలు, వాగ్ధాటి, నిరంతర శ్రమ, నిజాయితీల వల్ల జరిగాయని మా నాన్న స్నేహితుడు సింగరాజు నాగభూషణంగారు చెబుతూ వుండేవారు. "మీ నాన్న తెలివి ఎవ్వరికీ లేదమ్మా. బి.ఏ.లో ప్యారడైజ్ లాస్ట్ (మిల్టన్) వెయ్యి లైన్లు మొదటి నుండి చివరిదాకా అప్పచెప్పేవాడమ్మా! అంతేకాదు చివరిలైను నుండి మొదటిలైను వరకు వాడికి కంఠస్థమే నమ్మా" అని మా నాన్న జ్ఞాపకశక్తికి, తెలివితేటలకు ఉప్పొంగి పోతూవుండేవారాయన. మా నాన్న ఆఖరికి గడియారం కాని, పెన్నుగాని ఎరుగడు. సిరాలో ముంచేకలంతోనే ఎంతటి 'కంప్లెయింటైనా' వ్రాసేవాడు. ఆ రోజుల్లో ఎప్పుడయినా రెండు రూపాయలు పెట్టి 'పెన్ను' కొనుక్కుంటే ఏ కొడుకో తీసుకెళ్ళేవాడు. మనీపర్సు లేకుండా చేతి రుమాల్లో నోట్లు, చిల్లర మూట కట్టి జేబులో వేసుకునే వాడు. తలపాగ, తెల్లధోవతి, ఒక నల్ల కోటుతో వేలు సంపాదించిన ఘనుడు. ముందుగా ప్లీడరు ప్రాక్టీసుకు చేసిన అప్పులు తీర్చాడు. ఏ ఒక్కరూ వడ్డీ తీసుకోలేదు. ఇల్లు కట్టాడు. మా అమ్మకు మరలా పోయిన నగలన్నీ చేయించాడు. ముప్ఫై ఎకరాల మాగాణి కొన్నాడు. పదముగ్గురు పిల్లల్ని పోషించాడు. పెద్ద పెద్ద చదువులు డాక్టర్లు, ఇంజనీర్లు చెప్పించాడు. పెళ్ళిళ్ళు చేశాడు. అంతేకాదు తన తమ్ముడు చదువుకు రెండు వేలు ఖర్చు పెట్టి సూపర్ వైజర్ని చేశాడు. చెల్లికి పెళ్ళిచేశాడు. మంచి పేరు ప్రఖ్యాతులే కాక పేరున్న పదిమంది వకీళ్ళలో ఒకడుగా వుండేవాడు. "ఉమ్మడి కుటుంబ బాధ్యత, కుటుంబ బంధాలు తీరాయమ్మా. ఇకముందు సంపాదనలో 10 శాతం తీసి ధర్మకార్యా లకు వినియోగిస్తానమ్మా" అన్నాడు యాభై ఏళ్ళు నిండాక ఒకనాడు నాతో. కాని తల పెట్టిన ధర్మకార్యాలు చెయ్యకుండా, కోర్కెలు తీరకుండానే తన 52వ ఏట అకాల మరణం పాలయ్యాడు. నాన్న పొయ్యేముందు మా అన్నయ్య డాక్టర్ గా ప్రాక్టీసు చేస్తూ హఠాత్తుగా చనిపోయాడు. అప్పటికి ఏడుగురు సంతానం మిగిలాము. అసలు మా నాన్నకు నేను 4వ పిల్లను, కాని పై ముగ్గురు పోవటాన నేను మొదటిదాన్ని అయ్యాను. నాకు కృష్ణమూర్తి, సాంబశివరావు, నరశింహారావు, సీతారామశాస్త్రి, సూర్యనారాయణ, అనసూయ అనే అయిదుగురు తమ్ములు, చెల్లెలూ వున్నారు.

## నా ఎలిమెంటరీ ఎడ్యుకేషన్

ఆ రోజుల్లో ఆడపిల్లలకు అసలు చదువే లేదు. అయినా నన్ను మాత్రం 5 ఏళు ్ళ నిండాక అన్నవరపువారి బాలికా పాఠశాలలో వేశాడు మా నాన్న. అప్పుడు "డబుల్

ప్రమోషన్లు" అని వుండేవి. పిల్లల్ని కాస్త ఉత్సాహపరచటానికి బొమ్మలు, బంతులు, రంగుల పెన్సిళ్ళు ప్రయిజులు ఇచ్చి పోటీలు పెట్టి చదివించేవారు. ఆ సందర్భంగా నేను ఒకటవ క్లాసు ఫస్టు వచ్చానని రెండు చదవకుండానే మూడవ క్లాసులో వేశారు. పెద్ద ప్లీడరు కూతురని అలా చేశారని నన్ను చూసి మూతివిరిచే వాళ్ళు తోటి విద్యార్థినులు. మా హెడ్ మాష్టారిని "తాతా" అని పిలిచే వాళ్ళం నేనంటే చాలా ప్రేమగా, వాత్సల్యంగా చూచేవాడు. పైగా మా నాన్నతో ఆయనకు కోర్టు వ్యవహారాలు కూడా వుండేవి, అప్పుడు ప్రయివేట్లు లేవు. ఇంట్లో ఎవ్వరూ చదువు నేర్పించే వారు లేరు. కాపీలు రాయడం, కాంపోజిషన్లు వ్రాయించేవారు టీచర్లు. లెక్కలు, ఎక్కాలు అన్నీ ఒప్పజెప్పేవాళ్ళం. పద్యాలన్నీ కంఠతా రావాల్సిందే. నేనూ, శిఖరం, అన్నపూర్ణ, మందాకిని, తాడేపల్లి రాజ్యం జట్టుగా వుండేవాళ్ళం. కొద్ది చదువైనా దీక్షా, ఆసక్తి నాలో పెనవేసుకొని వుండేవి. నాన్న సహకారం కూడా వుండేది. అలా చదువు పై ఆసక్తి పట్టుదల వుండబట్టే తర్వాత మళ్ళీ వృద్ధి చేసుకోగలిగాను. పది ఏళ్ళు నిండేనాటికి 5వ క్లాసువరకు చదివాను. ఇక పెళ్ళి రద్దీ నా పైన స్వైర విహారం చేసింది.

## నా పెళ్ళి సంబంధాలు

అమ్మ, అమ్మమ్మల పోరుతో నాన్న నా పెళ్ళి సంబంధాల వేట ప్రారంభించాడు. 'లా' చదివిన వాడు కనుక అతి బాల్య వివాహానికి ఇష్టపడలేదు. పెద్దవాళ్ళు రోజూ గొడవ చేస్తూనే వుండేవారు. "అది పెద్దమనిషి అయ్యేలోగా దాని పెళ్ళి చేయవా?" అంటూ గగ్గోలు పెట్టేవాళ్ళు. కాకినాడలో మా నాన్న స్నేహితుడు ఒక ప్లీడరు వుండేవారు. ఆయనకు జాతకాల పిచ్చి. ఆ జ్యోతిష్యునికి నాన్న నా జాతకం చూపించాడు. నేను ఒక మహా గొప్ప వ్యక్తినవుతానని, నా భవిష్యత్తు గురించి తన జీవితాంతం తాను తెలుసుకుంటూనే వుంటానని నన్ను గురించి మహాద్భుతంగా వర్ణించాడు ఆ భవిష్యద్దర్శకుడు. అసలే మా నాన్నకు నేనంటే అమిత ప్రేమ. ఇక స్నేహితుడి సంభాషణతో ఉబ్బి తబ్బిబయిపోయాడు. ఇంక అమ్మాయికి గొప్ప సంబంధం చూచి పెళ్ళిచేయాలని సంబరపడిపోతూ వుండేవాడు. అంటే వారికి పేరు ప్రఖ్యాతులు, ఆస్తిపాస్తులు వుండి, సంస్కారులై అబ్బాయి చాలా బుద్ధిమంతుడై వుండాలి. విద్యా, వినయం, వివేకం కలిగిన కుర్రాడు కావాలనే భావంతో నా కోసం రెండేళ్ళు శలవురోజులన్నీ అనేక వూళ్ళు తెగతిరిగేవాడు. ఆ రోజుల్లో 10 రూ॥ లు పెట్టి సీజన్ టికెట్ కొంటే 45 రోజులు దక్షిణాది అంతా ఎక్కడికైనా వెళ్ళి రావచ్చు. వెళ్ళేలోగా అడ్రసులు కనుక్కొని వారికి ఉత్తరాలు వ్రాసి చూసి వస్తూ వుండేవాడు. చివరికి దరిదాపు కాకినాడలో ఒక సంబంధం కుదిరినట్లు అయింది. అతను సంపన్నుల కుర్రాడు ఐ.సి.ఎస్. చదవబోతున్నాడని తెలిసి చూసి అడిగివచ్చాడు. వాళ్ళు నా ఫోటో అడిగారట. మా ఇద్దరికి వయస్సు చాలా తేడాగా వుందని తెలిసి నాకొక చీరకట్టి, నగానట్రా పెట్టి అలంకరించి ఫోటో తీసి

వారికి పంపాడు. వారు సరేనంటూ మూడు వేల కట్నం మాత్రం అడిగారు. నాన్న సరే అన్నాడు. అతనూ, నేను చూచుకోకుండానే నిశ్చయ తాంబూలం, లగ్నం అన్నీ అయిపోయే దశలో ఒక సంఘటన జరిగింది. మా ఇంటి ప్రక్కనే మేజిస్ట్రేట్ గా పనిచేస్తున్న మల్లాది సోమసుందరంగారు వుండేవారు. మంచి పేరు ప్రతిష్ఠలున్న వారు. ఆయనకు ఒక్కడే కుమారుడు, పేరు రామ్మూర్తి. 16 ఏళ్ళు నిండాయి. ఇంటర్ అయింది. మల్లాది వారు అగ్రహారీకులు, మహానిష్ఠాగరిష్టులు. అంతకు ముందు ఆరు నెలలు క్రిందట వెళ్ళి మా నాన్న పిల్లనిస్తానని ఒకసారి అడిగివచ్చాడు. అప్పుడు వాళ్ళు మా అబ్బాయికి 16 ఏళ్ళే ఇప్పుడే చేయమని కబురు పెట్టారు. చివరికి కాకినాడ వారి సంబంధానికి తాంబూలాలు పుచ్చుకునే సమయంలో మల్లాదివారు పునరాలోచించుకొని వారబ్బాయికి పెళ్ళి చెయ్యాలనే ఉద్దేశ్యంతో వున్నారని నాన్నకు తెలిసింది. పిల్ల దగ్గరలో వుంటుందని, గొప్ప సంబంధం కనుక సుఖపడుతుందని మళ్ళీ అడగటానికి వెళ్ళాడు మా నాన్న. మా అత్తగారికి బహు సంతానవతి అయిన కోడలు కావాలనే వాంఛ ప్రబలంగా వుండేది. ఆమెకు ఒక్కగా నొక్క కొడుకు అవటంవల్ల కొండూరి వారి పిల్ల అయితే ఇంటినిండా పళ్ళగంపలా పిల్లల్ని కంటుంది అనే ఆశతో, అంటే మా అమ్మ వైపు, నాన్న వైపూ అందరూ బహు సంతానవంతులు కనుక, ఎలాగైనా ఈ సంబంధం చేసుకోవాలని ఆమెకు గట్టి కోరిక కలిగింది. తన కొడుకు పెళ్ళి ముద్దూ ముచ్చటా చూచుకోవాలని ఆమె కోరిక. నా పెళ్ళికి తొందరేమిటని, చదువు పూర్తి కావాలని పెద్ద పేచీ పెట్టిన కొడుకును నేను ఎక్కువకాలం బ్రతకనని, ఆ తర్వాత నీకు అండదండలుండవని, కొండూరి వారి సంబంధం అయితే నిన్ను కని పెట్టుకొని వుంటారని పోరు పెట్టి, ఏడ్చి, మొత్తుకొని నాతో పెళ్ళికి కొడుకుని ఒప్పించింది. ఇక వెళ్ళి పిల్లను చూసి వద్దామని గగ్గోలు పెట్టిందట. సరే వచ్చి పిల్లను చూస్తామని మామగారు కబురు పెట్టారు. తిధి, వారం, వర్జ్యం అన్నీ చూసుకొని ఆరోజు పదిమందిదాకా ఆడ, మగ కలిసి వచ్చారు నన్ను చూడటానికి మాఘ శుద్ధ విధియనాడు. ఇక షరా మామూలే. అదే పట్టు పరికిణి, అదే నా హార్మణి పెట్టె, అదే పాట, అదే పాఠం. పెళ్ళివారు చూడటానికి వస్తారంటే పైకి సిగ్గు నటిస్తున్నా నా లోపల వల్లమాలిన ఆనందం, సంతోషం వెల్లివిరిసేది. ''లంబోదర లకుమికరా - అంబాసుత అమర వినుత" అంటూ గణపతి ప్రార్థన పాడాను. ఇంగ్లీషు పాఠం ఒక పేరా చదివాను. సీతారామ కళ్యాణం గురించి. ఆ వక్క పాఠమే కంఠత వచ్చని తెలియని పెళ్ళివారు "అబ్బా! ఏమి సంగీతం, ఏమి ఇంగ్లీషు' అని మురిసిపోయారు. ఫలహారాలు ముగించుగొని, జాతకాలు పుచ్చుకొని వెళ్ళారు. మామగారు నా జాతకం సిద్ధాంతికి చూపితే చాలా దివ్యంగా వుందని, అష్ట ఐశ్వర్యాలతో పాటు వంశాభివృద్ధి చేస్తుందని విన్న మా అత్తమామలు పరమానందభరితులయి, ఆ వెంటనే వచ్చి తాంబూలాలు పుచ్చుకుంటామని కబురు పెట్టారు. అలాగే వచ్చి వైశాఖ శుద్ధ, దశమి గురువారం (తేది 15-5-1935) పెళ్ళి లగ్నం పెట్టారు. ఇంతవరకు అమ్మాయి, అబ్బాయిల చూపులుగాని, మాటలుకాని, ఒప్పందాలుగాని ఏమీ జరగలేదు. అంతా పెద్దల సమక్షంలో,

వారి ఆలోచనలతో జరిగిపోయింది. అది నాటి ఆచారం, బాల్య వివాహాల లక్షణం. అంతా అయ్యాక మా నాన్న వచ్చి 'అమ్మా! ఈ పెళ్ళి నీకు ఇష్టమేనా' అన్నాడు. ఎంతయినా లాయరు కదా! నేను సంబరపడిపోయాను, సిగ్గుతో తలవంచుకున్నాను. నిశ్చయం నాడే కట్నం, లాంఛనాలు, అయిదు రోజుల పెళ్ళి అందరికి అప్పగింత బట్టలు ఇస్తానని మా నాన్న చెప్పాడు. గొప్ప సంబంధం కుదిరిందన్న సంబరంతో అన్ని విషయాలు మాట్లాడుకున్నారు. కాని నాకు నగలు ఏమి పెడతారో అని అడగటం ఆనాటి సాంప్రదాయం కాదు. పెట్టినా, లేకున్నా మాట్లాడరాదు. కాని మా మామగారు ఏ బేరసారాలు చెయ్య లేదు. మా నాన్నే అయిదు ఎకరాల ముప్పయి తొమ్మిది సెంట్ల మాగాణి ఇస్తానని (1933లో 3 వేలకు మా నాన్న కొన్నాడు. ఆ పొలం) చెప్పాడు. అగ్రహారీకులు, ఉన్నతోద్యోగులతో వియ్యమందటం మాటలా! అదీగాక ఒక్కడే బిడ్డ. ఎంచుకునేవారు, పంచుకునేవారు లేరు. పైగా అమ్మాయిని పువ్వుల్లో పెట్టి అతి ప్రేమతో చూస్తారు. ఆ జిల్లాలోనే వుంటుంది. అల్లుడు కలెక్టరవుతాడు. ఇక ఆమె భవిష్యత్తు మూడు పువ్వులూ, ఆరు కాయలూ అని ఉప్పొంగి పోయాడు మా నాన్న. నా పెళ్ళి నాటికి మా అమ్మానాన్నలకు నే ఒక్కతినే ఆడపిల్లను. మంచి సంబంధం కదా అనే మహా ఆనందంతో పెద్ద కట్నాన్ని ఇచ్చి ఘనంగా పెళ్ళి చేయాలనుకున్నాడు. మా అత్తగారు మాత్రం తన మేనకోడలు, ఆడపడచు, తోడి కోడలు, తను ఈ నలుగురికి మాత్రం ఘనంగా వెండి బొట్టు పెట్టెలు, పట్టు చీరెలతో లాంఛనాలడిగింది. సరే అన్నారు. ఆ కట్నం తీసుకున్నందుకు నా భర్త ఆ తరువాత చాలా బాధపడి 1945లో నా ద్వారా తిరిగి ఇస్తానని కబురు పెట్టారు. నాన్న మాత్రం "అది మర్యాద కాదు అంతగా అయితే నా పిల్లలెవరికయినా అవసరం వస్తే ఇస్తే ఇవ్వండి, లేదా చదువు చెప్పించండి" అని అన్నాడు. మా అమ్మ మాత్రం చాలా కాలం తలకుమించిన ఖర్చుఅయింది, పిల్లలు కల వాళ్ళం అని బాధపడేది. అయినా గొప్ప సంబంధం దొరికింది కదా అని తృప్తిపడేది.

అప్పుడు రాష్ట్రంలో (చైల్డు మ్యారేజి రిస్ట్రైంట్ యాక్టు) బాల్య వివాహ నిరోధ శాసనం అమల్లో వుంది. పెళ్ళి ఎక్కడ చెయ్యాలి అని ఇరువర్గాల వారూ ఆలోచించారు. మా నాన్న చట్టం తెలిసిన వాడు, మామగారు రెవెన్యూ ఆఫీసరు. బాల్య వివాహం జరిగితే ఇద్దరూ శిక్షార్హులవుతారు. అందుకని ఆ రోజుల్లో నైజాం స్వదేశ సంస్థానాల్లో వుంది కనుక యాక్టు దానికి వర్తించదు. నైజాంలో భాగమైన ఎఱ్రుపాలెంలో పెళ్ళి జరపటానికి నిశ్చయించారు.

## ఆనాటి పెళ్ళి ఖర్చులు – ఆడంబరాలు

ఆ రోజుల్లో పెళ్ళిళ్ళు అతి వైభవంగా పోటీలుపడి చేసేవారు. ముఖ్యంగా గ్రామాల్లో పెళ్ళి జరిగితే ఆ వారం అంతా అందరిళ్ళలో పొయ్యి తవ్వేసుకోమని చెప్పేవారు. అంటే అక్కడి వాళ్ళందరికి రెండు పూటలా భోజనం, టిఫిన్లు అన్నీ పెళ్ళి పందిట్లోనే జరిగేవి.

పెట్టలేని వారిని పీనాసులు, లోభులు అని మూతులు తిప్పుకోవటం, గుసగుస లాడటం సర్వ సాధారణం. అందువల్ల ప్రతి పిల్ల పెళ్ళికి రెండు ఎకరాలు అమ్మటం, అప్పులు చేయటం, వడ్డీల బాధతో మరో ఎకరం అమ్మటం ఇట్లా చివరికి చేతికి చిప్పలు రావటం మధ్యతరగతిలో సర్వసామాన్యం. ఆ చరిత్ర ఇప్పటికి నడుస్తున్నదనుకోండి. అంతేకాదు పోటీలుపడి బ్రాహ్మణులకు, వేద పండితులకు, ఘనాపాఠీలకు సంభావనలు ఇచ్చేవారు. వరుడి వైపు వారు అగ్రహారీకులు అయితే మరీ ఎక్కువ దక్షిణలు ఇవ్వాలన్న మాట. వేద పండితులకు, ఘనాపాఠీలకు పట్టు శాలువతో పాటు మనిషికి ఒక తులం బంగారందాకా ముట్టేది. యజ్ఞాలు చేసిన సోమయాజులకు, చైనులకు, అవధాన్లకు, పురోహితులకు కన్యాదాతలు కూడా అటూ ఇటూ అత్యధిక స్థాయిలో, హెూదాగా శక్తికి మించి ముట్ట చెప్పేవారు. ఆ 'లెవల్లో' జరిగిందే నా పెళ్ళి కూడా.

## నా పెళ్ళి సంబరాలు

ఎర్రుపాలెంకు రెండు రోజులు ముందుగా ఉభయ వర్గాల పెళ్ళివారు, బంధువులతో, స్నేహితులతో వెళ్ళారు. పిల్లా పాపలతో, తోరణాలతో, ముగ్గులతో ఆ పందిళ్ళు శోభాయమానంగా వెలిగిపోతూ వుండేవి. కరెంటు లేని కారణంగా పెట్రోమాక్సు లైట్లు పెట్టేవారు. ఇక పెండ్లి విందుకయితే రెండు పూట్లా తీపి, కారం, పిండి వంటలు, రెండేసి కూరలు, అప్పడాలు అరటి ఆకు నిండేలా వుండేవి వంటకాలు. వైశ్వదేవపరులకు, సోమయాజులకు, దేవతార్చనాపరులకు వేరే ఎవ్వరు చూడని ప్రదేశంలో జుట్లు, బొట్లు గాజులులేని విధవరాండ్ర ఆధ్వర్యంలో లేక పెద్ద ముత్తయిదువుల చేత గాని, తడిగుడ్డలు ధరించిన వైదిక వంటవాని చేతగాని షడ్రసోపేతంగా వండించి పెట్టేవాళ్ళు. వాళ్ళు అంతా పరమ శ్రోత్రియులన్న మాట. ఇక పెళ్ళి వారికి వేరే బంతి పెట్టే వారు. వారికి అడుగడుగునా పొంచి వుండి సకల మర్యాదలు జరిపేవారు. అంటే విస్తరి క్రింద ముగ్గులు పెట్టటం, ప్రక్కన వెలిగించిన అగరొత్తులు, వెండి పళ్ళెం నిండా పంచభక్ష్య పరమాన్నాలు, అరిసెలు, లడ్లు, జిలేబీలు, మామిడిపండ్లు, పనసతొనలు, ఊరగాయలు, చుట్టూ నేతి గిన్నెలు, తోడేసిన మీగడ పెరుగు, త్రాగినంత క్షీరాన్నం, నమిలినన్ని కిళ్ళీలు ఒకటేమిటి ఇళ్ళకు వెళ్ళాక వారం రోజుల దాకా తిండి తినలేని అజీర్తి వ్యాధులు చుట్టుముట్టేవి. ఐదురోజుల పెళ్ళి, ముందూ వెనకా మరి రెండు రోజులు మొత్తం వారం రోజులు గంపెడు పిల్లలు, ముసలీ ముతకలతో దిగి తిష్టవేసేవారు.

ఇరువైపుల వారు ఐదువందల దాకా పెళ్ళికి హాజరయినారు. ఒక్కడే కొడుకు ముందూ, వెనక ఎవ్వరూ లేరంటూ మా అత్తగారు బంధుమిత్రులకు అందరికీ ఛార్జీలు భరించి తెచ్చారు. అందరికి కన్యాదాతలుగా మేము ఇచ్చిన అప్పగింతల బట్టలు, కొడుకు పెళ్ళికి వచ్చినందుకు మా అత్తగారు ఇచ్చిన బట్టలు వెరసి పెళ్ళికి వచ్చిన అందరికి రెండు జతలు ముట్టాయి. ఇటూ కూడా ఇదే ప్రథమ కార్యం కనుక ఘనమైన విందులతో,

మహా వైభవంగా పెళ్ళి జరిగింది. అయిదు పట్టుచీరెలు, ముప్పయి తులాల బంగారం, వెయ్యి నూట పదహార్లు నాకు చదివించారు మా అత్తవారు. పసుపు కుంకుమల క్రింద అమ్మా వాళ్ళు ముప్పయి తులాల బంగారం, వెయ్యి తులాల వెండి ఇచ్చి కన్యాదానం చేశారు. మామగారు ఇచ్చిన డబ్బుతో మా నాన్న మూడు ఎకరాల మాగాణి కొని వెంటనే నా పేర రిజిష్టర్ చేయించాడు. మా మామగారు 'అడవాళ్ళ పేర ఆస్తి పెట్టారా? అది కుటుంబానికి అగౌరవము' అన్నారని విన్నాము. మళ్ళీ 16 రోజుల పండుగకు పట్టుబట్టలు పెట్టి చిన్న వేడుక చేశారు. మళ్ళీ దీనికి కూడా బంధువులంతా వచ్చారు. ఆరోజే ఇంటర్ ఫలితాలు వచ్చాయి. నా భర్త ఫస్టు క్లాసులో పాసయినట్లు తెలిసింది. అదంతా నా అదృష్టమని, బిడ్డ వచ్చిన వేళ గొడ్డువచ్చిన వేళ అని నా భవిష్యత్తుకు పొంగిపోయారు.

## నా పెళ్ళినాటి ధరలు

వాటిని గురించి చెబితే నిలువు గుడ్లు పడతాయి. తులం బంగారం 18 రూ॥ లు. రాణి ముద్రతో కల్తీలేనివి సవర బిళ్ళలు పదమూడు రూపాయలు మాత్రమే. వెండి తులం ఏడు అణాలు. పట్టు చీరంతా వెండి జరీ చెట్లతో 40 రూ॥ లు. ఇక పెట్టుబడి చీరలు రెండు రూపాయలు. రవిక గుడ్డ గజం రెండు అణాలు. కొబ్బరినూనె సవాశేరు అణాన్నర. డాల్డాలు, నూనెలు ఎరుగని రోజులవి. నేతి డబ్బా (16 కిలోలు పట్టే డబ్బా) 8 రూ॥ లు, అంటే రెండు శేర్ల నెయ్యి రూపాయి. అలాంటి రోజుల్లోనే పొలం కిమ్మత్తేకాక పదివేలయింది నా పెళ్ళికి. అదే ఈనాడయితే రెండు లక్షలు పైగా వుంటుంది.

## నా రజస్వలా భాగవతం

పెళ్ళయిన తరువాత రెండు నెలలకే నేను రజస్వలనయ్యాను. నా సమర్త చరిత్ర వింటే 'మన వాళ్ళెంత వెర్రివాళ్ళోయ్' అన్న సూక్తి గుర్తుకొస్తుంది. మూఢ విశ్వాసాలవల్ల అజ్ఞానంవల్ల ఎంత డబ్బు, ఎంత శ్రమ, 'టైము' వృథా అవుతున్నదో! మనశ్శాంతి వమ్మయిపోతోందో ఊహాతీతం. అది పెళ్ళయిన తరువాత జరిగినందుకు అమ్మమ్మా, నాయనమ్మా, మిగిలిన మా వాళ్ళంతా సంబరపడ్డారు. ఈ రెండు నెలలూ పెళ్లికాకపోతే పరువుపొయ్యేది. వంశ ప్రతిష్ఠ మంటకలిసేది, ఇటేడు తరాలు, అటేడు తరాలు నరకంలో పడి నలిగిపోయ్యేవాళ్ళు, వర్ణ భ్రష్టత్వమయ్యేది, పుట్టగతులు లేకుండా పొయ్యేవి. ఇంకా నయం అంటూ పూపిరి పీల్చుకున్నారు. మళ్ళీ మా వాళ్ళకు ఖర్చూ, తతంగం. కానీ ఏం చేస్తారు! తప్పదుకదా! గడ్డివేసి, దానిమీద తెల్ల గుడ్డను నలుగురు ముత్తయిదువులు నాలుగువైపులా పట్టుకొని పరచి, (దీనిని దరివెం అంటారు) నాలుగు మూలలా ఎండు కొబ్బరి చిప్పలు పెట్టి నన్ను తూర్పు ముఖంగా కూర్చోబెట్టారు. మా నాన్నను కోర్టు

నుండి హడావిడిగా పిలిపించారు. అమ్మలక్కలంతా వచ్చి చిమ్మిరి దంచి చిన్న వేడుకచేసి వెళ్ళిపోయారు. ఆ సాయంత్రం మా అమ్మ బనారసు చీరకట్టి, నగలు పెట్టి, సమర్త మేళం పిలిపించి ఊరంతా పిలిచివచ్చింది. "పదకొండు రోజులకు ఒకసారే చెప్పరాదటే" అన్నది మా దొడ్డమ్మ "అయ్యో అదేమి సలహాయే! అది అమర్యాద కాదూ! రోజూ వెళ్ళి పేరంటం పిలవాలి. అది అనాదిగా వస్తున్న ఆచారం" అన్నది అమ్మమ్మ. నానబోసిన శనగలు, చిమ్మిరి, అరటి పళ్ళు, ఆకువక్కలు వచ్చిన వారందరికి పంచేవారు. నాలుగోరోజు స్నానం చేయించి అట్లబంతి దాదాపు వంద మందిని పిలిచి పెట్టాలి. ఇక 11వ రోజు తెలిసిన ఆడవారందరిని పిలిచి తాహతునుబట్టి రవికెల గుడ్డలు, భోజనాలు, పేరంటం చేసేవారు. అత్తవారివైపు వారికి బట్టలూ వగైరా మళ్ళీ రెండువేల ఖర్చు.

## నక్షత్ర విశిష్టత

ఇక నా సమర్త నక్షత్రం మా అత్తగారికి అశాభంగం అయి మంచానపడింది. భరణి నక్షత్రం మొదటి పాదం అది. మొదటి పాదం అయితే భర్త, రెండోది అయితే మామ, మూడవదయితే అత్తకు గండమట. "భరణీ నక్షత్రమయితే భర్త ధరణి మీద వుండడట". ఈ వాక్యం చదవటానికి పసందుగా వుంది. కాని ఆమెకు ఒక్కగానొక్క కొడుకు. నా జాతకం చూచి దివ్యంగా వుందని, వంశాభివృద్ధి అవుతుందని, ధనధాన్యలతో పాటు ఆరోగ్య ఐశ్వర్యాభివృద్ధి బాగా జరుగుతుందని ఊహించుకుంటున్న ఆమెకు ఇదొక పిడుగుపాటి దెబ్బ అయింది. పండితులను పిలిపించింది. గుండపు శాంతి, దశదానాలు, సంతర్పణా సంభావనలు ఎంత బాగా జరిపితే అంత ఉపశాంతి జరుగుతుందని చెప్పారు పురోహితులు. గుండపు శాంతి హెూమానికి డబ్బానెయ్యి, 200 కొబ్బరికాయలు, వేద పండితులకు బట్టలు, అన్నశాంతి ఒకటేమిటి మళ్ళీ పెళ్ళంత ఖర్చు ప్రతిపాదించారు ధర్మశాస్త్రజ్ఞులు. పుత్రగండాన్ని తప్పించాలని పరితపించి పోయిన మా అత్తగారు సర్వాన్ని సిద్ధం చేసింది. ఆమె నిద్రాహారాలకు దూరమై దుఃఖసముద్రంలో మునిగిపోయింది. మా అత్తగారి దుఃఖోపశాంతికి నాలుగు వేలు ఖర్చు అయింది మా మామ గారికి. ఆమె పుత్రుణ్ణి మింగటానికి పుట్టానేమో – భీష్ముడి కొరకు శిఖండి పుట్టినట్లు – అన్న వ్యాకులం ఆమెను దహించి వేస్తూనే వుండేది. పెళ్ళినాటికి నా మీద వున్న మమతా అనురాగాలు సన్నగిల్లాయి.

వెంటనే మెడ్రాసులో చదువుతున్న కొడుకుకు టెలిగ్రాం ఇచ్చి పిలిపించింది. 11వ రోజు పెద్ద బంతికి నాకు చీరె, గొలుసు ఇచ్చిందే కాని ఏడుస్తూనే వుంది. నా ముఖాన్ని పరిశీలించి చూడలేకపోయింది. కంటినీరు కారుతూనే వుంది. మామగారు అప్పుడు పొన్నూరులో డిప్యూటీ తహసిల్ దార్ గా వున్నారు. అక్కడికి మా ఇద్దరినీ పిలిచి కూర్చోబెట్టి పళ్ళెం నిండా నూనెపోసి అందులో నా ముఖం చూపించారు. శాంతి

హోమం, సంతర్పణ, అన్నదానం చేశారు. ఇంకా నయం నన్ను మాత్రం విడిచి పెట్టమనలేదు. ఒక్క తిట్టుకూడా తిట్టలేదు. అంతా పూర్వజన్మ సుకృతం అనుకున్నది. నా భర్త ఇదంతా ఆనాడు తెలిసి చేసినట్లా, తెలియక పెద్దల కోసం చేసినట్లా అన్నది నాకిప్పటికి అనుమానమే. ఆయనకు నా పెళ్ళి నాటికే జంధ్యం లేదు. కాంగ్రెసువాది. బహుశ తల్లిదండ్రుల ఆత్మశాంతికి, సంతోషానికి చేసి వుండవచ్చు. ఈ విషయాలన్నీ తర్వాత చర్చిద్దాం. 'ఆ నక్షత్రానికి అంత శక్తి, బలం వుంటే ఈ శాంతి హోమం భర్త గండాన్ని తప్పిస్తుందా' అన్న ప్రశ్నకు నాటికి, నేటికి జవాబు దొరకదు. ఆ నక్షత్ర శాస్త్రము, జ్యోతిష్యాలు అసలు నిజమయితే 56 ఏళ్ళు కాపురం చేయగలమా? ఇలాంటి అనుభవాలు లెక్కకు మిక్కుటంగా వున్నా తాతల నాటి అశాస్త్రీయం అహేతుక విశ్వాసాలు మన మస్తిష్కాలను విడిచిపోక ఈ ఇరవై శతాబ్దంలో కూడా మనను ఇంకా వెంటాడుతూనే వున్నాయి. అందువల్లే మనమింకా ఆధునికతనూ, శాస్త్రీయ దృక్పథాన్ని అలవరుచుకోలేక మన కాలాన్ని, శ్రమను, ధనాన్ని ఎంతగా వృధా చేసుకుంటున్నామో తెలిస్తే మన నష్టం తీరేది కాదు. లెక్కకు దొరికేది కాదు, భరణీ నక్షత్ర కథ ఇలా ముగిసేది కాదు.

ఆ వెంటనే శ్రావణ పట్టీ నాకు, ఆషాడపట్టీ నా భర్తకు ఇచ్చిపుచ్చుకోవటాలు గొప్పగా, హోదాకు తగిన రీతిలో జరిగిపోయాయి. ఏడాదిలోపు రాకపోకల్లాంటి వేడుకలన్నీ ఘనంగా జరిపారు. వారింటా, మా యింటా మొదటి వేడుక కనుక ఇరు పక్షాలవారు ప్రతి వేడుకకు అధికంగా ఖర్చుచేశారు.

## నా విద్య పునఃప్రారంభం

ఇప్పుడొక పెద్ద సమస్య తయారయింది. నా సమర్త నాటికి నాకు 11 ఏళ్ళు. నా భర్త రామ్మూర్తిగారికి 17 ఏళ్ళు మాత్రమే. చదువు పూర్తి కాలేదు. కాపురానికి తేవటమా, వద్దా అన్నది మా అత్తమామలకు చర్చనీయాంశం అయినది. కాపురం పెట్టి చదివిస్తే "వివాహో విద్య నాశాయ" అంటూ భయపడ్డారు. మా నాన్న కూడా ఇంత చిన్నతనంలో ఎలా పంపేది అని కాస్త ఆలోచించి కొన్నాళ్ళు వుంచమని వియ్యాల వారిని అభ్యర్థించాడు. రెండు పక్షాల వారూ ఒకే నిర్ణయానికి వచ్చారు. ఆ రోజుల్లో రజస్వలయ్యాక పుట్టింట వుంచటం సంప్రదాయ విరుద్ధమేకాదు, లోక సమ్మతం కూడా కాదు. తలో మాట అనే వారు. అయినా మా వాళ్ళు (ఇరు పక్షాల వారు) కాస్త ముందడుగు వేశారని చెప్పక తప్పదు. ఈలోగా అమ్మాయిని స్కూల్ కు పంపుతాను మీకు అభ్యంతరమా అని మా నాన్న మా అత్తగారి అనుమతిని కోరాడు. మెట్టింటి వారు మిన్నకున్నారు. పమిటలు వేసి పంపండి అని ఆజ్ఞాపించారు మా అమ్మమ్మ, వాయనమ్మలు.

వేసవి శలవుల అనంతరం అయిదో క్లాసు పాసయినట్లు తెలిసి, స్కూల్లో చేరి ఆరులోకి అడుగు పెట్టాను. అంతా నన్ను విడ్డూరంగా చూడటం, వింతగా చెప్పుకోవటం

మొదలు పెట్టారు. ''వర్ణ భ్రష్టత్వం'' ''సంప్రదాయ ధ్వంసం'' 'వినాశకాలే విపరీత బుద్ధి', అందువల్లే కరువు కాటకాలు పెరిగిపోతున్నాయి. అగ్రహారీకుల కోడలట. ఈ కిరస్తానీ చదువులేమిటో అంటూ ముక్కు మీద వేలు వేసుకున్నారు అమ్మలక్కలు. ఆడవారు కిటికిలోంచి చూస్తుంటే మగవారు పళ్ళు పట పటా కొరికే వాళ్ళు. అలా రెండేళ్ళు గడిచాయి. ఏడు క్లాసులు పాసయ్యాను.

ఈలోగా నా భర్తను బి.ఏ. ఆనర్సు కొరకై మెద్రాసు పంపారు మా మామగారు. ఆయనగారు ఇంగ్లీషులో తప్పి డిగ్రీ లేకుండా ఇల్లు చేరారు. ఆనర్సు కాగానే లండన్ పంపి కలెక్టర్ ను చెయ్యాలని మామగారు, మా నాన్న తపన పడిపోయారు. ఆ తర్వాత గుండెలు చిక్కబట్టుకొని ''అంత తెలివితేటలు ఏమయ్యాయో! అంతా ఆడదాని అదృష్టం' అని లోలోపల తర్కించుకున్నారు. అందరూ ఆశించింది ఒకటైతే ఫలితం మరొకటి అయింది. మా అత్తగారు మాత్రం కిమిన్నాస్తి, ఏమీ అనలేదు. పైగా పోనీలేండి ఈసారి ఆ భాగం పూర్తి చేసుకుంటాడంటూ సర్దుకోమని హెచ్చరించింది. నా బిడ్డే నాకు సర్వస్వం వాడు కలెక్టరయినా, కాకపోయినా బ్రతకలేని పరిస్థితి లేదు అంటూ ఎవరయినా ఏమైనా అంటారేమోనని ముందుగానే 'వాణ్ణి నొప్పించకండి' అనేది.

పుత్ర ప్రేమ అంటే మా అత్తగారికే చెల్లుతుంది! ఆమెది ఏకపుత్ర విషయం కదా! కొడుకును ఏనాడూ ఏ మాటా అని ఎరుగదు. ఆమెతో నాకు నలభై ఏళ్ళ సహచర్యం వుంది. కాని ఒక్కనాడైనా కొడుకును తిట్టిగాని, విమర్శించిగాని, విసుక్కొని గాని సంపాదించలేదని గాని పల్లెత్తుమాట కూడా అని ఎరుగదు. రామాయణంలో దశరధుడి పుత్రప్రేమ గురించి విన్నాను, మళ్ళీ మా అత్తగారినే చూచాను. అదేమి వాత్సల్యమో నాకు ఇప్పటికీ అర్థం కాదు. ఆమె పుత్ర (ప్రేమతో పోలిస్తే (మా అమ్మ 13 మందిని, నేనూ 5 గుర్ని కన్నాం) అందులో మా పుత్రప్రేమ ఎన్నో వంతో నేనే చెప్పలేను. ఒక కన్ను కన్ను కాదు ఒక బిడ్డ బిడ్డాకాదు అంటూ వుండేది – ఆమె పంచప్రాణాలు ఆ బిడ్డమీదనే వుండేవి. క్రింద పెడితే భూమి, పైన పెడితే ఆకాశం ఎత్తుకుపోతుందేమోనని వెయ్యి కళ్ళతో చూస్తూ వుండేది. మామగారు ఏమన్నా అంటరేమోనని ముందుగానే ఆయనపై విరుచుకుపడేది.

## అత్తింటికి ఆగమనం

ఇక తరువాత గుంటూరు ఏ.సి. కాలేజీలో బి.ఏ.లో రామ్మూర్తిగారిని ప్రవేశ పెట్టారు. మామగారు సేల్సుటాక్సు ఆఫీసరుగా గుంటూరు చేరారు. నన్ను కూడా 1937 మే 17న పునస్సంధానం చేసి కాపురానికి తీసుకు వెళ్ళారు. నేను అత్తింటికి వెళ్ళాక రెండు పురుళ్ళకు మాత్రం పుట్టింటికి వచ్చి వెంటనే వెళ్ళిపోయాను. పదమూడవ ఏట కాపురానికి వెళ్ళిన నేను చుట్టం చూపుగా తప్ప, పట్టుమని పదిరోజులైనా పుట్టింట్లో

వుండి ఎరుగను. నా పిల్లలకు తగిన వైద్య సౌకర్యాలు ఆ వూళ్ళో లేనందువల్ల నన్ను రమ్మనటానికి మా నాన్న భయపడేవాడు. నాన్న పొయ్యాక అదీ పోయింది. నా కుటుంబం, నా పిల్లలు, వారి పెంపకం, బాధ్యతలతో తలమునిగి వుండేదాన్ని. అత్తగారి ఆచార వ్యవహారాలు పాటిస్తూ, పూజలూ, నోములు చేస్తూ, ఆమెకు సర్వ విధాలా సహాయకారిగా వుండి అన్ని పనులు చేయటంవల్ల నాటికి, నేటికి కూడా ఎంతపనైనా భారం అనిపించదు. మొదటి కాన్పు 1938 అక్టోబరు నాటికి నాకు 14 సం॥ లు. పిల్లల్ని పెంచటం కూడా తెలియని అజ్ఞానపు దశ. నా పెళ్ళి తరువాత మా అమ్మకు మరో ఆడపిల్ల, మరో ఇద్దరు మగపిల్లలు కలిగారు. ఆమె ఎప్పుడూ బాలింత గానో, చూలింతగానో వుండేది. నేను పెద్ద పిల్లను అవడంవల్ల అమ్మ పిల్లల్ని దరిదాపు ముగ్గుర్ని పూర్తిగా నేనే పెంచానని చెప్పక తప్పదు. ఆ అనుభవంవల్ల నా పిల్లల్ని పెంచటం నాకు కొంత తేలికయింది. మొదటి పిల్లాడికి వెంకట రామకృష్ణ పూర్ణానంద శర్మ అని మామగారి తండ్రి పేరు పెట్టారు. 1940 మార్చి 4వ తేదీన రెండో పిల్లాడు కలిగాడు. కామేశ్వరరావు అని రామ్మూర్తిగారు తన మేనమామ పేరు పెట్టారు. 11వ రోజే ఆల్ ఇండియా కాంగ్రెస్ సభలకు రామ్‌ఘర్ పంపితేనే బారసాల పీటల మీద కూర్చుంటానని పట్టుపడితే మామగారు సరే అని డబ్బు యిచ్చి పంపారు. రెండేళ్ళు నిండకుండానే మొదటి పిల్లవాడికి డిఫ్తీరియా వచ్చి 24 గంటల లోపు చనిపోయాడు. సకాలంలో వైద్య సహాయం లభించక అలా జరిగిందని ఇప్పటికీ బాధగా వుంటుంది. కాని పూర్వాషాఢ నక్షత్రం మొదటి పాదంలో రెండో అబ్బాయి పుట్టిన నక్షత్ర దోషంవల్ల జ్యేష్ఠుడికి నష్టం జరిగిందని మా పెద్దలందరూ బాధపడ్డారు. ముఖ్యంగా మా అత్తగారు ఆ పిల్లాడి కోసం అల్లాడిపోయింది.

## నా భర్త రాజకీయ కార్యకలాపాలు

ఆ తర్వాత నా భర్త బి.ఏ. పూర్తయింది. కానీ రాజకీయాలు పెరిగి కమ్యూనిష్టుగా మారడం జరిగింది. అంతకంతకు రహస్య కార్యక్రమాలు పెరగసాగాయి. అప్పుడు తెనాలి తాలూకా తహశీల్దార్ అయ్యారు మా మామగారు. పోలీసులొచ్చి "మీ అబ్బాయిని కట్టుదిట్టం అయినా చేయండి. లేదా అరెస్టు చెయ్యాల్సి వస్తుంది" అని హెచ్చరించి వెళ్ళారు. ఇక్కడ వుంటే జైలు ప్రాప్తి అని గత్యంతరం లేక బెనారస్ హిందూ యూనివర్సిటీలో ఎమ్.ఏ. ఎల్.ఎల్.బి. చేయటానికి పంపారు. అక్కడ మాత్రమే ఆ రోజుల్లో రెండూ ఏక కాలంలో చదివే అవకాశం వుంది. అక్కడయితే బుద్ధి కలిగి వుంటాడనే ఆశతో మామగారు అలా చేశారు. ఆయన చదువుకెళుతూ మా మామగారితో "మీరు బ్రిటిష్ ప్రభుత్వం తొత్తులుగా వుద్యోగాలు చేయటంవల్ల భయపడుతున్నారు. అదే నేనయితే వెంటనే ఆ వుద్యోగానికి రాజీనామా ఇచ్చేసే వాడిని" అన్నప్పుడు మామగారు చాలా బాధపడి "మేము కూడా దేశాభిమానం కలవారమేరా? కాకపోతే జీవనాధారం కోసం ఈ ఉద్యోగం చేయాల్సి వచ్చింది" అని చెమ్మగిల్లిన కన్నులతో అన్నారు. ఆ విషయం మామగారు

ఎప్పుడూ నాకు చెబుతూ వుండేవారు. నా భర్త బెనారస్ చదువుకు వెళ్ళి అక్కడ రెండేళు ్ళ వుండి కమ్యూనిస్టు కార్యక్రమాలు ఇంకా బాహాటంగా చేయటం మొదలు పెట్టారు. ఇక్కడ మామగారు కష్టపడి డబ్బు పంపుతూ వుండటం, అక్కడ రామ్మూర్తి గారు రాజకీయ స్వైర విహారం చేయటం జరిగింది.

ఆ సమయంలో ఒక భయంకర సంఘటన జరిగిందట. అప్పుడు అక్కడ రహస్యంగా కమ్యూనిస్టు కార్యక్రమాలు ఇంకా హెచ్చు స్థాయిలో రామ్మూర్తిగారు జరిపేవారు. మారు వేషాలేసి వారంటున్న కార్యకర్తలను దాచటం, రహస్య కరపత్రాలు పంచటం లాంటి అండర్ గ్రౌండు పనులు చేసేవారు. 13 మంది ముఖ్య కార్యకర్తల పేర్లు వున్న జాబితా కలిగివున్న ఒక నాయకుడు హఠాత్తుగా పోలీసులకు పట్టుబడటంతో ఆ కాగితం వాళ్ళు చూస్తే ప్రమాదమని గ్రహించి దానిని నమిలి మింగేశాడట. ఆ లిస్ట్ లో వున్న పేర్లలో రామ్మూర్తిగారి పేరు కూడా వుంది. అలా రక్షింపబడిన వారిలో రామ్మూర్తి గారు కూడా వున్నారు. ఆయన తిరిగొచ్చిన తరువాత ఈ విషయం చెప్పారు. అలాగే 1947లో విప్లవ వీరుడు, నవ్యమానవవాద దార్శనికుడు, తత్త్వవేత్త బహుగ్రంథకర్త ఎమ్.ఎన్.రాయ్, భార్య ఎల్లెన్ రాయ్ ఇద్దరూ ఆంధ్రరాష్ట్ర పర్యటన జరిపిన సందర్భంగా రాడికల్ హ్యూమనిస్టులు అనేక సభలు ఏర్పాటు చేసినప్పుడు రాయ్ దంపతులు గుంటూరులో మా ఇంటికి వచ్చి మాట్లాడి వెళ్ళారు. ఆ మర్నాడు పోలీసులు మా ఇంటికి వచ్చి సోదాచేసి కొన్ని కరపత్రాలు, సాహిత్యం పట్టుకెళ్ళాక మా అత్తగారు, మామగారితో పాటు నేనూ కంగారు పడిపోయాను. ఆనాడు సామాజిక సేవ, దేశ సేవల ఊసే తెలియకపోవడంవల్ల రామ్మూర్తిగారి రాజకీయాలంటే నాకు గిట్టేది కాదు.

1940లో తెలంగాణా పోరాటం జరుగుతున్నప్పుడు అనేకమంది కమ్యూనిస్టులను, వారి 'సింపతైజర్సు'ను నిజాం ప్రభుత్వం నిర్దాక్షిణ్యంగా కాల్చివేయటం జరిగింది. అప్పుడు నిజాం ప్రభుత్వం వ్యతిరేకులు అందరూ చెట్టుకొకరు, పుట్టకొకరుగా చెల్లాచెదురయినారు. పిల్లల్ని, ఆడవారిని ఆంధ్రాకు పంపారు. నైజాంలోని చుట్టాలు, స్నేహితులు తలదాచుకోవటానికి మా ఇంటికి వచ్చేవారు. ఈ విషయం తెలిస్తే మామగారి ఉ ద్యోగం పోతుంది. మిగిలిన కుటుంబ సభ్యులకు కూడా ఏం జరుగుతుందోనని ఇంట్లోకి రానివ్వటానికి భయపడి తిరిగి పంపే వాళ్ళం. రామ్మూర్తిగారికి ఈ విషయం తెలిసి బాధపడి మాతో దెబ్బలాడే వారు. ఇటువంటి కార్యక్రమాల వల్ల ఆయన ఎమ్.ఏ. చేయకండా కేవలం 'లా' మాత్రం పూర్తిచేసి ఇల్లు చేరారు. గుంటూరులో కూడా ఇదే రీతిని తిరగటం, పార్టీ వాళ్ళను దాచటం ఉద్యమ కార్యక్రమాల స్థాయి పెంచి ఇల్లూ, వాకిలి పట్టకుండా తిరగడం ఇంకా పెరిగింది.

1944లో ప్రమోషన్ మీద మా మామ గారిని సేల్సుటాక్సు ఆఫీసరుగా విజయవాడ వేస్తే మా కాపురం కూడా కదిలింది. మామ గారు ఎక్కడ వుంటే నేను, పిల్లలు ఆయన

పోషణలో రక్షణలో వుండేవాళ్ళం. 1937లో కాపురానికి వస్తే 50లో మా నాన్న పొయ్యాక బాపట్ల వచ్చి ఆయన ప్రాక్టీసు ఈయన చేసేదాకా, గట్టిగా కలిసి కాపురమూ లేదు. కానీ సంపాదనా లేదు. వస్తూ పోతూ వున్నా నన్ను మాత్రం ప్రేమగానే చూచే వారు. మామగారి నుండి సొంత ఖర్చుల క్రింద పుచ్చుకొన్న డబ్బులో పదో పరకో నా కిచ్చి వెళ్ళేవారు. ఏనాడూ నేను ఆర్థికంగా కష్టపడి ఎరుగను. ఏభై రూపాయల నుండి వంద మించి వుండేది కాదు.

## సంపాదనకు స్వస్తి: రాజకీయాలపై ఆసక్తి

అవి రెండవ ప్రపంచ యుద్ధపు రోజులు. బెజవాడలో వుండగా ఒక ఆర్మీ ఆఫీసరు మేమున్న ఇంటి పైభాగంలో వుండేవారు. మామగారి ప్రవర్తనా, శ్రమ చూసి “మీ అబ్బాయిని పిలిపించండి. ఒక్క లీగల్ పోస్టు రెడీగా వుంది. అందులో చేరితే యుద్ధం ముగిసాక జిల్లా మున్సబు పోస్టు ఇస్తారని చెప్పాడు. వెంటనే మనిషిని పంపి ఎలాగో శ్రమపడి కొడుకును పిలిపించి విషయాన్ని వివరించి బ్రతిమాలారు. “నాయనా మనకు పెద్ద ఆస్తి లేదు. నా జీతం 300లతో నీ చదువు, కుటుంబం సర్దుకొచ్చాను. నా తర్వాత నీ పిల్లల గతి ఏమిటి” అని మొత్తుకున్నారు. అయినా వినకుండా, ఆ అప్లికేషన్ మీద సంతకం పెట్టకుండా ఆ రాత్రే తిరిగి వెళ్ళిపోయారు. ఆ తల్లి మాత్రం మారు మాట్లాడలేదు. తండ్రి హతాశుడైనా పల్లెత్తుమాట అనలేదు. వాళ్ళ కర్మ ఎలావుంటే అలా జరుగుతుంది అన్నారు. నేను మాత్రం ఆ తెల్లవార్లూ ఏడుస్తూనే వున్నాను. కానీ సంపాయిద్దామని గాని, ఇంటి మంచీ చెడుగాని ఏమీ పట్టేది కాదు. నాకు, పిల్లలకు వున్నంతలో ఏ లోటు లేకుండా అత్తమామలు చూస్తున్నా నేను మాత్రం ఆయన అలా వుండటం వలన నలుగురు పిల్లలతో సంసారం ఎలా గడుస్తుందోనని బాధపడేదాన్ని. అత్తమామల అదుపు ఆజ్ఞలతో ఇల్లే స్వర్గంగా, కడుపే కైలాసంగా కాలక్షేపం చేసేదానిని, దానికి తోడు 1943 మే 6వ తేదీన మరో పిల్లాడు పుట్టాడు. వాడు రోహిణి నక్షత్రాన పుట్టాడని గోపాల కృష్ణమూర్తి అని పేరు పెట్టారు మా అత్తవారు. వాడికి ఒక సంవత్సరం లోపునే లివరు వచ్చి ప్రాణావశిష్టుడయినాడు. వాడి మీద నాకు అమిత ప్రేమ వుండేది. తొలి బిడ్డ పొయ్యాడు. మళ్ళీ వీడు. ఇలాంటి ఆలోచనలతో తెల్లవార్లూ నిద్ర పట్టేది కాదు. పగలంతా చాకిరి. ‘వాడెలాగు బ్రతకడు, వాడికి మత్తు మాత్రవేసి, నీవు నిద్రపో, అన్నారు మా ఫ్యామిలీ డాక్టరు. వాడిని ఎలాగైనా బ్రతికించాలని నా తాపత్రయం. సర్వశక్తులూ ధారపోసి, రాత్రింబవళ్ళు సేవచేసి మా అత్త, మామగారు, నేను, నా భర్తా కలిసి వాణ్ణి బ్రతికించుకున్నాము.

# 2. నా చిన్ననాటి స్త్రీల స్థితిగతులు

"పుట్టలోని చెదలు పుట్టదా గిట్టదా? "అన్నాడు సుమతీ శతకకారుడు. పుట్టటం, పెరగటం, పోవటం కాదు ముఖ్యం. పుట్టి ఎవరిని వుద్ధరించాం, ఎందుకు పుట్టాం, ఆ పుట్టుకవల్ల సమాజానికి లాభమా, నష్టమా? అనేది ఆలోచనీయాంశం. ఆ దృష్టితో ఆలోచిస్తే నా జన్మ ఒక విధంగా కొంత వరకూ చరితార్థమైనదని నాకనిపిస్తుంది. మరో విధంగా చెప్పాలంటే నా జీవితంలో సగపాలు వృధా అయినదనేది మరో నగ్న సత్యం. దానికి కారణాలు అనేకం. నా చుట్టూ అల్లుకొన్న ఆ ముళ్ళ పొదలు నరికి బైట పడేటప్పటికి సగం జీవితం అణగారి పోయింది. కారణం ఆనాటి సాంఘిక ఆచారాలు, బాధలు చాలా కంటక ప్రాయంగా వుండేవి.

అది 1930వ సంవత్సరం. అప్పుడప్పుడే కొద్ది కొద్దిగా ఆఖరికి పాల లెక్కలు, చాకలి పద్దులకయినా పనికి వస్తుంది కదా అనే ఉద్దేశ్యంతో ఆడపిల్లలను బడికి పంపడం మొదలైంది. అంటే అప్పర్ ప్రైమరీ చదివితే గొప్పగా వుండేది. పంతులమ్మ పని దొరికేది. కొన్ని కులాలవారు ముఖ్యంగా బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య స్త్రీలు, బైటకు రావటం అసలు ఎరుగని రోజులు. అసూర్యంపశ్యలుగా వంట ఇళ్ళకు, పడకటిళ్ళకు పరిమితమయ్యేవారు. మూఢాచారాలు, దైవభక్తి, పతిసేవ మెండుగా వుండేవి. క్రైస్తవ స్త్రీలు మాత్రం కొందరు నర్సులుగా, టీచర్లుగా, ఉద్యోగాలు చేస్తూ వుండేవారు. పురుషులు వేదపఠనం ఉంఛవృత్తి, అర్చకత్వం, పితృతర్పణాలు లాంటి వైదిక కర్మలు విధిగా జరిపించేవారు. వర్తకులు, క్షత్రియులు కూడా జంధ్యాలు ధరించటంవల్ల ద్విజులు అనబడేవారు. అప్పటికింకా కుల వృత్తులు అమలులో వుండేవి. వర్ణాశ్రమ ధర్మాలు కట్టుదిట్టంగా నడిచేవి. ఆ దశలో ఆడపిల్లలపై ఆంక్షలు అత్యధికంగా కొనసాగుతూ ఉండేవి. కుటుంబ విధులలో ముఖ్యమైనవి ఆడపిల్లకి వివాహం చేయటం. 'కన్యాత్వాన్ని రక్షించటం ముఖ్యం' అనేదే వేదం అని నమ్మి అతి బాల్య వివాహాలు జరిపించేవారు. కన్నెపిల్లలకు ముద్దూ మురిపెము లేకుండా వధూవరులకు 15,20 ఏళ్ళ తేడాలతో పెళ్ళిళ్ళు చేసేవారు.

బీద తల్లిదండ్రులు రెండో పెళ్ళి, మూడో పెళ్ళికి కూడా డబ్బు తీసుకొని పిల్లనిచ్చేవారు. అంటే అక్కడక్కడా కన్యాశుల్కం అమల్లో వుండేది. భార్యా విహీనులు సైతం కన్యలే కావాలని పట్టుపట్టి 10, 12 ఏళ్ళ లోపు అమ్మాయిలను చేసుకునేవారు. వారు ఈడేరక ముందే విగత జీవులయ్యేవారు. ఆ చిన్నారులు ఆజన్మాంతం అలా మోడువారి బ్రతకాల్సిందే పునర్వివాహానికి నోచుకునే వారు కారు.

మా అమ్మమ్మ చెల్లెలు మద్దూరి లక్ష్మమ్మకు ఆరవ ఏట పెళ్ళి చేశారట. ఆ సంవత్సరంలో భర్త పరమపదించాడు. ఆయన 11వ రోజు కర్మకాండకు గారెలు వండుతుంటే "ఇంకో గారె పెట్టండే, మరో గారె కావాలే" అని ఏడ్చానని చెప్పింది. ఆ

తరువాత ఆమె మరో ఆరేళ్ళకు తన 12వ ఏట రజస్వలయింది. ఆ 11వ రోజు పట్టుచీర కట్టి, పూలజడ వేసి, నగలన్నీ పెట్టి, గాజులు తొడిగించి, నుదుట కుంకుమ తీర్చి దిద్దుతుంటే "ఎందుకే ఇవన్నీ చేస్తున్నారు. రోజూ ఇలా ఎందుకు చేయరే, ఇంకా ఎప్పుడూ ఇలానే చేస్తారటే" అని ఆనందపడిపోయిందిట. ఆ అలంకారాలతో ఆమెను చెఱువు గట్టుకు తీసుకెళ్ళి గాజులు పగులగొట్టి, బొట్టు తుడిచేసి, సూత్రం తెంపేసి, నున్నగా గుండు చేయించి, తెల్లటి బట్ట కట్టి, రవిక లేకుండా ఒంటెద్దు బండిలో ఎక్కించి ఒక మూల కూర్చో పెట్టి అంతా చుట్టూ చేరి ముక్కులు చీదుతూ ఘొల్లుమన్నారట. "ఇది నాబిడ్డను పొట్టన పెట్టుకుందని" అత్తగారు ఆమె ముఖమే చూడలేదట. "ఈ పుట్టు కుంక మా కడుపున పుట్టటం మా కర్మ" అంటూ ఏ శుభకార్యాన్ని చూడనిచ్చేవారు కాదట తల్లిదండ్రులు. ఆ తరువాత ఆమె బయట ప్రపంచం ఎరుగదు. పురుష స్పర్శ లేకుండా, సుఖసంతోషాలు అనుభవించకుండా చచ్చేదాకా వంటపని, ఇంటిపని, తల్లిదండ్రుల సేవ, అన్నతమ్ములకు వండి వడ్డించటం, అక్క చెల్లెళ్లకు పురుళ్ళు పోయటం అలా ఎవరికి కావాలంటే అక్కడికి వెళ్ళి పెళ్ళిళ్ళకు, చావులకు, జబ్బులకు సహాయం చేసేది. ఇంటి చాకిరి అంతా తానే చేస్తూ ఒంటి పూట తిండి, చన్నీటి స్నానం, నేలమీద పడకలాంటి విధులు నిర్వర్తిస్తూ అలా 90 ఏళ్ళు బ్రతికింది ఆ అభాగ్యురాలు. "నా జీవితంలో ఎన్ని బస్తాలు వండానో ఎందర్ని పెంచానో లెక్క లేదమ్మా" అన్నది ఒకనాడు నాతో, అలా ఆనాటి సమాజానికి బలిపశువయింది మా చిన్న అమ్మమ్మ. అలాంటి అభాగినులు ఆనాడు లెక్కకు మిక్కుటంగా వుండేవారు.

ఒక వంక బహుభార్యాత్వం, మరోవంక వేశ్యావృత్తి, దేవదాసి వ్యవస్థ, కన్యాశుల్కం, బాల్య వివాహాలు, ఆడపిల్లలను చంపటం, గొడ్రాలు అయితే విడిచి వేయటం, ఏ పొరపాటు చేసిన కఠిన శిక్షలు – కొట్టటం, తిట్టడం, పుట్టింటికి పంపివేయటం, లేక అసలే పంపకపోవటం పిల్లల్ని విడదీయటం, గొడ్డులా ఇంటి చాకిరి అంతా చేయించటం, మాడ్చటం లాంటివి సర్వసామాన్యంగా వుండేవి. మా దూరపు బంధువొకామె గరిటె కాల్చి కోడలికి వాతలు పెట్టింది. ఇలాంటివి సవాలక్ష చేసేవారు. మనుధర్మ శాస్త్రం, చాణక్య నీతి, వాత్స్యాయన కామసూత్రాల్లోని ధర్మాలు, ఆమె విధులు అన్నీ మా రోజుల్లో అమల్లో వుండేవి. మా వూరిలో మరొక ఆమె కోడలికి విషం పెట్టింది. భార్యలను చంపి బావిలో పడెయ్యటం సర్వసాధారణం. ఆ బాధలు భరించలేక కొందరికి చిత్త చాంచల్యం కలిగేది. అయినా కోర్టుకు వెళ్ళటం, పుట్టిళ్ళకెళ్ళటం జరిగేది కాదు. హిస్టీరియా వచ్చేది కొందరికి. అది చూచి దయ్యం పట్టిందని మంత్రగాళ్లచేత చావ బాదించేవారు. ఆస్తి హక్కు లేదు. రాజకీయ చొరవ అసలు లేదు. ఎన్ని బాధలైనా నోరు మూసుకొని అనుభవించేవారు. పుట్టింటికి వెళితే మళ్ళీ రానివ్వరని, అత్తగారింట్లోనుంచి పొమ్మని వెళ్ళగొట్టినా 'పోము' అని ఏడ్చేవారు. ఇన్ని బాధలు వున్నా ఆనాడు వర దక్షిణ వున్నా,

వరకట్న సమస్యలు, వరకట్న చావులు, మానభంగాలు, ఇంతగా వుండేవి కావు. కారణం ఏ ఆడదీ ఎదురు తిరిగేదికాదు. ప్రశ్నించేది కాదు. కోర్టు కెక్కేది కాదు. పూర్తిగా అణిగి మణిగి చెప్పుచేతల్లో పడి వుండేది. భర్త వ్యభిచరించినా, పదిమందిని పెళ్ళాడినా, గొడ్డు చాకిరి చేయించినా నోరెత్తనప్పుడు చంపాల్సిన పని ఏముంది. ఇంటి చాకిరి చేస్తూ కుక్కలా కాపలా కాసేది కదా! అసలు బైటికే పోనిచ్చేవారు కాదు కనుక మానభంగాలు అంతగా జరిగేవి కావు. నిశితంగా ఆలోచిస్తే ఆనాటి సమస్యలే వేరు. శాస్త్రీయ విజ్ఞానం పెరగటంవల్ల, నాగరికత ప్రభావంవల్లా కొంతమార్పు, అభివృద్ధి వున్నా ఈనాటి అత్యాచారాలు అనంతంగా వున్నాయని మనకు తెలుసు. వాటిని మార్చి సమ సమాజాన్ని స్థాపించటమే ఈ నాటి మన కర్తవ్యం అనేది నా నిశ్చితాభిప్రాయం.

## మూఢాచారాల ముసుగులో నాటి స్త్రీల స్థితి

ఆనాటి మూఢాచారాలు పూర్తిగా వ్రాస్తే అదే ఒక మహాభారత గ్రంథమవుతుంది. ఆ ఛాందసాల ఊబినుండి నేనెలా బైట పడ్డానో వ్రాయాలంటే మరో యాభయి పేజీలు నింపాల్సి వుంటుంది. కళ్ళ కామెర్లు వస్తే అమ్మమ్మ మంత్రం వేసేది. పాము, తేలు కుట్టిన వాళ్ళంతా వస్తే అగ్ర వర్ణాలయితే తాకి మంత్రించేది పచ్చగడ్డి పరకతో. అదే ఏ శూద్రుడో అయితే వీధిలో నిలబెట్టి మంత్రించిన నీళ్ళు వాడి కుండలో ఎత్తి మాచేత పోయించి చల్లుకోమనేది. కలరా, మశూచి వస్తే కోడి పెట్టలను చంపి దిగ తుడిచి నాలుగు రోడ్ల కూడలిలో రాత్రిళ్ళు వేయించేవారు. ప్రతి జబ్బుకు దయ్యం పట్టిందని భూత వైద్యుడికి వొప్ప జెప్పేవాళ్ళు. అమ్మమ్మకు సాయంచేసే లక్ష్మీ నరసమ్మ కోడలు ధనలక్ష్మికి పిల్లలు పుట్టలేదని దాని సవతి దయ్యమయి పట్టిందని ధనలక్ష్మిని కాళ్ళూ చేతులు కదలకుండా పట్టుకొని రోజుకు ఒకటి పెంచుకుంటూ వంద బిందెల నీళ్ళు పొయ్యాలని భూతవైద్యుడు చెప్పాడు. ఆ ప్రకారమే నీళ్ళు నెత్తిన పోసేవారు. ఈ బాధ భరించలేక ఒకనాడు ఆమె ఊరి చివరి బావిలో పడి చనిపోయింది. మనిషి చచ్చిపోయినందుకు ఏ ఒక్కరికీ బాధలేదు. కానీ, బావి పాడు పెట్టటంమీద గ్రామస్తులంతా చేరి మూడు రోజులు చర్చలు జరిపారు. చివరకు ఆమె 30 ఏళ్ళది కనుక మూడు ఏళు ్ళ పాడుబెట్టారు. అసలే ఆ ఊరిలో – పోతార్లంకలో – 16, 18 నిలువుల లోతు త్రవ్వినా నీళ్ళు పడేవి కావు. సగం గ్రామం నీళ్ళు చాలక కృష్ణ నుండి మోసే వారు. ఇంక ఆ ఒక్క బావి కూడా పాడుబెడితే కనీసం ఆరు నెలలయినా నానా గడ్డి తినాల్సి వచ్చింది.

పిల్లలు పుట్టకపోతే రామేశ్వరం పోయి నాగ ప్రతిష్ట చేసేవారు. పుట్టలో పాలు పోయటం ఈనాటికీ వుంది. అంటే నాగేంద్రుడు కళ్ళూ, కాళ్ళూ, చెవులు రక్షిస్తాడని వారి నమ్మకం. ఆంజనేయస్వామి దేవాలయం చుట్టూ రోజు వంద ప్రదక్షిణాలు చేసేవారు.

పిల్లలకు జ్వరాలు తగ్గితే నిలువు తోపు (అంటే మొక్కుకునే సమయానికి వంటిమీద వున్న నగలన్నీ ఇస్తామని) మొక్కుకునే వారు. కొందరు పిల్లలచేత గుడి చుట్టూ పొర్లు దండాలు పెట్టించేవారు. ఇలా మొక్కుబడులే తప్ప వైద్యానికి, రోగి పాలకు, పండ్లకు పైసా ఖర్చు పెట్టేవారు కాదు. పిల్ల పుడితే పురుడు, దాయాది చేస్తే సూతకం, నెల నెలా వచ్చే ముట్లు, ఈ మూడూ మహా పట్టింపులు, ప్రతిబంధకాలు కూడా. మనిషి పుట్టుకుండా, చావకుండా, ముట్టు కాకుండా ఎలా జరుగుతుంది. ఈ దేహ లక్షణాలకు ఇన్ని ఆంక్షలు, ప్రతి బంధకాలు ఎందుకని ఆనాడు తెలియ తెలియదు. ఎంతో ఆలోచించి, మరెంతో చర్చించి, ఇంకెంతో పరిశోధించిన మీదట ఇదంతా సనాతనాచారాల బలిమి, అజ్ఞానం అని తెలియడానికి, విసర్జించటానికి చాలా కాలం పటింది. ఆలస్యంగానైనా ఆ ఊబిలోంచి బైట పడగలిగానంటే అదంతా నా అదృష్టమనక తప్పదు.

## ఆనాటి సొసైటి

అసలు తాము అనుభవించేది కష్టాలనే భావమే స్త్రీలకు లేదు. ఎంత అణిగి మణిగి వుంటే అంత పవిత్రమని భావించేవారు. ఎన్ని కష్టాలు, ఎంత బాధ పడితే అంత పేరు ప్రఖ్యాతులనే భావం వారి నరనరాన జీర్ణించి పోయింది. ఏ పొరపాటు జరిగినా దెబ్బలు తినేవారు. కొందరయితే రోజూ దెబ్బలు తిని ఆనందించేవారు. అలాంటి వారి సంఖ్య అసంఖ్యాకంగా వుండేది. మా పొరిగింటావిడకు అత్త, భర్త వాతలు పెడితే ఇతరులు అధిక్షేపిస్తారని కీళ్ళవాతం తగ్గుతుందని తానే వాతలు పెట్టుకున్నట్లు చచ్చిందాకా చెప్పుకునేది. మా మేడమీద సంపన్నుడైన ఒక డాక్టరు వుండేవారు. ఆయన భార్య పై అజమాయిషీ అంతా అతని తల్లిదే. ఒకనాడు దొడ్లో కోడలి జుట్టు పట్టుకొని కొడుతోంది అత్త. అదేమిటని కోడలిని అడిగాను. అత్త ఆజ్ఞ లేకుండా భర్త గదిలోకి వెళ్ళానని కొట్టిందని, అంతే కాదు నాకు తెలియకుండా నీకు కడుపు ఎలా వచ్చిందే అని ప్రతిసారీ తిట్టేదట. ఆ విషయం రహస్యంగా నాతో చెప్పింది. నా భర్త ద్వారా నేను కన్న ఆరుగురు పిల్లలు దొంగతనంగా పుట్టిన వారే నమ్మా అంటూ నాతో వాపోయిందా కోడలు. ఆమె పూర్వ చరిత్ర విన్న నేను ఈనాటికి మరువలేనంటే నమ్మండి.

## మా అమ్మమ్మగారి ఊరు

అది కృష్ణానది ఒడ్డున వున్న చిన్న గ్రామం. వర్ణాశ్రమ ధర్మాలకు నిలయం. అక్కడ వర్ణాశ్రమ ధర్మాలు పాటించని వాళ్ళను గ్రామ పెద్దలే వెలివేసి శిక్షించేవారు. సగం గ్రామం బ్రాహ్మణవాడ. అది చాలా పెద్దదిగా వుండేది. అందరికి సొంత వ్యవసాయం వుండేది. నిత్యావసర వస్తువులు అమ్మే కోమటి కుటుంబాలు ఒక పది మాత్రం వుండేవి. మిగతా జనాభా అంతా వ్యవసాయ కూలీలు, కమతగాళ్ళు, మాల, మాదిగ, వెట్టి అనబడే వారంతా గ్రామ పొలిమేర్లలో వుండేవారు. వారికి వేరుగా ఒక బావి వుండేది.

వేసవికాలంలో బావులు ఎండిపోతే కృష్ణానది నుండి చీకటి పడ్డాక మాత్రమే వెళ్ళి నీళు ్ళ తెచ్చుకోనిచ్చేవారు. జుట్టు, బొట్టు, గాజులు, రవికె అని అమ్మమ్మ ధవళ వస్త్రంతో వెళ్ళి నదిలో స్నానమాడి తడి బట్టలతో రోజూ రెండు మైళ్ళు వెళ్ళి రెండు బిందెలు నీళు ్ళ తెచ్చేది త్రాగటానికి. ఆ నదిలో గొడ్లు కూడా జలకమాడేవి. ఆ నీటిని శుభ్రపరచటమే లేదు. ఇప్పుడు అనిపిస్తుంది ఆ నీళ్ళు త్రాగి ఎలా బ్రతకాలా అని కృష్ణా, గోదావరి, గంగ, తుంగభద్రల నీరు త్రాగితే వైకుంఠ ప్రాప్తి అనే పవిత్ర భావన వుండేది. ఆ నీరు త్రాగితే నిజంగా సరాసరి వైకుంఠం ప్రాప్తి అనేది నగ్న సత్యం. ఆ మురికి నీరు తాగిన తరువాత లేని పోని జబ్బులు రావడం, ఆ తర్వాత మరణించడం తేలిగ్గా జరుగుతుంది. ఆ కుగ్రామంలో వైద్యాలయాలు అసలే లేవు. ఒక ఆయుర్వేద వైద్యుడు మాత్రం వుండేవాడు. అతనికి డిగ్రీలు, డిప్లమాలు ఏమీ లేవు. అది వంశపారంపర్య విద్య. రాత్రిళ్ళు గుళ్ళో పూజారి. పగలు ఔషధాలు, లేహ్యాలు అందించటం. మెదిలితే "లంఖణం పరమౌషధం" అంటూ ఎండ గట్టే వాడు. ఆకలితో దహించి అసలు వ్యాధి కన్నా ఈ వైద్య శిఖామణి సూచనలతో చచ్చే వాళ్ళం. కడుపులో మంటకు తట్టుకోలేక అమ్మమ్మ చూడకుండా దొంగతనంగా అన్నం తినటం, ఏమైనా పిండి వంటలు వగైరా వుంటే చాటుగా తిని మూత క్రింద పడేసి వచ్చేదాన్ని. అమ్మమ్మ ఎలుకలు తిన్నాయను కోవాలి గదా! ఆ వూళ్ళో ఒక చిన్న స్కూలు వుండేది. అమ్మాయిలు 8 ఏళ్ళ వరకు వెళ్ళవచ్చు. పాలు, పెరుగు లెక్కలకయినా, చాకలి పద్దుకయినా, వుత్తరం ముక్క రాసి చదవటానికైనా కావాలి గదా అని గొప్పింటి అమ్మాయిలను 4 క్లాసులు చదవనిచ్చేవారు. మా శ్రీహరి మాష్టారు పరమ కోపిష్టి: రాగానే బెంచీలెక్కించేవాడు. మగ పిల్లల్ని గోడ కుర్చీ వేయించేవాడు. ఆడపిల్లల చేత గుంట ఓనమాలు అంటే ఓ నమః లాంటి అక్షరాలను నేలలోనే గుంటలు చేయించి దిద్దించేవాడు. అది మట్టి నేల. రోజూ పేడతో అలికేవాళు ్ళ. ఆయనలో బ్రాహ్మణత్వం మూర్తీభవించి వుండేది. శూద్రులకు అసలు అక్కడ ప్రవేశమే లేదు. ఆయన శిష్యులయిన ఆరుగురి అమ్మాయిల్లో నేనొకదాన్ని. పట్నం నుండి వచ్చానని, ప్లీడరు కూతుర్నని, ఆస్తిపరురాలయిన అమ్మమ్మ మనవరాలినని నన్ను తాటాకు చాప మీద కూర్చోనిచ్చే వాళ్ళు. అయినా 10 సార్లకు పైనే నేను కూడా పేము బెత్తపు దెబ్బలు తినక తప్పలేదు. అలా దండించకపోతే ఆయన గురుత్వం దెబ్బ తింటుందట. మాష్టారు రంగప్రవేశం కాగానే అబ్బాయిల లాగులు సగం తడిసేవి. దెబ్బలు తినని కుర్రాళ్ళు లేరంటే అతిశయోక్తి కాదు. ఇంటికి రాగానే అమ్మమ్మ రోజూ బట్టలు విప్పించి, స్నానం చేయించి, శుద్ధి బట్టలు కట్టించేది. ఆ రోజుల్లో వైద్యుడి ఇంటికి వెళ్ళి వస్తే 'డష్టరు' (డాక్టరు పేరురాక) బట్టలని, స్కూలు కెడితే కిరస్తానీ' బట్టలని వేరే పెట్టించేది. అంటే దారిలో ఏ కిరస్తానీ వాడో, ఏ అంటరానివాడో ఎదురయ్యాడేమోనని ఆమె అనుమానం.

ఒకరోజు అమ్మమ్మ చూడకుండా వత్తుల డబ్బా నుండి ఒక దమ్మిడి దొంగిలించి కోమటింటికి వెళ్ళి బెల్లంతో చేసిన బూందీ లడ్డు కొనుక్కొని తిన్నా. ఎదురింటి లచ్చి

(లక్ష్మి) నేను క్రితం రోజు గచ్చకాయలాటలో పోట్లాడుకున్నాం. ఆ పగతో అది వెళ్ళి నా దొంగ తిండి సంగతి మా అమ్మమ్మకు నివేదించింది. ఇక పెద్ద వడగళ్ళ వాన జంఝా మారుతమైన గాలితో వచ్చింది. మా అమ్మమ్మ నన్ను మా ఎత్తయిన అరుగు మీద నిల్చోబెట్టి శ్రీహరి మాష్టారింటికి పరుగెత్తింది. (ఆ గ్రామంలో తరుచు కృష్ణా నది పొంగి వరదలొచ్చి ఇళ్ళు మునిగి పోయేవి. అందువల్ల కాస్త ధనవంతులంతా డాబా ఎత్తున పునాది లేపి 2, 3 గదులు కట్టించుకునేవారు. దాని ముందు పెద్ద అరుగులు కూడా వుండేవి) పరమ నిష్టాగరిష్టుడయిన మాస్టారి ఆదేశాలు నా పై ప్రయోగించటానికి అమ్మమ్మ అతి ఆదుర్దాతో రంగ ప్రవేశం చేసింది.

మాష్టారిచ్చిన దర్భపుల్ల చేత ధరించి కాళికా రూపం దాల్చిన అమ్మమ్మ ముందుగా నోరు తెరచి నాలుక చాపు అని గద్దించింది. ఆ దర్భ కాల్చి నా నాలిక మీద పెట్టింది. అసలు దర్భ వేడి వుండదు. పైగా నాలుక తడికి వెంటనే ఆరిపోతుంది. అదేమంత పెద్ద శిక్ష కాదు. బాధ లేదు. కాని శుచి క్రింద శుద్ధి చేసినట్లు అవుతుందని అలా చేసింది. ఆ తర్వాత తల స్నానం చేయించి మంత్రపు నీళ్లు ప్రోక్షించి ఇంట్లోకి రానిచ్చింది.

గ్రామాల్లో ముఖ్యంగా ధనవంతుల పొలాలు అన్నీ మాల, మాదిగ వాళ్ళు సాగుచేసి, అష్టకష్టాలు పడి, రాత్రింబవళ్ళు ఇంటిళ్ళపాది చాకిరి చేసి, మక్తాలు చెల్లించి, మిగిలిన గింజలు దంచుకొని గంజి నీళ్ళు త్రాగి వూరి బయట గుడిశల్లో ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ గట్టి పిండాలు కాబట్టి బ్రతికేవాళ్ళు. డబ్బుకాని, అధికారంగాని, అండదండలు గాని ఏనాడు ఎరుగని జీవుల కరుణామయ గాథలు లెక్కకు మిక్కుటంగా వుండేవి. అగ్ర వర్ణాల వారి అధికార దర్పం దండనా విధానాలు అత్యల్పాలు కావు. నాకిప్పటికి ఆ దృశ్యాలు కళ్ళకు కట్టినట్లు గోచరిస్తాయి. మేమంతా వీధి అరుగుల మీద కూర్చుంటే ఆ దారంట మా ముందుగా వారు వెళ్ళాలంటే హడలి పొయ్యేవారు. తలవొంచి, తల పాగా తీసి భుజాన వేసుకొని, చెప్పులు విడిచి చంకలో పెట్టుకొని, "అమ్మగారూ! లోపలికి వెళ్ళండమ్మా! చెప్పరానివాడు వస్తున్నాడమ్మా" అని బిగ్గరగా అరిస్తే, మేము లోపలికి వెడితే, వాడు తలొంచుకొని వెళ్ళేవాడు. వాడినోటి నుండి వుమ్మి మేము నడిచే రోడ్డు మీద పడరాదు. అందుకని చిన్న ముంత పట్టుకొని అందులో వుమ్మేసి ఇంటికి వెళ్ళిన తర్వాత పారబోసి కడుక్కునే వారు. కూరగాయలు తెస్తే మూడుసార్లు కడిగి తర్వాత సంప్రోక్షించి లోపల పెట్టేది అమ్మమ్మ. వాళ్ళను తాకితే మా వీపు చిట్లిపొయ్యేది. వాడి కాళ్ళు విరిగి పోయేవి. అంతే కాదు రెండు గజాల దూరంలో నిలబడాలి. ఇవన్ని గమనించిన నేను "వాణ్ణి చూస్తే నీకు అసహ్యం కదా మరి వాడు పండించిన పంట, చింతకాయలు, మామిడికాయలు, చిలకడ దుంపలు అన్నీ కడిగితే మాత్రం ఎలా పనికి వస్తాయి అమ్మమ్మా!" అంటే "నువ్వు నోరు మూసుకో "అనేది.

ఇలా ఆనాటి ఆచార వ్యవహారాలు, కథలు ఎన్నయినా వర్ణించవచ్చు. కాని ఈనాటికి కూడా కొన్ని ప్రాంతాలలో అదే స్థితి వుండటం శోచనీయం. కాలము, పరిస్థితులు మారాయి. చంద్రుడి నెత్తిన మానవుడు కాలు మోపాడు, ఎన్నో అసాధ్యాలు సాధ్యాలయినాయి. పరిశ్రమలు, నాగరికతా పెరిగాయి. అయినా మన మస్తిష్కాలలో మార్పు రాలేదు. ఛాందసాచారాలు, వర్ణాశ్రమ ధర్మాలు సమసిపోలేదనే బాధ నన్ను అనుక్షణం వెన్నాడుతూనే వుంది. మా హయాంలో ఈ వ్యవస్థ మారుతుందా అనే ప్రశ్నకు సమాధానం దొరకటం లేదు.

## మనువుకు వారసురాలు మా అమ్మమ్మ

నాకు 10వ ఏడు ప్రవేశంతో పాటు మా అమ్మమ్మ రంగ ప్రవేశం చేసింది. అంటే మా అమ్మ తన ముద్దుల మూడో కూతురు కావటాన ఆస్తిపాస్తులు, నగా నట్రా అన్నీ ఆమెకే ముట్ట చెప్పి చివరిదాకా చాకిరి చేస్తూనే అంతిమ శ్వాస అక్కడే, అంటే, మా ఇంట్లోనే విడిచింది. ఏటా కనటం, పెంచటం వల్ల మా అమ్మకు అంత మరీ ఆచార వ్యవహారాలు పట్టేవి కావు. కానీ మా అమ్మమ్మ మడి, ఆచారం చూస్తుంటే లోకాలే కృంగిపోయేవి. బజారు సరుకులన్నీ సంప్రోక్షించి లోపల పెట్టేది. సరే బాగానే వుంది. ఆ బట్ట తాకానని, దీని కొంగు తగిలిందని, ఆ విస్తరి తొక్కానని, ఈ పిల్ల ముట్టుకుందని రోజూ కనీసం పదిసార్లు స్నానం చేసేది. అసలే ఒంటిపూట తిండి, దీనికి తోడు ఏ పనిమనిషో, ముట్టు మనిషో, జుట్టు తీయించుకోని విధవరాల చూపు తగిలిందనో చూపు తగిలిందనో, నీళ్ళ చుక్క మీద పడ్డదనో తినే విస్తరి వదిలేసి పోయేది. ఇది చాలక కట్టెపుల్లలు, అగ్గిపెట్టెలు, ఉప్పు సర్వం నీళ్ళతో క్షాళనం చేసేది. ఇంక కట్టెలు మండేవి కావు. అగ్గిపుల్ల వెలిగేది కాదు. ఈ చాదస్తాలన్నీ తీరి మడితో వంట, పూజ, నైవేద్యం పూర్తి అయ్యేసరికి ఒంటిగంట దాటేది. మేము స్కూళ్ళ నుండి వచ్చాక తను విస్తట్లో వడ్డించుకొని వంట ఇంటి తలుపేసి, వంటగిన్నెలు తెచ్చి నేలకు తగలకుండా ఎత్తిపడేసేది. రోజూ ఉదయం ఏడు గంటలకు చద్ది అన్నం, ఆవకాయ, పుల్ల మజ్జిగ తిని బడికి పోయి వచ్చి మళ్ళా రెండు గంటలకు తిని పోయేవాళ్ళం. ఇక మా నాన్న గతి వర్ణనాతీతం. కొన్నాళ్ళు తినకుండా వెళ్ళేవాడు. కొన్నాళ్ళు ఒక సోలెడు వేరే పెట్టి ఇచ్చేది. రోజూ పచ్చడి మెతుకులు తినలేక మా అమ్మని వేరే "వంట చెయ్యరాదా" అని చెప్పి, ఒక యోచన చేసి, ఒక వంట మనిషిని (లక్ష్మమ్మ) తెచ్చాడు. ఆ వంట మనిషి చేతి నీళ్ళు కూడా అమ్మమ్మ ముట్టేది కాదు. కారణం ఆమె నియోగపుది, తల వెంట్రుకలు వున్నాయి. 28 ఏళ్ళ వయస్సుది. ఒక్క కూతురుతో వచ్చింది. కూతురు కూడా 14 ఏళ్ళ పుట్టు విధవరాలే.

## మా వంటమనిషి గాథ

అదొక తమాషా కథ. మా వంటలక్క లక్ష్మమ్మ కూతురు పుష్పను తన తమ్ముడికిచ్చి చేసింది. తన మగడు, అల్లుడూ ఒక వారంలోనే మశూచి వచ్చి మరణించారు. పుష్ప మామగారు (లక్షమ్మ తండ్రి) ఆస్తిపరుడే కాని పీనాసి. పుష్పను తన పెద్ద కొడుకు పిల్లాడిని పెంచుకొని ఇంట్లో వుండి చాకిరీ చెయ్యి ఇంత తిండి పడేస్తానన్నాడు. అది చాలక దాని నగలు, పట్టు చీరెలు అన్నీ పది రోజుల లోపలే దాచి పూసలు, గాజులు లాగేసి జుట్టు తీసేసి మూల కూర్చోమన్నాడు. ఇలా రాను రాను జీవితం దుర్భరమయి తల్లి లక్ష్మమ్మను చేరింది పుష్ప. మావూరి ప్రక్క గ్రామం రేటూరు నుండి లక్ష్మమ్మ, కూతురు పుష్ప, మరో అక్క కొడుకు మా నాన్న దగ్గరకు పుష్ప మనోవర్తికని వచ్చారు. ఇక మా నాన్న చేతిలో గారె ముక్క విరిగి నేతిలో పడ్డది. మనిషి దొరికింది కదా అని వెళ్ళి అమ్మను సమ్మతి పరిచాడు. లక్షమ్మ వంటకు డబ్బు లేదు, ఆమె దావాకు మా నాన్నకు ఫీజు లేదు, ఆస్తి లేదని పాపరు దావా వేశాడు. మా అమ్మ పిల్లలతో చస్తోందని కాస్త ఆసరాగా వుంటుందని వేళకు ఇంత తిండి పెడుతుందని తల్లికి మా ఇంట్లోనూ, పిల్లకు మరో ప్లీడరు ఇంట్లోనూ వంటపని కుదిర్చాడు. లక్ష్మమ్మ ఇంట్లో గొడ్డు చాకిరీ చేసేది. అప్పడాలు, వడియాలు, పచ్చళ్ళు, మంచినీళ్ళు మొయ్యటం, తలంట్లు పోయడం, పిండి రుబ్బటం సర్వం చేసేది. పుష్పకు మాత్రం 8 రూపాయలు ఇచ్చేవాళ్ళు. 2 రూపాయలు ఇల్లు అద్దె పోగా పై ఖర్చులు 6 రూపాయలతోనూ, అమ్మ ఇచ్చిన పాత బట్టలతోనూ గడుపుకునేవారు. లక్ష్మమ్మ వచ్చాక అమ్మకూ, నాకూ చాలా భాగం పని తగ్గింది. అలా వచ్చిన లక్షమ్మ నా పెళ్ళయి, నాకు రెండు పురుళ్ళయ్యే దాకా వుండి మా అమ్మ ప్రాణాలు నిలిపింది. మా నాన్నకు ఇంత తిండి వేళకు వండి పెట్టింది.

కానీ మా అమ్మమ్మ మాత్రం యథాప్రకారమే. ఆమె వంట గది, మడి వంట అన్నీ వేరే వుంచుకునేది. జుట్టు వుందని ఆ పుష్పను చూచి మెటికలు విరుస్తూ వుండేది. మా అమ్మమ్మ పోరు పడలేక లక్షమ్మ గుండు చేయించుకుంది. ఆ తర్వాత అమ్మమ్మ కాస్త దయగా చూస్తూ పాతబడ్డ తన తెల్ల బట్టలు ఇస్తూ వుండేది. ఇంతకూ అమ్మమ్మ సనాతన ధర్మ ప్రభావం నామీద బాగా పనిచేసింది. రోజూ రాత్రిళ్ళు నీతికథలు, పతివ్రతల చరిత్రలు చెప్పటం, చెప్తూ దాంతోపాటు మనువు విధించిన ఆడవారి ధర్మాలు, విధి నిషేధాలు 'బైహార్టు' చేయించేది. అత్తవారింటి విధులు అన్నీ బట్టీ పట్టించేది. ఒకనాడు "అమ్మమ్మా! నీకు చదువురాదుకదా ఆ మనువు రాసినవన్నీ నీకెట్లా తెలిశాయి" అని ప్రశ్నించా. "పిచ్చి వేషాలు వెయ్యకు నే చెప్పింది వినడమే కాని ఎదురు ప్రశ్న, అందులో ఆడవారు అసలే వెయ్యరాదు. తెల్సిందా? నాకు మా అమ్మమ్మ చెప్పింది, ఆమెకు వాళ్ళ అమ్మమ్మ ఇలా ఈ నీతులన్నీ వారసత్వంగా వస్తాయి కానీ చదువులూ, పాఠాలు ఎందుకే? అసలు మనది పుణ్యభూమి కనుకనే ఆ మనువు మన గడ్డమీద పుట్టాడంటూ" గద్దించింది.

ఇంకా వర్ణాశ్రమ ధర్మాలన్నీ చక్కగా బోధించేది. ముస్లింలు ఎక్కడ తాకితే అక్కడ శరీరం కోసుకోవాలనీ, కిరస్తానీలు తాకితే వాతలు పెట్టుకోవాలని చెప్పేది. ఆమె బోధలన్నీ నా నరనరాన పెనవేసుకొని పోయాయి. అవన్నీ నిజమేనని నమ్మేదాన్ని. ఆ తర్వాత అత్తగారి ప్రభావం నన్ను మరీ సుడిగుండంలోకి నెట్టింది. ఆ భావాలు మారి మళ్ళీ మనిషినవ్వటానికి నాకు 30 ఏళ్ళు పట్టింది. ఇంకా నయం అప్పటికయినా మారానంటే అదొక మహా ప్రస్థానం లాంటిది. అంటే చలం సెక్సు సాహిత్యం నుండి అరవిందాశ్రమానికి మారినట్లు, మహా భోగాలను విసర్జించి మహాయోగిగా, సర్వసంగ పరిత్యాగిగా, బుద్ధుడు మారినట్లు ఈ కొసనుండి, ఆ కొసకు ఊగిన ఉయ్యాలలాంటి ఈ మార్పు నాలో ఎలా జరిగిందో ఊహాతీతం.

# 3. నా పెళ్ళి ప్రయత్నాలు

## నా పెళ్ళి సంగీతం

నా విద్యారంగాన్ని వివరించే సందర్భంలో నా సంగీత చరిత్ర, దాని పుట్టు పూరోత్వత్తరాలు వింటే అదొక వినోద రసభరితమైన గాథ. తమాషా కథ. మా నాన్న మేనమామ వేలువిడిచిన మనుమడు నోరి విశ్వనాథం. ఆయన సంగీత పాఠాలు చెప్పి కుటుంబాన్ని పోషించే వాడు. మా నాన్న నా పెళ్ళి చేయాలంటే నాకు పాట రావాలి. ఆనాడు హార్మణి, ఫిడేలు వాయించటం అంటే అదొక హెూదా, దర్జాగా వుండేది. అది ఉన్నత కుటుంబాల వారికే చెల్లేది. మా అమ్మా, అమ్మమ్మల రోజుల్లో వంటా వార్పులతో పాటు ముత్తయిదువు చేత పతివ్రతల పాటలు, గీత గోవిందం, సీతా వనవాసం, కుచ్చెల కథ (కుశలవ చరిత్ర) తరంగాలు, అష్టపదులు, వాళ్ళ ఇళ్ళకెళ్లి పనిచేసి పెట్టి చెప్పించుకునేవారట. మా రోజుల నాటికి బడికి పోవడం, ఆటకు పంపటం, సంగీతం నేర్చుకోవటం పెద్ద అభ్యుదయం అన్నమాట. మా నాన్న సంపాదన పెరిగాక నాకు పది ఏళ్ళు వచ్చాక పదునాలుగు రూపాయలకు ఒక మంచి రకం హార్మణి పెట్టె మద్రాసు కోర్టు పనిమీద వెళ్ళి కొనుక్కు వచ్చాడు. అప్పుడు మనది ఉమ్మడి రాష్ట్రం కావటంవల్ల హైకోర్టు మద్రాసులో వుండడం చేత అప్పుడప్పుడు కోర్టు పనిమీద మద్రాసు వెళ్ళేవాడు. అది ఒక మొండి కేసు. ఏ పరిస్థితిలోనూ నూరు పాళ్ళు గెలవడని నమ్మి ఒక క్లయింటు మా నాన్నను బ్రతిమాలి కేసును హైకోర్టులో ఎడ్ మిట్ చేయించుకున్నాడు. ఎలాగూ గెలవడని నమ్మిన కోమటి క్లయింట్ తాను గెలిస్తే మా అన్నయకు గడియారం (బిగ్ బెన్), నాకు హర్మణి మా తమ్ముడికి పెన్ను ప్రెజంట్ చేస్తానని మమ్మల్ని వచ్చినప్పుడల్లా ఊరించేవాడు. అతని అదృష్టం కొద్దీ ఆ రోజుల్లో లక్ష రూపాయల కేసు మా నాన్న గెలిపించాడు. ఆ పిసినారిని అడగ్గా, అడగ్గా ఆ సందర్భంగా ఇచ్చిన 'ప్రెజెంటే' ఆ హార్మణి పెట్టె.

ఇక మా సంగీతం మాష్టారి కథ మరీ చమత్కారం. ఆ విశ్వనాథం మాష్టారు బహు కుటుంబీకుడు. తన పిల్లల్ని అందర్ని మంచి సంగీత విద్వాంసులుగా కష్టపడి సొంతంగా తయారు చేసాడు. తండ్రి, కొడుకులు ఇళ్ళకు వెళ్ళి నెలకు రెండు మూడు రూపాయలు పుచ్చుకొని పాఠాలు చెప్పి కుటుంబాన్ని పోషించుకునే వారు. మా నాన్న.నెలకు (ఖచ్చితంగా 30 రోజులు రావాలి) నాలుగు రూపాయలు ఇచ్చేట్లు, రోజుకు గంట పాఠం చెప్పేట్లు ఒడంబడిక. ఐతే మా మాష్టారుకు ఎప్పుడూ ఏదో కోర్టుపని వుండేది. మా నాన్న ఆయనకు ప్లీడరు. అందువల్ల ఆయన ఈయనకు ఫీజు ఇచ్చిన పాపాన పోలేదు. ఈయన ఆయనకు నెల జీతం ఏనాడూ ఇచ్చి ఎరుగడు. అలా సంవత్సరన్నర జరిగింది. ఇరవై వర్ణాలు, ఇరవై కృతులు నేర్చుకున్నా. తాళం, రాగం

ఇంకా బాగా రానేలేదు. ఈలోగా పెళ్ళి చూపులకు చూడటానికి వచ్చిన వాళ్ళకు నా సంగీతం వినిపించాల్సి వచ్చేది. పెళ్ళివారు వచ్చేసరికి చాపవేసి సంగీతం పెట్టె పెట్టి, పట్టు పరికిణీ, వెల్ వెట్ జాకెట్ కట్టి, నగలు పెట్టి అలంకరించి కూర్చో బెట్టేవారు. మా నాన్న పార్టీ ఒక మార్వాడికి మద్రాసులో ఒక పట్టు చీరెల కొట్టు వుండేది. ఆ మార్వాడి ఒక పట్టు పరికిణి పదహారు రూపాయలది తెచ్చి నాన్నకిచ్చి వెళ్ళాడు. అది చాలా బాగుండేది. అది నా పెళ్ళిచూపులకు బాగా పనిచేసింది. ఇక ఆ పట్టులంగా ఈ సంగీతం పెట్టె నేనూ తయారు. "లంబోదర లకుమికరా" అనే గణేశ స్తోత్రం. ""శాంతమూ లేక సౌఖ్యమూ లేదు" అనే త్యాగరాయ కృతి పాడటం. ఇంగ్లీషు పుస్తకంలో ఒక పేరా "వన్సు అపాన్ ఏ టైమ్ దేర్ వాజ్ ఏ కింగు దశరధ" అంటూ సీతాకళ్యాణం వరకూ చదివే దాన్ని.

పెళ్ళిచూపుల వారంతా పిల్లనచ్చింది అనే వారు. కారణం పదేళ్ళకే మంచి వడ్డూ పొడుగు వుండేదాన్ని. ఆ తర్వాత వెంటనే పిల్లలు పుట్టటాన నా పెరుగుదల అలా ఆగిపోయింది. మా పుట్టింటి వారంతా ఆజానుబాహువులు. నేను వారికి నచ్చినా నాన్న ఇంకా గొప్ప సంబంధం తేవాలని ఆశతో వుండేవాడు.

## తప్పిపోయిన నా పెళ్ళి సంబంధం

మా నాన్న కుదిర్చిన పెళ్ళి సంబంధాల సందర్భంగా ఒక సంఘటనను గురించి చెప్పాల్సి వుంది. నన్ను ఒక ధనవంతుల కుటుంబం వారు చూచివెళ్ళారు. వారికి నచ్చినట్లు ఉత్తరం వ్రాశారు. మాతో సంబంధం ఖాయం చేసుకోవడానికి ఫలానా రైలుకు వస్తున్నామని ఉత్తరం పంపారు. సంతోషంతో వారిని తీసుకుని రావడానికి మా నాన్న రైల్వే స్టేషనుకు వెళ్ళాడు. కాని ఫ్లాట్ ఫారం అంతా వెతికినా వాళ్ళ జాడలేదు. ఆశ్చర్యపడ్డాడు. ఎందుకు రాలేదబ్బా ఏమై ఉంటుందని బెంబేలెత్తాడు. పరిపరి విధాల ఆలోచిస్తూ ఇల్లు చేరాడు. దీని ముఖానికి ఈ జన్మలో పెళ్ళికాదు. "రెండేళ్ళుగా చూస్తున్నా ఏదీ ముడిపడక పోయె!" అంటూ మా అమ్మ నామీద విరుచుకుపడింది. ఆ తర్వాత అసలు విషయం తెలిసింది. వాళ్ళు ఆ రైలుకే వచ్చారని, వేరే సంబంధం ఖాయం చేసుకుని వెళ్ళారని అంటే నా స్నేహితురాలు రాజ్యలక్ష్మికి తాంబూలాలు పుచ్చుకున్నారని తెలిసింది. ఎందుకు ఇలా జరిగిందని విచారించాడు మా నాన్న. మా ఇంటికి రోజూ వస్తూవుండే సంగీతం మాష్టారు విశ్వనాధంగారు స్టేషనుకు వెళ్ళి వాళ్ళను కలుసుకుని "కొండూరి వారి సంబంధం మంచిది కాదు. పిల్ల తాత పేకాట ఆడి పొట్ట పోసుకుంటాడు, శవాలను మోస్తాడు. వారు ధనవంతులు కారు" అని చెప్పాడట. మా తాతయ్య, ఆయన అన్న శవాలను మోసేవారు. ఆ రోజుల్లో ఆ పనిచేయడం పుణ్యమే కాదు ఆచారం కూడా. ఈ మాటలు విన్న పెళ్ళివారు మా సంబంధం వద్దని వెనుతిరిగి పోతుంటే

మళ్ళీ ఆ విశ్వనాథం గారే కల్పించుకుని, "ఎలాగు వచ్చారు కాబట్టి ఇంకొక సబంధాన్ని చూచి వెళ్ళండి. అది చాలా మంచి సంబంధం. పిల్ల అందగత్తె. కుటుంబం గౌరవ ప్రతిష్టలు కలది, సంపన్నులు వారు. వేలలో కట్నకానుకలిస్తారు. "అని వారిని తీసుకొని వెళ్ళి పిల్లను చూపించాడట! ఆ సంబంధం వారికి వెంటనే నచ్చటం, ఖాయపరచుకోవటం ఆ రోజే జరిగాయని తెలిసింది. ఆ రాజ్యానికి కూడా ఆయనే సంగీతం నేర్పేవాడు. మా సంబంధం చెడిపోవడానికి విశ్వనాథం గారే కారకులని మా అమ్మకు తెలిసింది. ఆ కోపంతో ఆయన మీద మండిపడ్డది. "ఈసారి ఆయన మన ఇంటికి వస్తే కాళ్ళు విరగకొడతాను, శ్రాద్ధం పెడ్తాను" అని తిడుతూ వుండేది. ఆ మాటలు మా తమ్ముడు విన్నాడట. విశ్వనాథం గారు మా ఇంటికి రావడం దూరాన్నుంచి మా తమ్ముడు చూచి పరుగెత్తుకుంటూ గేటు దగ్గరికి వెళ్ళి "మాస్టారూ! మాస్టారూ! మీరు మా ఇంటికి రాకండి. వస్తే మా అమ్మ మీ కాళ్ళు విరగొట్టి శ్రాద్ధం పెడ్తుంది" అని కేకవేసి చెప్పాడట. మాస్టారు మా ఇంట్లోకి వచ్చి మా అమ్మను పిలిచి "అన్నపూర్ణమ్మా! నా శ్రాద్ధం నీవెందుకు పెట్టాలమ్మా. నాకు నలుగురు కొడుకులున్నారమ్మా" అన్నాడు. మా అమ్మ నివ్వెరపోయింది. "నీవు చేసిన పని న్యాయమేనా? అది కాదు అన్నయ్యా! అమ్మాయి పెళ్ళి సంబంధాన్ని నేరుగా తీసుకెళ్ళి తాడేపల్లి వారమ్మాయికి కుదిర్చావు అనే కోపంగా అలా అన్నానన్నయ్యా" అన్నది కోపంగా, ఈ కథ గుర్తుకు వచ్చినపుడల్లా విపరీతంగా నవ్వు వస్తున్నది ఈ నాటికీ.

# 4. నాటకాలు, పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు

బాపట్లలో పెళ్ళి తర్వాత – పెద్దమనిషినయ్యాక – 6వ క్లాసుతో మళ్ళీ చదువు ప్రారంభించాను. అప్పుడు చదువు మీద, ఇంగ్లీషు మీద కొంత శ్రద్ధ పెరిగింది. క్లాసు ఫస్ట్ రావాలని పోటీలు పడే వాళ్ళల్లో నేనూ వున్నాను. ఆ సందర్భంలో స్త్రీ హితైషిణి మండల ఆర్గనైజర్సు ఆడపిల్లలకు పరుగుపందాలు, పాటలు పాడటం, సంగీతం, వక్తృత్వం, వ్యాస రచన

మొదలైన వాటిలో పోటీలు పెట్టి గెలిచిన వారికి 'ప్రైజులు' ఇస్తున్నారని తెలిసి మా స్నేహితులు నన్ను కూడా అక్కడికి తీసుకెళ్ళారు. అక్కడ పూసల సంచీలు, కుట్లు, అల్లికలు, సిగరెట్ పెట్టెలతో రకరకాల జంతువుల బొమ్మలు చేయడం, అద్దాలు కుట్టటం, రిబ్బన్లతో పువ్వులు చెయ్యటం లాంటి అనేక రకాల చేతి పనులు నేర్పించేవారు. అలా తయారుచేసిన వాటిని అమ్మి ఆ డబ్బును మండలికి జమకట్టేవారు. వార్షికోత్సవాలలో నాటకాలు వెయ్యడం, బుజ్జి కథలు చెప్పటం, గొబ్బి పాటలు పాడటం, డాన్సులు చెయ్యటం లాంటి వాటిలో పాల్గొని బహుమతులు గెల్చుకునే వాళ్ళం. వెండి భరిణలు, మెడల్సు, పుస్తకాలు ముఖ్యంగా బొమ్మలు ఆడపిల్లలకు ఇచ్చేవారు. నాటకాలలో రామదాసు, సారంగధరుడు, హరిశ్చంద్రుడు, సత్యవంతుడు, ధృవుడు, తానీషాలాంటి పాత్రలు నాకు ఇచ్చేవాళ్ళు. పద్యాలు, పోర్షన్సు బాగా అప్పజెప్పేదాన్ని. వేషాలు వేయటమే కాక మేకప్పులు చేయడం, కర్టెన్లు కట్టటం అన్నీ మేమే చేసే వాళ్ళం. అదోకరకమైన వినోదం, అనుభూతితో కూడిన ఆనందం కలిగేది.

ఆ రోజుల్లో సరదాకో, పేరుకో తోటి పిల్లలతో పోటీలు పడి ఏ పెన్సిలు ముక్కో, మరేదో ఏదైనా సరే ప్రైజుగా పొందితే పరమానందంగా, మేరు పర్వతం ఎక్కినట్లుగా వుండేది. ఆ నాటకాల్లో 'బైహార్టు' చేసి చెప్పి నటించిన నేను క్రమేపీ 'ప్రాంప్టింగు' చేసేవరకు ఎదగగలిగాను అంటే అంతో ఇంతో కళా పిపాస, గొప్పదాన్ని కావాలనే ఆకాంక్ష వుండేదన్న మాట. ఆ విలువలు ఆనాడు తెలియక పోయినా పది పన్నెండేళ్ళకే నాలో వ్యక్తిత్వ వికాస బీజాలు పడ్డాయన్న మాట. పరిస్థితుల ప్రాబల్యంవల్ల తరువాత అణగారిపోయినా తిరిగి 30వ ఏట నుండి మళ్ళీ ఆ అభిరుచి మొలకెత్తి, విజృంభించి ఉపన్యాసకురాలిగా, రచయితగా, సంస్కరణ వాదిగా సంస్థ నిర్మాతగా మలచబడ్డాను.

హైద్రాబాద్ సోషల్ వర్కర్సు శిక్షణా కాలంలో వక్తృత్వం, మ్యూజికల్ చైర్సు, రింగు, టెన్నీసు, కేరమ్సు లాంటి ఆటలో పాల్గొనడం జరిగింది. ఈ కాలంలో అనుభూతి కేవలం విజ్ఞాన దాయకం. వయః పరిపక్వతవల్ల నేటి స్వరూప స్వభావాలే వేరుగా వుండేవి.

ఏది ఏమైనా ఒక వ్యక్తిలో ఒక కళ వికసించింది అంటే అది వంశానుగతం కావచ్చు. పరిసరాల ప్రాబల్యం వల్ల కావచ్చు. ప్రోద్బలంవల్ల కావచ్చు. ఇలా దానికి అనేక కారణాలు వుంటాయి. నా విషయంలో పెళ్ళి అయ్యాక కొంత పరిపక్వతతో చదివిన చదువువల్లా, స్త్రీ హితైషిణీ మండలి కార్యక్రమాలలో పాల్గొనడం వల్ల నాలో ప్రాతిపదికలు పడ్డాయని నేను నమ్ముతున్నాను.

# 5. మెట్టినిల్లు

గోపాల కృష్ణమూర్తి 1943లో పుట్టాడు. 1946 ఏప్రిల్ లో మామగారు రిటైరయినారు. మేమే ఇంటిపనులు అన్నీ చేసుకోవాలి. దానికి తోడు మా అత్తగారి ఆచారం. పని మనిషిని పెట్టుకునేది కాదు. పిల్లల జబ్బులు, నోములు, వ్రతాలు, ఉపవాసాలు, మడి వంటలతో హారతి కర్పూరంలా కరిగిపోయేది నా జీవితం. స్వాముల వార్లు, వారికి బిక్షలు, గురువులు, శాస్త్రుల్లు గారు, పురాణ శ్రవణాలు వీరితో మా ఇల్లు ఒక ఆశ్రమంగా భాసించేది. ఆమె ఏది చెబితే అది చేయటమే నా పని. ఏ తప్పు చేసినా సాధించేది. ఎంత మడిగా చేసినా ఏదో ఒకటి అనేది. అస్తమానం కోపంతో మండిపోయేది. అయితే ఒక తిట్టు అయినా తిట్టేది కాదు. నన్ను తిడితే తన వంశ క్షయమని ఆమెకు భయం. అంతేకాని నా పనులు నచ్చికాదు. ఒక్కొక్కపుడు చాలా ప్రేమగా చూచేది. వేడి అన్నం నాకు పెట్టి చద్ది అన్నం, మిగిలినవి తాను తినేది. నాకు క్రొత్త బట్టలిచ్చి తాను నా పాత చీరెలు కట్టుకొని తిరిగేది. ఒకనాడు వున్నట్లుండి తన బంగారం యావత్తూ – 150 నవర్సుల ఆభరణాలు – పళ్ళెంలో పెట్టి నాకు బొట్టు పెట్టి సువర్ణ దానంచేసి పుణ్యం సంపాదించాననుకొని తృప్తిపడింది. ఆమెకు రెండు రకాల మనస్తత్వం ఉండేది. ఒకప్పుడు అతి ప్రేమ, మరుక్షణంలో అతి సాధింపు. భరించనలవి కాని బాధ పెట్టేది. చాకిరి అంతా చాలా భాగం తనుచేసేది. నా పిల్లలను తన పంచప్రాణాలుగా చూచుకునేది. వాళ్ళ కోసం రకరకాల పిండివంటలు చేసేది. ఎంత అల్లరి చేసినా ఊరుకునేది: ఏమికావాలన్నా ఇచ్చేది.

ఇక్కడ ఒక చిన్న సంఘటనను గురించి ముచ్చటించాలి. నాకు ఒక్కగా నొక్క అమ్మాయి. ఆమె అంటే అందరూ చాలా ప్రేమగా, గారాబంగా చూచే వాళ్ళం. మా రోజుల్లో ముట్లకు, పురుళ్ళకు వేరే గదులు కట్టించే వాళ్ళు. అంటే ఆ సమయాల్లో ఎవరికంటా పడరాదు. స్నానం రోజున కూడా మడి గదిలోకి రాకూడదు. అలా వస్తే మా అమ్మమ్మ అన్నం విడిచి పొయ్యేది. బ్రాహ్మణ్ణి పిలిచి ఇంటికి సంప్రోక్షణ చేయించేది, పుణ్యాహవచనం చేయించేది. అవి ఆనాటి ఆచారాలు. అప్పుడు నా కుమార్తె ఎం.బి.బి.ఎస్. చదువుతున్నది. సెలవులకు ఇంటికి వచ్చిన ఆమె బహిష్టు అయి దూరంగా కుర్చీలో కూర్చుని చదువుకుంటున్నది. ఆ రోజుల్లో సీలింగుకు బొంగులు వ్రేలాడతీసి మడి బట్టలు ఆరేసే వాళ్ళం. అలా ఆరేసిన బట్ట నూలుపోగు ఈ పిల్ల నెత్తికి తగిలింది. అది చూచిన మా అత్తగారు భద్రకాళి రూపం తాల్చి నన్ను నానా మాటలు అన్నది. తప్పు చేసింది మనవరాలు అయితే నన్ను ఎందుకిలా వేధించాలి? మరి రక్త సంబంధాన్ని కున్న విలువ అంత కాబోలు! కొన్ని విషయాల్లో అండదండలు వుండి సుఖపడ్డాకాని అనేక విషయాలలో మహా వేధించేది. ముప్పతిప్పలు పెట్టి మూడు చెరువుల నీళ్ళు త్రాగించేది. ఆమెతో అనుభవించిన సుఖం కన్నా బాధలే మిక్కుటంగా వుండేవి. అయినా

ఒక్క కోడలిననే బాధ్యతతో 40 ఏళ్ళు భరించి ఆమెను దాటించాను.

## సంప్రదాయాల బలిమి

నాటికి నేటికి నా అనారోగ్యానికి కారణమయిన ఒక మూఢ విశ్వాస కథ చెప్తాను. నా మూడో కాన్పుకు, నాలుగవ పిల్లకు మధ్య ఒక కడుపొచ్చి నెల రోజులు రక్తస్రావమయింది. రాను రాను పెరిగి చివరికి పాదముద్రలు పడేదాకా పెరిగింది. అప్పుడు డా? సుశీలమ్మ లాభం లేదు కడుపు తీసేద్దామని హెచ్చరించింది. మా అత్తగారు ఇంటా వంటా ఎరుగుదుమా వీల్లేదని కళ్ళనీళ్ళ దాకా వెళ్ళింది. పడుకోబెట్టి నాకు సకల పరిచర్యలూ చేసేది. ఆ బట్టలన్నీ వుతికి ఆరవేసేది. చక్కగా వండి పెట్టేది. ఆ రోజుల్లో 5 రూ॥లు ఇంజక్షన్ రోజూ ఇప్పించేది. కాని భ్రూణ హత్య మహాపాపమని, వంశ క్షయమని నమ్మిన ఆమె గర్భస్రావానికి మాత్రం అంగీకరించలేదు. మరో ఇరవైరోజులు ఇలాగే గడిచింది. అయినా తగ్గ లేదు. మా అన్నయ్య డాక్టరు పాసయ్యాడు. మా తమ్ముడి పెళ్ళికి పిలవటానికి వచ్చాడు. రాగానే మంచంమీద నుండి లేచి కూర్చున్నాను. వెంటనే భళ్ళున స్రవించిన రక్తం బొట్లుగా క్రిందపడి ప్రవహిస్తుంది. మా అన్నయ్య రామ్మూర్తిగారిని బైటకు తీసుకెళ్ళి వెంటనే డాక్టరును పట్టుకొచ్చి గర్భస్రావం చేయించాడు. తెల్లారేసరికి రక్తస్రావం ఆగిపోయింది. ఇంక మొదలయింది మా అత్తగారి ఆగ్రహం. ఆమె రౌద్రాకారం చూచి తట్టుకోలేక పెళ్ళికి రమ్మని చెప్పి మా అన్నయ్య వెంటనే వెళ్ళిపోయాడు. నాకు అన్నం లేదు. నాతో మాటా పలుకులేదు. శవాకారమయి పొయ్యాను. మంచం క్రింద హార్లిక్సు వుంటే చెంబులో ఉప్పు నీళ్ళలో కలుపుకొని త్రాగి పడుకున్నాను. ఆ తర్వాత ఘోర హత్యచేసిన వాణ్ణి శిక్షించినట్లు నన్ను పలకరించే వారు అన్నం పెట్టేవారు కరువయ్యారు. రోడ్డు మీద ఇడ్లీ వాడు పోతుంటే వెళ్ళి తెచ్చుకు తిన్నానని నానా హంగామా చేసింది మా అత్తగారు. తట్టుకోలేక, శవాకారంగా మారిన నేను పుట్టింటికి పెళ్ళికనే వంకతో వెళ్ళాను. రామ్మూర్తిగారికి అప్పుడు టైఫాయిడ్ వచ్చి చావు తప్పి కన్ను లొట్టపోయి బ్రతికిన వెంటనే నాకీ విపత్తు జరిగింది. ఆయన నాకు సహాయం చేయలేరు. నేను అక్కడ వుండి భరించలేక చాటుగా వెళ్ళాను. ఆ సమయంలో ఆయనను వదిలి వెళ్ళటానికి నేను పడ్డ బాధ వర్ణనాతీతం. కాని పెళ్ళికెళ్ళిందనే అపకీర్తి మాత్రం మిగిలిపోయింది.

ఇంక మా అత్త విశ్వరూపం దాల్చింది. పెళ్ళికెళ్ళాలని కడుపు తీయించుకున్నానని తన మాట వినలేదని నామీద కక్షకట్టి నానా హింస పెట్టింది కాని నా చావు ప్రమాదం కూడా పట్టించుకోలేదు ఆమె. మరో పది రోజులయితే నిజంగానే చచ్చేదాన్ని. ముఖ్యంగా చెప్పేదేమిటంటే బొమికెలు, చర్మంతో మిగిలిన నేను రెండు నెలలకల్లా పర్వతాకారమై పొయ్యాను. అది వాపో, బలుపో తెలియదుకాని నాటికీ నేటికీ నావళ్ళు మళ్ళీ తగ్గనేలేదు. ఎన్నో సార్లు 'డైటింగ్, చేసినా పది కిలోలు తగ్గటం మళ్ళీ 15 కిలోలు పెరగటం

పరిపాటి అయింది. దీనికంతకూ కారణం ఆనాటి మూఢ విశ్వాసమే నన్ను బలిగొన్నది అన్న ఆ బాధఈనాటికి నన్ను వేధిస్తూనే వున్నది. ఇలాంటివి లెక్కకు మిక్కుటంగా వుండేవి. తీరిగ్గా కూర్చొని ఒకనాడు ఆలోచించి అసలు ఈ పనులన్ని భయంవల్ల చేస్తున్నామా? నమ్మకంతో చేస్తున్నామా? నమ్మకం అయితే పూర్వ జన్మకర్మను కూడా నమ్మాలి. అదే నిజమయితే పురుష ప్రయత్నం అనవసరం. విధి ఎలా వుంటే అలా జరుగుతుంది. అంతా దైవేచ్ఛ. విధి కర్మాను సారిణి అని నమ్మినప్పుడు, మన ప్రయత్నాలు, పూజలు, ముడుపులు, తాయెత్తులూ, తలనీలాలు ఇవ్వడంలాంటివన్నీ శుద్ధ దండుగ కాదా? మా అత్తగారు ప్రతి విపత్తుకూ తిరుపతి వెళ్ళి జుట్టు తీయించి దేముడికి ఇచ్చి వస్తూ వుండేది. చిన్నప్పుడు కొడుక్కు జబ్బు నయమయితే కుడి చెయ్యి ముడుపు కట్టి ఎడం చేత్తో అన్నం తింటానని మొక్కు కున్నదిట. ఎవరన్నా అలా తింటావేం అని అడిగితే లేచిపోయేది. ఒకవైపు 'అహంబ్రహ్మాస్మి ఏకమేవా ద్వితీయ బ్రహ్మ' మరో వైపు 'యదృశ్యం తన్నశ్యం' అంటూ వుపన్యాసాలు చెప్పేది వేదాంతిలా. మళ్ళీ కర్మను నమ్మేది. అంటే శ్రమ, ఖర్చు తప్ప పిల్లలు పుట్టటానికి, జబ్బులు తగ్గటానికి మన ప్రయాస ప్రయత్నాలు శుద్ధ దండుగ అని తేలిపోయింది. కనుక ఇవన్నీ భక్తివల్ల కాదని భయంతో చేసే పనులని తెలిసింది. అయితే, ఎందుకు చేస్తున్నాం అంటే అనాలోచన, అజ్ఞానం, పెద్దల వత్తిడి, తరతరాల వారసత్వం లాగా, కారణాలు కన్పిస్తున్నాయి. కాని అవి మనని ఉద్ధరించకపోగా జీవితాలనే సర్వనాశనం చేస్తున్నాయనే జ్ఞానోదయం నాకు కలిగే నాటికి చాలా కాలం గడిచిపోయింది.

## నా భర్త నిర్లిప్తత – నా ఊహాపోహలు

పెళ్ళికి ముందూ, తర్వాత కూడా మాటామంతీ లేనిది మా దాంపత్యం. నేను కాపురానికి పోకముందు పుట్టింట్లో ఉన్నప్పుడు 1935 నుండి 1937 మే వరకు నా భర్త రామ్మూర్తిగారు బాపట్ల వస్తూ పోతూ వుండేవారు. ఆయన మేనమామల వూరు బాపట్ల, ఆ వూళ్ళోనే చదువుకున్నారు, మేనమామ 1924 లోనే చనిపోయినా తరువాత బాపట్లకు శెలవుల్లో వస్తూ పోతూ వుండేవారు. పెండ్లి అయిన తర్వాత మా ఇంటికి వచ్చేవారు. కాని నాతో మాట్లాడిన పాపాన పోలేదు. నాకు కానుకలు, బహుమతులు తేలేదు. మా వాళ్ళ విషయం చెప్పనక్కరలేదు. ఫలహారం కూడా నా చేత పంపించి ఎరుగదు మా అమ్మ. అప్పటికే నేను రజస్వల అయి ఉండటాన భార్యా భర్త, మాటా మంతీలోకి దిగితే ఏమి ప్రమాదం ముంచుకొస్తుందో అని భయం కాబోలు. ఆ రోజుల్లో పునస్సంధానం అయ్యేవరకు భార్యా భర్తలను దూరంగా వుంచేవారు. అందువల్ల అసలు ఆయనకు నామీద ఎలాంటి అభిప్రాయం వుందో కూడా తెలియదు.

నా స్నేహితురాండ్ర భర్తలు తమ భార్యలతో ఛలోక్తులతో మాట్లాడేవారు. చీరలు, రవికలు తీసుకొని రాకపోయినా ఫేస్ పౌడరు డబ్బాలు, క్రీములు, రిబ్బన్లు, పిన్నులు

ఇలాంటివి తెచ్చి భార్యలకు బహుమతులుగా ఇచ్చేవారు. నాకూ అలాగే నా భర్త తేవాలని కోరిక వుండేది. అయితే అది మనసులోనే ఆగిపోయేది. నేనుగా పలకరించటానికి సిగ్గు, ఆయన పలకరించకపోయె. ఇక సంభాషణకు, సాంగత్యానికి, సన్నిహితత్వానికి తావేదీ? అసలే ఆయన పెండ్లి చూపులకు రాలేదు. ఆయనకు మాటలు వచ్చా, సరసుడేనా, నా పై వైముఖ్యమా అని నా మనసు పరిపరి విధాల పోయేది. ఆయన వైఖరి నాకు అగమ్య గోచరంగా వుండేది. వయస్సు పదకొండు, పన్నెండు సంవత్సరాలు అయినా ఊహలు ఆకాశాన్ని అంటేవి. అందులో ఆడపిల్లల సంగతి ఇటువంటి విషయాలలో చెప్పనక్కరలేదు. ఏదయినా చేయగల్గింది లేదని మనస్సు చిక్కబట్టు కొని ధైర్యం చెప్పుకున్నాను. ఆశ నిరాశల మధ్య కొట్టు మిట్టాడుతూ పతిని చేరే సమయం ఎప్పుడు వస్తుందా అని ఎదురు చూస్తూ కాలం గడిపేదాన్ని.

ఇప్పుడొక సంగతి పాఠకుల దృష్టికి తేవటం ముఖ్యం. నా పెళ్ళినాటి రోజుల్లో వివాహ వ్యవస్థ చాలా అస్తవ్యస్తంగా వుండేది. వధువుకు 8 ఏళ్ళయితే వరుడికి 30 ఏళ్ళు వుండేవి. ఆమె ఈడేరేనాటికి అతని కోర్కెలు ఈడేరేవి. మేనరికాలలాంటి పెళ్ళిళ్ళయితే ఆస్తులు, అనురాగాలు దూరం కావని అలా చేసేవారు. పైగా అమ్మాయి అబ్బాయిల ఈడూ జోడూ లాంటి వాటి వూసే వుండేది కాదు. గుణగణాలు, లక్ష్యాలు, ఆదర్శాలు గురించిన ఆలోచనలు అసలె వుండవు. ఇక ఒండొరుల ఇష్టా అయిష్టాల ప్రసక్తి అసలే లేదు. ఇంక ఎంపికలు, కలయికలు, ముద్దూ ముచ్చట్లు ఎలా సాధ్యమవుతాయి? ఒకవేళ చాటుగా మాట్లాడితే కాళ్ళు విరగొట్టి గదిలో బంధించేవారు. గర్భాదానానికి తిథి, నక్షత్రం, వర్షం, వారం, ఒకటేమిటీ మళ్ళీ పెళ్ళి అంత తతంగం వుండేది. ఆ 'టైములో గర్భం వస్తే మహారాజు లక్షణాలతో మహా జాతకుడు జన్మిస్తాడని పెద్దవాళ్ళ ఆశయం. అసలు ఐదు నిమిషాల్లో, ఇద్దరికీ పరిచయం అయి ఆ పైన కోర్కెలు తీరి గర్భం ఎలా వస్తుందో! ఇలాంటి ఊహాపోహలు కుటుంబ పెద్దలకు వుండటం హాస్యాస్పదం.

ఆ కాలాన్ని, కుటుంబాల పరిస్థితుల్ని బట్టి రామ్మూర్తిగారు అలా నిర్లిప్తంగా వున్నారని తోస్తున్నది.

## మా దంపతుల మధ్య సఖ్యత సామరస్యతలు

సమాజంలో ఏ దంపతుల లక్షణం వారిది. ఏ జంట విధానం వారిది. ఒకరిని పోలిన జంట మరొకటి వుండదు. ప్రతి జంటలో ఒక ప్రత్యేక విశిష్టత వుంటుంది. అది అనుభవైక వేద్యం. కొందరెప్పుడూ నవ్వుతూ కళకళలాడుతూ హుషారుగా వుంటారు. కొందరెప్పుడూ కీచులాడు కుంటూ వుంటారు. సర్దుకుపొయ్యేవారు కొందరయితే బీభత్సాన్ని సృష్టించేవారు మరెందరో వున్నారు. ఒకరికి భార్యమీద మోజు వుంటే మరొకరు అవసరాన్ని

తీర్చుకుంటూ వాడుకుంటూ రకరకాలయిన అత్యాచారాలు జరుపుతూ అధికారాన్ని చలాయిస్తారు. భార్యా విధేయులై సంచరించేవారు కూడా లేకపోలేదు. ఆమెకు సకల సపర్యలు చేస్తూ బాధలు పెట్టేవారు కూడా అక్కడక్కడా వుంటూనే వున్నారు. అలా రకరకాలయిన వైవిధ్యంతో కూడిన దాంపత్య జీవితాన్ని గడిపే వారున్నారు. ఇక కుటుంబ కలహాలతో సంసార భారంతో కృంగి కృశించిపోయి చావలేక బ్రతికేవారు హెచ్చు సంఖ్యలోనే వున్నారు. బైటికి చెప్పుకోలేక, లోపల దాచుకోలేక, అంటే మ్రింగలేక, కక్కలేక జీవితాన్ని ఈడ్చుకెళ్ళే వాళ్ళు మనకు దర్శనమిస్తూనే వుంటారు.

అందువల్ల జీవిత చరిత్ర రాసేటప్పుడు నా దాంపత్య జీవితం గురించి నా సహచరునితో నా జీవితం ఎలా పెనవేసుకున్నదో చెప్పక తప్పదు. ఎన్నో రంగాలలో ఇద్దరం కలిసి పనిచెయ్యటం జరిగింది. అందులో ఎన్నో వసంతాలు గడిచాయి. మరెన్నో మనస్తాపాలు చోటు చేసుకున్నాయి. ఎన్నో చర్చలు, పేచీలు, పంతాలు, పట్టింపులు పనిచేశాయి. త్యాగాలు చేశాం. కొన్నిసార్లు ఆత్మాభిమానం దెబ్బతిని తీవ్ర స్థితికి పోయే పరిస్థితులొచ్చాయి. ఒక ఇంట్లో వుంటూ ప్రేమాభిమానాలు పెనగొన్నా, ఆప్యాయతలు త్యాగాలు ఎన్ని వున్నా ఒక్కటేగా ఒకేరకంగా ఎలా వుండగలము? ఎవరి అభిరుచులు, ఆలోచనలు వారివే. మౌలికంగా అభిమానం వుండబట్టే పేచీలెన్ని వచ్చినా గ్రహణంలా విడిపోయ్యేవి. ఒక్క మూసలో దిగిన నమూనాలం కాదు కదా! అందులో యిద్దరం వ్యక్తిత్వం కలవారం. ఇద్దరం ఆలోచించగలవారమే కదా! గ్రహణశక్తి, సమాజాన్ని గురించి స్పష్టమయిన అవగాహన కలవారం. వ్యక్తి స్వేచ్ఛ సమానతలు కోరేవాళ్ళం. ఆ విధి నిర్వహణలో అంతో ఇంతో ప్రచారం చేస్తున్న వాళ్ళం. అందుకే అహరహం శ్రమిస్తున్న వాళ్ళం. అది లేని జీవితం ఎడారివంటిదని భావించే వాళ్ళం. కనుక మాకూ ఆ పేచీ సందర్భాలు వుంటాయని భావించటంలో తప్పు లేదు. అభిప్రాయాల తేడాలు కూడా తల ఎత్తుతాయి. అందువల్ల కొన్ని ఇబ్బందులు వస్తాయి. అలా వస్తున్నాయి కూడా. అవి స్వేచ్ఛా జీవిత విధానంలో వచ్చే లక్షణాలు. ఆ విషయ గ్రహణ పారీణత కలవారం కనుక స్వేచ్ఛా విలువలను తెలిసినవారం కనుకే ఒకరిపై ఒకరు పెత్తనం సాగించకుండా అణచివేతను వ్యతిరేకిస్తూ, లొంగుబాటు లేకుండా

అభిప్రాయ భేదాన్ని, వ్యతిరేకతను కూడ గౌరవిస్తూ ఒకరి హక్కులను మరొకరం కాలరాయకుండా రక్షించుకుంటూ జీవిత రథాన్ని నడిపిస్తున్నాం. ఈ కార్యాచరణలో అనేక ఇబ్బందులు సమస్యలు రాకపోలేదు. వచ్చాయి, వస్తాయి కూడా. వచ్చినా ఒకరికి మరొకరం అడ్డు వచ్చే వాళ్ళం కాదు. అయితే అంత మాత్రాన ముఖ్యాంశాలలో విబేధాలొస్తే సర్దుకుపోయే ప్రశ్న లేదు" అసలు అభిప్రాయ విబేధాలు లేవంటే అందులో ఎవరో ఒకళ్ళు వ్యక్తిత్వం లేకుండా లొంగుబాటు చూపుతారని నా అభిప్రాయం. చాలా ముఖ్య విషయాలలో మా అభిప్రాయాలు ఏకీకృతం కావటం ఒక విధంగా అదృష్టమనే

చెప్పాలి. మొదటి నుంచి తను మాత్రం పెళ్ళి నాటికే కాంగ్రెస్, తరువాత కమ్యూనిస్టు ఆ తరువాత రాడికల్ హ్యూమనిష్టుగా పరిఢవిల్లటం జరిగింది. నేను మాత్రం మొదట్లో సనాతనిస్టుగా వుండేదాన్ని. ఆ తరువాత ఎన్ని ఆటుపోట్లు మరెన్నో సుడిగుండాలు అధిగమించగలిగానంటే అదంతా ఎం.వి.ఆర్. సహకారం వల్లనే అనేది కాదనలేని నిజం.

ఎన్ని చెప్పినా, ఎంత చేసినా ఎంతటి విప్లవాత్మక భావాలు వున్నా మరెంతో కాలం సాహచర్యం సాగించినా అనుభవాలు, అనుభూతులు ఎవరివి వారివే అనేది పచ్చి నిజం. అందువల్లే ఏకత్వంలో అనేకత్వం, అనేకత్వంలో ఏకత్వం అనే విశిష్టత మా దాంపత్యంలో నిండి వున్నదనేది సత్యం.

## మా దాంపత్య జీవితం – మరో కోణం

నా దాంపత్య జీవితాన్ని మరో కోణం నుండి పరిశీలించవచ్చు. 1937 నుండి 1940 దాకా గుంటూరులో రామ్మూర్తి గారి బి.ఏ చదువు తరువాత తెనాలిలో మకాం. ఒకరకంగా ఆయన ఇంటిపట్టున వున్నట్లే. కాగా 1940 జూన్ లో బెనారస్ లో చేరారు. అంటే శలవల్లో చుట్టం చూపుగా వచ్చేవారన్నమాట. 1942 ఏప్రిల్ లో చదువు పూర్తి చేసుకొని ఇంటికి చేరారు. దీనిని ఒక దశగా గుర్తించవచ్చు. 1942 ఆగస్టు నుండి ఆంధ్రప్రదేశ్ లో రాడికల్ డెమోక్రటిక్ పార్టీలో కార్యకర్తగా, నాయకులుగా చెలామణీ అయ్యారు.

జిల్లా అంతటా పర్యటన చేసేవారు. పేరుకు ప్లీడరు వాస్తవానికి పార్టీలో పూర్తి కాలం వినియోగించటం జరిగేది. 1947 ఆగస్టు వరకు సంపాదన లేదు, రాజకీయమే వారి వృత్తి. ఈ దశలో నాలో సహనం నశించి పోసాగింది.

## అస్థిరత

మామగారు 1946లో రిటైరయినాడు. అందువల్ల వారి సంపాదన నెలకు 300 రూ॥ లు పై చిలుక నుండి పింఛను నెలకు 127 రూపాయలకు పడిపోయింది. నా ప్రోద్బలం మీద మామగారు గుంటూరులో ఇల్లు కట్టడంతో చేతిలో పైకం లేకపోయింది. ఇట్టి పరిస్థితులలో నా భర్త ఏమీ సంపాదించకుండా మామగారి సంపాదన పై బ్రతకటం అన్యాయమని నాకు తోచింది. అంతేగాక అత్తగారి విసుగును, చికాకును భరించడం నాకు కష్టమయింది. అందువల్ల సంపాదన లోకి దిగమని నా భర్తను అభ్యర్థించాను. ఇంతలో స్వరాజ్యం రావటం ఖాయమని, కాంగ్రెస్ అధికారంలోకి రావడం తథ్యమని తేలిపోతున్నది. ఆ సమయంలో రేపల్లెలో తన ఆఫీసును నిర్వహించమని తన స్నేహితుడు రామ్మూర్తిగారిని కోరాడు. సంపాదన ధ్యాసలో పడిపోతాడని అత్తమామలు ఇష్టపడ్డారు.

నేను ఎగిరి గంతేశాను. రేపల్లే పోదామన్నాను. అప్పటికి ఇద్దరు మగ

పిల్లలు. సరేనన్నారు నా భర్త. 1947లో రేపల్లె చేరాము. రేపల్లె జీవితంలో కొంత కాలం ఉన్నంతలో హాయిగా జీవించాను. ఆడపిల్ల తల్లిని కావాలని ఆశపడి గర్భవతినయినాను. 1948 ఫిబ్రవరిలో నా అన్న డా॥ వెంకటేశ్వర్లు మరణించాడు. నా అన్నకు నాకు సన్నిహితత్వం ఉండేది. అతని మరణంతో నా మనస్సు వికలమయింది. పైగా నా భర్త ప్లీడరు వృత్తి కూడా లాభసాటి కాకపోయింది. ఆయనకు మన్నన మర్యాదలు లభించినా సంపాదన లేనట్లే అయింది. తిరిగి గుంటూరు వెళ్దామనుకున్నాం. పైగా నేను చూలాలిని. 1948 జనవరి 30న గాంధీని హత్య చేశారని నా మనస్సు వికలమయింది. ఆ వూరు వదలాలనిపించింది. రేపల్లెను 1948 ఏప్రియల్ చివరిలో వదలి గుంటూరులో 1948 వేసవి శెలవుల అనంతరం మరల కాపురం పెట్టాము. 1948 మే లో మూడవ అబ్బాయి పుట్టాడు. వెంకటేశ్వర్లు అని మా అన్నయ్య పేరు పెట్టుకున్నాను. కుటుంబ నియంత్రణాన్ని పాటించమని గత రెండేళ్ళుగా ఆయన చెప్తున్నా నా ఆలోచన వేరుగా వుండేది. 1949 సెప్టెంబరులో నాకు ఆడపిల్ల పుట్టింది. అత్తమామలు సంతోషించారు. నాకు కొంత సంతృప్తి కలిగింది. కాని మరో మనోవ్యధ. భర్త ప్లీడరు వృత్తిలో స్థిరపడలేదు. సంపాదన లేదు. ఇది బాధకరంగా తోచేది.

## నా తండ్రి హఠాన్మరణం : మా బాపట్ల నివాసం:

అది 1950 ఆగస్టు 12వ తేదీ, మా నాన్న పొయ్యాడనే వార్త రాగానే ఇద్దరం పిల్లల్ని తీసుకొని ఆ రాత్రికే చేరాం. దహన క్రియలు జరిగాక మా అమ్మ పెద్ద ప్రాక్టీసు పాడయిపోతుందని అల్లుడు నిలబెట్టుకుంటే బాగుంటుందని అన్నది నాతో. నా పట్టుదల, ప్రోద్బలంతో కట్టిన గుంటూరు ఇల్లు వదలలేక అది నాకంతగా రుచించలేదు. కాని అప్పటి పెద్దలు అదొక అవకాశమని చెప్పారు. రామ్మూర్తిగారు అంగీకరించారు. అప్పటికి నలుగురు పిల్లలు పుట్టారు. వారి చదువులు, ఇతర ఖర్చులు చాలా పెరగటం వల్ల బాపట్ల వెళ్ళటానికి సిద్ధమయినాము. బాపట్లలో అద్దె ఇంట్లో చేరాము. తమాషా ఏమంటే నాదంటూ ఒక ఇల్లు – అద్దె ఇల్లేననుకోండి – మరల ఏర్పడింది. బాపట్లలో ఒక రకంగా ఆయనకు నష్టదాయకమయింది. నాకు మరో విధంగా లాభించింది. 1951 నుండి 1954 వరకు నా జీవితంలో మరో దశ ప్రారంభమయింది. 1954 నుండి 1972 వరకు మరో మజిలీ. 1954 నాటికి మా అత్తగారి భావాలను విడనాడి రామ్మూర్తిగారి సిద్ధాంతాలవైపు మొగ్గు చూపాను. తద్వారా భార్యా భర్తల అనుబంధం ఎంతో గట్టిపడింది. బాపట్లలో అర ఎకరం స్థలం కొని 3000 చదరపు అడుగుల ఇల్లు ఆధునిక రీతిలో కట్టించుకొని అందులో 1961 నుండి 1970 వరకు పది ఏళ్ళు వున్నాం. ప్రకాశం జిల్లా ఏర్పడింది. చీరాలలో సబ్' కోర్టు వచ్చింది. రామ్మూర్తిగారికి ఆ

ప్రాంతపు క్లయింట్లు ఎక్కువ. అందువల్ల 1970 డిశంబరు నుండి 1973 మే వరకు చీరాలలో కాపురం వున్నాం. 1972 చివరి వరకు వడిదుడుకులు లేని జీవితం సాగిస్తుండగా ఆంధ్ర తెలంగాణ స్పర్థలు ప్రారంభమయి అది మా దాకా వచ్చింది. ఆంధ్రోద్యమంలో నేను ముందుకు దూకాను. నాకు తాలూకా నాయకత్వం వచ్చింది. రామ్మూర్తి గారికి రాష్ట్ర స్థాయి నాయకత్వం లభించింది. 1972 డిశెంబరు మండి 1973 మే వరకు ఆయన కార్యస్థానం విజయవాడ. 1973లో ఆయన ఆంధ్ర ప్రాంత పర్యటన చేస్తే నేమా వెళ్ళి జిల్లాలూ, తాలుకాలూ అన్నీ తిరిగి ప్రత్యేక రాష్ట్ర ఆవశ్యకత గురించి ఉపన్యసించాను. ఆ సందర్భంలో అనేక మహిళా సంఘాలలో మహిళోద్యమం పై ప్రసంగించడం జరిగింది. 1973 మే నుండి 1976 జూన్ వరకు విజయవాడలో అద్దె ఇంట్లో కాపురం చేశాము. 1973 మేలో నా ప్రోద్బలం మీద రామ్మూర్తిగారు ప్లీడరీ మానుకున్నారు. ఇద్దరం ఉద్యమాలలో పూర్తి కాలాన్ని వినియోగించడం మొదలు పెట్టాము. పూర్తిగా కామ్రేడ్సం అయ్యాము. 1975 జూన్ నుండి 1976 ఆఖరు వరకు ఎమర్జన్సీలో అరెస్టయి ఎం.వి.ఆర్. జైలు జీవితం గడిపారు. ఆయన ఎమర్జెన్సీ డెటిన్యూ. కొన్నాళు ళ ధైర్యంగా ఉన్నా రాను రాను స్థయిర్యం సడలింది. ధృతి నశింప సాగింది. ఆ తర్వాత ఒవేరియన్ సిస్ట్ పుట్టింది. ఆపరేషన్ అవసరమయింది. ఆయన 1976 ఏప్రిల్ 1న పేరోలు మీద వచ్చారు. వారి విడుదలకు ఏప్రిల్ 8వ తేదీన ఉత్తరువు ఇచ్చింది.

ఆయన తన కార్యక్రమాలు మానలేదు. మరల అరెస్టు ఎప్పుడు వస్తుందోనని భయం. నా ఆరోగ్యం ఒక చెంప బాధిస్తున్నది. నా సౌకర్యార్థం అంటే ఆయనను మళ్ళీ జైలులో పెడ్తే రాజమండ్రి జైలుకి తీసుకుని వెళతారని నేను వెళ్ళి చూడటానికి ఇబ్బంది అని తోచి హైదరాబాద్ లో స్వంత ఇంటిని ఖాళీ చేయించి రహస్యంగా 1976 డిశెంబరు 31 రాత్రి హైదరాబాద్ చేరాము. అప్పటి నుండి హైదరాబాద్ మా నివాస స్థానం అయింది. ఎడబాటు లేని పరిణతి పొందిన సాహచర్యం కొనసాగుతున్నది.

## ఆదర్శ దంపతులంటే

ఆదర్శ దంపతులంటే నా ఆలోచనా, అర్థం వేరుగా వుంటాయి. ఒకళ్ళను మరి ఒకళ్ళు అనుసరించడం కాదు, అనుకరించడమూ కాదు. ఎవరి సిద్ధాంతాలు వారివి, ఎవరి మార్గాలు వారివిగా వుంటూ ఒకరిని రెండోవారు గౌరవిస్తూ కాపురాన్ని సాగించే వాళ్లే అసలైన ఆదర్శ దంపతులు. ఏ పరిధిలోనూ ఒకరికి రెండోవారు అడ్డు రారాదు. ద్వేషించరాదు, వ్యతిరేకిస్తూ బాధించరాదు. అలాంటి నిగ్రహం ఎవరికి వుంటుందో వారే అసలైన ఉత్తములు. అంత మాత్రాన చెడు నడత, హింసా వాదము, దుర్మార్గ ప్రవృత్తులను గౌరవించమని కాదు. సామాజిక స్పృహ, సేవాసక్తి, అధునిక భావాలు కాస్తో, కూస్తో జీవిత విధానంలో అనుసరిస్తున్నవారయితే మార్గాలు వేరైనా గొప్ప

ఆదర్శాలువున్న వారయితే గౌరవించడంలో తప్పు లేదు.

'ఒకరు భావ వాదులు, మరొకరు భౌతిక వాదులు అయితే ఆ సంసారం సాఫీగా నడుస్తుందా' అనే ప్రశ్న మొలకెత్తుతుంది. మన సమాజంలో పెళ్ళికి ముందే లక్ష్యాలు, ఆదర్శాలు చర్చించుకుంటే భవిష్యత్తులో దాంపత్యంలో స్పర్ధలు రావు. అలా జరగనప్పుడు వారొక కృత్రిమమైన దంపతులుగానే మిగిలి పోతారు. పిల్లల్ని కనవచ్చు. ఒకరినొకరు (ప్రేమించుకోవచ్చు, ఒకరికి ఒకరు అండగా వుండవచ్చు. కాని సంపూర్ణ భావ సమైక్యతలో వుండే సన్నిహితత్వం వ్యతిరేక మనస్కులతో పొసగదు. అయినా ఒకే మాట, ఒకే బాట వుండదు. అలా కలసి సహజీవనం చేసేవారు ఏ లక్షకో, కోటికో ఒకరు వుంటారు. అదృష్ట వశాత్తు (దృష్టం కానిది) మా ఇద్దరికి మౌలికమైన భావ సమైక్యత వుండటం వల్ల అంటే ఇద్దరం హేతువాదంలోనూ, హ్యూమనిజం లోనూ, ఫెమినిజంలోనూ, ప్రజాస్వామ్యంలోనూ నమ్మకం వున్నవాళ్ళం కనుక ఆ ఉద్యమాలకు సారధ్యం వహించి, గత నలభయి ఏళ్ళుగా కలసి కార్యక్రమాలు కొనసాగిస్తున్నాం. నా ఉద్దేశ్యంలో ఇదే అసలయిన ఆదర్శదాంపత్యం అనిపిస్తున్నది. అంత మాత్రాన అభిప్రాయ భేదాలు రావని కాదు.

# 6. నా సంతానం

అతి చిన్న వయసులో అంటే 11వ ఏట 1935 సంవత్సరంలో నాకు బాల్య వివాహం జరిగింది. ఆ తరువాత 13వ ఏట అత్తవారింటికి పంపారు. నా తొలిబిడ్డ 1938 అక్టోబరులో, రెండవ బిడ్డ 1940 మార్చి 4న, నా మూడవ బిడ్డ 1943 మే 6న, నాలుగవ బిడ్డ 1948 మే 17న, అయిదవ బిడ్డ (ఆడపిల్ల) 1949 సంవత్సరం సెప్టెంబరు 21వ తేదీన కలిగారు.

నా పిల్లల విషయంలో నేను ఏనాడు లోపం చేయలేదు. వారి విద్యాబుద్ధుల్లో కాని, క్రమ శిక్షణలో కాని ఏమాత్రం నిర్లక్ష్యం చూపలేదు. మా అత్తమామలు వాళ్ళను కనురెప్పలా చూచే వారు. ఆ రోజుల్లో వైద్య సహాయం అభివృద్ధి చెందని కారణంగా నాకు ఆరోగ్య సూత్రాలు, పిల్లల పెంపకం సశాస్త్రీయంగా తెలియని కారణంగా కొన్ని రుగ్మతలు వారిని బాధించేవి. చక్కగా ఎనిమిది పౌన్లతో ప్రతి సంతానం పుట్టడం జరిగేది కాని ఆ తర్వాత ఆనారోగ్యాలు వారిని వెన్నాడేవి. మా అమ్మమ్మ ధర్మోపన్యాసాల సారం వల్ల మూడుసార్లు ఆముదం త్రాగించటం, ఏడ్చినప్పుడల్లా పాలు పొయ్యటం, కిటికీలు బిగించి వుంచడం, జ్వరాలొస్తే ముడుపులు కట్టడం, ఒకటేమిటి ఎన్ని అవలక్షణాలతో పెంచానో! పిచ్చి ప్రేమతో నిద్దర కూడా లేకుండా చూచుకునే దాన్ని. కాని ఆరోగ్య సూత్రాలు ఏమిటో తెలియని కారణంగా కొన్ని అవాంతరాలు తెచ్చి పెట్టుకొన్నాను. ఆమాటకొస్తే అసలు ఆ రోజుల్లో పిండోత్పత్తి గురించిగాని దాని పరిణామం గురించి గాని ఏమి తెలియని నా అజ్ఞానపుదశలో వారు పుట్టారు. రోజూ వాళ్ళ ఆరోగ్యం కోసం దేవుళ్ళకు మ్రొక్కుతూ వుండేదాన్ని. మొదటి బిడ్డ రెండేళ్ళలోగానే 'డిప్తీరియా' వచ్చి తగిన వైద్య సహాయం అందక 24 గంటలలో చనిపోతే నా రెండో కొడుకు పూర్వాషాఢ నక్షత్రం మూడవ పాదంలో పుట్టడంవల్ల జ్యేష్టుడు పోయాడని మా అత్తగారు తలచుకొని కుమిలి కుమిలి ఏడ్చేది. అలాగే నా మూడో కొడుకు రోహిణి నక్షత్రంలో పుట్టడంవల్ల మేనమామ అయిన నా అన్న అర్ధాంతరంగా చనిపోయాడు అని మా వాళ్ళు భావించారు. ఇవన్నీ యాదృచ్ఛికాలని ఆనాడు తెలియదు.

13వ ఏట నేను తల్లినవ్వటం ఒక విధంగా మంచిదయింది. అంటే నాకు 24 ఏళ్ళకే ఐదుగురు పుట్టడం మరి చాలించుకోవడం జరిగింది. వాళ్ళు వెంటనే డిగ్రీలు పొందడం, ఉద్యోగాల్లో చేరటం వల్ల నాకు 'రిలీఫ్' వచ్చి 'ఫుల్ టైమ్ వర్కరుగా' పనిచేసే అవకాశం కలిగింది. అప్పుడు ఇల్లూ పిల్లలూ ఎడతెరిపిలేని పనితో సరిపోయేది. ఇప్పుడు ఉద్యమాలు, సంస్థలూ, కార్యక్రమాలు విధీ విరామం లేకుండా కొనసాగుతున్నాయి. అందువల్ల నా బాల్యవివాహం ఒక విధంగా నాకు మేలు చేసింది. నా వయస్సు వాళు ళ్ళ ఇంకా పిల్లల చదువులు పూర్తికాకుండా పెళ్ళిళ్ళు జరగకుండా బిడ్డల నిరుద్యోగం లాంటి బాధలతో సతమతమయ్యేవారు అనేకమంది వున్నారు.

బిడ్డల్ని పెంచేదశలో నేను కూడా వారితో లీనమై నా సర్వస్వం వారుగానే ఎంచి పెంచుకున్నాను. వారు తిన్నది బంగారం నేను తిన్నది మట్టిగా భావించి నా నోట్లో ది సైతం తీసి పెట్టేదాన్ని. 24 గంటలూ నా మనస్సు వారి సంక్షేమాన్ని గూర్చి ఆలోచించేది. వారి కాల్లో ముల్లు గుచ్చుకున్నా, కంట్లో నలుసు పడ్డా నా ప్రాణం తపించిపోయేది. పరీక్ష ఫలితాలు వినేదాక గుండె దడదడ లాడేది. సీట్లు, ఉద్యోగాలు, వివాహాల గురించి వారి భవిష్యత్తు గురించి తపిస్తూ వుండేదాన్ని. ఆనాడు వాళ్ళు నన్ను రేపు చూస్తారా, గౌరవిస్తారా, పోషిస్తారా అన్న ముందుచూపు వుండేది కాదు. మరి అది ప్రకృతి లక్షణమో, రక్త సంబంధమో, వ్యామోహమో" కన్నవారికే అర్ధమవుతుంది. అదేమి వాత్సల్యమో తెలియదు. కాని తల్లి ప్రేమ అద్వితీయమని తరువాత తెలుసుకున్నాను.

పిల్లలు సైతం ప్రక్కలో పడుకోవడం, కబుర్లు చెప్పటం, చుట్టుకొని తిరగడం, ఆఖరికి స్నానం చేస్తుంటే వాకిలి ముందు నిలబడి వుండటం చేసేవారు. అలాంటి దశలు దాటి, అనుభూతులు మారి, తరాల అంతరాలు ప్రస్ఫుటమై ఒక పెద్ద 'యూనిట్, నుండి చిన్న చిన్న విభాగాలుగా ఉదయించినట్లు జరగడం సర్వ సామాన్యం. ఇప్పుడు వారి లక్ష్యాలూ, ఆదర్శాలు వేరు. నాచూపు, ధ్యేయం వేరు. పిల్లలు ఆ స్థితికి వచ్చే నాటికే మన ప్రవృత్తులు మార్చుకోకపోతే వున్న అనుబంధం తెగిపోతుంది. అందువల్ల పిల్లలు పెరిగాక వారిని స్నేహితులుగా చూడమనే నిత్యసత్యం ఆచరణీయం. మనం ఇంకా పెనవేసుకుపోతే అన్యోన్యత దెబ్బతింటుంది. మనకు ప్రశాంతత తగ్గుతుంది. ఇప్పుడొక ముఖ్య విషయం ప్రస్తావించాలి. ఆస్తి పాస్తుల విషయంలో మాది మధ్య తరగతి కుటుంబం. విద్యా బుద్ధులు నేర్పించాక పిల్లలకు ఆస్తులు ఇవ్వలేకపోయాం. మిగిలిన సంపద వారికి ఇవ్వలేదు. అది మా జీవయాత్రకు కావాలనుకున్నాం. అందువల్ల వారినుండి పుచ్చుకోవాలనికాని, వారికి ఇవ్వాలనికాని నాకు లేదు. 'అమ్మా!' అని ఆప్యాయతతో ఒక చీరో, ఒక వస్తువో ఇస్తే పుచ్చుకోవటమేకాని ఇమ్మని అడగాల్సిన పరిస్థితి తెచ్చుకోలేదు. వారికి ఇవ్వాలనే తపన నాకు లేదు. ఈనాడు సమాజమే నా కుటుంబమయింది. అందులోని వ్యక్తులే నా బిడ్డలని భావించే పరిస్థితి వచ్చింది. అందువల్ల నా మిగిలిన డబ్బూ, ఇల్లూ, స్థిర చరాస్తులన్నీ ఉద్యమాలకే ఇవ్వాలని నిశ్చయించుకున్నాను. దానికి నా భర్త అంగీకరించటం జరిగింది. నా ఆస్తి పాస్తులన్నీ నాచే స్థాపించబడిన ధర్మ సంస్థలకే చెందాలని విల్లురాసి 'మల్లాది సుబ్బమ్మ ట్రస్టు" కు అంద జేశాను.

నా స్థిర చరాస్తులు ఉద్యమానికి వ్రాసినా బాధ పడకపోగా నా పిల్లలు 'జీవితంలో మేము సాధించలేని ఘనకార్యాలు మా తల్లిదండ్రులు సాధించారు. ఆ దశలో వారి ధనాన్ని, కాలాన్ని, శ్రమనూ పదిమందికీ పనికివచ్చే విధంగా త్యాగం చెయ్యటం వాంఛనీయమే' నని నన్ను శ్లాఘించారు. ఒక విధంగా చెప్పాలంటే నేనెల పుట్టి పెరిగాను అనేది కాదు. నాకెలాంటి భర్త లభించాడు ఎలాంటి పిల్లలు కలిగారు అని ఆలోచిస్తే –

సత్ప్రవర్తనలో కాని, నీతి, నిజాయితీలలో కాని, తెలివితేటలలో కాని, సమర్థతలో కాని నిజంగా చెప్పాలంటే నా పిల్లలు నన్ను మించిన వారని నాకు తెలుసు. ఆ విషయంలో నేను చాలా అదృష్టవంతురాలిని అనే గర్వం నాకు వుంది. కాకపోతే రెండో అబ్బాయి మరణంవల్ల కలిగిన నష్టాన్ని మాత్రం ఎవ్వరూ పూరించలేరు. యోగ్యులయిన నా బిడ్డల గురించి నా పిల్లలు చదువులో, సంస్కారంలో పేర్కొనదగినవారు. ఆరోజుల్లో అబ్బాయిలకు మాత్రం 5వ ఏట అక్షరాభ్యాసం చేసి బళ్లో వేసే వాళ్లం. కేవలం ఎలిమెంటరీ స్కూళ్ళు, వీధి బళ్ళు మాత్రం వుండేవి. అగ్రవర్ణాలవారే హెచ్చు భాగం ఉపాధ్యాయులుగా వుండేవారు. ముఖ్యంగా పండిత కుటుంబాల నుండి వచ్చేవారు. వారు శ్రద్ధ తీసుకొని విద్యార్థులను గోడ కుర్చీలు వేయించి, కొట్టి చదివించేవారు. హోమ్ వర్కు, కాపీలు రాయడం, కొంపోజిషన్లు రాయించే వారు కేవలం స్వయంకృషితో చదివి ఏటేటా పాసయ్యేవాళ్లే కాని వాళ్ళకు ఇంట్లో కోచింగు కాని, ప్రోగ్రెస్ కార్డులు చూచికాని ఎరుగం. అలా అని వాళ్ళ విద్యా విషయంలో ఎంతమాత్రం నిర్లక్ష్యం చేయడం జరగలేదు.

పిల్లలలో ముగ్గురు హైస్కూలు ఫస్టు వచ్చారు. ఇంగ్లీషు, తెలుగు, లెక్కల్లో ఫస్టు వచ్చేవారు. మెడల్సు, ప్రయిజులు వచ్చేవి. పెద్దబ్బాయి, అమ్మాయి, 3వ అబ్బాయి టవున్ ఫస్టుగా వుండేవారు. పెద్దబ్బాయికి, మూడోవాడికి ఇంజనీరింగులోను, రెండోవాడికి, అమ్మాయికి మెడిసిన్ లోను నలుగురికీ మెరిట్ మీద సీట్లు వచ్చాయి. బాపట్లనుండి పై చదువులకు పట్టణాలు పంపినా ఇంజనీరింగ్ కోర్సు, మెడికల్ కోర్సు మొత్తానికి పది, పదిహేను వేలకన్నా ఖర్చు పెట్టి ఎరుగము. అమ్మాయి నేషనల్ మెరిట్ స్కాలర్ షిప్‌తో చదివి డాక్టరయింది. డి.జి.ఓ. మాత్రం వైజాగ్ లో చేసింది. డిగ్రీలు రాగానే పెద్దబ్బాయికి బిర్లా కంపెనీలో ఉద్యోగం దొరికింది. అప్పటికి 20 ఏళ్ళకన్నా ఎక్కువ లేవు. అది వదలుకొని హైదరాబాదులో 'జే' ఇంజనీరింగు కంపెనీలోనూ, తరువాత జంషెడ్ పూర్ టెల్కోలో, తిరిగి ఐ.యల్.టి.డి. చీరాల్లో ఇంజనీరుగా మంచి పేరు ప్రఖ్యాతలు గడించాడు. తెలివితేటలు మరియు కృషి రెండూ వాడి సొమ్ము కావడంవల్ల ఎక్కడ చేసినా వొదిలేవారు కారు. అలాగే ఆ తర్వాత గల్ఫ్ దేశాల్లో ఉద్యోగం దొరికి 10 ఏళ్ళు పనిచేసి దేశాభిమానం పీడించటంవల్ల ఆ ఉద్యోగం వదిలేసి ఇండియా చేరి ప్రస్తుతం ప్రయివేటుగా చిన్న కంపెనీ పెట్టుకున్నాడు. 1965లో ఒక గ్రాడ్యుయేటు అయిన అమ్మాయి ఉషతో పెళ్ళయింది. ఇద్దరు కుమారులు కలిగారు. కార్తీక్, కౌశిక్ 22, 20 ఏళ్ళు వయస్సు వారిది. కార్తీక్ ఆర్మీలో లెఫ్టినెంటుగాను, కౌశిక్ మణిపాల్ లో ఇంజనీరింగు విద్యార్థి గానూ వున్నారు.

మా పిల్లలు ఒకరికి హాని, అపకారం, మోసం చెయ్యరు. స్వార్థపరులు కారు. శ్రమపడి వృత్తివిద్యలు చదివారు. వారి తెలివితేటలతో కష్టపడి సంపాదించుకుంటున్నారు. మాకు అగౌరవం తెచ్చే ఏపనీ చేసి ఎరుగరు. సర్వసంగ పరిత్యాగం చేసి దేశానికి,

సంఘానికి సేవ చెయ్యకపోయినా తల్లిదండ్రులంటే వల్లమాలిన గౌరవం, అభిమానం వున్నవారు. తండ్రి ప్రాక్టీసు మానేసి సేవాకార్యక్రమాల్లో పనిచేస్తున్నా, నేను వారికి రెక్కలొచ్చాక ఎలాంటి సహాయ సహకా రాలు ఇవ్వకపోయినా మాఎడ కృతజ్ఞత కలవారుగా వుండటం నా అదృష్టం. పైగా ఆర్థికంగా సహాయ పడతామని అనేకసార్లు అడుగుతూనే వుంటారు. మేమే తీసుకోటానికి అంగీకరించం. కారణం మా తిండికయితే అడగొచ్చు కాని మా ఉద్యమాలకు పుచ్చుకోవటం సభ్యత కాదని మా భావం. అయినా అంతో ఇంతో మాకు సౌకర్యాలు కలుగచేస్తామని, మనుష్యులను పెట్టుకొని పనిచేయించుకొని సుఖపడమని డబ్బు ఇస్తే ఆ డబ్బు నా సాహిత్యానికి వెచ్చించేదాన్ని. ముఖ్యంగా ఏ దురలవాట్లు వారికి లేవు. ఆఖరికి ఐ.యల్.టి.డి. వారు 500 రూ॥ లు సిగరెట్లు నెలనెలా ఇచ్చేవి కూడా పంచి పెట్టడమే కాని తాను కాల్చి ఎరుగడు నా పెద్ద కొడుకు.

ఇక రెండో అబ్బాయి గోపి హైస్కూలు చదువును బాపట్లలో పూర్తి చేసి, విజయవాడలో పి.యు.సి. చదివి హైదరాబాదులో దంత వైద్యంలో బి.డి.ఎస్. డిగ్రీ పొందాడు. హైస్కూలు చదువు కాలంలోనే వాడిలో నాయకత్వ లక్షణాలు కన్పడినాయి. పదిమంది స్నేహితులు వాడి అదేశాలు పాటించేవారు. మాటల పుట్ట, కలుపుకోలుతనం ఉన్న మనిషి, ముఖ్యంగా నన్ను చుట్టుకుని తిరుగుతూ వుండేవాడు. నాతో చెప్పకుండా ఆఖరికి భార్య మీద కూడా చెప్పకుండా వుండలేనంత ఆంతర్యంగా వుండేవారు. డాక్టరయ్యాక ఆర్మీలో చేరి 'షార్టు సర్వీసు కమీషన్ లో మూడేళ్ళు చేశాడు. ఆ వాతవారణంలో సిగరెట్లు, ఇతర డ్రింక్సు త్రాగని వాళ్ళు వెలి. కానీ వీడు తాగేవాడు కాకపోవటంవల్ల 'బాటిల్స్' వున్న 'రూముకు' ఇన్ చార్జిగా వుంచేవాళ్ళు. మిగతా వాళు ళ్ళ ఎవరున్నా సగం వాళ్ళే త్రాగుతారట. అలాంటి అపురూపమయిన వాడు. అతనిది ప్రేమ వివాహం. మా ప్రక్కనే వుండేది వాళ్ళ కుటుంబం. అమ్మాయి సత్య కళ్యాణి. విద్యావతి, సంస్కారవతి. ఆమె మెడిసిన్ పాసు అయిందాకా ఆరు సంవత్సరాలు ఆగి పెళ్ళి చేసుకున్నాడు. ఆమె రైల్వేలో డాక్టరు. ఇప్పుడు దక్షిణ మధ్య రైల్వే హాస్పటల్ లో సీనియర్ డాక్టర్ గా వుంటున్నది. కవిత అనే 19 ఏళ్ళ కూతురు, అనిల్ అనే 17 ఏళ్ళ కుమారుడు చదువుకుంటు న్నారు.

మూడో అబ్బాయి వెంకటేశ్వర్లు 1949 మేలో పుట్టాడు. ఎలక్ ట్రానిక్స్ ఇంజనీరు చదివాడు. బాంబేలో రెండేళ్ళు ఉద్యోగం చేసి, హైదరాబాద్ లో ఇ. సి.ఐ.ఎల్.లో పనిచేస్తుండగా 78లో గల్ఫ్ దేశాలయిన అబూదబీలో ఉద్యోగం దొరికి వెళ్ళాడు. అక్కడ ఆరేళ్ళువుండి ఇప్పుడు అమెరికాలో ఆరేళ్ళుగా వుంటున్నాడు. మంజు అనే ఎమ్.కామ్. చదివిన పిల్లతో పెళ్ళయింది. ఇప్పుడామె స్టేట్స్ లో జపానువారి బ్యాంకులో పెద్ద ఉ ద్యోగం నిర్వహిస్తున్నది. మేమంటే వాళ్ళకు చాలా గౌరవాభిమానాలు వున్నాయి. మూడో అబ్బాయి మాకు ఆర్థిక సహాయం చేసి విదేశాలు పంపాడు. ఆనాడు అతనా సహాయం

చెయ్యకపోతే 1978లో మేము ప్రపంచ హ్యూమనిస్టు మహా సభలో పాల్గొనటం, యూరప్ పర్యటన చేయటం జరిగేది కాదు. అదొక అపూర్వ అవకాశమనే భావన నాకు వుంది.

ఇక ఒక్కగానొక్క అమ్మాయి. నలుగురు అబ్బాయిల తర్వాత పుట్టింది. నాకు ఎలాగూ విద్యా యోగ్యత లేదు. ఆ పిల్లనైనా గొప్ప సైంటిస్టునో, కలెక్టరునో చెయ్యాలని మహా తాపత్రయ పడ్డాను. విజయలక్ష్మీ పండిట్ అంత కావాలని ఆ పేరు పెట్టాను. ఆ ఫీల్డులోకి రాకపోయినా వైద్య విద్యలో ఉన్నత స్థానాన్ని పొంది డాక్టరుగా మంచి పేరు గడించింది. గత పదిహేనేళ్ళుగా ప్రాక్టీసు చేస్తోంది. స్వశక్తితో అంత చదువు చదివింది. మంచి తెలివితేటలే కాక చాలా కష్టపడి బాధ్యతతో వృత్తి ధర్మాన్ని నిర్వహిస్తోంది. 1976లో డా॥ పట్టాభితో పెళ్ళయింది. ముత్యాల్లాంటి ముగ్గురు పిల్లలు కలిగారు. 14, 12, 10 ఏళ్ళ ఆ పిల్లల పేర్లు జయంత్, అనుపమ, అమూల్య. చక్కగా చదువుకుంటున్నారు.

## మా పిల్లల వ్యక్తిత్వాలు - గుణగణాలు

పిల్లలు ఎవ్వరూ కాపీలు కొట్టడం, తప్పడం లేదు. తాత తండ్రుల్లాగ నీతి, నిజాయితీలతో వ్యవహరించటం చూచి తల్లిదండ్రులుగా మేము ఆనందించని రోజు లేదు. మల్లాది వారి వంశ పరంపరే అటువంటిదేమో! మచ్చుకి కొన్ని ఉదాహరణలు చెప్తా. కామేష్ కు పది ఏళ్ళప్పుడు నేను ఒక ముసలమ్మ దగ్గర బేరమాడి డజను బత్తాయిలు కొన్నాను. నేను రెండు రూపాయలకు బేరమాడితే ముందు ఇవ్వనని తరువాత ఇచ్చింది. నేను డబ్బులిచ్చి లోపలికి వెళ్ళా. ఇది చూచిన కామేష్ ఆమెను పిలిచి మరో రూపాయి ఇచ్చి పంపాడు. అది చూచిన నేను 'అదేమిట్రా పోయిన ఆమెను పిలచి డబ్బిస్తున్నావు' అని కేకలేశా. "కాదమ్మా అది అసలే ముసల్ది. పైగా రెండు రూపాయలు గిట్టుబాటు కాదంటే అంతే ఇచ్చి పుచ్చుకున్నావు. అదెలా బ్రతుకుతుంది? పైగా అన్యాయం కాదా. నాకిచ్చిన పాకెట్ మనీ రెండు రూపాయల్లో ఒక రూపాయి ఇచ్చాను. ఈ నెలలో మిగిలిన రూపాయి చాల్లే "అన్నాడంటే, ఆ వయస్సు వాడికి అదెంతటి త్యాగం. ఎంత నిజాయితీ, ఎంతటి సద్గుణం అని నేనిప్పటికీ అనుకుంటూ వుంటా. అలాంటిదే మరో సంఘటన. తను కంపెనీలో పనిచేసేటప్పుడు జరిగింది. ఆ కంపెనీకి ఏటా రంగులు వేయించటం పరిపాటి. ఒకసారి రంగులు వెయ్యటం అయ్యాక ఆ డబ్బాలు ఖాళీవే గదా అని ఇంటికి తెప్పిస్తే, ఇంటికొచ్చి చూచి వాటిని వెంటనే త్రిప్పి పంపించాడు. ఖాళీవి తెచ్చుకుంటే ఏమవుతుంది అని అడిగితే ఈరోజు ఖాళీవి తెప్పించారు. రేపు ఏం తెప్పిస్తారో? అన్నాడు. అక్కడొక మిషన్ - ఆ రోజుల్లో ఆరు లక్షలది - పని చేయించలేక పోయారు. కామేష్ నానా తంటాలు పడి వర్కు చేయించాడు. రెండేళ్లల్లో ఆ మిషన్ ఆరు లక్షల లాభాన్ని సంపాదించి పెట్టింది. ఈ పనివల్ల నీకేమన్నా బహుమానం ఇచ్చారా? అన్న నా ప్రశ్నకు "అసలు నేను అక్కడ వున్నది ఈ పనులు చేయించటానికే కదమ్మా

వాళ్ళు అంత పెద్ద జీతం ఇచ్చేది” అన్నాడు నవ్వుతూ. అంత నిక్కచ్చి, నిజాయితీ వుండబట్టే ఎక్కడపని చేసినా పోనిచ్చేవారు కాదు. ఒక్కమాటలో చెప్పాలంటే, “కామేష్ కి వున్న పేరు ఆ కంపెనీలో ఏ ఒక్కరికి లేదండి” అని అనేకమంది మాతో చెప్పేవారు. ఏదయినా ఉద్యోగం ఇప్పించండి అని అడగటానికి హడలి పోయేవాళ్ళు. మెరిట్ లేనిదే తీసుకునే వాడు కాదు. కులం, మతం, పక్షపాతం లేని నిప్పులాంటి మనిషి అనే పేరు ప్రఖ్యాతలున్న పెద్ద మనిషిగా జీవిత రధాన్ని నడిపిస్తున్నాడు. యాభై రెండేళ్ళ కొడుకు అలాంటి సద్గుణవంతుడు నాకు వున్నాడంటే అదొక ఆనందదాయకం కదా!

అలాగే చెప్పాలంటే నా రెండో కొడుకు గోపి డాక్టరుగా ప్రాక్టీసు చేస్తుండగా ఒకనాడు చిన్న పట్టా - స్కూటర్ మీద కప్పేది - ఒక కుర్రాడు దొంగిలించి తెచ్చి అమ్మితే ఆ విషయం తెలియక కొన్నాడు. ఆ తరువాత కుర్రాణ్ణి పోలీసులు పట్టుకుంటే ‘డాక్టరుగారికి 20 రూపాయలకు అమ్మాను’ అని చెప్పాడు. ఇక పోలీసులు వచ్చి వీణ్ణి అడిగితే ముఖాన నెత్తురు చుక్క లేకపోగా విభ్రాంతుడై మా వద్దకు వచ్చి ‘అది దొంగ సొత్తని నాకు తెలియదు నాన్నగారూ! ఇలా చేశాను పరువు పోదు కదా’ అని బెంబేలు ఎత్తాడు. ఆ తరువాత మూడు రోజులు కుమిలిపోయాడు. అంటే తప్పు, మోసం చేయనివాళ్ళు ఇలా అల్లకల్లోల పడిపోవటం మామూలే. పోలీసులకు నాలుగు రూపాయలిచ్చి పంపితే సరిపోయేదానికి ఇంత గ్రంథమా! అని వాడి స్నేహితులు అనుకున్నారట. అసలు నా’ సంతానం ఏనాడు ఏ తప్పూ చేయలేదని కాదు, సర్వసంగ పరిత్యాగులనీ కాదు. మహెూన్నతులు కాకపోయినా దుర్మార్గులు కాదు. మధ్యములన్న మాట.

## జీవితంలో తీరని లోటు

అందరితో “నా పిల్లలు ఇద్దరు డాక్టర్లు, ఇద్దరు ఇంజనీర్లు” అని చెప్పుకుంటూ మహదానందపడే నాకు ఒక గొప్ప విపత్తు కలిగి అది నా జీవితాంతం తీరని లోటు అయింది. నాకు పుట్టింది నలుగురు అబ్బాయిలు, ఒక అమ్మాయి. అందులో తొలిచూలు బిడ్డ పూర్ణానంద పెరిగి పసివాడిగానే పోయాడు. కొద్దికాలం కడుపు శోకం కలిగినా, మళ్ళా పిల్లలు, పెంపు ఇతర బాధ్యతలతో కొట్టుమిట్టాడంవల్ల ఆ దుఃఖం అనతికాలంలోనే సమసిపోయింది. కాని రెండేళ్ళ నా రెండో బిడ్డ డాక్టర్ గోపి అల్జీరియాలో ఐదు ఏళ్ళు వుండి ఒక నెలలో ఇండియా రాబోతుండగా ఒక పెద్ద కారు యాక్సిడెంట్ లో 8-2-86న చనిపోయిన దుర్ఘటన నా జీవితంలో అదొక గొప్ప విపత్తు అనక తప్పదు. ఆ పేరు చెప్పినా, ఆ ఫోటో చూచినా, పోయాడని ఎవరు అన్నా తల్లడిల్లిపోయేదాన్ని. ఇప్పటికీ ఆ దృశ్యం అంటే ఒక పెట్టెలో పెట్టి ఇండియాకు చేరిన ఆ ‘బాడీని’ తలుచుకుంటే నా హృదయం పరితపిస్తుంది. “అందుకే పుత్రదుఃఖం నిరంతరం”, అన్నారు పెద్దలు.

అది అక్షరాలా నిజం. అంతవరకు సుబ్బమ్మ గారంత అదృష్టవంతురాలు లేదు అనేవారు. ఇది జరిగాక బాగా చలించాను. మామూలు స్థితికి వచ్చానో, లేదో నాకే తెలియటం లేదు. ఏది ఏమయినా ఆ లోటు లోటే. మరణవార్త విన్న రెండు రోజులకు దీర్ఘాలోచనలో పడిపోయాను. అభాగ్యులకు సలహాలిచ్చి, సంస్కరించి పంపే నేను మరెందరినో వూరడించి సలహాలిచ్చి, ధైర్యాన్నిచ్చి ఆదుకునే నేను, పదిమందికి ఆదర్శప్రాయంగా వుండాలే కాని ఇలా కృంగిపోతే అది నా వ్యక్తిత్వానికే గొడ్డలి పెట్టు అని నా దుఃఖాన్ని నేనే దిగమింగుకున్నా. అదీగాక ఏడ్చి, బాధపడి చేసేది ఏముంది అని ఆలోచించి సమన్వయపర్చుకున్నా. "చచ్చెడు వానికై ఏడ్చెదను చావని భంగి" అన్నట్లు అసలు నా జీవితకాలం ఎంత? ఈలోగా నేను చేయాల్సిన కార్యభారం ఎంత? పెట్టిన సంస్థలు, తల పెట్టిన కార్యక్రమాలు చాలా వున్నాయి. నేను దాటిపోయేలోగా మరెన్నో ఘనకార్యాలు చేయాలే, అసలే టైం చాలక తన్నుకుంటూంటే ఇంక ఇలాంటి సంఘటనలకు దిగాలుపడి కూర్చుంటే లాభం ఏమిటి? యాక్సిడెంట్ అంటే అనుకోని సంఘటన దానికి తట్టుకోలేకపోతే ఎలా అనే జాగృతి, కర్తవ్యం నన్ను వెన్ను తట్టి 'లే లే అని లేపి కార్యోన్ముఖురాలిని చేశాయి. ఇక అంతే! 19-2-86న గోపి 'బాడీ' హైదరాబాదు చేరింది. ఆ దృశ్యం మరపురానిది. వళ్ళు జలదరించింది. దుఃఖం పొంగి పొర్లింది. నా కోడలు కళ్యాణి మ్రాన్పడిపోయి స్థాణువులా నిలబడిపోయింది. రామ్మూర్తిగారు పైకి ధైర్యంగా తిరిగారు. చుట్టాలు, స్నేహితులు, పలువురు ఆ సమయానికి వచ్చారు. మాతృహృదయం కదా అని నన్ను చూచి అనుకున్నారు. గోపి దేహంతోపాటు నేనూ ఎలక్ట్రిక్ క్రెమెటోరియం' (విద్యుత్ తో నడిచే దహనాలయంకు) వెళ్ళి అప్పజెప్పి తిరిగి వచ్చాను. ఆ రాత్రి గత చరిత్రంతా నా స్మృతి పథంలో మెదిలింది. నాలో నేను తర్క వితర్కాలకు లోనయినాను. చివరకు మళ్ళీ ధైర్యస్థయిర్యాలను పుంజుకున్నాను.

ఇంతలో ఉస్మానియా యూనివర్సిటీ అధ్యాపకులు నలుగురొచ్చి అంతకుముందు యూనివ ర్సిటీ మా సంస్థతో కలిపి తల పెట్టిన సెమినారు విషయం నాతో ఎలా ప్రస్తావించాలి అని తికమక పడుతున్నారు. డాక్టర్ విశ్వనాధరెడ్డి, సి. రామారావు, శివలింగ ప్రసాద్, యాదగిరిరెడ్డి "మిమ్మల్ని చూచి పోదామని వచ్చామని, పలకరించారు. అసలు విషయం గ్రహించి నేను 'సెమినారు పనులన్నీ పూర్తయినాయా' అని ప్రశ్నించాను. ఆ పెద్దమనుషులు నన్ను చూచి ఆశ్చర్యపోయారట. అప్పుడు నేను 'ఏమండి! మనం ఒక రహదారి మీద ప్రయాణం చేస్తున్నాం. ఒక ముల్లు గుచ్చుకుంది, నెత్తురు బాగా ప్రవహించింది. అది చాలా పెద్ద ముల్లే. అయినా ఆ ముల్లు తీసి పారేసి ప్రయాణం సాగించమా? అలాగే ఈ విపత్తు సంభవించింది. అది కాస్త భారమైనది, భరించలేనిది, లోటు తీరనిది. ఐనా కర్తవ్యాన్ని విస్మరిస్తామా?' అని వారితో పలుకుతుంటే నాకు కంటనీరు ప్రవహించలేదు. గుండె దడ లేదు, తొట్రుపాటు లేదు.

ఈ సందర్భంలోనే ఒక అసాధారణ సంఘటనను గురించి చెప్పాలనిపిస్తున్నది. నా కుమారుడు గోపి మరణ వార్త 10వ తేదీ రాత్రి తెలిసింది. 3 రోజులు పుత్రశోక దుఃఖంతో తల్లడిల్లిపోయాను. నెల క్రిందట సికింద్రాబాద్ లయన్సు క్లబ్బులో మహిళా దినోత్సవానికి ముఖ్య అతిథిగా 14వ తేదీన హాజరవుతానని అంగీకరించాను. సభకు రావాల్సిందని కోరడానికి వచ్చినామె తటపటాయిస్తున్నది. నేనే చొరవ తీసుకొని "నా పిల్లవాని మరణాన్ని గురించి సభలో ప్రసక్తి రాకుంటే నేను మీటింగుకు తప్పక వస్తాను" అని చెప్పాను. ఆమె అలానే వాగ్దానం చేసింది. సభకు వెళ్ళాను. మామూలు ధోరణిలో ఉపన్యసించాను. అనేకమంది స్త్రీలు అభినందించారు. క్లబ్బు వారు నాకు ఒక 'మెమెంటో' ఇచ్చారు. ఇప్పటికీ అది నా గదిలో గోడకు వేలాడుతూనే వుంది. దాన్ని చూచినప్పుడల్లా నా కళ్ళల్లో ఈ కథంతా సినిమా రీలులాగా తిరుగుతుంటుంది. ఆనాడు నేను అంత నిబ్బరాన్ని ఎలా ప్రదర్శించగలిగానో నాకే విస్మయం కలిగిస్తుంది.

## పిల్లల పెళ్ళిళ్ళు - విధానాలు

కబుర్లు ఎన్నయినా చెప్పవచ్చు, ఉద్యమాలు ఎన్ని అయినా నడపవచ్చు, కట్నం అసలు తీసుకోని పెళ్ళి ఏదయినా వున్నదా అని ఎద్దేవ చేసే పెద్ద మనుషులున్న సమాజం మనది. వ్యక్తులంతా తమలాగానే వుంటారనే అపభ్రంశపు వారికే ఇలాంటి వెర్రి వూహలు పుట్టుకొస్తాయి. కాని, కాలం మారింది. పరిస్థితులు మారాయి. కుల మతాలు అంతరించాయి. కట్న కానుకలు సన్నగిల్లాయి. "మాకు లేని పరిపూర్ణ స్వేచ్ఛ మీకు ఇచ్చాం, మీ ఇష్టం వచ్చిన రీతిలో మీ భాగస్వామిని ఎన్నుకోండి, మీరు సుఖంగా జీవించగలరు" అని పిల్లలందరికి ఎన్నోసార్లు హెచ్చరించేవాళ్ళం. అంత స్వేచ్ఛ ఇచ్చినా వాడుకోలేని అసమర్థులయ్యారు ఇద్దరు. మరో ఇద్దరు సఫలీకృతులయ్యారు. నా పిల్లలు ఇద్దరు ఇంజనీర్లు (1,3) మరో ఇద్దరు డాక్టర్లు (2,4) అందరూ చదువులు పూర్తి చేసి, వుద్యోగాలు సంపాదించుకొని వ్యక్తిత్వాలు నిలుపుకొని వివాహాలు చేసుకున్నారు. కోడళు ్ళ అంతా గ్రాడ్యుయేట్లు, పైగా రెండో కోడలు, అల్లుడు కూడా డాక్టర్లే. మొదటి ఇద్దరూ సంప్రదాయ వివాహాలు చేసుకున్నారు. బహుశా తాతా అవ్వల మీద గౌరవమో లేక వారి నిశ్చయమో? నేను మాత్రం తటస్థంగా వున్నాను..

మా రెండవ అబ్బాయి గోపి వివాహం 1967లో బాపట్లలో మా ఇంట్లో జరిగింది. మేము పెళ్ళి పీటలమీద కూర్చోలేదు. అయితే పెళ్ళికొడుకు పెట్టాల్సిన ఖర్చుకు పైకం మేము ఇచ్చాం. ఆ పెళ్ళికి హ్యూమనిస్టు ఉద్యమ కార్యకర్తలు, నాయకులూ వచ్చారు. తరువాత ఒక గోష్ఠిలో రామ్మూర్తిగారిని "మానవవాదులయిన మీరు ఆ వివాహాన్ని మీ ఇంట్లో, మీ ఖర్చుతో ఎందుకు నిర్వహించారు" అని ప్రశ్నించటం జరిగింది. దానికి రామ్మూర్తిగారు చిరునవ్వు నవ్వి ఊరుకున్నారు. ఇంత మాత్రం మానవవాదం అర్థం

కాలేదా అని వారి భావం కాబోలు. అప్పుడు నేను లేచి సమాధానం చెప్పాను. పెళ్ళి జరిగింది మా అబ్బాయికి, మాకు కాదు. మా అబ్బాయి వయస్సు 25 సం॥లు, మేజరు. అతని ఇష్ట ప్రకారం అతడు వివాహం చేసుకోడానికి అతనికి హక్కు వుంది. ఆ హక్కును అతడు వాడుకున్నాడు. మేము మంత్ర తంత్రాలలో పాల్గొనలేదు కాగా ఖర్చుకు పైకం ఇచ్చాం. సమిష్టి ఆస్తిలో అతనికి వాటా వుంది. పైకాన్ని యివ్వకుండా వుండలేము. ప్రజాస్వామిక భావన అర్థమైతే మా ప్రవర్తనలో నిందార్హత కన్పించదు. దీనిలో విమర్శకులు సంతృప్తి చెందారో లేదో నాకు తెలియదు కాని మిన్నకున్నారు.

ఇక మూడవ, నాల్గవ పిల్లల నాటికి నా ఉద్యమ స్వభావాలు మిన్ను ముట్టాయి. ముహూర్తం, తాళి, తలంబ్రాలు, ఆడంబరాలు పూర్తిగా వ్యతిరేకించగలిగాను. చివరి పిల్లలిద్దరికి సివిల్ మ్యారేజ్ పద్ధతిలో దండల మార్పిడి పెళ్ళి చేశా. ఒక్కగానొక్క అమ్మాయి మాత్రం మా సంతోషం, సంతృప్తి కోసం ఇక్కడ అలాగే చేయించుకొని వాళ్ళ ఇంటికెళ్ళి మళ్ళా బాజాభజంత్రీలతో పురోహిత వర్గంతో తిధి, వార, నక్షత్రాల అనుకూలంతో ఆ భర్తనే సంప్రదాయ వివాహం చేసుకొన్నది. ఆ పెళ్ళికి మా దంపతులు హాజరు కాలేదు. ముందే మీకు ఈ సంగతి తెలుసా అని అనేకమంది అధిక్షేపించారు. నాచేతితో చెయ్యలేదు, నేను హాజరు కాలేదు, నాకిష్టం లేదని వారికి తెలుసు. మమ్మల్ని గౌరవించినట్లు ఇక్కడ మా పద్ధతిలో వివాహమాడి అక్కడ కెళ్ళి వారి ఇష్టప్రకారం చేసుకుంటే అది వారి ఇష్టం. నేను మైనర్లకు చెయ్యలేదు. కులాతీత, మతాతీత, వరకట్న రహిత వివాహాలు చేస్తున్నాం, ప్రచారం చేస్తున్నాం అంటే ఆ సిద్ధాంతం నచ్చినవాళ్ళు యెవరయినా ఆచరిస్తారు. అందరికి చెప్పినదానికన్నా ఎక్కువగానే వాళ్ళకు చెప్పాను. కాని శాసించలేదు. అది ప్రజాస్వామ్య వాదినైన నేను చేయలేని పని. పిల్లల్ని కన్నంత మాత్రాన వారి జీవితాలను మనం అది సనాతనంకాని, ఆధునికంకాని, మరేదయినాకాని మలచాలనే తాపత్రయంతో విధి నిషేధాలను వారి పట్ల విధించటం న్యాయం కాదు. అలాంటి సహనమే మన కవచం. ఏది ఏమయినా నామూడో కుమారుడు మాత్రం కులాన్ని ఖాతరు చేయకుండా పెళ్ళాడాడు.

"కులాంతర వివాహాలు ఎన్నో ఏళ్ళుగా చేస్తున్నారు కదా మీరెందుకు చేసుకోలేదు" అని ఇటీవలవరకు ప్రశ్నిస్తూనే వున్నారు. అది అర్ధరహితమైన ప్రశ్న. నా పెళ్ళి నా అంగీకారంతో జరగలేదు. అది ప్రేమ వివాహం కాదు. పైగా అతి బాల్య వివాహం. ఆ తర్వాత మా దాంపత్యంలో విడిపడాల్సిన అవసరం కలుగ లేదు. కలిగి మళ్ళీ పెళ్ళాడితే అప్పుడు ఇవన్నీ ఆలోచించాల్సి వచ్చేది.

మరి మీ పిల్లలికెందుకు చెయ్యలేదు అని అక్షేపించేవారికి అసలు తెలియని విషయం ఒకటి వుంది. నా ఉద్యమాలలో వారు భాగస్వాములు కాదు. కేవలం తటస్థంగా వుంటున్నారు. ఆలోచించుకొని పెళ్ళాడే హక్కు వారికి వుంది. అది వారివారి వ్యక్తిగత

విలువలను బట్టి వుంటుంది. ఆఖరికి భార్యా భర్తలు వేరు వేరు పార్టీలలో, ఉద్యమాలలో పనిచేస్తున్నా నీవు నా పార్టీలో చేరి పని చెయ్యమని శాసించే హక్కు ఏ ఒక్కరికీ లేదు. ఇదీ అలాంటి సిద్ధాంతమేనని అర్థం చేసుకుంటే ఈ అనుమానాలకు తావు వుండదు.

## కోడళ్ళతో నా అనుబంధం

"అత్త లేని కోడలు ఉత్తమురాలు కోడళ్ళు లేని అత్త గుణవంతురాలు" అనే సామెత బాగానే వుంది. కాని మరి ఇద్దరూ ఒక ఇంట్లోనే కలిసి కాపురం చేస్తూ తల్లీ పిల్లలవలె ఒకర్ని మరొకరు గౌరవించుకోగలరా అనేది ప్రశ్నగానే మిగిలి పోయింది. వ్యవసాయం, చేతి వృత్తులు జీవనాధారంగా వున్నంత కాలం 'జాయింటు ఫామిలీలు' తప్పనిసరి అయినాయి. ఆ కుటుంబాల్లో స్త్రీ పరిస్థితి దుర్భరంగా వుండేది. ఉమ్మడి కుటుంబంలో రక్షణ, సహాయం, ఆర్థికంగా తోడ్పాటు వుంటాయి కాని, ముఖ్యంగా కోడళ్ళు అంతా పెద్దల ఆజ్ఞ పరిపాలించాల్సి వచ్చేది. కుటుంబం లోని వారి మన్ననలకు అర్రులు చాచాల్సి వుంటుంది. అదెంత అసాధ్యమో కొందరికే తెలుస్తుంది. 40 ఏళ్ళ ఉమ్మడి కాపురంలో జీవితాన్ని వెళ్ళబుచ్చుకున్న నాకు ఆ అనుభవం అనన్య సామాన్యం. ఎంతగానో నన్ను ప్రేమించిన అత్తగార్నే ఆమె నస, కోపం, సాధింపు, ఆచారం భరించలేక ప్రాణావశిష్టురాలినయి వుండేదాన్ని. కొన్నిసార్లయితే మరణాన్ని కూడా ఆహ్వానించేదాన్ని. ఇంక ద్వేషం పగ వున్న అత్తగార్ల విషయం వర్ణనాతీతం. అదికాక నా కోడళ్ళ రోజులనాటికి సమాజంలో ఎన్నో రంగాల్లో వచ్చిన మార్పువల్ల ఉమ్మడి కుటుంబ వ్యవస్థ కూడా బీటలు వారింది. బాల్య వివాహాలు తగ్గిపోయాయి. వయస్సు వచ్చిన యువతలో కొన్ని స్పష్టమయిన భావాలు వచ్చి భాగస్వామి ఎన్నికలో వారిదే తుది తీర్పు అయింది.

పెళ్ళికి ముందే సంపాదించే భర్తలను చూచుకొని ఉద్యోగమంటూ వేరు కాపురాలు చూచుకుంటున్నారు. పెళ్ళికి ముందే మా అమ్మాయి మీ ఇంట్లో వుండదు, వేరుగా వుంటేనే పిల్లనిస్తామని షరతు పెట్టేవాళ్ళూ లెక్కకు మిక్కుటంగా వుంటున్నారు. ఒక్క నెల కూడా అత్తా, కోడళ్ళు కలిసి వున్న కాపురాలే శూన్యమయి పోతున్నాయి. ఈ పద్ధతి ఉభయులకు శ్రేయస్కరం అనేది నా విశ్వాసం. ఈ పరిణామంలో బాధ పడేది అత్తలు. అన్నీ పోగొట్టుకున్నామని బాధపడని రీతిలో ఆ దశకు ముందుగానే అత్త తన మనస్సును ఏ సంఘ సేవకో, ఏ ప్రజాహిత కార్యక్రమాలకో అంకితం చేసుకుంటే, చేతినిండా పని వుంటే ఈ ఎడబాటును, వెలితిని భర్తీ చేసుకోగలం అని తెల్సుకుంటే కుటుంబంలో అందరికీ సుఖశాంతులు వుంటాయని నా అనుభవం ద్వారా చెబుతున్నాను. ఆ పరిస్థితులకు ముందే పిల్లల ఖర్చుతో పాటు తను తిండికి కాస్తో కూస్తో నిల్వ చేసుకుంటే పిల్లల మీద ఆధారపడాల్సిన పరిస్థితి రాదు. వాళ్ళ కుటుంబ ఖర్చులే వారికి భారమవుతున్న ఈ రోజుల్లో అత్త మామలు వారి నెత్తి కెక్కి వారికి వీరికి అశాంతి

తేవటం మంచిది కాదు. పెద్దలు పిల్లలకు ఎంత ఇచ్చినా అది ఉభయులకూ అనందదాయకమే. కాని పెద్దల చెయ్యి క్రింద వుంటే ఆర్ధికంగా చెయ్యి చాస్తే అది నిజంగా నరకప్రాయ మవుతుంది. పది మంది పిల్లల్ని ఒక్క తల్లి పెంచుతుంది కాని తల్లిని ఈ పదిమంది కలిసి పోషించలేరు. కనుక వారిని విడిచి బ్రతకగలగటం, మన ఖర్చులకు తగినంత వుంటే సగం సమస్యలు పోతాయి. ఈ తరహా తాత్విక చింతన ఉమ్మడి కాపురపు అనుభవంలో నేర్చుకుని నా జీవితంలో దాన్ని అమలు పరిచాను. అందువల్ల కోడళ్ళతో నా అనుబంధం అంతా ఒక ్న పెక్యూలియర్ 'గా వుంటుంది. ఏనాడూ ఒక్క మాట అనలేదు. అనిపించు కోలేదు. మరి మీరు కూడా ఆలోచించండి. 'ఇందులో నా దుర్మార్గం ఏమైనా వున్నదా' అని.

# 7. నా అత్తమామలు

## నీతికి, నిజాయితీకి మారు పేరు మా మామగారు

మామగారి నీతికి ఒక్క నిదర్శనం చెప్పక తప్పదు. 1941లో గుంటూరులో కట్టిన ఇంటి గృహ ప్రవేశానికి రెవిన్యూ డిపార్టుమెంటు వారంతా వచ్చి ఆ రోజుల్లో పదివేలకు పైగా వస్తువులు, వెండి, బంగారు ఆభరణాలు చదివించబొయ్యారు. నాకళ్ళు జిగేలుమన్నాయి. కాని అన్నీ తిరగొట్టేశారు మామగారు. ఒక్క చెంచా కూడా ఇంట్లోకి రానివ్వలేదంటే అది అతిశయోక్తి కాదు. అసలు ఆ ఇల్లు కట్టించడానికి ఆయన పడ్డపాట్లు నాకు తెలుసు. ప్రావిడెంటు ఫండులోను, మా ఇద్దరి పొలాల పై మక్తాలు, ఎల్.ఐ.సిపై లోను, వీటితో కట్టినా ఇల్లు పూర్తికాలేదు. "ఇక నాచేత కాదమ్మా కట్టినంతలో తల దాచుకుందాం. ఆ పైన పూర్తికాకపోయినా పరవాలేదు అని తలపట్టుకొని కూర్చుంటే నేను ఈ సమయంలో కాకపోతే మరి మేము అసలే చేయలేమని ఆయనచేత నోట్లు రాయించి బలవంతాన అప్పు చేయించి కట్టించాను. ఇంతా ఆనాడు ఆ ఇల్లు 16 వేలయింది. దానికి ఇన్ని ఇక్కట్లు. ఆయనే కనుక లంచం పుచ్చుకుంటే మా కుటుంబమే మరో దశలో పయనించేది. ఆ నీతి నిజాయితీలే నాభర్తకు, నా పిల్లలకు వారసత్వంగా సంక్రమించాయి. అందువల్ల నేను మల్లాదివారి కోడలిగా రావడం నా అదృష్టమని చెప్పక తప్పదు.

## మాపై మామగారి వాత్సల్యం

మామగారు మాత్రం పిల్లల భవిష్యత్ గురించి బాధపడేవారు. "వీడు సంపాదించడు. వాళ్లు ఎలా వృద్ధిలోకి వస్తారు" అనే భావం వున్నా ఒక్కనాడు కూడా కుమారుణ్ణి నిలదీసి అడగనూ లేదు, తిట్టనూ లేదు, నొప్పించనూ లేదు. తమ ప్రేమలో కానీ, వాత్సల్యంలో కానీ లోపం రావివ్వలేదు. పిల్లలంటే అమిత వాత్సల్యం చూపే వయోవృద్ధులు వారు. మరో విషయం చెప్పాలనిపిస్తున్నది. మామగారు 1946లో రిటైరవ్వగానే ప్రావిడెంటు ఫండ్ 4 వేలు చేతి కొచ్చింది. ఆ డబ్బు భార్య కివ్వలేదు. ఆమెకిస్తే స్వాములవారికి ఇస్తుందని, ఆయనకిస్తే దేశం పాలవుతుంది, రాజకీయాలకు పెడతారని కుమారుడికి ఇవ్వలేదు. నా దగ్గరికొచ్చి "అమ్మాయీ! ఈ డబ్బు ఏం చెయ్యమంటావమ్మా" అని అడిగితే దొడ్లో చిన్న ఇల్లు వేసి అద్దెకిద్దామన్నాను. తర్వాత 1950లో ఎల్.ఐ.సి. 7 వేలు వచ్చింది. మళ్ళీ నన్ను అడిగారు. "ఒక పిల్ల వుంది పెళ్ళినాటికి మావద్ద చిల్లికానీ వుండకపోవచ్చు ఆమెకు నాలుగువేలు ఇవ్వండి. ముగ్గురు కొడుకులున్నారు. చదువులు సాగాలి కదా! వారికి వెయ్యి చొప్పున ఇవ్వండి" అన్నాను. ఆమర్నాడే వెళ్ళి నేషనల్ సేవింగ్సు సర్టిఫికేట్సు వాళ్ళ పేర తెచ్చి నాకిచ్చారు. ఆయన

త్యాగాన్ని, వాత్సల్యాన్ని నేను మాటలలో వర్ణించలేను. మహా నిష్ఠాపరుడు, దమ్మిడి లంచం ఎరుగడు. 70 రూ॥లు జీతంతో ప్రవేశించి చాకిరి చేసి, తాలూకా తహసిలుదారయినాడు. అయినా ఒక్క కొడుకు చదువు చెప్పించుకోలేక నానా బాధలు పడ్డాడంటే ఆయన నిజాయితి ఎంతో అర్థమవుతుంది. 50 ఎకరాల మెట్ట పొలాలు, అగ్రహారాలు వున్నాయి. దానిమీద వచ్చే నికరపు వరుమానం సంవత్సరానికి 200 రూ॥ లు కన్నా వుండేది కాదు. ఆ ఆదాయం, తన జీతంతో కాలం గడుపుకుంటూ కేవలం నీరుకావి బట్టలు ఉంటే ఉతికి ఆరేసినవి కట్టి సామాన్యునిలా, గుర్రబ్బండిమీద, బస్సులమీద తిరిగి తెచ్చిన రెవిన్యూ అంతా గవర్నమెంటుకు లెక్క చెప్పే వాడు. ఏనాడు బహుమతిగా మామిడిపండ్ల బుట్ట కూడా ముట్టి ఎరుగడు. సేల్సుటాక్సు ఆఫీసరుగా ప్రమోటు చేయబడ్డప్పుడు రెండవ ప్రపంచ యుద్ధం వచ్చి వార్ ఫండు వసూలు చెయ్యమని హుకుం జారీ అయింది. ఆ రోజుల్లో లక్ష వసూలు చేశాడు. ప్రభుత్వం గుర్తించి ఒక వెండి మెడల్ ఆరోజుల్లో (5 రూ॥ లు విలువ) ఇచ్చింది పుచ్చుకొని సంతోష పడ్డాడు. కాని అదనంగా అపేక్షించి ఎరుగడు. ఆ దంపతుల వాత్సల్యంలో నా జీవితం పండి ఫలించడం వల్లనే కొంతలో కొంత అయినా నీతి నిజాయితీ, సేవా ధృక్పధం, ఆలోచనాశక్తి వచ్చాయి అని చెప్పుకోవడానికి నేను గర్వపడుతున్నా. మార్గాలు వేరయినా కొన్ని ఆదర్శాలు, లక్ష్యాలు వారినుండి పుణికి పుచ్చుకున్నాను. అలా ఎన్నో విధాలుగా వారికెంతో ఋణపడి వున్నానని నాకు తెలుసు.

## అత్తగారి మరణం

17 ఏప్రియల్ 1975న మహా నిష్టా గరిష్టురాలయిన మా అత్తగారి మరణం ఒక అశనిఘాత మయింది. పరిపూర్ణ జీవితాన్ని గడించిన ఆమె మహా విదుషీమణి. ఆమెకు శక్తి సామర్థ్యాలు వున్నప్పుడు వస్తూపోతూ వుండే శిష్య బృందం అంతరించి పోయింది. 1966లో మామగారు పోయారు. ఇక మిగిలింది ఆమె, నేను, నా భర్త. ఆయనెప్పుడూ ఇంటిపట్టున వుండేది లేదు. ఆమెకు పుట్టెడు చెముడు. మా కుటుంబం విజయవాడ చేరడంవల్ల, ఊరు మార్పువల్ల, అంతా క్రొత్త కావడంవల్ల ఆమె ఒంటరిదయి పోయింది. నాకు పనుల భారంవల్ల క్షణం తీరేది కాదు. రోజూ కొడుకు గురించి మాత్రం అడిగి తెలుసుకునేది. మే 1975లో రామ్మూర్తిగారు అరెస్టు కావటానికి నెలముందు ఆమె పోవడం వల్ల ఒక రకంగా ఆమె అదృష్టవంతురాలు. నా కొడుకును తెప్పించి చూపించమంటే ఎక్కడ తెచ్చి చూపించేది? మా ఇద్దర్నీ చూస్తూనే ప్రాణాలు విడిచింది. నాకు మాత్రం మూడు నెలల వరకు దుఃఖం ఆగలేదంటే నమ్మండి. 40 ఏళ్ళ శుశ్రూష అనండి, కలిసి వున్న అనుబంధం అనండి. 'అమ్మాయీ! అనే ఆ దంపతుల పిలుపు నా చెవుల్లో ప్రతిధ్వనిస్తూనే వుండేది. నేను కోడలినే కాదు, కూతుర్ని కూడా.

చివరకు వారికి నేనే సర్వస్వాన్ని అయి నిలిచాను. మామగారి కర్మకాండ ఆమె వేరే మనిషిని పెట్టి చేయించింది. అంటే మేమిద్దరం అప్పటికే రేషనలిస్టులం, అకర్మవాదులం. ఆ తర్వాత అత్తగారి దహనానికి ఇద్దరం వెళ్ళి దగ్గరుండి బూడిదగా మార్చి వచ్చాం. ఏ కర్మకాండా జరుపలేదు. మమ్మల్ని నమ్ముకున్న ఆమెను కడతేర్చామే కాని ఆమె నాకు, నా పిల్లలకి చేసిన చాకిరికి, ప్రేమాభిమానాలకు నేనెంత చేసినా ఆమె ఋణం తీరేది కాదు. ఆమె నాకు చేసింది నూరుపాళ్ళయితే నేను చేసింది పది పాళ్ళకన్నా లేదని బాధతో చెప్పుకుంటున్నా. ఇక్కడొక చిన్న విషయం చెప్పక తప్పదు. మామగారు చనిపొయ్యే ముందు ఆస్తి నీ పేర పెట్టించుకోమని ఆమె స్నేహితురాలు సలహా చెప్పింది. ఈ మాట విన్న మా అత్తగారికి అమితమైన కోపం వచ్చి “ఇలా చెప్పటానికి నీకు నోరెలా వచ్చిందమ్మా! నా బిడ్డలు సమాజానికి సేవ చేస్తున్నారు. మహా నిజాయితీ పరులు, కర్తవ్యతా పరాయణులు కూడా. అలాంటివారు నాకు అన్నం పెట్టరని, జాగ్రత్త పడమని నీవు నాకు సలహా చెప్తున్నావా! ఇక ముందెప్పుడూ ఇలా చెప్పకు. నాకు వారిమీద సంపూర్ణ విశ్వాసం వుంది. వారు పెట్టకపోయినా నీ ఇంటికి రానులే. వస్తానని భయపడకు” అని చీవాట్లు పెట్టి పంపిందా ముసలమ్మను. తన బిడ్డ మీదే కాక నా మీద కూడా అచంచల విశ్వాసం వున్న ఆ మహాతల్లిని నేను విస్మరించలేను. చివరికి ఆమె నా చేతుల్లోనే తన ప్రాణాలు విడిచిన ధన్య జీవి. నేను కూడా ఆమెకున్న నమ్మకాన్ని వమ్ము చేయలేదనే సంతృప్తి నాకు మిగిలింది.

## నా పుణ్యలోకాలకు మా అత్తగారి ఆరాటం

అప్పుడు అంటే 1937 నుండి 1954 వరకు నా జీవితం చాలా శోచనీయంగా వుండేది. ఆ పరిస్థితి తలుచుకుంటే నాకిప్పటికీ జుగప్సు, బాధ కలుగుతాయి. అంటే అది ఎవరి తప్పు కాదు. ఆ రోజుల్లో ఆడవారి దుస్థితి అలా వుండేది. కేవలం ఇంటిపని, పిల్లల పెంపకం, పెద్దల ఆజ్ఞ శిరసావహించటం పరమ ధర్మంగా భావించేవారు. ఏ లక్షకో ఒకరిద్దరు ఎదురు తిరిగేవారు. పైగా ఉమ్మడి కుటుంబ వ్యవస్థ. ఇంట్లో పంపు లేదు కదా! బైటి నీళ్ళు కూడా తేవాలి. కట్టెలు, పిడకలతో వంట చేయాలి. ఇల్లంతా పొగతో గోడలన్నీ నల్లబడి వుండేవి. బహిష్టు సమయంలో దొడ్డి గదిలో దూరంగా వుండాలి. మడి వాళ్ళను, మగవాళ్ళను చూడరాదు. పిల్లల్ని సైతం దిగంబరం చేసి ఇస్తే పొలిచ్చి వాళ్ళను క్రింద పడుకోబెడితే పట్టుకెళ్ళి స్నానం చేయించి ఇచ్చేవాళ్ళు. ముట్ల కోసం, పురుళ్ళ కోసం దూరంగా ఒక గది కట్టించేవారు. ఇక ఉదయం 5 గంటలకు లేస్తే అందరూ పడుకున్నాక నిద్రపోవాలి. తెల్లవార్లూ పిల్లల బాధ. తెల్లారుతుందన్నా, చీకటి పడుతుందన్నా ఆందోళనే. ఎవరేమంటారోననే భయంతో గడపాల్సిందే. పిల్లలకు, మగవాళ్ళకు పెరుగూ, మాకు మజ్జిగతోపాటు మిగిలిన వంటకాలు వుంటాయి. భర్తలు

తిన్నాక ఆ విస్తరిలో భుజించాలి. ఒక రోజు మా బంధువు ఒకామె భర్త విస్తరి అనుకొని ప్రక్కవాళ్ళ విస్తరిలో తింటూ "ఎన్నడూ వదలి పెట్టని మీనాన్న ఈ రోజు మామిడి పండు వదిలేశాడేమిటే" అన్నది దీర్ఘం తీస్తూ. అది విన్న కూతురు ఫకాలున నవ్వి "అది నాన్నగారి విస్తరి కాదమ్మా' – అన్నప్పుడామె బాధ ఏమని వర్ణించాలి!

ఇక మడి కట్టుకొని వండాలి. దేవతార్చనయ్యాక నైవేద్యం పెట్టి వడ్డించాలి. మళ్లీ రాత్రి వంటా వార్పూ ఈ మధ్యలో బట్టలు, అంట్లు వగైరాలెన్నో! మరెన్నో! వైశ్వదేవపరులు, సోమయాజులు (యజ్ఞం చేసిన వారు) చైనులు లాంటివారు వచ్చి – మామగారు అగ్రహారీకులు గనుక–విడిది చేసేవారు. గాజులు తీసి తడిబట్టలతో వండాలి. ఆ రోజుల్లో నేను చేయని వ్రతం లేదు. ఎప్పుడూ పూజలు, ఉపవాసాలు చెయ్యటం మా కుటుంబాచారం. 365 నోముల పుస్తకాలు వుండేవి. ప్రతి అమ్మాయికి పెళ్ళి కాగానే ఆ పుస్తకం బహుమానంగా ఇచ్చేవారు. దరిదాపు నెలకు 10 రోజులు మామూలు పూజలు కాక మంగళగౌరి వ్రతం, అయిదవ తనం కోసం సావిత్రీ నోము, 16 ఫలాల నోము, ఉదయ కుంకుమ నోము, కన్యగా వుండగా కన్నె తులశమ్మ నోము, ఉండ్రాళ్ళ తద్దె, అట్ల తద్దె, అష్ట గౌరి వ్రతం, సూర్య చంద్రుల పూజలు, లక్ష వత్తుల నోము, ఏకాదశీ గురువారం ఇలా ఒక్క టేమిటి అన్నీ ఐదవ తనంకోసమే – వీటన్నింటికీ ఉపవాసాలు చెయ్యాలి. సంతర్పణలు, సమారాధనలు, ముతైదువులకు మూసి వాయనాలు – ఇవన్ని మా అత్తగారు దగ్గరుండి యధావిధిగా చేయించేది. చెయ్య లేక నా తల ప్రాణం తోక కొచ్చేది. సంవత్సరానికి నాలుగు సార్లు సముద్ర స్నానాలు విధిగా చెయ్యాలనేది తప్పని సరి. ఆషాడం, కార్తీకం, మాఘం, వైశాఖంలలో (ఆ.కా.మా.వై) పసి పిల్లలతో, ఇంటి చాకిరితో ఇదంతా చేస్తూ, కార్తీక మాసం ఒంటి పూట భోజనంతో ప్రాణం నకనకలాడి పోయేది. ఒకరోజు చాటుగా జామపండు తిన్నా. నోటి వాసనతో మా అత్త పట్టేసింది. ఇక తిట్టలేదు కాని చెప్పరాని కోపం వచ్చింది. ఆమె చెప్పినట్లు వింటే నెత్తిన పెట్టుకొని చాకిరి అంతా చేసేది. కోపం వచ్చిందంటే వారం రోజులనుండి నెలవరకు బిగుసుకు పోయేది. అన్నానికి కూడా పిలిచేది కాదు. అందువల్ల నేమో నాభర్త కన్నా ఆమె అంటే నాకు చచ్చే భయం.

ఈ బాధలు చాలక ఈ జన్మ చరితార్థతకు, పునర్జన్మ రాహిత్యానికి మా అత్త నాకు ఉపదేశం చేయించింది. మా అత్తకు చిన్న గురువులు, పెద్ద గురువులు, స్వాముల వార్లూ, పురాణ శాస్త్రులవారు, సన్యాసులు అనేకమంది వుండేవాళ్ళు. వాళ్ళకు భిక్షలు చేసేది. కాషాయ బట్టలు (శాటీలు) ఇచ్చేది. వెండి పీటలు, పూజా సామాగ్రి ఇవ్వటమే కాక వారికి సేవలు అత్యధికంగా చేసేది. తాను నా పాత బట్టలు కట్టుకొని క్రొత్త చీరెలు శాస్త్రుల్ల భార్యకు ఇచ్చేది. పిండి వంటలలో తన వాటా తినకుండా వాళ్ళకు పెట్టేది. వాళ్ళ ఇళ్ళకు నా ద్వారా ఫలహారాలు మడి బట్టలతో పంపేది. పట్టు బట్టలు కట్టుకొని

గుంటూరు తారు రోడ్లమీద వెడుతుంటే కాళ్ళుకాలి బొబ్బలెక్కేవి. ఆరోజుల్లో చెప్పులేసుకుంటే తప్పు. కళ్ళద్దాలు పెట్టుకుంటే భోగంది అనే వాళ్ళు. ఎంత కష్టపడితే అంత పుణ్యమని ఆమె భావం. ఎంత త్యాగం చేస్తే అంత వైభోగం మరో జన్మలో పొందుతామట. తాను చేసేది, నాచేత చేయించేది. మామగారికి అంత చాదస్తం లేకపోయినా అత్తగారికి అడ్డం చెప్పేవారు కాదు, పైగా ఆయన చేతకూడా చేయించేది. అవి చాలక తద్దినాలు, పిండ ప్రదానాలూ తరుచూ వస్తూవుండేవి. పెద్దవాళ్ళకు జబ్బులొస్తే మంచి పోషణ, వైద్యం చేయించే వాళ్ళు కాదు. ముడుపులు కట్టి, దేవుళ్ళ పేరుతో బ్రాహ్మణులకు దానాలు ఇచ్చేవాళ్ళు. నవగ్రహాల పూజలు, శని పట్టాడని శనిగ్రహ పూజలు చేసేవాళ్ళు. వాళ్ళు జబ్బుతో చస్తే ఇళ్ళూ వాకిళ్ళు తాకట్టు పెట్టి అయినా దిన వారాలు, మాసికాలు, తద్దినాలు, సంవత్సరీకాలు భారీ ఎత్తున జరిపేవాళ్ళు. అది వారి భక్తి ప్రపత్తులకు నిదర్శనం. ఇక ఎంత చిన్న పిల్ల అయినా భర్త గతిస్తే, గర్భిణి అయితే తప్ప, శిరోముండనం చేయాల్సిందే. లేకపోతే వంటకు, పూజకు ఆమె అనర్హురాలు. నాజన్మ చరితార్థమవుతుందని చేయించిన ఉపదేశం నాకు కంటకప్రాయమయింది. నా గురువు చెవిలో చెప్పిన మంత్రం "ఓం శ్రీ రాం రామాయనమః గౌరీయనమః "అంటూ రోజుకు కనీసం లక్షా పదివేల సార్లు జపంచేసి ఈ ఫలితాన్ని గురువుకు ధారపొయ్యాలట. లేకపోతే గురుద్రోహ పాపం ఏడు జన్మలదాకా పీడిస్తుందని చెప్పాడు. ఈ మంత్రం ఇన్నిసార్లు ఎప్పుడు చెయ్యాలి? పిల్లల చాకిరి, ఇంటి చాకిరీ చాలక ఇదొక పోరు. అబద్ధం చెపితే ఏం ముంచుకొస్తుందో అనే భయంతో పనిచేస్తూనే లోపల జపం చేస్తూండేదాన్ని. ఆయన మహా భోగ పురుషుడు. వొళ్ళంతా వెన్న పూసి 5 బిందెల వీళ్ళతో స్నానం చేయించేవారు శిష్యులు. పట్టు బట్టలు, సీలింగు ఫ్యాన్లూ, గడియారం, ద్రాక్షారసంతోపాటు పిండి వంటలతో కుతికె దాకా పెట్టాలి. ఆయన ఉచ్ఛిష్టాన్ని, అంటే, ఎంగిలిని శిష్యులంతా ప్రసాదంగా పంచుకునే వారు. ఆయన శిష్యులంతా ధనవంతులే. అందులో యవ్వనవతులైన విధవలు, భర్తృ తిరస్కృ తులు, ఇతర స్త్రీలు హెచ్చుగా వుండేవారు. ఒకనాడు ఆయన బోధ చేసే సమయంలో నాతో "గురువుకు తను, ధన, మనః, ప్రాణాలు సమర్పించాలని "హెచ్చరించారు. నేను, మరొకామె లేచి "స్వామీ! తనువు భర్తకర్పించాం కదా గురువు కెలాగండి!" అని ప్రశ్నించాం. ఆయన మండిపడి "మీ వెధవ దేహా లెవరికి కావాలి? అది శాస్త్ర ధర్మం కనుక చెప్పా" నన్నాడు తీవ్రస్థాయిలో. ఎదురు మాట పలికితే మహోగ్రుడయి పొయ్యేవాడు. ముందున్న కమండలంలాంటి వస్తువులు నేలకేసి కొట్టేవాడు. దిక్కూ మొక్కు లేక ఊడిగం చేసే ఆడవారి పై చెయ్యి కూడా చేసుకునేవాడు.

ఒకనాడు 'ఈ సంసార తాపత్రయం వదలి కొన్నాళ్ళు నా ఆశ్రమానికి వస్తే జన్మ తరించే బోధలు చేస్తా. ప్రశాంత వాతావరణంలోనే శ్రవణం జరగాలి "అని ప్రధమ

శిష్యురాలి ద్వారా ఉత్తరం వ్రాయించాడు. పిల్లల్ని తను చూస్తాననీ నన్ను ఆశ్రమానికి వెళ్ళి రమ్మని మా అత్త సలహా ఇచ్చింది. ఇదంతా 'బోగస్' అని ఆమెకు తెలియదు. ఎంత సేపు నాకు ముక్తి కలగాలని ఆమె ధ్యేయం. నాకు మాత్రం తత్తర పుట్టింది. కాళు ్ళ గడ గడా వణికి పొయ్యాయి. నిశ్చేష్టురాలినయి పొయ్యా. ఒక విధంగా ద్వేషం పుట్టింది. అసహ్యం కలిగింది. ఇతడు స్వామిజీ కాదు జారుడుగా కనిపించాడు. ఆ కుహనా సన్యాసికి బుద్ధి చెప్పక తప్పదనిపించింది. జపాన్ని గంగలో కలిపేశా. ఆ తరువాత 'ఇలా అన్నాడండి' అని నా భర్తతో చెప్పగా ఆయన కోపోద్రికుడై మా అత్తగార్ని "నీవు కాక చిన్న పిల్ల ఆమెకెందుకు ఉపదేశం చేయించావు? నాకు చెప్పవద్దా?' అని గద్దించాడు. అందుకామె "అదేమిట్రా నాయనా! మోక్ష సాధనంలో ఎవరికెవరు? ధర్మార్థ కామాల వరకే భార్యా భర్తల సంబంధం. మోక్షప్రాప్తికి ఒకరి ప్రమేయం కాని, అదుపు ఆజ్ఞలు కాని అక్కరలేదు. ఆఖరికి భర్తకయినా ఆ అధికారం లేదు. ఎవరి దారి వారిదే. మహా అదృష్టవంతురాలు కనుకనే ఇంత చిన్న వయస్సులో మహా మహితాత్ములకు కాని దక్కని జ్ఞానతృష్ట నా కోడలికి కలిగింది. ఇంక దాని దారికి మనం అడ్డం పోరాదు" అని మహా ప్రవక్తలా ఉద్బోధించింది. ఆమె ఉచ్చారణ, ఠీవి, దర్పమూ చూచి నా భర్త నిర్ఘాంత పోయాడు. ఇంత కాలం తన ఉపేక్షవల్లే తల్లి, భార్య ఇంత దాకా వచ్చారని గ్రహించి నిజంగా "నాకు నీవే గురువు వయినావమ్మా ! ఈనాటికి నా కన్ను తెరిపించావమ్మా! ఇదంతా నా స్వయం కృతాపరాధం. నీకు ఒక్కగానొక్క బిడ్డను. నా భార్యకు నా సిద్ధాంతాలు బోధిస్తే ఆమె ఒక హేతువాదిగా మారితే, ఒక స్వేచ్ఛా పరురాలుగా మారితే, ఒక ప్రజాస్వామిక వాదిగా పరిఢవిల్లితే కుటుంబ ఐక్యత నశిస్తుందని, నా తల్లి దండ్రులు నిరాశ్రయులయి పోతారని, కుమారుడు ఎలా వున్నా కోడలు కలిసి మెలసి సంచరిస్తే సమాజం కాని, తల్లిదండ్రులుకాని హర్షిస్తారనే విశ్వాసంతో వుండేవాణ్ణి. అలా నా తెలివి తేటలు వమ్మయినాయి. నాస్వార్థం నామీద దెబ్బతీసింది. నా భవిష్యత్తు వక్రమార్గాన పడటానికి నేనే కారకుణ్ణి "అని బదులు పలికాడు నా భర్త. ఆ సంభాషణే మా ముగ్గురి జీవితాలకు ఒక మలుపు అయింది. అప్పటి నుండి ఆమె నా జోలికి రాలేదు.

నేను మాత్రం ఆలోచనలో పడ్డా. అటు భర్తకు సమాజ సేవ, దేశభక్తి, సంస్కరణ భావాలు, ఉద్యమాలు, ఆచరణలూ ఆదరణీయాలుగా వున్నాయి. సంపాదన మీద ధ్యాస లేదు. ఏది మంచి పని త్యాగంతోనూ, నిశ్చలచిత్తంతోను చెయ్యాలనే ధ్యేయం ఆయనది. ఇటు అత్త అద్వైత వాది (వేదాంతి), మోక్ష సాధనకోసం, ఆశ్రమాలు, గురువులు 'అహం బ్రహ్మోస్మి' లాంటి తత్వం ద్వారా భవబంధ విముక్తి కోసం తాపత్రయం. ఇక నా పాత్ర ఏమిటి అని దీర్ఘంగా ఆలోచించు కున్నా. ఇటో, అటో ఏదో ఒక నిర్ణయం తీసుకోవాలి. రెండూ కలియవు. ఉత్తర ధృవం, దక్షిణ ధృవం లాంటి సిద్ధాంతాలు. ఇద్దరూ నిజాయితీ పరులే, త్యాగ ధనులే, ధైర్య సాహసాలు కలవారే, సేవా తత్పరులే. ఒకరు జన్మ, కర్మల

రాహిత్యానికి తమ మార్గమే సోపానమని నమ్మిన కర్మ వాదులు, మరొకరు సంస్కరణ ద్వారా సమాజాన్ని మార్చి తద్వారా మానవాభ్యుదయాన్ని కాంక్షించే మానవవాదులు. ఈ రెండు మార్గాల మధ్య ఏ మార్గము తెలియని అజ్ఞాన తిమిర అయోమయ మార్గం నాది.. ఇప్పుడేం చెయ్యాలో అనేదొక పెద్ద సమస్య అయింది. అప్పటికే నేను పది సంవత్సరాల లోపు వయసుగల నలుగురు పిల్లల తల్లిని. చివరికి నా భర్త మార్గమే సరైనదనే నిర్ణయానికి వచ్చాను. అలాకాక ఆ ఆధ్యాత్మిక మార్గాన్నే పయనిస్తే వారికి దక్కకుండా పోయేదాన్ని. వారి భవిష్యత్తు మరోలా తయారయ్యేది. నా పరిస్థితి మరోలా మారిపోయేది. ఆ తరువాత వివిధ సిద్ధాంతాల గురించి వాటి మూల సూత్రాల గురించి కొంతగా కొంత తెలుసు కొన్నాను. ఇంకా తెలుసుకోవలసింది అనంతంగా వున్నదని నాకు అప్పటి వరకూ తెలియనే తెలియదు. అప్పటినుండి ఆ జన్మాంతం విద్యార్థిగా వుండి ఇంకెంతో తెలుసుకోవాలనే తపన నాలో పెరిగింది.

# భాగం – III

# జాగృతి : చైతన్యం

# 1. జాగృతి

బొత్తిగా విద్యా విజ్ఞానాలు తెలియని నేను ఆధునిక విజ్ఞానం అసలే ఎరుగని నేను 'నాలో జాగృతి, చైతన్యం ఎప్పుడు కలిగింది. ఎలా కలిగింది. ఎందుకు కలిగింది' అనేది చెప్పాలంటే అదొక అద్భుతమే కాదు ఆశ్చర్యకరమైన విషయం కూడా. నాది పెళ్ళి సంగీతంలాగా పెళ్ళి చదువు కూడా. కాపురానికి వెళ్ళే కాలానికి నా చదువు ఆగిపోయింది. 1937 మే నాటికి 7 క్లాసులు మాత్రం హయ్యరు ఎలిమెంటరీ స్కూల్లో చదివాను. ఆ రోజుల్లో కనుపర్తి వరలక్ష్మమ్మ గారు రచయిత్రిగా సంఘ సేవకురాలిగా మంచి పేరు ప్రఖ్యాతులువున్న విదుషీమణి. ఆమె నడిపే స్త్రీ హితైషిణీ మండలివారు నిర్వహించే ఆటల్లో, వాగ్వివాదాల్లో, నాటకాల్లో, ఇతర సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొనటం వల్ల 'నేనూ ప్రయోజకురాలినే' అనే భావం కల్గింది. ఆమె నాకు గురుతుల్యులు. తన ఆశయాలతో సంస్థను నడిపే పద్ధతిలో ఆమె సంస్కర్త, స్త్రీజన పక్షపాతి. అసలు ఆడవారు అసూర్యంపశ్యలుగా వుండే రోజుల్లో ఆ మండలికి చాటు మాటుగా సందుల్లో పడి పొయ్యే వాళ్ళం. అంటే ఆనాటికే నాలో కొంత చైతన్యం ఏమూలో వుండేదన్న మాట.

నేను 14 ఏళ్ళ నాటికే తల్లినయినా, చదువుమీద, ఆభరణాల మీద, చీరసారెల మీద మోజు పోలేదు. 1940 జూన్ లో రామ్మూర్తిగారు చదువుకు కాశీ వెళ్ళారు. తొలిచూలు పూర్ణానందం రెండేళ్ళు పెరిగిపోయాడు. తరువాతి వాడు కామేష్ నెలల పిల్లవాడు. అప్పుడు కావాల్సినంత తీరికవుంది. కనుక చదువుకుంటానని అత్తగారిని అడిగాను. ఆ రోజుల్లో ఇళ్ళకు వచ్చి ప్రయివేట్లు (ట్యూషన్లు) చెప్పే ఆడ టీచర్లు లేరు. మగ టీచరు దగ్గర నేర్చుకోవాలి. మా అత్తగారు ససేమిరా అంగీకరించలేదు.

"చిన్న వయస్సు దానివి, భర్త ఊళ్ళో లేనప్పుడు ఒంటరిగా పర పురుషునివద్ద చదువు కొనటానికి వీలులేదు" అంది. నాకు మనస్సు చివుక్కుమంది. బాధపడ్డాను. ఈ సంగతి రామ్మూర్తిగారికి ఉత్తరం వ్రాశాను. నేను చదువు పూర్తి చేసుకొని వచ్చేదాకా ఓపిక పట్టమని తర్వాత నీ కోర్కె తీరుస్తానని జవాబు వ్రాశారు. గ్రుడ్ల నీళ్ళు గ్రుడ్లకు కుక్కుకొని ఊరకున్నాను. ఈ సందర్భంలో ఒక విషయం తెలియజేయక పోతే అపార్థం వస్తుంది. ఏ అత్తగారు అయితే 1940లో నా చదువు వీల్లేదన్నారో ఆ అత్తగారే తనంత తానుగా "పిల్లలను నేను చూసుకుం టాను. నీవు హైదరాబాదు వెళ్ళి చదువుకో" అన్నారు 1961లో. దీనిని బట్టి ఆమె సంప్రదాయానుసారిణి కనుక తత్ఫలితంగా ఆమె సంకోచించిందని నాకు తర్వాత అర్ధమయింది. కాని ఆనాడు ఆమెను నమిలి మ్రింగుదామా అన్నంత కోపం వచ్చింది. మండిపోయాను.

1948లో నాలుగవ పురిటికి కాన్వెంటు ఆస్పత్రికి వెళ్ళిన నేను అక్కడ లేడీ

డాక్టర్లను, నర్సులను చూస్తుంటే నేనూ చదువుకొని అలా ఉద్యోగం చెయ్యాలనే నాలోని కోరిక తీవ్రరూపం దాల్చింది. చదువుకోవాలనే జిజ్ఞాస ఎక్కువయింది. అయినా కుదరలేదు. అత్త సేవ, పతి సేవ, కాన్పులు, పసిపిల్లల పెంపకాలు అడ్డువచ్చాయి. నాకు 25 ఏళ్ళు నిండే నాటికి 5 గురు పిల్లలు కలిగారు. ఇంక పిల్లలు వద్దని ఆపరేషన్ చేసుకున్నాం. మా అమ్మాయికి నాలుగేళ్ళ వయస్సు వచ్చేదాకా అంటే 1953 వరకు తీరికలేని జీవితం గడిపాను. 1952 నుండి కాస్తంత గాలి పిల్చుకోగల్గాను. స్త్రీ హితైషిణీ మండలిలో మెంబరుగా చేరాను. క్రమేపి సెక్రటరీగా ఎదిగాను. స్త్రీల గృహ పారిశ్రామిక సహకార సంఘంలో చేరాను. సమాజమంటే ఏమిటో కాస్తంత తెలియసాగింది. కొంత చైతన్యం వచ్చింది, సంఘాలలో పనిచేస్తున్నా. స్త్రీ సమస్యలపట్ల. సమస్యల యెడ స్పందన కలిగింది. క్రమేపి నాలో జిజ్ఞాస పెరిగింది. అదే నాలో చైతన్య స్ఫూర్తికి దారితీసింది.

హైదరాబాదులో శిక్షణ, తదుపరి కుటుంబ నియంత్రణ జిల్లా గౌరవ ప్రబోధపు పదవి నాలో చైతన్యాన్ని హెచ్చుగా రేకెత్తించి జాగృతికి మూల కారణమయింది. గ్రామాలు తిరగడం వల్ల అనేక సమస్యలు, అడ్డంకులు నా పై స్వైర విహారం జరపటంవల్ల ఎంతో లోకజ్ఞానం కలిగింది. ఇంకా సాంఘికాచారాల వల్ల మూఢ విశ్వాసాలవల్ల నాలో మార్పు రాసాగింది. ముఖ్యంగా గురువు దుర్ ప్రబోధం నన్ను పూర్తిగా మలిచింది. ఒకటేమిటి, కాలము, పరిస్థితుల ప్రభావం, కుటుంబాచారాలు, హెచ్చుతగ్గులు అన్ని కలిసి నా జీవితాన్నే మలిచాయి. ఆంధ్రోద్యమం నా మీద చెరిగిపోని ముద్రవేసింది. ముఖ్యంగా హేతువాదతత్వం, హ్యూమనిష్టు ఫిలాసఫీ కలిసి నన్ను నూరుపాళ్ళు ఫెమినిష్టుగా తీర్చిదిద్దాయి. ఒక విషయం, ఒక రంగం, ఒక వ్యక్తి ఒక సంఘటనా కాదు. ఆ, ఈ అననేల అనేక విషయాల కూటమివల్ల నాలో చైతన్యం, జాగృతి కలిగింది. అందువల్లే అవి నా జీవితంలో విడదీయరాని రీతిలో కలిసిపోయాయి. అలా జీవితానుభవాన్నుండి పొందిన జాగృతికి, చైతన్యానికి శాశ్వతత్వం వుంటుందని నా అనుభవం ద్వారా తెలుసుకున్న నిత్య సత్యం.

# 2. సేవా కార్యక్రమం

## సేవాభావ ఆవిర్భావం

చిన్ననాడు స్త్రీ హితైషిణీ మండలి కార్యక్రమాల్లో పాల్గొన్న కారణంగా మండలి అధ్యక్షురాలు శ్రీమతి కనుపర్తి వరలక్ష్మమ్మ గారి ప్రభావము నా మీద పడిందని చెప్పాలి. ఆమె అన్ని సాహితీ ప్రక్రియలను వాడిన రచయిత్రి. ఆనాడు ఆమె చదువు అత్యల్పం క్రింద లెక్క. అయినా స్వయం కృషితో వాసిగాంచిన విదుషీమణి. తోటి స్త్రీలలో జాగృతి, చైతన్యం కలిగించాలనే ఆమె ఆవేదన అనన్య సామాన్యం. కాగా ఆనాటి పరిస్థితులలో ఆమె కార్యక్రమాలు మధ్య తరగతి స్త్రీలకు పరిమితం. అప్పటికే ఆమెకు రాష్ట్ర వ్యాప్తంగా పరిగణన వచ్చింది. ఆమె జీవితం నాకు మొదట్లో స్ఫూర్తినిచ్చింది.

బాపట్ల స్త్రీల కుటీర పరిశ్రమల సహకార సంఘాన్ని నడుపుతున్నారు సర్వశ్రీ ఊటుకూరి లక్ష్మీకాన్తమ్మ, వెలగపూడి వైదేహి ప్రభృతులు. దానికి నన్ను కార్యదర్శిగా ఉ ండమన్నారు. సరే నన్నాను. రెండు కుట్టు మిషన్లు ఉన్న ఆ సంఘంవారు ఆడపిల్లలకు కుట్టు నేర్పించే వారు. రెండు రూపాయల ప్రవేశ రుసుముతో ఆడపిల్లలు కోర్సులో చేరడానికి అవకాశం ఉండేది. ఎప్పుడూ ఇరవై మందికి తక్కువ లేకుండా వుండేవారు. అయితే కార్యదర్శి పదవి నిర్వహించే వారు అనేక పనులు చేయాల్సి వచ్చేది. నేర్పే అతని చేత, నేర్చుకునే పిల్లల చేత బట్టలు కుటించడం, బిల్లులు వ్రాయటం, వసూలు చేయించటం, లెక్కలు వ్రాయడం, సంఘ కార్యకలాపాలను అజమాయిషీ చేయడం, రేడియో కార్యక్రమాలు నిర్వహించడం, అధికారులు వొస్తే మాట్లాడి పంపటం లాంటివి కార్యదర్శి పదవిలో వున్నవారి బాధ్యత. అన్ని పనులూ ఏదో ఆవేశించిన వ్యక్తిలాగా కష్టమనుకోకుండా చేసేదాన్ని. 1954లో ఇలా ప్రారంభమైంది నా సేవా కార్యక్రమం.

1958లోనే స్త్రీ హితైషిణి మండలి కార్య నిర్వాహకవర్గం నన్ను సహాయ కార్యదర్శిగా ఎన్నుకుంది. యువతులకు సంక్షిప్త బోధనా తరగతులను (కండెడ్ కోర్సు) నడిపే వారు. ఈ స్కీమును కేంద్ర సాంఘిక సంక్షేమ బోర్డు ఆధ్వర్యంలో శ్రీమతి దుర్గాబాయ్ దేశ్ ముఖ్ నెలకొల్పారు. ఆనాడు ఆమె కేంద్ర సాంఘిక సంక్షేమ బోర్డుకు అధ్యక్షులు. ఆమె తన వ్యక్తిత్వ ప్రభావంతో ప్రధానమంత్రి జవహర్ లాల్ నెహ్రూతో వాదించి భారీగా (ఆనాటి లెక్కన) గ్రాంటు సంపాదించారు. అది ఎనిమిది కోట్ల రూపాయలు మాత్రమే. రాష్ట్ర సంక్షేమ సలహా సంఘం ఆ కోర్సు నిర్వహించటానికి బాపట్లలోని స్త్రీ హితైషిణి మండలిని ఎన్నుకోవటం జరిగింది. ప్రథమ కోర్సు జరిగిన సమయంలో నేను సహాయ కార్యదర్శిగా హాస్టలు నిర్వహణ బాధ్యతను స్వీకరించగల్గటం నా అదృష్టము. నేను వూహించని విషయం. హాస్టలులో ఉన్న యువతులకు ఆహార వస్తువులు ప్రతి దినము యివ్వటం, వారి యోగక్షేమాలు విచారించటం నా కర్తవ్యం. నా దినచర్యలో

భాగంగా ఆ పని చేసేదాన్ని. ఒక్కొక్క కోర్సు 2 సం॥ లు సాగేది. ద్వితీయ కోర్సు జరిగే రోజుల్లో నేను కార్యదర్శిని అయ్యాను. హైదరాబాదులో చదువుకున్న సంవత్సరం మినహా నా బాధ్యతలను నేను నిర్విహించే దాన్ని.

## ఆనాటి ఒక చిన్న అనుభవం

ఒక రోజున మామూలుకు భిన్నంగా సాయంత్రం వేళ హాస్టల్ కు వెళ్ళాను. నేను విద్యార్థినులతో మాట్లాడుతున్న సమయంలో ఒక తమలపాకు కిళ్ళీ ఒక విద్యార్థిని కాళ్ళముందు పడ్డది. నా కాశ్చర్యం కలిగింది. ఆ అమ్మాయిని ఆ కిళ్ళీని ఊడదీయమన్నాను. అందులో ఆ అమ్మాయి పేరున వ్రాసిన ప్రేమలేఖ కనిపించింది. ఆ అమ్మాయిని గద్దించి అడిగితే ఉత్తరం వ్రాసిన కుర్రవాడి పేరు చెప్పింది. అతని చిరునామా కూడా తెలుసుకున్నాను. ఈ విషయం ఎం.వి.ఆర్.కి చెబితే ఆయన తన మేనమామ కుమారునికి (ఆయనకి ఆ పట్టణంలో బాగా పలుకుబడి వుంది) ఆ వార్త అందజేశారు. ఆయన వాడిని పిలిచి చెంప పెట్టువేశారు. అంతటిలో సమసి పోయిందని అనుకున్నాం. కానీ అలా జరగలేదు. రామ్మూర్తిగారు, ఆయన మేనమామ కొడుకూ ఇళ్ళ వెలుపల ఆరు బయట పడుకుంటుండే వారు. వారిళ్ళు ప్రక్క ప్రక్కనే వుండేవి. రాత్రి రెండు గంటలప్పుడు ఒక వ్యక్తి రెండిళ్ళ మధ్య రోడ్డు మీద తిరగాడుతున్నాడు. వారిరువురూ లేచి అతన్ని వెంబడించారు. తీరా చూస్తే అతను ప్రేమలేఖ వ్రాసి, చెంపదెబ్బతిన్న యువకుడని తేలింది. ఆడపిల్లల హాస్టల్ నిర్వహణలో వున్న ఇబ్బందులలో ఇలాంటివి ఎన్నో వుంటాయి. వీటిని ఓర్పుతో నిదానంతో, తాపీగా ఆచితూచి వ్యవహరించి పరిష్కరించవలసి వుంటుందని నాకప్పుడు అర్థమైంది. ఇది ఈనాటికీ జ్ఞాపకం చేసుకోవలసిన విషయం. హాస్టల్ వార్డెన్ ల అనుభవంలో వున్న వాస్తవిక సూత్రం.

1958లోనే మెట్రిక్ చదువు ప్రారంభించి సాగించటం ఒక సంఘానికి సహాయ కార్యదర్శిగా పనిచేయడంవల్ల స్త్రీల కుటీర పరిశ్రమల సహకార సంఘానికి కార్యదర్శిగా పనిచేయటంవల క్షణం తీరిక ఉండేది కాదు. ఎక్కడ లేని బలంతో, తరగని ఆవేశంతో సడలని పట్టుదలతో పనిచేసుకొని పోయేదాన్ని. ఇలా 1958లో నా సేవా కార్యక్రమాలు ఒక్క పెట్టున ప్రారంభమయ్యాయి.

## బాపట్లలో మహిళా సంఘాలలో

స్త్రీ హితైషిణి మండలిలో నా పాత్ర, స్త్రీల గృహ పారిశ్రామిక సహకార సంఘంలో నా కృషి ఇదివరకే వివరించాను. కాగా ఒకటి రెండు విషయాలు ముచ్చటించటం అవసరం.

శ్రీమతి కర్లపూడి కమలమ్మ శారదా మహిళా విజ్ఞాన సమితిని స్థాపించింది. ఎంతో శ్రమించి చందాలు పోగుచేసి సమితికి భవనాన్ని కట్టించింది. దానికి నన్ను అధ్యక్షురాలిగా వుండమని కోరితే నేను అంగీకరించి ఆ సమితిలో పనిచేశాను. స్త్రీలను ఉత్సాహపరచి సభ్యత్వాన్ని పెంచాను. అనేక ఉపన్యాసాలు ఏర్పాటు చేశాము. స్వాతంత్ర్య దినోత్సవం లాంటివి జరిపాం. వ్యాస రచన, వక్తృత్వ పోటీలు పెట్టి స్త్రీలలో ప్రతిభాశక్తులు పెరగటానికి దోహదం చేశాను.

# 3. విద్య

## విద్యాసక్తికి తిరిగి స్ఫూర్తి

అంతకు సంవత్సరం క్రితమే గర్భస్రావం అయి చాలా నీరసించటంవల్ల ఈసారి నాల్గవ పురిటికి గుంటూరు కాన్వెంట్ హాస్పటల్ లో చేరాను. ఇంటినుండి బయటికొచ్చి మొదటిసారి హాస్పటల్ లో చేరటంవల్ల అక్కడ డాక్టర్లు, నర్సులు రావటం రోగులను చూడటం అంతా వింతగా వుండేది. అక్కడ ఒక చక్కని లేడీ డాక్టరు వుండేది. ఆమె అందమైన ముఖము, చక్కని పలు వరుస, జుట్టు ముడి మీద నెట్టు వేసుకొని ఎంతో చలాకీతనంతో మెడలో స్టెత్ వేసుకొని నడుస్తుంటే ఆమె వెనక లేడీ డాక్టర్లు, హవుస్ సర్జన్లు, నర్సులు చకచకా అనుసరించి పోతూవుండే వారు. ఆ దృశ్యం నాకెందుకో మరుపురాని మహానందంగా వుండేది. ఆమెకేసి కళ్ళార్పకుండా చూసేదాన్ని. మా బోటి వాళ్ళు చదువు, సంధ్యలు లేకుండా ఇంటి చాకిరీ, పిల్లలను కనటం, ఇంతకుమించి ఏమీ సాధించలేని దుర్భర జీవితాన్ని గడుపుతున్నాము కదా అనే ఆవేదనతో నా మనస్సు అంతా వికలమయ్యేది. "నేనూ చదువుకొని ఒక డాక్టరును ఎందుకు కాలేకపోయాను? వాళ్ళ జీవితంలో వున్న హుందా నా జీవితంలో లేదు కదా! ఇల్లే స్వర్గం, కడుపే కైలాసంలా ఎందుకు బతుకుతున్నట్లు? ఏమి సాధించినట్లు? నేనూ ఒక మనిషినేనా? చదువులేదు, సంస్కారమూ లేదు. ఎంత సేపూ నగలు, ఆస్తులు, సంసారం ఇదేనా జీవిత గమ్యం !" అనే జిజ్ఞాస నాలో ప్రారంభమయింది. "ఇప్పుడు నేను చదవాలన్నా అలాంటి అవకాశం నాకు దొరుకుతుందా? పిల్లల తల్లినైన నేనెక్కడ, విద్యావకాశాలు ఎక్కడ?" అనే తపనతో నాలో విద్యాసక్తి అంకురించింది. ఆమె కూడా నాలాగే పుట్టింది కాని ఆమెకు పరిస్థితులు అనుకూలించాయి, అలాగని నిరాశతో, నిట్టూర్పులతో గతాన్ని గురించి ఆలోచిస్తూ కూర్చుంటే ఏ కార్యాన్నీ సాధించలేము, పరిస్థితుల్ని మన అదుపులోకి తెచ్చుకుంటే మనమూ అంతవారము కాగలం అనే నిశ్చయానికొచ్చాను.

ఆ తర్వాత (1954లో) దుర్గాబాయమ్మతో పరిచయం కాగా ఆమె ధీశక్తి నన్ను ఆకర్షించాయి. ఆమె తన ముప్పయివ ఏట మెట్రిక్ తో చదువు మొదలు పెట్టి లాయరయ్యి, రాజకీయాలలో ఉన్నత స్థానానికి ఎదిగి, ఎన్నో సంస్థలు స్థాపించి, ఆడవారి అభ్యున్నతికి పాటుపడటం చూసిన నేను ప్రభావితురాలనయినాను. అంతకుముందు నాలో అంకురించిన విద్యాసక్తి, అభ్యుదయ భావాలు, సేవా దృక్పథం, ఇంకా పెరిగి కార్యరూపం దాల్చాయి. ఒక విధంగా చెప్పాలంటే దుర్గాబాయమ్మ నాకు ఏకలవ్య గురువు అని చెప్పుకోటానికి నాకు గర్వంగా వుంటుంది. 'ఇక భూమి తలక్రిందులయినా సరే నేను చదవాల్సిందే, ఉద్యమాలు స్థాపించాల్సిందే, మహిళాభ్యుదయానికి పాటుపడాల్సిందే, అహోరాత్రులు కష్టపడి చదివి పరీక్షలు పాసయి ఆ తర్వాత సాధించాల్సిందే. ఈ

పనికి ఎవరు అడ్డువచ్చినా ఇక ఆగేది లేదు' అనే పట్టుదల కలిగింది. కార్యసాధనకై ఎదురుచూడటం మొదలయింది.

## విద్య – శిక్షణ

నా విద్య అన్నవరపువారి బాలికా పాఠశాలలో ఓనమాలతో ప్రారంభమైంది. 5 క్లాసులు కాగానే పెళ్ళిచేశారు. వివాహం కుదరటంతో 11వ ఏటనే రజస్వల అయిన నన్ను 13వ ఏటి వరకు చదువుకు పంపటం జరిగింది. ఒక విధంగా ఆ రోజుల్లో అది ఎంతో అభ్యుదయమని చెప్పుకోవచ్చు.. దానికి కారణం మా నాన్నగారే. క్రయిస్తవ అమ్మాయిలు తప్ప హిందూ కన్యలయిన నా స్నేహితురాండ్లకు అందరికీ చదువు మాన్పించి పెళ్ళిళ్ళు చేసేశారు. ఆ తర్వాత కాపురానికి వెళ్ళటం, అక్కడ సంసార బాధ్యతలు, పిల్లల పెంపకం వీటన్నిటిలో పడిపోయినా చదువుమీద ఆసక్తి మాత్రం నాలో నశించి పోలేదు. ఎలాగయినా మళ్ళీ చదవాలనే తపనతో అత్తగారినీ, మామగారినీ మళ్ళీ చదువుకుంటానని అభ్యర్థించాను. నా భర్త అప్పుడు బెనారస్ లో ఎం.ఎ., ఎల్.ఎల్.బి. చదువుకుంటున్నారు. ఆ సమయంలో కొంతకాలం పుట్టింట్లో వుండి చదువుకుందామని బేసిక్ ఇంగ్లీషు పుస్తకాలు పది బాంబే నుండి ఎనిమిది రూపాయలు ఇచ్చి తెప్పించుకున్నా. ఒక మేష్టరుకు నెలకు ఎనిమిది రూపాయలిచ్చి ఇంగ్లీషు మొదలు పెట్టా. హిందీ, సంగీతం కూడా కుదుర్చుకున్నా. ఇంతలో సెలవులకు వచ్చిన నా భర్త నన్నూ పిల్లవాణ్ణి తీసుకువెళ్ళాక మళ్ళీ పుట్టింటికి రాలేదు. పైగా నేను వచ్చాక నేర్పిస్తాలే అని ఆశ పెట్టారు. ఇక అంతే. తాత్కాలికంగా చదువుకు స్వస్తి పలకటం జరిగింది. అలా హిందీ, ఇంగ్లీషు, సంగీతం మూడింటికి దూరమయిపోయింది నా బ్రతుకు. అలా ఆగిన నా చదువు 1958లో పునఃప్రారంభ మయ్యింది. అప్పటికి నలుగురు పిల్లలు పుట్టి పెద్ద వాళ్ళయినారు. అయినా తీరని విద్యాకాంక్ష నన్ను తిరిగి పురికొల్పింది. పిల్లల నోట్సులు నాకు పనికి వచ్చాయి.

నా భర్త పేరు ప్రఖ్యాతులుగల ప్లీడరు కావడంవల్ల ఉపాధ్యాయులు ఇంటికి వచ్చి ఇంగ్లీషు, తెలుగు నాకు ప్రయివేటు చెప్పేవారు. వాళ్ళ శిష్యరికంలో ఎ.బి. సి. డిలతో గుణింతాలతో తిరిగి ప్రారంభమైన చదువుకు ఎంతో కష్టపడాల్సివచ్చింది. ఎందువల్లనంటే అంతకుముందు (చిన్నప్పుడు) చదవుకున్న విద్య మధ్యలో ఆపి సంసార గొడవలలో పడిపోవటం వల్ల పూరిగా మర్చిపోవడం జరిగింది. కుటుంబ బరువు బాధ్యతలవల్ల మళ్ళీ మొదలైన నా చదువు 'గూడ్సు బండిలా కదలింది. పిల్లల పెంపకం, ఇంటిపని మహిళా సంఘాలలలో బాధ్యత, వచ్చి పొయ్యేవారికి మర్యాదలు విధి విరామం లేని శ్రమఅయింది. రోజుకు 18 గంటల కార్యభారం వుండేది. పూర్వం చదివిన చదువుకు పదును లేక తుప్పు పట్టిపోయిన నా విద్య తిరిగి చిగురించింది కదా అనే ఆనందమే నా చేత ఇన్ని కష్టాలను అధిగమించి చదివించింది. అదొక అసిధారావ్రతమయింది. అంటే

ఇంటిపని, పిల్లల పని, అప్పటికే నా నిర్వహణలో జరుగుతున్న మహిళాభ్యుదయ కార్యక్రమాల బాధ్యత, వత్తిడులు వీటివల్ల నా విద్యా వ్యాసంగానికి టైము సరిపోయేది గాదు. రాత్రిళ్ళు 12 గంటల లోపల ఏనాడూ నిద్రించి ఎరుగను. ఒక రోజు అయితే అలాగే (చదువు కుంటూ) తెల్లవారి పోయేది. అన్నం తిన్నానో లేదో మరచిపోయి చదివేదాన్ని. తెల్లారి అన్నంచూచి 'తినలేదేమ'ని మా అత్తగారు కోప్పడేది. అలా చదివి, చదివి 1961 మార్చికి మెట్రిక్ ఎగ్జంషన్' 60 రూపాయలు కట్టాను. తీరా పరీక్షలొచ్చేటప్పటికి నా కాళ్ళు గడగడలాడాయి. శరీరం మొద్దుబారిపోయింది. ధైర్యం అడుగంటింది. నేను 'వెళ్ళనండి' అని బాధపడుతూ ఏడ్చేసా. తప్పుతానని భయం. అదొక తాలూకా హెడ్ క్వార్టర్స్. నా భర్త అక్కడొక పెద్ద ప్లీడరు. నా గురించి చాలామందికి తెలుసు. అప్పటికే చాలామంది నన్ను ఆ వయస్సులో చదువేమిటని ఆక్షేపించారు. ఇక తప్పితే నన్ను "తగుదునమ్మా అని వెళ్ళింది, తప్పింది, రోగం కుదిరింది" అంటూ మరీ ఎగతాళి చేస్తారని ఆ తడవకు పరీక్ష మానేశా. మళ్ళీ 62 మార్చి పరీక్షకు తయారయినా. అయితే పాఠ్యపుస్తకాలు తెలుగు, ఇంగ్లీషు మారిపోయినాయి. అందువల్ల కొంత కష్టమయినా 'స్టాన్డర్డ్' బాగా పెరిగింది. తెలుగు మాష్టారికి (నరిశింగరావుగారు) మొదటిసారి వంద, రెండోసారి టెక్స్ట్ బుక్స్‌కి మరో వంద మాత్రం ఇచ్చాను. ఆ పుస్తకాలు రెండుసార్లు ఆసాంతం పద విభాగం, పద్యం, ప్రతి పదార్థం, తాత్పర్యం సర్వం క్షుణ్ణంగా చదవటంవల్ల తెలుగుభాషా జ్ఞానం బాగా పెరిగింది. ఆ తర్వాత పి.యు.సి, బి.ఏ.లకు కూడా ఆ విద్వత్తే సరిపోయింది. మళ్ళీ ట్యూషన్ ఎరుగను. ఆ మహా పండితుడి శిష్యరికంవల్లనే ఈనాటి నా తెలుగు భాషా జ్ఞానానికి ఆనాడే పునాదులు పడ్డాయి. తెలుగులో ఇంత సాహిత్యం తేగలగటం, చేయగలగటం కూడా ఆ గురువు వల్లే జరిగింది. అలా 1962లో మెట్రిక్ పరీక్ష వ్రాసి అయిదు సబ్జక్టులు ఒకేసారి పాసయ్యాను. ఆ రోజుల్లో ఎందులో తప్పినా మొత్తం తప్పినట్లే. అన్నిటికీ మరలా కూర్చోవాలి. ఒక విధంగా చెప్పాలంటే నా జీవితంలో అదొక గొప్ప విజయమని చెప్పక తప్పదు.

## ఫామిలీ వెల్ ఫేర్ వర్కర్సు ట్రయినింగు

ఆ తర్వాత 1962లో కుటుంబ నియంత్రణ సంఘం ఆంధ్రప్రదేశ్ శాఖవారు ప్రేమలతా గుప్త ఆధ్వర్యంలో ఫామిలీ వెల్ ఫేర్ వర్కర్సు ట్రయినింగు కోర్సుకు ఒక సంవత్సరం ట్రయినింగు ఇస్తామని, మెట్రిక్ పాసయి వుండాలని, 20 సంవత్సరముల నుండి 35 సంవత్సరములోపు వయసు వుండాలని ప్రకటించారు. నెలకు 75 రూపాయలు స్టయిఫెండ్ ఇస్తామన్నారు. అప్లయి చేశాను. ఇంటర్ వ్యూకి పిలిచారు. నేనూ రామ్మూర్తిగారు హైదరాబాదు వెళ్ళాము. ఇంటర్వ్యూ వచ్చిన అభ్యర్థులను ఒక హాలులో కూర్చోబెట్టారు. రామ్మూర్తిగారు బయట వరండాలో కూర్చున్నారు. నాకు ఒక ఉత్తరం

ఇచ్చి అవసరమయితే వాడమన్నారు. నా పేరు పిలిచారు సెలక్షన్ బోర్డువారు. నా అర్హతలు, వయస్సు, భర్త పేరు, పిల్లల పేర్లు, చదువులు, ఉద్యోగాలు అన్నీ నా దరఖాస్తు ఫారంలో ఉన్నాయి. బోర్డు చైర్మన్ డా॥ ఖత్రీ మాజీ రాష్ట్ర వైద్య శాఖాధికారి (డైరెక్టరు) నన్నూ నా దరఖాస్తును ఎగాదిగా చూచారు. ""ఏమమ్మా భర్తతో దెబ్బలాడి దీనికి వచ్చావా? "అన్నాడు. "నా భర్త వాకిట్లో ఉన్నాడు. కావాలంటే పిలిచి అడగండి" అంటూ ఆయన ఇచ్చిన ఉత్తరం ఇచ్చాను. అది ఆయన సమ్మతి తెలిపే పత్రం. ఇంతలో రామ్మూర్తి గారికి పరిచయమైన వ్యక్తి ఆఫీసు సూపరింటెండెంటుగా ఉన్న పోలవరపు శ్రీహరిరావు 'వారిది విశిష్టమైన రాజకీయ కోవ' అన్నాడు. నన్ను సెలక్టు చేశారు. ఆ తర్వాత ఉ ద్యోగం తప్పక చేయాలని లేకపోతే స్టయిఫెండ్ రెట్టింపు తిరిగి ఇవ్వాలని మా చేత 'బాండు' రాయించుకొని కోర్సులో చేర్చుకున్నారు.

38 సంవత్సరాల దాన్ని ఏనాడు ఇల్లు కదలనిదాన్ని ఏమీ విద్యా గంధము లేని దాన్ని. ఒక విషయంగాని, భాషా జ్ఞానంగాని ఏమీ తెలియదు నా కప్పటికి. మొదట్లో భయమేసింది. అదొక చాలా పెద్ద బంగళా, ఒక్క హాలులో వంద మంది వుండవచ్చు. ఏడు హాల్సు, ఎనిమిది గదులు వున్నాయి. ఎత్తయిన కొండమీద ముస్లిం జాగీర్దార్లు కట్టి అమ్మినది. బిక్కు బిక్కు మంటూ అందులో 30 మంది చేరాము. అసలు 50 మందికి బడ్జెట్ వుంది. తర్వాత మరో పది మంది చేరారు. అందరిలో నేనే పెద్దదాన్ని. మొదట్లో నేనే వార్డెనులాగా వున్నాను. వంటా వగైరాలు చేయటం, సామాన్లు తెప్పించటం, ఇతర ఫర్నిచరు కూడా వెళ్ళి తేవడం, పిల్లలకి పర్మిషన్స్ ఇచ్చి బైటికి పంపడం, ఆఖరికి బర్రెపాలు పిండించి కాచటం, దసరా, దీపావళికి స్పెషల్స్ చేసి పెట్టడం అన్నీ నా మీదే పడ్డాయి. మొదట్లో చాలా దిగులుగా వుండేది. నలుగురు పిల్లల్ని, భర్తను వదిలి ఇల్లూ వసతులు వదిలేసి వచ్చా. ఏనాడూ ఎక్కడా వుండి ఎరుగను. అమ్మ ఇల్లు, అత్త ఇల్లు తప్ప వేరే లోకం తెలియదు. ఆ బాపట్లలోనే పుట్టాను. పెరిగాను. అలాంటి నేను మరో వూరు, హైదరాబాదు లాంటి పట్టణంలో వుండటం అదే మొదటిసారి.

## కాలేజీలో చేరని కాలేజీ చదువు

ఆ తర్వాత బాపట్ల ఆర్ట్సు కాలేజీ సెంటర్ లో 1964 సెప్టెంబరులో పి.యు.సి. పార్ట్–1 మరియు – 2 వ్రాసి, రెండూ పాస్ అయ్యాను. ఇంతకుముందు నేను పూర్తి చేసిన కుటుంబ నియంత్రణ కోర్సుకి తప్పకుండా ఉద్యోగం చేయాలని ఒప్పందం వున్నా నాకు ఆ ఉద్యోగం రాలేదు. నేర్చుకున్న విద్య వృధా కాకుండా స్వచ్ఛందంగా కార్యక్రమ ప్రచారాన్ని చేపట్టాను. బాపట్ల తాలూకా కుటుంబ నియంత్రణ అసోసియేషన్ పెట్టి శిబిరాల (ఓరియంటేషన్ ట్రయినింగ్ క్యాంపులను) ద్వారా ఇతరత్రా ప్రచారం సాగిస్తున్న సమయంలో కేంద్ర ప్రభుత్వం కొన్ని జిల్లాలకు కుటుంబ నియంత్రణ గౌరవ ప్రచారకులను నియమించింది. అందులో భాగంగా నన్ను గుంటూరు జిల్లాకు

నియోగించినట్లు ప్రెసిడెంట్ ఆఫ్ ఇండియా పేరుతో ఉత్తర్వు వచ్చింది. ఇతర కార్యక్రమాలతో పాటు ఈ పదవిని కూడా నిర్వహిస్తూ వుండేదాన్ని. దాదాపు నెలకు 20 రోజులు ఈ పనులతో సమమతమవుతూ 1965 సెప్టెంబరున గ్రూపు (పి.యు.సి) పరీక్షకి కూర్చుని పాస్ అయ్యాను. తర్వాత సెప్టెంబరు 1966న బి.ఏ. మొదటి సంవత్సరం లాంగ్వేజ్ తర్వాత సెప్టెంబరు 67న గ్రూప్ పాస్ అయ్యాను. అలా అంచెలంచెలుగా చదువుతూ 68లో బి.ఏ. పార్టులు పూర్తి చేశాను.

## లెస్లీ సహాని శిక్షణ

1968లో లెస్లీ సహాని శిక్షణ శిబిరంలో చేరాను. ఆ పది రోజుల్లో ఎన్నో విషయాలు, ఎన్నో అంశాలు తెలుసుకున్నాను. జ్ఞానతృష్ణ పెరిగింది. క్రమశిక్షణ యెడ సద్భావం గట్టిపడ్డది. సామాజిక అంశాలు, రాజకీయ విషయాలు ఎన్నో అవగతమయినాయి. ప్రజాస్వామ్య విశిష్టతను గ్రహించాను.

## అష్టకష్టాలు పడి నేర్చుకున్న అష్టపదులు

మహా పండితులు సంస్కృత భాషా వేత్తలు అయిన శిష్ట్లా అనంత పద్మనాభశాస్త్రి గారిని బాపట్ల దేవస్థానం వారు ఆహ్వానించి భావన్నారాయణ గుడిలో రోజూ అష్టపదులన్నీ అర్థ తాత్పర్యాలతో గానం చెయ్యమని కోరారు. ఆ సందర్భంగా ఉదయం, మధ్యాహ్నం ఊళ్ళో స్త్రీ పురుషులకు, బాల బాలికలకు అందరికీ ఆ 24 అష్టపదులు నెలరోజుల్లో నేర్పుతాము మూడు రూపాయలు చెల్లించగల వారందరూ నేర్చుకోమని సూళ్ళకు, సంస్థలకు, కొన్ని కుటుంబాల వారికి తెలియజేశారు. నా స్నేహితురాళ్ళు పది మంది దాకా పేర్లు ఇచ్చారు. నేను కూడా నేర్చుకుంటానని మా అమ్మను బ్రతిమాలాను. పాటలూ వద్దు, సాడూ వద్దు నీ పెళ్ళికి చచ్చే ఖర్చు పెట్టాలి. 'రేపు అత్తారింటికి పోయేదానివి, పిల్లల్ని కని పెంచాల్సిన దానివి నీకింకా ఈ కోర్కెలేమిటి చాల్లే నోరుమూసుకు పడివుండు. అదీకాక నా దగ్గర డబ్బు లేదు పో! పో!' అని కొట్టినంత పనిచేసింది. నా కప్పుడు పెద్దగా ఏడ్పువచ్చింది. మూడు రూపాయలు ఎలా వస్తాయి అని బెంబేలెత్తిపోయా. ఆ రోజుల్లో మా నాన్న ప్రతి ఆదివారం నాకు, మా అన్నయ్యకు ఒక కాని (అంటే మూడు పైసలు) ఇచ్చేవాడు. మా అన్నయ్య వెంటనే కొనుక్కొని తినేవాడు. నా నోరు వూరినా, ఏడుపొచ్చినా దిగమింగి పిసినారిగా ఆ కాని దాచుకునే దాన్ని. ఆ పిసినారితనం, జాగ్రత్త ఈనాటికీ అంతో, ఇంతో ఇంకా నాలో లేకపోలేదు. అలా పోగుచేసిన రెండు రూపాయలు, అప్పుడప్పుడు చుట్టాలు, అమ్మమ్మ ఇచ్చిన చిల్లరా కలిపి మూడు రూపాయలయ్యింది. దానిని ఫీజుగా చెల్లించాను. 1935 ఆగష్టు శ్రావణ శుద్ధ విదియ నాడు క్లాసులు మొదలు పెట్టి ఒక నెలలో పూర్తి చేశారు శాస్త్రిగారు. ఆ గీత గోవింద కావ్యం ఆ రోజుల్లో రూపాయి పావలా అయినా ఆ పుస్తకం కొనలేక నా స్నేహితురాలింటికి

పోయి రోజూ రాసుకునే దాన్ని. ఏదేమయినా ఆ కష్టార్జితాన్ని త్యాగం చేసి ఆ 24 అష్టపదులు భావంకాని, అర్థం కాని తెలియకుండానే నేర్చుకున్నాను. విద్యా విజ్ఞానం ఏ మాత్రం తెలియని ఆ రోజుల్లో కూడా ఏదో నేర్చుకోవాలనే తపన, ఏదో చెయ్యాలనే ఆరాటం మాత్రం నా నరనరానా జీర్ణించి వుండేది. ఆ ఆరాటమే నా భావి జీవితానికి నాంది అయిందేమో అనిపిస్తుంది.

# 4. సోషల్ వర్కర్సు శిక్షణానుభవాలు

ఫామిలీ ప్లానింగ్ అండ్ సోషల్ వర్కర్సు ట్రైనింగ్ వల్ల నా స్వరూపమే మారిపోయింది. లక్షలు వెచ్చించినా లభించని విజ్ఞానం ఎంతో సంపాదించుకొన్నా, మరెంతో ప్రపంచ జ్ఞానం పొందగలిగా. ఇంక ఎందరితోనో కలిసి మెలిసి జీవించడం నేర్చుకున్నా. నాకు తెలియని అంశాలెన్నో నేర్చుకున్నా. మరెందరివో హావభావాలు అంటే మనస్తత్వాలను నెమరేసుకున్నా.. ఫీల్డు వర్కువల్ల సర్వేలవల్ల స్త్రీల పరిస్థితిని అర్థం చేసుకోగలిగా. ముఖ్యంగా కార్మిక స్త్రీలు, కష్టజీవులయిన వారి అజ్ఞానానికి అవధులులేవని గ్రహించా. అధిక సంతానాన్ని కంటూ తమ పిల్లలే తమ ఆస్తి అని నమ్ముతున్న వారి దయనీయ పరిస్థితిని తెల్సుకున్నా. కుటుంబ నియంత్రణనూ, ఆరోగ్య విధులను నేర్పించటానికి, మూఢాచారాలు మాన్పించటానికి వాళ్ళ ఇళ్ళకు వెళితే కూర్చోమనే వారు కాదు. "మీకు ప్రభుత్వం డబ్బిచ్చి పంపింది. అందుకోసం వచ్చారు. మమ్మల్ని ఆర్చేవాళ్ళెవరు, తీర్చేవాళ్ళెవరు" అని కొందరంటే, "అసలు మాకేం కష్టాలున్నాయి. చక్కగా బిడ్డా, పాపలతో, చల్లని నీడలో జీవిస్తున్నాం. పొండి పొండి. మీ సలహాలు మాకెందుకు" అని కసిరి కొట్టే వాళ్ళు. వాళ్ళ అత్తమామలు వారితోపాటు మమ్మల్ని కూడా తిట్టేవాళ్ళు. ఈ బైట ప్రపంచపు అనుభవాలు నాలుగు గోడల మధ్య జీవించే నాకు ఎన్ని వేలు పెట్టినా వచ్చేది కాదని నాకు ఆనాడు అర్థమయింది.

శిక్షణా కాలంలో నా జీవితాన్ని మలిచిన కొన్ని ముఖ్య సంఘటనలు మీకు చెప్పదలిచాను. అసలు ఆర్ట్సుకాని, సైన్సుకాని ఏమీ తెలియని మాకు ఎనిమిది సబ్జక్టులు. ఇంగ్లీషులో డిపార్టుమెంట్సు హెడ్సు, ప్రొఫెసర్లు వచ్చి క్లాసులు తీసుకునే వారు. అనాటమి, ఫిజియాలజి, హెల్తు, హైజిన్ న్యూట్రిషన్, ఎలిమెంటరీ నర్సింగు, ఫస్టు ఎయిడ్, సోషియాలజి, సైకాలజి, ఫామిలీ ప్లానింగు ఇవి ముఖ్యమైన పాఠ్యాంశాలు. ఇంక యుటిరస్, ఫెలోపియన్ ట్యూబ్సు, హార్టు, స్కిను, ఇంటస్టెయిన్సు లాంటివన్నీ డ్రాయింగువేసి చూపాలి. టి.బి. టైఫాయిడ్, స్మాల్ పాక్సు, లెప్రసీ లాంటి కొన్ని జబ్బులను వివరిస్తూ రాయాలి. కాన్పులు, ఆపరేషన్లు చూచి నోట్సు రాయాలి. ఇంకా ఇలాంటివి చాలా వుండేవి. ఈ సబ్జక్టు పేరే వినని నాలాంటి వాళ్ళకు అవి వింటుంటే మరో లోకంలో విహరించినట్లు వుండేది. అందులో అంత గొప్ప వాళ్ళు పాఠాలు చెప్పటంవల్ల ప్రశ్నలు అడగలేము. చెప్పింది అర్థం కాదు. ఎలా? ఏం చెయ్యాలి?

ఒకనాడు 'వజైనా' గురించి మెటర్నిటీ హాస్పిటల్ లో సూపరింటెండెంటు డా॥ నాయుడు చెప్తుంటే ఒక పిల్ల సిగ్గుతో నవ్వింది. స్కేలుతో నెత్తిన చురకవేసి ప్రేమలతా గుప్తాతో చెప్పి వెళ్ళిపోయింది. ఆ తర్వాత ఆమె మాకు బుద్ధి చెప్పటం లాంటివి ఎన్నో జరిగాయి. ఈ శిక్షణవల్ల ఎంతో లోకజ్ఞానమేకాక శాస్త్రీయమైన విజ్ఞానం కూడా లభించింది. ఈ విషయాలన్ని 5, 6 సంవత్సరాలు కాలేజీలో చదివితే గానీ తెలియవు. ఆ శిక్షణ నాకెంతో పరిజ్ఞానాన్ని ఇచ్చింది. ఇంకా నగరంలోని పెద్ద పెద్ద సంస్థలకు,

పాలకేంద్రం లాంటి పరిశ్రమలకు, జైళ్ళకు వెళ్ళి వచ్చే వాళ్ళం. హాస్పటల్స్, లేబరేటరీలు, అనాధ శరణాలయాలు, ఆడవాళ్ళ హెూమ్సు, బాలనేరస్థుల జైళ్ళు, టి.బి. శానిటోరియం, 'పిచ్చాసుపత్రిలు, ఫీవర్ హాస్పటల్ ఒకటేమిటి సిటీలో మేము చూడని ప్రదేశాలు లేవు. ఆఖరికి ఎగ్జిబిషన్ లో ఒక స్టాల్ పెడితే డిమాన్స్ట్రేట్ చేసే దాకా వచ్చాం. ట్యూబక్టమీ వేసక్టమీ ఆపరేషన్లు, ఇతర ఆపరేషన్లు, డెలివరీలు, డిసెక్షన్ (శవాలను కోసి చూపించటం) లాంటివి ఒకటేమిటి ఇలా ఎన్నో చూసే వాళ్ళం. అసెంబ్లీ సెక్రటేరియట్ మ్యూజియం, జూ, విశ్వవిద్యాలయం సర్వం తిలకించాం. మొదట్లో ఎంతో బాధతో శిక్షణ ప్రారంభించిన నేను చివరికి చెప్పనలవి కాని కొత్త కొత్త విషయాలను, విజ్ఞానాన్ని, ఆధునిక భావాలను పొంది, ఇంకా ఎంతో తెలుసుకోవాలనే తపనతో బైటికొచ్చా. అదొక జీవితానుభవం. ఆ శిక్షణతో కలిగిన లోకజ్ఞానం క్రమేసి పెంచుకోగలిగాను అంటే అదంతా ఆనాటి ఆ ట్రయినింగుకు పంపిన నా భర్త త్యాగఫలితమే.

## హాస్టల్ అనుభవాలు

హాస్టల్ లోవున్న ఆ సంవత్సరం అదివరలో నాలో వున్న కులమతాభిమానాలు పోయాయి. హిందూ, క్రైస్తవ, మహమ్మదీయ మతాలవారు వేరనే భావం పోయింది. అంతవరకు వారిని తాకరాదని, నేను ఉత్తమ కులంలో పుట్టానని, నాది అగ్రకులమని, బ్రాహ్మణులు అగ్రశ్రేణి వారని వున్న నమ్మకం ఆనాటి నుండి నాలో పటాపంచలయి పోయింది. ముస్లింలను తాకితే అంతవరకు కోసేయాలని, క్రిష్టియన్లను తాకితే ప్రాయశ్చిత్తం చేసుకోవాలని మా అమ్మమ్మ, నాయనమ్మ, మా అత్తగారు చెప్పింది వేదమని నమ్మిన దాన్ని. ఆ జిడ్డు భావాలు అంత సునాయాసంగా ఎలా పోయాయో ఈ నాటికి నేనే నమ్మలేక పోతున్నాను.

అంతకుముందే రామ్మూర్తిగారు పక్కా హేతువాది కావడంవల్ల కులమతాల పైన ఆయనకు ఏనాడూ నమ్మకం లేదు. దేవుని వునికినే నమ్మేది లేదు. ఆయన జీవిత విధానం అలా వున్నా అత్తమామల, తల్లిదండ్రుల ఆచారాలే నమ్మి వారిని అనుసరిస్తూ వుండేదాన్ని. కాని ఈ శిక్షణా కాలంలో నాలో వచ్చిన మార్పులలో ఇవి ముఖ్యమైనవని చెప్పక తప్పదు. ఉన్న పదార్థాలను సమానంగా అందరం పంచుకోవటం, హెచ్చుతగ్గులు లేకుండా వుండటం అలవాటు అయింది. ఎక్కడికి వెళ్ళినా కలిసిమెలిసి వెళ్ళేవాళ్ళం. చర్చలతో, నవ్వులతో, వచ్చీరానీ భాషతో (కేరళ వాళ్ళకు తెలుగురాదు, మాకు మళయాళం రాదు) ఇంగ్లీషులో మాట్లాడుతుంటే చెప్పనలవి కాని నవ్వు వచ్చేది. ఒకళ్ళకొకళ్ళు తెలియని వాళ్ళం. భాషలు వేరు, రాష్ట్రాలు వేరు, ఆచారాలు వేరు, మతాలు వేరు అయినా అందరం ఐకమత్యంగా వుండే వాళ్ళం. రాను రాను విడదీయరాని స్నేహితులుగా మారిపోయాం. మొదట్లో క్షణమొక యుగంగా గడిపినదాన్ని, చివరికి రోజులే క్షణాలయి పోయాయి.

ఆరోజు దీపావళి వేడుక చేసుకున్నాం. హైదరాబాద్ లో మార్వాడీలు ధనలక్ష్మి పూజ గొప్పగా చేస్తారు. అలాగే హాస్టల్లో స్వీట్లు చేసుకున్నాం. మ్యూజికల్ ఛైర్సు, ఉపన్యాసాలు, పాటలు, ముగ్గుల పోటీలు జరిగాయి. నాకు 'స్వరాజ్యం ప్రాముఖ్యత' మీద ఉపన్యాసానికి ఒక బహుమతి, సంగీతంలో రెండోది, ముగ్గులకు మూడోది మిగతావి అందరికీ వచ్చాయి. ఆ 'ఫంక్షన్ 'పూర్తికాగానే మా ఆఫీస్ స్టాఫ్, ప్రేమలతా గుప్తా (అసోసియేషన్ ప్రెసిడెంటు) వెళ్ళిపోయారు. ఆరోజు రాత్రి మా అందరికి సమీపంలోవున్న ముఖ్యమంత్రి బంగళా గ్రీన్ లాండ్సు చూడాలనిపించింది. 35 మందికి నాయకత్వం వహించి సరే పోదామన్నా. పర్మిషన్ లేకుండా అందరం కట్టకట్టుకొని లెఫ్టు, రైటు కొట్టుకుంటూ వెళ్ళాం. శ్రీమతి గుప్తా ముఖ్యమంత్రి గారికి స్వీట్స్ ఇచ్చి బైటకొచ్చేటప్పటికి మేమంతా గేటులోపల కనిపించాం. మర్నాడు నన్ను పిలిపించి మీరు "జైల్లో నేరస్థులు కారు, మిమ్మల్ని మేము ఖైదీలుగా చూడటం లేదు. అలాంటప్పుడు మీరు మనల్ని ఎందుకడగలేదు? ఈ రోజు ఇది అయింది. రేపు మరొకటి అవుతుంది" అని సూటిగా నా వైపుగా చూస్తూ (నేను పెద్దదాన్ని గదా) అడిగింది. "పొరపాటు చేశాం" అని నేను తప్పు ఒప్పుకొని ఇక ఇలాంటి పనులు చేయమని చెప్పా. ఆ తర్వాత ఆమె నన్నొక సోదరిగా చూసేది కాని ఏనాడు ఒక ట్రయినీగా చూడలేదు. అందరం ఆమెను 'మాతాజీ' అని సంబోధించే వారం. ఆమె మహా ధనవంతురాలు. చదువుకున్నది, చక్కనిది, తరుచు విదేశాలు తిరిగివస్తూ వుండేది. కాలేజీలు, హోమ్సు, సంస్థలు ఎన్నో స్థాపించి మంచి గణుతికెక్కిన సంఘ సేవకురాలు. అంతేకాదు మహా విద్యావంతులయిన ఎడ్యుకేషన్ సెక్రటరీ ఎల్.ఎన్. గుప్తా భార్య. అయినా ప్రతి చిన్న విషయం స్వయంగా విచారించేది. చక్కని భాష, సత్ ప్రవర్తన, చిరునవ్వు, నిరాడంబరత, పొదుపుగల ఆమెను చూసి నేనెంతో నేర్చుకున్నా. హైదరాబాద్ వచ్చిన విదేశీయులంతా వచ్చి మా హాస్టల్ ను, ఆమె స్థాపించిన సంస్థలను చూసి వెళ్ళేవారు. నేను కూడా ఆమె స్థాయిని అందుకోవాలనే కోర్కె నాలో కలిగింది. అది క్రమేపి పెరగసాగింది.

ఇక కోర్సు పూర్తయి పరీక్షలు దగ్గర పడ్డాయి. ఆలోగా సబ్జక్టు మీద మాట్లాడే రిహార్సులు జరిపారు. ఇంగ్లీషులో ఎలా మాట్లాడాలో తెలియక తికమక పడ్డారు చాలామంది. కాని నా జీవితంలో నాకు వున్నది ఒకే ఒక లక్షణం. అంటే మహా ధైర్యం. అసలు పిరికితనమే ఎరుగను. ఏదయినా సరే విషయం తెలిస్తే అనర్గళంగా మాట్లాడే చొరవ నాకు ఎలా వచ్చిందో నాకే తెలియదు. ఐదు ఆరు నిముషాలు చెప్పాలి. వచ్చిరాని ఇంగ్లీషులో, కర్త, కర్మ, క్రియలేని భాషను అరగంట దాకా చెప్పేదాన్ని. అందరూ విరగబడి నవ్వేవాళ్ళు. కాని భావాన్ని గ్రహించే వారు. అయినా విముఖత చూపేవారు కాదు, అది వారి సహృదయతకు నిదర్శనం. ఆనాటి ఆ ధైర్యమూ, ఆ చొరవే ఈనాటికీ నాకు చెరగని ముద్రగా నిలిచిపోయాయి. శ్రీమతి గుప్తాలాగా 'నేను ఎన్నో సంస్థలు ఎందుకు

స్థాపించకూడదు? గొప్ప గొప్ప వాళ్ళతో ఎందుకు పరిచయాలు చేసుకోకూ డదు' అనే ప్రశ్నలు ఉదయించి చివరికి నేను కూడా అంతదాన్ని కావాలి అనే ఆకాంక్ష నన్ను అనుక్షణం వేధిస్తూ వుండేది.


ఆ కోర్సువల్ల మంచి క్రమశిక్షణ, కష్టపడటం సొంతంగా ఆలోచించటం, వ్రాయటం, అందరితో కలిసి సంచరించటం నేర్చుకున్నా. అందరం యూనిఫాం ధరించటం, ఒక్కటిగా మెలగటం, పోటీపడి చదవటం చూస్తుంటే అది మరో ప్రపంచంలా వుండేది. మా పరీక్షలు దగ్గర పడే కొద్ది భయం తగ్గిపోయింది. మెట్రిక్ లాగా భయపడలేదు. కష్టపడదాం. తెలిసింది రాద్దాం. 'ఒకవేళ తప్పితే పోనీ జరిగేది జరుగుతుంది. మళ్ళీ చదివితే జ్ఞానం పెరుగుతుంది. తప్పితే ఈ లాభం పాసయితే ఆ లాభం' అని స్థిమిత పడ్డా. పరీక్షలు రానే వచ్చాయి. క్షయమీద, అనాటమీ మీద, గర్భిణీల మీద, ఆరోగ్యం, జనాభా పెరుగుదల మీద పేపర్లు బాగా వ్రాశాను. ప్రాక్టికల్స్, జన్మ నిగ్రహ సాధనాలు ఎలా వాడాలో ముఖతా చెప్పి మరో పేపరు తెలిసిందంతా గబగబా వ్రాసి ఇచ్చా.

రిజల్టు మరో వారానికల్లా చెప్పారు. నేను ఏడో ర్యాంకులో వచ్చానని సర్టిఫికెట్ ఇచ్చారు. అసలు భాషరాని నేను ఇంగ్లీషులో రాశానంటే – అంతా తప్పే కావచ్చు. కానీ భాషకన్నా భావం ముఖ్యమని – అలా దిద్ది వుండవచ్చు. ఏదయినా చివరిరోజు పెద్ద మీటింగ్, ఫేర్ వెల్ పార్టీ ఇచ్చారు. అందులో విద్యార్థినుల తరఫున నేను కృతజ్ఞతలు చెప్పా వచ్చీరాని ఇంగ్లీషులో అలా మొదట్లో ఏమీ తెలియని అజ్ఞానంతో వెళ్ళి ఇప్పుడు ఇలా ఎంతో విజ్ఞానం సంపాదించుకుని తిరిగి వెళుతున్నందుకు నాలో ఎంతో నిండుతనం, హుందా ఆనందం కలిగి తృప్తితో నా కళ్ళ వెంట ఆనందభాష్పాలు జలజలా రాలాయి. ఆనాడు వెళ్ళినప్పుడు పడ్డ బాధకంటే ఈనాడు తిరిగి వస్తుంటే పడ్డ బాధ చెప్పనలవి కానిది. ఆనాడు పొందిన మమత, స్నేహం, అభిమానం, ఆప్యాయతలు ఈనాటికి మరవలేనివి, మరపురానివి. ఆ ప్రాంతం వెళ్ళినప్పుడల్లా మాతాజీని, ఆ బిల్డింగును, ఆ బోర్డును వాతావరణాన్ని చూచి వస్తూ వుండేదాన్ని. ఆ కోర్సు కాలంలో షాజహాను అనే పేరుగల ముస్లిం యువతి మాకు వార్డెనుగా ఉండేది. ఆమె సౌందర్యవతి. ఆమె చిరునవ్వు చిందిస్తే మల్లెలు కురిసినట్లుండేది. ఆమె ఎంతో ఓర్పుతో, సహనంతో, ఆప్యాయ తతో, సమభావంతో మమ్మల్ని చూచేది. ఆమె ఏనాడూ పరుషంగా మాట్లాడి ఎరుగదు. గద్దించి ఎరుగదు. సౌమ్యత ఆమె సొమ్ము. పక్షపాత రహిత దృష్టి ఆమె ప్రత్యేకత. ఆమెను చూచి నేను యెంతో నేర్చుకున్నా. వార్డెను పైన శ్రీమతి నసీమ హసను సూపరింటెండెంటుగా ఉండేవారు. ఆమె మాకు సోషియాలజీ చెప్పే వారు. మమ్మల్ని ఎంతో అభిమానంతో చూచేవారు. హైదరాబాదు చదువు నా జీవితంలో ముఖ్య అధ్యాయంగా నిలిచి పోయింది.

# భాగం – IV
# ఆందోళనలు : ఉద్యమాలు



ఎవిలిన్ వెక్సురు
ఓల్డు వుమెన్స్ లీగు
పతకాన్ని ఇస్తూ (1978)




లోక్‌సభ ఎన్నికలలో (1980)



వృద్ధ సంఘ సేవకుల సన్మానం గవర్నరు
శంకరదయాళ్ శర్మ ప్రక్కన (1985)



సంఘ సేవా ధురీణ లయనెస్
శోభారెడ్డికి సన్మానం (1988)




కోడలు కళ్యాణికి పరిగణన, సన్మానం (1989)




గవర్నరు కుముద్ బెన్ జోషితో నాసా సభ
అధ్యక్షురాలిగా (1989)



మాలతీ చందూర్‌తో
'స్త్రీ స్వేచ్ఛ' పత్రికావిష్కరణ (1989)



అంతర్జాతీయ మానవవాద
సంఘకార్యదర్శి నెట్టీక్లీన్‌తో (1989)




సతీసహగమన వ్యతిరేక సదస్సు (1987)



వృద్ధ మహిళా సంఘ సేవకుల
సన్మానం (1985)





సుబ్బమ్మ షెల్టరు ప్రారంభోత్సవం (1989)




లైంగిక స్వేచ్ఛపై సెమినారు (1989)



దశాబ్ది ఉత్సవ సభ
గవర్నరు ప్రసంగం (1990)



మహిళాభ్యుదయ సంస్థ సభ్యులతో (1990)




మహిళల డిమాండ్లపై సదస్సు (1990)




బాలికా శిబిరం (జనవాడ) 1990



అంబేద్కర్ వర్ధంతి (1989)



స్త్రీ విమోచన శిక్షణ శిబిరం (1987)




దంపతులు





అమెరికన్ మానవవాదుల సభలో
ఆవుల సాంబశివరావు



ఆం.ప్ర. రాడికల్ హ్యూమినిస్టు మిత్రులు
జనవరి 1987



పి. సత్యనారాయణ
(మల్లాది సుబ్బమ్మ ట్రస్టు ధర్మకర్త)




పి.ఆర్. నార్ల, మేరియా మీస్‌లతో



అంతర్జాతీయ మానవవాద
సంఘాధ్యక్షులు లెవీ ఫ్రాజల్‌తో

# 1. ప్రత్యేక ఆంధ్రోద్యమం

వడి దుడుకులులేని జీవితాన్ని సాగించిన నేను ఆందోళనలలోకి ఎలాదూకానా అనే సందేహం కలగడం సహజం. ప్రతి మనిషిలో అంతో ఇంతో ఉద్రేక స్వభావం ఉంటుంది. పరిస్థితులను బట్టి అది ప్రకోపించటం జరుగుతుంది. మున్ముందుగా నేను పాల్గొన్న ఆందోళనా కార్యక్రమం పొట్టి శ్రీరాములు ఉపవాస దీక్షాకాలంలో. 1954లో స్త్రీ హితైషిణి మండలి సభ్యులం ఆంధ్ర రాష్ట్ర నిర్మాణం కావాలని బాపట్లలో ఊరేగింపు జరిపాం. దానికి శ్రీమతి కనుపర్తి వరలక్ష్మమ్మ గారు నాయకత్వం వహించారు.

అది అక్టోబరు 1972. అంతకు క్రితం నైజాంలో వున్న ముల్కీ నిబంధన తెలంగాణాలో చలామణి కావచ్చని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన సమయం. నైజాం ప్రాంతంలో 12 సంవత్సరాలు స్థిరనివాసం ఉన్న వారికి, ఆ ప్రాంతంలో జన్మించిన వారికి మాత్రమే ఆ సంస్థానంలో ఉద్యోగాలు ఇవ్వాలనే నవాబు ఫర్మానాను ముల్కీ విధానమని పిలిచేవారు క్రితంలో. నవాబు పరిపాలన పోయింది. హైదరాబాదు రాష్ట్రం ఏర్పడింది. తరువాత అది విచ్ఛిన్నమై ఆయా భాషా ప్రాంతాలు పొరుగున వున్న ఇతర రాష్ట్రాలతో కలిసిపోయ్యాయి. ఆ క్రమంలో ఆంధ్రప్రదేశ్ 1956లో అవతరించింది. తరువాత ఒక రాష్ట్రంలో ఒక ప్రాంతంలో నివాసమున్నవారికి మాత్రమే ఆ ప్రాంతంలో ఉద్యోగాలు మున్ముందుగా ఇవ్వవచ్చునా అనేది తగాదా అంశమయింది. రాష్ట్రం విషయంగా ఇలాంటి నివాస నిబంధన చెల్లుతుంది. కాని రాష్ట్రంలో ఒక భాగానికి సూత్రం అన్వయించదని హైకోర్టు తీర్పు వచ్చింది. దానితో తెలంగాణా ప్రాంతం విడిపోవాలని ఆ ప్రాంతంలో 1969లో ఉద్యమం వచ్చింది. దురదృష్టవశాత్తు ఆ ఉద్యమంలో కొన్ని చోట్ల కొందరు ఆంధ్రుల పై (అంటే కోస్తా వారు, రాయలసీమ వారు) దాడులు జరిగాయి. సంవత్సరన్నర సాగిన ఆ ఉద్యమం రాజకీయ కారణాలవల్ల సద్దుమణిగింది. అయితే సూత్రబద్ధం అయిన తగాదా సమసిపోలేదు. కేసు సుప్రీంకోర్టుకు వెళ్ళింది. 1972లో సుప్రీంకోర్టు తీర్పు వచ్చింది. రాష్ట్రంలో భాగానికయినా ఈ నివాస నిబంధనను అమలుచేయటం రాజ్యాంగ విరుద్ధం కాదన్నారు. అంటే ముల్కీ సూత్రం తల ఎత్తిందన్న మాట. తత్ఫలితంగా కోస్తాలో, రాయలసీమలో నివాసముం టున్న ఆంధ్రులకు తెలంగాణా జిల్లాలలోను, హైదరాబాదు నగరంలోను ఉద్యోగావకాశాలు సన్నగిల్లాయి. ఇంచుమించుగా మృగ్యమయినవన్నమాట. ఈ విషయాన్ని ప్రజలకు తెలియచేయటానికి గౌతు లచ్చన్నగారు ఆయన అనుయాయులు గుంటూరులో సభ పెట్టారు. అంతకు క్రితం కొలది రోజుల క్రిందట ఆంధ్ర ఉద్యోగులు ఈ సమస్యను లేవనెత్తారు. ఆంధ్ర విద్యార్థులు రంగంలోకి దూకారు. సమస్య ఆంధ్ర మధ్యతరగతిని కలవర పరచసాగింది.

అది నవంబరు 12వ తేదీ 1972 సంవత్సరం. మేము అప్పుడు చీరాలలో కాపురం ఉంటున్నాం. బాపట్ల నుండి కోర్టులు చీరాల కెళ్ళాయి. అందువల్ల రామ్మూర్తిగారు బాపట్లనుండి చీరాలలో నివాసం ఏర్పరచుకోవలసి రావటంతో నేనూ వారి వెంట చీరాలలో ఉండటం తటస్థించింది. గోపాలకృష్ణ పార్కులో అఖిలపక్ష సభ ఏర్పాటయింది. తతిమ్మా రాజకీయ నాయకులతోపాటు రామ్మూర్తిగారు కూడా అందులో ఉపన్యాసకులు. నాకు ఆనాటి రాజకీయాలు పెద్దగా తెలియవు. అందులో పార్టీ రాజకీయాలు అసలే తెలియవు. నన్ను సభాధ్యక్ష స్థానంలో కూర్చోబెట్టారు. సభా నిర్వాహకులు. పలువురు పలు అభిప్రాయాలు ప్రకటించారు కొందరు ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం వైపు మొగ్గు చూపారు. తొందరపడవద్దని, హైదరాబాదు నగరాన్ని, దాని చుట్టుప్రక్కల నలుబది మైళ్ళుకల ప్రాంతాన్ని కలిపి కేంద్రపాలిత ప్రాంతంగా నెలకొల్పాలని, తతిమ్మా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం రెండు భాగాలుగా అంటే ఆంధ్ర, తెలంగాణా రాష్ట్రాలుగా విడదీయాలని రామ్మూర్తిగారు సూచించారు. అందరూ మాట్లాడారు. చివరకు నా వంతు వచ్చింది. ప్రాంతాల మధ్య వైషమ్యాలు పెరుగుతున్నాయని, పగిలిన అద్దం ఎంత అతికించినా అతుకు అతుకే తప్ప సహజం కాలేదు అని అందువల్ల విడిపోతే తప్ప పరిస్థితి చక్కబడదని, ప్రత్యేక ఆంధ్రరాష్ట్ర నినాదం ఇచ్చి తీరాలని నేను ప్రకటించాను. ఇది మొదటిసారిగా రామ్మూర్తి గారితో విభేదించిన తరుణం. సనాతన భావాలకు తలొగ్గి జీవితం సాగించిన కాలంలో (1937 నుండి 1958) గాని, తరువాత గాని అప్పటివరకు ఆయన భావం ఏ విషయంలో కూడా తప్పని, పొరపాటు అని నేను అని ఉండలేదు. ఇది మొదటిసారిగా జరిగింది. అందులో ఇది పదిమంది సమక్షంలో సభాముఖంగా జరిగిన భావ భేదం. దీని లోతుపాతులు, ఆనుపానులు ఆలోచించి చేశానా అని తర్కిస్తే అలా ప్రవర్తించినట్లు తోచదు. నాకు అలా యుక్తమని తోచింది. అలా చెప్పాను. అంతే. ఇతరులకు ఇది నా వ్యక్తిత్వ నిరూపణ క్రింద తోచవచ్చును. సభ ముగిసిన తరువాత నేనూ రామ్మూర్తిగారు ఈ విషయం చర్చించలేదు. ఎందుకు ఇలా అన్నావని నన్ను ఆయన గద్దించలేదు. బహుశ వారి ప్రజాస్వామ్య వైఖరికి అది నిదర్శనం కాబోలు. సభా నిర్వాహకులు సర్వశ్రీ పల్లపోలు సాంబయ్య, వేమవరపు వెంకటేశ్వర్లు తరువాత నన్ను కలిసి ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర నిర్మాణం కోసం జరిగే సత్యాగ్రహాలలో నన్ను పాల్గొనమని, 17వ తేదీన ప్రభుత్వ స్త్రీల కళాశాల భవనం పై ఆంధ్రపతాకను ఎగురవేయమని నన్ను కోరారు. నేను అంగీకరించాను. నా నాయకత్వం క్రింద ఆ రోజున సత్యాగ్రహం జరుగుతుందని కరపత్రం విడుదల అయింది. అంతవరకు ఈ విషయం నేను రామ్మూర్తిగారికి చెప్పలేదు. ఆయన అడుగలేదు. 16వ తేదీ రాత్రి రెండు జతల చీరెలు, రవికలు వగైరా పెట్టి పక్క చుట్ట కట్టి పెట్టాను. 17వ తేది జెండా ఎగురవేశాను. నన్ను అరెస్టు చేశారు. మున్ముందుగా పోలీసు స్టేషనుకు తీసుకెళ్లారు. తర్వాత కోర్టు విచారణలో నాకు అయిదు రోజులు జైలు శిక్ష వేశారు. తరువాత జిల్లా ముఖ్యపట్టణమైన ఒంగోలులోని జిల్లా జైలుకు

తరలించడానికి మరల పోలీసు స్టేషనుకు తీసుకొని వచ్చారు. రాడికల్ హ్యూమనిస్టులతో పాటుమిత్రులందరూ నన్ను చూడటానికి వచ్చారు. రామ్మూర్తిగారు రాలేదు. తరువాత ఒంగోలుకు తీసుకొని వెళ్ళారు. ఒంగోలులో ఐదు రోజులు జైలులో వున్నాను. అదే నా జైలు జీవిత అనుభవం.

నవంబరు 21వ తేదీన తెనాలిలో, ఒంగోలులో, ఆదోనిలో కాల్పులు జరిగాయి. దాంతో ఆంధ్ర ప్రాంతం అట్టుడికి పోయింది. ఆంధ్ర ప్రభుత్వోద్యోగులు సమ్మె ప్రారంభించారు. విద్యార్థులు రంగంలోకి దూకారు. డిసెంబరు 1వ తేదీన రామ్మూర్తిగారు రాష్ట్ర న్యాయవాదుల మహాసభలో పాల్గొని తన గవర్నమెంటు ప్లీడరు పదవికి రాజీనామా ఇచ్చి ఆంధ్ర రాష్ట్ర న్యాయవాద సంఘ కార్యాచరణ సంఘానికి అధ్యక్షులయినారు. దాంతో వారి కార్యరంగం విజయవాడ అయింది. నా కార్య క్షేత్రం చీరాల ప్రాంతమయింది. తాలూకా కార్యాచరణ సంఘానికి నన్ను ఉపాధ్యక్షురాలిగా ఎన్నుకున్నారు. ఇక విధి విరామం లేకుండా శ్రీ ప్రగడ కోటయ్య ప్రభృతులతో కార్యక్రమాలలో పాల్గొన్నాను. రోజుకు 3, 4 సభల లెక్కన ప్రసంగిస్తూ గ్రామ ప్రాంతాలన్నీ పర్యటించాను. ప్రతి రోజు రాత్రి ఇంటికి వచ్చేటప్పటికి 1 గంట లేక 2 గంటలు అయ్యేది. చీరాలలో జరిగిన ఊరేగింపులలో 40కి పైగా పాల్గొన్నాను,

ఒక సంఘటనను గురించి వ్రాయక తప్పదు. చీరాలలో ఊరేగింపు జరుగుతున్నది. అందులో విద్యార్థులు - కాంగ్రెసుకు చెందిన విద్యార్థులు కూడా - వున్నారు. అప్పటికి ఈ సమస్య పరిష్కారానికి పంచసూత్ర ప్రణాళికను ఇందిరాగాంధి సూచించారు. దానిని వ్యతిరేకించారు ఆంధ్ర నాయకులు. ఊరేగింపు సాగుతున్నది. “సూత్రాలులేని ఇందిరాగాంధీకి పంచ సూత్రమేల” అని కాంగ్రెసు విద్యార్థులు పాట లంకించుకున్నారు. దానికి వంత పాడారు తదితరులు. ఊరేగింపు అగ్రభాగాన ఉన్న నాకు వళ్ళు కంపరమెత్తింది. చిరాకు కల్గింది. ‘ఆపండి’ అని అరిచాను. రామ్మూర్తిగారు బలపరిచారు. పాట ఆగిపోయింది. ఇలాంటి పాట పాడి స్త్రీ జాతిని అవమానిస్తే మేము ఊరేగింపు నుండి వైదొలుగుతామన్నాను. ఇందిరాగాంధీ వితంతువు అవడానికి ఆమె రాజకీయానికి ముడి పెట్టడం అసంబద్ధం అన్నాను. నీచమని తెగనాడాను. ఆ పాట పాడబోమని విద్యార్థులు చెప్పారు. ఆ పాట లేకుండా నినాదాలతో ఊరేగింపు సాగిపోయింది.

నేనూ విజయవాడ చేరాను. అది 1973 ఫిబ్రవరి 19వ తేదీ. ఆ రోజున పోలీస్ స్టేషన్లపై ఆంధ్ర పతాకాన్ని ఎగురవేయాలని ఆంధ్ర కేంద్ర కార్యాచరణ సంఘం ఆదేశం ఇచ్చింది. ఆ రోజున అన్ని పట్టణాలలోను జెండాలను ఎగురవేశారు. నేను విజయవాడలో అయిదు పోలీస్ స్టేషన్లపై జెండా ఎగురవేశాను. అంతకు క్రితం రోజున (18వ తేదీన) బస్సు స్టేషనువద్ద సత్యాగ్రహం చేసిన పట్టణ న్యాయవాదుల పై, వైద్యుల పై ఘోరంగా లాఠీచార్జి చేశారు. విజయవాడ వాతావరణం ఉద్రిక్తమయింది. మరి 19వ తేదీన

అరెస్టులు సాగిస్తే లాఠీచార్జీలు చేస్తే పరిస్థితి మరీ ముదురుతుందని భావించారేమో, పోలీసులు మమ్మల్ని 19వ తేదీన అరెస్టులు చేయలేదు. లాఠీ ఛార్జీలు చేయలేదు. ఆంధ్ర ప్రాంత మహిళా మహాసభ విజయవాడలో జరిగింది. డా॥ సరోజినీ రామారావు, శ్రీమతి లీలావతీ సుందరం (తిరుపతిలో జరిగిన ప్రథమ మహిళా మహాసభ అధ్యక్షులు), నేను అధ్యక్ష వర్గంగా వ్యవహరించాం. 11 జిల్లాల కార్యకర్తలు వెయ్యికి పైగా సభకు వచ్చారు. ఆ సభ మహిళల్లో ఎంతో సంచలనాన్ని జాగృతిని కల్పించింది.

ఉద్యమ ఉధృతం తగ్గసాగింది. ప్రభుత్వోద్యోగులు ఉద్యమం నుండి మార్చి 3వ వారంలో వైదొలిగారు. కోర్టుల బహిష్కరణ ఎత్తివేయాలని న్యాయవాదుల కార్యాచరణ సంఘాధ్యక్షులైన రామ్మూర్తిగారి మీద వత్తిడి వచ్చింది. అంత ఆంధ్ర ప్రాంత న్యాయవాదుల అభిప్రాయాలను తెలుసుకోవడానికి ఆయన పర్యటనకు పూనుకున్నారు. అప్పటికి రైళు ్ళ నడపరాదనే కేంద్ర కార్యాచరణ సంఘ నిర్ణయం అమల్లో వున్నట్లే లెక్క. బస్సులు తిరగడాన్ని సంఘం అనుమతించింది. ఏదైనా రైళ్ళు, బస్సులు నడుస్తున్నాయి. రామ్మూర్తిగారు కేంద్ర కార్యాచరణ సంఘానికి సమన్వయ కార్యదర్శిగా వుండడం వల్ల వారు సంఘ తీర్మానాన్ని ఉల్లంఘించరాదు. అందుకని బస్సులపై ప్రయాణం సాగించడం తప్పని సరైంది. నేను వారి వెంట పర్యటన చేశాను. హిందూపూర్ నుండి శ్రీకాకుళం వరకు అనేక పట్టణాలలో నేను, ఆయన ప్రసంగించడం జరిగింది. అది నాకు అపూర్వ అనుభవం, అవకాశం కూడాను.

ఏప్రియల్ మధ్యలో రాజమండ్రిలో తృతీయ మహిళా మహాసభ జరిగింది. అందులో పాల్గొని ప్రసంగించాను. న్యాయవాదులు ఉద్యమం నుండి తప్పుకున్నారు. తరువాత విద్యార్థులు వెనకకు మళ్ళారు. ఉద్యమం నీరు కారిపోయింది. ప్రత్యేక ఆంధ్రోద్యమం, ఔనన్నా కాదన్నా, మహెూద్యమం. వందల నుండి లక్షల దాకా జనం ప్రవాహంలాగా ముందుకు సాగిన ఆందోళన అది. వివిధ వృత్తులవారు – చివరికి పురోహితులు కూడా – ఊరేగింపుగా పాల్గొన్న కాలమది. ఫిబ్రవరి 1వ తేదీన వాజ్ పాయ్ బెజవాడ వచ్చిన సందర్భంలో లక్షమంది స్త్రీలు బారులు తీరి విజయవాడ నగర వీధుల్లో ఊరేగింపు జరిపారు. ఇంత ప్రజాశక్తి మహెూద్యమం నిష్ఫల మవడం శోచనీయం.

మానవవాదిగా అభివర్ణించుకుంటున్న నేను ఒక ప్రాంత ప్రజల ప్రత్యేక ఉ ద్యమంలో పాల్గొనడం సబబుకాదని కొందరు అభిప్రాయపడవచ్చు. హ్యూమనిష్టులకు భాషా, ప్రాంత భేదాలు వుండరాదు. అయితే ఇరు ప్రాంతాల వారు – ఆంధ్ర, తెలంగాణా ప్రాంతాల వారు కలిసి మెలిసి ఒకే రాష్ట్రంలో ఒద్దికగా వుండలేని పరిస్థితి ఉ దయించినపుడు, వారు అన్నదమ్ముల్లాగా విడిపోయి తర్వాత సాదరంగా, సమరస భావంతో జీవించగల్గడం అభిలషణీయమని నా ఉద్దేశ్యం. తెలంగాణా వారి పై ఈర్ష్యా, అసూయలు

లేవు. ఆంధ్రుల పై ప్రత్యేక ఆదరాభిమానాలు లేవు. ఆ దృష్టితో ఉద్యమంలో వ్యవహరించాను. అలాగే ప్రసంగించాను. 1971 నుండి తెలంగాణ ప్రాంతమైన హైదరాబాదు నగరంలో నివసించడమే దానికి నిదర్శనం.

## జె.పి. ఉద్యమం

ఆంధ్రోద్యమం 1973 ఏప్రియల్ చివరకు అణగారిపోయింది. కాని ఆంధ్ర ప్రాంతంలో కేంద్ర ప్రభుత్వం పై క్రోధావేశాలు తగ్గలేదు. 1974 ఏప్రియల్ నుండి జయ ప్రకాష్ నారాయణ్, ఇందిరా గాంధీ ప్రభుత్వంపై విమర్శ సాగించాడు. అవినీతి క్షాళనమే ఆయన ధ్యేయం అయింది. గుజరాత్ లోని విద్యార్థుల ఉద్యమాన్ని పరిశీలించి బీహార్ లోని విద్యార్థులు ప్రజోద్యమంలోకి దూకారు. ప్రజలపై అన్యాయాలు, అక్రమాలు, దౌర్జన్యాలు, కాల్పులు సాగుతుంటే ప్రజా ప్రతినిధులు అయిన ఎం.ఎల్.ఎ.లు మౌనం వహించడం క్షంతవ్యం కాదని, వారి రాజీనామాను జె.పి. డిమాండు చేశాడు. చివరకు ఆయనను చావగొట్టబోయే స్థితి వచ్చింది. భారత ప్రజలు ఆగ్రహోదగ్రులు అయినారు. ప్రభుత్వాలలో అవినీతిని రూపుమాపాలని జె.పి. ఆందోళన లేవదీశాడు. కాంగ్రెసు వ్యతిరేకులంతా వారి పార్టీల అస్తిత్వంతో, ప్రత్యేకతతో నిమిత్తం లేకుండా సర్వులూ ఆయన ప్రారంభించిన ఉద్యమంలోకి దూకారు.

నేనూ, రామ్మూర్తిగారు ఏ పార్టీకి చెందని వారం కాబట్టి, అంతకుముందు ఆందోళనా కార్యక్రమంలో భాగస్వాములం కాబట్టి, జె.పి ఉద్యమంలో మాకు స్థానం కలగడమే కాక మా ఇల్లు జె.పి ఆహ్వాన సంఘానికి కార్యాలయంగా ఎంపిక చేయడం జరిగింది. సంఘానికి తెన్నేటి విశ్వనాధం గారు అధ్యక్షులు, శ్రీ గొట్టిపాటి మురళీమోహన్ కార్యదర్శి, నేను ఉపాధ్యక్షులుగా వున్నాము. ఆహ్వాన సంఘం ఏబది వేలదాకా పైకం వసూలు చేసి బ్రహ్మాండంగా ఏర్పాట్లు చేసింది. ఆ సందర్భంగా జె.పి ఉద్యమ సమన్వయ కమిటీ సమావేశాలు కూడా మా ఇంట్లోనే జరిగేవి. రాష్ట్ర నాయకులు అనేక మంది చర్చల్లో పాల్గొనేవారు. జె.పి. 1975వ సంవత్సరం మే 4వ తేదీన విజయవాడ రావడానికి అంగీకరించాడు. జనతంత్ర సమాజ్ (సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ) ఆంధ్ర ప్రదేశ్ శాఖకు ప్రారంభోత్సవం చేయడానికి ఆయన అంగీకరించాడు. విజయవాడలో ఆ రోజు సాయంత్రం బహిరంగ సభలో ఉపన్యసించడానికి సమ్మతించాడు. ఆంధ్ర ప్రదేశ్ లో హైదరాబాదు, విశాఖపట్టణం, విజయవాడ పట్టణాలలో మాత్రమే జయప్రకాష్ నారాయణ్ తన పర్యటన కేంద్రాలుగా నిశ్చయించుకోవడాన్ని బట్టి విజయవాడ సభ ప్రాధాన్యత తెలుస్తుంది. మే 1వ తేదీన జనతంత్ర సమాజ్ ఆంధ్రప్రదేశ్ మహా సభ జరిగింది. అందులో నేను వేదికమీద కూర్చుని, విసనకర్రతో జె.పి.కి సేవ చెయ్యగలగడం నా అదృష్టం. ఆనాటి బహిరంగ సభకు 3 లక్షల మంది జనం వచ్చారు. సభ ప్రారంభమైన

అరగంటకు కుంభవృష్టి కురిసింది. తొణక్కుండా జె.పి. తన ఉపన్యాసాన్ని కొనసాగించారు. విపరీతమైన వర్షంలో తడుస్తూ, కదలకుండా మెదలకుండా 50 వేల మంది ప్రజలు ఉపన్యాసాన్ని చివరిదాకా విన్నారు. ఆ రోజున జె.పి. రాక సందర్భంగా మేము జె.పి ఫోటోతో ప్రచురించిన 'వికాసం' ప్రత్యేక సంచిక అధిక సంఖ్యలో అమ్మాను.

బహిరంగ సభలో ప్రసంగాన్ని రామ్మూర్తిగారు తర్జుమా చేశారు. సభను ఏర్పాటు చేయడంలో వారు ప్రముఖ పాత్ర వహించారు. బహుశః దాని ఫలితమేమో ఆయన్ను. 26-06-1975 తేదీన ఎమర్జెన్సీ డెటిన్యూగా అరెస్టు చేశారు. ఆయన జైల్లో వున్న కాలంలో జె.పి. ఉద్యమ నాయకులు తరుచూ మా ఇంటికి వస్తూ పోతూ వుండేవారు. కొంతమంది మా ఇంట్లోకే తలదాచుకోవడం కూడా తటస్థించేది. అందువలన సి.ఐ.డీ.లు నాపై నిఘా వున్నారని గ్రహించాను. రామ్మూర్తిగారు జైలునుంచి వచ్చాక మాకాపురం హైదరాబాదుకు తరలించటం వల్ల నా కార్యక్రమాలకు హైదరాబాదు కేంద్ర స్థానమయింది.

## కూరగాయల ఎగుమతి నిషేధం

అభ్యుదయ మహిళా సమాఖ్యకు నేను 1979లో అధ్యక్షురాలినయ్యాను. జంట నగరాల మహిళా మండలుల ఫెడరేషన్ గా ఆ సంస్థను రూపొందించదలచి దానికి నింబంధనావళి తయారు చేసి రిజిష్టరు చేయించాం. సమాఖ్య ఏ కార్యక్రమాన్ని చేపట్టాలి అనే తర్జన భర్జనలు సాగుతున్న సమయంలో తీవ్రవాద భావాలుగల వసంతా, రమా, వీణా, లలితలు తమ సహకారాన్ని అందించడానికి అంగీకరించారు. వారిని సమాఖ్యలో పదవులు స్వీకరించమని అభ్యర్థించాను. వారు సంస్థకు వెలుపల నుండి సర్వవిధాలా సాయం చేస్తామన్నారు. అలాగే చేశారు.

1978-79లో కూరగాయలను, కోడిగ్రుడ్లను ప్రభుత్వం గల్ఫ్ దేశాలకు ఎగుమతి చేయడంతో వాటి ధరలు విపరీతంగా పెరిగాయి. టొమాటోలు. కిలో 8 రూపాయలు అమ్మింది. ఉల్లిపాయలు కిలో ఒక రూపాయి నుండి మూడు వరకు పెరిగింది. ప్రజల్లో అలజడి కలిగింది. కూరగాయల ఎగుమతి నిషేధ కార్యక్రమాన్ని చేపట్టడానికి నిశ్చయించాం. ముమ్ముందుగా తేది 5-9-1979న నగర మహిళల ఆందోళన ప్రదర్శన జరపడానికి తీర్మానించాము. ప్రచార సాధనంగా ఇంగ్లీషులో, తెలుగులో కరపత్రాలు ప్రచురించాం. జంటనగరాల మహిళా సంఘాల వారిని కలిసి ఊరేగింపుకు ఆహ్వానించడానికి అధ్యక్షురాలినైన నేను, శ్రీమతి ప్రభావతి, శ్రీమతి కాశీరత్నం తీవ్రంగా కృషిచేశాం. కష్టజీవుల కాలనీలకు వెళ్ళి వారిని, ఇతర ప్రాంతాల మహిళలను ఉద్యమంలో చేరమని కోరాం. అలవాటు ప్రకారం వారు పైసలడిగారు. అలా ఇవ్వజాలమని, ఇది అందరి ఉద్యమమని వారికి తెలియజేశాం. అయినా దూరప్రాంతాల వారు, దగ్గరివారు,

గర్భిణీ స్త్రీలు, పిల్లల తల్లులు తమంత తాముగా షుమారు వెయ్యిమంది గుంపులు గుంపులుగా వచ్చి చేరారు. ఆందోళనోద్యమంలో స్త్రీలు ఇలా రావటం అపూర్వం అనవచ్చు. కారణం కూరగాయల సమస్య అందరిది కనుక అలా వచ్చి చేరారు.

ముందుగా నిర్ణయించిన ఆ తేదీనాడు నగర మహిళలం కోఠిలోని ఫిరోజ్ గాంధీ పార్కు వద్ద సమావేశమయినాం. పట్టు చీరలవారు, పాత చీరలవారు, ఉద్యోగినులు, విద్యార్థినులు, ధనవంతులు, మధ్య తరగతి వారు, శ్రామికులు ఇలా అన్ని వర్గాలవారు అన్ని తరగతుల వారు మొత్తం 600 మందికి పైగా మహిళలు గుమిగూడారు. సెక్రటేరియట్ వరకు ఊరేగింపు సాగింది. పత్రికా విలేకరులు అధిక సంఖ్యలో వచ్చారు. ప్రదర్శన తీరుతెన్నులు చూచి విస్తుపోయారు. మర్నాడు పత్రికలలో ఫోటోలతో వార్తలను ప్రముఖంగా ప్రచురించారు.

ప్రదర్శన తరువాత కోర్కెల పత్రాన్ని రాష్ట్ర ప్రభుత్వ సచివాలయంలో సమర్పించినా నెల రోజుల వరకు కూడా ప్రభుత్వం నుండి ప్రతిస్పందన రాలేదు. ఆలోచించి, ప్రదర్శన జరిగిన నెల రోజులకు 5-10-79 తేదీన అసెంబ్లీ వద్ద ధర్నా చేయడానికి కృతనిశ్చయులమైనాము. రిజర్వు బ్యాంకు వద్ద రోడ్డు ప్రక్కన టెంట్ లు వేసుకొని ధర్నా చేయడానికి పోలీసులు అనుమతించారు. ధర్నాకు పిలుపు ఇచ్చాం. 500 మందికి పైగా హాజరయిన ధర్నాలో ఎక్కువగా విద్యార్థినులు పాల్గొన్నారు. అసెంబ్లీలో ప్రతిపక్ష పార్టీల నాయకులను వచ్చి ప్రసంగించమని నేను అభ్యర్థించాను. సర్వశ్రీ గౌతు లచ్చన్న, వెంకయ్య నాయుడులు వచ్చి ప్రసంగించారు. తీవ్రవాద భావాలుకల వారికి అదే ఆక్షేపణీయంగా తోచింది. వారు అభ్యంతర పెట్టారు. నేను లెక్క చెయ్య లేదు. తరువాత కొందరం అసెంబ్లీ ఆవరణలోకి పోలీసులు వద్దన్నా దూసుకొని పోవడానికి ప్రయత్నించాము. మమ్మల్ని అరెస్టు చేసి పోలీసు వ్యాను ఎక్కించారు. తరువాత విడుదల చేశారు. తదుపరి శ్రీమతి వసంత సుందరయ్య గారిని కలిసి వారికి ఈ విషయాన్ని చెప్పారు. పార్టీల వాళ్ళను మన సభలకు పిలవరాదంటే సుందరయ్య గారి వద్దకు వెళ్ళవలసిన అవసరం లేదు. వెళ్ళడం తటస్థించిందంటే తీవ్రవాద పార్టీల వారిని పిలవాలి కాని, మితవాద పార్టీల వారిని పిలువరాదని భావం అయివుండవచ్చును.

ధర్నా జరిగిన 20 రోజుల వరకు ప్రభుత్వం చలించక పోవడంతో ఏం చెయ్యాలి అనేది మీమాంసకు దారితీసింది. పొలాల దగ్గరికి వెళ్ళి విమానాశ్రయానికి కూరగాయలను తీసుకుని వెళ్ళే లారీలను అటకాయింపు చేద్దామని తీవ్రవాదులు ప్రతిపాదించారు. అలా చేస్తే కార్యకర్తలను రైతులు, వ్యాపారస్తులు ఇద్దరూ కలిసి కొడతారని తలంచి నేను ఆ ప్రతిపాదనను వ్యతిరేకించి తిరస్కరించాను. అప్పుడు నిరాహారదీక్ష చేబడదామని నేను సూచించాను. ఆహారం దండిగా తీసుకుని వచ్చి నిరాహారదీక్ష చేస్తున్నారని, దాంతో ఆ విధానం నగుబాటు అయిందని తీవ్రవాదులు అడ్డుతగిలారు. మరో ప్రత్యామ్నాయ

మార్గం సూచించమని వారిని నేను కోరాను. వారు మరో మార్గాన్ని సూచించలేదు. అందుచేత 5-11-19 నుండి 9-11-19 వరకు సెక్రటేరియట్ దగ్గరలో ఎల్.ఐ.సి. బిల్డింగు వద్ద రోడ్డు ప్రక్కన టెంట్ వేసుకొని కొద్దిమంది మిత్రులతో రిలే నిరాహారదీక్ష ప్రారంభించాను. మొదటి రోజున మా సమాఖ్య కోశాధికారి, ప్రధాన కార్యదర్శులు కూడా పాల్గొన లేదు. రెండవరోజు నుండి వారు వచ్చారు. మూడవ రోజు నుంచి తీవ్రవాదులు కూడా వచ్చి టెంట్ లో కూర్చున్నారు. నాల్గవ రోజున పోలీసు సి.ఐ.డి.లు వచ్చి వాకబు చేసుకుని వెళ్ళారు. ఐదవ రోజున ఆంధ్రప్రదేశ్ సామాజిక సంక్షేమ సలహా మండలి అధ్యక్షురాలు శ్రీమతి దుర్గా భక్తవత్సలం టెంట్ లో నన్ను కలిసి, నాకు ముఖ్యమంత్రి శ్రీ చెన్నారెడ్డితో ఆరోజు సమావేశం ఏర్పాటుచేస్తానని, ఆయన కూరగాయల ఎగుమతిని ని షేధించే ప్రకటన చేస్తాడని చెప్పింది. మర్నాడు ఉదయం 9 గంటలకు సమావేశ సమయం ఆమె నిర్ణయించింది. అందుకు అంగీకరించాం.

మరో విచిత్రమైన ఉదంతాన్ని ఉటంకించాల్సి వస్తున్నది. రాత్రి 10 గంటలకు తీవ్రవాద మహిళలు మా ఇంటికి వచ్చి ముఖ్యమంత్రితో సమావేశాన్ని వ్యతిరేకించారు. పోరాటంలో పట్టు విడుపులుండాలని, ఎప్పటికైనా రాజీ పడడం, ఒప్పందానికి రావడం తప్పదని నేను వాదించాను. వారు అసమ్మతితో వెళ్ళిపోయారు. ఆ రాత్రి ఒక మంత్రి కూరగాయల ఎగుమతిని నిషేధిస్తూ ఉత్తర్వు ఇచ్చాడని తెల్లవారే సరికి పత్రికల్లో వార్త వచ్చింది. ఉదయం 7 గంటలకు శ్రీమతి భక్తవత్సలం ఫోను చేసింది. తెన్నేటి విశ్వనాథం గారు చనిపోయిన సందర్భంగా ముఖ్యమంత్రి విశాఖపట్నం వెళ్లవలసి వున్నందున ఆనాడు ఉదయం 9 గంటలకు నిర్ణయమైన సమావేశం, ఉదయం 8 గంటలకే జరుగుతుందని, అందుకు రావలసిందని నన్ను కోరింది. మా సమాఖ్య డిమాండును ప్రభుత్వం అంగీకరించినందున ముఖ్యమంత్రితో సంభాషణలకు పోలేదు. ఇలా ముగిసింది ఎగుమతి నిషేధ ఉద్యమం.

## ప్రజాస్వామ్య పరిరక్షణ ఉద్యమం (సేవ్ డెమోక్రసీ)

కాంగ్రెసు ముఖ్యమంత్రులు కాంగ్రెసు అధిష్టాన వర్గం చేతిలో కీలుబొమ్మలై రాష్ట్ర ప్రతిష్ఠను దిగజార్చరని శ్రీ ఎన్.టి. రామారావు బహుళ ప్రచారంచేసి, ఎన్నికలలో గెలుపొంది ముఖ్య మంత్రి అయినాడు. శ్రీ నాదెళ్ళ భాస్కరరావు తెలుగుదేశం పార్టీ నుండి చీలి తన మద్దతుదారుల సంఖ్యను తప్పుడుగా ఇచ్చి, ఆనాటి గవర్నర్ శ్రీ రాంలాల్ ధర్మమా అని 1983లో ముఖ్యమంత్రి అయినాడు. ఈ చర్యకు ప్రతి స్పందనగా ఆంధ్ర ప్రజలు ఉవ్వెత్తున ఆందోళనకు దిగారు. మహిళలు ప్రజాస్వామ్య పరిరక్షణకు పూనుకోవాలని నేను పత్రికా ప్రకటన చేశాను. అది చూచి సర్వశ్రీ కాశీరత్నం, ప్రభావతి, వసంతలు తాము కూడా సహకరిస్తామని చెప్పారు. అంతా నిజాం కాలేజీలో సభకు,

ఫిరోజ్ గాంధీ పార్కునుండి ఊరేగింపుకు సిద్ధపడ్డాం. పోలీసు కమీషనర్ ను కలిసి ఊరేగింపుకు అనుమతిని కోరాం. అనుమతి ఇవ్వడానికి తన అశక్తతను ఆయన వెల్లడించాడు. ఫిరోజ్ గాంధీ పార్కులో ఆ సాయంత్రం సమావేశమైన నగర స్త్రీలు అనుమతి లేకుండా ఊరేగింపు లేవదీయాలా, అక్కర్లేదా అని చర్చించాం. ఊరేగింపు రద్దు చేసుకుందామని తీవ్రవాదులు చెప్పారు. కాని ముఖ్య కార్యకర్తలు కొందరం ఊరేగింపుగా వెళ్ళదలచాం. వెళుతుండగా పోలీసులు అరెస్టుచేసి కంట్రోలు రూంకి తీసుకెళ్ళారు. అరగంట అయిన తరువాత వదలి పెట్టారు. సభా సమయానికి పావుగంట ఆలస్యంగా చేరాం. అధ్యక్షులుగా ఆనాటి సభ నిర్వహించాను. శ్రీ రామారావు బర్తరఫ్ సందర్భంగా నగరంలో జరిగిన మహిళల ప్రధమ నిరసన ఇదే. ఆమాటకొస్తే పురుషులకంటే ముందుగా జరిపిన ఆందోళన సభ మాదే... తర్వాత మాత్రమే ఇతర సంఘాల వారు కదిలారు.

# 2. కుల వ్యతిరేక కృషి

## కులతత్వ భావన ఎలా పోయింది

నా ప్రాణ స్నేహితురాలు మంగలి రంగన్న కూతురు రుక్కమ్మ. తనూ నేను నాలుగు క్లాసుల వరకు కలిసి చదువుకున్నాం. స్కూల్లో 3, 4 'ర్యాంకు' ల్లో వుండే వాళ్ళం. మూడేళ్ళు ప్రక్క ప్రక్కన కూర్చున్నాం. పాఠాలు ఒకళ్ళ కొకళ్ళు అప్పజెప్పుకోవడం, క్లాసులో తగాదా వస్తే ఇద్దరం ఒక్క ప్రక్క జట్టుగా వుండటం, ఒకటేమిటి ఇన్నింటిలోనూ ఒకళ్ళను విడిచి రెండో వాళ్ళు వుండలేక పోయేవాళ్ళం. దాన్ని చూస్తేనే మా అమ్మమ్మకు మంట. కులం తక్కువదని, అంటరానిదని దాని మొహాన్నే తిట్టేది. నాకు ఏడుపొచ్చేది. నాన్న నన్ను సముదాయిస్తుంటే కొన్నిసార్లు మా అమ్మ కూడా నన్ను నానా మాటలు అనేది. రుక్కమ్మా ఇల్లు ఒక పూరి పాక. అక్కడికి వెళ్ళానని చెప్పకపోయినా అనుమానించేది. కేవలం బ్రాహ్మణ పిల్లలు, ధనవంతుల అమ్మాయిలు అయితే రావచ్చు, పోవచ్చు. చివరకు రుక్కమ్మ దూరం అయ్యేదాకా దుమ్మెత్తి పోసారు మా వాళ్ళు. ఆ తర్వాత వాళ్ళ నాన్న దాని పెళ్ళిచేసి పంపాడని తెలిసి వాపోయాను. తర్వాత తను ఏమయిందో నాకు మళ్ళీ తెలియలేదు. కొన్నాళ్ళు కలవరించి, కలవరించి మరచిపొయ్యా. కాని తను నా మానసిక ఘాతకు మూల కారణమయింది.

ఇలాంటి సంఘటనే మరోటి చెప్పుకుందాం. ఒకరోజు స్కూలు నుండి వస్తుంటే నా కాలులో పెద్ద గాజు పెంకు దిగి ధారాళంగా రక్తం స్రవించింది. అప్పుడు నేను ఆ రక్తం చూసి భయంతో ఏడుస్తూ మా నాన్నకు చెప్పుకుందామని భోజనాల గదిలోకి గబ గబా పరుగెత్తుకెళ్ళా. నాన్న కోర్టుకెళ్ళాడు. అమ్మమ్మకు నా రక్తం, గాజు పెంకు పట్టకపోగా "అయ్యయ్యో! కిరస్తానీ బట్టలతో వంటింట్లోకి వస్తావుటే! ముందా బట్టలు విప్పి లోపలికి తగలడు" అంటుంటే అమ్మ ధోరణి కూడా అదే అయ్యింది. ఆ రోజుల్లో క్రిష్టియన్లు టీచర్లుగా వుండేవారు. అందువల్ల ఇంటికి రాగానే బట్టలు విప్పి కొల్లాయి గుడ్డ చుట్టుకొని కాళ్ళూ చేతులు కడుక్కొని లేదా స్నానం చేసి రావాలి. ఆ స్కూలు బట్టలకే కిరస్తానీ బట్టలని విడిపించేవారు. పురుళ్ళొచ్చినా, బహిష్టులొచ్చినా శుచీ శుభ్రతలు లేకుండా పశువుల్లా బ్రతకనిచ్చేవారు. ఆ వాతావరణంలో పెరిగిన నాకు వర్ణాశ్రమ ధర్మం, కులతత్వం బాగా వంటబట్టి పోయింది. అది మానవాభ్యుదయానికి అడ్డుగోడ అని ఆనాడు నాకు తెలియదు. నాలో పాతుకున్న కులతత్వం నశించడానికి ప్రబల కారణాలు నాలుగు. ఒకటి స్వామీజీ ఉపదేశ భాగోతం, రెండు హైద్రాబాద్ లో సంవత్సర శిక్షణా ప్రభావం, మూడు గోరా నాస్తిక సభలు, నాలుగు రామూర్తిగారి హేతువాద ప్రభావం. అన్నీ కలిసి నాలో మార్పు తెచ్చాయి. ముఖ్యంగా చిన్ననాటి అమ్మమ్మ కఠిన ప్రవర్తనా, నా స్నేహితురాలి అవమాన ఫలితం బాగా పనిచేసాయి. ఏదయినా ఒక వ్యక్తి అభిప్రాయం

మార్చుకోవడం జరిగితే ప్రధాన కారణం విజ్ఞానం. దీనిని అర్థజ్ఞానమా, అనుభవ జ్ఞానమా అని మీమాంస చేస్తారు. మా అత్తగారి వేదాంత భావ పరిచయం వల్ల, రామ్మూర్తిగారి హేతువాద నడవడివల్ల నేర్చుకున్నది అర్థజ్ఞానం. కాగా హైద్రాబాదు కుటుంబ సంక్షేమ శిక్షణాలయంలో అలవరచుకున్నది అనుభవ జ్ఞానం. వండేది నాయరు, వడ్డించేది ముస్లిం వనిత, ఒక ప్రక్కన కూర్చున్నది బ్రాహ్మణేతర యువతి, మరో ప్రక్కన కూర్చున్నది క్రైస్తవ స్త్రీ. ఇంకెక్కడి 'ఆచారం'? సంప్రదాయం ఎగిరి పోయింది. వర్ణాశ్రమ ధర్మం అడుగంటింది. కుల పిశాచం పారిపోయింది. ఆ తర్వాత కుల నిర్మూలన సంఘంతో కలిసి పనిచెయ్యడమే కాక, కులాంతర వివాహాలు హేతువాద ధోరణిలో జరిపించేదాకా ఎదిగి పొయ్యానంటే నాకే ఆశ్చర్యంగా వుంటుంది.

## కుల నిర్మూలనోద్యమంలో

హిందూ సంఘంలో కులతత్వం, తత్ఫలితంగా అంటరానితనం జాడ్యాలుగా పరిణమించా యని హిందూ సంఘసంస్కర్తలు, విప్లవకారులు ఎప్పటినుంచో ప్రకటిస్తున్నారు. భక్తి ఉద్యమంలో కృషి చేసిన కబీరు, మీరాబాయి ప్రభృతులు కులాన్ని పాటించలేదు. వివేకానందుడు కులత త్వాన్ని నిరసించాడు. రాజా రామ్మోహన్ రాయ్ తన బ్రహ్మ సమాజ మతంలో కులానికి చోటు పెట్టలేదు. పల్నాటి చరిత్ర పురుషుడు బ్రహ్మనాయుడు చాప కూడు సిద్ధాంతాన్ని అమలు జరిపాడు. వీర వైష్ణవంలో కులం ఎగిరిపోయింది. బసవుడు స్థాపించిన వీరశైవంలో కులాలు లేవు. లింగధారులైన జంగములంతా ఒకటే కులం. కేరళలో నారాయణ గురు ఆధ్వర్యంలో మానవ కులం ఒకే కులంగా అవతరించింది. పోతులూరి వీరబ్రహ్మం, సిద్దప్పల ప్రచారంలో కులానికి ఆస్కారం లేదు. వేమన వేదాంత ధోరణిలో కులం మటుమాయ మయ్యింది. త్రిపురనేని రామస్వామిగారి 'నిహిలిజం' సనాతనత్వాన్ని నిరసింపజేసింది. కమ్యూనిస్టులు, సోషలిస్టులు కులాన్ని జమిందారీ విధాన అవవేషంగా పరిగణించారు. కులాన్ని అధిగమించి వివాహాలు చేశారు. భారతదేశ కమ్యూనిస్టు చరిత్రకు మూల పురుషుడయిన ఎం.ఎన్. రాయ్ తన తాత్విక దృష్టితో కులాన్ని ఎండగట్టాడు. హిందూమతంలోని నిచ్చెనమెట్ల సమాజాన్ని నిరసించాడు. ఇలా కుల జాడ్య నిర్మూలనకు అనేకమంది పూనుకున్నారు: దోహదం చేశారు.

ఎం.ఎన్. రాయ్ అనుచరులు ప్రప్రథమంగా తమను సిశలయిన కమ్యూనిస్టులుగా అభివర్ణించు కున్నారు. కాంగ్రెస్లో వున్నప్పుడు రాడికల్ కాంగ్రెస్ వాదులుగా, కాంగ్రెస్ నుండి బయటపడి రాడికల్ డెమొక్రాట్లుగా, మార్క్సిస్టు తత్వంలోని లోపాలను లొసుగులను కనుగొని మార్క్సిస్టు తత్వాన్ని కాదన్నప్పుడు రాడికల్ హ్యూమనిస్టులుగా చలామణీ అయ్యారు. ఏ దశలోనూ వారు కులతత్వాన్ని చీల్చి చెండాడటం మానలేదు. ఆంధ్రలోనూ

అదే జరిగింది. ఎం.ఎన్. రాయ్ తాత్విక రచనలు ఈ కృషికి ఎంతో సహాయపడ్డాయి. అందువల్ల హ్యూమనిస్టులు కులాంతర వివాహాలను చేయించడానికి ఎంతో చొరవ చూపేవారు. రాడికల్ హ్యూమనిస్టులంగా 1950 నుండి రామూర్తిగారు, 1970 నుండి నేను కుల ప్రసక్తి లేని మిశ్రమ వివాహాలను ప్రోత్సహించేవారం. మత తంతులేని పెళ్ళిళ్ళను ఆమోదించటమే కాక బలపరిచేవాళ్ళం. కానీ కులాంతర వివాహమే కుల నిర్మూలన వ్యాధికి సర్వరోగ నివారిణి అని విశ్వసించలేక పోయాం. కులాంతర వివాహాలు చేసుకున్న రాడికల్ హ్యూమనిస్టులను మహాసభలలో సన్మానించాం. వారిని ఆదర్శ ప్రాయులుగా పేర్కొన్నాం. మొదట్లో రామ్మూర్తిగారు కుల ప్రసక్తి లేని పెళ్ళిళ్ళను, ఆదర్శ వివాహాలను మిశ్రమ వివాహ వ్యవస్థ పేరుతో చేయించేవారు. నేను ఆ పెళ్ళిళ్ళకు హాజరు అయిన సందర్భాలెన్నో వున్నాయి. వధూవరులను అభినందించిన సన్నివేశాలు చాలా వున్నాయి.

నా తమ్ముడు డా. కే.యస్.ఆర్. శాస్త్రిది ప్రేమ వివాహం, కులాంతరం. అది పాతికేళ్ళనాటి మాట. ఉభయ పక్షాల పెద్దలు ఆ పెళ్ళిని హర్షించలేక పోయారు. నేను మా అమ్మకు నచ్చ చెప్పడానికి ఎంతో ప్రయత్నంచేశాను. ఆ జంటను ఆహ్వానించి బాపట్లలో మా ఇంట్లో విందు ఏర్పాటు చేశాను. పట్టణంలోని అభ్యుదయ కాములంతా వచ్చారు. వారు వధూవరులను అభినందించారు. ఆ దృశ్యం చూసి నా తల్లి కొంత ఊరట చెందింది. కాలం గడిచినకొద్దీ ఇరువైపులవారు వారిని ఆప్యాయతతో స్వీకరించారు. విచిత్రమేమిటంటే మా అమ్మ తన జీవితంలో చివరి కాలాన్ని ఆ తమ్ముడి ఇంట్లోనే గడిపింది. మరదలు ఝాన్సీదేవి చేతిమీదగా ఆమె దాటిపోయిందంటే ఆ కోడలు ఎంత ఉన్నతురాలో మనం గ్రహించగలం.

మా సంతానాన్ని కులాంతర వివాహాలు చేసుకొమ్మని ప్రోత్సహించాం. అమ్మాయి, చివరి అబ్బాయి సూత్రప్రాయంగా అంగీకరించారు. కానీ అమ్మాయి విషయంలో ఆ ప్రయత్నం ఫలించలేదు. 1978లో నా మూడవ కుమారుడు కుల ప్రసక్తి లేని వివాహాన్ని చేసుకున్నాడు. ఈనాటి జ్ఞానపీఠ అవార్డు గ్రహీత శ్రీ నారాయణరెడ్డి గారు ఆచార్యత్వం వహించగా రాడికల్ హ్యూమనిస్టు ఉద్యమ ప్రముఖులు ఆవుల సాంబశివరావు గారు, ఆం.ప్ర. కుల నిర్మూలన సంఘాధ్యక్షులు వీరాస్వామి గారు ఆ పెళ్ళిలో ఉపన్యాసకులుగా వధూవరులను అభినందించారు. ఆ పెళ్ళికి నేను ఆధ్వర్యం వహించాను. కుల నిర్మూలనోద్యమ కార్యకర్తలు, మహిళాభ్యుదయ వాదులు అనేకమంది పాల్గొని అభినందించారు.

సర్వశ్రీ జి. వీరాస్వామి, డి. జి. రామారావు, సురమౌళి ప్రభృతులు కలిసి ఆం.ప్ర. కుల నిర్మూలన సంఘం స్థాపించారు. అంతర్వర్ణ వివాహాలను ప్రోత్సహించ

పూనుకున్నారు. కులాంతర వివాహాలవల్ల కులం సమసిపోతుందని ప్రచారం చేశారు. ఆ సందర్భంలో గుంటూరు జిల్లాలో ఏర్పడిన కుల నిర్మూలన సంఘ నిర్మాణంలో నేనూ, రామ్మూర్తిగారు పాల్గొన్నాం. కులాంతర వివాహాలు చేసుకున్న వారికి ఉద్యోగాలలో రిజర్వేషన్ల సౌకర్యాన్ని ఆ సంఘంవారు ఆశించారు. అంతటితో ఆగక వెనుకబడిన కులాలవారికి విద్యా ఉపాధి రంగాలలో రిజర్వేషన్లు కావాలనేదాకా వెళ్ళారు ఆ సంఘం వారు. దాంతో మేము అందులో పాల్గొనడం తగ్గించాము.

1971లో హైద్రాబాద్ లో స్థిరపడ్డాక 1979 నుండి కుల నిర్మూలన సంఘంలో చేరి పని చేయడం ప్రారంభించాం. రామ్మూర్తిగారు కార్య నిర్వాహక సంఘ సభ్యులు అయినారు. కుల నిర్మూలన సంఘం వారి సభలలో ప్రసంగించటం, వారి సావనీరు గ్రంథాలలో వ్యాసాలు వ్రాయటం నాకు పరిపాటి అయింది. వారు నిర్వహించే పెళ్ళిళ్ళలో ఉపన్యసించడం, పాల్గొనడం తరచూ జరుగుతోంది. 1983లో కుల ప్రసక్తి లేని వివాహాలను ప్రోత్సహించటానికి 'అభ్యుదయ వివాహ వేదిక' స్థాపించి పెళ్ళిళ్ళు చేస్తూ పని చేస్తున్నా కుల నిర్మూలన ఉద్యమంతో సంబంధం వదులుకోలేదు. అయితే కులంలో వివాహం చెల్లరాదనే సూత్రాన్ని ఆమోదించలేక పోతున్నాము. కులాంతర వివాహాలు చేసుకున్న వారిలో కూడా కుల భావన పోవడం లేదని గ్రహించిన నాకు (ప్రేమ వివాహాలను కుల ప్రసక్తితో కట్టి వేయడం భావ్యం కాదని తోచింది. పూర్వులు, సనాతనులు ఒకే కులంలో వివాహాలు జరగాలని శాసిస్తే, సంస్కరణ పేర కులాంతర వివాహాలు మాత్రమే 'లా' ప్రకారం చెల్లాలని అంటే ఒకే కులంలో వివాహాలు జరుగరాదని శాసించపూనడం జరుగుతున్నది. ఇలా జరిగితే మానవ స్వేచ్ఛ కుంటు పడుతుందని నాభావం, కొన్ని సందర్భాలలో ఒకే కులంవారు గాఢంగా ప్రేమించుకుంటే వారి పెళ్ళి నిరసించాల్సి వస్తుంది. అసలు కులతత్వ భావన నశించడమే ముఖ్యంగదా అనేది నా స్పష్టమయిన అభిప్రాయం.

# 3. సామాజిక కార్యక్రమాలు

## నిర్మాణాత్మక చర్యలు / కార్యక్రమాలు కుటుంబ నియంత్రణోద్యమం

నా చిన్నతనంలో స్త్రీలు పోటీలుపడి పిల్లల్ని కనేవారు. ఒక్క బాపట్లలోనే 21 మంది పిల్లల్ని కన్న తల్లులు ముగ్గురున్నారంటే నమ్మండి. మా పెత్తల్లి అత్తవారింట్లో బహిష్టు అయి ఎరుగదు. అంటే కాపురానికి రాగానే నెల తప్పింది. కడుపుతో వుండటమో, కడుపు పోవడమో జరుగుతూ ఉండేది. ఆమెకు భర్త పోయే నాటికి ముట్లుడిగి పోయాయి. పళ్ళ గంపలాంటి పిల్లలతో ఇల్లంతా నింపింది నా కోడలు అంటూ ఆమె అత్తగారు తెగ గర్వపడేది. కాన్పుల్లో తల్లులు చావటమో లేక పిల్లలు మరణించటమో ఆ రోజుల్లో సర్వసాధారణం. అలా చనిపోతే అదంతా పూర్వజన్మ సుకృతఫలమని నామకరణం చేసేవారు. మా అమ్మకు పదమూడు కాన్పులు. నేను పెద్దపిల్లనవటాన నా తోడబుట్టిన వాళ్ళను ముగ్గురిని నేనే పెంచాను. నా పిల్లలు ఐదుగురిని పెంచి పోషించాను. పిల్లల పెంపకంలో నాకు ఎంతో అనుభవం ఉంది.

ఎం.వి.ఆర్, ఎం.ఎన్. రాయ్ అనుచరుడు అవటం వలన ఆయన గ్రంథం "భారత నారీ ఆదర్శం" చదవడం మూలాన కుటుంబ నియంత్రణ ఆవశ్యకతను 1943 నాటికే గ్రహించారు. ఆయన సలహాలను సూచనలను నేను పాటించనందున దరిమిలా నాకు ఇద్దరు పిల్లలు కలిగారు. చివరి సంతానం కలిగేనాటికి నాకు 25 ఏళ్ళున్నాయి. ఆ వయస్సులోనే అమ్మాయి కలిగిన వెంటనే 1949లో ఆపరేషన్ చేయించుకొని ఆ తర్వాత ఉద్యమ ప్రచారం ఉధృతం చేశాం. అప్పటినుండి ఎన్ని వేలమందికి చెప్పానో! కారణం అది నాకిష్టమయిన మొదటి ఉద్యమం కనుక.

ఆనాడు, నాకు తెలియకపోయినా, కుటుంబ నియంత్రణ సిద్ధాంత ప్రచారంలో ఒకనానుడి వుండేది. తండ్రికో పిల్లవాడు, తల్లికో పిల్ల తల్లిదండ్రులిద్దరికీ కలిపి మరో పిల్ల కాలవైపరీత్యం వల్ల కలిగే ప్రమాదాలను తట్టుకోవడానికి మరోపిల్ల అలా మొత్తం నలుగురు పిల్లల కుటుంబం నమూనా కుటుంబంగా వుండేది. పరిస్థితులు మారి తల్లిదండ్రులిద్దరికీ కలిపి మరోక పిల్ల అవసరం లేదని దరిమిలా సిద్ధాంతం వచ్చింది. అంటే ముగ్గురు పిల్లలు చాలన్నమాట. కాలక్రమేణా వైద్య సౌకర్యాలు పెరిగాయి. బాలల మరణాల ప్రమాదం తగ్గిపోయింది. కనుక ఇద్దరు పిల్లల కుటుంబం చింతలు లేని కుటుంబంగా భావించసాగారు. భార్య భర్తలిద్దరికీ కలిపి ఒక పిల్ల చాలుననే భావం ఇటీవల అభ్యుదయ కాములు ప్రచారం చేస్తున్నారు.

1962లో కుటుంబ సంక్షేమ కార్యకర్తగా శిక్షణ పొందడంతో నాకు విశేషమైన జీవితానుభవం కలిగింది. కుటుంబ నియంత్రణ ఆవశ్యకతను గుర్తించాను. ఆ రోజుల్లో అంటే శిక్షణ కాలంలో ప్రతి విద్యార్థిని కొన్ని కేసులు చేపట్టవలసి వుండేది. నేనొకసారి

ఒక ముస్లిం కుటుంబ గృహంలోకి వెళ్ళాను. కోడలుకు ఆరుగురు పిల్లలు, కొడుక్కు పరిమితమైన సంపాదన. పిల్లలు కలుగకుండా ఆపరేషన్ చేయించుకోమని హితవు చెప్పాను. ఆమె అంగీకరించింది. అయినా తన అత్త అనుమతి పొందమంది. అత్తతో మాట్లాడాను. ససేమిరా వీల్లేదంది. నా ఒక్క ఆపరేషన్ కేసు ఎగిరిపో యింది. శిక్షణ పూర్తి అయిన తరువాత 1962లో బాపట్ల తాలూకా కుటుంబ నియంత్రణ సంఘం ఏర్పాటుచేశాం. బాపట్ల రోటరీ క్లబ్ ప్రముఖులు సహకరించారు. బాపట్ల పట్టణ వీధుల కూడలులలో, పేటలలో చుట్టు ప్రక్కల గ్రామాల్లో చేతిమైకు పట్టుకొని నేనూ, రామ్మూర్తిగారు, కత్తి సత్యనారాయణ గారూ, వెలగపూడి దక్షిణామూర్తిగారు ప్రచారం చేసేవారం. అలా కుటుంబ నియంత్రణ సందేశాన్ని వాడవాడలా 1973 వరకు నేను ప్రచారం చేశాను. రాష్ట్ర కుటుంబ నియంత్రణ సంఘంలో ఇద్దరం జీవిత సభ్యులంగా చేరాము. కొంతకాలం రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలిగా వున్నాను. జిల్లా కుటుంబ నియంత్రణోద్యమ గౌరవ ప్రబోధకురాలుగా నియమిత మయిన తర్వాత జిల్లా అంతటా తాలుకా కేంద్రాలలో, గ్రామాలలో శిక్షణా శిబిరాలు (ఓరియంటేషన్ ట్రయినింగ్ క్యాంప్స్) నిర్వహించాను. ఇవి మూడు రోజులపాటు సాగేవి. 30 మందిని చేర్చి భోజన వసతి సౌకర్యాలిచ్చి కుటుంబ నియంత్రణ విషయ ప్రధానంగా దాని ఆవశ్యకత, అపోహలు, గృహవసతి, విద్యా వైద్య సౌకర్యాలు, ఉద్యోగాల పరిధి, ఆహార పదార్థాల వనరులు వీటి పైన, నిష్ణాతులైనవారి ప్రసంగాలు చేయించేదాన్ని. శరీర నిర్మాణశాస్త్రం, శరీరావయవాల పనితీరు లాంటి వాటి పై వైద్యులు ఉపన్యసించేవారు. కుటుంబ నియంత్రణ విధానాలు, వాటి అమలులోని సౌకర్యాలు, అసౌకర్యాలు, వీటి పై నేను ప్రసంగించేదాన్ని. ప్రజాస్వామ్య వ్యవస్థ మనుగడకు కుటుంబనియంత్రణ ఎలా అవసరమో రామ్మూర్తిగారు మాట్లాడేవారు. ఇలా ప్రతి శిబిరంలోను పన్నెండుకు తక్కువ కాకుండా ప్రసంగాలు సాగేవి. శిక్షణ పొందేవారు తమ తమ అనుమానాలను ధైర్యంగా వ్యక్తం చేసుకొని సమాధానాలను పొందగలిగేవారు. నేను అప్పటికి నలుగురు పిల్లల తల్లినయి, 38 సం॥ ల వయస్సు కలదానినయి, నాభర్త పెద్ద ప్లీడరుగా వుండి అనేక ఉద్యమాలలో సంబంధం ఉన్న వ్యక్తిని కనుక అవహేళనగా, అగౌరవంగా ఎవరూ మాట్లేదేవారు కాదు. అదీగాక అనేక చర్చనీయాంశాల మీద ఎక్కువగా స్థానికులనే ఉపన్యాసకులుగా ఎన్నుకునేదాన్ని. అన్ని తాలూకా ముఖ్య పట్టణాల్లో ప్రముఖ ఫిర్కాకార్యస్థానాల ఊళ్లలో శిబిరాలు నిర్వహించాను. ఆయా ప్రదేశాలలో రాడికల్ హ్యూమనిస్టులు, ప్రజాస్వామ్య వాదులు ఎక్కువగా సహకరించేవారు. సర్వశ్రీ సి. హెచ్. రాజరెడ్డి, ఎనుముల వెంకటేశ్వర్లు, ఎం.వి. రమణయ్య వారిలో ప్రముఖులు. రామ్మూర్తిగారి విషయం ప్రత్యేకంగా పేర్కొన నక్కర లేదు, వారు ప్రతి శిబిరంలోను నాకు చేదోడు వాదోడుగా ఉండేవారు. కుటుంబ నియంత్రణ ప్రచారంవల్ల నీతి నశించి పోతుందని శ్రీమతి కనుపర్తి వరలక్ష్మి గారు 'ఆంధ్రప్రభ' దిన పత్రికలో సుదీర్ఘ వ్యాసం వ్రాశారు. దానికి నన్ను జవాబు వ్రాయమన్నారు రామ్మూర్తిగారు.

ఆమె భావంతో నేను ఏకీభవించకపోయినా అప్పటికే నేను 'ఆంధ్ర జ్యోతిలో' కుటుంబ నియంత్రణ విషయమై అనేక కోణాలను దర్శనం చేస్తూ వ్యాసాలు వ్రాసినా కనుపర్తి వరలక్ష్మమ్మ గారితో తలపడటానికి నాకు మనస్కరించలేదు. అంత రామ్మూర్తిగారు అదే దినపత్రికలో ఆమెకు జవాబు వ్రాశారు. అది ప్రకటిత మయింది.

ఈ సందర్భంగానే మరొక సంఘటన పేర్కొనాలి. బాపట్ల పట్టణంలో వీధి కూడలులలో సభలు పెట్టి ప్రచారం చేశామని చెప్పాను కదా! అలాంటి ఒక సభలో ఒక త్రాగుబోతువాడు వచ్చి '' నేను మగాడిని, నాకు శక్తి ఉంది, నా ఇష్టం వచ్చినంత మంది పిల్లల్ని కంటాను' 'అని గట్టిగా అరిచాడు. నేను జవాబు చెప్పేలోగానే అచట చేరిన స్త్రీలు కలుగ జేసుకొని వాడిని చివాట్లు పెట్టి వెళ్ళగొట్టారు. దాంతో కుటుంబ నియంత్రణోద్యమం విధిగా స్త్రీల ఉద్యమమనే భావన నాలో స్థిరపడింది.

పురుషులు వంధ్యాకరణ శస్త్ర చికిత్స (వ్యా సెక్టమి) చేయించుకుంటే వారి పుంస్త్వం పోతుందని చాలమంది పురుషులకు, స్త్రీలు ట్యూబక్టమీ చేయించుకుంటే నడుం నొప్పి వస్తుందని, లావు అయిపోతారని, పాపమని, భ్రూణ హత్య అని, విజ్ఞానం నశించి పోతుందని, నారు పోసినవాడే నీరు పోస్తాడనే అపోహలన్నింటికీ 'లాజికల్ 'గా సమాధానాలు చెప్పటం, గంటల కొలది ఉపన్యాసాలివ్వటం, వందల మంది గల సభలలో నిర్భయంగా మాట్లాడే అవకాశం, అలవాటు నాకు ఆ రోజుల్లో బాగా ఏర్పడ్డాయి. అందువల్లే ఈనాడు మహిళా సభల్లో అనర్గళంగా మాట్లాడగలుగుతున్నా ననేది సత్యం. మరో ముఖ్య విషయం గమనార్హం. ఆలిండియా రేడియో హైదరాబాద్ శాఖ నన్ను ఫ్యామిలీ వెల్ ఫేర్ ఎడ్వైజరీ బోర్డులోకి ఆహ్వానించి గౌరవించటం ముదావహం.

## హేతువాద ఉద్యమంలో

అన్ని ఉద్యమాలకు మూలం హేతువాదం. మానవునికి మెదడుంది: ఆలోచనా శక్తి ఉంది. అతడు ఆలోచనా జీవిగా ప్రత్యేకతను పొందాడు. విశ్వాన్ని, సమాజాన్ని చివరకు తనను అర్థం చేసుకోవటానికి అతని మేధస్సు ఉపకరిస్తుంది. ఏ విషయాన్ని పరిశీలించినా ఏమిటి, ఎలా, ఎందుకు అనే ప్రశ్నలు మనిషికి తోస్తాయి. ఆ ప్రశ్నలకు సమాధానం చెప్పే క్రమంలోనే అతని వ్యక్తిత్వం వికసిస్తుంది.

హేతువాదం ఈనాటిది కాదు. మానవుని పుట్టుక నుంచీ దాని వ్యాప్తి సాగింది. జంతు దశ నుండి వచ్చిన తొలి జీవి జిజ్ఞాసతో జీవితాన్ని ప్రారంభించిందని చెప్పవచ్చు. విశ్వంలో కన్పించే ప్రకృతి శక్తుల ఉనికికి కారణాన్ని మనిషి అన్వేషించాడు. ఆ ప్రయత్నంలో అతనికి దైవ భావన కలిగింది. ప్రకృతిలోని పదార్థాల సంయోగ వియోగాల ఫలితాలే అనేక ప్రకృతి శక్తుల ఆవిర్భావానికి కారణమని మానవుడు భావించాడు. అలా భావవాదం, భౌతికవాదం పెరుగుతున్నాయి. ఈ సృష్టినంతటినీ ఏదో దైవ శక్తి

నడిపిస్తోందని ఆస్తికులు, మానవ శక్తిని మించిన శక్తి లేదని హేతువాదులు భావిస్తున్నారు. సైన్సు అభివృద్ధి పొందటం మొదలయింది. దాంతో హేతువాదం పుంజుకుంది. శాస్త్రీయ భావనకు బలం చేకూరింది.

కమ్యూనిస్టు సిద్ధాంతంలో నాస్తికత్వం చోటు చేసుకున్నది. మానవులు మత భావనను వీడనిదే సామాజిక పునర్నిర్మాణానికి పూనుకోలేరు గదా! కనుకనే మార్క్సు నాస్తికత్వానికి ప్రాముఖ్యతను యిచ్చాడు. ఎమ్.ఎన్. రాయ్ హేతువాద ఆలోచనా విధానాన్ని సమర్థించటానికి అవసరమయిన సారస్వతాన్ని సృష్టించాడు. కర్మ సిద్ధాంతం, ఆత్మ నిత్యత్వం, పునర్జన్మ మొదలగు ఆధ్యాత్మిక భావాల గుట్టు రట్టు చేశాడు. 1935 నుండి 48 వరకు ఈ కృషి సాగింది. తమిళనాడులో రామస్వామి (ఇ వి ఆర్) ఆంధ్ర ప్రాంతంలో త్రిపురనేని నాస్తికోద్యమానికి చేయూతనిచ్చారు. గోరా నాస్తికోద్యమాన్ని చేపట్టాడు.

1930 దశకంలో బొంబాయిలోను, దేశం యొక్క యితర ప్రాంతాలలోను పూజారీ విధాన పద్ధతికి వ్యతిరేకంగా సంఘాలు ఏర్పడినాయి. ఇ.వి.ఆర్ ఒకనాటి అనుచరుడయిన ఎస్. రామనాథన్ దేశంలోని హేతువాదులను చేర్చి 1949లో అఖిల భారత హేతువాద సంఘ నిర్మాణం చేశాడు. దాంట్లో ఎం.ఎన్. రాయ్, ఎలెన్ రాయ్, గోరా, జోసఫ్ ప్రభృతులు చేరారు. తరువాత రాడికల్ హ్యూమనిస్టు ఉద్యమానికి చెందిన సర్వశ్రీ సి.ఆర్.ఎం. రావు, ఆర్.యస్. యాదవ్, ఎ.జి.కె. ప్రభృతులు సంఘంలో బాధ్యతాయుత పదవులను నిర్వహించారు. రావిపూడి, ఎన్.వి. బ్రహ్మం తదితర మిత్రులు ఉద్యమానికి ఆంధ్ర ప్రాంతంలో బలాన్ని చేకూర్చారు.

1972 వరకు శ్రీ ఆవుల సాంబశివరావు ప్రధాన కార్యదర్శిగా వ్యవహరించారు. వారు హైకోర్టు న్యాయమూర్తిగా పదవీ స్వీకారం చేయటంతో ఉద్యమంలో రాడికల్ హ్యూమనిస్టు భావాలవారి ప్రాతినిధ్యానికి మనిషి అవసరమయినాడు. ఆ పరిస్థితుల్లో నేను, రామ్మూర్తిగారు మద్రాసులో 1973 డిసెంబరులో జరిగిన అఖిల భారత హేతువాద మహాసభకు వెళ్ళటం తటస్థించింది. బొంబాయి వాసి ఆనాడు యూరపు నివాసి అయిన ప్రముఖ హ్యూమనిస్టు శ్రీ అబ్రహాం సాలమను మహాసభను ప్రారంభం చేశారు. ఆయన ప్రసంగంలో హేతువాద ఆదర్శం, లక్ష్యాలు, మార్గం స్పష్టంగా నిర్వచింపబడినాయి. ఆ ఉపన్యాసం నన్ను ఆకర్షించింది. ఆ మహాసభలో రామ్మూర్తి గారు అఖిల భారత సంఘ ఉపాధ్యక్షులలో ఒకరుగా ఎన్నుకోబడ్డారు. అఖిల భారత సంఘం వారు శ్రీ ఎ.టి. కోవూరు పర్యటనను ఏర్పాటు చేయదలిచారు. కోవూరు సింహళ హేతువాద సంఘాధ్యక్షుడు. ఆయన శాస్త్ర అధ్యయనం విశేషంగా చేసిన వ్యక్తి. మానవ జీవితాలలో అద్భుతాలకు తావులేదని విశ్వసించి ప్రచారం చేసే ప్రబోధకుడు. ఆయన పర్యటనను భారత దేశంలో ఏర్పాటు చేస్తే అది హేతువాద ఉద్యమ వ్యాప్తికి తోడ్పడుతుందని

ఆనాటి సంఘ కార్యదర్శి శ్రీ ఎ. సూర్యనారాయణ ఊహించాడు. ఆంధ్ర ప్రాంతంలో పర్యటన తాలూకు ఏర్పాట్లు చేసే బాధ్యత రామ్మూర్తిగారికి యివ్వబడింది. 1974లో కోవూరు పర్యటనకు చీరాల, విజయవాడ, వరంగల్, హైదరాబాదును ఎంపిక చేయడం జరిగింది. ఆ సభల్లో కోవూరు ఉపన్యాసాన్ని రామ్మూర్తిగారు తర్జుమా చేశారు. నేను కోవూరు వెంట పర్యటించడం, ఆయన వసతి సౌకర్యాలు చూడటం, సభలు నిర్వహించడం చేశాను. మిత్రుడు వేణుగోపాల్ కూడా సహకార్యకర్తగా వ్యవహరించాడు.

కోవూర్ 1975, 1976 లలో మరలా ఆంధ్రా ప్రాంతంలో పర్యటించాడు. 1975లో విజయవాడలో సభ జరిగినపుడు రామ్మూర్తిగారు డెటిన్యూగా జైలులో వున్నారు. వారు సభలో లేక పోవడాన్ని ఆయన నర్మ గర్భితంగా ప్రస్తావించాడు. 1976లో వచ్చినప్పుడు విజయవాడలో సభ ఏర్పాటు చేశాం. నేను సభా నిర్వహణలో పాలు పంచుకున్నాను. కాకినాడ నుండి ఒంగోలు వరకు సభల్లో ఆయన ఉపన్యాస పాఠాన్ని రామ్మూర్తిగారు తెలుగులోకి అనువదించి శ్రోతల కందించారు.

కోవూర్ పర్యటనలు ఆంధ్ర ప్రాంతంలో ఉద్యమాన్ని పునరుజ్జీవింప చేసినాయి. మిత్రుడు తోటకూర వెంకటేశ్వర్లు 'చార్వాక' అనే పేరుతో మాస పత్రిక పెట్టి ఉద్యమానికి ఇతోధికంగా సేవ చేశాడు. అందులో నేను హేతువాద వ్యాసాలు వ్రాస్తూ వుండేదాన్ని. "నేను హేతువాదిని ఎలా అయ్యాను" అనే వ్యాసం చాలామంది మెప్పు పొందింది.

1979లో ఏలూరు జిల్లా హేతువాద సంఘం వారు ఆంధ్ర రాష్ట్ర హేతువాద మహాసభను సమావేశ పరిచారు. అనుభవజ్ఞులైన రామ్మూర్తిగారిని సంఘ నిర్మాణ బాధ్యత స్వీకరించమని స్థానిక మిత్రులు కోరారు. అప్పుడు అధ్యక్షునితో మూడు ప్రాంతాలకు ముగ్గురు ఉపాధ్యక్షులతో, ఒక స్త్రీ ఉపాధ్యక్షురాలిగా, ఒక ప్రధాన కార్యదర్శితో మూడు ప్రాంతాలకు విడివిడిగా ఒకరు చొప్పున ముగ్గురు సహాయ కార్యదర్శులతో ఒక స్త్రీ కార్యదర్శితో జిల్లాకొక సభ్యుని చొప్పున కార్యనిర్వాహక వర్గాన్ని రామ్మూర్తిగారు రూపొందించారు. ఆ సందర్భంగా రాష్ట్ర హేతువాద సంఘ ఉపాధ్యక్ష పదవి నాకు దక్కింది. తర్వాత ఆ పదవికి తగినట్లు బాధ్యతలు నిర్వహిస్తూ వచ్చాను. రాష్ట్ర సంఘ స్థాపన నుండి వైస్ ప్రెసిడెంట్ గా వుండి యధోచిత సేవ చేస్తూనే వున్నాను. హేతువాది పత్రికలో రాస్తూనే వున్నాను.

ఏలూరు (1979), రాజమండ్రి (1981), భీమవరం (1983), విజయవాడ (1985), గుంటూరు (1987) రాష్ట్ర మహా సభలకు నేను హాజరై మహా సభల్లోనూ, బహిరంగ సభల్లోనూ ఉపన్యసించాను. భీమవరం మహాసభకు డా.ఎల్. ఆర్. శివ సుబ్రహ్మణ్యాన్ని, రాజమండ్రికి న్యాయమూర్తి జీవన్ రెడ్డిగారిని, విజయవాడకు భూగర్భ శాస్త్రవేత్త డా. వినోద్ కుమార్ గౌర్ గారిని, గుంటూరుకు శాస్త్రవేత్త డా. గౌరీశంకర్ గారిని ఆహ్వానించగలిగాం.. అఖిల భారత మహాసభలకు బొంబాయి, ఢిల్లీ మొదలైన

చోట్లకు హాజరై ప్రసంగించే దాన్ని. కేరళ, మధ్య ప్రదేశ్ రాష్ట్ర మహాసభలకు వక్తగా వెళ్ళేదాన్ని. ఆంధ్రప్రాంతంలో జరిగిన అధ్యయన తరగతుల్లో 'హేతువాదము - కుటుంబము', 'హేతువాదం - స్త్రీలు', 'హేతువాదము - సెక్సు' అనే అంశాల పైన తరగతులను నిర్వహించేదాన్ని. 'హేతువాదం - స్త్రీలు', 'భావ వాహిని' అనే హేతువాద పుస్తకాలను కూడా వ్రాశాను. నా వ్యాసాలు 'హేతువాది' లోనూ, యస్వీరావు గారు నడిపిన 'హేతువాదం' లోనూ, బి. రామకృష్ణ, జయగోపాల్ గార్లు నడిపిన 'నాస్తిక యుగంలోనూ' వారి ఇంగ్లీషు పత్రిక ''ఏజ్ ఆఫ్ ఎథియిజం' లోనూ ప్రచురితమయ్యేవి.

ప్రఖ్యాత హేతువాది ఛార్లెస్ బ్రాడ్ లా వంద సంవత్సరాల క్రితం బ్రిటనులో స్థాపించిన నేషనల్ సెక్యులర్ సొసైటీ కోశాధికారి శ్రీ దేవ్ దేఖర్ దక్షిణ భారతంలోని హేతువాద నాస్తికవాద ఉద్యమాలను అధ్యయనం చేసే నిమిత్తం వచ్చారు. ఆ సందర్భంలో ఆయనను నేనూ రామ్మూర్తిగారూ వెంట వుండి సికిందరాబాదు, వరంగల్, ఏలూరు, చీరాల సభలలో ఉపన్యసింప చేశాం. ఆంధ్ర ప్రదేశ్ లోని హేతువాద నాస్తికవాద ఉద్యమాల తీరు తెన్నులను విశద పరిచాం.

1990లో నేషనల్ సెక్యులర్ సొసైటీ అధ్యక్షురాలు శ్రీమతి బార్బారా స్మోకర్ వస్తే హైదరాబాద్ లో సభ ఏర్పాటు చేశాం. ఇలా యధోచితంగా హేతువాద ఉద్యమ వ్యాప్తికి తోడ్పడ్డాను.

# వివిధ ప్రగతి నిరోధాల పై ప్రతిచర్య

## సతీ సహగమన వ్యతిరేక ఉద్యమం

రాజస్థాన్ లోని దేవరాల గ్రామంలో తేది. 4-9-87 సతీసహగమనం జరిగిందనే వార్త పత్రికల్లో వచ్చింది. సభ్యసమాజం కలవరం చెందింది. 1856లో సతీసహగమన నిరోధ శాసనం వచ్చినా 20వ శతాబ్దంలో ఇంకా సహగమనపు వార్త వినవలసి రావడం ఘోర దురన్యాయమని బాధపడింది. ప్రజానీకం. సతీ సహగమనం చేసిందన్న రూప్ కన్వర్ వాస్తవానికి ఇష్టపూరక్వకంగా చితిని ఎక్కలేదని, రాజస్తాన్ యువకులు విచ్చు కత్తులతో పహరాకాస్తూ ఆమెను బలవంతంగా చితిలోకి నెట్టారని వార్తలు వచ్చాయి. ఒక నిండు ప్రాణాన్ని సామాజిక ఆచారం పేర బలిచేయడం స్త్రీ జాతికి అవమానంగా నాకు తోచింది. వెంటనే ఆందోళనకు దిగాలనుకున్నాను. శ్రీమతి స్నేహలతా భూపాల్ తను కూడా ఈ ఉద్యమంలో పనిచేస్తానన్నది. ఇద్దరం కలిసి ఇరవై దాకా మహిళా సంఘాల వారిని కలిసి వారి సహాయాన్ని అర్థించాం. వారు ఉత్సాహంగా ముందుకు వచ్చారు. 10-09-1987 తేదీన హైదరాబాద్ లో సదస్సు జరిపాం. నేను అధ్యక్షత

వహించాను. సతీసహగమనం 'స్త్రీలపై అత్యాచారాలకు పరాకాష్ఠ' అని ప్రసంగించాను. సుమారుగా పాతిక మంది మహిళా సంఘ ప్రతినిధులు, ఉద్యమ నాయకులు ప్రసంగించారు. పత్రికలలో వార్తలు, దూరదర్శన్ లో ప్రచారం బాగా లభించాయి.

సికిందరాబాదు నగరంలో ఇలాంటి సభ జరపాలని స్వాతంత్ర్య సమరయోధులు శ్రీ నర్రా మాధవరావుగారు సంకల్పించారు. నా సహకారాన్ని అర్థించారు. మేము ఇరువురము సమావేశక ర్తలుగా పౌరసభకు 5-11-1987 తేదీన మహబూబియా కాలేజీలో ఏర్పాటుచేశాం. ఆనాటి గవర్నర్ కుముద్ బెన్ జోషి సభను ప్రారంభించడానికి అంగీకరించింది. పలువురు పెద్దలు, అధ్యాపకులు, స్వాతంత్ర్యయోధులు ప్రసంగించారు. సభ జయప్రదమయింది. వార్తలు బహుళంగా వచ్చాయి. సతీసహగమన వ్యతిరేక ఉ ద్యమం బలం పుంజుకున్నది. సతీ దేవాలయ నిర్మాణాన్ని హైదరాబాద్‌లో కొందరు తల పెట్టారని తెలిసి అలాంటి దుష్ట ప్రయత్నాన్ని ఆపమని ముఖ్యమంత్రికి, గవర్నర్కు విజ్ఞాపన పత్రాలు సమర్పించాం. రాష్ట్రాలలో పలు దేశాలలో ఉద్యమ భావం బలపడింది. నేను అనేక సభల్లో పాల్గొన్నాను. వికారాబాదులో, తెనాలిలో, వనపర్తిలో, ఏలూరులో, విశాఖపట్టణం సభల్లో నేను ముఖ్యోపన్యాసాలు చేశాను. విశాఖపట్నం ఉపన్యాసం పత్రికలవారి దృష్టిని విశేషంగా ఆకర్షించింది.

## మొనాస్టరీ పై రిట్

సతీ సహగమన అత్యాచార నిరోధం పై ఏలూరులో ఒక సదస్సు పెట్టి నన్ను ప్రారంభోత్సవా నికి పిలిచారు. ఆ వార్త ఆరోజు పేపర్లో 'సభలు - సమావేశాలు' కాలంలో చూసి అక్కడి థెరిసా మహిళా కళాశాల వారు వారి 'కాలేజి కాంపస్'లో ఉ పన్యసించమని నన్ను అడిగారు. ఆ సభలో 400 మంది విద్యార్థినులు పాల్గొని దాదాపు 100 ప్రశ్నలడిగి, నా సమాధానాలు విని సంతృప్తి పడ్డారు.

అదే రోజు ఉదయం పేపర్లోని ఒక వార్త నన్ను కలవరపరిచింది. అదేమిటంటే ఏలూరు బిషప్పు ఎనిమిది మంది పెళ్ళికాని ఆడపిల్లలను 'మొనాస్టరీ' లో అంటే ఒక ప్రార్థనా మందిరంలో రెండు గదులు కట్టించి, అందులో వారిని జీవితాంతం వుంచి ధ్యానం చేయిస్తే పాప పంకిలం నుండి మానవులు ప్రక్షాళన మవుతారనే ధ్యేయంతో ఆ 'బిల్డింగ్ 'పూర్తి చేయించి 12-11-87 తేదీన ఆ ఉత్సవం జరుపుతామని ప్రకటించాడు. ఆ బిల్డింగుకు కిటికీలు లేవు. బైటకు ద్వారాలు లేవు. బైటి ప్రపంచాన్ని చూడకుండా ఒక కన్నం ద్వారా అన్నం మాత్రం పంపుతారు. వారి కొఱకు ఎనిమిది గోతులు ముందుగానే త్రవ్వి వారిలో ఎవరు ముందుగా చనిపోతే వారిని పూడ్చి పెడుతూ వుంటారట. ఎనిమిదో ఆవిడ కూడా పోయాక మరో ఎనిమిది మంది యుక్త వయస్కులైన అమ్మాయిలను తిరిగి అందులో ప్రవేశ పెడతారు. ఈ ప్రదేశాన్ని 'మొనాస్టరీ' అంటారు.

ఈ వార్త చదివి "ప్రజల మోక్షానికి ఆడపిల్లలే కావాలా! పురుషులు నిషిద్ధమా? అసలు ఆ బిషప్ తానే ఎందుకు ఆ పుణ్యకార్యానికి సంసిద్ధుడు కాడు? ఇదేం ఘోరమని' తలచి వెళ్ళి ఆయనను ఇంటర్వ్యూ అడిగితే ఇవ్వలేదు. ఇక పట్టరాని కోపంతో తల్లడిల్లిపోతున్న సమయం లో 'ఉదయం' పత్రిక వారు విజయవాడ నుండి తమ ఏలూరు 'కరస్పాండెంట్'కు ఫోనుచేసి నన్ను 'మొనాస్టరీ' పై 'ఇంటర్వ్యూ చేయమని పంపారని వచ్చి చెప్పాడు. అప్పుడు నా అభిప్రాయాలన్నీ ఇంటర్వ్యూలో చెప్పాను. వాటిని వ్రాసికెళ్ళి "మొనాస్టరీలో ధ్యానం: అర్థం లేని త్యాగం" అన్న పెద్ద శీర్షికతో బిషప్ ను విమర్శిస్తూ పత్రికవారు అచ్చువేశారు.

ఆ తర్వాత హైదరాబాద్ వచ్చి నేను, మోటూరి ఉదయం (సి.పి.ఎం) రామ్మూర్తి గారూ (పి.యు.సి.ఎల్) కలిసి హైకోర్టులో ఒక రిట్టు వేయటం జరిగింది. స్టే ఆర్డర్ తెచ్చాం. వెంటనే హైకోర్టు నుండి ఒక కోర్టు కమిషనరు అసలు విషయం తెలుసుకోవడానికి ఏలూరు వెళ్ళాడు. ఆ విషయం ముందుగా తెలుసుకున్న బిషప్ ఆ గదికి రెండు కిటికీలు పెట్టించి అందులో వున్న ఎనిమిది మంది అమ్మాయిలచేత తామే ఈ పనిని తమ ఇష్టపూర్వకంగా చేస్తున్నామని చెప్పించాడు. ఇలా పాక్షిక విజయం సాధించగలిగాం.

## దుష్ట మేధావి మనువు

1988లో ఆరు అడుగుల మనువు విగ్రహాన్ని చెక్కించి రాజస్థాన్ హైకోర్టులో ఆవరణలో చీఫ్ జస్టిస్ ఆవిష్కరించాడు. దానికి సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ అనుమతి ఇచ్చాడని వార్త చదివి అంబేద్కర్ మీటింగ్ లో దుష్ట మేధావి మనువు అంటూ అవహేళన చేశాను. మనువు బి.సి. రెండవ శతాబ్దపు మేధావుల్లో ముఖ్యుడు. ఆనాటి ఆచార వ్యవహారాలన్నీ క్రోడీకరించి ధర్మశా స్త్రంగా రూపొందించాడు. అందులో స్త్రీ ధర్మాలు, విధి నిషేధాలు సర్వం అంటే ఆమె పుట్టిన దాది తుది దశవరకు బాల్య యవ్వన కౌమార వార్ధక్య దశలలో స్త్రీ వ్యక్తిత్వాన్ని అణచటానికి తగిన రూపాంతరాలన్నీ నిర్వచించాడు. 'న స్త్రీ స్వాతంత్ర్యమర్హతి' అంటూ స్త్రీ ఏ దశలోనూ స్వేచ్ఛ లేని కట్టుబానిసగా ప్రకటించాడు. ఆ శాస్త్రాధారంతో రాసినవే మన హిందూ చట్టాలన్నీ. ఆ తరువాత చట్టాలలో కొన్ని సవరణలు వచ్చాయి. అయినా వాటిని అనుభవించలేనంత మానసిక దౌర్భల్యంతో మన స్త్రీలు ఈనాటికీ మహా దౌర్భగ్య స్థితిలో వున్నారని, అలాంటి దుష్ట మేధావి అయిన మనువును తిరిగి ప్రతిష్టించటం స్త్రీ జాతి అభ్యుదయానికి గొడ్డలి పెట్టు అని ఆనాటి నా ఉపన్యాసంలో పేర్కొన్నానని ఆర్య సమాజంవారు దుయ్యబట్టి వారి పత్రికల్లో నన్ను ఘాటుగా విమర్శించారు.

## సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి అనుచిత ప్రసంగం

1990 నవంబర్ లో సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ శ్రీ రంగనాధ మిశ్రా బ్రహ్మకుమారీల సభలో ఉపన్యసించారు. "స్త్రీలు ప్రతి రంగంలోనూ పురుషులతో పోటీ పడరాదు. ఇల్లాలుగా స్త్రీ మహా సమర్ధురాలు. ఇంటిని మహిళ స్వర్గసీమగా మలుచుకుంటే చాలు. పాత ధర్మశాస్త్రాలు చెప్పినట్టుగా కుటుంబంలోనూ, సంఘంలోనూ ఆమె గొప్పదని గుర్తిద్దాం. తల్లిగా, తోబుట్టువుగా, చేసుకున్న భార్యగా స్త్రీ స్థానం మహా దొడ్డది. అంతేగాని పురుషునితో పోటీగా తగుదునమ్మా అని స్త్రీ సమానత్వం కావాలని పాకులాడటం తగదు. అది తనను తాను ఆమె కించపరచుకోవడమే. ఈ పోటీ మనస్తత్వాన్ని చాలించుకొని స్త్రీలు ఇతర రంగాలలో ప్రవేశం కట్టి పెట్టి మళ్ళీ ఇళ్ళలోనే వుండి పోవాలి "అన్న పితృస్వామిక భావాలను వెలిబుచ్చాడు. నేను అతని దుష్టభావాలను వ్యతిరేకిస్తూ పత్రికలకు ప్రకటనలు పంపడమే కాక 'స్త్రీ స్వేచ్ఛ'లో వ్యాసాలు, సంపాదకీయం వ్రాయటం జరిగింది. ఇలా ఎక్కడ ఎప్పుడు ఏ అన్యాయం జరిగినా ప్రతిస్పందిస్తూ ఖండిస్తూనే వున్నాను. సభలు పెడుతూనే వున్నాను మెమోరాండాలు సమర్పిస్తూ, ఆందోళనలు సాగిస్తూ యధోచిత కార్యక్రమాలు నిర్వహించటం పరిపాటి అయింది.

## సిద్ధాంత వ్యతిరేకత ఎంతకయినా దారితీస్తుంది

నవంబరు 1987లో విశాఖపట్నంలో పెద్ద సతీసహగమన వ్యతిరేక సభ, ప్రదర్శన ఏర్పాటు చేస్తామని నన్ను ముఖ్య అతిధిగా ఆహ్వానించారు. భారత నాస్తిక సమాజపు ఆం. ప్ర. శాఖ అధ్యక్షులు టి. శ్రీ రామమూర్తిగారు. జిల్లా గ్రంధాలయ సంస్థ ఆవరణలో పోలీసువారి అనుమతి పొంది సభను ఏర్పాటుచేశారు నిర్వాహకులు. తీరా సభా సమయానికి కరెంటు తీసేశారు. గ్రంథాలయం ముందు నాలుగు వ్యాన్లతో పోలీసులు వచ్చి నిలబడ్డారు. దారికి అడ్డం నిలిచారు. సభను నిషేధించామన్నారు. ఎందుకంటే అంతే అన్నారు. సభా ప్రాంగణం ప్రక్కన బి.జె.పి. వారి మద్దతుతో పదిరోజులుగా యజ్ఞం జరుగుతోంది. అక్కడ కరెంటు వుంది వారి మంత్రోచ్చారణ మైకు ద్వారా వింటున్నాం.

మేమంతా గేటు ముందు నిలబడ్డాం. పోలీసులు గేటుకు గడియవేసి బయట నిలబడి మమ్మల్ని లోనికి పోనియ్యలేదు. 'మీటింగుకు అనుమతి ఇచ్చారు కదా! ఇప్పుడు ఏమయిందని' కార్యకర్తలు ప్రశ్నించారు. పై నుండి మీ సభను ఆపమని ఉత్తర్వులు నచ్చాయి. అక్కడికి వెళ్ళి మీరు అనుమతి తెచ్చుకోండి. లేకపోతే వీల్లేదు" లోనికి వెడితే అరెస్టులు చేస్తామని, లోపలికి పోరాదని పోలీసులు హుంకరించారు. మిగతా ఆడవాళ్ళను, నన్ను అరెస్టు చేస్తామని బెదిరించారు. 'చేసుకోండి! అన్నాను. పొరుగూరు నుండి వచ్చారు. ఇక్కడ చిక్కుల్లో పడిపోతారని కొందరు స్త్రీలు భయ పెట్టారు. 'ఇది ఊరు కాదా? ఒక

సతిచేత సహగమనం చేయించారు. ఇది రాక్షస కృత్యమని సభ్య సమాజానికి చెప్పి వెడదామని ఇంత దూరం వచ్చాను. ఆ విషయాన్ని బహిర్గతం చెయ్యకుండా వెళ్ళను' అని భీష్మించాను. మేమంతా ఏం తప్పు చేశామని అంటూ నెట్టుకుంటూ లోనికెళ్ళాం. నా వెంట మిగతా ఆడవారు వచ్చారు. చీకట్లో మైకు లేకుండానే ఉపన్యాసం మొదలు పెట్టాను. ప్రక్కనున్న యజ్ఞంతాలూకు వాళ్ళు వారి మైకు 'సౌండు' పెంచారు. నేను నా కంఠం ఇంకా పెంచాను. హైదరాబాదు నుండి వచ్చిన సుబ్బమ్మ గారిని అరెస్టు చేస్తే అసెంబ్లీలో ప్రశ్నలు రావచ్చు. 'పేపర్లు' దుయ్యబట్టవచ్చు. ఏమో ఎందుకయినా మంచిది' అనుకున్నారేమో పోలీసులు బైటవున్న మా కార్యకర్తలనందరినీ లోనికి రానిచ్చారు. అలాగే గంట మాట్లాడాను. పత్రికలకు 'స్టేటుమెంటు' ఇచ్చి హైదరాబాదు వచ్చేశా. ఇదంతా మతానికి నాస్తికత్వానికి జరిగిన యుద్ధం. ఆనాడు అంత దూరం నేను పోతానని ఎవ్వరూ ఊహించలేదు. సిద్ధాంత వ్యతిరేక సంఘర్షణ ఇలా పర్యవసానం అయింది.

# 4. రాజకీయ ఉద్యమాలు

## రాజకీయాలతో నా అనుబంధం

అవి 1932 సంవత్సరములో సత్యాగ్రహం జరుగుతున్న రోజులు. కాంగ్రెసువారి సభలు మా ఇంటిముందున్న గాంధీ విగ్రహం ముందు జరిగేవి. నిక్కర్లు ధరించి కాంగ్రెసు జెండాలతో రెడీగా వుండేవారు వాలంటీర్లు. నాయకులు, కార్యకర్తలు స్థిరచిత్తంతో ఉపన్యాసాలు ఇస్తూ వుండేవారు. ఆ ధైర్యం, త్యాగం, చొరవ, పట్టుదల వారికి ఆనాడు ఎలా కలిగాయో వర్ణనాతీతం. ప్రాణాలు సైతం లెక్కచేయక దీక్షతో ఎలా నిలబడేవారో! వారిని చూస్తుంటే భయం, దుఃఖం, ఆశ్చర్యం అన్నీ పెనవేసుకొని నిశ్చలంగా చూస్తూ కొయ్యబారి పోయే వాళ్ళం. లక్షలు కుమ్మరించినా చేయలేని త్యాగాలు వారివి. డబ్బుతో కొనలేని దేశభక్తి వారిది. పదవుల కోసం ప్రాకులాడని దీక్షవారి సొమ్ము. సర్వస్వం పరిత్యజించే నైజం వారిది. పోలీసులు వచ్చి లాఠీలు తీసుకొని వారిని చితకకొట్టేవారు. బూటు కాళ్ళతో పొట్టమీద తొక్కేవారు. రక్తం స్రవించేది. నేలమీద పడిపోతూ కూడా 'భారత మాతకు జై' అంటూ అరుస్తూనే వుండేవారు. వెంటనే వారిని 'వ్యాను' ఎక్కించుకొని వెళ్ళేవారు. పది నిముషాలకల్లా మరో జట్టు తయారయ్యేది. మళ్ళీ సభ, మళ్ళీ గుంపులుగా జనం చేరడం, మళ్ళీ కొట్టడం, చెల్లాచెదురవటం, మళ్ళీ పోగవటం ఇలా జరుగుతూనే వుండేది. క్షణంలో ఆ ప్రాంతమంతా నానా బీభత్సంగా మారిపోయేది. మేమంతా భయంతో గజగజలాడి పోయేవాళ్ళం. మా నాన్న వీధి తలుపులు మూసి గడియలు వేసేవాడు. నేనూ, మా అన్నయ్య మేడ ఎక్కి చూస్తూ వుండేవాళ్ళం. ఆ దృశ్యాలు తలుచుకుంటే ఈ నాటికీ ఒళ్ళు గగుర్పొడుస్తుంది.

అది 1934వ సంవత్సరం అనుకుంటాను. మహాత్మా గాంధీ బాపట్ల వచ్చేటప్పటికి నాకు పదేళ్ళుంటాయి. టౌన్ హాల్లో ఆయన మీటింగ్ ఏర్పాటుచేశారు. అప్పటికి రాజకీయాలన్నా, బ్రిటిష్ పరిపాలన అన్నా, ఓటుహక్కు అన్నా, ప్రజాస్వామ్యం అన్నా ఆడవాళ్ళకే కాదు, మగవాళ్ళకు కూడా చాలామందికి తెలియదు. పట్టించుకునే వాళ్ళు కాదు. మా నాన్న ప్లీడరు కావటాన, కొంచమైనా దేశభక్తి వుండటాన కొంత అవగాహన, సానుభూతి వుండేది. కానీ, కాంగ్రెసులో చేరడం, త్యాగాలు చేయటం, జైళ్ళకు వెళ్ళటం అంటే హడల్. అయిన ఇంట్లో బ్రిటిష్ వారి దౌర్జన్యాలు, భారతదేశపు దోపిడి గురించి కథలుగా మాకు కబుర్లు చెబుతూ వుండేవాడు మానాన్న. గాంధీ ప్రభావంవల్ల సత్యాగ్రహ ఉద్యమం పై గల గౌరవంవల్ల జాగృతి, చైతన్యంకల భారతీయులందరూ ప్రభావితులైనారు. ఆరోజు గాంధీ 9 గంటలకు బాపట్ల బైలుదేరి టౌనుహాల్లో మీటింగ్ జరిపి, తిరిగి 10 గంటలకు వెళ్ళిపోతారని తెలిసి గబగబా వారిలో నేను, మా అన్నయ్య, అమ్మా, నాన్న, మానెచ్చెలి పిచ్చామ్మా వెళ్లాం. జనంతో కిక్కిరిసి పోకముందే నేను, పిచ్చెమ్మా

నెట్టుకుంటూపోయి ముందుగా కూర్చున్నాము. ఖద్దరు బట్టలు ధరించి, ఖాదీ దండలు చేతబూని గాంధీని చూడటానికి జనం బారులు తీర్చి నిలబడివున్నారు. దూసుకుంటూ పోతున్న టాపులేని కారులో నిలబడి బోసి నవ్వుతో ముకుళిత హస్తాలతో తిలకిస్తున్న గాంధీ కారుదిగి లోనికి వచ్చిన వెంటనే ఆయనకు నమస్కరించి కూర్చున్నాం. పైనున్న కొల్లాయి గుడ్డ పరిచి విరాళాలు అడిగితే ('డబ్బు' అనే ఒక్క తెలుగు పదం వచ్చు గాంధీకి) రూపాయలు ధన ధనా పడుతూనే వున్నాయి. ఆడవాళ్ళు గాజులు, గొలుసులువేసి దణ్ణాలు పెట్టి పోతున్నారు. "అందరూ వేస్తున్నారు. నాకు రెండు గాజులు న్నాయి. అందులో ఒకటి వేస్తానే, నీవేలి ఉంగరం నువ్వు వెయ్యవే" అని పిచ్చమ్మ నాతో గుసగుసలాడింది. నాకు నిలుపు గ్రుడ్లు పడ్డాయి. పిచ్చమ్మ గాజు పడేసి నన్ను పొడుస్తూ వేధించింది. లోపల ఇష్టమయినా "మా అమ్మ తంతుంది, తిడ్తుంది. ఎలా" అన్నాను బిక్కమొహంతో. "పోయింది అని చెప్పవే" అంటూ నా ఉంగరం లాగింది. ఉదయం అమ్మతో మా నాన్న పది రూపాయలు కాంగ్రెసు ఫండుకు ఇస్తాననడం విని నేను మాత్రం ఎందుకు ఆపని చెయ్యరాదూ అని వెంటనే తీసి పడేస్తుంటే ఏదో అనిర్వచనీయమైన ఆనందం నాలో ఆవరించింది. ఆ తర్వాత ఇంటికొచ్చాక మా అమ్మ కథ మామూలే.

మా ఇల్లు నడిబజారు కూడలి కావటాన అక్కడ నిలువెత్తు గాంధీ బొమ్మ వుండటాన అక్కడ సభలకు పెద్ద పెద్ద నాయకులంతా వచ్చి బ్రిటీష్ వారి దురాగతాలను వెల్లడించి, దేశభక్తిని బోధించేవారు. కాంగ్రెస్ నాయకులు అందరూ నెహ్రూ, రాజేంద్రప్రసాద్, బోసు, వల్లభాయి పటేల్, సరిహద్దు గాంధీ గఫర్ ఖాన్ ఇంకా అనేకమంది గాంధీ టోపీలు ధరించి, ఇద్దరు బట్టలతో, దేశభక్తి గురించి చెప్తుండేవారు. వారి ప్రసంగాలు ఆనాడు అర్థం కాకపోయినా వారిని చూచే అవకాశం కలిగింది. అందువల్ల రాజకీయాల మీద చిన్న వయస్సులోనే నాకు ఆసక్తి కలిగింది. అది ఎంతవరకు నా మీద పనిచేసిందంటే అత్తగారి చికాకులు బాధ కలిగించినప్పుడు అనేకసార్లు ఇల్లు విడిచి గాంధీ ఆశ్రమానికి వెళ్ళి ఆయనతో కలిసి పనిచేయాలని అనుకునే దాన్ని. కాని అది అనుకోవటమే కాని ఫలించనే లేదు. ఆనాడు నాకు అంత సాహసం లేదు, అవకాశం అసలే లేదు. ఆచరణలో మాత్రం పెట్టలేకపోయాను.

1950 తరువాత బాపట్లలో అనేక మహిళా సంఘాలలో రకరకాల పదవులు నిర్వహించే దాన్ని. దానివల్ల ఇతర రంగాలతో పాటు రాజకీయాలలో కూడా పాల్గొనాలనిపించేది. ఆ విధంగా రాజకీయాల్లో కొంత పరిచయం ఏర్పరచుకున్నాను. అలా మొదలయిన నా రాజకీయ జీవితం అంచెలు అంచెలుగా పరిణతి చెందింది.

## పార్టీ రహిత ఉద్యమం

1948లో ఎం.ఎన్.రాయ్ రాడికల్ డెమోక్రాటిక్ పార్టీని రద్దుచేశారు. ప్రజలకు సార్వభౌమాధికారం ఉండాలంటే ప్రజల పేరుతో పార్టీలకు అధికారం కట్టబెట్టే ప్రయత్నం ఆగిపోవాలన్నారు. అటు పార్లమెంటరీ ప్రజాస్వామ్యానికి, ఇటు కమ్యూనిజానికి ప్రత్యామ్నాయంగా నిర్మాణాత్మక ప్రజాస్వామ్యాన్ని (ఆర్గనైజ్ డ్ డెమోక్రసి) సమూల ప్రజాస్వామ్యాన్ని (రాడికల్ డెమోక్రసి) రాయ్ సూచించారు. ఇందులో పిరమిడు రూపంలో ఉన్న ప్రజా సంఘాల నిర్మాణానికి అధికారం వుండాలన్నారు. దీనిని స్థూలంగా పార్టీ రహిత ఉద్యమమని అభివర్ణించటం జరిగింది. 1951లో గోరా పార్టీ రహిత అభ్యర్థిగా పార్లమెంటుకు పోటీచేశారు.

గోరా గారు విజయవాడలో 1966లో పార్టీ రహిత మహాసభ జరిపారు. ఎం.వి.ఆర్. ఆ మహా సభాధ్యక్షులు. ఆవుల గోపాలకృష్ణమూర్తిగారు సభా ప్రారంభకులు. నేను ఆ మహాసభలో పాల్గొన్నాను. ఆ సభలో ఎం.వి.ఆర్.కు ఇతోధిక ప్రచారం వచ్చింది. మహాసభ అనంతరం ఒంగోలు పార్లమెంటు సీటుకు ఎం.వి.ఆర్., విజయవాడ తూర్పు అసెంబ్లీ నియోజక వర్గానికి గోరా పోటీ చేయాలని నిర్ణయం జరిగింది. ఎం.వి.ఆర్. 1967 పార్లమెంట్ ఎన్నికల్లో పోటీచేశారు. వారికి సుమారు పదివేల ఓట్లు వచ్చాయి. నెలరోజుల ప్రచారంలో నేను ఎం.వి.ఆర్.కు బాసటగా వున్నాను.

1972 అసెంబ్లీ ఎన్నికలకు పార్టీ రహిత అభ్యర్థులుగా నన్ను పోటీ చేయమని గోరా గారు కోరారు. నేను అంగీకరించలేదు. 1972లో గోరాగారి కుమార్తె శ్రీమతి విద్య కాంగ్రెసు టికెట్ కోసం ప్రయత్నించారు. రాలేదు. గోరాగారి కుమారుడు శ్రీ లవణం 1972లో పార్టీ రహిత అభ్యర్థిగా విజయవాడ తూర్పు నియోజకవర్గంలో పోటీచేశాడు. 1977లో గోరా గారి కుమార్తె శ్రీమతి విద్య కాంగ్రెసు టికెట్ పై విజయవాడ పార్లమెంటరీ సీటుకు ఎన్నికలలో పాల్గొన్నారు. పార్టీ రహిత అభ్యర్థిగా నాస్తిక కేంద్రం వారెవరూ అప్పుడు ఎన్నికలలో పోటీ చేయలేదు. ఇది నాకు తెలిసిన పార్టీ రహిత ఉద్యమ చరిత్ర.

## మునిసిపల్ ఎన్నికలలో

1968లో బాపట్ల పట్టణంలో మునిసిపల్ ఎన్నికలు వచ్చాయి. స్త్రీల రిజర్వుడు స్థానానికి పోటీ చేద్దామని ఆలోచించాను. ఆ విషయం ఎం.వి.ఆర్.తో అన్నాను. "ఆ రభస నీకు ఎందుకు "అన్నారు. మరి మీరెందుకు పార్లమెంటుకు పోటీచేశారని ప్రశ్నించాను. దానితో వారు 'నీ ఇష్టం' అన్నారు. నా 'నామినేషన్ దాఖలు చేశాను. మునిసిపల్ సాంవత్సరిక రిపోర్టులు చదివాం. కరపత్రం తయారు చేశాం. సైకిలు

గుర్తు ఎన్నుకున్నాము. ఇంటింటికి తిరిగి ఓట్లు అభ్యర్థించి వచ్చాను. రిక్షా ఎక్కి కూర్చొని వీధి కూడలిలో మైకులో మాట్లాడే దాన్ని. మొదట్లో నా వెంట ఎవరూ రాలేదు ఒక్క ఎం.వి.ఆర్. తప్ప. తర్వాత కొందరు కుర్రాళ్ళు వెంట వచ్చారు. వారికి బేటాలు, ఫలహారాలు నేను ఇవ్వలేదు, ఇప్పించలేదు. ఎన్నిక తేదీ ఇంక రెండు రోజులు వుందనగా ఛైర్మన్ అభ్యర్థి వచ్చి "మీకు 40 వోట్లు ఫలాని ప్రాంతపువి వస్తే మీరు గెలుస్తారు, వాటిని కొంటారా?" అని అడిగాడు. ససేమిరా ఆ పద్ధతి వద్దన్నాం. 'అలా అయితే నేనే కొంటాలే' అన్నాడు. 'నీవు కొనటం, మేము గెలవటం జరిగితే మేము మీటింగ్ పెట్టి, ఇలా విషయం జరిగిందని చెప్పి తర్వాత ఆమె రాజీనామా చేస్తుంది" అని ఎం.వి.ఆర్. నా సమక్షంలో ఆయనకు చెప్పారు. ఆయన చీదరించుకొని వెళ్ళిపోయాడు. పోలింగ్ జరిగింది. నేను వాహనాలు పెట్టలేదు, కాఫీ, టీ, సోడాలు ఇప్పించలేదు. పైగా ఏ ప్రాథమిక ఉపాధ్యాయులను మునిసిపల్ పాఠశాలలో పాఠాలు చెప్పటం లేదని కరపత్రం ద్వారా, వీధి సభల ద్వారా విమర్శించానో వారే కుటుంబాలతో సహా వచ్చి నాకు ఓటు వేశారు. ఓట్ల లెక్కింపు సమయంలో నేను గెలుస్తున్నాననే పుకారు కూడా పుట్టింది. ఫలితాలు ఇలా వచ్చాయి. పోలయిన ఓట్లు మొత్తం 919. గెలిచిన కమ్యూనిస్టు అభ్యర్థికి 377, నాకు 306, మరో అభ్యర్థికి 236 ఓట్లు వచ్చాయి. ఈ వివరాలు తెలియజేస్తూ, నా నైతిక విజయానికి దోహదం చేసిన వోటర్లకు అభినందనలు తెలుపుతూ పోస్టు కార్డులు వ్రాసాను. గెలిచి విశ్రాంతి తీసుకుంటున్న అభ్యర్థి దాంతో ఇంటింటికి వెళ్ళి తిరిగి కృతజ్ఞతలు చెప్పి రావలసిన స్థితి కలిగింది. ఇంతకూ ధరావత్ 50 రూపాయలు గాక నేను ఖర్చు పెట్టింది 150 రూపాయలు. అదయినా కరపత్రాలకుగాను వెచ్చించాను. ఇది నాకు అపూర్వ అనుభవాన్ని కలుగజేసింది. నీతికి వున్న విలువను గ్రహింపజేసింది.

## జనతా పార్టీకి మద్దతు

రాడికల్ హ్యూమనిస్టు అయిన నేను ఏ పార్టీలో సభ్యురాలిని కాదు. పైగా పార్టీ రాజకీయాలు మాకు గిట్టవు. అయినా ప్రత్యేక పరిస్థితులలో – ఎమర్జెన్సీ తరువాత స్థితి అలాంటిది – ఉన్న రాజకీయ పార్టీలలో మెరుగైన దానిని బలపరచడం మా కర్తవ్యమని భావించాము. ప్రజాస్వామ్యమా, నియంతృత్వమా అనేది సమస్య అయినప్పుడు ప్రజాస్వామ్యాన్ని బలపరిచే పార్టీకి మద్దతు ఇవ్వడం సమంజసం అనిపించింది.

జనతాపార్టీ మహిళా విభాగానికి శ్రీమతి సూర్యదేవర రాజ్యలక్ష్మమ్మ గారు అధ్యక్షులుగా నియమితులయినారు. ఆ మహిళా విభాగం యూనిట్ల నిర్మాణంలో నేను ఆమెకు తోడ్పడ్డాను. 1977లో లోక్ సభ ఎన్నికలలో జనతాపార్టీ అభ్యర్థి శ్రీమతి లక్ష్మీకాంతమ్మకు అనుకూలంగా సభలలో ఉపన్యసించాను. చుట్టుప్రక్కల నున్న నల్గొండ, మెదక్ నియోజక వర్గాలలో కూడా ప్రసంగించటం జరిగింది.

1978లో అసెంబ్లీ ఎన్నికలు వచ్చాయి. సత్తుపల్లి నియోజకవర్గంలో శ్రీమతి లక్ష్మీకాంతమ్మ పోటీ చేస్తానంటే ఆమెను కొందరు మిత్రులు విరమింపజేశారు. ఆ నియోజకవర్గంలో కాళోజి నారాయణరావు గార్ని ప్రజోద్యమ అభ్యర్థిగా నిలబెట్టారు. మార్క్సిస్టు పార్టీ జనతాపార్టీ, నక్సలైట్లు కొందరు ఏ పార్టీకి చెందని మాబోటి వాళ్ళం ఆయన్ను బలపరిచాం. ఎం.వి.ఆర్. ఆయన ఎలెక్షన్ ఏజంట్. నేను నియోజకవర్గంలో కాళోజి వెంట పదిరోజులు నియోజక ప్రాంతమంతా పర్యటించి సభలలో ఉపన్యసించాను. ఆ నియోజకవర్గంలో కాంగ్రెసు ప్రతిపక్ష అభ్యర్థికి ఎన్నడూ రానన్ని ఓట్లు వచ్చాయి. కాని ఆయన గెలువలేదు.

1980లో కేంద్రంలో జనతా ప్రభుత్వం పతనమయింది. జనతాపార్టీ రాష్ట్ర మహిళా విభాగానికి సమావేశ కర్తగా వుండమని మాజీ కేంద్రమంత్రి శ్రీమతి సరోజిని మహిషి నన్ను కోరింది. నేను పార్టీల వునికిలో నమ్మకంలేని దానిని కనుక ఆమె అభ్యర్థనను తిరస్కరించక తప్పలేదు.

## పార్లమెంటు ఎన్నికలు

పార్లమెంటుకు ఎన్నికలు వచ్చాయి 1980లో, ఓటర్ల సమితి వుద్యమాన్ని జనతంత్ర సమాజ్ (సిటిజను, ఫర్ డెమోక్రసీ) చేపట్టింది. హైదరాబాద్ నగరంలో వోటర్ల సమితి వుద్యమాన్ని బలపరచే వారు గాంధీ జ్ఞానమందిరంలో సమావేశమైనారు. సికింద్రాబాద్ 'శ్రీ చుండి జగన్నాథంగారిని, హైదరాబాద్ నియోజకవర్గానికి నన్ను పోటీ చేసేందుకు ఎంపిక చేశారు. అయితే వోటర్ల సమితీల నిర్మాణం జరుగలేదు. కనుక మమ్మల్ని ఓటర్ల సమితి వుద్యమ ప్రచారక అభ్యర్థులుగా పేర్కొనటం జరిగింది. నెల రోజులు ప్రచారం చేశాము. తెలుగు, ఇంగ్లీషు, హిందీ భాషలలో ఉపన్యాసాలున్న క్యా సెట్స్ వాడాము. చేవెళ్ళ, తాండూరు, వికారాబాద్ లలో సభలు నిర్వహించాం. ఆ నియోజకవర్గంలో పోటీచేసిన పార్టీలు గ్రూపులు ఇలా వున్నాయి. కాంగ్రెసు, జనతా, మజ్లిస్ ఇతిహాదుల్ ముస్లిమీన్, వోటర్ల సమితి ఉద్యమం, రామరాజ్య పరిషత్, కాంగ్రెసు(ఎన్). నాకు మేధావుల బలం వున్నదని పత్రికలు వ్రాశాయి. నాకు సైకిల్ గుర్తు కేటాయించబడింది. నాకు 6129 వోట్లు వచ్చాయి. కాంగ్రెసు (ఎన్)కు 3వేల పై చిల్లర. రామరాజ్య పరిషత్ కు 500 నోట్లు వచ్చాయి. నేను 4000 రూపాయలు మాత్రం ఖర్చు పెట్టాను. ఈ ఎన్నికలలో తీవ్రవాదులమని చెప్పుకునే మహిళల వైఖరి శోచనీయంగా, అనూహ్యంగా వుంది. వారిలో కొందరు నా అభ్యర్థిత్వాన్ని బలపరచనూ లేదు, వ్యతిరేకించనూ లేదు. వారి వుదాసీనత అగమ్య గోచరం. నేను గెలుస్తానని పోటీ చేయలేదు. కనుక నాకు ఓటమివల్ల బాధ లేదు. కాగా వోటర్ల సమితి వుద్యమ ప్రచారం కొంతగా కొంత చేయగల్గాను. అదే నాకు తృప్తి.

## తెలుగుదేశం పార్టీకి సహకారం

కాంగ్రెసును రాష్ట్రంలో వోడించి అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం పార్టీని సానుభూతితో చూసాము. గుంటూరు జిల్లా రేపల్లె తాలూకా కావూరిలో జరిగిన తెలుగు యువతా శిక్షణా శిబిరంలో, 400 మంది హాజరయిన సభలో, 3 గంటలకు పైగా మహిళోద్యమం పైనా, మహిళా సమస్యల పైనా నేను మాట్లాడాను. ఆరోజు 90 ప్రశ్నలు పంపారు. చర్చలు బాగా జరిగాయి. తరువాత తెలుగుదేశం మహిళా కార్యకర్తల సదస్సులో గండి పేటలో 'సాంఘిక సంస్కరణ' అనే అంశంపై ప్రసంగించాను. నా వుపన్యాసాన్ని ముందుగా ముద్రించి పంచి పెట్టడం వల్ల స్త్రీలు ఆసక్తితో పాల్గొని రకరకాల ప్రశ్నల వర్షం కురిపించారు. ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర ఆందోళన, జె.పి. ఉద్యమం, ప్రజాస్వామ్య పరిరక్షణోద్యమం ఇవి ఆందోళనా కార్యక్రమాలయినా రాజకీయ సంబంధమైనవే అని గుర్తుంచుకోవడం సమంజసం. తెలుగుదేశం సభలలో పాల్గొనడంవల్ల భారతీయ రిపబ్లిక్ అధ్యక్షుడు జైల్ సింగ్ హైదరాబాదు వచ్చినప్పుడు శ్రీ ఎన్.టి.ఆర్. పెట్టిన సభకు నన్ను ఆహ్వానించగా ముఖ్యమంత్రి పరిచయం చేయగా ప్రెసిడెంటు కరచాలనం చేశాడు. ఇది న్యూస్ రీల్ లో వచ్చింది. అలా 32 సం॥ నుండి ఈనాటి వరకు ఎంతో అంత రాజకీయ కార్యకలాపాల్లో పాల్గొంటూనే వున్నాను.

## మా పై ఎమర్జన్సీ ప్రభావం

1975లో భారతదేశాన్ని ఎమర్జన్సీ అనే భూతం కబళించింది. ఎల్లెడలా చీకట్లు కమ్ముకున్నాయి. ఆ గాడాంధకారం మా వాకిలి దాటి మా ఇంట్లో కూడా ప్రవేశించింది. ఆ తెల్లవారు ఝామున అయిదు గంటలకు "రామ్మూర్తిగారూ!" అంటూ పిలిచాడాక ఆగంతకుడు. తలుపు తియ్యగానే అరెస్టు వారంటు చేతికందించి కారెక్కమన్నారు. డి.ఎస్.పి. వెంటనే లోపలికి వచ్చి "నన్ను అరెస్టు చేశారు. వెడుతున్నాను" అని ఆయన చెప్పగానే " అదేమిటండీ ఎలా?" అని బెంబేలెత్తుతున్న నాతో "మరి మనం చేస్తున్న పనులకు ఇది తప్పదు" అంటూ వెంటనే వెళ్లి కారు ఎక్కి వెళ్ళిపోతున్న రామ్మూర్తి గారిని నిలువు గ్రుడ్లు పడి చూస్తూ నిలచున్న నాతో ఉదయాన్నే బట్టలు, ముఖ్య వస్తువులు పట్టుకొని పోలీస్ స్టేషన్ కు రమ్మన్నాడు పోలీస్ ఆఫీసర్. అలాగే వెళ్ళాను. ఒక నలుగురు మాత్రం తెలిసిన వారు లాకప్లో కనిపించారు. వీరందరిని రాజమండ్రి తరలించారని ఒక వారానికి ప్రజాశక్తి ఎడిటర్ బొమ్మారెడ్డి గారు చెప్పి వెళ్ళారు.

అరెస్టు అయిన ఆరోజు చాలామంది వచ్చి నన్ను కూడా పట్టుకెళ్ళారేమోనని చూసి వెళ్ళారు. విజయవాడలోని ప్లీడరు వై. హనుమంతరావు గారు, శ్రీ వి. నటరాజ్ తో కలిసి వచ్చి నన్ను తమ యింటికి తీసుకొని వెళ్ళారు. నేనూ ఆరోజుల్లో హెచ్చు స్థాయిలో రాజకీయాల్లో పనిచేసేదాన్ని, ఘాటుగా వుపన్యాసాలు ఇచ్చే దాన్ని. ప్రభుత్వ

దమన నీతిని దుయ్యబట్టే దాన్ని. అంతే కాదు జయప్రకాశ్ నారాయణ్ గారిని ఆంధ్రా తేవటానికి ఒక ఆహ్వాన సంఘాన్ని పెట్టి, నన్ను వైస్ ప్రెసిడెంట్ ను చేశారు. జనతంత్ర సమాజ్ పేరుతో జె.పి. స్థాపించిన సంఘంలో మేమందరం మెంబర్లం. ఇంక రాష్ట్ర సి.యఫ్.డి.లలో కూడా మెంబర్ గావుండి ప్రతి మీటింగులో పాల్గొనే దాన్ని. ఇద్దరం రాజకీయాలలో వున్నాం. కనుక ఇద్దర్నీ అరెస్టు చేశారనే వదంతి వ్యాపించింది. ఆ రోజుల్లో మా ఇల్లు 'అపోజిషన్ 'వారికందరికి కేంద్రం అయింది. ఒక్క కాంగ్రెసు, కమ్యూనిష్టులు తప్ప అన్ని పార్టీల వారితో కూడిన సమావేశాలు మా ఇంట్లోనే జరిగేవి. కాని ఎమర్జన్సీలో ఆడవారిని అంతగా అరెస్టు చేయలేదు. అందువల్ల నా జోలికి రాలేదు. కాని మా టెలిఫోన్ 'టాప్' చేసేవారు. రేషన్ కి, మార్కెట్ కి, ఇతరత్రా నేనెటు వెళ్ళినా నా వెంట ఒక సి.ఐ.డి. తిరుగుతూ వుండే వాడు. ఒకనాడు ఫిలిం సొసైటీకి (నేను ఉపాధ్యక్షురాలిని) వెళ్ళి వస్తుంటే చీకట్లో ఆపి నా సంచి చూపమని అడిగాడు. అంటే కాగితాలు అవీ చేరవేస్తున్నానని వారి అనుమానం. బంధువులు, స్నేహితులు నాతో మాట్లాడటానికి, నన్ను ఇంటికి పిలవటానికి, మా ఇంటికి రావటానికి హడలి పోయేవారు.

అప్పుడు నేను 'వికాసం' పత్రికకు మేనేజింగ్ ఎడిటర్ ను కావటాన కలెక్టర్ ఒకనాడు ప్రెస్ వారిని పిలిపించి, ప్రెస్సు సెన్సార్ వుంది కనుక మీరు రాసే మేటర్ అంతా మేము 'సర్టిఫై చెయ్యాలి. లేదా మీ 'డిక్లరేషన్ 'రద్దు అవుతుంది అని హెచ్చరించి పంపాడు. మరో రోజు పోలీసు సూపరింటెండెంట్ ఆహ్వానించి "ఎవరో ప్రభుత్వ దమన నీతి నశించాలి లాంటి స్లోగన్లు వ్రాస్తున్నారు. జాగ్రత్త – వారిని అరెస్టుచేసి అండమాన్ పంపుతాము. వారి ప్రెస్సు లాక్ చేస్తాం" విన్నారా అని గద్దించాడు. "ఏమండీ! ఎవరో, ఎక్కడో, ఎమర్జన్సీని, ప్రభుత్వ చర్యలనూ నిరసిస్తూ గోడల మీద పోస్టర్స్ వ్రాస్తే మీరు మమ్మల్ని ఝూడిస్తే మేమేం చేస్తాం" అన్నా ధైర్యంగా. "అలా వ్రాసేవారెవరో మాకు తెలుసండీ" అంటూ ఉగ్రుడైనాడు. అసలు కొంతకాలం 'ఎడిటోరియల్స్' లేకుండా ఖాళీ పెట్టి పేపర్లు ప్రింట్ చేయటం కూడా చేసాం.

రాజమండ్రి జైలుకు నెలకు రెండుసార్లు ఇద్దరం వెళ్ళి 15 నిముషాలు సెంట్రీ ఎదుట కూర్చొని డిటెన్యూతో మాట్లాడిరావచ్చు. దానికి మేము తెల్లారగట్ల మెయిల్లో వెళ్ళి రాజమండ్రిలో దిగి మళ్ళీ మూడు మైళ్ళు రిక్షాలో పోయి వెంటనే తిరిగి ఆ రాత్రికి ఇల్లు చేరడం చాలా భారంగా వుండేది. రైల్లో కుమ్ములాట, కిక్కిరిసిన జనం, టిక్కెట్లు దొరకటం బహుకష్టతరంగా వుండేది. పైగా నాకు అంతకుముందే పెద్ద ఆపరేషన్ జరగటంవల్ల పోలేక పోయేదాన్ని. అలాగని చూడకుండా ఆగ లేక పోయేదాన్ని. అలాగే వెళ్ళి వస్తూండే దాన్ని. నేనా కాలంలో వారిని ఒక పుస్తకం రాయమని ఎన్నో సార్లు వుత్తరాలు వ్రాసేదాన్ని కాని ఆయన విడుదల కోసం హైకోర్టులో కేసు నడుపుకుంటూ ఆ ప్రయత్నం చేయలేదు..

ఈ పరిస్థితులలో నా కుమార్తె వివాహం తేది. 9-4-76న జరపాలని నిశ్చయమయింది. ఆ పెళ్ళి కోసం నా భర్త 'పెరోల్ 'మీద వచ్చినప్పుడు తేది. 8-6-76న కేసు గెలిచినట్లు హైకోర్టు ఆర్డర్ వచ్చింది. ఆ వార్త విన్నాము. పిల్ల పెళ్ళయి పోయింది. కాని మళ్ళీ మరో పుకారు వచ్చింది. అందులో విడుదలయిన వారందరిని మళ్ళీ అరెస్టు చేయమని, వారు కోర్టుకు వెళ్ళటానికి హక్కు లేదని దాని సారాంశం. అంటే రామ్మూర్తిగారు మళ్ళీ అరెస్టు కావటం, ఆజన్మాంతం ఖైదీగా వుండిపోవటం జరగడం తథ్యం అని తేలిపోయింది. కాని ఎమర్జెన్సీని శ్రీమతి ఇందిరాగాంధీ సడలించారు. తరువాత 1977లో తీసివేశారు. అప్పటికి మేము హైదరాబాదు చేరాం.

## రాడికల్ హ్యూమనిస్టు సంఘ కార్యకలాపాలు

ఎం.ఎన్.రాయ్ 1940లో రాడికల్ డెమోక్రాటిక్ పార్టీని స్థాపించాడు. 1937 డిశంబరు నుండి ఎం.వి.ఆర్. కమ్యూనిస్టు రాజకీయాలతో సంబంధం పెట్టుకున్నారు. 1940లో చదువుకు వెళ్ళేటప్పుడు కమ్యూనిస్టుగానే వెళ్ళారు. 1942 ఏప్రిల్ లో అలాగే తిరగి వచ్చారు. 1941 డిసెంబరులో కమ్యూనిస్టులు ప్రజాయుద్ధ నినాదాన్ని ఇచ్చారు. అంతవరకు విధానం రూపొందించడంలో తాము తప్పుచేశామని వారి నాయకత్వం అంగీకరించింది. అంతటితో ఊరుకుంటే బాగుండేది. అలాకాక సభ్యులను వారి అపరిణత మనస్కతకు నిందించసాగింది. దాంతో విసుగు చెందిన ఎం.వి. ఆర్. సిద్ధాంతాలను మరలా అవలోడనం చేసుకొని ఎం.ఎన్.రాయ్ రాడికల్ డెమొక్రాటిక్ పార్టీలో చేరారు 1942 ఆగస్టులో. ఆ పార్టీని ఎం.ఎన్.రాయ్ 1948లో రద్దుచేశాడు. అప్పటినుండి రాడికల్ హ్యూమనిస్టు పత్రిక, (పూర్వం దాని పేరు ఇండిపెండెంటు ఇండియా) 'రినైజాన్సు పబ్లిషర్సు' రినైజాన్సు ఇన్ స్టిట్యూట్ కేంద్రాలుగా రాడికల్ హ్యూమనిస్టుల కార్యకలాపాలు సాగాయి. 1969 డిసెంబరులో రాడికల్ హ్యూమనిస్టు సంఘ నిర్మాణం జరిగింది. పార్టీ సంస్థలకు దీనికి భేదం వుంది. ఈ సంస్థ ఎన్నికలలో అభ్యర్థులను నిలబెట్టదు. తద్వారా రాజకీయాధికాం కోసం వెంపర్లాడదు.

1969లో నేనూ రాడికల్ హ్యూమనిస్టు సంఘంలో సభ్యురాలిగా చేరాను. అంతకు క్రితం నుండే వి.బి.కార్నిక్, తార్కుండే లాంటి నాయకులు మా ఇంటికి తరచువస్తూపోతూ ఉండటం వల్ల, సమావేశాలు మా ఇంట్లో జరుగుతున్నందువల్ల నాకు ఉద్యమంతో పరోక్షంగా సంబంధం వుండేది. 1967లో రాడికల్ హ్యూమనిస్టుగానే ఎం.వి.ఆర్. ఒంగోలు పార్లమెంటరీ నియోజకవర్గంలో పోటీచేశారు. అలాగే 1971లో ఈ నియోజకవర్గంలో నెలరోజులు వోటర్ల ప్రబోధ కార్యక్రమం చేపట్టి సభలు పెట్టాము. అలాగే బాపట్ల, చీరాల పట్టణాలలో కార్యకలాపాలు హెచ్చుస్థాయిలో జరిపాము.

చీరాల తాలూకా కారంచేడు గ్రామంలో 1973, 74, 76 సంవత్సరాలలో

హ్యూమనిస్టు రాష్ట్ర అధ్యయన తరగతులు నిర్వహించాము. ఆ గ్రామస్తులు శ్రీ యార్లగడ్డ దుర్గయ్యగారు సాదరంగా భోజన వసతి కల్పించేవారు. అధ్యయన తరగతుల్లో నేనూ పాల్గొనేదాన్ని. అంతేకాక ఏదో ఒక విషయం మీద అంటే 'హ్యూమనిజం : స్త్రీలు' క్లాసు తీసుకునే దాన్ని '1968 సంవత్సరంలో తెనాలిలో జరిగిన అధ్యయన తరగతుల్లో పాల్గొన్నాను. 1973లో జరిగిన ప్రాంతీయ మహా సభల్లోనూ, 74లో జరిగిన రాష్ట్ర మహా సభల్లోనూ చురుగ్గా పనిచేయడం జరిగింది. ఈ రెండు సభలు విజయవాడలో జరిగాయి. 1978లో హైదరాబాదు రాష్ట్ర మహాసభకు నేను ఆహ్వాన సంఘం తరపున పనిచేశాను. అప్పుడు నేను రాష్ట్ర సంఘ ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకోబడటం తటస్థించింది. 1987 సంవత్సరంలో తెనాలి రాష్ట్ర మహాసభలో నన్ను రాష్ట్ర సంఘ అధ్యక్షురాలిగా ఎంపికచేశారు.

నేను అఖిల భారత అధ్యయన తరగతులకు హాజరవుతూ వుండేదాన్ని. అక్కడ ముఖ్యంగా స్త్రీల సమస్యల మీద మాట్లాడటం సంభవించేది. 1976లో నైనిటాల్ లో జరిగిన అధ్యయన తరగతుల్లో నేను కుటుంబ నియంత్రణ మీద తెలుగులో ఉపన్యసించాను. ఎం.వి.ఆర్. తర్జుమా చేశారు. ఇంగ్లీషులోకి. నా ఉపన్యాసం రసవత్తరంగా వున్నా తర్జుమా చప్పగా వుందని తోటి సభ్యులు వ్యాఖ్యానించారు. పై పెచ్చు ఇకనుండి ఇంగ్లీషులోనే మాట్లాడమని, భాషా లోపం వున్నా తాము సహించగలమని తార్కుండే సలహా చెప్పారు. బొంబాయి అధ్యయన తరగతులలో (1983) దేవలా లోనూ (1988) నేను ఆంగ్లంలోనే ప్రసంగించాను. అఖిల భారత సభలకు నేను, ఎం.వి.ఆర్. తప్పక కలిసి వెళ్ళే వాళ్ళం. ఢిల్లీ (1978), రాజస్థాన్లోని జైపూర్ (1980) కలకత్తా (1984), హైదరాబాద్ (1986) సభలలో పాల్గొన్నా. 1978 ఢిల్లీ మహాసభకు ఎం.వి.ఆర్. అధ్యక్షత వహించారు. సంఘ జాతీయ సమితి సభ్యుల్లో స్త్రీ ప్రాతినిధ్యాన్ని పెంచారు. నేనూ రాజస్థాన్, లక్నో, మీరట్ ల నుండి తదితరులు మొదటిసారిగా మహిళలం సభ్యులమయ్యాం. 1978 నుంచి ఇప్పటివరకు జాతీయ సమితి సభ్యురాలిగా నేను వుంటున్నాను.

జైపూర్ మహాసభ అనంతరం జోధ్ పూర్, అహమ్మదాబాద్, బొంబాయిలు పర్యటించడం అచ్చటి సభలలో పాల్గొని మాట్లాడటం జరిగింది. ఆంధ్ర ప్రాంతంలో ప్రచార సభలలో ఇతర సభలలో పాల్గొనడం పరిపాటే. 1978 నాటికి ఎం.వి.ఆర్. అఖిలభారత సంఘానికి ప్రధాన కార్యదర్శి అయినారు. అంతర్జాతీయ హ్యూమనిస్టు నైతిక సంఘం హ్యూమనిస్టు అవార్డును శ్రీ వి.ఎం. తార్కుండేకు ఇవ్వడానికి నిశ్చయించింది. తార్కుండే 1969 నుండి 1980 వరకు భారత సంఘ అధ్యక్షులుగా వున్నారు. ప్రపంచ హ్యూమనిస్టు అవార్డు 4 సంవత్సరాల కొకసారి ప్రపంచం మొత్తంమీద ప్రముఖ హ్యూమనిస్టుగా కార్యకలాపాలు నిర్వహించిన వ్యక్తికి ఇస్తారు. ఈ అవార్డు

ప్రదాన స్థాపన 1974లో జరిగింది. ప్రథమ ప్రదానంకూడా 1974లోనే అయింది. భారతదేశంలో ఎమర్జెన్సీ కాలంలో తార్కుండే చేసిన కార్యక్రమాలను, చూపిన ధైర్య సాహసాలను పరిగణనలోకి తీసుకొని ఆ బహుమతిని 1978లో వారికి ఇవ్వటానికి తీర్మానించారు అంతర్జా తీయ సంఘ పెద్దలు. తమ సంఘాధ్యక్షునికి సన్మానం జరుగబోతున్న లండన్ అంతర్జాతీయ మహాసభకు వెళ్ళాలని ఎం.వి.ఆర్.కు ఉబలాటం ఎక్కువయింది. నన్ను కూడా లండన్ రమ్మనమని ఆయన అభ్యర్థించారు. కానీ ఖర్చు ఎక్కువగా వుంటుందని నేను అంగీకరించలేదు. చివరకు మా మూడో అబ్బాయి వెంకటేశ్వర్లు ప్రోద్బలంతో అంగీకరించాను. ఎం.వి.ఆర్. నేను సభలు రేపు అనగా లండన్ చేరాం. మహాసభ మొదటిరోజున తార్కుండేకు అవార్డు ప్రదానం చేశారు. తరువాత అనుబంధ జాతీయ సంఘాల తరపున నివేదికలు సమర్పించారు. తార్కుండేకు పట్ట ప్రదానం చేశారు గనుక నివేదికలు సమర్పించే దేశాలలో ప్రథమ స్థానం భారతదేశానికి ఇచ్చారు. నివేదికను సమర్పించడానికి ఐదు నిమిషాలు వ్యవధిని ఒక్కొక్క దేశానికి కేటాయిం చారు. ఎం.వి.ఆర్. ప్రథముడిగా భారతదేశం తరపున నివేదికను అందజేసి మాట్లాడారు. ఆ మహాసభల సందర్భంగానే బ్రిటీషు నేషనల్ సెక్యులర్ సొసైటీ ప్రెసిడెంటు బార్బారా స్మోకర్, అమెరికాకు చెందిన ఆచార్య పాల్ కుర్జు, వెక్సులర్ దంపతులతో పరిచయం ఏర్పడింది. అది వేసవికాలం. అందరూ విహార యాత్రలకు వెళతారు గనుక (మహాసభలలో తప్ప) హ్యూమనిస్టు లను వారి వారి పట్టణాలలో కలుసుకోవటం జరుగలేదు.

# భాగం – V
# నా సాహితీ యాత్ర

# 1. వ్యాస రచన

సాహితీ ప్రక్రియల్లో వ్యాసం ఒక రూపం. సర్వ సాధారణంగా కథ, కథానిక, నవల, పద్యకవిత్వం, గద్య కవిత్వం, గేయం, పాట ఇవన్నీ సాహితీ రూపాలుగా ప్రసిద్ధి పొందాయి. కందుకూరి వారు సామాజిక సంస్కరణకు సాధనంగా వ్యాస ప్రక్రియను సమర్థవంతంగా వాడారు. తద్వారా వ్యాసానికి సాహిత్యంలో ఒక స్థానం వచ్చింది. కాని తగినంత ఆదరణ రాలేదు. తెలుగులో దినపత్రికల సంఖ్య వృద్ధి అయ్యే కొద్దీ, వారపత్రికలకు చదువరులు వేల సంఖ్యలో ఒనగూడే కొద్దీ వ్యాసం వాడుకలోకి వచ్చింది. పెద్ద వ్యాసం, చిన్న వ్యాసం అనే రూపాలు వెలిశాయి. లేఖారచన ఎక్కువైంది. దాంతో లేఖా వ్యాసాలు చలామణీలోకి వచ్చాయి.

కవితాశక్తి అందరికీ అందుబాటులో ఉండదు. అలాగే అందరూ కథారచయితలు కాలేరు. నవలాకారులుగా రూపొందలేరు. గేయాన్ని ఆలాపించాలంటే, పాట రాయాలంటే పదాల్లో పొందిక, ప్రస్ఫుటం కాకపోయినా లయజ్ఞానం అవసరం. అయితే వ్యాసానికి ఏమీ సామర్థ్యం అక్కరలేదా? ప్రతి ఒక్కరూ వ్రాయగలరా? వ్రాయలేరు. చక్కని వ్యాసం వ్రాయాలంటే, మెచ్చుకోదగిన వ్యాసం వెలువరించాలంటే కృషి మాత్రమే చాలదు. కొంత ప్రతిభ కూడా అవసరం. ఏ సాహితీ ప్రక్రియలో ఎవరు రాణించినా మొదటి నుంచీ వారికి ఆ ప్రతిభా వ్యుత్పత్తులు ఉండవు. మొదట్లో ఏదో వ్రాస్తారు. తరువాత అందులోని గొప్పతనాన్ని పరాయివారు గుర్తించి పొగిడితే ఆ రచనా వ్యాసంగాన్ని కొనసాగిస్తారు. అదే జరిగింది నా పట్ల కూడా.

తెలిసింది ఇతరులకు తెలియజేయాలనే తపన, నా పేరు పత్రికలలో అచ్చుకావాలనే కాంక్ష, ఈ రెండూ నన్ను రచనా వ్యాసాంగానికి పురికొల్పాయి. ఎందువల్లో వ్యాసరచన తేలికని మొదట్లో తోచింది నాకు. కాని ఆ ప్రక్రియ చాలా కష్టమని అర్థమయింది. అయినా వ్రాస్తూ వుండబట్టి క్రమేపి అలవాటయింది. ఈనాడు శరపరంపరగా కలందించకుండా వ్రాస్తూనే వున్నాను.

కుటుంబ సంక్షేమ కార్యకర్తగా శిక్షణ పొందిన తరువాత రాష్ట్ర కుటుంబ నియంత్రణ సంఘపు వారి మాసపత్రిక 'కుటుంబ మిత్ర' లో వ్యాసాలు వ్రాయసాగాను. 1964లో 'ఆంధ్రజ్యోతి, దినపత్రికలో కుటుంబ నియంత్రణ పై అపోహలు, ఆవశ్యకత, విధానాలు, ప్రక్రియలు అనే పేరుతో వ్యాసాలు వ్రాశాను. సంపాదకుడు శ్రీ నండూరి రామమోహనరావుగారు వాటిని ప్రచురించి ప్రోత్సహించారు. ఆ పత్రికవారు 1964లో నెలకొల్పిన 'వనితావని' అనే స్త్రీల పేజీల్లో "అత్తా కోడళ్ళు', 'వరకట్నం ', 'అధిక ధరలు' లాంటి అనేక అంశాల పై వ్రాస్తూ వుండేదాన్ని.

1974లో మాచే స్థాపించబడిన 'వికాసం' పత్రికలో చాలా వ్యాసాలు,

సంపాదకీయాలు వ్రాసేదాన్ని. “ఆడవారికి ఆస్తిహక్కు” అనే అంశంపై నేను వ్రాసిన వ్యాసానికి ఆంధ్రపత్రిక వారు ప్రధమ బహుమతి వెయ్యి రూపాయలు ఇచ్చారు. తర్వాత మరో పోటీలో “ నేటి వనితల ప్రధాన సమస్యలు వాటి పరిష్కారం” అనే అంశం పై వ్రాశాను. 750 రూపాయల ప్రయిజు వచ్చింది.

‘కలువబాల’ పక్షపత్రిక ప్రారంభ సంచిక 1984 నుండి ఇప్పటివరకూ వివిధ అంశాలపై నెలకు రెండు వ్యాసాలు వ్రాస్తూనే వున్నాను. “మహిళా వికాసం” పేరుతో వున్న శీర్షికలో ఈ వ్యాసాలు వస్తున్నాయి. జనవరి 1987 ‘వనితా జ్యోతి’ మాసపత్రికలో ‘వెలుగు’ (పెళ్ళికాని తల్లి) కథకు కన్ సోలేషన్ ప్రయిజుయిచ్చారు. ఆంధ్రభూమి వారపత్రిక వారు ‘జీవిత వలయం! అనే నా కథకు కన్సలేషన్ బహుమతి ఇచ్చారు. వ్యక్తిగత సమస్యలు – సమాధానాలు’ అనే శీర్షిక క్రింద 1985 నుండి ఈనాటి వరకూ ఇంకా వ్రాస్తూనే వున్నాను.

స్త్రీ జీవితానికి సంబంధించి అనేక వ్యాసాలు ఇంకా అనేక దిన, వార, పక్ష పత్రికలలో వ్రాస్తూనే వున్నాను. వస్తూనే వున్నాయి. ఇండియన్ ఎక్స్ ప్రెస్, డక్కన్ క్రానికల్ ఇంగ్లీషు ప్రతికల్లో కొన్ని ఆర్టికల్సు వచ్చాయి. అందులో ‘అన్ వెడ్ మదర్ ‘(పెళ్ళికాని తల్లి), ‘అబార్షన్ ‘ల పై వ్రాసిన వ్యాసాల పై పెద్ద గాలి దుమారం రేగింది. మిక్కుటంగా ఉత్తరాలు వచ్చాయని పత్రిక వ్రాసింది. ‘వనిత’ మహిళా మాసపత్రికలో కొన్ని వ్యాసాలు, వ్యక్తి చిత్రణ వచ్చాయి. దాచేస్తే దాగని సత్యం అనే స్త్రీ నిజజీవిత కథలు ప్రచురిత మయ్యాయి.

1964 నుండి 1991 వరకు స్త్రీల సమస్యల పై అనేకానేక పత్రికలలో వ్రాసిన వ్యాసాలు మొత్తం 600లకు పైగా వున్నాయి. సావనీర్లలో, స్మారక సంచికల్లో, షష్టిపూర్తి సంచికలలో, సెమినార్ల వర్కు పేపర్లుగా, మహిళా సంచికల్లో వ్రాస్తూనే వున్నాను. స్త్రీల పత్రికలే కాక ‘తెలుగు విద్యార్థి’ ‘పొదుపు’ ‘హేతువాదం’, ‘హేతువాది’, ‘న్యూ హ్యూమనిస్టు’, ‘యోజన’, ‘సుభాషిణి’ (ఆం.ప్ర. సోషల్ వెల్ ఫేర్ వారిది) ౣ లిటరసీ పత్రిక, ‘ఉ పాధ్యాయ’, ‘ప్రసారిత’, ‘తెలుగు’ (తెలుగు అకాడమి సంచిక), ‘జ్యోతి’, ‘అనామిక’, ‘కేకలు’, ‘గీటురాయి’, ‘బీదల బాధలు’ లాంటి వివిధ దిన, వార, పక్ష, మాసపత్రికల్లో లెక్కకు మిక్కుటంగా వస్తున్నాయి. పంపినవన్నీ ప్రచురితమవుతూనే వున్నయి. ఏ కొత్త పత్రిక పెట్టినా స్త్రీల గురించి వ్రాసి పంపమని అడుగుతూనే వున్నారు. ఒకనాడు తిరిగివచ్చే నా వ్యాసాలకు ఈనాడు డిమాండ్ పెరిగింది. ఆంధ్రదేశంలో దరిదాపు అన్ని పత్రికల్లో నా పుస్తకాల గురించి సమీక్షలు లెక్కకు మిక్కుటంగా వచ్చా యి.

అది 1980 సం॥ స్త్రీల సంబంధమైన సాహిత్యాన్ని మాత్రం వుత్సాహంతో చదవటం నాకు అలవాటు. ఆ సందర్భంలో ‘నూతన వనిత’ అనే 50 పేజీల పుస్తకంలో

దేశదేశాల స్త్రీల ఆర్థిక, రాజకీయ, సాంఘిక రంగాలలో స్త్రీల పరిస్థితులను గురించి క్లుప్తంగా వ్రాసివుంది. అది చదివాను. కానీ నాలో ప్రత్యేక భావం ఏదీ కలుగలేదు. రామ్మూర్తిగారు ఆ పుస్తకాన్ని చదివి "నీవు కూడా ఇలాంటిది అచ్చు వేసుకోవచ్చు" అని అన్నారు. అలా ఆయన సాదా సీదాగా అన్న మాట నాలో ఆలోచనను, ప్రేరణను కలిగించింది. వెంటనే నేను 'వికాసం' లో వ్రాసిన వ్యాసాలను, అలాగే ఇంకా వివిధ దిన, వార, మాస పత్రికల్లో ఆనాటివరకు ప్రచురితమైన నా వ్యాసాలను అన్నిటినీ ఒక సంకలనంగా చేసి 250 పేజీలతో ప్రప్రధమంగా 'ఆధునిక స్త్రీ' అనే పుస్తకం ప్రచురించాను.

ఆం.ప్ర. సాహిత్య అకాడమి నవలా సాసిత్యం కాకుండా ఇతర సాహిత్య ప్రక్రియలకు ఆర్థిక సహాయం అందజేస్తుందని తెలుసుకున్నాను. వెంటనే నేను వ్రాసిన కొన్ని వ్యాసాలు తీసుకెళ్ళి ఆర్థిక సహాయం చేయమని ఇచ్చి వచ్చాను. కొంతకాలం ఆ విషయం మరచిపోయాను – తర్వాత నా సొంత ఖర్చుమీద "ఓ మహిళా ముందుకు సాగిపో' అనే పేరుతో ఆ వ్యాసాలు ముద్రణ పూర్తి కావస్తున్న తరుణంలో వాళ్ళు నాకు వెయ్యి రూపాయలు మంజూరు చేసినట్లు తెలియజే శారు. ఇక ఉత్సాహం వచ్చి ఆ డబ్బుతో 'ఓ మహిళా ముందుకు సాగిపో' అనేదేకాక 'మారుతున్న సమాజం: మహిళలు' అనే రెండవ పుస్తకాన్ని ప్రచురించాను. ఇలా నేను వ్రాసిన వ్యాసాలను సంకలనాలుగా ప్రచురించటం మామూలు అయింది. వాటి వివరాలు ఈ పుస్తక అనుబంధాలలో పేర్కొనటం జరిగింది.

వ్రాయబడిన పరిశోధనా వ్యాసాలు కూడా ఈ సందర్భంలో పేర్కొనడం అసమంజసం కాదు. 'వనితా లోకం' అనే పేరుతో వెలువడిన వ్యాస సంపుటికి ఆం.ప్ర. సాహిత్య అకాడమి ఆర్థిక సహాయం చేసింది. దాంతో వ్యాస రచయిత్రులలో నాకు ఒక స్థానం ఏర్పడింది. ప్రభుత్వ గ్రంథాలయాలు ఈ వ్యాస సంకలనాలను కొన్నాయి. కళాశాల ప్రిన్సిపాల్సు వీటిని తమ గ్రంథాలయాలకు తీసుకున్నారు. వీరందరికీ నేను కృతజ్ఞత చెప్పుకోవడం నా కర్తవ్యం. ఈనాడు దినపత్రికల వారు అడిగి వ్యాసాలు వ్రాయించుకుంటున్నారు. 'ఆంధ్రజ్యోతి', 'ఆంధ్రపత్రిక' 'ఆంధ్రప్రభ', 'ఆంధ్రభూమి', 'ఉదయం', పత్రికలలో వ్యాసాలు విరివిగా రావడంతో, స్త్రీల సమస్యల పై ఇండియన్ ఎక్స్ ప్రెస్, దక్కన్ క్రానికల్ లాంటి ఇంగ్లీషు పత్రికల్లో ప్రకటితమవటంతో వ్యాసరచయితగా నేను పేరు పొందాను. ఇది నాకు తృప్తిని, ఆత్మ విశ్వాసాన్ని కలిగించింది. ఎంతో మంది విద్యార్థులు నా వ్యాసాలు చదివి ఫస్టు ప్రయిజు తెచ్చుకున్నామని వ్రాస్తూ వుంటారు. అది నాకెంతో సంతోషంగా వుంటుంది.

నా వ్యాస సంపుటాల పై సమీక్షలు ఆంధ్ర, ఆంగ్ల పత్రికలలో వచ్చాయి. చాలామంది సమీక్షకులు సద్విమర్శలు వ్రాశారు. వారిలో సర్వశ్రీ జి. రామకృష్ణ, బూదరాజు రాధాకృష్ణ ఇత్యాదులు పేర్కొనదగిన వారు. రచయిత్రినని ప్రోత్సహించే నిమిత్తం వ్రాశారా

అనే సందేహం నాకు ఆదిలో కల్గినా తరువాత వారికి నచ్చి వ్రాసినట్లు విదితమయింది. ఈ అంశం నాకు మరింత బలాన్ని, స్థయిర్యాన్ని చేకూర్చింది. ఆ తరువాత మిత్రుల సలహాలతో కొన్ని వ్యాసాలు ఇంగ్లీషులోకి రామ్మూర్తిగారు అనువదించి ఇచ్చారు. 'ఉమెన్ ట్రెడిషన్ అండ్ కల్చర్ 'అనే పేరుతో ఢిల్లీలో ఒక పెద్ద పబ్లిషర్సు (స్టెర్లింగ్ వారు) ప్రచురించారు. మరో సంస్థ ఇండియన్ ఎథీస్ట్ పబ్లిషర్సు వారు 'శాగా ఆఫ్ ఉమెన్స్ స్ట్రగుల్ 'అనే పేరుతో ఇంగ్లీషులోను, తరువాత మళయాళంలోను మరో పుస్తకాన్ని ప్రింటు చేశారు. ఈనాడు స్త్రీల మీద, ఫెమినిజంమీద రిసర్చి చేసే వారు వచ్చి ఇంటర్వ్యూచేసి, పుస్తకాలు కొని నా సాహిత్యాన్ని ఉపయోగించుకుంటు న్నారు అని చెప్పుకోవటానికి సాహసిస్తున్నాను.

# 2. పత్రికా నిర్వహణ

సంఘ సేవలో ఎడ్యుకేషన్, ఎజిటేషన్, ఆర్గనైజేషన్ అని మూడు మార్గాలు వుంటాయి. ఒకటి ప్రబోధం, రెండు ఆందోళన, మూడవది నిర్మాణ కార్యక్రమాలు. ఈ మూడింటిలో ఎవరి ఇష్టం వచ్చిన మార్గాన్ని వారు ఎన్నుకుంటారు. నా ఇష్ట ప్రకారం నేను మొదటి రకం మార్గాన్ని ఎన్నుకున్నాను. అందులో భాగంగా ఒక పత్రిక స్థాపించి ప్రజలలో జాగృతి, చైతన్యం కలిగించాలనిపించింది. తత్ఫలితంగా 1974 లో 'వికాసం' పత్రికావిష్కరణ జరిగింది. "పత్రికొక్కటున్న పది వేల బలగంబు, పత్రికే లేకున్న బ్రతుకే భారంబగు" అని నార్ల వెంకటేశ్వరరావు గారు అన్నారు. అది అక్షర సత్యం. ఆ స్ఫూర్తితోనే నేను ఈ పత్రిక ప్రారంభించాను.

ఆనాడు మా వద్ద పదివేలు మిగిలాయి. దాంతో ఈ పత్రిక మొదలు పెట్టాము. మొదట్లో ప్రింటరు, పబ్లిషరుగా పనిచేశాను. ఆ పత్రిక 1/4 క్రౌను సైజులో 32 పేజీలతో రూపాయి ధరతో వెలువరించాం. అందులో సాంఘిక, ఆర్థిక, సాంస్కృతిక, రాజకీయ విధానాల పై వ్రాసే వాళ్ళం, వ్రాయించే వాళ్లం. 'మహిళా లోకం' అనే శీర్షిక క్రింద 4 పేజీలు స్త్రీలకొరకు కేటాయించాం. మొదటి మూడు నెలల్లో ఆరువందల నుండి ఎనిమిది వందల దాకా చందాదారులు పెరిగారు. కాస్తో కూస్తో మా దంపతులను వెలుగులోకి తెచ్చింది ఈ పత్రికేనని నాకు తెలుసు. దాని స్థాపనకు, పెరుగుదలకు, ప్రచారానికి నా శక్తి సామర్థ్యాలన్నీ వెచ్చించగల వయస్సూ, ఉత్సాహమూ రెండూ పెనగొన్న కారణంగా దాని నిర్వహణా భారాన్ని నేనే నెత్తినేసుకున్నాను.

## రచన పై నా ఆకాంక్ష ఒకసారి

'వికాసం' పత్రికలో నేను వ్రాస్తాను అని అన్నాను. "నీకు తాహతు లేదు" అన్నారు సంపాదకులైన రామ్మూర్తిగారు. నేను పత్రికాధిపతిని అన్నాను. "కావచ్చు నేను సంపాదకుడిగా ఉండగా యోగ్యత లేని వ్యాసాలను అచ్చు వెయ్యను" అని గట్టిగా పలికారు ఆయన. నాకు ఉక్రోషం వచ్చింది. "నేను మిమ్మల్ని సంపాదకత్వం నుండి తొలగించగలను, పత్రిక నాది" అన్నాను. "కావాలంటే అధికారం చలాయించుకో" అని జవాబిచ్చారు ఆయన. నాకు కోపం తారామండలా నికి లేచిపోయింది. ""మీకు సహాయం చేయడం కన్నా శ్రీమతి దుర్గాబాయమ్మ లేక ప్రేమలతా గుప్త వద్దకు వెళ్ళి సేవాకార్యక్రమాలలో పాల్గొనటం మంచిది" అని నా భావాన్ని ప్రకటించాను. ఆయన తాపీగా "హైదరాబాదుకు టికెట్టు ఏ తేదీకి తెచ్చేది" అని ప్రశ్నారూపంలో బదులు పలికారు. నాకు బాధ కలిగింది. "ఈ మనిషి ఇంతే కదా" అని నా మస్తిష్కంలో కోప భావం మెరిసింది. అప్పటికి కళ్ళనీళ్ళు పైకి రాకుండా గంభీరంగా అక్కడనుంచి లేచి ఇంట్లోకి వెళ్ళా. కాని ఆయన సవాల్ ను ఎలా ఎదుర్కోవాలి' అనే ప్రశ్న నన్ను వేధింప

సాగింది. పత్రిక ఆయనకు ఇచ్చి రంగం నుండి తప్పుకోవటమా? ఆయనను సంపాదకత్వ బాధ్యత నుండి తప్పించి పత్రికను నేను నడుపుకోవటమా? లేక ఆయునను సంపాదకుడిగానే ఉండనిస్తూ ఆయన మెచ్చేది, విలువైనది, పదిమందికి పనికివచ్చే సాహిత్యాన్ని వ్రాయడమా? రాత్రంతా ఈ జిజ్ఞాసతో గడిచిపోయింది. రంగం నుండి నిష్క్రమించడం నా ఇంటా వంటా లేదు. అది నా నైజానికి విరుద్ధం. ఆయనను పదవినుండి తొలగిస్తే పత్రికను నడపగల తాహతు లేదే అనే భయం పట్టుకుంది. ఆలోచించి సవాలును స్వీకరించ దలచాను. ఉదయం నుండే వ్యాసరచనకు ఉపక్రమించా. చిత్తు, రణచిత్తు, ఫెయిర్, వెరీ ఫెయిర్ లతో వ్యాసాలను తయారు చేశా. 'సంపాదకుడు, వికాసం' అని కవరు పై విలాసం వ్రాసి, కవరులో పెట్టి రామ్మూర్తిగారి కిచ్చా. ఆయన నవ్వుతూ స్వీకరించారు. తరువాత నా వ్యాసాలను అచ్చువేయసాగారు.

కావాలని నన్ను రెచ్చగొట్టి నా చేత మంచి వ్యాసాలను వ్రాయించాలని రామ్మూర్తిగారు అలా ప్రవర్తించారో లేక నిజంగా నా రచనా సామర్థ్యం వారికి నచ్చక అలా చేశారో నాకిప్పటికీ అంతు తేలని విషయం. ఆ ప్రశ్న నేను వారిని వేయలేదు. వారు తనకు తానుగా నాకు సమాధానం చెప్ప ప్రయత్నించ లేదు.

## బాధ్యత

1975లో రామ్మూర్తిగారు ఎమర్జన్సీలో అరెస్టు అవటం వలన నేను మేనేజింగ్ ఎడిటర్ గా వుండి సంపాదకీయాలు వ్రాయటం, ఇతరుల నుంచి వ్యాసాలు కోరటం, ప్రూఫులు చూడటం, ప్రకటనలు సంపాదించటం, అమ్మకం, లెక్కలు ఇలా ఒకటేమిటి అన్నీ నేనే చేసేదాన్ని. అలా నిర్వహించబడిన 'వికాసం' పత్రిక దాదాపు 10 సంవత్సరాలు సాగింది. 800 మంది చందాదారులు 100 దాకా లూజు సేల్సువరకు పెంచడం జరిగింది. అలా 1983 వరకు నడిచిన 'వికాసం' ఆగిపోయింది. అది అలా ఆగినప్పుడు నా గుండె నెవరో పిండినట్లయింది. అది నే సృష్టించిన పిల్ల పది ఏళ్ళు పెంచి పెద్దచేసిన పిల్ల. నాలో ఐక్యమయిపోయిన బిడ్డ. నాకళ్ళ ముందే హతమారి పోతుంటే ఏ తల్లి గుండె పగిలిపోదు!

## పత్రిక నిలిచిపోవటానికి కారణాలు

ఆగిపోవటానికి అనేక కారణాలు దోహదం చేశాయి. ఆ పత్రికను ఎక్కువమంది ఆదరించక పోవటంవల్ల నష్టాలు రావటం, నేను మహిళోద్యమాలలో ఎక్కువగా పాల్గొనటం, అలాగే నవలా రచనా వ్యాపకంలో పడటం, ఆ సమయంలో (1982) రామ్మూర్తిగార్కి యాక్సిడెంట్ లో ఒక కన్ను చూపు పోవటం వీటన్నిటి కారణంగా వికాసం పత్రికా నిర్వహణ చాలా క్లిష్టమై ఆపివెయ్యటం జరిగింది. ఇతర కారణాలు

లేకపోలేదు. వాటిని అలాయిదాగా ప్రస్తావిస్తాను. ఆ పత్రిక మీద నాకు ఎనలేని మక్కువ, ఎందుకంటే అది నన్ను ఒక వ్యక్తిగా, రచయితగా, సిద్ధాంత కర్తగా, సెమినార్లకు రిసోర్సు పర్సన్ గా మలిచింది. ఆ పత్రికే నన్ను ఒక జర్నలిస్టుగా, మరొక మహిళా పత్రికకు ఎడిటర్ గా తయారుచేసి తీర్చిదిద్దింది. ఆ పత్రిక ఆగిపోయినా నా రచనలు ఆగిపోలేదు. నా కలంలో సిరా ఇంకా ప్రవహిస్తూనే వుంది. అంటే అది ఆ 'వికాసం' పత్రికా ప్రభావం వల్లనే. ఆ పత్రిక ప్రారంభ దశనుండి వ్రాస్తూనే వున్నా. అది ఆ తర్వాత ఆగిపోయినా, అత్యధిక స్థాయిలో మహిళా సారస్వత ప్రచురణకు దోహదం చేసి మరో మహిళా పత్రిక 'స్త్రీ స్వేచ్ఛను' అది సృష్టించింది.

'వికాసం' వృత్తాంతం ముగించే ముందు మరో రెండు సంఘటనలను వివరిస్తాను. రామ్మూర్తి గారిని తేది 26-6-1975న డిటిన్యూగా జైలుకు తీసుకొని వెళ్ళగానే నేను వాస్తవానికి సంపాదకురాలిని అయినాను. కాని సంపాదకుడుగా ఆయన పేరే ముఖపత్రం మీద ఉంది. 1975 జూలై నెలలో గోరాగారు హఠాత్తుగా చనిపోయారు. వారితో, వారి కుటుంబంతో మా దంపతులకు 1966 నుండి పరిచయం. నాస్తిక కేంద్రానికి వెళ్ళి మృతదేహాన్ని చూచివచ్చాను. తర్వాత వికాసానికి సంపాదకీయం వ్రాశా. అందులో గోరాగారి సద్గుణాలు, ఆయన ఉద్యమ ప్రయోజనాలు సహజంగా చోటు చేసుకున్నాయి. పత్రిక ఆంధ్రలో నాలుగు మూలలకు చేరింది. చీరాలలో కొంతమంది మిత్రులకు నా సంపాదకీయం నచ్చలేదు. 'నాస్తిక మత వేదాంత ప్రవక్త' అనే వ్యాసాన్ని మిత్రులు ఎన్.వి. బ్రహ్మంగారు ప్రకటనార్థం పంపారు. నేను చిక్కుల్లో పడ్డా. నేనయితే ఆ వ్యాసాన్ని త్రిప్పి పంపేదాన్ని. ఒక మహావ్యక్తి మరణించి నపుడు ఆయనలోని మంచిని ఆనాడు వెలికి తీయటం సహజం. తరువాత కొంత కాలానికి ఆయన పై, అతని ఉద్యమం పై, కార్యక్రమా ల పై విమర్శలు, సమీక్షలు వేయటం సదాచారం. అయితే ఇది అందుకు భిన్నమయిన పరిస్థితి. నాకు పాలుపోక ఏదైనా బాధ్యత అసలు సంపాదకునిదేనని భావించి ఈ వ్యాసాన్ని జైలులో ఉన్న రామ్మూర్తి గారికి చేర్చా. అది ఆయన క్షుణ్ణంగా ఒకటికి రెండుసార్లు చదివి అచ్చువేయమని కబురు పంపారు. మేనేజింగు ఎడిటరుగా ఉన్న నేను ఆ విమర్శనాయుత వ్యాసాన్ని అచ్చువేశా. దానితో నాస్తిక కేంద్రం వారు కోపావేశానికి గురి అయినారు. మా ఇద్దరికీ ఇష్టుడైన ఒక మిత్రుని ద్వారా ఈ కబురు నాకు చేరింది. 'మాది ప్రజాస్వామ్యానికి అంకితమైన పత్రిక. భావ వైవిధ్యానికి చోటివ్వటం మా సూత్రం' అన్నా. ఆ మిత్రునికి (వేణుగోపాల్) కూడా కోపం వచ్చింది. "మీ ఆవుల గోపాలకృష్ణ మూర్తి గారి మీద చెడుగా వ్రాస్తే మీ పత్రికలో వేస్తారా?" అని గద్దించి అడిగాడు. "వ్యాసం వ్యక్తిగతం కాకుండా అది ఉద్యమానికి సంబంధించి వుంటే తప్పక ప్రచురిస్తాం. వ్రాయండి లేక వ్రాయించి తీసుకురండి" అని నిదానంగా ప్రత్యుత్తరం ఇచ్చా. ఆయన తృప్తిపడి వెళ్ళిపోయాడు. 1974 నాటికి రామ్మూర్తిగారు, నేను రాడికల్

హ్యూమని స్టులం. ఆ ఉద్యమ నిర్మాత ఎం.ఎన్. రాయ్. ఆయన సిద్ధాంతాన్ని 'రాయిజం' అని కూడా పిలవడం కద్దు. నవ్యమానవవాద సిద్ధాంతాన్ని ప్రచారం చేసేది 'వికాసం'. ఒకసారి 'రాయిజాన్ని తిరిగి వ్రాయాలి' అనే ఇన్నయ్య గారి వ్యాసాన్ని, దానికి జవాబుగా రాయిజాన్ని సమర్థిస్తూ వచ్చిన రావిపూడి వెంకటాద్రిగారి వ్యాసాన్ని వికాసంలో ప్రచురించాం. తరువాత సంచికలలో కూడా వారు ఈ వివాదాన్ని కొనసాగించారు. ఇది కొన్ని బృందాలలో, ముఖ్యంగా కమ్యూనిస్టులలో, సంచలనం కలుగజేసింది. అంటే వికాసం పిడివాదానికి కట్టుబడి ఉండలేదని, బాధ్యతాయుత భావస్వేచ్ఛను పెంపొందించేదని తెలుతుంది. ఈ సంఘటన జరిగిన రోజుల్లో నేను ఆ పత్రికకు మేనేజింగు ఎడిటరును. నేను మేనేజింగు ఎడిటరు అయిన తరువాత నన్ను సంప్రదించకుండా రామ్మూర్తిగారు ఏ ముఖ్య నిర్ణయం చేసే వారు కాదు. అది ఆయన ప్రజాస్వామ్య వైఖరికి, బాధ్యతాయుత ప్రవర్తనకు ప్రతీక.

'వికాసం' పత్రికను గురించి మరికొంత వ్రాయాల్సి ఉంది. నేనూ, రామ్మూర్తిగారూ రాడికల్ హ్యూమనిస్టులం కనుక ఈ పత్రికను ప్రోత్సహించారు నవ్య మానవవాదమిత్రులు. సర్వశ్రీ గుంటుపల్లి గోపాలరావు, గురజాల సీతారామయ్య, కె.రాధాకృష్ణమూర్తి, ఆవుల సాంబశివరావు, కొల్లా సుబ్బారావు, గోరంట్ల రాఘవయ్య ప్రారంభంలో విరాళాలిచ్చిన వారిలో ముఖ్యులు. కమ్యూనిస్టు ఉద్యమాభిమానులు పాపులర్ షూమార్టు అధిపతి శ్రీ చుక్కపల్లి పిచ్చయ్య గారు విరాళాలిచ్చారు. అలాగే బొగ్గవరపు రోశయ్య గారు ప్రకటనలనిచ్చి పత్రిక పోషణకు తోడ్పడ్డారు. ఆంధ్రోద్యమపు రోజుల్లో వారింటిలో రామ్మూర్తిగారు ఆశ్రయం పొందారు. రెండు దఫాలుగా సుమారు 20 రోజులు. ఆయనకు మాకు సిద్ధాంతపరంగా మత భేదాలున్నా మా మీది అభిమాన గౌరవాలతో పత్రికకు బాసటగా నిలిచారు. రామ్మూర్తిగారు నిధులు సమకూర్చటంలో మొదటి నుండీ అశక్తులు. ఏదైనా సాయం అడుగుతారు కాని చందాలు, విరాళాలు అడగలేరు. ధన సేకరణా సామర్థ్యం ఆయనకు లేదు. అందువల్ల ఆ బాధ్యతను నేను తీసుకోవాల్సి వచ్చింది.

కేవలం పైకం వున్నంత మాత్రాన పత్రికను నడపలేము. రచనలు కావాలి, వ్యాసాలు రావాలి. అవి సమర్థవంతంగా ఆసక్తిదాయకంగా ఉండాలి. ఆ బాధ్యతను చీరాల మిత్రులు చాలావరకు నిర్వహించారు. సర్వశ్రీ రావిపూడి వెంకటాద్రి, ఎన్.వి. బ్రహ్మం ప్రభృతులు ఆపని నెరవేర్చారు. చీరాలకు చెందిన సి. హెచ్. రాజారెడ్డి గారికి అంతకు క్రితం 'సమీక్ష' అనే మాసపత్రికను ఆరు సంవత్సరాలు నడిపిన అనుభవం ఉంది. ఆయన మా దంపతులతోపాటు ఆంధ్రోద్యమంలో దూకిన మిత్రులు. రామ్మూర్తిగారు అరెస్టు కాగానే ఆయన ప్రతినెలా వచ్చి పత్రిక నిర్వహణ బాధ్యతతో పాలుపంచుకొన్నారు. సర్వశ్రీ ఎం. బసవ పున్నారావు, గురజాల సీతారామయ్యలు పత్రికకు చందాదారులను చేర్పించే బాధ్యతను వారి పట్టణంలో స్వీకరించారు. ఆ సందర్భంగా నేను నా కుమారుల

సాయాన్ని, మరదలు డా. ఝాన్సీదేవి (వరంగల్) సహాయాన్ని పొందగలిగాను. ఇలా ఎందరో మిత్రులు, అభిమానులు, పత్రికను అభిమానించి ప్రోత్సహించారు. పత్రిక ప్రారంభ దశలో రామ్మూర్తిగారికి, నాకు తర్వాత 'రేపు' పత్రిక సంపాదకులైన నరసింహరావుగారు పత్రికా ముద్రణ, పత్రికలోని శీర్షికల నామకరణం వీటిపరంగా ఎంతో చేయూతనిచ్చారు. ఉషశ్రీ ప్రింటర్స్ వారు (విజయవాడ), ప్రగతి ఆర్టు ప్రింటర్సు (హైదరాబాదు), నాట్యకళా ప్రింటర్సు వారు (హైదరాబాదు) ఎంతో తోడ్పడ్డారు. ఇంతమంది అభిమానాన్ని చూరగొన్న పత్రిక ఆగిపోవడం విడ్డూరంగా కన్పిస్తుంది. కేవలం సాంకేతిక కారణాల వైఫల్యం మాత్రమే కాదు. సిద్ధాంతపరమైన కారణాలు కూడా ఉన్నాయి. 'వికాసం' పత్రిక రాడికల్ హ్యూమనిస్టుల పత్రిక. నవ్య మానవవాద ఉద్యమం ఆంధ్ర ప్రాంతంలో 1974లో చాలా బలహీనంగా ఉంది. రాజకీయాలలో ప్రవేశం ఉన్న వారికి ఆ ఉద్యమం చిరపరచితమైనా సామాన్య ప్రజానీకంలోకి ఆ ఉద్యమం చొచ్చుకొని పోలేకపోయింది. పైగా నవ్య మానవవాదంలో హేతువాదం, వ్యక్తివాదం, ప్రజాస్వామ్యం ప్రధాన భాగాలు కనుక వాటి తాలూకు భావాలు, ఆ భావాలు కల్గిన వ్యాసాలు పత్రికలో చోటు చేసుకున్నాయి. అన్ని ఉద్యమాల తాలూకు వార్తలుండేవి. పార్టీ రహిత ఉద్యమం, మహిళోద్యమం బాగా ప్రధాన స్థానాలను ఆక్రమించేవి. అన్నిటిని మించి భాష అంతగా సరళంగా ఉండేది కాదు. అందువల్ల అన్ని ఉద్యమాలకు అండదండలందించే సమగ్ర పత్రికగా ఉన్నా అది రాడికల్ హ్యూమనిస్టుల ఉద్యమ పత్రికగా నిలిచిపోయింది.

కోవూరు పర్యటనల తదుపరి 'చార్వాక' పత్రిక పుట్టింది. దానిని ఆంధ్ర ప్రజలు విశేషంగా ఆదరించారు. అదీగాక హేతువాద నాస్తికవాద పత్రికలు వెలిశాయి. దాంతో హేతువాద సానుభూతి పరులకు 'వికాసం' పత్రిక కొనవలసిన అవసరం తీరిపోయింది. మహిళా లోకం సంగతి సరేసరి. అది జాగృతం కాలేదు. అప్పట్లో 1980 లో జనతా ప్రభుత్వ పతనంతో, జయప్రకాష్ మరణంతో ప్రజాస్వామ్య ఉద్యమానికి బలం వీగిపోయింది. పాఠకుల ఆసక్తి తగ్గిపోయింది. తిరిగి చందాదారులుగా చేరటం తగ్గిపోయింది. ఏదయినా అనేక కారణాల ఫలితంగా 'వికాసం' ఆగిపోవలసిన పరిస్థితి కలిగింది.

అయితే అనతికాలంలోనే ఆ వరవడిలో ఉద్భవించిన 'స్త్రీ స్వేచ్ఛ' ఆలోటును తీర్చింది. మరో ముఖ్య విషయం '84లో 'వికాసం' ఆగిపోయి '88లో 'స్త్రీ స్వేచ్ఛ' ఆవిర్భవించే ఈ మధ్యకాలంలోనే సృష్టించిన మహిళా సాహిత్యం అంతా 50 పుస్తకాలు, 40 కరపత్రాలుగా వ్రాసి ముద్రించటం జరిగింది. అంతేకాదు, ఆ కాలంలో అనేక దిన, వార, పక్ష మాసపత్రికలలో అత్యధిక స్థాయిలో నా రచనలు వెల్లి విరిశాయి. ఆ విధంగా నా సాహిత్యానికి 'వికాసం' మాతృక అయింది.

## "స్త్రీ స్వేచ్ఛ' పత్రిక ఆవిర్భావం, ఆవశ్యకత

'స్త్రీ స్వేచ్ఛ' పత్రికా స్థాపనకు నాకూ ఎంతో అనుబంధం ఉంది. అది ఇటీవల పండిన నా కలల పంట పూర్తిగా స్త్రీ స్వేచ్ఛకు, సమానత్వానికి అంకితమైన ఈ తరహా పత్రికలు దరిదాపు వెలువడడం లేదు. స్త్రీల పత్రికలంటూ వంటలు, అల్లికలు, కుట్లు, పండుగలు, వైద్యంలాంటి విషయాలతో పత్రికలు నింపి ఏ ఒక్కటో అరో 'స్త్రీల పై అత్యాచారాలు', 'వరకట్నాల మరణాలు' అనే శీర్షికల పై వ్యాసాలు రాస్తారు. అలా రాయకపోతే ఆ పత్రిక బ్రతకదట! అయినా పూర్తిగా సిద్ధాంతపరమైన స్త్రీల పత్రికలకు కూడా విలువయిచ్చే వారున్నారనే విశ్వాసం నాకు వుంది.

"మాలతీ చందూర్ హైదరాబాద్ వస్తున్నది. మీరు మీటింగు ఏర్పాటుచేస్తే బాగుంటుంద"న్నారు మిత్రులు. 'సరే' అని మాట ఇచ్చాను. ఆ రాత్రి ఆలోచించి ఒక నిర్ణయానికి వచ్చా. 'వికాసం' పత్రిక ఆగిపోయాక మహిళా పత్రిక పెడదామనే బహుకాలంగా ఉన్న నా కోరిక అలా నెరవేరింది. ఆ వెంటనే 'స్త్రీ స్వేచ్ఛ' పత్రిక ప్రింటు చేయించి 1988 ఫిబ్రవరిలో విడుదల చేశాం. స్త్రీలకు సిద్ధాంతపరమైన పత్రిక లేకపోవటమే దీని స్థాపనకు ముఖ్యకారణం.

నా ఆధ్వర్యంలో 'వికాసం' అనే మాసపత్రిక పది ఏళ్ళు నడిచి ఆగిపోయిన తరువాత నాలో చెలరేగిన అశాంతి సమసిపోయి 'స్త్రీ స్వేచ్ఛ' పత్రిక స్థాపన వలన తిరిగి ప్రశాంతత ఏర్పడింది. ఇందులో ఎన్నో కష్టాలు, ఇబ్బందులు, ఉద్రిక్తతలు, విమర్శలు యిమిడివున్నా, ఇది నాచేత సృష్టింపబడ్డ పువ్వు కనుక ఆ శ్రమ అంతా నాకు సంతోషదాయకంగా వుంది. ఇది ప్రకృతి ధర్మమో, మానవ నైజమో! అందుకే అంటారు కాబోలు 'తా వలచింది రంభ తా మునిగింది గంగ! "అని. ఇది నూరు పాళ్ళూ పచ్చి నిజం.

పత్రిక నిర్వాహకులకు ఎంతో చారిత్రక అవగాహన ఉండాలి. మరెంతో దూరదృష్టి ఉండాలి. అప్పుడే పత్రిక రాణిస్తుంది. పత్రిక స్థాపించటం తేలికే. దానిని పది కాలాలపాటు చాలా ఆటంకాలను, కష్టనష్టాలను అధిగమించి బ్రతికించటం బహుకష్టం. అయినా అది అసాధ్యం మాత్రం కాదు. మానవశక్తికి మించిన శక్తి ఏదీ లేదు. ఆ దృష్టితో స్థాపించిందే ఈ 'స్త్రీ స్వేచ్ఛ' పత్రిక.

ఈ పత్రికకు ఒక విశాల దృక్పథం, విశిష్ట లక్ష్యం ఉన్నాయి. ఈ పత్రిక సాంఘిక, ఆర్థిక, రాజకీయ సాంస్కృతికరంగాల్లో ఆడవారి అభ్యుదయాన్ని ఆకాంక్షిస్తుంది. స్త్రీ విముక్తిలోనే పురుష విముక్తి కూడా ఇమిడి వుందని అది విశదీకరిస్తుంది. ఎంతకాలం స్త్రీలు బందీలుగా వుంటారో అంత కాలం పురుషులు కూడా సుఖశాంతులు పొందలేరని నిరూపిస్తుంది. వ్యక్తి శాంతితో బాటు కుటుంబ శాంతిని కూడా అభిలషిస్తుంది.

హెచ్చుతగ్గులను గౌరవించే బూర్జువా లక్షణాలను ఈ పత్రిక చీల్చి చెండాడుతుంది.

'స్త్రీ స్వేచ్ఛ' కేవలం వైవిధ్యంతో కూడిన స్త్రీల సమస్యలను ప్రజాదృష్టికి తెచ్చి వాటిని పరిష్కరించటానికి స్థాపించబడింది. స్త్రీల కొరకు, స్త్రీల చేత నడిపించబడే ఈ పత్రిక అనతికాలంలోనే పుంజుకున్నది. మొదటి సంవత్సరం వెయ్యి కాపీలు వేసినదాన్ని, రెండవ సంవత్సరం రెండు వేల కాపీల వరకు పెరిగింది. ఇంకా సమర్థవంతంగా నడిపితే ఇది దినదినాభివృద్ధి చెందుతుందనే విశ్వాసం నాకు వుంది. కారణం జనాభాలో సగభాగం స్త్రీలు. వారు వేల సంవత్సరాల నుండి కూపస్థ మండూకాల్లా బ్రతుకుతూ రూపాయి సినిమాకు, పావలా పూలకు, పదిరూపాయల చీరెకు భర్తలపై ఆధారపడి బ్రతుకుతూ ఆలనా పాలనా లేకుండా వుంటూ అదే వారి కర్తవ్యం అని సంతోషంగా అనుభవిస్తున్నారు. ఈ స్థితి దారుణం అని వారికి నచ్చచెప్పి వారిలో క్రాంతిని కలిగించే పత్రిక చాలా అవసరం అనిపించింది. ఆ లక్ష్యంతో స్థాపించబడిన 'స్త్రీ స్వేచ్ఛ' పత్రికకు గొప్ప భవిష్యత్తు వుంటుందని నాకు తెలుసు. ప్రస్తుతం ఈ పత్రిక ఇప్పుడే కన్ను తెరిచిన చిన్న పిల్ల. ఇంతకుముందు పది సంస్థలు స్థాపించి పనిచేస్తున్నా వాటి కార్యరంగం వేరు. ఈ పురిటిపిల్ల బాలారిష్టాలు దాటి యవ్వనంలో అడుగు పెట్టి కౌమార దశను దాటి, వార్ధక్యపు అనుభవాలు గడించి "శతమానం భవతి శతాయుః పురుషశ్శతేంద్రియః ప్రతితిష్ఠతి" కాగలదు. దానికి నేనే సారధ్యం వహించ నక్కరలేదు. అనుభవజ్ఞులైన వారసులు తయారయి వున్నారు. ఎవరు లేకపోయినా ఏదీ ఆగిపోదు. కొన్ని భావాలను ప్రజల మీద విరజిల్లితే, ఆ భావాలు వారికి నచ్చితే అవి ప్రజా సమస్యకు మార్గదర్శకాలయితే ప్రజలే వాటి భారాన్ని మోస్తారు. పెంచుతారు. నెత్తినేసుకుంటారు. కనుక భావాలకు బలిమి, వాడి, వేడి వుంటే ప్రజలు వందలు వేలుగా బైటపడి ప్రభావితులవుతారు. అలా కాకపోతే ప్రజలు మన్నించని పత్రికలు మఖలో పుట్టి, పుబ్బలో మాయమయిపోతాయి..

అలాగే ఒక పత్రిక గాని, సాహిత్యం గాని ఆనాటి సమాజాన్ని కదిలించాలి. సమస్యలన్ని వెలికి తెచ్చి సంస్కరించాలి. బహుజనాభ్యుదయానికి చేరువైన భాష వాడాలి. దేశ దేశాల సమస్యలను సమీక్షించాలి. ఆర్థిక శక్తితో, సరిక్రొత్త వరవడిలో నూతన మెరుగులతో నడిపించడం, సమర్థులైన వారి సలహాలు పాటించడం చాలా అవసరం.

ముఖ్యమైనది నిబద్ధత (కమిట్ మెంట్). పత్రికా నిర్వాహకులకు స్పష్టమైన లక్ష్యాలు, ఆదర్శాలు వుంటేనే పత్రికా నిర్వహణ చేపట్టాలి. ఆ లక్ష్యంతో స్థాపించిందే 'స్త్రీ స్వేచ్ఛ' మాసపత్రిక. అయినా 'స్త్రీ స్వేచ్ఛ' పత్రిక అవసరమా అని అడుగుతున్నారు. అసలు స్త్రీకి స్వేచ్ఛే అఖర్లేదనే కొందరు. "మన రాజ్యాంగంలోనే స్త్రీకి స్వేచ్ఛ ఇచ్చారు. అలా రాశారు. అది వాడుకోవాలి. కాని పత్రిక ద్వారా చెప్పాలా" అని హాస్యోక్తులు విసిరేవారూ వున్నారు. ఎన్ని భావాలున్నా స్త్రీకి స్వేచ్ఛ కావాలి అనే భావాన్ని చంపలేము కదా!

అందుకే ఆ పత్రిక అవసరమయింది.

మా దంపతులం కాక, నా కుటుంబీకులు కాక, మిత్రులు సర్వశ్రీ చుక్క పల్లి పిచ్చయ్య, డి. స్వాతి, బి. రామస్వామి భారీగా విరాళాలిచ్చారు. శ్రీ బొగ్గవరపు రోశయ్య ప్రతినెలా ప్రకటన యిచ్చి అండదండలు చేకూర్చారు. ఇతర మిత్రులు పత్రికద్వారా తోడ్పడ్డారు. అభిమానులు అశేషంగా ఆదరించారు. మొదట్లో నా స్వంత పత్రికగా వున్న 'స్త్రీ స్వేచ్ఛ'ను 28-11-90 తేదీన మహిళాభ్యుదయ ట్రస్టుకు బదిలీ చేశాను. ఇప్పటికి పత్రికకు ఒకటిన్నర లక్షల రూపాయల మూలధనాన్ని సేకరించగలిగాను.

పత్రిక డెమ్మీ పుస్తకం సైజులో 24 పుటలతో వెలువడుతున్నది. మానవవాద స్త్రీ విమోచన (Humanist Feminism) సిద్ధాంత ప్రాతిపదికగా సంపాదకురాలిగా దానిని వెలువరిస్తున్నాను. ప్రస్తుతం అది 'మహిళాభ్యుదయ ట్రస్టు' అనే ధర్మ సంస్థ పత్రిక. మానవవాదం (Humanism) ఆధారంగా మహిళోద్యమ నిర్మాణానికి ఆ పత్రిక అంకితమయింది. గత నాలుగేళ్ళుగా ఆ పత్రిక ప్రజల మన్ననలను అందుకుంటూ సభ్యత్వాన్ని గణనీయంగా పెంచుకుంటున్నది.

# 3. సాహితీ రూపాలు

విమర్శ గ్రంథాలు : చరిత్ర

## ఇస్లాం స్త్రీలు

స్త్రీల సమస్యలను గురించి చెప్పేటప్పుడు అన్ని మతాల చట్టాలు, ఆచారాలు, సంప్రదా యాలు వేర్వేరుగా వుంటాయి. కనుక హిందూమతంలోనే కాక ఇతర మతాలైన ఇస్లాం, క్రైస్తవం స్త్రీల యొక్క పరిస్థితులను కూడా తెలియజేయటం నా ప్రథమ కర్తవ్యంగా భావించాను. మొదటిగా 1984లో "ఇస్లాం: స్త్రీలు" అనే గ్రంథం వ్రాసాను. అది చదివిన "జమాయత్ ఇస్లాం "వారు తీవ్ర నిరసనను తెలియజేశారు. "మీరు మహమ్మదును ప్రవక్తగా గుర్తించలేదు. అది మాదృష్టిలో బాధాకరం. మిమ్మల్ని బురఖా వేసుకోమని మేము అనలేదు: మీ భర్తను నలుగురు భార్యలను చేసుకోమని మేము కోరలేదు. మీ హిందూ మత విషయాలను మేము పట్టించుకోవటం లేదు. మా విషయాలు మీకెందుకు? మా మతం గురించి ఇలా వ్రాసినందుకు మాకు కోపకారణమయింది" అని వారు బెదిరించారు. నేను ఇస్లాం మతం గురించి దురుద్దేశ్యంతో వ్రాయలేదని సమాధానం చెప్పాను. అయినా వారికీ నాకూ మధ్య మూడునెలలు రిజిష్టరు ఉత్తరాల ద్వారా తగాదా జరిగింది. తరువాత సిటీలో కర్ఫ్యూ వచ్చింది. చంపుకోవటాలు పెరిగాయి. నామీద పెద్ద ఎత్తున పేచీ పెట్టినా నేను మాత్రం ధైర్యంతో నిలబడి వారు అడిగిన ప్రశ్నలకు తగిన విధంగా సమాధానాలు చెప్పాను. కనుక అంతటితో ఆ వ్యవహారానికి తెరపడింది. ఆ తర్వాత వారి ఉద్యమనేతలు తమ వారపత్రిక 'గీటురాయి' లో నన్ను వ్రాయమని అడిగారు. చాలాకాలం అనేక విషయాల మీద ముఖ్యంగా స్త్రీల గురించి రాశాను. ఇంకా వ్రాస్తూనే వున్నాను. 'ఇస్లాం: స్త్రీలు' పుస్తకాన్ని రామ్మూర్తిగారు ఇంగ్లీషులోకి తర్జుమా చేస్తే స్టెర్లింగు పబ్లిషర్సు (ఢిల్లీవారు) 1987లో ప్రచురించారు. వారు 120 రూపాయలు వెల పెట్టినా ఇండియాలోనూ విదేశాలలోను అమ్ముడుపోవటం దాని పై ఎన్నో సమీక్షలు రావడం విశేషం.

## క్రైస్తవం : స్త్రీలు

క్రైస్తవ సమాజం స్త్రీలను ఎలా పరిగణించేది అనే అంశాన్ని అనేక కోణాలనుండి పరిశీలించవచ్చును. మత గ్రంథాల పరిశీలన, ఆచారాల విశ్లేషణ, శాసనాల సమీక్ష భావనా స్రవంతి, సంప్రదాయానుసరణ. ఇది బహురూపాలు. ఇందులో మత గ్రంథాల ప్రమాణంగా నేను క్రైస్తవ స్త్రీల స్తితిగతులను గురించి తాత్విక ఆలోచనను తరచి చూశాను. పాత నిబంధన ధర్మాలను కొనసాగించటానికి తను పూనుకొన్నాననే ఏసుక్రీస్తు ప్రవచనాన్ని ఉటంకించి విమర్శ ప్రారంభిం చాను. క్రైస్తవ సోదరీమణులు తమ మతం పురుషాధిక్యతను

ప్రతిపాదిస్తున్నదనే విషయాన్ని గమనించాలని ముఖచిత్రం ఆమెరికను నాస్తికోద్యమంవారి గ్రంథం నుండి అరువు తెచ్చి ముద్రించాను. కొంతమంది సంప్రదాయ పరులయిన స్త్రీలు కోపగించుకున్నారు కూడ. అచిరకాలంలోనే నేను పక్షపాత దృష్టితో వ్రాయలేదని గ్రహించగలరని నా నమ్మకం.

## హైందవం : స్త్రీలు

ఇస్లాం మతంలో, క్రైస్తవమతంలో స్త్రీల హోదాను, స్థానాన్ని గురించి వ్రాసిన తదుపరి దేశంలో అధిక సంఖ్యాకులయిన హిందూ స్త్రీల స్థితిగతులను పరిశీలించకపోవటం క్షంతవ్యం కాదు. హైందవ సమాజం పైకి అభ్యుదయకరంగా కన్పించినా నిజానికి స్త్రీల విషయమై క్రూరంగా ప్రవర్తించింది. పతి విహీనులను హింసించిన వయినం, సతీసహగమనం పేర కాల్చి చంపిన విధం దుర్భరమైనది. పాతివ్రత్యం పేర సతులను అణగదొక్కిన విధానం, స్త్రీలను కించపరచిన పద్ధతి అసాధారణం. వితంతువులకు ఆస్తి హక్కును లేకుండా చేసింది హిందూ సమాజం. అన్నదమ్ములతో కలసివున్న పురుషుడు చనిపోతే అతని భార్యకు భరణం మాత్రం వచ్చే ఏర్పాటు చేసింది హిందూ సంఘం. బ్రిటిషు పరిపాలన ధర్మమా అని హిందూ స్త్రీల స్థితి మెరుగయింది. ప్రస్తుతం హిందూ స్త్రీల స్థితిగతులు ముస్లిం స్త్రీల పరిస్థితి కన్నా మెరుగుగా ఉన్నాయి. క్రైస్తవ స్త్రీల స్థితిగతులు అధ్వాన్నంగా వున్నాయి. హైందవం తాత్వికపరంగా ఉదాత్తమయిన భావాలను ప్రవచిస్తుంది. సామాజికంగా ఆలోచిస్తే నిచ్చెనమెట్ల సమాజాన్ని స్థాపించటమే కాక స్త్రీలను అధోగతిలోకి త్రోసిన ఘనత దానిది. నా దృష్టిలో 'హైందవం: స్త్రీలు' నా పుస్తకాలన్నింటిలో ప్రసిద్ధం, ఉత్తమోత్తమం.

## ఆంధ్రప్రదేశ్ మహిళోద్యమ చరిత్ర (1860-1983)

ఐ.సి.ఎస్.ఎస్.ఆర్. (I.C.S.S.R.) వారు కోరిన మీదట 250 పేజీలుగల ఈ గ్రంథం వ్రాయటం జరిగింది. దీనికోసం వేటపాలెంలోని సారస్వత నికేతనం తదితర గ్రంథాలయాల నుండి ప్రాచీన గ్రంథాలను పత్రికలను పరిశీలించి నోట్సు వ్రాసుకొని ఈ గ్రంధాన్ని రచించాను. పూర్వ చరిత్ర పూర్తిగా దొరకలేదు. ఎంతో కష్టమయింది. దీనికి ఆ సంస్థవారు 1500/- రూ. పారితోషికం ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్ మొత్తానికి కథ, నవల, నాటకం కాని ఇతర ప్రక్రియల క్రింద ఈ గ్రంధానికి తెలుగు విశ్వవిద్యాలయం వారు ప్రథమ బహుమతిని ప్రకటించి 1988 ఉగాదినాడు మూడువేల రూపాయిల బహుమానంతో పాటు ఒక మొమెంటో ఇచ్చారు. ముఖ్యమంత్రి శాలువా కప్పి సత్కరించారు. అధ్యక్షత వహించిన వైస్ ఛాన్సలర్ అభినందించారు.

ఆంధ్రపత్రిక దినపత్రికలో ఇందులోని ముఖ్య భాగాలను సీరియల్ గా కొంతకాలం

ప్రచురించారు. అనతి కాలంలో ఇంగ్లీషులో కూడా గ్రంథరూపంలో ప్రింటయ్యే అవకాశం వుంది.

## నవలలు, కథలు, కథానికలు

సాహితీ ప్రక్రియలన్నింటి కన్నా నవలా ప్రక్రియ అర్వాచీనమయినది. నవల 19వ శతాబ్దంలో రూపొందింది. అంతకు క్రితం మనకు బృహత్ కథలు వుండేవి. ప్రసిద్ధ నవలలకు కందుకూరితో ప్రారంభోత్సవం జరిగింది. 1921 నుండి నవలా ప్రక్రియ బహుజన ఆదరణను పొంద సాగింది. 1960, 1970 దశకాలలో రచయిత్రులు నవలా ప్రపంచాన్ని పరిపాలించారు. దిన, వార, మాస పత్రికల్లో సీరియల్ నవలల ప్రచురణలు నవలల పై మోజును పెంచాయి. వివాహానికి ఎదురు చూచే యువతులు పాఠకులు అయినారు. ఇటీవల వారూ రచయిత్రులవుతున్నారు. గమ్మత్తులు, చమక్కులు, కథలో మలుపులు, అనూహ్య సంఘటనలు, ఉత్కంఠను రేకెత్తించే సన్నివేశాలు, విపరీత మనస్తత్వాలు కల పాత్రలు, విచిత్ర వర్ణనలు, విడ్డూరపు సంభాషణలు, వీలయితే అశ్లీల పదజాలాలు ఇవన్నీ ఈనాటి నవలల్లో గోచరిస్తాయి. ఇది దరహం మీద చెప్పే మాట.

నవలను పదిమంది చదువుతున్నారు కనుక నవలల ద్వారా స్త్రీ విముక్తి సందేశాన్ని ప్రచారం చేద్దామని నేను సంకల్పించా. అసలు స్త్రీల సమస్యలకు దర్పణాలే నా నవలలు అని చెప్పుకోటానికి నేను సంకోచించను. ప్రతి సమస్యకు విధిగా పరిష్కార మార్గం కన్పించాలని బల్ల గుద్ది నేను చెప్పక పోయినా ఒక పాత్ర అయినా సమస్యా పరిష్కారాన్ని సూచించాలి. అది నర్మగర్భితంగానా లేక ప్రస్ఫుటంగానా అనేది వేరే ప్రశ్న. కథాసంవిధానం, కథావస్తువు ప్రశ్నకు జవాబును చేకూరుస్తాయి.

నా నవలలో స్త్రీ, పక్షపాతం కొట్టవచ్చినట్లు కనిపిస్తుంది. దాని అర్థం స్త్రీలందరూ మంచివారని కాదు. స్త్రీ జాతి దోపిడీకి, అన్యాయానికి, దౌర్జన్యానికి గురి అవుతున్నది కనుక స్త్రీల పై సానుభూతితో వ్రాయబడతాయి నా నవలలు, కథలూనూ.

## వెలిగిన జ్యోతి

1980లో జైపూర్ లో జరిగిన భారత రాడికల్ హ్యూమనిస్టు సభలకు నేను, రామ్మూర్తిగారు కలసి రైలులో వెళుతున్నాము. ఆ రైలులో మాతోటి ప్రయాణికులలో ఒక ఆయన 6 సంవత్సరాల పిల్లతో ప్రయాణం చేస్తున్నాడు. ఆపిల్ల పేరు కాంచన అని, తను ఆ పిల్లకు తండ్రినని, తన భార్య వళ్ళుకాలి చనిపోతే రెండో పెళ్ళి చేసుకోవటంవలన సవతి తల్లి సరిగా చూడదేమోనని మేనత్తకు (తన చెల్లెలు) పెంచుకోవటానికి ఈ పిల్లను ఇచ్చి రావటానికి వెళుతున్నానని అతను చెప్పాడు. అది విన్నప్పుడు కుందనపు బొమ్మలా వున్న ఆపిల్ల తల్లి లేనిదయి పోవటం, పరాయి పంచన చేరవలసి రావటం తలుచుకుంటే

నాకు తెలియకుండానే ఆ పాపమీద విపరీతమైన అనురాగం ఏర్పడింది. అప్పటినుండి ఆ పాపే నా ధ్యాసలో వుండి ఆ పాప జీవితాన్ని గురించి నాలో పరిపరి ఊహలు వచ్చినాయి. వాటి ఆధారంగా వ్రాసిందే 'వెలిగిన జ్యోతి' అనే నవల దీనిని రేడియోలో సమీక్షించారు. సుప్రసిద్ధ నవలా కారులు మహీధర రామమోహన్ రావుగారు. అనేక పత్రికల్లో రివ్యూలు వచ్చాయి. స్త్రీ వస్తువుకాదు, ఒకరి సొత్తుకాదు. ఆమె ఒక మనిషి ఆమెకి ఆలోచనలు ఊహాపోహలు వుంటాయి. ఆమె కలలు కంటుంది. తనకు అనుకూలమైన భర్త కావాలని ఆశిస్తుంది. అలాంటి వాడు తటస్థిస్తే తన మనసిస్తుంది. కానీ అనుభవంలో ఎదురు దెబ్బలు తగుల్తాయి కొందరికి. పరిస్థితులకు సర్దుకొని – దగా చేసి దౌర్జన్యం చేసిన – అతన్ని భర్తగా స్వీకరించటం భారతదేశంలో సర్వసాధారణంగా జరుగుతోంది. పతివ్రతగా జీవితం సాగించడం మామూలే. భర్త దుష్టుడైనా, దుర్మార్గుడైనా, నీచుడయినా అతనితో కాపురం చేయడం ఈ దేశంలో ఆనవాయితీ. అయితే ఏభర్త ఆమె జీవితాన్ని దిగజార్చాడో ఆ భర్తే తనని కులట అంటే " భారతనారికి మాత్రం కోపం రాదా? 'వెలిగిన జ్యోతి' నవలలోని కాంచనకు అలాగే కోపం వచ్చింది. అంతటితో ఆగక ఆ ఖలుడు దౌర్జన్యాన్ని ఉన్నతస్థాయికి తీసుకొని వెళ్ళాడు. దగా చేసిన భర్తను, పడుపు గృహానికి తనని తరలించడానికి జుట్టు పట్టుకొని ఈడుస్తున్న భర్తను, తనను కొట్టిన భర్తను కాంచన కత్తిపీటతో నెత్తి అడుస్తుంది. ఇది చదివిన కొందరు స్త్రీ పురుషులు నన్ను విమర్శించారు. స్త్రీ శాంతమూర్తి అని, హింసకు పాల్పడదని కొందరు స్త్రీలు విమర్శిస్తే, ఈ కథ ద్వారా భర్తలను చావ గొట్టమని సుబ్బమ్మ గారు ప్రోత్సహిస్తున్నారని పురుషులు కొందరు నన్ను దుయ్యబట్టారు. ఈ అభ్యంతరాలను, ఆక్షేపణలను ముందుగానే ఊహించి రామ్మూర్తిగారు. దీనికి ఉపసంహారం వ్రాశారు. అందులో ఇలాంటి విమర్శలకు జవాబు వుంది. స్త్రీ స్వభావాన్ని గురించి విశదీకరించారు. హింస అహింసల చర్చ చేసారు.

## ప్రేమ + సెక్స్ = నీతి

జీవితానుభవాన్ని మథించి వ్రాసిన నవల "ప్రేమ+ సెక్స్ = నీతి" ఒకసారి ఒక స్త్రీ నాకు వుత్తరం వ్రాసింది. అందులో తను నలుగురు పిల్లల తల్లినని, భర్త పోయాడని, తనకు ఇంకా సెక్సు కోరిక తీరలేదని, అందువల్ల మళ్ళీ పెళ్ళి చేసుకోవాలని వున్నదని. అలా చేస్తే సంఘంలో తనకు గౌరవం వుంటుందా, తన పిల్లల భవిష్యత్ ఎలా వుంటుంది అనే దానికి సలహా చెప్పమని కోరుతూ వ్రాసింది. అది చదివిన తర్వాత ఆమెకే కాకుండా అలాంటి సమస్యతో బాధపడుతున్న వాళ్ళందరికి తెలిసేలాగా ఒక కథ వ్రాయాలని నా మనస్సులో ఆలోచన కలిగింది. ఆ ఆలోచనలకు రూపకల్పనే "ప్రేమ +సెక్స్ = నీతి" దీనిని ఆంధ్రప్రభలో "శార్వరి" ప్రశంసించారు.

జీవితంలో సెక్స్ ఎంత పాత్ర వహిస్తుందో తెలుసుకోవడం స్త్రీ, పురుషులందరికి అవశ్య కర్తవ్యం. సెక్సు ప్రప్రథమమైందని ప్రకటించి దానిని పరిగణనలోనికి తీసుకుని రానక్కర లేదు. అలాగని త్రోసిరాజన్నా రెండూ తప్పే. జీవితంలో సెక్సుకు స్థానం వున్నమాట వాస్తవం. అయితే దానిపాత్ర 'ప్రేమ' కన్నా చిన్నది. నీతి కన్నా మరీ చిన్నది. సెక్సులేని ప్రేమ ఎంత అసంపూర్ణమో, ప్రేమ లేని సెక్సు అంత పాశవికం. నీతి ప్రేమను, సెక్సును అధిగమిస్తుంది. మానవ జీవితం విశిష్టమైనది. ఆలోచనా సంపన్నుడైన మానవుడు / మానవి వివేకవంతులుగా జీవితం సాగించడం చూస్తున్నాం. మంచి చెడ్డల ఎంపికకు దోహదం చేసేదే "నీతి' అంటాము. పై నవలలో ప్రేమ లేని సెక్సుకు ప్రతీకలుగా పాత్రలున్నాయి. అలవాటుగా సెక్సు జీవితం సాగించే 'సనాతన సంప్రదాయ పరుల' నీతికి సహృదయులు, సద్గుణపరులు ఆశించే నీతికి తేడా ఈ పుస్తకంలో ప్రస్ఫుటమయింది.

## వంశాంకురం

ఒక భార్య, భర్త వృత్తి రీత్యా వేరు వేరు వూళ్ళలో వుండటం వలన భార్య తన భర్తకు భార్యగా ఇవ్వవలసిన సుఖాలు ఇవ్వటం లేదని తద్వారా పుత్రులు కలుగక పోవటం జరుగుతుందని, పున్నామ నరకం నుండి తనకు విముక్తి లేదని అందువల్ల ఆమెకు విడాకులు ఇవ్వాలని భర్త పెట్టిన విడాకుల కేసులో అతనికి అనుకూలంగా జడ్జి తీర్పు ఇచ్చి ఆమెనుండి విడాకులు ఇప్పించాడు. ఇది మధ్యప్రదేశ్ లో జరిగిన సంఘటన. దీనిని గురించి పత్రికలో చదివిన నాకు ఆ తీర్పు ఇచ్చిన జడ్జి మీద విపరీతమైన కోపం వచ్చింది. ఆ ఆవేశంలోనే "వంశాంకురం' అనే నవలను వ్రాయటం జరిగింది. అసలు బిడ్డను కనాలన్నా వద్దన్నా ఆ హక్కు ఆమెకు వుండాలని, అలాగే గర్భస్రావపు హక్కు కూడా స్త్రీకి విధిగా వుండాలనే స్ఫూర్తి కలిగి వ్రాసిందే ఆ నవల.

పిల్లలను కనడం, కనకపోవడం స్త్రీ యొక్క జన్మహక్కు. ఎవరూ ఈ విషయంలో ఆమెను శాసించరాదు. ఆ మాటకు వస్తే భర్తకు కూడా ఆ హక్కు లేదు. ఆమె దేహం ఆమెది. దాని పై దురాక్రమణ చేయడానికి ఎవరికీ అధికారం వుండరాదు. స్త్రీ, పురుషుల సమ్మతిమీద వారి శారీరక సమ్మేళనం సంభవించటం న్యాయం, ధర్మం కూడాను. ఈ శాశ్వత సత్యాలను "వంశాంకురం" వెలికి తీస్తుంది. ఈ నవలను 'ఆంధ్రభూమి" మాసపత్రిక వారు సీరియల్ గా వేసి రెండువేల రూపాయలు పారితోషికం (Remuneration) ఇచ్చారు.

## చీకటి వెలుగులు

ఒక యువతికి తన చిన్నప్పటి నుండి సంగీతం మీద మక్కువ వుండేది. పుట్టింట్లో

దానిని ప్రోత్సహించారు. కాని పెళ్ళి అయిన తర్వాత భర్తగాని, అత్తమామలు గాని అసలు వీణ వునికినే ఈసడించారు. అన్నింటికన్నా సంగీతంపై ఎక్కువ మక్కువ పెంచుకున్న ఆమెకు అది అశనిఘాతం అయింది. తనకు ఇతరత్రా ఎన్నివున్నా ఈ విషయంగా మానసిక శాంతిలేక భర్తనుండి విడిపోవటానికి సిద్ధపడింది. ఆ విషయం నాకు వ్రాసింది. అది చదివిన నాకు శారీరక హింస కన్నా మానసిక హింసే ఎక్కువ బాధాకరమైనదని, అందువల్ల ఆమె విడిపోవాలని తీసుకున్న నిర్ణయమే సమంజసమని తోచి అలా తీర్పు ఇస్తూ "చీకటి వెలుగులు" అనే నవల వ్రాయటం జరిగింది. ఇది విశ్వరచన మాసపత్రికలో సీరియల్ గా పోతుకూచి సాంబశివరావు గారు ప్రచురించారు. స్త్రీకి శక్తి సామర్థ్యాలు వున్నాయి. నేర్పరితనం, విద్వత్తు ఆమె సంపాదించ గలదు. ఆమెకు తగ్గ ప్రతిభ ఆమెకుంటుంది. ఆమెకి వ్యక్తిత్వముంది. ఆమెను ఇతరులు గుర్తించాలని తన ప్రతిభను ఇతరులకు ఎరుకపరచాలని ఆమె ఆశించడం సహజం అనే అంశాన్ని ఈనవల ప్రస్ఫుటంగా తెలియ జెప్పింది. ఇందులో సరోజ పాత్ర నన్నెంతగానో ముగ్ధురాలిని చేసింది. అణగారిపోయిన, పోతున్న అనేకమంది స్త్రీలకు ఆ పాత్ర ప్రతీకగా నిలిచింది.

## ఈ దేశం నాదేనా?

ఒకనాడు ఒక చెత్తకుండీ దగ్గర కాగితాలు ఏరుకునే కుర్రాడు కనిపించాడు. వాడు చిరిగిన బట్టలతో మాసిన తలతో అతిదీనంగా ఉన్నాడు. ఈ దేశంలో మనలాగే పుట్టిన ఆ బాలునకు కనీసపు అవసరాలైన కూడు, గుడ్డ, గూడు కూడా ఇవ్వలేని మనదేశం గురించి ఆలోచించాను.

ఆ బాలుణ్ణి తలుచుకుంటే హృదయం ద్రవించింది. "ఈదేశం నాదేనా?" అనే చిన్న నవల వ్రాసాను. కటిక దరిద్రంలో అల్లాడే కష్టజీవుల కథే ఆ నవలలోని ఇతివృత్తం.

"దేశంలో దారిద్ర్యాన్ని, దైన్యాన్ని, హేతువాదులు, రాడికల్ హ్యూమనిస్టులు పట్టించుకోరు' అనే అపప్రథ వుంది. ఈ నీలాపనిందను రాజకీయ ప్రత్యర్థులు పనిగట్టుకొని ప్రచారం చేశారు. వాస్తవానికి ఇది అబద్ధమని తెలియ చెప్పడానికి 'ఈదేశం నాదేనా?" అనే నవల ఉపకరిస్తుంది. బహుశః దానిని అందుకే వ్రాశానేమో?

## కాంతి కిరణాలు

వివాహ వ్యవస్థలో ఎన్ని విధాలుగా దాంపత్య జీవితాన్ని గడప వచ్చునో, కలసి ఎలా జీవించవచ్చునో అనే అంశం మీద వ్రాసిన నవలే "కాంతి కిరణాలు". వివాహ వ్యవస్థ వైవిధ్యాన్ని చిత్రీకరించడమే ఈ నవల ఉద్దేశ్యం. సంప్రదాయపు వివాహం, ప్రేమ వివాహం, ప్రయోజనాన్ని ఆశించిన సాహచర్య వివాహం, ఆమాటకు వస్తే వైవాహిక

తంతు లేకుండా కాపురం సాగించే 'విప్లవ వివాహం 'అన్ని రకాలైన వివాహాలు ఈ నవలలో దర్శనమిస్తాయి. ఏది మంచిది, ఏది పనికిరానిది అనే విషయాన్ని చదువరులకే వదలి వేశాను. కాని నా మొగ్గు 'విప్లవ వివాహం' వైపే సాగిందని విజ్ఞులైన పాఠకులు గ్రహించగలరు. అది అందరికీ సాధ్యం కాక పోవచ్చును. ఏదయినా సర్వులకూ అందుబాటులో వుండాల్సినవి ప్రేమ వివాహాలు, సాహచర్య వివాహాలూను. వివాహ వ్యవస్థపై ఈ నవలలో సునిశితమైన సమీక్ష కన్పిస్తుందని నా విశ్వాసం.

## బాలల నవల 'సామ్రాజ్ఞి రుద్రమదేవి'

'సామ్రాజ్ఞి రుద్రమదేవి' అనే బాలల నవలను ఆం.ప్ర. బాల భవన్ వారు 1991లో ముద్రణ చేశారు. కాకతీయ సామ్రాజ్యాన్ని సమర్ధవంతంగా పరిపాలించిన సామ్రాజ్ఞి రుద్రమదేవి చరిత్ర నన్నాకర్షించింది. ఒక స్త్రీ ధైర్య స్థయిర్యాలను పరిపాలనా సమర్థతను గురించి చిన్న పిల్లల్లో ఆలోచన రేకెత్తించే నవల ఇది. స్త్రీలలో సమర్ధులు, దక్షులు వున్నారని రుజువు చేసింది రాణి రుద్రమ. కోటలను కట్టించి, యుద్ధాలు చేసి, సామంతులను సమాదరించి, పరిపాలనా దక్షతను నెలకొల్పి, సాహిత్యాన్ని, కళలను పోషించి, అరివీర భయంకరియై, ఆశ్రిత పక్షపాతియై ప్రజల మన్ననలను పొందిన మహారాణి రుద్రమదేవి మహిళలు సన్మానింప అర్హులని ప్రస్ఫుటంగా ప్రకటించే నవల రుద్రమదేవి. నా ఆదర్శాలకు నమూనాగా నేను రుద్రమదేవిని మనోఫలకంలో చిత్రించుకున్నాను. ఆమె వ్యక్తిత్వ చిత్రణయే ఈ నవల ఇతివృత్తం.

వంశాంకురంలో ముఖ్యపాత్ర నళిని. పిల్లలను ఆమె ఇష్టం వచ్చినప్పుడు కనేటట్లు ఒప్పందానికి అంగీకరించాడు భర్త. తన శాస్త్ర పరిశోధనా జీవితానికి అడ్డు వస్తుందని ఆమె గర్భస్రావం చేసుకొని, ఆవిషయం అతనికి చెప్పవలసిన అవసరం లేక చెప్పకపోతే వాస్తవం తెలియని భర్త తన సంతాన వాంఛను బహిర్గతం చేసే ప్రయత్నంలో ఆమె అనుమతి లేకుండా ఆమె శరీరాన్ని వైద్య పరీక్ష చేయించాడు. అది అవమానంగా ఎంచి విడాకులు పుచ్చుకుంది ఆమె. "చీకటి వెలుగులు" లో భర్త ఆమెను వీణ వాయించనీయక పోతే అదే భర్త మరో స్త్రీ వీణావాదాన్ని మెచ్చుకుంటే, అతడు హింసించ పూనుకుంటే తన ప్రతిభావ్యుత్పత్తుల వికాసం కోసం భర్తకు ఆమె విడాకులిస్తుంది. సుబ్బమ్మ గారు చీటికి మాటికి విడాకులు ప్రోత్సహిస్తుందని ప్రచారం చేయసాగారు కొందరు స్త్రీ పురుషులు. భార్యా భర్తల మధ్య ప్రేమానురాగాలు, సదవగాహన, పరస్పర విశ్వాసం నెలకొనాలని నా మతం. అవి కొరవడి సాగే దాంపత్యాలు దుఃఖభూయిష్టాలు, వాటిని కొనసాగించడం అవివేకమని నా ఆలోచన. ఈ విమర్శలకు తొణకకుండా సాగి పోవడమే నా జీవిత లక్ష్యం.

## మాతృత్వానికి మరో ముడి (కథల సంపుటి)

1. మగవాడి మోసానికి గురి అయి పెళ్ళి కాకుండానే గర్భవతులయిన ఇద్దరు స్నేహితురాళ్ళు పంకజం, మందారం. పంకజం సమాజానికి భయపడి పిరికితనంగా జీవిస్తుంటే, మందారం ధైర్యంగా నిలబడి బిడ్డని కని పెంచటమే కాక పెద్ద ఆఫీసరయి మార్గదర్శకురాలయి నిలిచింది. ఆ స్నేహితురాళ్ళ కథ 'కంటి వెలుగు'.

2. భర్త త్రాగి వచ్చి భార్యను కొట్టటం హింసించడం చేస్తే ఇంతకు ముందులా ఇక పడి వుండరని, అలా చేస్తే మహిళలంతా కలిసి సంఘటితంగా బుద్ధి చెపుతామని స్త్రీలని ఐక్యం చేసి నిరూపించిన సంఘ సేవకురాలు లక్ష్మి కథ. 'కనువిప్పు'.

3. పిల్లల్ని కనే విషయంలో స్త్రీకి హక్కు వుండాలని ఆలస్యంగానైనా గ్రహించి తన కుటుంబ భారాన్ని తగ్గించి భర్తని ఎదిరించి తనలాంటి సమస్యతో బాధపడే ఇతర స్త్రీలకు "వేగుచుక్క' గా నిలిచిన అమూల్య కథ.

4. ధనదాహంలో మునిగిపోయి తన ప్రియురాలినే పోగొట్టుకున్న ఒక డాక్టర్ కథే 'మంట కలిసిన మానవత్వం '.

5. పరాయి స్త్రీ గొప్ప పనిచేస్తే మెచ్చుకున్న భర్తే అదే పని తన భార్య చేస్తే ఈసడిస్తాడు అని నిరూపించిన సగటు భర్త కథ 'మనసెప్పుడూ గుప్పెడే'.

6. భర్తని పోగొట్టుకున్న స్త్రీ వైధవ్యాన్ని భరిస్తూ జీవితాంతం ఇతరులకు దాస్యం చేస్తూ బ్రతకడం కన్నా తన స్వశక్తితో స్వతంత్రంగా జీవించాలని తెలిసే కథే 'పడగ విప్పిన పదో రోజు'.

7. కన్న పిల్లలపై కూడా ఆశ పెంచుకోకుండా తమకు శక్తి వున్నప్పుడే తనకంటూ కొంత ఆస్తిని జాగ్రత్త చేసుకోవాలనే సంకల్పం లేకుంటే కామాక్షమ్మకు పట్టిన గతే పడుతుందని హెచ్చరించే కథే 'జీవిత వలయం'.

8. భార్య వుండగానే మరొక స్త్రీతో సంబంధం పెట్టుకుని, బిడ్డను కూడ కని, పైగా భార్యని కూడా అనుమానించే మగవాడి మనస్తత్వం తెలియజేసే కథ 'దేవుడిచ్చిన పిల్లలు'.

9. ఈ రోజుల్లో ఏదైనా లభిస్తుందేమోగానీ అణకువ, పనితనం, శుభ్రత గల పని మనిషి దొరకడం ఎంత కష్టమో, అలా దొరికితే నిజంగా అదృష్టమని చాటిచెప్పే హాస్యం తొణికిసలాడే కథ "ప్రత్యక్ష దైవం".

10. మనిషిలో చూడవలసింది బాహ్య సౌందర్యాన్ని కాదు మానసిక సౌందర్యాన్ని

అని తెలిపే కథే 'పనికి మాలిన ముత్యం'.

11. కట్టుకున్న భార్యకన్నా ఆస్తికి ఎక్కువ విలువ ఇచ్చిన రామయ్య ఆమె పోయాక 'చివరకి మిగిలిందేమిటి' అని బాధతో నేల కొరిగిన కథ.

12. నిజాయితీ నిక్కచ్చి గల వ్యక్తి సూరి గొప్పింటి స్త్రీ కామదాహాన్ని తీర్చని కారణంగా ప్రాణాలనే కోల్పోయిన కథ 'వైకుంఠపాళి'.

13. స్త్రీ శ్రామికులంతా ఐక్యంగా వుండి పోరాడిన ఫలితంగా సమాన పనికి సమాన వేతనం పొంద గలిగిన కథే 'అందరూ సమానులే'.

14. సంతానం కలగక పోతే లోపమంతా భార్యలోనే వుందని మూర్ఖంగా తలచి ఆమెని చంపి మళ్ళీ పెళ్ళి చేసుకున్న రాజు చివరికి తన లోపం వల్లనే పిల్లలు కలుగలేదని తెలుసుకొని పశ్చాత్తాపంతో కుమిలి పోయే కథే 'మాతృత్వానికి మరో ముడి'.

15. ఆడదాని అందాన్ని చూచి అడుగడుగునా తోడేళ్ళలా పొంచి కాటువేసే మగవాళ్ళని, చివరికి కూతురిని కూడా కామించే మగాడి మనస్తత్వాన్ని తెలియ చేసేకథే 'చెలియలి కట్ట'.

16. భర్త ఎన్ని పెళ్ళిళ్ళయినా చేసుకోవచ్చు గాని భార్య పొరపాటున కన్యగా ఉన్నప్పుడు ఒక మగాడితో మోసపోయినా సహించలేక ఆమెని శాడిస్టుగా నానా హింసలు పెట్టే భర్తకి తగిన విధంగా గుణపాఠం చెప్పిన రాణి కథ 'బొమ్మ పలికింది'.

17. పెద్ద ఆస్తికి, అంతస్తుకి వారసుణ్ణి చేయాలనే అత్యాసతో తల్లి అంగీకారం లేకుండ తండ్రి మగబిడ్డను దత్తు ఇచ్చిన సందర్భంలో తల్లీ బిడ్డల ప్రేమని ధనంతో తూచలేమని చెప్పే కథ 'పూసల పల్లకి'.

18. తన కాముకతకి ఎందరో స్త్రీల శీలాలను హరించిన నీచుడిని చంపి తగిన ప్రతీకారం తీర్చుకున్న చంపాలత కథ 'ప్రతీకార వాంఛ'.

## కథానికలు

నవలకన్న, కథలకన్న కథానికలు రాయటం కష్టతరమైన కార్యం. ఈ ప్రక్రియను కూడ తరచి చూడాలనే తపన నన్ను కథానికలు రాయటానికి ప్రోద్బలం చేసింది.

కథానిక యొక్క పరిధి అత్యల్పం. నిడివి అతి స్వల్పం. నవలలో చిత్రించినట్లు దేశ వాతావరణాన్ని, సామాజిక వాతావరణాన్ని వివరించ వీలుపడదు, కథలో

విశదీకరించినట్లు ఒక సన్నివేశాన్ని, లేక ఒక పాత్రను, లేక ఒక సంఘటనను దర్శనం చేయించే ప్రయత్నానికి ఆస్కారం లేదు. కొద్ది పరిధిలో కథానిక ద్వారా రచయిత చెప్పదలుచుకున్న నీతివాక్యం స్ఫురింప చేయాలి. చదువరులు తేల్చుకోవాల్సిన సమస్యా పరిష్కారాన్ని స్ఫురింపచేయాలి.

సేవా కార్యక్రమాలు ప్రారంభించినప్పటి నుండి, ముఖ్యంగా మహిళోద్యమ కార్యక్రమాన్ని ఎత్తుకున్నప్పటి నుండి, 1984లో వైవాహిక కుటుంబ సలహా కేంద్రాన్ని స్థాపించిన నాటినుండి ఎక్కువగా స్త్రీలకు సలహాలిస్తుండేదాన్ని. అందుచేత స్త్రీల విషాదగాథలను ఎక్కువ సంఖ్యలో వినటం తటస్తించింది. స్త్రీల ఇబ్బందులు, కష్టాలు, బాధలు, ఆవేదనలు, ఆక్రందనలు నాకు చిరపరచితాలు. ఎన్నిరకాలుగా స్త్రీల మీద అత్యాచారాలు సాగుతున్నాయో నాకు విదితమయ్యింది. ప్రతి ఒక్క బాధితురాలి కథ దేనికదే ప్రత్యేకం, విశిష్టం. మొదట్లో వాటిని విన్నప్పుడు అన్నం సహించేది కాదు. దుఃఖం ముంచుకొని వచ్చేది. కాలక్రమేణ మనసు మొద్దుబారిపోయింది. నిర్విణ్ణురాలిని అయిపోయేదాన్ని. కళ్ళవెంట అశ్రువులు రాలేవి కావు. కాగా కళ్ళలో నిప్పులు కురవటం తటస్తించింది. స్త్రీ జాతి పై జరిగే అమానుష దుష్కార్యాలకు నారక్తం ఉడికిపోయేది. మగవాళ్ళ పై తాత్కాలికంగా క్రోధం పుట్టుకొచ్చేది. కాలక్రమేణా ఆలోచనా క్రమంలో దుష్టులయిన మగవారి పై ద్వేషంగా అది మారింది.

నేను వనితా జ్యోతిలో 'వ్యక్తిగత సమస్యలు: సమాధానాలు' అనే శీర్షిక నిర్వహిస్తున్నానని వ్రాశాను కదా! ఆ సందర్భంగా అనేకమంది బాధాసర్ప దష్టులయిన మహిళలు ఉత్తరాలు వ్రాసేవారు. అవి కూడా నాలో పైచెప్పిన భావాలను ప్రకోపింప చేసేవి. ఆ 'కాలం'లో సమాధానాలు వ్రాసేటప్పుడు ఉత్తరాలు రాసిన వారి పేర్లు, ఊర్లు మార్చి రాయటం అలవాటు. అది ఆ శీర్షిక నిర్వహణకు అత్యవసరం.

చాలమంది విద్యావంతులయిన వనితలు సహితం "మా వారు నన్నెప్పుడూ ఏమీ అనలేదు, నావద్దకు వచ్చి ఏ స్త్రీ తను భర్తవల్ల కష్టపడుతున్నానని చెప్పలేదు" అనేవారు. మీరు అదృష్టవంతులు. ఆమాటకు వస్తే రామ్మూర్తిగారూ నన్ను కష్ట పెట్టలేదు. ఇది మీవారు మావారు వీరికి మాత్రమే సంబంధించిన సమస్య కాదు. మగజాతికి, అందులో ముఖ్యంగా ఎక్కువమందికి వర్తించే విషయం. మీవారు మావారు సగటు పురుషులకు నమూనాలు కారు" అని సమాధానం చెప్పేదాన్ని. అంతటితో ఆగక "నేను మహిళలకు సలహాలు ఇస్తానని బోర్డు పెట్టాను కనుక నావద్దకు అవమానితులైన అతివలు అనేకమంది వస్తారు. మీ దగ్గరకు రాకపోవడంలో ఆశ్చర్యం లేదు" అని సగౌరవంగా జవాబు చెప్పేదాన్ని. ఇదంతా ఎందుకు చెప్పాల్సి వస్తున్నదంటే స్త్రీల దుఃఖమయ జీవితాలు నాకు బాగా తెలుసునని చెప్పటానికి. ఈ మహిళల గాథలను మహిళాలోకానికి తెలియజేస్తే మహిళల్లో జాగృతి, చైతన్యం ఉద్భవిస్తాయని ఆశతో నేను కొన్ని విషాద గాథలను

ప్రచురించాను. ఆ పుస్తకం చదివితే యువతీ సమూహాలలోనయినా సమస్య అవగాహన పెరుగుతుందని నా ఆశ. ఈ యధార్ధ గాధలు కాంతల కళ్ళు తెరిపించాలని నా ఆకాంక్ష,

## నా రేడియో నాటకం 'మంట కలిసిన మానవత్వం'

అందంతోపాటు చదువు సంస్కారంగల సుగుణాల రాసి అయిన డా॥ పావని తెలివి, చురుకుతనంగల డా॥ రవి చిన్ననాటి స్నేహితులే కాదు మెడిసిన్ దాకా క్లాసుమేట్సు. ఇద్దరికి ఒకరిపై ఒకరికి మహా ప్రేమ. ఆ ప్రేమ పెళ్ళిదాకా దారితీసింది. కానీ ఈ లోగా ఒక సంఘటన జరిగింది. పావని మెడిసిన్ లో యూనివర్సిటీ ఫస్టు వచ్చింది. గోల్డు మెడల్ తీసుకుని కారు డ్రయివ్ చేసుకుని వస్తుండగా దారిలో ఆమెకు 'అపెండీసైటిస్' నొప్పివచ్చి తట్టుకోలేని స్థితిలో కారు చెట్టుకు కొట్టుకోగా స్పృహ కోల్పోయింది. బాటసారులు ఆమెను ప్రక్కనే వున్న హాస్పిటల్ కు తీసుకెళ్ళారు. అది డా॥ రవి నర్శింగు హెూము. వెంటనే నర్సు వచ్చి పేషెంటును చూచి ఆపరేషన్ కు ముందుగా వెయ్యి రూపాయలు చెల్లిస్తేనే 'అడ్మిట్ చేస్తాను. లేకపోతే తీసుకెళ్ళి పోండి. ఇది మా డాక్టరుగారి ఆజ్ఞ" అని చెప్పి వెళ్ళింది. ఆగంతకులు ఆమె పరిస్థితికి బాధపడి మరో హాస్పటల్ లో చేరుద్దామనుకుంటూ ఆమెను చేతులతో పైకి ఎత్తుతూ గుప్పిడి లాగారు. అందులో నుంచి బయటపడ్డది యూనివర్శిటీ వారిచ్చిన గోల్డు మెడల్. వారి ముఖాలు వికసించి ఆస్పత్రిలోకి పరుగెత్తుకొని వెళ్ళి "నర్సమ్మా ! ఈ బంగారు పతకం మీ డాక్టరుకిచ్చి ఆపరేషన్ చేయించమ్మా" అన్నారు.

ఆ మెడల్ ని త్రిప్పి చూచిన రవి "పావనీ!" అంటూ ఆపరేషన్ బల్లమీద నెత్తురు కక్కుతూ ప్రాణం విడుస్తున్న ఆమె మీద వాలిపోయాడు. రవి గొప్ప పేరు ప్రఖ్యాతులు, నిపుణతగల శస్త్ర వైద్యుడు. కానీ అతని ప్రాణానికి, డబ్బుకు లంకె. కేవలం డబ్బు కోసం ఏ గడ్డి అయినా తింటాడు. దయాధర్మాలు అతనిలో శూన్యం. పావని ఈ విషయంలో అతన్ని మారమని ఎన్నోసార్లు మొత్తుకున్నది. ముందు వైద్యం, తరువాత మన వృత్తి ధర్మం అని ప్రబోధించినా వినకుండా తన ప్రాణంలో ప్రాణమైన తన పావనిని పోగొట్టుకున్నానని దుఃఖంతో ఆమె శవం పై పడి కుళ్ళి కుళ్ళి ఏడ్చాడు.

ఈ కథను నాటకీకరణ చేసి హైదరాబాద్ రేడియో వారికి పంపాను. ప్రసారం చేశారు. మరో రెండు మూడు మాసాలకు పునః ప్రసారం చేశారు. కథ, సంభాషణలు, ఉచ్చారణ చాలా బాగున్నాయని అత్యధిక స్థాయిలో శ్రోతల నుండి ఉత్తరాలు వచ్చాయి.

చీకటి వెలుగులు' అనే చిన్న నవల నాటకీకరణ చేయబడింది. దానిని ఆలిండియా రేడియో వారు ఆమోదించారు. దానిని ప్రసారాల జాబితాలో వేశారు. ప్రసారం చేస్తున్నామని వార్త వచ్చింది.

# ఇతర సారస్వత కృషి

## ప్రజాస్వామ్య ప్రచురణలు:

రాడికల్ హ్యూమనిజం ఒక తాత్విక ధోరణి. రాడికల్ హ్యూమనిస్టు సిద్ధాంతం సమగ్రమైనది. దానికి ఒక విశిష్టమైన ప్రాపంచిక దృక్పథం వున్నది. శాస్త్రీయ దృష్టిని ఆదరిస్తుంది, శాస్త్రీయ వైఖరిని అలవరచుకోమని ఉద్బోధిస్తుంది. హేతువాదం, వ్యక్తివాదం, మానవవాదం దీనికి త్రిరత్నాలు. హేతువాద నీతి దీనికి ఆలంబనం. లౌకికత దీని లక్షణం. ఈ తత్వాన్ని భారతదేశంలో ప్రతిపాదించిన వాడు ఎమ్.ఎన్. రాయ్. అతడు దానిని నవ్యమానవవాదమని, శాస్త్రీయ మానవవాదమని, సమగ్ర మానవవాదమని అభివర్ణించాడు.

రాడికల్ హ్యూమనిస్టులమైన నేను, రామ్మూర్తిగారు – ఇద్దరం కలిసి ఒక ప్రచురణ సంస్థను నెలకొల్పి ఉద్యమానికి కావలసిన సారస్వతాన్ని సృష్టి చేయాలనుకున్నాము. ఉద్యమమిత్రులు సర్వశ్రీ కోగంటి రాధాకృష్ణమూర్తి, గురజాల సీతారామయ్య, గుంటుపల్లి గోపాలరావు, కొల్లా సుబ్బారావు గార్లతో సంప్రదించాం. పై నలుగురిలో మొదటి ముగ్గురున్నూ, ఎం.వి.ఆర్., నేనూ డైరెక్టర్లుగా 1974లో ప్రజాస్వామ్య ప్రచురణలు (ప్రై) లిమిటెడ్ అనే కంపెనీ వెలిసింది. దానికి 1974 నుండి చాలా కాలం నేను మేనేజింగ్ డైరెక్టర్ గా వున్నాను. దీని తరఫున గ్రంధాలను ప్రచురించాం. నవ్యమానవవాదం, హేతువాదం, నాస్తికత్వం, మహిళా సమస్యలు వీటిపై పుస్తకాలు అచ్చువేయటం జరిగింది. ఈ కంపెనీ తరఫున 'మనం దేనికి బానిసలం' 'తల్లే పిల్లను చంపితే', ''విముక్తి ఉద్యమాలు: మహనీయులు' అనే నా చిన్న గ్రంధాలు ప్రచురితమయినాయి. ఈ మూడు కలిసి 'ఆధునిక స్త్రీ' అనే పేరుతో పెద్ద గ్రంధంగా వెలువడింది.

ప్రజాస్వామ్య ప్రచురణలు ఒక విశిష్ఠ తాత్విక ఉద్యమంలో ఒక ప్రయత్నం. ఇలాంటి ప్రయత్నాలను ఇతర సిద్ధాంతాల వారు కూడా చేస్తున్నారు. కొందరికి అంగబలం వుంటే మరికొందరికి ధన సంపత్తి నిండుగా వుంది. అంగబలం, ధనబలం, సాధన సంపత్తిలేని రాడికల్ హ్యూమనిస్టులు ఇలాంటి ప్రయత్నం చేయడం అతి సాహసం కావచ్చును గాని దుస్సాహసం మాత్రం కాదు.

కొంత కాలమైన తరువాత 'మల్లాది పబ్లికేషన్సు' అనే పేరుతో ఒక స్వంత సంస్థను నెలకొల్పి నా పుస్తకాలు కొన్నింటిని ముద్రించడం జరిగింది. ఈ సంస్థ తరఫున 'స్త్రీల పై అత్యాచారాలు' 'స్త్రీల హక్కులు, సమస్యలు' 'మతధర్మ శాసనాలు', అట్రాసిటీస్ ఆన్ వుమెన్ ''వంశాంకురం, 'హేతువాదం: స్త్రీలు' 'మనం : మన సంస్కృతి', 'లైంగిక విప్లవం', 'వుమెన్స లిబరేషన్' మొదలగు పుస్తకాలు ప్రచరితమయినాయి.

## సెమినార్ల పత్రాల ప్రచురణలు

మహిళాభ్యుదయ సంస్థ, అభ్యుదయ వివాహ వేదిక, స్త్రీ విమోచన అనే సంఘాల తరఫున వివిధ సమస్యల పై సెమినార్లు జరిగాయి. వాటిలో పాల్గొనువారి పరిశోధనా పత్రాలను ఏఏ సెమినార్ కు సంబంధించినవో వాటిని కలిపి గ్రంధంగా ప్రకటించడం మా పద్ధతి. ఇలా ఆయా సంకలనాల పేర్లు ఆయా సంస్థల శీర్షికల క్రింద వివరించబడినాయి.

## చిన్న పుస్తకాలు

స్త్రీ విమోచన కార్యక్రమం క్రింద గ్రామీణ మహిళా సంఘాల కార్యకర్తలకు శిక్షణ ఇస్తున్నాం. వారికి ప్రాధమిక, మాధ్యమిక తరగతులను నిర్వహిస్తున్నాం. ఆ ఉపన్యాస సారాలను వారు మరచిపోకుండా చదివే నిమిత్తం వారికి, 20, 30 పేజీలకు మించకుండా 40 చిన్న పుస్తకాలను ప్రచురించాం. వాటి వివరణ స్త్రీ విమోచన కార్యక్రమాలలో వస్తుంది.

మల్లాది సుబ్బమ్మ టస్టువారు నా పుస్తకాలను అచ్చువేశారు. వీటిపై హక్కులను ఆ ధర్మ సంస్థకు నేను దత్తం చేశాను. నా ఆత్మకథ కూడా ఆ సం స్టే ప్రింటు చేసింది.

## నా సాహిత్యానికి కేంద్రం స్త్రీ

మనసులో పుట్టేది ఆవేదన. మండే గుండెల్లోంచి వచ్చేది తపన. అసమానత్వం పై కలిగేది భావోద్రేకం. వీటిని కలపోసి రచించిన సాహిత్యం కావ్య రూపం తాలుస్తుంది. ఉద్వేగం పొందిన వ్యక్తి బహిర్గతం చేయకుండా వుండలేడు. అంటే నెలలు నిండాక అది సమయమా కాదా అని ఆలోచించకుండా దూసుకుంటూ వచ్చి పడుతుంది పిల్ల. ఒక్క క్షణం కూడా ఆగదు. అలా ఆగితే ఆ తల్లి పిల్లా ఇద్దరూ దక్కరు. అలాంటిదే కవిత్వం అనండి, రచన అనండి, మరోటి అనండి. ఉద్వేగం కలిగితే కవిత్వం ఉప్పొంగి పెల్లుబికి కట్టలు తెగి ప్రవహిస్తుంది. నా సాహిత్యానికి కవితారీతులు లేకపోవచ్చు. "నీ నీడలోనే మేడ కడతా నాయుడు బావ' అంటుంది ఎంకి. అందులో ఏముందీ! దాని భావాలే పడికట్టు రాళ్ళయి అవి శరపరంపరగా దూసుకుపోతాయి. వాటిని ఎవరూ ఆపలేరు. అలాంటిదే నా సాహిత్యం. పండితులు మెచ్చకపోవచ్చు. పామరులకు అర్ధం కాకపోవచ్చు, సనాతనులకు వెగటు కావచ్చు. అయినా నా సాహిత్యానికి అమరత్వం వుంది. అది సమాజంలో ఘనీభవించి వున్న కుళ్ళును బహిర్గతం చేస్తుంది. సగభాగమైన స్త్రీ జాతి నిర్వీర్యతను త్రోసి రాజంటుంది. వారి ఆర్తనాదాలకు భాష్యం చెబుతుంది. అంతో ఇంతో ఉపశమనం ఇస్తుంది. అది చాలదా? అంతకన్నా మనం కోరేది ఏముంటుంది? అసలు సామాజిక దృక్పథం లేని సాహిత్యం పది కాలాలపాటు

మనజాలదు. పాత్రల్ని, సన్నివేశాలను ఊహించినా, కల్పించినా వాటిని జీవితమంత సహజంగా చిత్రించగలగాలి. పాఠకులకి సహజత్వం గోచరించాలి. అదే సిసలయిన సాహిత్యం.

నా సాహిత్యానికి డిగ్రీల కొలమానం లేదు. రీసెర్చి స్థాయిని అందుకోలేదు. కానీ ఈనాడు ఆంధ్రప్రదేశ్ లో ఫెమినిజం మీద పరిశోధన చేసే విద్యార్థులు నా పుస్తకాలు కొనక తప్పడం లేదు. నాతో చర్చించడానికి వస్తామని నాకు వ్రాసి వస్తూ వుంటారు. ఎందుకూ అంటే అది జీవితానుభవంతో మథించి వ్రాసినది కనుక. వాస్తవమైనవి కనుక. అలా వ్రాయని రచన రచన కాదు. దానికి ఏ విలువా వుండదు. వివిధ రకాల కళా ప్రక్రియలలో సాహిత్యానికి జన సామాన్యంలో చెరగని ముద్రవేసే లక్షణం వున్నది. కాబట్టి దీని ద్వారా స్త్రీ సమస్యలను వెలికి తెచ్చి మహిళా ప్రగతికి మార్గాన్ని చూపెట్టే ఉద్దేశ్యంతో ఈ క్రియను చేపట్టాను. నా పుస్తకాలు చదివితే కుటుంబశాంతి నశిస్తుందని, ఆడపిల్లలు పెళ్ళిళ్ళు చేసుకోరని వితండవాదులు ఎంత దుష్ప్రచారం చేసినా వాటి ఉనికికి ముప్పు లేదనే విశ్వాసం నాకుంది. ప్రతి స్త్రీ కన్నీరే నా కలం గుండా ప్రవహించి అక్షర రూపం దాలుస్తుంది. కనుక నేను చచ్చిపోయినా నా సాహిత్యం చావదు. ఈనాడు నన్ను వ్యతిరేకించేవారు కూడా నా భావాలను మన్నించక తప్పడం లేదు. అందువల్ల ఎప్పటికైనా నా ఈ సాహిత్యం ఇతోధికంగా మన్ననలను పొందక తప్పదు.

ఇప్పటికి 50 పుస్తకాలు, 40 కరపత్రాలు ప్రచురించానంటే స్త్రీల సమస్యల గురించి హృదయం ద్రవించి మండుతున్న గుండెతోనే ఆ పనిచేసాను. వారి బాధలు నా బాధలయి కూర్చున్నాయి. అందువల్ల ఒక మేధావి నా గురించి వ్రాస్తూ "సుబ్బమ్మ గారు చెప్పే వరకు స్త్రీలకు ఇన్ని బాధలు, సమస్యలు వున్నాయని మాకు తెలియదు. స్త్రీల సమస్యల పై ఆమె ఒక 'ఎన్‌సైక్లోపీడియా' రాసేలా వున్నారని అన్నాడు. నిజంగానే అందులో ఆవేదన వుంది. ఆర్తి వుంది. స్త్రీ విమోచన భావం వుంది. విముక్తికి భావం వుంది. బాధా సర్పదష్టులకు బాధోపశమనం కలిగే విధానాలు, పరిష్కార మార్గాలు వున్నాయి. ఈ తరహా సాహిత్యం ఆంధ్రలో తగినంతగా లేనేలేదని మనందరికీ తెలుసు. లక్ష రూపాయలకు పైగా ఖర్చు పెట్టి ముద్రించిన ఈ పుస్తకాలలో నా పంచ ప్రాణాలు వున్నాయి. అంతో, ఇంతో శ్రమపడి లక్షకు పైగా అమ్ముకోగలిగానంటే నా శక్తికి నేనే అచ్చురువు పొందుతున్నా. ఇది ఆత్మస్తుతి కాదు. నా పట్టుదలకు నిదర్శనం, ఆ సాహిత్యపు 'డిమాండుకు' చిహ్నం.

సాహిత్యం నాకు 'హాబీ' కాదు. భావ వ్యాప్తికి సాహిత్యం ఒక సాధనమైతే, ఆత్మకథ ద్వారా పదునైన భావాలను భావిపౌరులకు అందివ్వాలనే తాపత్రయం, ఆకాంక్ష నన్ను ఆ దశకు లాక్కెళ్ళాయి. నా కథల వెనుక, రచనల వెనుక సామాజిక అవగాహన, స్త్రీల అసహాయత నిండి నిబిడీకృతమై వుంటాయి. మంచి సాహిత్యం రావటం లేదంటారు.

వస్తే కొనేవారూ, చదివేవారూ దొరకడం దుర్లభంగా వుంది. లైబ్రరీల లిస్టులో వున్నా గ్రంథాలయాల వారు కొనడం కూడా అపురూపమే.

నా సాహిత్యంలో కొన్ని సార్వకాలికాలు వున్నాయి. కనీసం వాటిని ఇంగ్లీషులోకి తర్జుమా చెయ్యమని మిత్రులు కోరినప్పుడు వాటిని రామ్మూర్తిగారు అనువదించగా ఢిల్లీలోని అఖిల భారత మహిళా సంఘంవారు, స్టెర్లింగ్ పబ్లిషర్సు, ఇండియన్ ఎథీస్టు పబ్లిషర్సు ఇంకా అజంతా పబ్లిషర్సు వారు ప్రింటు చేశారు. తెలుగు అకాడమీ వారు జనరంజకమైన పుస్తకం స్త్రీ జీవితాన్ని గురించి రాయమని కాంట్రాక్టు పంపారు. వ్రాత ప్రతిని పంపాను. అనతికాలంలో ముద్రింపబడుతుంది. నా వ్యాసాలు గ్రంథరూపంలో వచ్చాయి. వాటిని గురించి ముచ్చటించాను. వీటిని కలిపి 'ఆధునిక స్త్రీ' పేరుతో 1980లో ప్రచురించాను. ఆ పుస్తక ముద్రణ ప్రేరణకు (ఐ.సి.ఎస్.ఎస్.ఆర్) హైదరాబాద్ శాఖకు ఆనాడు డిప్యూటీ డైరెక్టర్ గా వున్న శ్రీ పి. సత్యనారాయణ ముఖ్యులు. దానికి ఆనాటి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఆవుల సాంబశివరావుగారు ముందుమాట వ్రాయగా ప్రసిద్ధ మేధావి నార్ల వెంకటేశ్వరరావుగారు శుభాకాంక్షలు తెలిపారు. పలువురు ప్రోత్సహించారు.

నేను మత సమాజాలను స్త్రీ పరంగా విశ్లేషిస్తూ 'హైందవం: స్త్రీలు', 'ఇస్లాం : స్త్రీలు', 'క్రైస్తవం: స్త్రీలు' అనే గ్రంథాలు వ్రాశాను. 'ఇస్లాం : స్త్రీలు'న్ హైందవం : స్త్రీలు' ఆంగ్లంలోకి ఎం.వి.ఆర్. అనువాదాలుగా అచ్చుఅయినాయి. ఆం.ప్ర. మహిళోద్యమ చరిత్ర ప్రధానంగా ఆంధ్రప్రదేశ్ స్త్రీల ఉద్యమానికి సంబంధించినది. దీనిని కూడా ఎం.వి.ఆర్. ఇంగ్లీషులోకి అనువాదం చేశారు. ప్రింటు కాబోతున్నది. కుటుంబ సలహా కేంద్రానికి వచ్చిన వారి గాథలలో కొన్నింటిని 'విషాద గాథలు'గా ఒక పుస్తకం వేశాను. 'వనితా జ్యోతి' లో నేను వ్రాసిన 'వ్యక్తిగత సమస్యలు : సమాధానాలు' వీటిని సంకలనం చేసి 'వ్యక్తిగత సమస్యలు : సమాధానాలు' అనే పేరుతో పుస్తక రూపంగా ప్రచురించాను. ఇలా నా ప్రసిద్ధ గ్రంథాలన్నింట స్త్రీ మాత్రమే నా సాహిత్యానికి కేంద్రం అయింది.

## నా భావాల రూపమే నా సాహిత్యం : అదే నా అత్మకథా రూపం

నా జీవిత చరిత్ర రచనలో నా భావాలు, లక్ష్యాలు, ఆదర్శాలు నా అనుమతి లేకుండానే ప్రవేశించాయి. నా కలం అలా లాక్కెడుతోంది. అందులో నిత్య సత్యాలెన్నో వుంటాయి. కొందరిని అవి బాధించవచ్చు. నాకు మాత్రం దురుద్దేశం లేదు. నా రచనలో పురుష నింద, స్త్రీ దాస్యం గోచరిస్తూనే వుంటుంది. అది పూర్తిగా పురుష జాతిని ద్వేషించటం కాదు. హెచ్చు శాతం మంచిని, చెడును వివరించి దానిని సూత్రీకరించి కథను నడిపించడమే రచయిత ధ్యేయం. కాని ఎవరినీ ఉద్దేశించి కాదని పాఠకులు గ్రహించాలి. అసలు మంచిచెడుల ప్రసక్తి వచ్చినప్పుడు ఏ వ్యక్తి నూరుపాళ్ళు చెడుకాని

మంచి కాని అయి వుండడు. భారత కథలోని ధర్మరాజులో లోపాలు, దుర్యోధనుడిలో మంచి లక్షణాలు కాదనలేనివి వున్నా అతడు ధర్మాత్ముడు, ఇతడు దుష్టాత్ముడు అని ఎలా అంటున్నామో అలాగే దరహం మీద స్త్రీలు బాధితులు, పురుషులు బాధించే వారు అని అనాల్సివస్తోంది. కనుక నేను పురుష ద్వేషిని, స్త్రీ పక్షపాతిని అని భావించకండి. సమాజపు తీరు తెన్నులు గత నలభై ఏళ్ళుగా పరిశీలిస్తున్నాను. కనుక నాది అనుభవ జ్ఞానం. కాని అర్ధజ్ఞానం మాత్రం కాదు. ఇక నా విషయంలో నేను బాధితురాలినని చాలా మందికి అనుమానం. ఆనాటి సంప్రదాయ బలిమివల్ల కూపస్థ మండూకాన్ని అయ్యాను గాని, పురుషాధిపత్యం, యాజమాన్యం నన్ను అంతగా బాధించలేదు. సంస్కర్త ఎప్పుడూ తన గురించినదాని కన్నా లోకాన్ని తిలకించి, లోపాలను గ్రహించి, బాధలకు ద్రవించి ఆ బాధా సర్పదష్టుల కన్నీరు. తుడిచి పన్నీరు చల్లటానికి తన సర్వశక్తులూ వాడి తన తోటి వారినీ, సమాజాన్నీ ఉత్తేజపరుస్తుంది. “మా కొద్దీ తెల్ల దొరతనం’ అనే ఒక్క కలం పోటుతో వేల భారతీయులను కార్యరంగంలోకి దింపగల శక్తి కలానికి వుంది. కత్తి కంటే కలం గొప్పదనేది సత్యం. అలాగే మాటలకు విలువ, పదాలకు పాటవం, ఉపన్యాసాలకు ఉత్తేజశక్తి, వ్యాసాలకు ప్రేరక స్వభావం ఉన్నాయి.

అది కథకాని, ఆత్మకథ కొని, నవల కాని, నాటకం కొని మరేదయినా రచయిత నమ్మిన సత్యాలు, లక్ష్యాలు, ఆదర్శాలు దూసుకుంటూ వచ్చి పడతాయి. ఉదాహరణకు కొంతమంది “గోళ్ళు, జుట్టు ఎక్కడుండాలో అక్కడ వుంటేనే వాటికి అందం. కత్తిరిస్తే వాటి ఉనికే పోతుంది. అలాగే స్త్రీలు ఆ లక్ష్మణ రేఖను దాటివస్తే చాలా ప్రమాదం” అంటూ వుంటారు. స్త్రీలంటే రూట్సు (Roots) అవి ఏ నాటికీ పైకి రావు. పైనున్న వృక్షాలకే పంట వుంటుంది” అని స్త్రీని హీనంగా చిత్రిస్తారు. మరి నాబోటివారి రచనలకు వారి సాహిత్యానికి హస్తిమశకాంతర భేదం వుంటుంది. ఏదయినా ఎవరి స్వేచ్ఛ వారిది. ఎవరి దారులు వారివి. అన్నీ చదివిన పాఠకులదే తుది తీర్పు.

# భాగం – VI
# సంస్థల నిర్మాణం

# 1. నాంది

## హైదరాబాద్ రాక : అభివృద్ధి పథకాలు

'మళ్ళీ అరెస్టు, జైలు తప్పదు కదా! ఈలోగా హైదరాబాద్ వెడితే అక్కడ రెండు జైళ్ళు వున్నాయి కదా అక్కడ జైల్లో పెడితే నేను చూచి రావడం తేలిక. ఊళ్ళోనే అయితే ఏ బస్సులోనో వెళ్ళి రావచ్చు' అని నిశ్చయించాం. హైదరాబాద్ లో మాకు ఒక సొంత ఇల్లు వుంది. 1961లో మా పెద్దబ్బాయి హైదరాబాదులో ఉషా కంపెనీలో వున్నాడని హౌసింగ్ బోర్డు ఇల్లు ఒకటి మెహిదీపట్నంలో కొన్నాం. అది ఏనాడూ మేము చూడనూ లేదు, అందులో వుండనూ లేదు. దానిని ఖాళీ చేయించాం. ఆ నెలాఖరుకు అంటే తెల్లారితే 1-1-1977 తేదీన హైదరాబాద్ చేరుకున్నాం. పనిమనిషి లేదు. ఇల్లంతా చిందరవందర, బోలెడంత సామాను, ఎలాగో సర్దు కున్నాం. ఏరోజు జైలుకెళ్ళి పోతారో అని హడలి పోతుండగా ఒకరోజు మళ్ళా సార్వత్రిక ఎన్నికలనే వార్త వచ్చింది. "హమ్మయ్యా!' అంటూ పెద్ద నిట్టూర్పు విడిచాను.

ఎలాగయినా జనతా పార్టీని గెలిపించాలని సర్వశక్తులూ ధారపోసి, ఇంటింటికి తిరిగి, మనిషి మనిషికీ పరిపాలనలో జరుగుతున్న అవకతవకలు, లంచగొండితనం, కల్తీలు, ఆశ్రిత పక్షపాతం గురించి చెప్పటానికి నానా కష్టాలు పడి రాత్రింబవళ్ళు పనిచేశాము. జనతాపార్టీని గెలిపించుకున్నాం. కాంగ్రెసు అపజయం, జనతాపార్టీ విజయం జరిగి దేశమంతా బంధ విముక్తి పొందింది. లేకపోతే రామ్మూర్తిగారు ఆజన్మాంతం ఖైదీ. కావాల్సి వచ్చేది. రామ్మూర్తిగారి జైలు కథ అలా సుఖాంతమయింది. లేకుంటే నా ఉద్యమాలతోపాటు, నేనూ అణగారి పోయేదాన్ని. అలా మొదట్లో భక్షించిన ఇందిరమ్మ మళ్ళీ రక్షించి మా కుటుంబాన్ని నిలిపి నా ఉద్యమాలకు నా జీవితానికి ఊపిరి ఇచ్చి నన్నొక మనిషిగా బ్రతకనిచ్చింది. అంటే జైలుశిక్ష తప్పదని వచ్చిన మాకు శిక్ష తప్పి అభివృద్ధి పథకాల పైపు పయనించే అవకాశం కలిగింది. రాజధాని కనుక ఇక్కడ నా కార్యక్రమాలకు విశాల పరిధి కలిగింది. ఎన్నో అవకాశాలు, మరెన్నో పరిచయాలు ఇంకెంతో విజ్ఞానం పెంపొందించుకోగల అవకాశం కలిగింది. విశాలమైన ఇల్లు, స్థలం వుండటాన నా కార్యక్రమాల పరిధి పెరిగింది.

అలా 1976 అర్ధరాత్రి హైదరాబాద్ రాక నాకు ఎంతో వుపకరించింది. నాటి నుండి నేటివరకు ఎడతెరిపి లేని కార్యక్రమాలు, ఉద్యమాల స్థాపన, సాహిత్య స్రవంతి, మహిళా పత్రిక నిర్వహణ సాగింది. టి.వి. రేడియోలలో కార్యక్రమాలకు 'మోడరేటర్' గా వుండి ఎన్నో జరిపించాను. ఇతరుల అహ్వానాలు, ఇలా ఒకటేమిటి ఎన్నో అనేకానేకం నన్ను ఒక మహిళోద్యమ కార్యకర్తగా తీర్చిదిద్దాయి. నన్ను ఒక అసాధారణ వ్యక్తిగా మలిచాయి అంటే అతిశయోక్తి కాదు. ఇదొక అపూర్వ అనుభవం. అనిర్వచనీయానందం.

గౌతమ బుద్ధునకు జ్ఞానోదయం అయినట్లు, నేనూ ఒకనాటి చీకటినుండి వెలుగులోకి అడుగు పెట్టాను. అయినా నా జీవితంలో ఈ జ్ఞానోదయం ఒక శాతం మాత్రమే. కాని ఇంకా 99 శాతం మిగిలివుందని నాకు తెలుసు. అందువల్ల నా ఈ హైదరాబాదు రాక నా ఉజ్వల భవిష్యత్తుకొక నాంది మాత్రమే కాని ముగింపుకాదని నా మనస్సాక్షిగా చెప్పుకుంటున్నాను.

## వికాస కేంద్ర స్థాపన

అది నాకొక అనిర్వచనీయమైన అనుభూతి అని చెప్పక తప్పదు. అదొక మహావృక్షం. దాని నీడలో పెరుగుతున్నాయి పదిమంది పిల్లలు. 1977లో వికాస కేంద్ర స్థాపన జరిగింది. హైదరాబాదు స్వంత ఇంట్లో చేరగానే ఈ ఇల్లూ, ఆ వాకిలీ చూస్తే అది నాకొక పెన్నిధిలా గోచరించాయి. ఇంక ముందు సభలకు, సమావేశాలకు, సెమినార్లకు, శిక్షణా తరగతులకు బైట అద్దె చెల్లించాల్సిన పనిలేదని, ఈ ప్రాంగణమే నా కార్యరంగానికి కేంద్రమని అనిపించింది. ఆ వెంటనే ఇంటికి ముందున్న 150 గజాల స్థలంలో ఒక పెద్ద షెడ్డు వేయించి దానికి వికాస కేంద్రమని పేరు పెట్టి అక్కడే గత 15 ఏళ్ళుగా నా కార్యక్రమాలన్నీ నడిపిస్తున్నా. అదొక ఆశ్రమంగా నాకు గోచరిస్తూ వుంటుంది. దానికి ఒక మైకు, వంద కుర్చీలు, కెమేరా, టేపు రికార్డరు క్రమంగా అన్నీ ఏర్పరిచాను. కేంద్రంలో జరిగే మీటింగులకు పెళ్ళిళ్లకు 200 మంది వచ్చిన రోజులున్నాయి. 40 మంది వచ్చిన రోజులూ వున్నాయి. ఎంత మంది అని కాదు, ఎలా జరుగుతున్నాయి, ఏ విధమైన పనులు జరుగుతున్నాయి అనేది ముఖ్యం. ఈ కేంద్రంలో ముమ్మందుగా 1980 జూన్ లో పుట్టిన నా తొలిబిడ్డ పేరు మహిళా అభ్యుదయ సంస్థ. అది నాటికీ నేటికీ జ్వాజ్వల్య మానంగా వెలిగిపోతుంది. అంటే అది నా తొలి బిడ్డ కనుక నా ఆలోచనలకు రూపకల్పన చేస్తున్న ఆ ముద్దు బిడ్డమీద నాకు ఎనలేని మక్కువ. నా పంచప్రాణాలు అందులోనే వున్నాయి. బైటికి వెళ్ళేటప్పుడల్లా వెనక్కు తిరిగిచూస్తూ పోతా. రాగానే మళ్ళీ చూసుకుంటూ తన్మయత్వం పొందుతూ వుంటా. ఈ పదేళ్ళల్లో వికాస కేంద్రం మరికొన్ని సంస్థలను సృష్టించింది. అంటే నా సృష్టికి అనుసృష్టి జరిగిందన్న మాట. మనం కన్న పిల్లలు దిన దిన – ప్రవర్ధమానమవుతుంటే ఆ తల్లికి కలిగే ఆనందం ఎవరు వర్ణించగలరు? ఎలా చెప్పగలరు? అది నా సృష్టి కనుక నేనందులో లీనమయి వుంటాను.

ఇక్కడొక మధురానుభూతికి మీరు భాగస్వాములు కాక తప్పదు. పదిమంది పిల్లలూ కేరింతలు కొడుతూ నాకు అనుక్షణం దర్శనమిస్తూ వుంటాయి. నేను కన్న పిల్లలు రెక్కలొచ్చాక ఎగిరి పొయ్యారు. వాళ్ళు జీవితంలో స్థిరపడ్డారు. వాళ్ళ కాళ్ళ మీద వాళ్ళు నిలబడ్డారు. కాని ఈ నా ఉద్యమ పిల్లలకు రెక్కలొచ్చి ఎగిరి పోలేవు.

వాటికి పుట్టుక, అభివృద్ధి వుంది కాని వార్ధక్యం, చరమ దశ లేవు. ఎవరో ఒకరు వాటిని నాలా కని పెట్టుకొని వుండాలి. లేకపోతే వాటి వునికికే ప్రమాదం రావచ్చు. అందువల్ల వాటి రక్షణకు, అభివృద్ధికి ఎవరో ఒకరు వచ్చి ఉద్ధరిస్తారు అనే విశ్వాసం నాకు వుంది. కారణం అవి నా స్వార్థం కోసం సృష్టించినవి కావు కనుకనే, అవి పరహితార్థం కొరకు సృష్టింపబడ్డవి కనుకనే.

నా సర్వ సంస్థలకు ఇది వికాసాన్ని కలిగించే ఒక కేంద్రం. అంటే ఇక్కడ నెలకొన్న సంస్థలకు ఆశ్రయం ఇచ్చే ఒక కల్పతరువు. అంతేకాక ముఖ్యంగా చెప్పాలంటే ఇక్కడ పుట్టిన వివిధ సంస్థల ద్వారా మానవ వ్యక్తిత్వాన్నే వికసింపచేస్తుంది. చైతన్యవంతం లేక అర్థవంతం చేస్తుంది. కనుకనే దానికి వికాస కేంద్రం అని నామకరణం చేశాను.

## 2. మహిళాభ్యుదయ సంస్థ : దాని శాఖలు

మహిళాభ్యుదయ సంస్థ ఆవిర్భావానికి నాంది అభ్యుదయ మహిళా సమాఖ్య. ఈ సమాఖ్య 1979లో కూరగాయల ఎగుమతి నిషేధం కావాలని ఆందోళన చేపట్టింది. ఆందోళన ఫలించింది. నేను దానికి అప్పుడు అధ్యక్షురాలిని. ఇంక పత్రికలన్నీ నన్ను విపరీతంగా పొగిడాయి. మృణాల్ గోరేను బాంబేలో 'పానీవాలీ' అంటారు. అలాగే నన్ను ఆంధ్రా 'పానీవాలీ' అని పొగిడారు. నా పై ప్రజలు చూపిన ఈ గౌరవాన్ని, పేరు ప్రఖ్యాతులను నాతో కలిసి పనిచేసిన నా సహకార్యకర్త భరించలేక బాధపడి నన్ను సూటిగా అడిగేసింది. అందరం కలిసి పనిచేశాం నీకే పేరంతా ఎందుకు రావాలి అంటూ వ్యధ పడి పోయింది. అప్పుడు నావద్ద 20 వేల రూ॥ లు వున్నాయి. ఆ డబ్బుకూడా ఈ సమాఖ్యకే ఇచ్చి దీని ద్వారా ఇంకా హెచ్చు స్థాయిలో పని చేద్దామనుకున్న దాన్ని ఆమె మాటలు విన్నాక వీరితో కలిసి పనిచేయడం అసంభవమని అంతటితో విరిమించు కున్నాను. ఆ తర్వాత ఆ డబ్బుతో నా పేర ఒక ట్రస్టు పెట్టాను. అలా ప్రబోధం, ఆందోళన, నిర్మాణాల (ఎడ్యుకేషన్, ఎజిటేషన్, ఆర్గనైజేషను) ద్వారా మహిళోద్యమాన్ని సాధిద్దామను కున్న నా కొండంత ఆశ సన్నగిల్లి పోయింది. ఇంక అంతటితో నా ఆందోళనా కార్యక్రమాలకు స్వస్తి పలికాను. కాని ఎడ్యుకేషన్ (ప్రబోధం), ఆర్గనైజేషన్ (నిర్మాణం)ల ద్వారా సంఘటితపరచి పనిచేయటం జరుగుతున్నది. అందుకు సంస్థల నిర్మాణం అవసరమయింది.

అప్పుడు బాగా వయసున్నది. శక్తి సామర్థ్యాలు, దార్ఢ్యం ఉన్నాయి. బాపట్ల ఇల్లు అమ్మిన 40 వేలు ధనం వున్నది. అన్నిటి కన్నా కొండంత సహాయ సహకారాలిచ్చే నా భర్త అండదండలు న్నాయి. ఇంతకాలం ఇతరులతో కలిసి పనిచేయటం తప్ప నేనుగా సంస్థలు స్థాపించలేని నా అసహాయతకు బాధపడి, వ్యధచెంది 1980 జూన్ లో "మహిళాభ్యుదయ సంస్థ"ను స్థాపించి వెంటనే రిజిష్టరు చేశాను. 'ఇన్ స్టిట్యూట్' పద్ధతిలో దాని నిర్మాణం జరిగింది. మహిళాభ్యుద యాన్ని ఆకాంక్షించే పురుషులకు కూడా అందులో సభ్యత్వం కల్పించి దాని 'బైలాస్' వ్రాయటం జరిగింది. పది ఏళ్ళుగా అదొక మహా వృక్షంలా పెరిగి ఎన్నో కార్యక్రమాలు జరిపి మరో పది సంస్థల పుట్టుకకు సాయపడి తాను ఉన్నత స్థానాన్ని అలంకరించింది. చిరకాలపు నా కోర్కెను నెరవేర్చింది.

స్త్రీల సమస్యలు, వరకట్న మరణాలు రోజురోజుకూ పెరుగుతున్నాయేకాని తరగటం లేదు. బాల్య వివాహాలు, బహుభార్యాత్వం, వేశ్యావృత్తి, వైధవ్య పీడనం, సతీ సహగమనం, విద్యావిహీనత, ఉద్యోగలేమి ఇవన్నీ ఆనాటి సమస్యలయితే ఈనాడు మానభంగాలు, వరకట్న మరణాలు, హత్యలు, ఆత్మహత్యలు, భార్యల పై హింసలు సమస్యలు. ఉద్యోగినులకు సైతం ఆర్థిక భద్రత లేదు. రాజకీయ ప్రాతినిధ్యం అత్యల్పం. స్వేచ్ఛా సమానత్వాలు స్త్రీకి దూరమ య్యాయి. అవి సంస్కరించటం దుస్సాధ్యమైనా

అసాధ్యం మాత్రం కాదు. బాధితులే బంధ విముక్తులయి పోరాడినప్పుడు, వారు కడదాకా ధైర్యంతో నిలిచినప్పుడు, వారిలో ఐక్యత కలిగినప్పుడు మాత్రమే ఆ సమస్యలు చక్కబడతాయి. దానికి తగిన చైతన్యం, జాగృతి స్త్రీలలో వుండాలి. ఆ రకమైన ఆలోచనా, ఆవేదనా, ఉద్వేగం స్త్రీలలో కలిగించడానికే స్థాపించబడిన ఈ మహిళాభ్యుదయ సంస్థ గత పదేళ్ళుగా వైవిధ్యంతో కూడిన స్త్రీ జనాభ్యుదయానికి సర్వవిధాలా తోడ్పడుతోంది. స్త్రీలలో నిర్భీతి, నిజాయితీ, ఆలోచనా ధోరణి కలిగించే మార్గాలను ప్రబోధిస్తోంది ఈ సంస్థ. అందుకే దీనిని 'ఇన్ స్టిట్యూట్ ఫర్ ఎడ్వాన్సుమెంట్ ఆఫ్ ఉమెన్' అని ఇంగ్లీషులో వ్యవహరిస్తున్నాం.

కార్యనిర్వాహక వర్గ సభ్యులలో మూడవ వంతుకు మించకుండా పురుషులకు కూడా ప్రవేశాన్ని కలుగ జేశింది ఈ సంస్థే. మహిళా సంఘం అంటే మహిళలే మెంబర్సుగా వుంటారు. కాని స్త్రీ జానాభ్యుదయానికి సేవచేసే పురుషులు కూడా ఈ సంస్థలో చేరవచ్చని, వారి సహాయ సహకారాలు కూడా స్వీకరించవచ్చుననే అభిప్రాయంతో దీనికి మహిళాభ్యుదయ సంస్థ అని పేరు పెట్టడం సంభవించింది. స్త్రీ, పురుషులిద్దరూ కలిసి స్త్రీ పురోభివృద్ధిని స్థాపిస్తేనే దానికి ఒక విలువ, హోదా వుంటుందని అలా చేశాను. పురుషులలో కూడా స్త్రీకి స్వేచ్ఛ కావాలని కోరేవారు వున్నారని, వారిని గౌరవించాలని, వారి సేవలను విస్మరించరాదని నా వాదన. ఇది గత పది ఏళ్ళుగా సెమినార్లు, చర్చా వేదికలు, సభలు, సమావేశాలు, వర్కుషాపులలాంటి ఎన్నో కార్యక్రమాలను నిర్వహించి మహిళోద్యమానికి, నాకు ఎనలేని గౌరవాన్ని తెచ్చి పెట్టింది. 13 నవంబరు 1990లో ఈ సంస్థ దశాబ్ది ఉత్సవాలు ఘనంగా జరిగాయి.

## స్వరూపం

మహిళాభ్యుదయ సంస్థ ఫెడరల్ సంస్థ కాదు. దానికి గౌరవ సభ్యులు, పోషకులు, జీవిత సభ్యులు, సాధారణ సభ్యులు అని నాలుగు తెగల సభ్యులు వున్నారు. ఒక్కసారిగా గానీ రెండుసార్లుగా గానీ 500 రూ॥ మొత్తం చెల్లించిన వారు పోషకులు. 100 రూ॥ లు చెల్లించినవారు జీవిత సభ్యులు, సంవత్సరానికి 5 రూపాయలకు తక్కువ లేకుండా చెల్లించేవారు సాధారణ సభ్యులు. మహిళోద్యమానికి ఏ రీతిగా నైనా సేవచేసేవారిని, ఉద్యమానికి వన్నె తెచ్చేవారిని సంవత్సరానికి ఇద్దరిని మించకుండా గౌరవ సభ్యులుగా చేర్చుకోవచ్చును.

పోషకులు, గౌరవ సభ్యులు విధిగా కార్యనిర్వాహక వర్గ సభ్యులుగా వుంటారు. జీవిత సభ్యుల్లో నుండి విధిగా ఇద్దరిని కార్యనిర్వాహకవర్గ సభ్యులుగా ఎన్నుకుంటారు. ఈ రకపు నిర్మాణం వల్ల సంస్థ అభ్యుదయంలో బలమైన ఆసక్తి గలవారు కార్యభారం వహించడానికి అవకాశం వుంది.

## ముఖ్య కార్యక్రమాలు

మహిళోద్యమానికి సేవచేసిన, బలపరచిన లేక నాంది పలికిన ప్రముఖుల జన్మదినోత్సవాలను జరిపించడం ఆనవాయితీ. కందుకూరి, సరోజినీ నాయుడు, దుర్గాబాయ్ దేశ్ ముఖ్, అంబేడ్కర్ లాంటి మహనీయుల జన్మదినోత్సవాలను ప్రతి ఏటా చేస్తూ వున్నాం.

'స్త్రీల హోదా' పైన (1980), 'స్త్రీల భద్రత' అనే అంశం పై (1981), 'స్త్రీలు : ఉద్యోగం' అనే విషయంపై (1984) సెమినార్లు నిర్వహించాం. సెమినారు పరిశోధనా పత్రాలు 'మహిళా వికాసం : శ్రమ ఉద్యోగం' అనే పేరుతో గ్రంథరూపంగా ప్రచురించాం.

1981లో మత పరమైన అల్లర్లు జరిగినప్పుడు అవి జరిగిన ప్రాంతాలలో ప్రజల భావనలు, అభిప్రాయాలు, వైఖరులు వీటిని గురించి సర్వే చేసి నివేదిక సమర్పించాం. 1981 లోనే మత కలహాల పై రచయితలను జాగృతం చేసి సమీకరించాలనే ఉద్దేశ్యంతో తెలుగు, ఉర్దూ, హిందీ, కన్నడ, మరాఠీ, ఆంగ్ల రచయితల సమావేశాన్ని ఏర్పాటు చేశాం. అప్పుడు అరవై మంది రచయితలు సభకు వచ్చారు. అందులో 40 మంది తమ ఆందోళనను వెలిబుచ్చుతూ ప్రసంగించారు. 1983లో హిందూ వివాహ శాసనపు సవరణమీద అభిప్రాయ సేకరణకై పార్లమెంటు సభ్యులతో కూడిన కమిటీ హైదరాబాదు వచ్చింది. వివాహరథం కుంటు పడితే విడాకులు ఇవ్వవలెనా అక్కర్లేదా అనే ప్రశ్న మీద పౌరుల సాక్ష్య సేకరణకు ఆ కమిటీ పూనుకున్నది. నేను ఎం.వి.ఆర్ సాక్ష్యం చెప్పాం. పార్లమెంటరీ సెలక్టు కమిటీ సవరణకు అనుకూలంగా సిఫారసు చేసింది. ఐనా ఆనాటి పార్లమెంటు సవరణను ఆమోదించలేదు. 1984లో హిందూ వారసత్వ చట్టానికి ఎన్.టి.ఆర్ మంత్రివర్గం సవరణ ప్రతిపాదించింది. సమిష్టి హిందూ కుటుంబ ఆస్తిలో కుమార్తెలకు కూడా జన్మతః హక్కు ఏర్పరచాలని దాని ఉద్దేశ్యం. ఆం.ప్ర. శాసనసభ బిల్లు ప్రవేశానికి అంగీకరించి సెలెక్టు కమిటీకి పంపింది. ఆ శాసన సభ్యుల కమిటీ ప్రజాభిప్రాయాన్ని తెలుసుకోడానికి ఆం.ప్ర.లో పలు ప్రాంతాలలో పర్యటించింది. హైదరాబాదులో ఆ శాసన సభ్యుల కమిటీ ముందు నేను, ఎం.వి.ఆర్. సాక్ష్యం చెప్పాం. ఆడ బిడ్డల ఆక్రందన ఎన్.టి.ఆర్ కు వినబడుతున్నది కానీ భార్యల బాధ ఆయనకి తెలియటం లేదని అన్నాము. అంటే చనిపోయిన అతనికి వస్తుందనుకున్న వాటాలో సగం భార్యకు చెందేలా చేసి మిగతాది మాత్రమే వారసులకు చెందేలా చేయాలని మా భావం. ఇంత స్పష్టంగా న్యాయమయిన ప్రతిపాదన చేసినా సెలక్టు కమిటీ దీన్ని ఆమోదించలేదు. మా ప్రతిపాదనను జత పరచకుండానే మొదట్లో అనుకున్న విధంగానే బిల్లు పాసు అయ్యింది.

స్త్రీలకు ముప్ఫై శాతం ఉద్యోగాలివ్వాలనే దానిమీద చర్చచేసి ఎన్.టి.ఆర్ ప్రభుత్వ

ప్రతిపాదనను సమర్థించాం. ఉస్మానియా విశ్వవిద్యాలయం వారితో, ఐ.సి.ఎస్.ఎస్.ఆర్ వారితో మహిళాభ్యుదయ సంస్థ సహకరించి స్త్రీల సాహిత్యం మీద సెమినారు నిర్వహించింది. దాని ప్రారంభ సమావేశానికి నేను అధ్యక్షత వహించాను. స్త్రీలకు సంబంధించిన అనేక విషయాలమీద ఉపన్యాసాలిప్పించాం. అభిప్రాయ వేదికలు నిర్వహించాం. చర్చాగోష్టులు జరిపాం.

స్త్రీ సేవలో గణుతికెక్కిన నారీ శిరోమణులకు సన్మానాలు చేశాం. గౌరవ డాక్టరేటు వచ్చిన సందర్భంగా వాసిరెడ్డి సీతాదేవి గారికి, ఆంధ్ర సాహిత్య ఎకాడమీ అవార్డు వచ్చిన తరుణంలో సి. వేదవతి గారికి, లైనెస్ జిల్లా సంఘానికి గవర్నరైన సమయంలో ఎన్. శోభారెడ్డి గారికి సన్మానాలు చేశాం. ఊటుకూరి లక్ష్మీకాంతమ్మ, తురగా జానకీరాణి, బాదం సరోజాదేవిగార్లను సన్మానించాం. సేవా రంగంలోని వృద్ధ స్త్రీలను ఇతరులతో కలిసి గౌరవించాం. పుస్తకావిష్కర ణలు జరిపాం.

మహిళాభ్యుదయ సంస్థ నడిపే కుటుంబసలహా కేంద్రం గురించి ప్రపంచ విఖ్యాత 'విన్ 'త్రైమాసిక పత్రిక (Women's internation Net Work NEWS) ప్రస్తావించింది. ఇండియాలో జరిగే వరకట్న మరణాల కేసులను సంస్థ నివేదిస్తే ప్రచురించేది. ఈ పత్రిక ప్రపంచ మహిళా సంస్థలన్నింటికి పోతుంది. వ్యాపార ప్రకటనలు లేకుండా 80 పుటలతో రాయల్ సైజులో ప్రకటితమవుతున్నది. ప్రపంచ స్త్రీల స్థితిగతుల బహువిధ భోగట్టా ఎంతో దీంట్లో ఉంటున్నది. మన సంస్థ యీ పత్రికవారితో సంబంధం పెట్టుకోవడం వల్ల ఎంతో ప్రయోజనం పొందింది.

ఆమ్నెస్టీ ఇంటర్ నేషనల్ ఇండియా శాఖ మాజీ అధ్యక్షుడు, 'విజిల్ ఇండియా' ఉద్యమ అధినేత ఎం.ఎ. థామస్ మహిళాభ్యుదయ సంస్థను దర్శించి, ఇచ్చటి కార్యకలాపాలను గురించి తెలుసుకొని సంస్థకు భారీగా విరాళమిచ్చి సంస్థను ప్రోత్సహించారు.

బొంబాయిలోని హ్యూమనిస్టు రేషనలిస్టు ట్రస్టు స్థాపకులు శ్రీ దేవదేఖర్ తన ధర్మ సంస్థ నిధులనుండి మహిళాభ్యుదయ సంస్థకు ప్రతియేటా విరాళం ఇస్తున్నారు.

ఇలా ఎన్నో కార్యక్రమాలు చేపట్టి కృషి చేస్తున్నది మహిళాభ్యుదయ సంస్థ. 1986 నుండి తన అంతర్భాగమయిన 'స్త్రీ విమోచన'తో కలసి కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతోంది. అలాగే ఇతర సంస్థల సహకారంతో మరికొన్ని కార్యక్రమాలను చేపట్టింది.

## అర్బన్ బేస్డ్ సర్వీసెస్ ఫర్ ది పూర్

ఈ ప్రాజెక్టును హమాలీ బస్తీ (జియాబాగ్)లో యూనిసెఫ్ వారి ఆర్థిక సహాయంతో, మా సభ్యుల కృషితో స్థాపించి, అక్కడి మహిళలను కలిపి 'జియాబాగ్ ఇరుగు పొరుగు

మండలి' (నైబర్ హుడ్ కమిటి) అనే పేరు పెట్టి రిజిష్టరు చేశాం. అక్కడ 200 కుటుంబాలను సర్వేచేసి వారి ఆర్థిక పరిస్థితిని, సామాజిక హోదాను గుర్తించి వారిని వారే ఉద్ధరించుకునేటట్లు వారిని సంసిద్ధులను చేయాలనే ఉద్దేశ్యముతో ఈ సంఘం ఏర్పాటు చేశాం. సభలద్వారా, శిక్షణా తరగతుల ద్వారా హెల్తు ఎడ్యుకేషన్, ఇతర సంక్షేమ కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం.

## వయోజన విద్యా కేంద్రం

గత రెండేళ్ళుగా దత్తాత్రేయ కాలనీలో వయోజన విద్యా కేంద్రాన్ని స్థాపించి క్లాసులు నిర్వహిస్తున్నాం. ఇటీవల అక్షరజ్యోతి అనే పేరుతో దేశమంతటా అక్షరాస్యతను వృద్ధి చేస్తున్నారు. ఆ సందర్భంగా మేము కూడా ఇద్దరు వాలంటీర్లకు శిక్షణ ఇప్పించి జనవాడలో, జియాబాగ్ లో వారిని అక్షరాస్యులుగా చేస్తున్నాం.

## కుట్టు సెంటర్

మున్సిపాలిటీవారి సహకారంతో 8 కాలనీలకు కలిపి 30 మందికి ఒక కుట్టు సెంటరు స్థాపించి (గత సంవత్సరంగా) నిర్వహిస్తున్నాం. ట్రైనీస్ ను కుట్టు పరీక్షలకు పంపటానికి తయారు చేస్తున్నాం. మహిళాభ్యుదయ సంస్థ స్థాపించినప్పటి నుండి శ్రీమతి మమతాలక్ష్మన్న ఉపాధ్యక్షురాలిగా తరువాత అధ్యక్షురాలిగా, శ్రీమతి సి. శేషారత్నం కోశాధికారిగా, శ్రీమతి వాసిరెడ్డి కాశీరత్నం కార్యదర్శిగా సర్వశ్రీ తిపిరినేని వెంకటేశ్వరరావు, ఎన్. కె. ఆచార్యలు కార్యనిర్వా హక సభ్యులుగా సంస్థను బలపరిచారు. ఈనాడు కె. అన్నపూర్ణమ్మ అధ్యక్షులుగాను డి. చంద్రమతి కోశాధికారిగాను విశేషంగా అండదండలందిస్తున్నారు. ఏబది మందికి పైగా జీవిత సభ్యులున్నారు. సుమారు 80మంది సభ్యుల సహాయ సహకారాలతో పుర స్త్రీల తోడ్పాటుతో సంస్థ మూడుపువ్వులు ఆరు కాయలుగా విలసిల్లుతున్నది.

## కుటుంబ సలహా కేంద్ర స్థాపన

జీవిత సుడిగుండలో మునిగిపోయి సమస్యల విషవలయంలో చిక్కుకొని, మానసిక క్షోభకు గురి అయి బైట పడలేక ఆత్మహత్యే గత్యంతరం అనే నిర్ణయానికి వచ్చినవారు, తనను కన్నవారికి, తను కన్నవారికి, తనవారికి దూరమయినవారు, దారి, తెన్ను, గమ్యం లేనివారు, నిరాధార నిరాశ నిస్పృహలతో నిస్తేజితులైనవారు, ముఖ్యంగా భర్తృ తిరస్కృతులు, పెళ్ళికాని తల్లులు, అవమానితులు, ఇతరత్రా బాధితులు, ఇంకా రకరకాలయిన చిత్ర హింసల పాలయిన అనేకమంది స్త్రీలు నిత్యం ఈ కేంద్రానికి వస్తూవుంటారు. వారికి అనేక రకాల సహాయాలను, సలహాలను అందించి సమస్యలకు పరిష్కార మార్గాన్ని చూపించడం మన అవశ్య కర్తవ్యము అనే ధ్యేయంతో కుటుంబ

పరమైన తగాదాలకు, సమస్యలకు సలహాలు ఇవ్వటానికి 1971 నుండి కృషి చేస్తున్నాను. తరువాత చేసే కృషి సంస్థా గతంగా జరిపిస్తే మరింత సమర్థవంతంగా చేయగలనని భావించి 1984లో 'వైవాహిక కుటుంబ సలహా కేంద్రం' అనే సంస్థను స్థాపించి రిజిష్టరు చేశాను. దాంతో ఇతరుల అండదండలు అందాయి. 1989 మార్చి నుండి కేంద్ర ప్రభుత్వం సహాయం చేస్తానని ముందుకొచ్చింది. ఇప్పటివరకు స్వచ్ఛంద సేవకుల సాయంతో నడిచిన కేంద్రం ఇకనుండి ప్రత్యేక శిక్షణ పొందిన సంఘ సేవిక, సలహాదారులతో సమర్థవంతంగా నడుస్తున్నది. దానికొక ప్రత్యేకమైన కార్యాలయం, సిబ్బంది ఒన గూడాయి.

సమాజంలో ఆడవారికి జరుగుతున్న అన్యాయాలను, అత్యాచారాలను అరికట్టి, వారి జీవితాలకు కొంత వెలుగు ఇవ్వటానికి ఈ కేంద్రం తోడ్పడుతోంది. ప్రప్రధమంగా బాధితుల గాధలు విని వారికి మనశ్శాంతి కల్పించడం, ఆ తర్వాత భర్తను పిలిపించి సమాలోచనలు జరపటం, పరిస్థితులు అనుకూలిస్తే కలిపి కాపురం చేయించటం, వక్రీకరిస్తే కోర్టు ద్వారా సంస్కరించటం ఈ కేంద్రం ద్వారా జరిపిస్తున్నాం. ఇందులో ముఖ్యంగా రామ్మూర్తిగారి శ్రమ వర్ణనాతీతం. వారు గంటల తరబడి బాధితుల బాధామయ గాధలు విని, రోదన స్థితి చూచి ఎన్నో విధాలుగా యోచించి తమ తుది సలహా ఇచ్చి అమూల్యమైన సేవల ద్వారా ఉపశమనాన్ని కలిగిస్తున్నారు. అనుభవజ్ఞులైన లాయరు కావటంవల్ల కొన్ని కేసులలో చట్టం ద్వారా విడాకులు, భరణం లాంటివి ఇప్పించి పరిష్కరిస్తున్నారు. వైవిధ్యంతో కూడిన కేసులు కొన్ని ఈ సందర్భంగా చెప్పాలనిపిస్తున్నది..

కుటుంబ సలహా కేంద్రానికొచ్చేవారి కథలు చాలా విషాద భరితాలుగా వుంటాయి. ఒక చక్కని అమ్మాయి రమ. ఆమె భర్త సూత్రం తెంపి దానికి బదులు ఇదే తాడని సిగరెట్టుతో మెడ చుట్టూ కాల్చాడు. ఒక ఉద్యోగిని భర్త మళ్ళీ పెళ్ళాడి కూతుర్ని, తల్లిని గెంటేశాడు. ఒక టీచర్ని భర్త పెళ్ళికి ముందు సంపాదించిన డబ్బు లెక్క చెప్పలేదని రోజూ వేధిస్తూనే వున్నాడు. తనతో లేచి వచ్చిన ఆమె మరొకరితో పోదని నమ్మకమేమిటని ఒక భర్త పిల్లను లాక్కొని తల్లిని గెంటేశాడు. ఇలా చెప్పాలంటే వందలు, వేల సంఖ్యలో వుంటాయి కేసులు. ఇప్పటికి ఇలాంటి కేసులు వైవిధ్యంతో కూడినవి 800 పైగా రిజిష్టరయి వున్నాయి. అందులో కొన్ని కేసులు తీసుకొని వాటిని విషాద గాధలుగా వ్రాసి పుస్తకరూపంలో 'ప్రింటు' చేశాను. అవి చదివితే అలాంటి కిరాతకాలు ఏవ్యక్తి చెయ్యడని ఆ గాధలను వెలికి తెచ్చాను.

ఈ సలహా కేంద్రం తరఫున సెక్సును గురించిన శాస్త్రీయ పరిజ్ఞానాన్ని యువతీ యువకులకు అందిస్తున్నాం. 'వైవాహిక కుటుంబ సలహా' అనే ఒక చిన్న పుస్తకం, 'కుటుంబ కలహాలు – సలహా సంప్రదింపులు' అనే పుస్తకం మొదటి భాగం, రెండవ భాగంగా ప్రచురించాం. 'బుక్ లెట్సు' వచ్చాయి. ఈ కేంద్రం బాగా పనిచేస్తున్నదని

ప్రకటించటానికి నాకు ఎంతో సంతోషంగా వుంది. ఒక్క బాధితురాలి కన్నీరు కాస్త తగ్గించినా నా జన్మ సార్థకమయినట్లే, కేంద్ర స్థాపన సఫలీకృత మయినట్లే. ఈ కేంద్రానికి మొదటినుండి డా॥ సౌభాగ్యవల్లిగారు, నేను, రామ్మూర్తి గారు సలహా సంఘంలో వుంటూ వున్నాం.

## సుబ్బమ్మ షెల్టరు

నా ఉపన్యాసాలను విన్నవారు, నా రచనలు చదువుతున్న వారు, నా కార్యక్రమాలు చూస్తున్నవారిలో కొందరు నా పై సదభిప్రాయాన్ని పెంచుకున్నారు. భరించనలవికాని బాధలు పడేవారు కొందరు మున్ముందుగా తెలియజేయకుండా నా వద్దకు హడావుడిగా వస్తూ వుంటారు. అలాంటి ఒకటి రెండు సంఘటనలు నన్ను ఈ షెల్టరు స్థాపనకు కార్యోన్ముఖురాలిని చేశాయి. ఒకరోజు రాత్రి ఒక చంటిపిల్ల తల్లి వచ్చి తలుపు తట్టింది. ఆమె వాలకం చూస్తే అతి ఆందోళనకరంగా వున్నది. ఆదుర్దాపడుతోంది. వెర్రి చూపులతో పన్ను ఎగాదిగా చూచింది. తన్ను ఎవరో తరుముతున్నట్లు వెనక్కు చూస్తోంది. అయినా ధైర్యం చేసి లోనికి రానిచ్చా. వెంటనే తలుపు గడియ వేసింది. మరొకళ్ళు నా స్థానంలో వుంటే ఆమె ఒక హంతకురాలుగా వణికి పోయేవారే! ఒక గంట స్థిమిత పడ్డాక తనరాక గురించి చెప్తుంటే నా కాళ్ళక్రింద భూమి కదిలిపోయింది.

ఆమె రెండు ఎం.డి. డిగ్రీలున్న ఒక పెద్ద డాక్టరు. ఆమె భర్త ఎయిర్ ఫోర్స్లో పెద్ద ఇంజనీరు. ఒకనాడు అతనికి 105 డిగ్రీల జ్వరం వచ్చిందని, ఒక్క గంటలో తగ్గించకపోతే చంపేస్తానని అరిచాడట. వెంటనే తగ్గలేదనే కోపంతో పిస్తోలు పట్టుకొని లేచాడట. ఆ మత్తులో నిజంగా కాలుస్తాడనే ఆందోళనతో ఇంజక్షన్ తెస్తున్నాననే నెపంతో ఉయ్యాలలోని పిల్లను చంకనేసుకొని పరిగెత్తుకుంటూ తెలిసిన వాళ్ళింటికెళ్ళిందట. వాళ్ళు "నిన్ను రానిస్తే మా కుటుంబాన్ని నీమగడు కాల్చేస్తాడు "అని నా పేరు చెప్పి పొమ్మన్నారట. ఒక 30 రూ॥ లు తీసుకొని ఆటో ఎక్కి నా దగ్గరకొచ్చింది. అతనికి త్రాగుడు, హింసించటం లాంటి అవలక్షణాలన్నీ ఉన్నాయని ఎప్పుడో అప్పుడు కాల్చేస్తాడని ఆమెకు తెలుసు. అలా పరిగెత్తుకొచ్చిన మధుమతిని నాలుగు రోజులుంచి ఆమె తమ్ముడికి ఫోను చేసి పంపగలిగాను.

అలాంటిదే మరో కథ. లీల ఒక డాక్టరు. ఆమెకు 6 నెలలు నిండాయి. ఒకనాడు నా ఆశ్రమానికొచ్చింది. తండ్రి పేరుపొందిన పెద్ద డాక్టరు, ధనవంతుడు. తల్లీ, అమ్మమ్మ మెడలు వంచి మేనమామకిచ్చి పెళ్ళి చేశారు. అతనికి లేని వ్యసనం లేదు. చివరికి అమెరికా వెళ్ళి అక్కడొక లేడీని పెళ్ళాడి కాపురం పెట్టాడు. ఇండియా వచ్చినప్పుడల్లా లీలతో కాపురం. ఇది సహించలేక పోయింది లీల. ఈమాటు వెళ్ళేటప్పుడు లీలతో చెప్పకుండా అమెరికా వెళ్ళి అక్కడే వుండిపోతానని తన తల్లిదండ్రులకు చెప్పి

వెళ్ళిపోయాడు. వాళ్ళు మాత్రం పిల్లను కని తమకు సేవ చేస్తూ ఆస్తి తీసుకోమని తనను బలవంత పెట్టారని, తన తండ్రి ఆ కడుపు తీసేయించి మళ్ళీ పెళ్ళి చేస్తానని చాలా పట్టుపట్టాడని చెప్తూ భోరున ఏడ్చింది. ఇంక పారిపోయిరావటానికి బలమైన కారణం చెప్పింది. ఒక పెద్ద వ్యాపారస్తునితో తన పెళ్ళి కుదిర్చిన తండ్రి తనకు బలవంతంగా గర్భస్రావం చేయించటానికి మంచానికి కట్టేసి మత్తు కల్పించే నిమిత్తం ఇంజక్షన్ ఇచ్చాడట. ఇంతలో తండ్రి మరో కేసు చూడటానికి వెళ్ళినప్పుడు డ్యూటీ డాక్టరును బ్రతిమిలాడి మేడదిగి రిక్షా ఎక్కి పారిపోయి స్టేషనులో రెండు రోజులు వుండి చేతి బంగారు గాజు అమ్ముకొని హైదరాబాదు చేరానని చెప్పింది. ఎందుకలా చేశావమ్మా అంటే తనింక జీవితంలో పెళ్ళాడనని, కడుపు తీయించుకోనని, తనకంటూ ఒక తోడు కావాలని, అందువల్ల ఆ బిడ్డ తనకు కావాలని చెప్పి కాస్తంత సాయం చెయ్యమని కోరింది. మా మేడమీద 2 రోజులు ఆమెను దాచి మా ఇంటి ఎదుట ఒక క్లినిక్కులో ఉద్యోగం మాట్లాడి “నీకేమీ భయం లేదు. హాస్పటల్లో పురుడు పోసుకో. తర్వాత ఎలాగైనా బ్రతకవచ్చు” అని ధైర్యం చెప్పాను.

అప్పటినుండి బాధితులకు తాత్కాలిక వసతి కలిగించటం నేను నిర్వహిస్తున్న కార్యక్రమాలలో ముఖ్య భాగమనిపించింది. అదే ధ్యేయంతో స్థాపించిన తాత్కాలిక వసతి ‘సుబ్బమ్మ షెల్టర్’, ఆడవారి సమస్యలు ఈనాటివి కావు. అవి అనాదిగా వారిని వెంటాడుతున్నా బైటికి చెప్పుకునే ధైర్యం వారికి ఆనాడు లేదు. నేడు అనేక స్వచ్ఛంద సంస్థలు ఇస్తున్న సహకారంవల్ల ఈనాటి స్త్రీలు ముందుకు వచ్చి తమ సమస్యలు పరిష్కరించుకోగలుగుతున్నారు. స్త్రీల సామాజిక వికాసానికి తోడ్పడగల స్వచ్ఛంద సంస్థల అండదండలు ఈనాడు చాలా అవసరం. ఆ దృష్టితో అంతో ఇంతో సహాయం చేసి, దారిచూపి ఆ ఆర్తులకు కొండంత ధైర్యం కలిగించి వారి ప్రాణమానాలను రక్షించటానికి స్థాపించబడిందే ఈ షెల్టరు. అర్ధరాత్రి, అపరరాత్రి ఆశ్రయాన్ని అర్థించేవారికి కాస్తంత రక్షణ ఇస్తుంది ఈ ‘హోము’. ఆ తర్వాత వారి సమస్యలు చక్కబడితే మళ్ళీ కుటుంబ జీవితాన్ని స్వీకరించవచ్చు. లేదా మూడు ఏళ్ళు ఉంచుకునే స్టేటు హోమ్ కు, లేక సర్వీసు హోముకు లేక ప్రయివేటు శరణాలయానికి పంపడం జరుగుతుంది. అంటే ఈ తాత్కాలిక నివాసం కోసం మా అవుట్ హవుసును ఈ షెల్టరు కొరకు ఇచ్చాను. రౌడీల బారినుండి, కోపోద్రిక్తులయిన భర్తలనుండి బయటికొచ్చిన వారికి, వెళ్ళగొట్టబడిన వారికి ఇక్కడ తాత్కాలికంగా ఆశ్రయం లభిస్తుంది. నిరాశ్రయులకు కాస్తంత గాలి పీల్చుకునే అవకాశం కల్పించటానికి ఈ సుబ్బమ్మ షెల్టరు ఉపకరిస్తుంది.

## వరకట్న హింసల దర్యాప్తు సంఘం

నేను, స్త్రీ శక్తి సంఘటన వారు వరకట్న నిరసన ఉద్యమంలో కలిసి పనిచేశాం. నాటి నుండి నేటివరకు వరకట్న హత్యలు, హింసలు, ఇతర నేరాలను గురించి బాధిత

స్త్రీలు, వారి తల్లిదండ్రులు నావద్దకు రానటం పెరిగింది. నేరస్తులను శిక్షింపజేయటానికి అవసరమైన సలహాలను, సూచనలను అందించే దాన్ని. ఫిర్యాదు చేసేవారు చాలా కేసులో చాలా ఆలశ్యంగా వచ్చేవారు. ఈలోగా ఆ కేసులలో నిందితులు శిక్షనుండి తప్పించుకొని పారిపోయేవారు. వరకట్నం పెండ్లి అప్పుడుగాని, ముందుగాని, తర్వాతగాని తీసుకోవడం నేరం. వివాహమయిన దర్మిలా ఇతోధికంగా వరకట్నం తెమ్మని భార్యను పోరు పెట్టడం, హింసించడం, చంప ప్రయత్నించడం, చంపడం నేరాలు. వరకట్నం తీసుకున్న భర్తను వరకట్నాన్ని తిరిగి ఇమ్మని భార్య అడిగితే ఇవ్వక పోవడం భర్త చేసే నేరం. దీనికి సంబంధించి భారత శిక్షాస్మృతిలో, వరకట్న నిషేధ శాసనంలో అనేక అంశాలు పొందుపరచబడి ఉన్నాయి. వీటిని గురించి చాలా మంది ప్రజలకు తెలియవు. వరకట్న నేరాలకు సంబంధించిన సమాచారాన్ని ప్రజలకు అందజేయటం, వరకట్న నేరాల సందర్భంగా బాధిత స్త్రీలకు, వారి తల్లిదండ్రులకు సహాయం చెయ్యటం ఒక వ్యక్తి చేసేదాని కన్న ప్రత్యేకంగా ఒక కమిటీకి ఆపని కేటాయించడం మంచిదని నాకు తోచింది. అందుకని మహిళాభ్యుదయ సంస్థ "వరకట్న నేరాల దర్యాప్తు సంఘాన్ని" నెలకొల్పింది.

వరకట్న ఫిర్యాదులను ఇంతవరకు వధువు, ఆమె తల్లిదండ్రులు, అక్కచెల్లెళ్లు, అన్నదమ్ములు మాత్రమే చేయవలసి వుండేది. ఇప్పుడు పరిస్థితి మారింది. ప్రభుత్వంచే అంటే కేంద్ర ప్రభుత్వంచేతగానీ, రాష్ట్ర ప్రభుత్వంచేతగానీ లేదా గుర్తించబడిన సంక్షేమ సంఘం కూడా ఈ శాసనం క్రింద ఫిర్యాదు చేయవచ్చు. అలా జిల్లాకు రెండు సంస్థలను ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం శాసనపు పరిధిలోకి వచ్చే సంక్షేమ సంఘాలుగా గుర్తించింది. హైదరాబాదు నగరానికి వరకట్న మరణ దర్యాప్తు సంఘంగా మహిళాభ్యుదయ సంస్థను రాష్ట్ర ప్రభుత్వం గుర్తించింది.

ఆ మేరకు ది. 29-4-89న నెం. 61 జి.వో.ను రాష్ట్ర ప్రభుత్వం మహిళాభ్యుదయ సంస్థకు జారీ చేసింది. కొన్ని హక్కులను ప్రసాదించింది. అందువల్ల వరకట్నం అడిగినా, ఇచ్చినా ఆ వ్యక్తుల పై తగు చర్యలు తీసుకోవటానికి, ఫిర్యాదులు ఇవ్వటానికి మా సంస్థకు కొంత అవకాశమూ, హక్కు వచ్చాయి. అంతేకాదు పుచ్చుకున్న కట్నాన్ని వధువుకు ఇప్పించటానికి దాని పై చర్య తీసుకోవటానికి ఈ సంస్థ పిటిషన్ పెట్టవచ్చు. లాంఛనాలు, చదివింపులు లిస్టురాసి అవి వధువుకు అందచేయకపోతే చర్య తీసుకొని నేరస్తులను కోర్టుకు ఈడ్చే అధికారం కూడా వుంది. అధికంగా కట్నం అడిగినా ఆమెను చిత్ర హింసలు పెట్టినా, చంపటానికి ప్రయత్నించినా, చచ్చేలా చేసినా ఈ నేరాలన్నింటినీ వెలికి తెచ్చి చర్యలు తీసుకోవచ్చు. మహిళా కోర్టులకు మహిళా రక్షక పోలీసు విభాగానికి (ఉమెన్స్ ప్రొటెక్షన్ సెలుకు) పంపవచ్చు. ఇలా వైవిధ్యంతో కూడిన వరకట్న నేరాలను పరిశీలించటానికి, ప్రజాదృష్టికి తేవటానికి, చర్యలు, పిటిషన్ లు పెట్టే అధికారం ఈ సంస్థకు లభించింది.

వరకట్న నిషేధ శాసనం (1961) 1984 సంవత్సరంలో మార్పుకు లోనయింది. వరకట్నాన్ని అడగడం, తీసుకోవడం, తిరిగి ఇమ్మన్నప్పుడు నిరాకరించడం, వధువువైపు వారిచ్చిన బహుమతులను వరుడు జాబితా వ్రాయకపోవడం నేరాలు. ఈ నేరాలను వెలికి తెచ్చే అవకాశం మహిళాభ్యుదయ సంస్థకు ఇవ్వడం అభిలషణీయం.

## స్త్రీ విమోచన శిక్షణా కేంద్రం

మహిళాభ్యుదయ సంస్థద్వారా నేను చేస్తున్న కార్యక్రమాలను గమనించిన మిత్రులు క్రాస్ సంస్థ అధిపతి శ్రీ ఎం. కురియన్ సంఘ సేవా కార్యక్రమంలో గ్రామీణ స్త్రీలకు శిక్షణ ఇస్తే బాగుంటుందని సూచించారు. గ్రామీణ మహిళా సంఘంలో పదవులు చేపట్టిన స్త్రీలకు, వారి కార్యకర్తలకు అనుభవ జ్ఞానం వుంటుంది. కానీ వారి పరిధిని దాటిన విషయాలు వారికి తెలియవు. అంతేగాక ఇతరుల అనుభవాలను, వారి స్వంత అనుభవాన్ని జతపరచి రెంటికీ కల సామాన్య సూత్రాన్ని గమనించలేరు. ఈ పనిని విద్యావంతులయిన స్త్రీలు కొంతగా కొంత చేయగలుగు తారు. కనుక సిద్ధాంత పరిజ్ఞానం వున్న మహిళలు, గ్రామీణ సంఘాలవారు కలిసి తమ అనుభవాలను కలబోసుకుంటే సమస్య సదవగాహన అవుతుంది. గ్రామీణ మహిళా సంఘాల వారికి అధ్యయన తరగతులు నిర్వహించడానికి ఒక ఏడాదిపాటు సుదీర్ఘంగా, లోతుగా ఆలోచించి, నే నంగీకరించాను. ఈ కృషికి నామకరణం చేసే ప్రసక్తి వచ్చింది. దానికి 'స్త్రీ విమోచన శిక్షణా కేంద్రం' అని పేరు పెట్టాం. స్త్రీ అనేక బంధాలలో జీవిస్తుంది. బంధ విముక్తి వుంటేనే ఆమె ఒక మనిషిగా, ఒక వ్యక్తిగా మనగలగడం ఆమె జీవితానికి పరమార్థం అవుతుంది. అలాంటి సంపూర్ణ వ్యక్తిత్వంగల స్త్రీలను తయారు చేయడమే 'స్త్రీ విమోచన శిక్షణా కేంద్ర' లక్ష్యం.

ఈ కార్యక్రమాన్ని పనినిబట్టి మూడు ఉప కార్యక్రమాలుగా ముమ్మందుగా విభజించాం. గ్రామీణ మహిళా సంఘాల అధికారులను, కార్యకర్తలను ఇరవై మందికి మించకుండా చేర్చి వికాస కేంద్రంలో వారికి 5 రోజులు శిక్షణ ఇవ్వడమనేది అందులో ఒక భాగం. మొదట్లో 5 రోజులు శిక్షణ ఇద్దామనుకున్నాము కానీ గ్రామీణ గృహిణులు ఇల్లు వదిలి 5 రోజులు వుండ లేమంటే కాలపరిమితి మూడు రోజులకు తగ్గించడం జరిగింది.

కార్యకర్తలు అధ్యయనం చేయవలసిన విషయాలను మూడు వర్గాలుగా విభజించాం. ప్రాథమిక, మాధ్యమిక, ఉన్నత కోర్సులుగా పేర్కొన్నాం. ప్రాథమిక, మాధ్యమిక పాఠ్యాంశాలను, ఉపన్యాసాలు, ప్రశ్నలు, సమాధానాల ద్వారా బోధించాలని, ఉన్నతవర్గ పాఠాలను గోష్టులు, చర్చలు, అభిప్రాయ వేదికలు, సెమినారుల ద్వారా బోధించాలని నిర్ణయించాము. ప్రాథమిక మాధ్యమిక పాఠ్యాంశాల పై పలువురు విషయ

నిష్ణాతులయిన అధ్యాపకులచేత ఉపన్యాసాలిప్పిస్తున్నాం. సెమినార్లలో ప్రతిభావంతులైన స్త్రీ పురుషులు పరిశోధనా పత్రాలను వ్రాస్తున్నారు, చర్చల్లో చురుకుగా పాల్గొంటున్నారు.

బోధింపబడిన పాఠాలను శిక్షణ పొందేవారు మరిచిపోకుండా నలుబది చిన్న పుస్తకాలను ప్రచురించి అందిస్తున్నాం. సెమినార్ల వ్యాసాలను గ్రంథరూపకంగా వెలువరిస్తున్నాం. పాఠ్య ప్రణాళికను కూడ ముద్రించాం.

## అధ్యయన తరగతులు

నగరం చుట్టుప్రక్కల ఉన్న గ్రామీణ వాతావరణం సగం, నగర వాతావరణం సగం ఉన్న ప్రాంతాలలో, పేటలలో అధ్యయన కేంద్రాలను నెలకొల్పి అచ్చట నెలకొకసారి ఏదో ఒక మహిళా సమస్య మీద మహిళలు చర్చించే పద్ధతి నెలకొల్పాం. శిబిరాలకు వచ్చే స్త్రీలు పలు ప్రాంతాల నుండి, వివిధ జిల్లాల నుండి రావటంతో ఒకరికొకరు పరిచయం లేనివారయి స్వేచ్ఛగా ప్రసంగించటానికి జంకును, బెరుకును ప్రదర్శించేవారు. అలా కాకుండా వారివారి పేటలలో, ప్రాంతాలలో సమావేశమయినప్పుడు ఎంతో చనువుగా మాట్లాడగలిగేవారు. కనుక అధ్యయన కేంద్రాలలో చర్చలు ఎంతో ఉపయుక్తంగా ఉండేవి. అధ్యయన కేంద్రాల కార్యక్రమాన్ని నిర్వహించడానికి ఒక సమన్వయ మహిళా కార్యకర్తను కేటాయించాం. అలా 1985 నుండి ఇప్పటి వరకు ఎన్నో శిబిరాలను, అధ్యయన కేంద్రాలను నడపటం జరిగింది. ఒకప్పుడు అయిదారు జిల్లాల నుండి కూడా శిబిర వాసులు వచ్చిన సందర్భాలు వున్నాయి. సెమినార్ల పత్రాలను 'వరకట్న విశ్లేషణ', 'అశ్లీలం : అసభ్యత', 'స్త్రీల లైంగికత : లైంగిక స్వేచ్ఛ' పేర్లతో మూడు పుస్తకాల రూపంగా ప్రచురించాం.

## సామాజిక న్యాయ సహాయం

వైవాహిక కుటుంబ సలహాల నిమిత్తం అనేకమంది వికాస కేంద్రానికి వస్తుంటారు. వారిలో కొందరివి న్యాయ సంబంధమైన చిక్కులున్న కేసులు. వారిలో ధనవంతులకు ప్లీడరును పెట్టుకొని వాజ్యం జరుపుకోమని చెప్తున్నాం. కొంతమంది బీద స్త్రీలుకూడా వస్తుంటారు. వారు కేసులకు వాజ్యాలకు డబ్బు పెట్టుకోలేరు. ధనం వెచ్చించలేరు. అలాంటివారికి ప్లీడర్లను ఏర్పాటుచేసి, వ్యవహారాన్ని నడపడానికి అయ్యే ఖర్చులు భరించి కేసులు నడపటం స్త్రీ విమోచన కేంద్ర కర్తవ్యాలలో ఒకటి. ఇలా పేద స్త్రీలను ఆదుకోవడం జరుగుతున్నది. ఎట్టి పరిస్థితులలోనూ ధనవంతులై వుండి స్తోమతు కలిగిన స్త్రీలకు ధన సహాయంచేసే ప్రసక్తి లేదు. ఈ విధానంవల్ల అనేకమంది స్త్రీలు లాభించారు. ఇలా వైవిధ్యంతో కూడిన కార్యక్రమాలను నిర్వహిస్తోంది స్త్రీ విమోచన శిక్షణా కేంద్రం.

# 3. అభ్యుదయ వివాహవేదిక

ఈ వివాహవేదిక ఆవిర్భావం ఒక అద్భుత పరిస్థితిలో జరిగింది. హేతువాది, హ్యూమనిస్టు అయిన ఒక వ్యక్తి ఒక కంపెనీలో పనిచేస్తుండగా యంత్రంలోపడి చెయ్యి విరిగింది. 20 ఏళ్ళ వయస్సులో మోచేతి వరకు కృత్రిమహస్తం తొడుక్కుని 10 ఏళ్ళు గడిపాడు. చక్కనివాడు, తెలివైన వాడు. అంగ వికలుడైనందున గవర్నమెంట్ ఉద్యోగం వచ్చింది. ఒకనాడు నా దగ్గరికి వచ్చి పెళ్ళిచెయ్యమని అడిగాడు.

అప్పుడు నాకొక ఆలోచన వచ్చి నాకళ్ళలో ఒక వెలుగు వెలిగింది. ఇలాంటి అంగవికలురకు, ప్రేమికులకు, విడిపడి విడాకులు పొందినవారికి, వితంతువులకు కట్నం, కన్యాదానం, కులం, మతం, ఆడంబరం ఆర్భాటం లేకుండా క్లుప్తంగా ఎందుకు పెళ్ళి చేయకూడదు, అది ఆడవారే నిర్వహించవచ్చు కదా అని నిర్ణయించి ఈ అభ్యుదయ వివాహ వేదికను 1983లో స్థాపించాను.

ఈనాటి సమాజంలో ప్రేమ వివాహాలు ఫలించడానికి, కులమతాలు, ఆస్తి అంతస్తులు, వరకట్న పిశాచం అడ్డుగోడలయి బాధిస్తున్నాయి. వరకట్న విషజాడ్యం ఎల్లెడలా వ్యాపించి అదొక పెనుభూతమై అమ్మాయిల జీవితాలను అస్తవ్యస్తం చేస్తున్నది. తలకుమించిన ఆడంబరాల వల్ల కుటుంబాలే కూలిపోతున్నాయి. మతపరమైన ఛాందస ఆచారాలు, ముహూర్తాలు, జాతకాలు లాంటి నమ్మకాలు స్త్రీలలో మెండుగా వుంటున్నాయి. అనేకమంది అమ్మాయిలు ఈ అడ్డంకుల వల్ల వృద్ధ కన్యలుగా మిగిలిపోతున్నారు. ఈ పరిస్థితులను అధిగమించాలంటే ప్రేమ వివాహాలే శరణ్యం అనక తప్పదు. కనుక ఈరకమయిన వరకట్న రహిత, కుల, మత ప్రసక్తి లేని వివాహాలను జరిపించడానికి ఈ వేదిక నిర్మాణం జరిగింది.

ఈ వేదికనుండి పెళ్ళిళ్ళు ఎలా చేస్తున్నానో చెప్పవలసిన అవసరం వుంది. కులాతీత, మతాతీత, కట్నరహిత, మతతత్వ రహిత వివాహాలు జరుగుతాయి. వర్జ్యం, వారం, తిథి, నక్షత్రాలు చూసేది లేదు. తాళి లేదు, తలంబ్రాలు అసలే లేవు. ఆడంబరాలు అంతకన్నా వుండవు. పెళ్ళి సమయానికి స్నేహితులు, బంధువులు మాత్రం వస్తారు. కన్నవారు తిరస్కరిస్తే వారూ రారు. వధూవరుల చేత "కలిమి లేములలో కష్ట సుఖాలలో ఇరువురం పాలుపంచు కుంటూ, సహచరులుగా, స్నేహితులుగా ప్రేయసీ ప్రియులుగా ఆలుమగలుగా కలసి జీవితం సాగిద్దాం" అని తెలుగులో ప్రమాణం చేయించి, దండలు మార్పించి, రెండు ఫోటోలు తీసి వివాహతంతు ముగిస్తున్నాను. రెండు దండలు, రెండు ఫోటోలకు కేవలం 50 రూపాయల ఖర్చుతో పెళ్ళి అయిపోతుంది. అమ్మాయికి 18 ఏళ్ళు, అబ్బాయికి 21 ఏళ్ళు నిండనిదే ఏ పరిస్థితులలోనూ పెళ్ళి చేయను. ఇక్కడ జరిగేవి హెచ్చుగా ప్రేమ వివాహాలే. మాదగ్గర జరిగిన కొన్ని వివాహాలను మచ్చుకి ఉదహరిస్తాను.

ఒక పెళ్ళిలో వధువు విధవరాలు. మూడు ఏళ్ళ కూతురు కూడా వుంది. ఆ పిల్లను ప్రక్కనే పెట్టుకొని పెళ్ళాడారాదంపతులు. అలాగే ఇంకా పారిపోయి వచ్చిన అమ్మాయిలు, విడాకులు, పొందినవారు, అంగవికలురు, గుడ్డివారు ఇలా ఎంతో మందికి వివాహాలు మా వేదికమీద జరిపిస్తున్నాం. ఆ పెళ్ళిళ్ళు చెల్లవనే 'లా' ఇంతవరకూ రాలేదు.

## హిందూ వివాహ చట్టంలోని హిందూ శబ్ద నిర్వచనం

భారతదేశంలో స్థిరనివాసం కలిగి, భారత పౌరులైవుండి, ఇస్లాం, క్రైస్తవం, యూదు, జొరాస్టియన్ మతానికి చెందనివారు, అంటే అజ్ఞేయవాది. (AGNOSTIC), నాస్తికుడు (ATHEIST), హేతువాది (RATIONALIST) వీరందరూ హిందువులుగానే పరిగణింపబడతారు. హిందూ వివాహచట్టం సెక్షన్ 7 లో వివాహం వధూవరులలో ఏ ఒక్కరి పద్ధతి ప్రకారమైన జరగవచ్చని వుంది. కనుక హేతువాదుల పద్ధతి చెల్లుతుందని మావాదన. ఆ ప్రకారం పూలదండల మార్పిడితో, ప్రమాణం పద్ధతిలో పెళ్ళిళ్ళు చేయిస్తున్నాము. ఈ విషయమై ఏకోర్టు తీర్పు అనుకూలంగా గాని, వ్యతిరేకంగాని లేదు. కోర్టుకు వెళితే ఈ పద్ధతి చెల్లుతుంది. అయితే ఇదంతా శ్రమ అని తమిళనాడులో డి.యం.కె. ప్రభుత్వం 1967 లో హిందూ వివాహ చట్టాన్ని సవరణ చేసి సెకన్ 7ఎ ద్వారా పూలదండల పెళ్ళి, స్వయంవరం వగైరా వివాహాలను చట్టబద్ధం చేసింది. మన రాష్ట్రంలో ఇంకా అలాంటిది జరుగలేదు.

ఇకపోతే 'లా' కోర్టు పై ఆధారపడటం, అందులో ముఖ్యంగా స్త్రీలకు నష్టదాయకమని తలంచి ప్రత్యేక వివాహ శాసనం సెక్షన్ 13 క్రింద రిజిష్టర్ చేసుకోమని సలహా ఇస్తాను. కాగా అర్జంటుగా వివాహం చేయవలసి వస్తే ముందు మా పద్ధతి ప్రకారం పెళ్ళిచేసి తర్వాత 1954 ప్రత్యేక వివాహచట్టం సెక్షన్ 15 క్రింద రిజిష్టరు చేసుకోమంటాము. అప్పుడు వధూవరులిద్దరికీ 21 సం॥ రాలు విధిగా నిండి వుండాలి.

భిన్న మతాలవారి వివాహాలు మాత్రం వేదిక ఆధ్వర్యంలో చేయం. అవి మేము చేస్తే లా ప్రకారం చెల్లవు. అయితే కొన్ని జంటలు మాత్రం మాచేతనే వివాహం చేయించుకుంటున్నారు. ఒక క్రైస్తవ కన్య హిందూ యువకుడిని పెళ్ళాడతానన్నది. నేను ఆ పెళ్ళి చేయనని చెప్పాను. వివాహం లా ప్రకారం చెల్లకపోతే నష్టపోయేది వధువేనని చెప్పాను. అంత వధువు వరుడు చెవి పట్టుకొని ఇతడు నన్ను తప్పించుకొని పోలేడులే అంటూ అతని చెవి మెలి పెట్టింది. వెంటనే చిరునవ్వు నవ్వి పెండ్లి చేసేశాను. ఈ తరహా పెళ్ళిళ్ళు చేయమని చాలామంది అడిగి చేయించుకుంటూ వుంటారు. ఇలా గత 8 సంవత్సరాలుగా పెళ్ళిళ్ళు చేస్తూనే వున్నాను. ఈ వేదిక స్థాపన వలన వరకట్నాలు తగ్గాయి. ప్రేమ వివాహాలు పెరిగాయి. ఇలా ఎన్ని వివాహాలు చేయించామనేది ప్రశ్న

కాదు. ఒక నెలలో 4, 5 జరుగుతాయి. మరో నెలలో 2,3 జరుగవచ్చు. కొన్ని రోజుల్లో అసలే జరగకపోవచ్చు. ఈ సిద్ధాంతపరమైన భావ ప్రచారం ముఖ్యమని భావిస్తున్నాను. “ప్రేమ వివాహాలు కూడా విఫలమవుతున్నాయి కదా?” అని మమ్మల్ని కొందరు ప్రశ్నిస్తారు. ప్రేమ వివాహాలు విఫలమవుతున్నా యన్నమాట పూర్తిగా నిజం కాదు. కొందరు కావాలని అలా ప్రచారం చేస్తున్నారు. కొందరు మాత్రం అమాయకంగా ప్రశ్నిస్తున్నారు. పెద్దల ఏర్పాటుతో చేసిన పెళ్ళిళ్ళకన్నా ప్రేమ వివాహాలలో ఫెయిల్యూర్స్ చాలా తక్కువ. మేము చేసే వివాహాలలో 99 శాతం ప్రేమవివాహాలే. అలాంటి దంపతులు చాలా ఆనందంగా జీవిస్తున్నారు. తమకు కల్గిన సంతానాన్ని తెచ్చి మాకు చూపించి ‘అమ్మమ్మా! తాతయ్యా! ‘అని వారిచేత పలికించి వెళ్తూ వుంటారు. “తల్లిదండ్రుల ఇష్టం లేకుండా మీరు చేసే వివాహాలలో దంపతులకు కన్నవారి అండదండలుండవు గదా?” అని మరొక ప్రశ్న మామీద విసురుతున్నారు కొందరు. మేము చేసిన వివాహంలో

వధూవరుల తల్లిదండ్రులు తాత్కాలికంగా వారిని చీదరించుకున్నా, తరువాత సర్దుకొని వారిని ఆదరిస్తున్నారు. కులాంతర వివాహాలలో కూడా ఇలాగే జరుగుతున్నవి. వేరు వేరు భాషలకు, ప్రాంతాలకు చెందిన సంబంధాలలో కూడా అటూ ఇటూ తల్లిదండ్రులు సర్దుకుంటున్నారు.

“మీ పైన తల్లిదండ్రులకు ద్వేషం పుట్టడం లేదా? “అని కొందరు అడుగుతున్నారు. మేము అవలంబించే విశిష్ట విధానంవల్ల ఆ ప్రమాదం జరగటం లేదు. సాధారణంగా వివాహమయిన తరువాత వధూవరులను తమ తల్లిదండ్రుల వద్దకు వెళ్ళి నమస్కరించమని సలహా చెప్తాం. ఒకవేళ తల్లిదండ్రులు తిరస్కరించినా, నిందించినా పల్లెత్తుమాట జవాబు చెప్పకుండా తిరిగి పొమ్మని హెచ్చరిక చేస్తాం. చాలా మంది మా సలహాను పాటిస్తారు. అలాంటి కేసులలో తల్లిదండ్రులు ఆదంపతులతో అచిరకాలంలో రాజీపడి వారిని ఆదరించటం జరుగుతున్నది. అంతటితో ఆగక మావద్దకు వచ్చి ధన్యవాదాలు చెప్పి వెళ్ళటం విరివిగా సంభవిస్తున్నది. మిగతా కేసులలో సర్దుకు పోవటం కాస్త ఆలస్యమవుతున్నది. ఒకరిద్దరు మాత్రం ప్రథమంలో మమ్మల్ని నిందించి తరువాత మంచిగా మాట్లాడటం జరిగింది. మొత్తం మీద మేము తల్లిదండ్రుల ద్వేషానికి పాత్రులం కావటం లేదు. ఇది మాకు ధైర్య స్థయిర్యాలను కలుగ జేస్తున్నది.

ప్రేమ వివాహాల్లో వరకట్న ప్రసక్తి రాదు. కుల మతాల విషయం అసలే రాదు. ఒక్కొక్క సందర్భంలో వధూవరులు ఒకే కులానికి చెందిన వారయివుంటారు. కులపు ఊసు లేకుండా ఒకే కులంలో జన్మించినా వారు పెళ్ళి చేసుకుంటామంటే మాకు అభ్యంతరం లేదు. మీదే కులమని అడిగి తమది ఒకే కులమని గ్రహించి ప్రేమించే వారికి మా అండదండలుండవు. ప్రేమించుకున్న వారు సూత్రధారణ జరగాలని పట్టుపడితే వారికి మేము సాయం చెయ్యం. ఆర్య సమాజ్ వారి వద్దకు వెళ్ళి పెళ్ళి చేసుకోమని సలహా కూడా చెప్తాం.

కులాంతర వివాహాలు మాత్రమే చేయించాలని మాకు నియమం లేదు. సాధారణంగా కులాంతర వివాహాల్లో వధూవరులు ఇరువురు తమ తమ కులాలను అంటి పెట్టుకొని వుంటారు. అభ్యుదయ వివాహాల్లో కుల ప్రసక్తి వుండదు. వేదిక తరుపున సెమినార్ల పత్రాలను వివాహం సంతానం కోసమేనా' 'వివాహం నేడు, రేపు' అనే గ్రంధాల రూపంలో ప్రచురించాము. ఇలా అభ్యుదయ వివాహాలను ప్రచారం చేయడం మా దంపతుల ప్రత్యేక కృషి,

అభ్యుదయ వివాహ వేదికకు స్థాపక గౌరవాధ్యక్షులుగా ప్రసిద్ధ మేధావి, ప్రఖ్యాత రచయిత, పేరెన్నికగన్న పత్రికా సంపాదకులు నార్ల వెంకటేశ్వరరావు గారు వుండటం వేదికకు గర్వకారణం. ఈ వేదిక నిర్మాణపు తొలి రోజులలో మా దంపతులం, శ్రీమతి మమతా లక్ష్మన్న, శ్రీ సి. లక్ష్మన్న, శ్రీ ఎన్.కె. ఆచార్య, శ్రీ పోలు సత్యనారాయణ సమాలోచనలు చేసి స్థాపించాము. శ్రీ సి. చంద్రయ్య ఐ.సి.యస్. ప్రారంభోత్సవం చేశారు. శ్రీ పోలు సత్యనారాయణ స్థాపక అధ్యక్షులుగా వున్నారు. తర్వాత శ్రీమతి మమతాలక్షన్న అధ్యక్ష స్థానాన్ని అలంకరించారు. ప్రస్తుత అధ్యక్షులు ప్రఖ్యాత ప్లీడరు శ్రీ ఎన్.కె. ఆచార్య. నేను కార్యదర్శిగా, డైరెక్టరుగా మొదటి నుంచి వున్నాను.

అభ్యుదయ వివాహ వేదిక స్థాపనకు పూర్వం మిశ్రమ వివాహాలను (Mixed Marriages) అంటే కులాలు, గోత్రాలు, శాఖలు, వర్ణాలు, మతాలు సమ్మిశ్రమమైన పెళ్ళిళ్ళను ప్రోత్సహించేవారం; చేసేవారం. వేదిక స్థాపనకు పూర్వం రామ్మూర్తిగారు ఆచార్యత్వం వహించేవారు. వేదిక నిర్మాణం తరువాత ఆ బాధ్యత నేను తీసుకున్నాను. స్త్రీ ఆచార్యత్వం వహించడం అభుద్యయ పథంలో ఒక అడుగుగా భావించారు మార్క్సిస్టు తీవ్రవాద భావాలుకల మిత్రులు. వారు నన్ను తాము ఏర్పాటు చేసే కళ్యాణ వేదికలకు ఆహ్వానించేవారు. ప్రముఖ కవి శ్రీ నిఖిలేశ్వర్ తన కుమార్తె వివాహాన్ని నా ఆచార్యత్వంలో జరిపించి నన్ను ప్రోత్సహించారు. అలాగే హేతువాద ప్రచారంలో దిట్ట, కవి అయిన జ్వాలాముఖి తన ఆధ్వర్యంలో జరిపిన తన కుమారుని వివాహంలో నాకు సముచిత స్థానాన్ని కల్పించి ఉపన్యసింప చేశారు. అనేక మంది నక్సలైట్లు నాచేత పెళ్ళిళ్ళు చేయించుకోవాలని ఆశించేవాళ్ళు వున్నారు. అందువల్ల బైటకెళ్ళ కుండ వారి వివాహాలు చేయిస్తున్నాను. దీనిని బట్టి ఈ సంస్కరణోద్యమానికి ఎంత బలం ఉందో విదితమవుతున్నది.

అభ్యుదయ వివాహాలు మావేదిక పైననే జరగాలని మాకు పట్టుదల లేదు. ఎక్కడ జరిగినా, ఎవరి ఆధ్వర్యాన జరిగినా సమ్మతమే, ఆహ్వానింప దగినవే. 1940 దశకంలో ఆంధ్రప్రాంతంలో దండల పెళ్ళిళ్ళ సందర్భంగా వచ్చిన ఉత్సాహం కన్నా 1980, 1990 దశకాలలో కన్పిస్తున్న చొరవ, కార్యాచరణ అత్యధికంగా వున్నాయి.

# 4. ఇతర సంస్థలు

## శ్రామిక మహిళా సేవ

నేనూ రామ్మూర్తిగారు 1980లో అహమ్మదాబాద్ వెళ్ళినప్పుడు అక్కడ స్వయం ఉపాధికల స్త్రీలకు సేవ చేస్తున్న 'సేవ' కార్యాలయానికి వెళ్ళాం. ఆ సంస్థ స్థాపకురాలు శ్రీమతి ఇలా భట్ ను దర్శించి ఆమెతో మాట్లాడాం. అప్పటినుండి అలాంటి సంస్థను స్థాపించి, అలా సేవ చేయాలని మా దంపతులకు ఉబలాటం ఎక్కువయింది. తగిన సమయం కోసం వేచి వున్నాం.

ఈ సమాజంలో ధనవంతులూ వున్నారు. దాతలూ లేకపోలేదు. తనకున్న దానితో తృప్తి పడి అంతో ఇంతో సేవా కార్యక్రమాలకు ఇచ్చే వారిలో బాదం రామస్వామిగారొకరు. వారు "అమ్మా నేను పదివేలు మీకిస్తాను. ఆ డబ్బుతో మీరేదయినా సత్కార్యం చెయ్యమని' అడిగారు. అలాగేనని సంతోషంతో అంగీకరించాను.

ఎన్నో రోజులనుండి ఆర్థికంగా మహిళలకు తోడ్పాడాలనే నా భావాలకు రూపకల్పన ఈనాటికి చిగురించింది. కూరగాయలమ్మే శాంతమ్మకు, కట్టెలమ్మే వెల్లుబాయికి, కుండలు చేసే రాములమ్మకు, అప్పడాలమ్మే లక్ష్మమ్మకు, చీరలమ్మే తులశమ్మకు, కుట్టు మిషన్ వాడే శ్రీదేవి లాంటి 20 మందికి 500 రూ" చొప్పున వడ్డీ లేకుండా, కుదవబెట్టుకోకుండా ఇవ్వటం, వారు నెలకు రూ।। 50 చొప్పున తీర్చటం చేస్తున్నారు. ఇదొక విధమైన చిన్న తరహా ప్రయత్నంగా తయారయి, ఇప్పుడిప్పుడే ఇంకా పెరగబోతున్నది. డిపార్టుమెంట్ వారు కూడా "మీకు డబ్బు మేమిస్తాము. మీరు చేస్తున్న ఆర్థిక సేవా కార్యక్రమం ఇంకా భారీ ఎత్తున జరపండి, పూచీ మీది, సహాయం మాది" అని చెప్పటంవల్ల అనతికాలంలో ఇంకా ఋణాలు ఇచ్చే కార్యక్రమాన్ని అభివృద్ధి చేయబోతున్నాం.

వ్యక్తి స్త్రీయా, పురుషుడా అనే భేదం లేదు. అందరికీ కావలసింది తిండి, గుడ్డా, నీడ ఇవి మానవజాతికి ముఖ్య అవసరాలు. అవి అందరికి అందించటం మన పాలకులకు సమాజానికి ముఖ్య ధర్మం, లక్ష్యం కూడాను. అందరికి విద్య, ఉద్యోగం, భద్రత అందివ్వాలని మన రాజ్యాంగంలో ఆదేశిక సూత్రాలుగా వ్రాసుకున్నాం. అయినా 40 శాతం ఇంకా దరిద్రరేఖకు దిగువనే వున్నారు. అది చాలక ధరలు రోజురోజుకు ఆకాశాన్ని అంటుతున్నాయి. ఈ పరిస్థితి తట్టుకోలేక ఆడవారంతా అంతో ఇంతో సంపాదించాలనే బాధ్యత నెత్తిన వేసుకున్నారు. ఇప్పటికి 70 శాతం స్త్రీలు వ్యవసాయ కార్మికులుగా గ్రామాలలో పనిచేసి పొట్టపోసుకుంటున్నారు. ఇక కూరగాయలు, గ్రుడ్లు, పాలు, పూలు, అప్పడాలు, కుండలు, బుట్టలు, సబ్బులు తయారుచేసి అమ్మేవారు, మిషిన్ కుట్టేవారు, తోటలు పెంచేవారు. ఇలా రకరకాల వృత్తులు చేసి జీవించే వారి సంఖ్య రోజు రోజుకూ

విపరీతంగా పెరిగిపోతున్నది. బ్యాంకులు ఎన్ని వున్నా, వడ్డీ వ్యాపారస్తులు ఎందరున్నా అందరికీ ప్రతి పనికి పెట్టుబడి దొరకటం చాలా కష్టతరమయి పోతున్నది. అంతేకాదు ఎవరు అప్పుఇచ్చినా ఇల్లో, వస్తువో ముందుగా కుదవ పెట్టకపోతే ఏ ఒక్కరూ అప్పు ఇవ్వరు. అంతో ఇంతో వడ్డీ చెల్లించక తప్పదు. ఈ పరిస్థితికి బాధపడి వడ్డీలేని, తాకట్టు లేని, ఋణాలను ఇవ్వడం జరిగింది. ఇలాంటి తోడ్పాటును వ్యవస్థీకరించటానికి 'శ్రామిక మహిళా సేవ' ఉదయించింది. దీనిని 1989లో రిజిష్టరు చేశాము. అనతి కాలంలో ఇది శాఖోపశాఖలుగా విస్తరించగలదనే ఆశ నాకు మిక్కుటంగావున్నది.

మహిళలకు వృత్తి విద్య నేర్పటం ఒక ఎత్తు. సామాజిక హోదాను స్త్రీలకు కల్పించటం మరి ఒక పద్ధతి. వారిలో జ్ఞానతృష్ణను ప్రేరేపించి వారిని స్వేచ్ఛా పిపాసువులను చేయటం ఇంకో మార్గం. ఆర్థికంగా వారిని స్వావలంబనంగా చేయటం విశిష్ట కృషి, ఆర్థిక కార్యక్రమంలో అంశంగా అవసరమైన పెట్టుబడిని తగిన వారికి అందించడం చాలా మంచిపని అనేది తథ్యం. 'శ్రామిక మహిళా సేవ' ఈ కర్తవ్యాన్ని నెరవేర్చ పూనడం, అంతో ఇంతో ఆర్థికంగా అభివృద్ధికి సాయపడటం నాకు సంతృప్తిని కల్గిస్తున్నది.

## మహిళాభ్యుదయ గ్రంథాలయం

ఈ గ్రంథాలయ పూర్వకథ చాలా ఆసక్తిదాయకం. మహిళాభ్యుదయ సంస్థ కార్యవర్గ సమావేశం జరుగుతుండగా, హఠాత్తుగా మా సంఘ కార్యదర్శి 'సుబ్బమ్మ గారూ! ఒక శుభవార్త' అన్నది. అందరం ఏమిటా వార్త అన్నట్లు చూశాం. "ఈనాడు" పత్రిక కార్యాలయానికి వందల సంఖ్యలో సమీక్షార్థం వచ్చే పుస్తకాలకు చోటు చాలక గ్రంథాలయాల వారికి ఇచ్చేస్తున్నారట" అన్నది ఆమె ఆసక్తితో. ఇక నాలో ఆలోచన ప్రారంభమయింది. అంతో ఇంతో సాహిత్యాభిలాష, రచనా ప్రక్రియ పై అభిమానం వున్న నాకు కొన్ని గ్రంథాలను వారి నుండి పొందాలనే తహ తహ పెరిగింది. నిముషాల్లో ఒక నిర్ణయానికి వచ్చి మనం ఒక మహిళా గ్రంథాలయాన్ని స్థాపించి, ఆ పేరుతో వారి గ్రంథాలను అడుగుదాం. అని తీర్మానం చేశాను. నాకు విద్య మీద వున్న మిక్కుటమైన అభిమానానికి ఇప్పుడు అవకాశం వచ్చింది గదా అని ఆనందించాను. ఆ ఆలోచన నుండి ఉద్భవించిందే ""మహిళాభ్యుదయ గ్రంథాలయం". "ఈనాడు" వారు ఆనాడు ఉచితంగా ఇచ్చిన గ్రంథాలు ఒక వంద దాకా వున్నాయి. ఆ తర్వాత హైదరాబాద్ నగర జిల్లా గ్రంథాలయం, సాహిత్య అకాడమీ, సారస్వత పరిషత్తు, నార్లవారు, జె.బి. రావుగారు, రామ్మూర్తిగారు తమ వద్దనున్న గ్రంథాలు కొన్ని ఇచ్చారు. అలా పొందిన గ్రంథాలు అన్నీ కలిపి రెండు వేల దాకా వున్నాయి. ఒక 500 దాకా గ్రాంట్ల నుండి కొన్నవీ వున్నాయి.

ఈ గ్రంధాలయంలో మరెచ్చటా దొరకని అమూల్య గ్రంధాలువున్నాయి. వాటిని మహిళలు పరిశీలిస్తారని నా ఆశ. మహిళాభ్యుదయ సంస్థ సభ్యులందరూ వేరే సభ్యత్వ రుసుము చెల్లించకుండా ఈ గ్రంధాలయం ఒనగూర్చే సౌకర్యాన్ని సదుపాయాలను అనుభవించడానికి ఆస్కారముంది. గ్రంధాలయాలు వాడ వాడలా వున్నాయి. కాని స్త్రీలకు ప్రత్యేకంగా వున్న గ్రంధాలయాల సంఖ్య దరిదాపు శూన్యమని పేర్కొనవచ్చు.

"విద్య లేని వాడు వింత పశువు" అని అంటే విద్యా విహీనురాలయిన స్త్రీ మాత్రం అలా కాదా అనేదొక ప్రశ్న? అసలు ఆడదానికి చదువు ఎందుకు అని చదవనివ్వరు. అంటే చదివి సదసద్వివేకవతి అయితే తనంత అయి, వ్యక్తిత్వాన్ని నిలుపుకుంటుందని, తమ ఆధిపత్యం సన్నగిల్లుతుందని, ఆమెను విద్యకు దూరం చేసింది. 'ఆర్య' సమాజం. ఈ సమాజంలో "పురుషులున్నారు. వారి నీడలు వున్నాయి" అని ధైర్యంగా చలం వ్రాశాడని, "స్త్రీకి కూడా సెక్సు కోరిక వుంటుందని, ఆమెకు స్వేచ్ఛ కావాలి" అన్నాడని మా రోజుల్లో చలం సాహిత్యం చదువుతుంటే పుస్తకం చించేసి నెత్తిన మొట్టి వెంటనే లగ్నం జరిపించేవాళ్ళు. లేకపోతే ఎవడితోనో లేచిపోతుందని చచ్చే భయం. ఆ రోజుల్లో క్రొవ్విలి నవలలు, జంపన చంద్రశేఖరం నవలలు రెండు అణాలకు దొరికేవి. అవన్నీ బూతు కథలని అలగా జనం, అంటే శీల రహితులు తప్ప కుటుంబ స్త్రీలు, పిల్లలు చదువకూడదని చదవనిచ్చేవారు కాదు. కాని ఆ రోజుల్లో పండిత పామరులందర్నీ చదివించింది, చదవాలనే కుతూహలాన్ని కలిగించింది ఆ సాహిత్యమేనని చెప్పక తప్పదు. వైవిధ్యంగల సాహిత్యం చదివితేనే కొత్త భావం కలుగుతుంది. ఏది ఏమయినా మంచిగాని, చెడుగాని ఆలోచించుకొని తమకు తాము నిర్ణయాలు చేసుకోగల ఆలోచన, వివేకం కావాలంటే వారికి విద్యా విజ్ఞానాలు కావాలి. అది కావాలంటే సాహిత్య అవలోకనం చాలా అవసరం. ఆ దృష్టితో 1981లో స్థాపించిందే మహిళాభ్యుదయ గ్రంధాలయం.

ఈ గ్రంధాలయంలో లభించే పుస్తకాలు సిద్ధాంత పరమైనవి. అన్ని వర్గాల స్త్రీలు తెలుగు బాషలో చదవగలిగేవి. క్షుద్ర సాహిత్యానికి – దయ్యాలు, భూతాలకు – ఇక్కడ చోటు వుండదు. వివిధ దేశాల మహిళోద్యమాలు వాటి పరిస్థితులు లాంటి విజ్ఞానదాయకమైన వాటిని మాత్రమే ఈ గ్రంధాలయం అందిస్తుంది. స్త్రీల హక్కులు తెలిపే గ్రంధాలకు, వాటిని ఎలా అనుభవించాలో ఆలోచింపజేసే సాహిత్యానికి ఇక్కడ చోటు వుంటుంది. ఈ గ్రంధాలయం ద్వారా మహిళాభ్యుదయాన్ని సాధించగల అవకాశం హెచ్చు స్థాయిలో వుంటుందనే ధ్యేయంతో కేవలం స్త్రీల కొరకు స్త్రీలచేత నడుపబడుతున్నది. ఈ గ్రంధాలయంలోని సాహిత్యం అందరికి అందుబాటులో లభించాలనే ధ్యేయంతో మా ఇంట్లో ఒక గది దానికి కేటాయించి ఇవ్వడం జరిగింది.

## మహిళా హక్కుల పరిరక్షణ కేంద్రం

స్త్రీలు దేశ ప్రజలలో సగభాగం. ప్రపంచంలో మానవాళిలో స్త్రీల సంఖ్య ఇంచుమించుగా పురుషుల సంఖ్యతో దీటుగా వున్నది. స్త్రీలు మానవాళిలో కలిసి వున్న వ్యక్తులు. కనుక మానవుల హక్కులన్నీ వారికి సంక్రమిస్తాయి.

మానవులంతా దేవుని సంతానమనే ఆస్తిక భావంలో నుండి, మానవులందరికీ బుద్ధి కుశలత, వివేచనాశక్తి ప్రకృతి సహజంగా వుంటాయనే హేతువాద భావననుండి స్త్రీ పురుషులు సమానులనే భావం సహజంగా ఉద్భవిల్లుతుంది. ఇలా ఉత్పన్నమైన హక్కులను మానవుల సహజ హక్కులంటాం. కాగా సమాజంలో సంభవించిన విప్లవాల ఫలితంగా రాజ్యాంగాలు ఏర్పడినప్పుడు వాటిలో పేర్కొనబడిన మానవ హక్కులను మౌలిక హక్కులంటాం. వాటిని ప్రాతిపదిక హక్కులని, ప్రాథమిక హక్కులని కూడా పిలవడం కద్దు. మౌలిక హక్కులను రాజ్యాంగం విధిగా అమలుపరచాలి. అమలుపరచే హక్కుల జాబితాలో చేర్చని కొన్ని హక్కులను రాజ్యాంగంలోని ఆదేశక సూత్రాలలో ఉ టంకిస్తున్నారు. వీటి అమలును ఏ పౌరుడు హక్కుగా కోరుటకు వీలులేదు. ఇలా మౌలిక హక్కులు, ఇతర హక్కులు అని విభజన జరిగింది. పౌరులకు శాసనపరంగా కొన్ని హక్కులు సంక్రమిస్తున్నాయి. వాటి అమలు శాసనం యొక్క ప్రామాణికత మీద ఆధారపడుతుంది. అలా శాసనపరమైన హక్కులను వేరే తెగగా పేర్కొనవచ్చును.

మానవ హక్కులు ఏవో, మహిళల హక్కులు ఏవో చాలామంది మహిళలకు తెలియవు. అంతేగాక శాసనపరంగా వారికి సంక్రమిస్తున్న హక్కుల వివరం స్త్రీ లోకానికి పరిచయం కాదు.

జాగృతి చైతన్యంగల పౌరులుగా స్త్రీలు జీవించాలంటే వారికిగల అన్ని రకాల హక్కుల స్వరూప స్వభావాలు వారికి అవగతం కావాలి. అందుకు వారికి వాటి సంబంధమైన సమాచారం అందజేయబడాలి. విషయం తెలియని వారు దీన్ని గురించైనా పట్టించుకోలేరు కదా!

హక్కులను గురించి తెలుసుకోవడం, వాటిని విస్తరింప జేసుకోవడం, వాటిని రక్షించుకో వడం స్త్రీల ప్రథమ కర్తవ్యం. స్త్రీలు అందులో ముఖ్యంగా కార్మిక స్త్రీలు, కష్టజీవుల కుటుంబాల స్త్రీలు తమ విధి నిర్వహణలో ఈ విధ్యుక్త ధర్మానికి పూనుకోవలసి వుంటుంది. ఈ ప్రయత్నానికి బలం చేకూర్చే నిమిత్తం, సాయపడే నిమిత్తం అంతర్జాతీయ మానవవాద నైతిక సంస్థ (ఐ.హెచ్.ఇ.యు) సహాయ సహకారాలతో మహిళాభ్యుదయ సంస్థ "మహిళల హక్కుల పరిరక్షణ కేంద్రాన్ని "నెలకొల్పింది.

ఈ సందర్భంగా ఒక పూర్వగాథను ప్రస్తావించటం సముచితం. 1990లో అంతర్జాతీయ మానవవాద నైతిక సంఘ ప్రధాన కార్యదర్శి శ్రీమతి నెట్టీక్లీన్ హైదరాబాదు

వచ్చారు. మేము ఏర్పాటుచేసిన సభల్లో మాట్లాడారు. ఇక్కడి సంగతులు తెలుసుకున్నారు. పోతూ పోతూ "సుబ్బమ్మా! నీవు ఇన్ని మంచిపనులు చేస్తున్నావు అంతర్జాతీయ సంఘం వద్దనుండి ఏ సహాయం అడగవేం" అని ప్రశ్నించింది. "సహాయం సర్వ సామాన్యంగా అడగడం చేతకాదు అని బదులు చెప్పాను. అంతటితో సంభాషణ ముగిసింది. నేను అఖిల భారత నవ్య మానవవాద సంస్థ కార్యనిర్వాహక వర్గ సభ్యురాలనని, 1978లో ప్రపంచ మానవవాద మహాసభ లండన్ వెళ్ళి వచ్చానని ఆమెకు తెలుసు. ఇదంతా ఆమె మనస్సులో మెదులుతున్నది కాబోలు తరువాత అంతర్జాతీయ సంఘంలోని ఆమె సహచరి నుండి ఉత్తరం వచ్చింది. మానవ హక్కులను గురించి మహిళల్లో ప్రచారం చేసే బాధ్యతను చేపట్టమని అందులో అభ్యర్ధన వుంది. నేను నా సహచరులు మహిళాభ్యుదయ సంస్థ ద్వారా చేసే పని అదే గనుక అంగీకరించి వారికి ఒక ప్రణాళికను సిద్ధం చేసి పంపాను. ఆ ప్రణాళికను వారు ఆమోదించారు. ఇంతకూ చెప్పేదేమంటే మంచిపనికి అనుకోకుండా ఎక్కడ నుంచో ప్రోత్సాహం రాకపోదని నాకు తోచింది. మామూలుగా మన సంస్థ ఒక్క టే చేసే కన్న మిత్రుల సహకారంతో ఇతోధికంగా సమర్ధవంతంగా కార్యక్రమాన్ని సాగించవచ్చు.

# 5. ధర్మ సంస్థలు

## మల్లాది సుబ్బమ్మ ట్రస్టు

ఆందోళనా కార్యక్రమాల పై నొక్కు తగ్గించి ప్రబోధ కార్యక్రమాలకు, సంస్థ నిర్మాణ కార్యక్రమాలకు చాలా కాలము వెచ్చించటంవల్ల సాహిత్య సృష్టికి తగిన అవకాశం దొరికేది కాదు. అంతేకాదు, స్త్రీలు ప్రతిసారి ఆందోళనోద్యమంలో పాల్గొనమంటే భయపడి వచ్చేవారు కాదు. అందువల్ల ప్రబోధం ద్వారా, ప్రచారం ద్వారా, ప్రచురణల ద్వారా నిర్మాణాత్మక కార్యక్రమాలకు నా శక్తియుక్తులను వినియోగిద్దామనే ధ్యేయమే ఆ నిర్ణయానికి కారణభూతమైంది. అదీగాక ఆందోళనా కార్యక్రమంలో వుండే ఇబ్బందులు, చిక్కులు, చికాకులు కూడా నా మార్గం మార్పుకు తోడ్పడినాయి. ప్రబోధాత్మక సంస్థ నెలకొల్పుదామని సంకల్పించాను. ఎం.వి.ఆర్ ను సంప్రదిం చాను. 'సంస్థ నిర్మాణం తేలిక విషయం కాదు. దానికి ధనబలం, మనుష్య బలం వుండాలి' అని అన్నారు. 'మనుష్య బలం మంచి పనికి రాకపోదు' అన్నాను. 'సరే, ఇక ధన బలం సంగతి చెప్పు' అన్నారు. "నేను బ్రతికి ఉన్నన్నాళ్ళు నేను స్థాపించే సంస్థలు ఆగిపోకుండా, అంతరించి పోకుండా నాది పూచి" అని సమాధాన పూర్వకంగా, ప్రతిజ్ఞ రూపంలో జవాబు చెప్పాను. "నీవు గ్యారంటీగా అలా చేస్తావని నమ్మకం ఏమిటి? పరిస్థితులు తారుమారు కావచ్చు. కనుక ప్రతి ఒక్క సంస్థకు కొంత ఖర్చు పెట్టగలగాలి" అన్నారు. ఆ ప్రతిపాదన సమంజసంగా తోచింది. ఆనాడు "పిల్లల ఖర్చులుపోను నావద్ద ఇరువది వేల రూపాయల నగదు వుంది. దానిని ఈ సంస్థలకు వెచ్చిస్తాను." అన్నాను. అయితే ఆ మొత్తంతో నీ పేర ట్రస్టు ఏర్పరచమని సలహా చెప్పి, నేను అంగీకరించినదే తడువుగా దస్తావేజును వ్రాసి నా చేత 1980 జులైలో ఎం.వి.ఆర్. రిజిష్టరు చేయించారు. ఈ ట్రస్టుకు 'మల్లాది సుబ్బమ్మ ట్రస్టు' అని పేరు పెట్టాము. నేనూ, ఎం.వి.ఆర్. కాక నా కుమారులను, కుమార్తెను శ్రీ పి. సత్యనారాయణను జీవిత కాలపు ట్రస్టీలుగా పేర్కొన్నాను. మున్ముందుగా నేను, నా తదనంతరం ఎం.వి.ఆర్. మేనేజింగ్ ట్రస్టీలుగా వ్యవహరించే ఏర్పాటుచేశాను. మూలధనాన్ని పెంచి కార్యరంగ పరిధిని పెంచాలనే సంకల్పంతో ఇలా చేశాను.

మానవవాద, హేతువాద, లౌకిక, ప్రజాస్వామ్య ఉద్యమాలను, సంస్థలను పోషించటం. బలపరచటం ఆశయంగా ట్రస్టు దస్తావేజులో పేర్కొన్నాను. మహిళోద్యమాన్ని పెంచటం. అండగా నిలవటం, యువతీ యువకులలో సత్యాన్వేషణాసక్తిని, స్వేచ్ఛా పిపాసను వృద్ధి చేయటం, భావ పునర్వికాస ఉద్యమ వ్యాప్తికి తోడ్పడటం కూడా ఆశయాల జాబితాలో చోటు చేసుకున్నాయి. బహుమతులు, స్కాలర్ షిప్పులు, పరిశోధకులకు గ్రాంట్లు ఇవన్నీ ఇవ్వటం, మహిళలకు శరణాలయాలు రక్షణాలయాలు స్థాపించటం, మహిళా సంఘాల కార్యకర్తలకు శిక్షణాలయాలు నెలకొల్పటం ఇవన్నీ ట్రస్టు కార్యకలాపాల

క్రిందనే లెక్క. ఇలా పుట్టింది "మల్లాది సుబ్బమ్మ ట్రస్టు". మహిళాభ్యుదయ సంస్థ, మహిళాభ్యుదయ గ్రంథాలయం, అభ్యుదయ వివాహవేదికలు పుట్టిన తొలి రోజుల్లో వాటికి సుబ్బమ్మ ట్రస్టు నుండి విరాళాలు ఇచ్చాం. తరువాత అవి పెరిగి పెద్దవయి వాటంతట అవి మనగల్గుతున్నాయి. వాటికన్నింటికీ ఈనాడు వేలలో నిధులు వున్నాయి. ఈనాడు మహిళాభ్యుదయ సంస్థకు రూ॥ 20 వేలున్నూ, వివాహ వేదికకు రూ॥ 30 వేల డిపాజిట్లు డొనేషన్ల ద్వారా సంపాదించగలిగాను. ఒక పరిస్థితిలో నేను వ్రాసిన మహిళోద్యమానికి అవసరమయిన కొన్ని పుస్తకాలను-మల్లాది సుబ్బమ్మ ట్రస్టు ముద్రించింది. అలా మహిళా సారస్వత సృష్టికి ఈ ట్రస్టు దోహదం చేసింది.

## మహిళాభ్యుదయ ట్రస్టు

కాలం గడిచిన కొద్దీ నేను స్థాపించిన సంస్థలు బలపడసాగినాయి. అంతవరకు మహిళోద్యమ అవశ్యకతను గురించి మధ్య తరగతి స్త్రీలలో ప్రచారం చేశాను. ఇప్పుడు మరో దశ కార్యక్రమాలు చేపట్టటం అవసరమని భావించాను. ఈ సందర్భంలో కొన్ని విషయాలు స్పష్టీకరించవలసిన అగత్యం వుంది. స్త్రీలలో ఎక్కువమంది నిరక్షరాస్యులు. అందులో అధిక భాగం గ్రామాలలో నివసిస్తున్నారు. కనుక గ్రామీణ స్త్రీలకు ఇతోధిక సేవలను అందించాలనే అభిప్రాయం నాలో బలపడింది. నిజానికి స్త్రీ విమోచన ప్రణాళికల ద్వారా గ్రామీణ మహిళా సంఘాల కార్యకర్తలకు శిక్షణ ఇవ్వటం జరిగింది. అది హైదరాబాద్ కేంద్రంగా కొనసాగింది. అలాకాక ఏదో ఒక గ్రామం కేంద్రంగా పనిచేయాలని సంకల్పించాను. అందుకని ఇంచుమించుగా 'మల్లాది సుబ్బమ్మ ట్రస్టు'కున్న ఆశయాలతోనే "మహిళాభ్యుదయ ట్రస్టు'ను స్థాపించదలచాను. దానిలో నేను, ఎం.వి.ఆర్, కె.ఆర్. మల్లాది, మరో మిత్రుడు కె. ప్రతాపరెడ్డి శాశ్వత ట్రస్టీలు. నేను మేనేజింగ్ ట్రస్టీని. నాతదనంతరం ఎం.వి.ఆర్. మేనేజింగు ట్రస్టీగా వుంటారు. తరువాత ఇతరులు మేనేజింగు ట్రస్టీగా ఎన్నుకోబడతారు.

మహిళాభ్యుదయ ట్రస్టు ఏర్పడటానికి మరో కారణం కూడా వుంది. 'మల్లాది సుబ్బమ్మ ట్రస్టు' అంటే ప్రజల నుండి వచ్చే సహకారం కన్నా 'మహిళాభ్యుదయ ట్రస్టు' అనే పేరుతో ఉన్న ట్రస్టుకు ప్రజల నుండి ఇతోధిక సహాయ సహకారాలు అందుతాయని ఆశించాను. ఈ ట్రస్టు దస్తావేజు తేది. 21-11-1987న వ్రాశాను. అది రిజిష్టరు అయింది. దానికి ఆదాయపు పన్ను శాఖవారు పన్ను మినహాయింపు ఇచ్చారు.

1987 నవంబరు 21వ తేదీన ట్రస్టు పేర రంగారెడ్డి జిల్లా శంకరపల్లి మండలంలోని జనవాడి గ్రామంలో ఒక ఎకరం 50 సెంట్ల భూమిని కొనుగోలు చేశాము. అలాగే 1988లో జనవాడ గ్రామానికి పోయే రోడ్డు మీదవున్న మరొక ఎకరం 50 సెంట్ల స్థలాన్ని భవన నిర్మాణం కోసం కొన్నాను. రెండు స్థలాల దస్తావేజులు రిజిష్టరు

అయినాయి. రెండవ స్థలం మెయినాబాదు మండలం చందానగర్ పరిధిలో వుంది. నిజానికి జనవాడ గ్రామానికి మొదటి దానికన్నా ఇదే దగ్గర. మొదటి స్థలాన్ని ఆనుకొని అర ఎకరం, రెండవదాన్ని ఆనుకొని మరో రెండు ఎకరాల పొలం నా పేర విక్రయించుకున్నాను. ట్రస్టు ఆస్తులలో భవనాలు వగైరాలు నిర్మిస్తే వాటిని ఆజమాయిషీ చేయాలని సంకల్పంతో అలా చేశాను. ఎప్పటికయినా వాటిని కూడా ట్రస్టుకు ఇచ్చేవే. కారణాంతరాలవల్ల ఇంతవరకు ట్రస్టు భూములలో భవన నిర్మాణం సాగలేదు. గ్రామీణ స్త్రీలలో కొందరిని ఎంపికచేసి సంప్రదాయేతర వృత్తులలో శిక్షణ ఇవ్వాలని, వారి జీవనోపాధికి గాను తాపీ పని, నీళ్ళపంపు గొట్టాలు వేయటం, విద్యుచ్ఛక్తి సౌకర్యం ఇళ్ళకు కల్పించడం లాంటి వృత్తులను వారికి నేర్పాలని సంకల్పించి భూవసతులను ఏర్పరచి పని ప్రారంభించాను. 1991లో ట్రయినింగు సెంటరు మొదలవుతుంది.

1987 నుండి నేను అవిచ్ఛిన్నంగా నడుపుతున్న 'స్త్రీ, స్వేచ్ఛ' మాసపత్రికను 1990లో మహిళాభ్యుదయ ట్రస్టుకు బదిలీ చేశాను. దాని పోషణకు ఒక లక్షన్నర రూపాయల పై చిలుకు నిధిని శాశ్వత ప్రాతిపదికపై అమర్చాను. కనుక పత్రిక శాశ్వతంగా నడుస్తుందని నా ఆశాభావం.

మున్ముందు మహిళాభ్యుదయ ట్రస్టు ద్వారా ఇంకా మహిళా సంక్షేమానికి మరెన్నో మంచి పనులు చేయగలుగుతాననే కలలు కంటున్నాను. ఆ కలలు నా జీవిత కాలంలోనే పండి ఫలిస్తాయని నేను గంపెడంత ఆశతో పనిచేస్తున్నాను.

# భాగం – VII

# మాటలు : చేతలు

# 1. వక్తృత్వం

మొదట్లో అసలు చదువే లేనిదాన్ని ఉపన్యాసాలు ఎలా ఇవ్వగలను? అదీకాక బాపట్ల చాలా చిన్న పట్టణం. అక్కడ సభలు, సమావేశాలు, చర్చలు జరగటం అనేది బహుతక్కువ. అందులో సభలలో స్త్రీలు పాల్గొనటం, ఉపన్యాసాలు ఇవ్వటం, చర్చా కార్యక్రమాలలో పాల్గొనటం అసాధారణంగా వుండే రోజులవి. అంతేకాక స్త్రీల హక్కులన్నా, సమస్యలన్నా వాటిని గురించి చర్చించటం అసలే మృగ్యం. ఆ ప్రదేశానికి ఎవరైనా గొప్ప నాయకులుగాని, గొప్పవారుగాని వచ్చినప్పుడు ఆ సభలకు ఆడవారు వెళితే అదొక విడ్డూరంగా భావించేవారు. వెక్కిరించేవారు. అలాంటి సమయంలో కనుపర్తి వరలక్ష్మమ్మగారు స్థాపించిన స్త్రీ హితైషిణి మండలిలో 1950లో బాపట్లలో స్థిరపడ్డాక సభ్యురాలిగా చేరి అనతి కాలంలోనే కమిటీ మెంబరుగా పరిఢవిల్లి, ఆ తర్వాత కోశాధికారి స్థాయికి ఎదిగాను. అప్పుడు అన్ని పనులలో కార్యక్రమాల్లో శ్రద్ధ వహించే దాన్ని. మరికొంత కాలానికి కండెన్సుడ్ కోర్సు నడపడంలో (అటెండెన్స్, లీవు మంజూరు, వంట సామాగ్రి ఇచ్చుట మొదలైన పనులు) మీటింగుల ఏర్పాటు, లెక్కలు రాయడంలాంటి వన్నీ చేసే దాన్ని.

ఆ తర్వాత నా 38వ ఏట – నేను 1962లో మెట్రిక్ పాసయ్యాను. అందువల్ల నేనెంతో గొప్పదాన్నని తలచి బాపట్లలోని సర్వోదయ మహిళా మండలివారు మహిళల మీద వారి వార్షికోత్సవ సభలో ఉపన్యసించమని నన్ను కోరారు. అది విన్న వెంటనే నేను చాలా ఆనందపడటమే గాక కొంచెం గర్వపడ్డాను కూడా. ఉపన్యసించాలని ఉబలాటం, సరదా మాత్రం వుండేది. మొదటినుండి నాకొక అలవాటు వుండేది. అంటే అదొక ఆత్మవిశ్వాసం అన్న మాట. అదేమిటంటే ఎవరు వచ్చి ఏ విషయం అడిగినా లేదు, కాదు, రాదు అనే మాట లేకుండా ఒప్పుకునే దాన్ని, చదివేదాన్ని, ఎంతో శ్రమపడి తయారయ్యే దాన్ని. అప్పుడు ఆ విధంగా మాట్లాడబట్టి అప్పటినుంచి నేను కూడా మాట్లాడగలను అనే ధైర్యం వచ్చింది. తెలియని విషయం గురించి మాట్లాడవలసి వచ్చినా నాభర్త రామ్మూర్తిగారు వివరించి చెపుతారని కొండంత ధైర్యం వుంటబట్టే ఒప్పుకునే దాన్ని, శాయశక్తులా శ్రమించి, చదివి, తెలిసికొని మాట్లాడేదాన్ని, ఆ ధైర్యమే ఈనాటికీ విశేష బలాన్ని చేకూర్చింది.

## మహిళా సంఘాలలో

1959 నుండి 63 వరకు స్త్రీ హితైషిణి మండలి కార్యదర్శిగా ఆ సంస్థ ప్రారంభ సభలకు, వార్షికోత్సవాలకు, గాంధీ జయంతి, స్వాతంత్ర్య దినోత్సవం లాంటి వాటికి, అభినందన సభల్లో, సన్మాన సభల్లో ముందు రాసుకుని చదివి ఆ తర్వాత మాట్లాడటం నేర్చుకున్నాను. 1964 నుండి రెండు సంవత్సరాలు గుంటూరు జిల్లా కుటుంబ

నియంత్రణోద్యమ గౌరవ ప్రబోధకురాలిగా (గుంటూరు జిల్లా ఫ్యామిలీ ప్లానింగ్ ఆనరరీ ఎడ్యుకేషన్ లీడర్) కేంద్ర ప్రభుత్వ స్కీములో పనిచేశాను. ఆ సందర్భంగా సుమారు ఐదు వందల గ్రామాలు పర్యటించాను. సభలలో ప్రసంగించాను. అనేక ప్రశ్నలు వేసేవారు. వారికి నచ్చేలాగా జవాబులు చెప్పగలిగే దాన్ని. అంతేగాక కుటుంబ నియంత్రణోద్యమానికి ప్రజా సంఘాల కార్యకర్తలను, ఉపాధ్యాయులను, ప్రభుత్వోద్యోగులను సుముఖులను చేసే నిమిత్తం శిబిరాలు నిర్వహించాను. అందులో నేను పలువురు పెద్దలతోపాటు ప్రసంగించే దాన్ని. ఇలా రాటు తేలటం వల్ల నా వక్తృత్వ ధార నానాటికి పెరిగింది. అది ఉబలాట మనండి, ఉత్సాహ మనండి, పేరు కోసమనుకోండి మొదట్లో ఎవరన్నా అడిగితే చాలు ఎగిరి గంతేసి ఎన్ని పనులున్నా నెట్టేసి వెళ్ళేదాన్ని.

1967 నుండి చీరాల వెళ్ళే దాకా శారదా మహిళా విజ్ఞాన సమితి అధ్యక్షురాలిగా ఉన్నప్పుడు ధాటిగా మాట్లాడటం అలవాటయింది. బాపట్ల రోటరీ క్లబ్బులో కుటుంబ నియంత్రణ గురించి ఇంకా అనేక విషయాలు అధికారికంగా ప్రసంగించాను. మహిళా మహాసభల్లో ఉపన్యసించటానికి వెనుతీసే దాన్ని కాను. వేదిక నెక్కటానికి పిరికితనం లేకపోవటంతో నా పని సులువయింది. నాకు మెట్రిక్ చదువులో తెలుగు పాఠాలు చెప్పిన ఉపాధ్యాయుని ధర్మమా అని కాస్త తెలుగుభాషా పరిజ్ఞానం అబ్బింది. బెదురు లేదు. భాషా దారిద్ర్యం లేదు. దాంతో ఉపన్యాసకురాలిగా రూపొందాను. క్రమేపి ప్రజలకు విజ్ఞానపరమైన రీతిలో, సిద్ధాంతపరమైన లక్ష్యాలను విశదీకరించాలనే భావం నాలో ప్రబలంగా వుండేది. 1972లో ఆంధ్రోద్యమం వచ్చింది. చీరాల స్త్రీల కళాశాల పై జెండా కట్టాను. అరెస్టు చేశారు. జైలు శిక్ష అనంతరం చీరాల తాలూకా ఆంధ్రోద్యమ సంఘానికి ఉపాధ్యక్షురాలిగా నన్ను ఎంపిక చేశారు. ఆ సందర్భంగా తాలూకా మొత్తంమీద సుమారు వంద సభలలో మాట్లాడాను. వక్తగా పరిగణన వచ్చింది. జై ఆంధ్ర ఉద్యమంలో విజయవాడలో మహిళా మహాసభ జరిగింది. అందులో ఉపన్యసించాను. రామ్మూర్తిగారితో కలిసి ఆంధ్ర ప్రాంతం పర్యటించాను. చిత్తూరు నుండి విశాఖ దాకా సభలలో ఉపన్యసించటానికి అవకాశం వచ్చింది. ఒకటేమిటి ఏ సభ జరిగినా, సమావేశం జరుపుతున్నా స్త్రీల తరపున నన్ను ఆహ్వానించేవారు. అంతే కాదు విజయవాడలో 1973 నుండి 76 దాకా ఉన్నప్పుడు రేడియోలో చాలాసార్లు ప్రసంగించాను.

1977లో హైదరాబాదు చేరిన తర్వాత ఎన్నికల సభలలో ప్రసంగించవలసి వచ్చింది. జనతా పార్టీ అభ్యర్థులను బలపరుస్తూ మలక్ పేట నుండి బొల్లారం దాకా అనేక సభలలో పాల్గొన్నాను. 1978లో శ్రీ వెంగళరావుకు వ్యతిరేకంగా శ్రీ కాళోజీ అసెంబ్లీ ఎన్నికలలో పోటీచేస్తే సుమారు పది రోజులు సత్తుపల్లిలో వుండి ఆ నియోజకవర్గ సభలలో మాట్లాడాను. తరువాత 1980లో హైదరాబాదు పార్లమెంటరీ నియోజకవర్గం

నుండి నేను పోటీచేసినప్పుడు నెల రోజులు విధి విరామం లేకుండా ఉపన్యసించటం తప్పనిసరి అయింది.

ఇతర సంస్థల్లో, అధ్యయన తరగతుల్లో, మహాసభలలో ప్రసంగించటం పరిపాటి అయింది. ఇతర పట్టణాల వారి ఆహ్వానాలు అంగీకరించే దాన్ని. విశాఖపట్టణం నుండి అనంతపురం దాకా, విజయవాడ నుండి నిజామాబాదు దాకా ముఖ్యోపన్యాసకురాలిగా వెళ్ళటం అనవాయితి అయింది. శక్తివంతంగా మాట్లాడతానని, వాగ్ధోరణి కల వ్యక్తినని, ఆశువుగా ప్రసంగించగల శక్తి కలదాన్నని పలువురు ప్రశంసించటం పరిపాటి అయింది. బహుశ వీటన్నిటినీ దృష్టిలో పెట్టుకొనే కాబోలు ఉదయం పత్రిక వారు తమ ప్రత్యేక సంచికలో "వాగ్దేవి" అని నాకు పేరు పెట్టి చమత్కరించారు. ఇందులో నిజం లేకపోలేదు. కాకపోతే నా ధోరణిని తట్టుకోలేనివారు కూడా ఉన్నారు. కుండబద్దలు కొట్టినట్లు నిర్భయంగా విషయాన్ని చెప్పటం నా నైజం. తీవ్రమైన పదజాలం వాడటం నా స్వభావం. ఏ సభవారు ఆహ్వానించినా నేను నమ్మిన సత్యాలు, ఆచరించ వాటిని, వ్రాసే భావాలనే చెప్తా కాని వారు ఈ విధానంలో చెప్పమంటే వెళ్ళను. భావం, భాష, రీతి అన్ని నా సొంతంగా నిర్దిష్టంగా చెప్పటమే అలవాటయింది. నా వక్తృత్వ లోపాలు నాకు తెలిసినట్లు మరెవ్వరికీ తెలియవేమో! నా ప్రసంగాలలో వేగం హెచ్చు. ఆ తొందరలో తేదీలు, అంకెలు కొన్ని సందర్భాలలో తారుమారు అయ్యేవి. కాలం గడిచిన కొద్దీ ఆ లోపాలను సరిదిద్దుకుంటూ వచ్చాను. నా వాగ్ధాటికంటే నా ఉపన్యాసంలోని భావాలు చాలా తార్కికంగా వుంటాయని చాలామంది అంటూ వుంటారు. నా నోటి మాట, నా కలం వ్రాత, నా చేతలు అన్నీ మహిళోద్యమానికి బాసటగా నిలవాలని నా ఆకాంక్ష.

# 2. ఇతరులతో కలిసి సమిష్టి కృషి

నేను సంఘాలు నిర్మించి వాటితో పనిచేయటం ఒక ఎత్తు, ఇతరులు స్థాపించిన సంఘాలలో తగిన పాత్ర నిర్వహించటం మరో ఎత్తు. సభ్యురాలిని కాకుండా ఇతరుల సంఘాలలో కలిసి పనిచేయడం వేరొక పద్ధతి. మూడవ విధానం ప్రకారం నేను కొన్ని సంఘాలలో సభ్యురాలిని కాకుండా వారి సంఘాలతో సహకరించడం కూడా జరిగింది, జరుగుతున్నది కూడా.

నేను నిర్మించిన సంఘాల చరిత్ర మరో చోట వివరించాను. ఇతరులు స్థాపించిన సంఘాలలో నా కృషి కొంతగా కొంత విశదపరచటం జరిగింది. స్త్రీ హితైషిణీ మండలిలో నా ప్రమేయం, శారదా మహిళా విజ్ఞాన సమితిలో నా అధ్యక్షత్వం, బాపట్ల తాలూకా గుంటూరు జిల్లా మహిళా సభలలో నా భాగస్వామ్యం, బాపట్ల ఉమెన్స్ కాటేజీ ఇండస్ట్రీస్ కోఆపరేటివ్ సొసైటీలో నా కార్యదర్శకత్వం, అన్నవరపు వారి బాలికా ప్రాథమికోన్నత పాఠశాలకు నేను మేనేజరుగా వుండటం, యువతులకు సంస్కృత విద్యను గరపటానికి ఏర్పడిన వనితా విద్యాలయంలో కార్య దర్శకత్వం ఇవన్నీ ఇతరులు అంతకు క్రితం నిర్మించిన లేక నాతో కలిసి నిర్మించిన సంస్థలలో పనిచేయటం క్రింద లెక్కకు వస్తుంది. బెజవాడ ఫిలిం సొసైటీలో నా ఉపాధ్యక్ష పదవి, జై ఆంధ్ర ఉద్యమంలో నా చొరవ, జె.పి. ఉద్యమంలో నా పాత్ర, హైదరాబాదు నగర వరకట్న మరణ దర్యాప్తు సంఘంలో నా భాగస్వామ్యం ఈ తరగతి క్రిందికే వస్తాయి.

బెజవాడ ఫిలిం సొసైటీవారు ప్రతి నెలా ప్రజోపయోగమైన ఒక మంచి ఫిల్మును ఎంపికచేసి ప్రదర్శించే వారు. దాంట్లో 800 మంది సభ్యులుండే వారు. ఆ కార్యనిర్వాహక వర్గం వారు నన్ను ఉపాధ్యక్ష పదవి స్వీకరించమని కోరారు. నేను అంగీకరించాను. దానితో నాకు ఫిలిం ప్రపంచంతో పరిచయం కల్గింది. ప్రజల సమస్యలు, ముఖ్యంగా స్త్రీల పై నిర్మించిన చిత్రాలు, అవార్డు చిత్రాలు తెచ్చి చూపేవాళ్ళు. ఫిలిం డిస్ట్రిబ్యూటర్సు క్రొత్త సినిమాలను విడుదలకు పూర్వమే కొందరు రసజ్ఞులకు చూపేవారు. అలాంటి ప్రదర్శనలకు నాకు ఆహ్వానాలు వచ్చేవి. ఫిలిం సొసైటీ సభ్యత్వం తేలికగా యివ్వాలని, పెరిగిన సభ్యుల సంఖ్యకు తగ్గట్టుగా రెండు ఫిలిం ప్రదర్శనలు ఇవ్వాలని ప్రతిపాదనలు తెచ్చాను. ఆచరణ సాధ్యంకాదని హెచ్చు కార్యక్రమాలు ఎత్తుకోవడానికి విముఖత చూపారు. రెండు థియేటర్లలో చూపాలనే నా ప్రతిపాదన వీగిపోయింది.

ఇకపోతే నేను సభ్యత్వం స్వీకరించకుండా ఇతరుల సంఘాలతో సహకరించటం మూడవ కోవక్రింద చెప్పాలి. ఎమర్జెన్సీని తెచ్చి పెట్టిన కాంగ్రెసు పార్టీకి ప్రత్యామ్నాయంగా ఉదయించిన జనతాపార్టీ మహిళా విభాగ్ నిర్మాణంలోను, జనతాపార్టీ ప్రచారంలోను నేను పాల్గొనడాన్ని గురించి వేరే అధ్యాయంలో వివరణ వచ్చింది. ప్రజాస్వామ్య

పరిరక్షణోద్యమం తరపున నిజాం కాలేజీ సమావేశాన్ని గురించి ప్రత్యేకంగా ప్రస్తావన వచ్చింది.

## క్రాసు, ఆర్.డి.ఏ.ఎస్, అవేర్ లతో సహకారం

గ్రామాలలో జాగృతి కల్గించటానికి, గ్రామ మహిళలలో చైతన్యాన్ని పెంపొందించడానికి అనేక స్వచ్ఛంద సంస్థలు పనిచేస్తున్నాయి. అందులో శ్రీ కురియన్ నాయకత్వాన పనిచేసే క్రాసు, శ్రీ థామస్ మార్గదర్శకత్వంలో కృషిచేసే ఆర్.డి.ఎ.ఎస్. శ్రీ మాధవన్ ఆధ్వర్యాన నడిచే అవేర్ సంస్థలు ముఖ్యమయినవి.

క్రాసు సంస్థ హైదరాబాదు చుట్టూ వున్న మూడు జిల్లాలలో సుమారు పది సంవత్సరాలు గట్టిగా కృషి చేసింది. వారు నిర్వహించే శిక్షణా తరగతులకు అధ్యాపకురాలిగా వెళ్ళేదాన్ని. అంతేకాదు ముప్పై రెండు గ్రామాలలో ఆసాముల దొడ్లలో కసవు ఊడ్చే మహిళలను వెయ్యి మందిని సంఘటిత పరిచింది క్రాస్. ఎక్కువ వేతనం కావాలని డిమాండు చేయడానికి కూడిన సభ అది. న్యాయమైన వేతనం చెల్లించకపోతే వారు సమ్మె చేస్తారని జరిగిన ఆ సభలో నేను ప్రకటించాను. తరువాత కొలది రోజులకే ఆ మహిళల వేతనాలు పెరిగాయి. 1985 సంవత్సరంలో క్రాస్ సంస్థ దశమ వార్షిక మహాసభ జరిగింది. ఆరువేల మంది స్త్రీ, పురుషులు హాజరయినారు. ఆ సభలో స్త్రీల హక్కులు, సమస్యలు, డిమాండ్లు వీటి పైన నేను ఉపన్యసించాను. ఆర్.డి.ఏ.ఎస్. అనేది విదేశ సంస్థల నుండి ధన సహాయాన్ని ఎవరికి ఇవ్వాలో సూచించే సంస్థ. దానిలో కార్యనిర్వాహక సభ్యురాలిగా కొన్ని సంవత్సరాలు కృషిచేశాను. వారు నిర్వహించిన శిక్షణా తరగతులలో, పునశ్చరణ తరగతులలో నేను అధ్యాపకురాలిగా ప్రసంగించేదానిని.

అవేర్ సంస్థ మూడు, నాలుగు రాష్ట్రాలలో గ్రామ ప్రజలకు సేవ చేసే సంస్థ. స్వావలంబనం, మహిళా లోకంలో చైతన్యం, ఆర్థిక పురోగతి, గ్రామీణాభివృద్ధి ముఖ్యాంశాలు. అవేరు వారు వెయ్యిమంది మహిళలను సమీకరించారు. నేను ముఖ్యోపన్యాసం చేశాను. సుమారు వంద గ్రామాల నుండి ప్రతినిధులుగా మహిళలు వచ్చారు. అంతమంది మహిళలకు, అన్ని ప్రాంతాల మహిళలకు నా భావాలను ఎరుకపరచగలిగాననే తృప్తి నాకు కల్గింది.

మహిళా హక్కుల రక్షణ సంఘం (మార్పు) అనే పేరుతో హైదరాబాదులో ఒక సంఘం పనిచేసింది. ఆ సంస్థ స్థాపననుండి నేను ఉపాధ్యక్షురాలిగా వున్నాను. ఆ సంఘం వారు లంబాడి మహిళలకు వడ్రంగం, తాపీ పని, కారునడపటం అన్నీ నేర్పారు. మహిళల చేత పచ్చళ్ళు తయారు చేయించి విదేశాలకు పంపేవారు. ఆ సంస్థ ఇంకా

ఆరోగ్యం, విద్య, ఇళ్ళు కట్టడం కూడా నేర్పించేది. అనేకమంది స్త్రీలకు ఇళ్ళ పట్టాలు, రేషన్ కార్డులు ఇప్పించే వాళ్ళు.

## అధిక ధరలకు వ్యతిరేకంగా

అధిక ధరలను నిరసిస్తూ హైదరాబాదు నగరంలోని మహిళా సంస్థలు ఆందోళన లేవదీశాయి. అందులో కమ్యూనిస్టులకు చెందిన ఆం. ప్ర. మహిళా సమాఖ్య, మార్క్సిస్టుల సంఘం ఆం.ప్ర. మహిళా సంఘం, మహిళాభ్యుదయ సంస్థ సమిష్టిగా 1979లో ప్రదర్శన చేశాం. కోర్కెల పత్రం గవర్నరుకు సమర్పించాం. సమిష్టి కార్యాచరణకు నేను సర్వదా సిద్ధంగా ఉండే దానిని.

వరకట్న మరణాలను నిరసిస్తూ నిందితుల ఇళ్ళవద్ద ప్రదర్శనలు చేయటం, నిందితులను ప్రజల దృష్టిలో సంఘ వ్యతిరేకులుగా చిత్రించటం మా ఆశయంగా ఉ ండేది. తీవ్రవాద మహిళోద్యమ కార్యకర్తలు, నేనూ, మరి కొందరు అలాంటి ప్రదర్శనలలో పాల్గొనే వారం. అలా సుమారు రెండు సంవత్సరాలు సాగింది. తరువాత అలాంటి ప్రదర్శనవల్ల పెద్దగా ఉపయోగం లేదని గ్రహించాం.

## వరకట్న మరణ దర్యాప్తు సంఘం

వరకట్న మరణాల సంఖ్య పెరగటం చైతన్యం కల మహిళల మనస్సులను కలచి వేసింది. ఆ సంబంధమైన కేసులు వీగిపోవ నారంభించాయి. కేసులు నమోదు చేసుకోవడం, శవ పంచాయితీ, వైద్య పరీక్ష, నేరారోపణా పత్రాన్ని పోలీసులు తయారు చేయటం, పోలీసుల చేత సాక్షుల విచారణ, కోర్టులో విచారణ ఇలా అన్ని దశలలోను నిందితులు తప్పించుకోవడానికి అవకాశాలుండేవి. అందు విషయమై అందోళన చేయటానికి, ప్రజలలో ముఖ్యంగా స్త్రీలలో జాగృతి చైతన్యం కలుగచేయడానికి, దర్యాప్తులో, కోర్టు విచారణలో సహాయం చెయ్యటానికి వరకట్న మరణ దర్యాప్తు సంఘం ఏర్పడింది. ఆ సందర్భంగా దూరదర్శన్ లో ప్రసంగాలు చేశాము. వరకట్న మరణముల పై ఐదు సంఘటనలకు 'ఎపిసోడ్స్' చిత్రించి వాటిని ప్రదర్శించింది సంఘం. నేనూ మాట్లాడాను. కొంతకాలం దర్యాప్తు కమిటీ మీటింగులకు వెళ్ళే దానిని. దరిమిలా ఇతర కార్య భారాలవల్ల వెళ్ళలేకపోయినాను. అనేకమంది మా సంస్థ వద్దకు రావడం

మొదలయింది. తరువాత మహిళాభ్యుదయ సంస్థ తరపున వరకట్న నేరాల దర్యాప్తు కమిటీని ఏర్పరచి పనిచేస్తున్నాం. నేరానికి బలిఅయిన స్త్రీ నుండి, ఆమె తల్లితండ్రుల వరకు కేసును మాఫీ చేసే ప్రయత్నం చేసేవారు. పెళ్ళాన్ని చంప ప్రయత్నించినా, చంపినా, పిల్లనయినా సరిగా చూస్తారని భ్రమపడి, పిల్లల సంక్షేమ

భద్రతల దృష్ట్యా పిల్లల తల్లి తప్పు తనమీద వేసుకొని, స్టౌ వెలిగిస్తుంటే తన చీరెకు నిప్పు ముట్టుకుందని, అసత్యాలతో మరణ వాఙ్మూలం ఇచ్చేది. ఇక పోలీసుల సంగతి సరేసరి. మొత్తంమీద కేసులను రుజువుచేసి నిందితులను శిక్షించలేక పోతున్నాం. భార్యాహంతకులు శిక్షలనుండి తప్పించుకుని పోతున్నారు. ఇది బాధాకరం, శోచనీయం. అయినా కేసులు ప్రొటక్షన్ సెల్ కి పంపడం, కోర్టులకు పంపటం, సాక్ష్యాలు సేకరించటం లాంటి పనులన్నీ చేస్తూనే వున్నాం.

## వృద్ధ మహిళాశ్రమం

హోటల్ కృష్ణా ప్రొప్రయిటరు శ్రీ బాదం రామస్వామి స్వయం కృషితో వృద్ధిలోనికి వచ్చిన వ్యక్తి. తన చిన్ననాటి కష్టకాలాన్ని మరచిపోకుండా ఆయన తను స్థాపించిన ట్రస్టుల ద్వారా దానధర్మాలు చేయసాగారు. తన పుట్టిన రోజున ప్రతి సంవత్సరం తన వయస్సు ఎన్ని సంవత్సరాలు నిండితే అన్ని వేల రూపాయలు దానధర్మాలు చేయటం ఆయన అలవరచుకు న్నాడు. ఆయన ధర్మబుద్ధి గమనించిన నేనూ, ఎం.వి.ఆర్. ఇద్దరం ఆయనను సంస్థ రూపకంగా దానం చేయడం మంచిదని సలహా చెప్పాం. సహృదయుడయిన రామస్వామిగారు ఆ ప్రతిపాదనను అంగీకరించారు. వృద్ధ మహిళాశ్రమం నెలకొల్పమని సలహా చెప్పాం. ఆయన తన ధనంతో నెలకొల్పడానికి సమ్మతి తెల్పారు. నార్సింగిలో తన భవనాలలో వృద్ధ మహిళా గ్రామాన్ని తన భార్య సరోజాదేవిగారి పేర స్థాపించారు. ఆ వృద్ధ మహిళాశ్రమాన్ని నిర్వహించే తమ ధర్మ సంస్థలో (ట్రస్టులో) నన్ను కూడా ట్రస్టీగా చేర్చుకున్నారు. అది ఆ దంపతుల సహృదయానికి సుహృద్భావానికి నిదర్శనం. సరోజాదేవిగారు ప్రధానంగా కార్యభారం మోస్తున్నారు. ధనాన్ని సమకూర్చి వెచ్చిస్తున్నారు. ఒక కన్వీనరుగా వుండి నేను ఆ ప్రయత్నానికి నైతిక సహాయం, మాట సహాయం చేస్తున్నాను. కాస్తంత కార్యభారాన్ని వహిస్తున్నాను. మంచిపని ఎక్కడ జరిగినా, ఎవరు చేసినా సహకరించటం, తోడ్పడటం నా నైజం. కనుక వృద్ధ మహిళాశ్రమ స్థాపన నాకు సంతోషము, తృప్తి కలిగించాయి.

వాసోర్డ్ – వాసవ్య సొసైటీ ఫర్ రూరల్ డెవలప్ మెంట్ – అనే సంస్థ శ్రీ ప్రసాద్ ఆధ్వర్యంలో గ్రామాభివృద్ధి కార్యక్రమం క్రింద బట్టలు, అప్పులు ఇప్పించే పథకం స్వీకరించింది. ఆ సంస్థకు గత ఐదేళ్ళుగా వైస్ ప్రెసిడెంటుగా వుండి యథోచితంగా సేవ చేస్తున్నాను. చించోడు, బురుజుగడ్డ గ్రామాలు తరుచూ వెళ్ళి వారికి క్లాసులు నిర్వహిస్తున్నాను. అలాగే స్త్రీ మేళా ఎగ్జిబిషన్లు, సెమినార్లు, స్నేహలతాభూపాల్ తో కలిసి పనిచేయడం పరిపాటి అయింది. రెడ్ క్రాస్, ఆంధ్ర యువతీ మండలి, ఆంధ్ర మహిళా సభ, మియాపూర్ వృద్ధాశ్రమం, ఆలిండియా ఉమెన్సు కాన్ఫరెన్సు వీటిలో జీవిత సభ్యురాలిగా ఉన్నాను. మహిళా దక్షత సమతి తరఫున 1990 ఫిబ్రవరి 21న

రాజభవన్ లో జరిగిన సభలో శ్రీమతి సుమన్ కృష్ణకాంత్, సోషల్ వెల్ ఫేర్ ఛైర్మన్, ఉమెన్ వెల్ ఫేర్ ఛైర్మన్ తోపాటు నేనూ వేదికపై ఆశీనురాలినయినాను. బాలికల సమస్యల మీద సెమినార్ ప్రారంభోత్సవ సభలో ముఖ్య ఉపన్యాసకురాలిగా పాల్గొన్నాను. ఆంధ్రప్రదేశ్ కుటుంబ నియంత్రణ శాఖలలో జీవిత సభ్యురాలిగా, కమిటీ మెంబరుగా వుండి నా సహాయ సహకారాలను అందించాను. ఉత్తమ రచయిత్రి ఎన్నికకు హేతువాద ఎవార్డు కమిటీకి నా సలహా కోరడం జరుగుతూనే వుంది. ఇంటర్ నేషనల్ హెల్తు ఆర్గనైజేషన్ లో లైఫ్ మెంబరుగా చేరి నసీమ్ హసన్, నందిని గాంధీలతో పాటు కార్యక్రమాలలో పాల్గొంటున్నాను.

# భాగం – VIII

# అవీ : ఇవీ

# 1. ఆంధ్రలో ఆడవారి ఆత్మకథలు అరుదేమో!

చరిత్రహీనులెవరయ్యా అంటే ఆడవారు అనక తప్పదు. అలాంటి ఆడది ఆత్మకథ రాయాలంటే గుండె ధైర్యం కావాలి. అది అంత తేలిక కాదు. ఆ రచయిత్రి కొంతగా కొంత పరిపక్వ దశకు ఎదగాలి. వ్రాయటానికి తాహతు. చర్యలుచేసి వుండాలి. ప్రజోపయోగకరమైన పనులుచేసి వుండాలి. ఆ పనులు చెయ్యాలంటే బుర్ర వుండాలి. ఆ బుర్ర నిండా మంచి ఆలోచనలుండాలి. ఆ ఆలోచనలను ఆచరణలో పెట్టగల స్తోమత వుండాలి. వనరులు కూడా సమకూరాలి. వయస్సు పండాలి. కుటుంబ సమ్మతి కావాలి లేదా ఏ బ్రహ్మచారిణో (వృద్ధ కన్య), విధవరాలో, విడివడి జీవిస్తున్న స్త్రీయో అయి వుండాలి. పరిస్థితులు అనుకూలించాలి. లోకజ్ఞానం వుండాలి. జీవితంలో ముందడుగు వేసి వుండాలి. కార్యనిర్వహణకు తగిన ఆరోగ్యం వుండాలి. ఇన్ని వున్నా ముఖ్యంగా కావాల్సింది మానసిక చైతన్యం. వ్యతిరేకతను సహించగల మనో నిబ్బరం కావాలి. కనుక ఒక వ్యక్తి మంచిపని చెయ్యాలంటే కేవలం శ్రమతోనే సరిపోదని, ఏదో రంగంలో రాణించగల శక్తి సామర్థ్యాలు వుండాలని అనుభవ జ్ఞానం నేర్పింది. ఇంత చెప్పినా చెప్పాల్సింది మరొకటి వుంది. ఆడవారు – ఆత్మకథకు నోచుకున్నవారు ప్రపంచ చరిత్రలోనే అంటే ఎనిమిది వందల కోట్ల జనాభాలో ఎనిమిది పదుల కన్నా లేరేమో అనిపిస్తుంది. ఇంక ఆంధ్రదేశం సంగతి మరి చెప్పాల్సిన పనిలేదు. పురుషులు తాముగా తమ ఆత్మకథలు వ్రాసుకునే వారు కొందరయితే, ఇతరులచేత జీవిత చరిత్రలను రమణీయంగా వ్రాయించుకునే వారు మరి కొందరున్నారు. మొత్తం మీద ఆత్మకథలయినా, జీవిత చరిత్రలయినా మగవారి గురించే వస్తూ వుంటాయి. ఆడవారి జీవిత చరిత్రలు కూడా అక్కడక్కడా పదో పరకో వచ్చినా అవి పురుషులే వ్రాస్తున్నారు. మగవారి ఆత్మకథల నిండావారే దర్శన మిస్తారు. ఆడవారు వ్రాసిన ఆత్మకథల్లో కూడా ఎక్కువగా వారి తండ్రులో, భర్తలో గోచరమవుతారు. రెండు రకాల ఆత్మకథల్లోనూ పురుషులే ప్రస్ఫుటంగా కనిపిస్తారు. వాస్తవానికి కన్పించాల్సింది ఆ కథను జీవించిన స్త్రీ. అలాంటివి అరుదుగా కనిపిస్తున్నాయి.

ఒక వ్యక్తి ఒక విశేషానుభవాన్ని పొందితే, తద్వారా ఆమె అనేక చర్యలకు పాల్పడితే ఆమెలో ఆలోచనలు ఉద్భవిస్తే వాటిని సమాజంలోని ఇతరులకు తెలియజేయాలని ఆమె ఆశించటం సహజం. అయితే ఆమె అనుభవం ప్రత్యేకతను సంతరించుకున్నప్పుడే ఆమె జీవిత సంఘటనలు ఇతరులకు ఆసక్తిదాయకంగా వుంటాయి. అందరిలాంటి సగటుమనిషి తన ఆత్మకథను వ్రాసుకుంటే ఎవరూ చదవడానికి ఇష్టపడరు, చదవరు కూడాను. బందిపోటు దొంగ, హంత కుడు, రౌడీ వీళ్ళు ఎంత దుర్మార్గులయినా వీరి కథలను చదవడానికి ప్రజలలో ఆసక్తి మెండుగా వుంటుంది. అలాగే సంగీత విద్వాంసురాలు, నటి, నాట్యగత్తె, దేశ నాయకురాలు ఇలాంటి వారి ఆత్మకథలు కావాలని,

రావాలని ప్రజలు ఉత్కంఠతో ఎదురుచూస్తారు. సరోజినీ నాయుడు వంటి కవయిత్రి, కమలాదేవి ఛటోపాధ్యాయ, గుమ్మడిదల దుర్గాబాయమ్మ లాంటి సంఘ సేవికలు, మహాత్మాగాంధీ లాంటి ఉన్నతోన్నతవ్యక్తులు వీరెలా పెరిగారు, ఎలా జీవించారు, ఎలా “ప్రవారయ్యారు అని తెలుసుకోవాలనే ఉబలాటం ప్రజలలో వుంటుంది. అసలు జ్ఞానతృష్ణ మానవ సహజమైన ప్రవృత్తి. కనుకనే ఖూనీకోరు దగ్గరనుంచి మహాత్ములవరకు ఎవరి జీవితమైనా జీవిత కథకు వస్తువు కాగలదు. ఈ అంశాన్ని కొత్తగా కొంత గ్రహించిన నేను ఆత్మకథ వ్రాయడానికి పూనుకున్నాను. అయితే స్త్రీని అయినంత మాత్రాన నా ఆత్మకథ సమాదరణీయ మని నేను భావించి అలా చేయలేదు. స్త్రీ వ్రాసింది కనుక చదవనక్కరలేదనే దురభిప్రాయంతో నా ఆత్మకథా పఠనాన్ని మొదట్లోనే ఆపివేయవద్దని నా అభ్యర్థన. మరో మాట, నేను స్త్రీగా ఎక్కువగా నా గురించే వ్రాశాను. కాకపోతే సందర్భాన్ని బట్టి నా తండ్రి, మా మామగారు, నా భర్త అచ్చటచ్చట కన్పిస్తారు. అది తప్పదు. అయితే ఒక స్త్రీ తనను గురించి వివరంగా, విశదంగా, స్పష్టంగా, నిజాయితీగా చెప్పిన కథ అని చదువరులు గుర్తిస్తే నాకు అదే పది వేలు. స్త్రీల అరుదైన ఆత్మకథల్లో దీనికి స్థానం కలిగితే అది నా అదృష్టమని భావిస్తాను. ఈ దృష్టితో ఆలోచిస్తే నా ఆత్మకథ భావితరాలకు అవసరమని నా భావన.

## ఎందుకీ ఆత్మకథ : ఎవరి కోసం

“ఆడవారిని నిప్పుల్లో పడేసి ‘సతి’ అనే పేరుతో చంపుతుంటే వరకట్నాల కోసం కొత్త పెళ్ళికూతుళ్ళను హత్య చేస్తుంటే, పిల్లలు పుట్టలేదని వెళ్ళగొడుతుంటే, మగడు మళ్ళీ పెళ్ళాడుతుంటే, మానభంగాలు చేస్తుంటే మీరంతా ఏమి చేస్తున్నారు అమ్మమ్మా” అని రేపు నా మనవరాలు పెద్దయ్యాక ప్రశ్నిస్తే.నేనేమని సమాధానం చెప్పాలి. చెప్పకుండా వూరుకుంటే! అసలు మనిషి అయిన వాళ్ళు చీమూ, నెత్తురూ వున్న వాళ్ళయితే ఒక అన్యాయం జరుగుతుంటే స్పందన లేని మూగ జీవుల్లా పడివుంటే ఏమంటారు! పుట్టలోని చెదలు పుట్టవా గిట్టవా? అంతే మనమూనూ. కనుక జీవితం ముగిసే లోపల ప్రతి వ్యక్తీ అన్యాయాన్ని ఎదిరించాలి. మోసాన్ని త్రుంచాలి. దౌర్జన్యాన్ని దహనం చేయాలి. లేకుంటే మనం ఎవరమో, ఎందుకు పుట్టామో? ఏమని చెప్పుకుంటాం? కొందరు చరిత్రను సృష్టిస్తారు. కొందరు ఆ చరిత్రను గ్రంథస్థం చేస్తారు. కొందరు దాన్ని వక్రీకరిస్తారు. కొందరు చూస్తూ వూరుకుంటారు. కొందరు సంస్కరించ ప్రయత్నిస్తారు. కనుక సమాజం అంటే నానా రకాల వారూ వుంటారు. అది సామాజిక రీతి. అందులో మనం ఏ వర్గానికి చెందుతాము అనే ఆత్మ పరిశీలన ప్రతి వ్యక్తికి అవసరం. ఒక్కొక్క యుగంలో ఒక పెద్ద మార్పు వస్తుంది. ఆ మార్పుకు ప్రేరణ కలిగించే వారూ వుండాలి. ఆ లక్ష్యాన్ని సాధించే వాళ్ళూ వుండాలి. ఆ చర్యలకు వెలుగు లేకపోతే ఆనాటి పరిస్థితులు తరువాత తరంవారికి తెలియక మరుగున పడిపోతాయి. కనుక వ్రాసేవారూ, చేసేవారూ

ఇద్దరూ కావాల్సిన వారే. ఎవరి ఉనికి వారిది. ఎవరి ఆశయం వారిది. ఈ తరం వారికి మన పూర్వీకుల చరిత్ర తెలియ చెప్పాలి. అంటే ఆనాటి వ్యవస్థ తెలియాలి. ఆ వ్యవస్థలో ఎలాంటి మార్పు వచ్చిందో తెలియాలి. అది ఎందుకు వచ్చిందో ఆ పరిస్థితికి ప్రజలెలా స్పందించారో తెలియజెప్పడం మన విధి. తద్వారా ఈనాటి వారు తమ భవిష్యత్తును నిర్దేశించుకోగలరు. గతంలోని మంచి చెడులను గుర్తించి నెమరేసుకోగలరు. అసలు వజ్రం కూడా ఒక రాయే. దాన్ని రాళ్ళల్లో గుర్తించి వెలికి తెచ్చి సానపట్టి వజ్రం చేయగల శక్తిగలవారే దాని విలువను గుర్తిస్తారు. కనుక మన కాలంనాటి వ్యవస్థ, చర్యలు గ్రంథరూపంలో మన తరువాత వారికి తెలిస్తే వారు కూడా చదివి స్పందించి ఎంతో కొంత కార్యభారాన్ని వహిస్తారు. సమస్త సాహిత్య ప్రక్రియలలో ఆత్మకథ ఒకటి. నా చర్యలద్వారా నా కథ చెప్పాలనిపించింది. అసలు మహాత్ముల జయంతులు, వర్ధంతులు ఎందుకు చేస్తాం. అంటే వారు ఏం చేశారో, ఎందువల్ల మహాత్ములయినారో తెలుసుకొని మనం కూడా అందులో ఏదో ఒకదాన్ని నెత్తినేసుకొని అంటే సామాజికాభ్యుదయానికి అందులో ముఖ్యంగా మహిళాభ్యుదయానికి జరిగే పోరాట యజ్ఞంలో మన బాధ్యతను మనం చేయగలుగుతాం. అందులో ప్రతి ఒక్కరూ ఒక సమిధలమయి పోతాం. ఆ మహా యజ్ఞంలో 'నేను ఎంతవరకు నా కర్తవ్యాన్ని నెరవేర్చాను ఏ రంగంలో ఎంతవరకు సాధించాను, ఆ ప్రయత్నంలో ఎదురయిన ఇబ్బందులు ఏమిటి, ఆటుపోట్లు ఏమిటి? వాటి నెలా అధిగమించాను? విద్య కోసం, విజ్ఞానం కోసం ఎంత ఆరాటపడ్డాను కడకు ఏమి సాధించాను? ఎంత దూరం పయనించాను? ఎక్కడ బ్రేకు పడ్డది? అనే విషయాలు నా కథ ద్వారా చదివి మీరు దూషించినా, భూషించినా నా తపస్సు ఫలించినట్లే.

# 2. పరిగణన : పురస్కారాలు

మానవుడు సామాజిక జీవి. సమాజంలో జీవించడమనేది జంతువారసత్వం. మనిషికి మెదడుంది. ఆలోచనుంది. కార్యకారణ సంబంధాన్ని గుర్తెరుగగల శక్తి వుంది. ఊహించగల సత్తా వుంది. మంచిచెడ్డలు తెలుసుకోగల పరిణతి వుంది. ఈ ధర్మాలన్నిటిని మానవ మేధస్సు నిర్వర్తిస్తుంది. ఒక్క మాటలో చెప్పాలంటే మానవులలో హేతుత్వం (రీజన్) వుంది. మానవుడు బుద్ధి జీవి. ఇలాంటి మానవ వ్యక్తి సమాజంలో నడయాడటంలో తోటివారల మెప్పును పొందాలని, తోటివారు తన గొప్పతనాన్ని గుర్తించాలని తపన చెందడం సహజం.

నేను గొప్పదాన్ని కావాలని, నన్ను ఇతరులు మెచ్చుకోవాలని చిన్నప్పటి నుంచి తాపత్రయపడేదాన్ని, హరిశ్చంద్రుడి వేషం వేసినా, రామదాసు వేషం వేసినా ప్రేక్షకులు చప్పట్లు కొట్టాలని ఆశించేదాన్ని. దీన్ని బలహీనత అనండి కాంక్ష కాక మరేమైనా అనండి నేను మాత్రం ఆ యావ లేకుండా వుండలేక పోయేదాన్ని.

వ్యక్తి ఎదుగుతున్న సమయంలో జరిగే సన్మానాలు, పొందే బహుమతులు, వచ్చే పురస్కారాలు మరపురానివి. మనిషి పెద్దయిన తర్వాత పరిణత మనస్కులు అయిన తర్వాత వద్దన్నా సన్మానాలు, పొగడ్తలు అవే వరసన వస్తాయి. నిజానికి అప్పుడు వాటిని గొప్పగా ఎంచుకునే పరిస్థితి వుండదు. అంత మాత్రాన వద్దని తిరస్కరించడం, అక్కర్లేదని త్రోసి రాజనటం జరుగుతుందనుకోవడం భ్రమ. అయితే వాటికోసం యావ పడరు. ఇదే జరిగింది నా జీవితంలో,

7వ క్లాసుతో ఆగిన చదువు పునః ప్రారంభించి 38వ ఏట మెట్రిక్ పాసవ్వగలగటం విశేషం గానే నాకు తోచింది. కాటేజి ఇండస్ట్రీస్ సంఘం వారు అప్పుడు చిన్న టీ పార్టీ ఇచ్చి నన్ను ప్రస్తుతిస్తే దానికే ఎంతో పొంగిపోయాను. ఎం.ఎ. చదివిన వారు ఆ సంఘ సభ్యులుగా వున్నారు. వారంతా విద్యా విషయకంగా తప్పటడుగులు వేస్తున్న నన్ను సన్మానించడమేమిటి అనే ప్రశ్నే నాకు ఉదయించలేదు. వారికి తోచలేదు. అది ఆనాటి సుహృద్భావ వాతావరణ పరిస్థితి. మరో రకంగా ఆలోచిస్తే జన్మస్థానంలో సన్మానింపబడటం అదృష్టం. ఏసు క్రీస్తు అంతటి వాడికి అది లభ్యం కాలేదు. వేల కొద్దీ జనం ఆయన వెంట రాగా తన స్వగ్రామమైన నాజరత్ కు విచ్చేసే మన వడ్రంగి జోసఫ్ కొడుకే గదా అన్నాడు ఆ గ్రామ ప్రజలు.

తిరిగి 1964 ఫిబ్రవరిలో గౌరవ కుటుంబ నియంత్రణ ప్రచారకులుగా గుంటూరు జిల్లాకు నా పేరు ప్రెసిడెంటు ఆఫ్ ఇండియా నామినేట్ చేసినట్లు లేఖ వచ్చినప్పుడు నా ఆనందానికి అవధులు లేవు. జీతభత్యం లేని చాకిరీ అయినా ఆ పదవి నా దాకా వచ్చిందని పొంగిపోయాను. కనుపర్తి వరలక్ష్మమ్మ గారి అధ్యక్షతన మిత్రులు, సహచరులు

వెలగపూడి వారి స్కూల్లో శాలువా కప్పి, టీ పార్టీ ఇచ్చి, నన్ను గురించి కవయిత్రి ఉటుకూరి లక్ష్మీకాంతమ్మ గారు పొగడటం నాకిప్పటికీ మరపురాని మరో అభినందన సభ. 26-1-69లో అప్పికట్లలో మహిళోద్యమం పై పెద్ద సభ జరిగింది. 2 వేల మంది హాజరయిన ఆ సభలో శ్రీమతి లక్ష్మీకాన్తమ్మతోపాటు నన్ను సన్మానించారు. అప్పట్లో అది పెద్ద గుర్తింపుగా భావించాను.

## అవార్డులు

హైదరాబాదు వచ్చి సంస్థలు స్థాపించి, గ్రంధాలు ప్రచురించి, ఉపన్యాసాలలో గంభీరతను సంతరించిన పిదప ఒకరోజు 'అభినందన' కార్యదర్శి శ్రీమతి భవాని శరత్ 'మీకు దుర్గాబాయ్ దేశ్ ముఖ్ అవార్డు ఇస్తాము. మీరు స్వీకరించాలి' అని చెప్పింది. సంభ్రమాశ్చర్యాలలో మునిగిపోయాను. తేరుకుని నా అంగీకారం తెలిపాను. ఆంధ్ర మహిళాసభ వారి అనుమతిని తీసుకున్న తదుపరి మాత్రమే దుర్గాబాయ్ దేశ్ముఖ్ పేర ఆ అవార్డును నెలకొల్పారట. దుర్గాబాయ్ దేశ్ ముఖ్ నాకు ఏకలవ్య గురువు. అందుచేత ఆమె పేరిట వున్న అవార్డును స్వీకరించడానికి ఎంతో సంతోషపడ్డాను. ఈ సన్మాన కమిటీ అడ్వయిజరు ఆచార్య సి. నారాయణరెడ్డి. ఆయన సుబ్బమ్మ గారు ఈ సన్మానానికి తగిన అర్హులు కనుక వారికి మొదటగా ఈ అవార్డును ఇవ్వటం సమంజసం అని చెప్పారట. అలా నేను ప్రధమ గ్రహీతను కావడం నాకు గర్వకారణమయింది.

సన్మానపు తేదీ 27-11-86న చిక్కడపల్లిలోకి త్యాగరాయ గాన సభలో సమయానికి ముందే హాలు నిండటమే గాక ఒక వంద మంది దాకా నిల్చున్నారు. సభకు అంతమంది వస్తారని నేను ఊహించలేదు. సమాజంలో అభ్యుదయ పథాన పయనిస్తున్న స్త్రీలపట్ల ఎంత సాదర సానుభూతి వున్నదో ఆనాడు నాకు అవగతమైంది. సభకు విచ్చేసిన 400 మంది స్త్రీ, పురుషులలో పేరెన్నిక గన్న వారు మొదటి రెండు వరుసలలో ఎందరో కనిపించారు.

వేదికమీద ఆశీనురాలిని చేశారు. సన్నాయిమేళం సాగింది. పండితులు వేద ఘోషతో ఆశీర్వదించారు. హేతువాదినైన నేను దిగ్భ్రాంతికి లోనయినాను. ఇలా జరుగుతుందని ఊహించ లేదు. హేతువాదికి సనాతన పద్ధతిలో సన్మానమా? ఇదెక్కడి చోద్యం ! వేదిక మీద నేను బందీనయి పోయాను. కాదనలేక, వద్దన లేక మిన్నకుండి పోయాను. సన్మానం జరిగింది. డా॥ సి. నారాయణరెడ్డి నన్ను ప్రశంసిస్తూ ఒక చిన్న గేయం అప్పటికప్పుడు చదివారు. అభినందన వారు శాలువతోపాటు, జ్ఞాపికను, సన్మానపత్రాన్ని సమర్పించారు. మర్నాడు పత్రికలలో ఉత్సవపు ఫోటోలు ప్రచురితమయినాయి. ఇది ఒక రకంగా ఆలోచిస్తే నా జీవితంలో మైలురాయిగా భావించవచ్చు.

ఆలిండియా ఉమెన్స్ కాన్ఫరెన్స్ ప్రధాన కార్యదర్శి శ్రీమతి పద్మా సేత్ (కీ.శే. మాడభూషి అనంతశయనం అయ్యంగార్ గారి కుమార్తె) హైదరాబాదు రావడం, నన్ను కలవడం, నా సారస్వతాన్ని పరిశీలించడం అనుకోకుండా జరిగిపోయింది. "డైమండ్ జూబ్లీ సెలబ్రేషన్సు" సందర్భంగా నేను వ్రాసిన చిన్న పుస్తకాలలో మూడింటిని వారు ఎంపికచేసి ఇంగ్లీషులోకి అనువాదం చేసి ముద్రించి ఢిల్లీ పంపమన్నారు. ఖర్చు తమ సంఘం వారే భరిస్తారని చెప్పారు. 15 రోజుల్లో అనువాదం చెయ్యటం, పుస్తకాలు అచ్చువేయడం, గ్రంథాలను బైండింగ్ చేయడం, ఢిల్లీ పంపడం అంతా జరిగి పోయింది. 'మానవ హక్కులు, మహిళలు' 'మత ధర్మ శాసనాలు' 'స్త్రీలపై అత్యాచారాలు' అనేవి ఆ మూడు పుస్తకాలు, 10-1-87 తేదీన గ్వాలియర్ లో సమావేశమైన అఖిల భారత మహిళా మహాసభకు నేను జీవిత సభ్యురాలిగా హాజరైనాను. అచ్చట నేచేసిన సంఘ సేవను, సారస్వత సేవను గుర్తించి గ్వాలియర్ రాజమాత చేత శాలువ కప్పించారు. మార్గరేట్ అల్వా పట్ట ప్రదానం చేశారు. ఈ అపూర్వ పరిగణనతో నాలో ఆత్మ విశ్వాసం పెరిగింది.

నేను వ్రాసిన ఆంధ్రప్రదేశ్ మహిళోద్యమం, మహిళా సంఘాలు (1860-1983) అనే గ్రంధానికి "ఇతర సాహిత్య రీతులు 'అనే శీర్షిక క్రింద ఉత్తమ గ్రంధంగా తెలుగు విశ్వవిద్యాలయం (హైదరాబాదు) వారు ఎంపిక చేశారు. 1988వ సంవత్సరం ఉగాది నాడు 18-3-88 తేదీన తతిమ్మా బహుమతి గ్రహీతలతో పాటు నాకూ యూనివర్సిటీ మొమెంటో ఇచ్చారు. సన్మానం, బహుమతి లభించాయి. శాలువా కప్పి 3వేల రూపాయల నగదు బహుమతి ఇచ్చారు. ఆనాటి విశ్వ విద్యాలయ ఛాన్సలర్ శ్రీ ఎన్.టి. రామారావు నన్ను సత్కరించారు. నేను ఆంధ్ర దేశంలో గుర్తుంచుకోతగిన వ్యక్తుల్లో ఒకదాన్నని నాకు సంతోషం కలిగింది.

ఉప్పల గోపాలరావుగారు (మిర్యాలగూడ) తన అత్తగారైన దాసరి అనసూయమ్మ గారి పేర నా సంఘసేవకు, హేతువాద ప్రచారానికి ఆ అవార్డును బహూకరించడానికి సంకల్పించారు. ఆయన దుందుడుకు వాది కాకపోయినా అతివాది. ఆయన మిత్రులను సంప్రదించి, తాను ఆలోచించుకుని నాకు అవార్డును ఇవ్వ నిశ్చయించుకుని నాకు ఆ విషయం చెప్పారు. నేను 'సరే' అన్నాను. ఈ అవార్డుకు కూడా నేనే ప్రధమ గ్రహీతను. హైదరాబాదు ప్రెస్ క్లబ్ లో తేది. 19-3-89 దిన సన్మాన కార్యక్రమాన్ని సాఫీగా నడిపించారు. ఒక చక్కని సన్మానపత్రం, వెయ్యిన్నూట పదహారు రూపాయలు, పెద్ద మొమెంటో ఇచ్చి సత్కరించారు. ఈ సన్మానం తతిమ్మా వాటికన్నా పరిమాణంలో చిన్నదైనా ప్రమాణంలో గొప్పదిగా ఎంచుకున్నాను.

## సన్మానాలు

సన్మానాలు తరచుగా జరుగుతూనే వున్నాయి. అశోక గ్రంధాలయ సంస్థ వారోత్సవాల సందర్భంగా ఆ సంస్థ చైర్మన్ నన్నొక ఉత్తమ రచయిత్రిగా ప్రకటించి, శాలువా కప్పి, మొమెంటో ఇచ్చి సత్కరించారు. 'స్త్రీ శక్తి' స్కీము ప్రారంభోత్సవ సందర్భంగా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారు నన్ను గౌరవించి ఘన సన్మానం చేశారు. తెలుగు సంవత్సరాదికి అభినందన సంస్థవారి చేత ఇందిరా ప్రియదర్శినీ హాలు (హైదరాబాదు)లో ఏకాదశ రచయిత్రులకు సన్మానం జరిగింది. అందులో నేను ఒక రచయిత్రిగా గుర్తింపబడి సన్మానితురాలినైనాను.

ఒక విచిత్రమైన సంఘటనను ఈ సందర్భంగా పేర్కొనడం యుక్తి యుక్తం. 'గీటురాయి, అనే పత్రిక జమాయిత్ ఇస్లామ్ వారు నడుపుతున్నారు. వారి రేపల్లె నిజాంపట్నం శాఖల వారే నా 'ఇస్లాం : స్త్రీలు' అనే గ్రంధాన్ని పురస్కరించుకుని నాకు రిజిష్టరు నోటిసులు ఇచ్చారని దరిమిలా గీటురాయి సంపాదకులు శ్రీ మల్లిక్ నాచేత తన పత్రికలో వ్యాసాలు వ్రాయించుకున్న విషయం ఇంతకు క్రితమే వ్రాశాను. "గీటురాయి" రజతోత్సవ సందర్భంగా నాకు సన్మానం చేశారు. ఎందుకిలా జరిగిందా అని తీవ్రంగా ఆలోచించాను. ఇస్లాం మత వ్యతిరేకత నాలో సన్నగిల్లిందా లేక ఇస్లాం మతానుయాయుల సహనశక్తి పెరిగిందా అనేది ఇప్పటికీ తేలని అంశం.

లయన్సు క్లబ్ సికిందరాబాదువారు లేడీస్ నైట్ ఉత్సవానికి చీఫ్ గెస్టుగా పిలిచి మొమెంటో ఇచ్చి సత్కరించారు. చీరాలలో ప్రకాశం జిల్లా సాహితీ సదస్సు 1986లో జరిగింది. ఆ సభ రెండో సెక్షన్ మహిళా కవయిత్రుల సదస్సు నా చేత' ప్రారంభోత్సవం చేయించి నన్ను గొప్పగా సన్మానించారు.

కోటీ ఉమెన్స్ కాలేజీ సైన్సు విభాగం అక్టోబరు 1987లో సిల్వర్ జూబ్లీ సభకు నన్ను ఆహ్వానించి మొమెంటో ఇచ్చి సత్కరించారు. మెహిదీపట్నం వెల్ ఫేర్ అసోసియేషన్ వారి రజితోత్సవ సభలో నా సంఘ సేవను గుర్తించి చక్కని మొమెంటో ఇచ్చారు. ఆంధ్ర యువతీ మండలి సెక్రెటరీగారు శ్రీమతి ఎ. శ్యామలాదేవి స్కూలు వార్షికోత్సవానికి, స్వాతంత్ర్య దినోత్సవానికి జండా ప్రతిష్ఠ చేయించి సన్మానించింది. అలాగే అనేక స్కూళ్ల వార్షికోత్సవాలకు చీఫ్ గెస్టుగా ఆహ్వానించి గత 20 ఏళ్ళుగా అనేక మొమెంటోస్ ఇస్తూనే వున్నారు. ముఖ్యంగా బాంబే ఆంధ్ర మహిళా సభవారు పెద్ద సభ ఏర్పాటుచేసి పెద్ద మొమెంటోను సోమంచి యజ్ఞన్న శాస్త్రిగారి చేత ఇప్పించారు. ఇలా కొన్ని చిన్న సభలలో కొన్ని పెద్ద సభలలో ముఖ్య అతిధిగా ఆహ్వానించి గౌరవిస్తూనే వున్నారు. ఇంకా చెప్పాలంటే అనేక మహిళా సంఘాల వారు వార్షికోత్సవాలకు, దశాబ్ది ఉత్సవాలకు సిల్వర్ జూబ్లీ, గోల్డెన్ జూబ్లీ, డైమండ్ జూబ్లీ సభలకు ఆహ్వానించి శాలువాలూ, మొమొంటోలు ఇచ్చి సత్కరించిన సందర్భాలు ఎన్నో వున్నాయి.

## 3. ప్రశంసలు : అభిశంసనలు

ఎవరయినా ఎప్పుడయినా పొగిడితే సంతోషిస్తాం. విమర్శిస్తే బాధపడతాం. ఇది మానవ స్వభావం. మనిషి తోటి వారి గుర్తింపు కోసం ఆరాటపడతాడు. ఇది సహజం. ఎప్పుడయితే మానవ వ్యక్తి సమాజంలో మనుగడ సాగించటం తప్పనిసరి అవుతున్నదో తనను ఇతరులు పరిగణించాలని ఆశించడం పొరపాటు కాదు. దీనినే మానసిక శాస్త్రజ్ఞులు గుర్తింపు కోసం ఆరాటం (Craving for Recognition) అంటారు. ఇక్కడ ఒక తిరకాసు వుంది. తోటివారు తనను పట్టించుకోవాలని తాపత్రయ పడటం సబబే కాని కేవలం వారి గుర్తింపు కోసం ఏదో పని చేయాలని తలపోయడం తప్పు. తను నమ్మిన పని, తనకు ఇష్టమయిన పని, సమాజానికి లాభించే పనిచేయడం శ్రేయస్కరం. అలా చేస్తూపోతే వద్దాన్నా, కాదన్నా పేరు, ప్రతిష్టలు వస్తాయి. అదే జరిగింది నా జీవితంలో. మున్ముందుగా నన్ను గురించిన ప్రముఖ ప్రశంసలను ఉటంకిస్తాను.

"శ్రీమతి సుబ్బమ్మ గారిని పోలిన మహిళామణులు మనదేశంలో ఒక లక్షమంది ఉంటే మనదేశ స్వరూపమే పూర్తిగా మారిపోతుంది"

నార్ల వెంకటేశ్వరరావుగారు

('ఆధునిక స్త్రీ' శుభాకాంక్షలలో)

నా కార్యదీక్ష నార్ల వారికి నచ్చినట్లుంది.

"వేటగాడు చూచు చున్నాడని
గూటిలో గువ్వ దాగదు
గొడ్డలివేటు పడుతుందని
కొమ్మ ఎదగటం మానదు
గుండెల్లో సుడిగుండాలున్నా
నిండుగా పారు ఏరు
పక్కనే బురద ఉన్నా
పచ్చగా పెరుగును పైరు

(నా వ్యక్తిత్వ వికాసంపై డా॥ సి. నారాయణరెడ్డి గారి కవిత, నవంబరు 1986లో నా సన్మానసభలో.)

'రవిగాననిచో కవిగాంచునే' అన్నారు. నా స్వభావాన్ని సరిగా అంచనా వేశారు నారాయణ రెడ్డిగారు.

"ఆలస్యంగా బలయిన అగ్ని పర్వతం" అన్నారు ప్రఖ్యాత గ్రంథ సమీక్షాకారులు, విమర్శకులు శ్రీ జి. రామకృష్ణారావుగారు.

నా జీవిత పరిణామాన్ని పరిశీలించి చిన్న పదజాలంలో ఇమిడ్చి సూటిగా చెప్పారు.

"నా సాహిత్యానికి కేంద్రం స్త్రీ. నా ఉపన్యాసానికి మకుటం మహిళ. నా కార్యరంగానికి మూలం అబల. నా ధ్యేయం స్త్రీ విమోచన. నా ఆదర్శం, లక్ష్యం 'స్త్రీ జనాభ్యుదయమే' అంటారు సంఘ సంస్కరణోద్యమ రణ రంగంలో ఘన విజయం పొందిన వీర నారీమణి సోదరి మల్లాది సుబ్బమ్మ"

ఇది నన్ను గురించి వ్రాస్తూ సోదరుడు శ్రీ తిరుమల రామచంద్ర ఆంధ్రసచిత్ర వార పత్రికలో చేసిన వ్యాఖ్య.

నా మనస్సులో మాటకు, నేను అంత అందంగా చెప్పలేని విషయాన్ని చక్కగా పొందికగా, టూకీగా విస్పష్టం చేశారు.

నేను వ్రాసిన 'స్త్రీ విముక్తి' అనే పేరుగల స్త్రీల ప్రణాళికను (Feminist Manifesto) ఆచార్య చేకూరి రామారావుగారు చూడటం తటస్తించింది. తరువాత 'వంశాంకురం' అనే

పేరుగల నా పుస్తకాన్ని ఆవిష్కరించే సభలో ప్రసంగిస్తూ వారు ఇలా అన్నారు. "మల్లాది సుబ్బమ్మ గారిని చూస్తే నాకు వీరేశలింగంగారు గుర్తు వస్తారు. ఇద్దరూ తమ తమ మార్గాలో స్త్రీ జనోద్ధరణకు ప్రయత్నించిన వారు కావటం ఒక్కటే కాదు, వీరేశలింగం గారి లానే సుబ్బమ్మ గారికి పట్టుదలా, దీక్షా, పోరాట పటిమా వున్నాయి. వీరేశలింగం గారు ఒక్కరూ ఒక్క ఉద్యమమై సాగారు. వీరేశలింగం గారు వివాహాలు చేయించారు. సుబ్బమ్మ గారు విస్తృతంగా ఆదర్శ వివాహాలు చేయించారు. వీరేశలింగంగారు పెళ్ళిళు ృ చేయించారు కాని చెడగొట్టలేదు. సుబ్బమ్మ గారికి ఆ కీర్తి కూడా వుంది. సుబ్బమ్మ గారు 'స్త్రీ స్వేచ్ఛ' పత్రిక నడుపుతున్నారు. స్త్రీ సమస్యల పై వస్తున్న ఆదర్శ పత్రిక ఇది. ఈ పత్రికలో సిద్ధాంత రాద్ధాంతాలు వుండవు. అనవసరమైన వాగ్వాదాలు వుండవు. స్త్రీల సమస్యల పై రిపోర్టులు, ఆలోచనలు, స్పందనలు వుంటాయి." తరువాత 'చేరాతలు' శీర్షిక క్రింద 'ఆంధ్రజ్యోతి' ఆదివారం పత్రికలో ఈ భాగం వున్న వారి వ్యాఖ్య అచ్చయింది. రామారావుగారు సునిశిత పరిశీలనా దృష్టిగల మేధావి. అభ్యుదయ భావాలను ఆదరించే అసామాన్య వ్యక్తి, నిక్కచ్చిగా మాట్లాడటం, వ్రాయటం వారి నిజాయితీకి నిదర్శనాలు. సహజంగా తీవ్రవాద భావాలను వారు అభిమానించినా, సంస్కరణ కార్యక్రమాల విలువను వారు విస్మరించరు. నన్ను గురించి వారు చేసిన మదింపు నా అదృష్టంగా భావిస్తున్నాను.

'ఈనాడు' పత్రికలో చలసాని ప్రసాద్ గారు పనిచేస్తున్నారు. నేనేదో

మహిళోద్యమానికి ఇంతో అంత సేవ చేస్తున్నానని వారికి నామీద అభిమానం. ప్రతి అక్షరపు చోటుకు ఎంతో విలువగల ఆ పత్రికలో నా గ్రంథాల పై సమీక్షలు అనేకం వచ్చాయి. అందులో ఒకటి.

"రాళ్ళనీ రప్పల్నీ పడతోసుకుని పరవళ్ళు తొక్కుతూ

దూకివచ్చే కొండవాగు లాంటిది మల్లాది సుబ్బమ్మ రచన

భావోద్రేకం వాక్యాల్ని నెట్టుకుంటూ ముందుకు ఉరకలేస్తుంది.

మహిళాభ్యుదయం ఆమె లక్ష్యం.

'వనితా లోకం' పై సమీక్షలో జి. రామకృష్ణారావు గారు

నా దూకుడు రచనా విధానాన్ని వారు ఎంతో సహృదయంతో పసిగట్టారు.

నా గ్రంథాలన్నిటిలో ముమ్మందుగా ఆంగ్లంలో అచ్చయింది నా వ్యాసావళి "స్త్రీలు, సంప్రదాయం, సంస్కృతి" (Women Tradition & Culture). దీనిమీద అనేక పత్రికలలో అనేక సమీక్షలు వచ్చాయి. ఆనాటి రెండువందల ఏబది నా వ్యాసాలను పరిశీలించి ఇరువది ఏడింటిని ఎంపికచేసి ఆ గ్రంథానికి ఆ పేరు పెట్టారు రామ్మూర్తిగారు. గ్రంథనామం ఆకర్షణీయంగా ఉండి గ్రంథస్త విషయం అనేకమందికి నచ్చటం నాకు ప్రోత్సాహకారణం. ఈ పుస్తకం పై ఇంగ్లండులోని 'నవ్య మానవవాది' (New Humanist) మాస పత్రికలో ప్రశంసా పూర్వకంగా పత్రిక సంపాదకుడు శ్రీ జిమ్ హెరిట్ ఏకపళంగా వ్యాసమే వ్రాశారు. ఇన్ని వచ్చినా 'న్యూస్ టైము' (News Time) ఆంగ్ల దినపత్రికలో వచ్చిన సమీక్ష నా వెన్ను తట్టింది.

Subbamma presents a novel human approach which is the only way tof preservation of woman%µ%s dignity

Subbamma's style is clear. Systematised thought makes the book interesting reading

Parveen Bastawalla

సమీక్షాకారులూ నేనూ ఏనాడూ కలసి ఎరుగం. ఆమె అపరిచిత వ్యక్తి.

భావ వ్యక్తీకరణ విధానానికి, శైలికి ఆమె ముగ్ధలయినట్లు తోస్తుంది. అలాంటి సునిశిత పరిశీలనలే నా ఊపిరికి బలాన్ని ప్రసాదిస్తున్నాయి.

నేను అనేక పుస్తకాలు వ్రాసినా ఇప్పటికీ ""హైందవం: స్త్రీలు" అనే నా విమర్శనాత్మక

గ్రంథాన్నే అన్నింటికి మకుటాయమానంగా నేను భావిస్తాను. దానిని గురించి

This is a master - piece written with far more elucidation than most doctoral dissertations in Telugu these days

B. Radha Krishna

తెలుగు అకాడమీ పరిశోధనా విభాగంలో పనిచేసి ప్రస్తుతం 'ఈనాడు' పత్రికలో పనిచేస్తున్న పేరెన్నికగన్న భాషా శాస్త్రవేత్త డా॥ బూదరాజు రాధాకృష్ణగారి అభిప్రాయం ఇది. నేనూ వ్రాయగలనని నాకు ఆత్మ విశ్వాసం కలిగింది.

సెక్సును విషయంగా స్వీకరించి వ్రాసేవారు అరుదుగా కన్పిస్తారు. చలం తర్వాత అలా చేసిన వారిలో శ్రీమతి లత ప్రముఖులు. నేను సాహసించి 'ప్రేమ +సెక్స్ = నీతి' అనే నవల వ్రాశాను. దానిని గురించి

"మగవారు రాసినా, ఆడవారు రాసినా నవలల్లో పురుషాధిక్యత కనిపిస్తుంది. ఇందులో అసలైన ఆడవారు, వారి సమస్యలు, వారి ఉద్రేకాలు, తపన, కామం, మనస్తత్వాలు కొట్టవచ్చినట్లు కన్పిస్తాయి. ఇది ఎంత సెక్సు నవల అనిపించినా మంచి ప్రయోజనం వున్న మహిళాభ్యుదయ దృష్టితో రచించిన నవల

శార్వరి ('ఆంధ్రప్రభ' దినపత్రికలో)

ఇతర పత్రికలలో దీనిని మెచ్చుకుంటూ సమీక్షలు వచ్చాయి. కాని 'శార్వరి' లాంటి పండితుడు, తాత్విక చింతన గలవాడు ఇలా వ్రాయడం నాకు యెంతో ఊపునిచ్చింది.

ఆలస్యంగా వచ్చిన ఇస్లాం : స్త్రీలు (Islam & Women) నా ఆంగ్ల గ్రంథం పై ప్రతిష్ఠా పూర్వకమైన ఆంగ్ల త్రైమాసిక సాంస్కృతిక పత్రిక ''న్యూ క్వెస్టు' (New Quest) లో నాలుగు పేజీల సమీక్షా వ్యాసం అభినందన పూర్వకంగానే వచ్చింది.

'ఫెమినా' (Femina), 'ఉమెన్స్ ఈరా' (Women's Era) 'బ్యూటిఫుల్ వుమన్ (Beautiful Woman), మాట్రిమోనియల్ (Matrimonial), దక్కన్ క్రానికల్ (Deccan Chronicle) 'ఇండియన్ ఎక్స్ ప్రెస్, (Indian Express), సిటిజన్ (Citizen)

'ఉదయం '(దినపత్రిక) 'ఈనాడు', 'ఆంధ్రప్రభ' (దినపత్రిక), 'ఆంధ్రభూమి' (దినపత్రిక), 'వనిత' (మాసపత్రిక), 'వనితా జ్యోతి' (మాసపత్రిక) లలో వచ్చిన నా జీవిత చిత్రణలు నాకు కొండంత బలాన్ని సంతరించి పెట్టాయి.

ప్రసిద్ధ స్వాతంత్ర్య సమరయోధుడు శ్రీ ఎస్.ఎస్. వ్యాస్ ఎన్నో ఏండ్ల నుండి అచ్చవుతున్న తన హిందీ వారపత్రిక 'లోక్ జీవన్' లో (జోధ్ పూర్, రాజస్థాన్) నా

వ్యాసాలను వారలను ప్రచురించి నన్ను హిందీ చదువరులకు పరిచయం చేశారు. 'ఇండియన్ ఎథియిస్టు ప్రచురణల సంస్థ అధిపతి శ్రీ సనాల్ ఎడమరుకు నా గ్రంథాలను నాల్గింటిని మళయాళంలో అచ్చు వేయించారు. పై సమీక్షలు, విమర్శలు, సంఘటనలు నన్ను ఉత్తేజ పరుస్తున్నాయి.

## అభిశంసనలు

ఇన్ని ప్రశంసలు వచ్చాయే, విమర్శలు, కువిమర్శలు, అభిశంసనలు రాలేదా అని పాఠకులు ప్రశ్నించవచ్చు. వచ్చాయి. రాకుండా ఎలా ఉంటాయి? ఒక మనిషి తగుదునమ్మా యని ప్రజా జీవితంలో పాలు పంచుకుంటూ, అంతటితో ఆగక ప్రబోధ వ్యాపారాన్ని చేపట్టి ప్రజానీకాన్ని ఆలోచించవలసిందిగా అభ్యర్థిస్తూ రచనలు చేస్తుంటే, సామాజిక సంఘటనలకు స్పందిస్తుంటే మెచ్చుకోళ్ళే కాదు, మందలింపులు, తిట్లు, నిందలు కూడా వస్తాయి. వాటిని సమభావంతో స్వీకరించగల సత్తా ఉంటేనే ఏ మనిషి అయినా బరిమీదికి రావాలి. దానికి స్థిరపడి నేను ప్రజారంగంలో ప్రవేశించాను.

మందలింపులను సహృదయంతో అందుకోవాలి. అలాగే చేసాను, చేస్తాను, విమర్శను సద్బుద్ధితో స్వీకరించాలి. అలాగే నడుచుకుంటున్నాను. కాకపోతే కువిమర్శలు, నిందలు వెలువడితే మనస్సుకు కొంచెం కష్టం కలుగుతున్నది. మామూలుగా మౌనం తగిన ప్రతిస్పందనగా తోస్తుంది. కాని దుర్బుద్ధితో చేసిన విమర్శలను, కువిమర్శలను పట్టించుకోక పోవటం అపచారంగా భావిస్తాను. ఈసందర్భంగా ఒక సంఘటనను వివరించటం అవసరం. నా 'ఉమెన్, ట్రెడిషను అండ్ కల్చర్ (Women, Tradition & Culture) అనే దాని పై ఒక మార్క్సి స్టు లెనినిస్టు విదేశీ యువతి (ఆమె మహారాష్ట్రలో మహిళోద్యమ కార్యకర్త, సిద్ధాంత కర్త) గా బ్రియల్ డీట్రిచ్ సుప్రసిద్ధ ఆంగ్ల వారపత్రిక 'ఎకనామిక్ అండ్ పొలిటికల్ వీక్లీ! (Economic & Political Weekly) లో 1986 నవంబరులో సమీక్ష చేస్తూ కొన్ని వ్యాఖ్యానాలు చేశారు. వాటిని పేర్కొనటం నా విధి. ఆమె లేవనెత్తిన అంశాలు యిలాగున్నాయి.

1. పుస్తకంలో ప్రదర్శింపబడిన వైఖరివల్ల స్త్రీలకు ఆత్మ పరిశీలనకు అవకాశం ఉంటుందా? హేతువాదం స్త్రీల అణచివేతకు పరిష్కార మార్గం చూపదు.

2. వర్గ సంస్థలలో పనిచేస్తున్న వామపక్ష ఫెమినిస్టుల విషయం రచయిత (నేను) పట్టించుకోలేదు.

3. వాస్తవ జీవితంలో పురుష ద్వేషులు ఎక్కడ వున్నారు?

4. స్త్రీలు దేశంలో పూజారులుగా లేరు అన్న సుబ్బమ్మ గారి ప్రకటన పొరపాటు.

5. సుబ్బమ్మ రచనలలో ముస్లిం వ్యతిరేక వైఖరి కనిపిస్తుంది.
6. మత రంగంలో స్త్రీలు తగినంతగా ముందుకు పోయారు. అందువల్ల మతం విషయమై ఎంతో పునరాలోచన సాగుతున్నది.
7. కుటుంబ నియంత్రణ విషయంలో మధ్య తరగతి స్త్రీల వైఖరిని సుబ్బమ్మ చేపట్టారు.
8. బీద స్త్రీలు కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సల వల్ల బాధపడుతున్నారు.
9. గర్భస్రావం చేయించుకునే స్త్రీలోనయ్యే మానసికావేశాన్ని సుబ్బమ్మ గమనించలేదు.
10. కుటుంబ నియంత్రణను బలవంతంగా సర్వులనూ పాటించమనడం తప్పు.
11. వివాహం విషయంలో సుబ్బమ్మ గారి ప్రతిపాదనలు కల్పనా ప్రపంచానికి చెందినవి.
12. స్త్రీ పురుష లింగ భేదాన్ని గమనించి సుబ్బమ్మ పురుష ద్వేష భాషను వాడింది.

సమీక్షా వ్యాసానికి 'సంస్కరణ వాద వైఖరి' అని ఆమె పేరు పెట్టారు.

పై సమీక్షా వ్యాసానికి నేను జవాబు వ్రాసి రామ్మూర్తి గారి సాయంతో ఆ పత్రికకే పంపాను. సర్వసాధారణంగా సమీక్షలకు రచయితల సమాధానాలు ప్రకటించరు. కాని నా ప్రత్యుత్తరం ఆ పత్రికలోనే (జనవరి 3-10,1987) సంచికలో అచ్చువేశారు. సమీక్షకులు లేవనెత్తిన అంశాలకు ఇలా జవాబులు చెప్పాను,

1. హేతువాదం సిద్ధాంతం కాదు. అది ఒక వైఖరి. దాని సాయంతో సంఘటనలు, పరిస్థితులు వీటి యొక్క కారణాంశాల పరిశీలన చేయవచ్చు. అది కేవలం మత వ్యతిరేకం మాత్రమే కాదు. అంతకన్న ఎక్కువది.
2. వారు (వర్గ సంస్థల్లో పనిచే సే తీవ్రవాద వామపక్ష స్త్రీలు) మూడవ శాఖగా పురుషాధిపత్యాన్ని, పురుష దురహంకారాన్ని వ్యతిరేకిస్తున్నారు అని వ్రాశాను.
3. వాస్తవ జీవితంలో 'రాడికల్ ఫెమినిస్టుల' పేరుతో అమెరికా సంయుక్త రాష్ట్రాలలో అనేకమంది స్త్రీలు ఉన్నారు.
4. దేశంలో స్త్రీలు పూజారులుగా కన్పించటం లేదనేది స్థూలంగా చెప్పే మాట. దక్షిణాదిలో కొన్ని క్రైస్తవ సంఘాలలో, పూనేలో, ప్రార్థనలను నడిపించే ముస్లిం స్త్రీలు ఉన్నంత మాత్రాన దేశం మొత్తం మీద విషయంగా నేను వ్రాసింది పొరపాటు కాదు.
5. నేను అన్ని మత వైఖరులను నిరసిస్తాను. విమర్శకురాలిగా ముస్లిం పక్షపాత దృక్పథాన్ని ప్రదర్శించను.

6. మత రంగంలో స్త్రీలు ముందుకు వెళ్ళారా లేదా అనేది చదువరులు తేల్చుకోవాలి.

7. ముఖ్యాంశాలలో స్త్రీలందరివి ఒకే రకపు సమస్యలు.

8. ప్రజా సేవ చేయటానికి అనువుగా కార్యకర్తలు కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సలు చేయించుకుంటూ బీద ప్రజలకు అవి అనవసరమని వాదించటంలో ద్వంద్వ నీతి కనిపిస్తున్నది.

9. గర్భస్రావం బాధాకరమే అయినా అది కుటుంబ నియంత్రణ సాధనంగా పనికి వస్తుంది.

10. చైనాలో ఇంచుమించుగా, బలవంతపు కుటుంబ నియంత్రణ విధానాన్ని అమలు పరుస్తుంటే నక్సలైట్లు చైనాను విమర్శించ లేదే!

11. వివాహం విషయంగా నా ప్రతిపాదనలలో ఆదర్శ వాదపు ఛాయలు ఉన్న మాట వాస్తవం. అయితే వాస్తవిక వాదం పేరుతో ఈనాటి దారుణమైన అవమానకరమైన స్త్రీల స్థితిగతులను అంగీకరించటానికి లేక వాటిని కొనసాగించమనే అభిప్రాయాన్ని చెప్పటానికి నేను సిద్ధంగా లేను.

12. 'స్త్రీల భాష'ను వాడటాన్ని తీవ్రవాద వామపక్ష స్త్రీలు ఇంకా అలవరచుకోలేదు. అలాంటి ప్రయత్నం సాగాలి.

వ్యవస్థ మారితే గాని సుబ్బమ్మగారు ఆశించే మార్పులు రావని, ఆ విషయాన్ని ఆమె సరిగా సూటిగా గ్రహించలేక పోతున్నారని కొందరు యాంత్రిక భౌతికవాదులు నన్ను విమర్శించే వారు. ఇది నన్ను కేవలం అపార్థం చేసుకోవటమే. పురుషాధిపత్యం, పెట్టుబడిదారీ సమాజం, ఫ్యూడల్ భావాలున్న సమాజం ఇవన్నీ స్త్రీలను క్రుంగ తీస్తున్నాయని, వాటిని నిర్మూలించాలని నేను పదే పదే చెప్తూ వ్రాస్తున్నాను. ఈనాటికీ నేను ఆ అంశాలను గమనించటం లేదని, నాకు చారిత్రక దృష్టి లేదని కొందరు అంటుంటే బాధకలుగుతున్నది. ఇటీవల మరో కోవకు చెందిన విమర్శకులు రంగం మీదికి వచ్చారు. వ్యవస్థ మారటం స్త్రీల సమస్యలకు సర్వరోగ నివారిణి కాదని సుబ్బమ్మ గారు చెప్పిన దాన్ని అంగీకరిస్తున్నాం. కాని వ్యవస్థ మార్పు స్త్రీల స్థితిగతులను, చాలావరకు చాలా రోగాలను నివారించగలదేమో అంటూ, వ్యవస్థ మార్పు కోసం కూర్చోకుండా స్త్రీ జనాభ్యుయానికి కృషి చేయడం మంచిదనే అభిప్రాయానికి చివరకు అనేకమంది విమర్శకులు వస్తున్నారు. అంతవరకు ముదావహమే. కాకపోతే 'మధ్య తరగతి ఆడపిల్ల పెంపకం కొన్ని శతాబ్దాలుగా ఎలా వుందో రచయిత్రి గుర్తు చేసుకుంటే బాగుండేది' అని, 'స్త్రీలపట్ల అంత పెద్ద మార్పు ఈ వ్యవస్థలో వస్తుందనుకోవడం ఒక 'మిత్' అనిపిస్తుంది. అని వ్రాయడం శోచనీయం. ఈ వ్యవస్థలో సమూలమైన మార్పు వస్తుందని

నేను ఆశించటం లేదు. కాగా ఇపుడు సంస్కరణ కార్యక్రమాలను ప్రారంభిస్తే అని వ్యవస్థ మారటానికి, సమూల మార్పు రావటానికి ఉపకరిస్తాయనేది నా వాదం. స్త్రీలకు లైంగిక స్వేచ్ఛలేదని నేను అదే పనిగా విశదపరుస్తుంటే 'లైంగిక స్వేచ్ఛ గురించి లైంగిక విప్లవాల గురించి చర్చించే స్థాయికి ఇంకా మన సమాజం ఎదగలేదని' అంటూ 'తతిమ్మా స్వేచ్ఛలు కలిగిననాడు మన స్త్రీలు లైంగిక స్వేచ్ఛను గురించి చర్చించాలి అనడం యధాతథ వాదానికి పరోక్షంగా బలపరచినవారమవుతాం. స్వేచ్ఛ అవిభాజ్యం. కొన్ని రంగాలో అది పూర్తిగా వికసించటం, మరికొన్ని రంగాలలో అది ఉపేక్షకు గురికావటం కోరతగినది కాదు. అన్ని రంగాలలో స్వేచ్ఛకు ఉద్యమించాలి. స్వేచ్ఛా సాధనలో దశలు లేవు, ఉండరాదు. లేకపోతే కొన్ని రంగాలలో అది మున్ముందుగా ఫలిస్తుంది. అంతేకాని మనంగా స్వేచ్ఛా సాధనలో గిరులు, మెట్లు, దశలు నిర్ణయించుకొని ప్రవర్తించటం సబబు కాదు. ఈ విషయాలను గ్రహించగల వారే చివరకు 'ప్రబోధం కోసమే ప్రబోధంలా వుండకూడదు' అని హెచ్చరిక చేయడం ఆశ్చర్యకరం. సమాజాన్ని మేల్కొల్పే ప్రయత్నంలో ఆందోళన, ప్రబోధం, సంఘటనాయుత పోరాటం ఇవన్నీ అనుసరణీయాలు; ఆదరణీయాలు. ఈ మాటలు నేను పనికట్టుకొని నెత్తిన నోరు పెట్టుకొని ప్రకటిస్తున్నా, ఇప్పటికి ఇలా విమర్శలు రావడం దురదృష్టకరం.

నేను మధ్య తరగతికి పరిమితమయి పనిచేస్తున్నానని భావించి నేను ఏర్పాటుచేసే సెమినార్లకు వచ్చి గ్రామాలలో పనిచేయాలి గాని మధ్య తరగతిలో పనిచేసి లాభం లేదని, ఉపన్యాసాలకు వచ్చి ఉపన్యాసాలవల్ల ప్రయోజనం లేదని హెచ్చరించే మహిళలు అధిక సంఖ్యలో దర్శనమిస్తు న్నారు. గ్రామ స్త్రీలలో కృషి ఆరంభిస్తే మీరు చెప్పేవి వారికి అర్ధం కావు. అర్థం చేసుకోగల చదువుకున్న వారికి తెలియ జెప్పండి' అని సలహాలను అదే పనిగా విసిరే వారు స్త్రీలలో కూడా ఉన్నారు. హెచ్చరికలు, సలహాలు, ఆ మాటకు వస్తే మందలింపులు వీటిని ఎప్పుడు ఆహ్వానించవలసిందే, ఆశించవలసిందే. కాగా తాము మాత్రం కార్యరంగంలోకి దూకకుండా ఉచిత సలహాలను అందించటమే తమ హక్కు అన్నట్లు నడుచుకోవటం నాకు చికాకు కల్గిస్తున్నది. ఈ బాధలు, చికాకులు మనస్తాపాలు – కువిమర్శవల్ల కలిగినా – వీటినుండి నేను ఎప్పుడు విముక్తిరాలిని కాగలనో!

నా పుస్తకం 'స్త్రీ విముక్తి (Women%µ%s Liberation) లోని కొంత భాగాన్ని 'విన్ (Women's International net work news) లో ప్రచురితమయితే, 'స్త్రీల పోరాట ప్రయత్నం (Saga of Women's Struggle) ఇస్లాం స్త్రీలు (Islam & women) వీటి విషయసూచికను ఆ పత్రికవారు ఉటంకిస్తే, 'స్త్రీలు, సంప్రదాయం, సంస్కృతి' (Women Tradition & Culture) మత ధర్మశాసనాలు : స్త్రీలు (Personal laws : women)

'మహిళలు : మానవ హక్కులు' Human Rights : Women's Rights), 'స్త్రీల పై అత్యాచారాలు' (Atrocities on women) అదే పత్రికలో 1990 వేసవి కాలపు సంచికలో పేర్కొనబడితే నాకు కల్గిన సంతోషం మితిలేనిది. అంతర్జాతీయ మహిళోద్యమానికి అండగా గత 16 సంవత్సరాలుగా కృషిచేస్తున్న 'విన్ 'వారి మన్నన లభించినందుకు మురిసి పోయాను. బలాన్ని పుంజుకున్నాను. ఖేదమోదాలను దాటి పోగల స్థితి ఏనాడు వస్తుందో! అసలు వస్తుందా!

# 4. షష్టి పూర్తికి పొందిన స్ఫూర్తి – కలిగిన తృప్తి

మిత్రులు నా షష్టిపూర్తి సభ జరుపుతామని అన్నప్పుడు అసలు షష్టిపూర్తి ఎందుకు చేసుకుంటాం అనే ఆలోచన నా దీర్ఘ నిద్రను మేల్కొలిపింది. అరవై ఏళ్ళ జీవితంలో ఏమి సాధించాం, ఎవరిని ఉద్ధరించాం, శేష జీవితాన్ని ఎలా వినియోగించాలి, అని అతి 'సీరియస్' గా ఆలోచించి ఒక నిర్ణయానికి వచ్చాను. "ఈ సభకు నేను ఇష్టపడను" అని చెప్పి వారిని పంపి ఈ సందర్భంగా ఒక ఉన్నతోన్నతమైన ఘన కార్యానికి ప్రాతిపదిక వెయ్యాలి అని నిర్ణయించుకు న్నాను. తెల్లారితే 60 ఏళ్ళు నిండుతాయి. ఆ రాత్రి అంతా ఆలోచిస్తూనే వున్నా, సర్వసంగ పరిత్యాగం చేసి, కాంతా కనకాలను జయించిన వారు, ప్రపంచ చరిత్రలో గొప్ప కీర్తి గణించిన ఇద్దరు మహా పురుషులు నా దృష్టికి గోచరమయ్యారు. వారు గౌతమ బుద్ధుడు, భీష్ముడు. అతిలోక సుందరి, మహా సద్గుణవంతురాలు అయిన భార్యను, రాజ్యాధికారాన్ని పరహితార్థం కొరకు త్యాగం చేసిన మహాపురుషుడు బుద్ధుడు. అందుకే దానిని మహాపరిత్యాగం అన్నారు (%ఉష్ట్రవ +తీమఫ్ =వఅబఅఎఅఖ్అశీఅ శీట +శీబ్ఖఝ దీబఎఝ%). పారిపోయాడు, లేచిపోయాడు అనలేదు. అలాగే మహావీరుడయిన భీష్ముడు కూడా సర్వాన్ని అసామాన్య త్యాగం చేసి చరిత్రలో నిలిచాడు. వారిలాంటి వారు మళ్ళీ పుట్టనేలేదు. పుడతారని ఆశకూడా లేదు. వారి త్యాగం, దృఢ నిశ్చయం నన్ను ఉత్తేజ పరిచాయి. ఈ సందర్భంగా "దానము, భోగము, నాశము పూనికతో మూడు గతులు భువి ధనమునకున్ "అన్న భర్తృహరి సూక్తి కూడా జ్ఞప్తికి వచ్చింది. అలా నాశము కాకుండా, ఆ మహా పురుషులంత కాకున్నా కొంతలో కొంతయినా త్యాగంచేసి భావితరాలకు మార్గదర్శకం వహించవచ్చు కదా అని ఆరోజు అర్థరాత్రి ఒక స్థిర నిశ్చయానికి వచ్చాను. నన్నడిగితే నా సంపద ఒక విధంగా కష్టార్జితమే. ఏనాడూ ఎండనక, వాననక పనిచేసి, బస్సుల్లో తిరిగి, పైసా, పైసా కూడబెట్టి, బ్యాంకుల్లో దాచి వడ్డీలు పెంచి నిల్వ చేసుకొన్న ధనాన్ని అది ఎంత తక్కువయినా దానికి విలువా, హెూదా వున్న ఆస్తి అది. దానిని సద్వినియోగం చేయాలని నా దృఢ సంకల్పం. మరునాడు ఉదయాన్నే ముందుగా నాకెంతో ఇష్టమైన వజ్రాల దుద్దులు – అవి నేనుగా కొన్నవి. నా కిష్టమైన ఆభరణం. అవి ఒక్క రోజు కూడా విడిచి పెట్టనివి ఆ రోజు తీసేసి ఆ డబ్బు నా పుస్తకాల ఖర్చుకు జమ చేశా. మా అత్తగారు తన 150 తులాల మేలిమి బంగారం కోడలిగా నాకందజేసి తృప్తి పడ్డది. ఆ నగలన్నీ పిల్లల కిచ్చినా, పుస్తకాల కిచ్చినా చీమకుట్టినట్లు లేదు. కాని రవ్వల దుద్దులు అలా కాదు. నేను మోజుపడి కొనుక్కున్నవి. వాటిని త్యజిస్తే సంపదమీద, ఆడంబరాల మీద కాంక్ష తగ్గి వున్నతోన్నత దశకు పోతాననే భావంతో వాటిని ముందుగా త్యజించటం జరిగింది. నా నగల డబ్బుతో కొన్న పొలం నా పేర వున్న మూడు ఎకరాలు అమ్మితే 15 వేలు వచ్చింది. ఆ తర్వాత ఆ డబ్బుతో 1962లో వికాస కేంద్రానికి స్థావరమైన మెహిదీపట్నంలో ఇల్లు కొన్నాం. అది ఈనాడు 12 లక్షల ఆస్తి. అంతటి విలువగల ఆ హౌసింగ్ బోర్డు

ఇంటిని సంస్థలకు ఇచ్చేయాలని ఆ రోజే గట్టిగా నిర్ణయించుకొని విల్లు వ్రాయ సంకల్పించాను. నా ఆస్తిపాస్తులు, డబ్బు, ఇల్లు సర్వం సంస్థలకు చెందాలని వ్రాయాలి. అయితే ఇక్కడొక మెలిక వుంది. నా తదనంతరం రామ్మూర్తిగారు బ్రతికి వున్నంత కాలం ఈ ఇంట్లోనే వుండి ఈ సంస్థల వ్యవహారాలు చూడాలని, ఆయన తర్వాత ఈ మొత్తం స్థిర చరాస్తులు యావత్తూ నాచే సృష్టించబడ్డ సంస్థలకు చెందాలని నా ఆశయం. ఆ విధంగా విల్లు వ్రాశాను.

గత 40 ఏళ్ళుగా నేను, 50 ఏళ్ళుగా రామ్మూర్తిగారు సమాజ సంక్షేమమంటూ యథోచిత సేవ చేశాం. పిల్లలు మధ్యలో వచ్చారు. రెక్కలొచ్చి ఎగిరి పొయ్యారు. సహజంగా అయితే వారికే చెందవచ్చు. కాని చదువులు చెప్పించాము. ఉన్నతులు అయ్యారు. వారి 'యూనిట్స్' వేరయి పొయ్యాయి. ఇంతకాలం సేవ, సేవ అంటూ కలవరించి చివరికి మళ్ళీ పిల్లలు, పిల్లలు అంటూ తపించి పోవటం నాకిష్టం లేకపోయింది. అది అందరూ చేసే పనే. అలా కాకూడదనే నిర్ణయంతో ఇల్లూ, నా యితర యావదాస్తి అంతా నా షష్టిపూర్తినాడే ధర్మ సంస్థలకు విల్లు ద్వారా అందజేయదలచాను. దానికి రామ్మూర్తిగారు పరమానందభరితులయి, ఇప్పటికయినా నీకు అంత త్యాగం కలిగిందని నన్ను అభినందించారు. ఇప్పుడు నేనే ట్రస్టు ఇంట్లో వున్నట్లుగా భావిస్తున్నాను. ఈ ఆస్తి రక్షణకు, ఈ సంస్థల పోషణకు ఏ మహనీయులో పుట్టే వుంటారు. అనతి కాలంలో వారు ఈ కార్యభారాన్ని స్వీకరించగలరని ఎదురుచూస్తున్నాను. ఆ పని నేను బ్రతికి వుండగానే జరిగితే నా జన్మ చరితార్థమైనట్లే. అలా నా షష్టిపూర్తి ఉత్సవాన్ని మహాదానందంగా, ఘనంగా జరుపుకున్నాను. ఎంత హాయినిచ్చిందో! ఎంత 'రిలీఫ్' వచ్చిందో! దానపత్రం వ్రాసి వెంటనే రిజిష్టరు చేయించవచ్చును. కాని స్టాంపు ఖర్చు చాలా అవుతుందని దానిని తప్పించటానికి వీలునామా వ్రాసి రిజిష్టరు చేసి నా యావదాస్తిని మల్లాది సుబ్బమ్మ ట్రస్టుకు చెందజేసి సంతృప్తిని పొందగలిగాను. ఆ మాట ఆరోజే ఆత్మీయుల సమక్షంలో ప్రకటించాను. ఆ తరువాత నా ఆస్తిని నా ట్రస్టుకు ఇవ్వాలనే సంకల్పం ధృవపడింది. నా ఈ షష్టిపూర్తి తీర్మానాన్ని సభాముఖంగా నా సహచరులకు, సానుభూతిపరులకు తెలియజేశాను. అది నా పిల్లల సమక్షంలోనే జరిగింది. అందరూ హర్షించటం నా అదృష్టం. అలా ముగిసింది నా షష్టిపూర్తి ఉత్సవం.

షష్టి పూర్తి నాడు చేసిన సంకల్పానికి రూపం ఇద్దామని అనుకుంటున్న తదుపరి మహిళాభ్యుదయ ట్రస్టు స్థాపన 1987లో జరగటం, దాని పేర 2 దఫాలుగా 3 ఎకరాల పొలం జనవాడ గ్రామంలో కొనడం, 2దఫాలుగా నా పేర 2 1/2 ఎకరాలు పొలం కొనడం జరిగింది. మెహిదీపట్నం యింటిని మల్లాది సుబ్బమ్మ ట్రస్టుకు, జనవాడ భూమిని మహిళాభ్యుయ ట్రస్టుకు ఇస్తూ 1991లో వీలునామాను వ్రాయడం సంభవించింది. నా కుమారులు ఆ వీలునామాలో సాక్షి సంతకాలు చేశారు. షష్టిపూర్తి స్ఫూర్తి పనిచేసింది.

# 5. నా యూరపు పర్యటనానుభవాలు

విదేశాలు సందర్శించని వారు అక్కడి ప్రజల స్థితిగతుల గురించి రెండు భిన్నాభిప్రాయాలు కలిగి వుంటారు. ఆ దేశాలలలో మానవ జీవితం సుభిక్షంగా వుంటుందని, అక్కడ అంతా భూతల స్వర్గంలా వుంటుందని, మనదేశంలో అలాంటి జీవిత విధానం లేదనుకుంటారు కొందరు. అక్కడ అంతా విచ్చలవిడి తనమేనని, మనదేశంలోలా ఉన్నత సంస్కృతి వుండదని మనదేశాన్ని ఆకాశానికి ఎత్తి విదేశాల వారి గురించి చులకనగా, హేళనగా చూస్తారు మరికొందరు. నిజానికి ఈ రెండు అభిప్రాయాలు పూర్తిగా నిజం కాదు. ప్రతి మనిషిలోను కొన్ని మంచి, కొన్ని చెడు లక్షణాలు వున్నట్లే ప్రతి దేశ పద్ధతుల్లో కూడా కొన్ని ఆదరణీయంగా వుంటే, మరికొన్ని తృణీకరించ వలసినవిగా వుంటాయి. ఆ విషయాన్ని తెలియజేయడానికి, అక్కడ వు్న దర్శనీయ స్థలాలను, విశేషాలను గురించి చెప్పడానికి మీతో నా విదేశీ యాత్ర అనుభవాన్ని పంచుకోడానికి వ్రాస్తున్నాను.

విదేశాలలో కుటుంబమంటే భార్యా, భర్త 14 సం. లోపు పిల్లలు మాత్రమే వుంటారు. చిన్నలు, పెద్దలు జంటలుగానే తిరగటం వారి అలవాటు. యువతీ యువకులు రోడ్ల మీద, తోటల్లోనూ ముద్దెట్టుకున్నా, కౌగిలించుకున్నా, రెండోవారు వింతగా చూడరు, పట్టించుకోరు. పురుషులతో సమానంగా స్త్రీలు త్రాగటం, సిగరెట్టులు కాల్చటం సర్వ సామాన్యం. ఉద్యోగినుల పిల్లల్ని చూడటానికి వేరే వసతి గృహాలున్నాయి. వివాహం కాకుండా పిల్లల్ని కనడం పెద్ద నేరంగా భావించరు. అలాగే అవివాహిత స్త్రీ పురుషులు దాంపత్య జీవితం గడపడం విడ్డూరం కాదు. దీనికి సాంఘిక బహిష్కారం లేదు. ప్రతి కజ్జాకు విడాకులు తీసుకుంటారని మనం అపోహ పడరాదు. సర్దుకొని పోతూనే వుంటారు.

మొత్తం మీద స్త్రీలు పురుషులకన్నా తక్కువగా చూడబడుతున్నా కుటుంబ నిర్వహణలో పురుషుల సహాయ సహకారాలుంటాయి. అది వారు న్యూనతగా భావించరు. ఇంటి పనిలో వారి తోడ్పాటు వుంటుంది. పని మనిషిని భరించటం చాలా కష్టం. వంట విషయంలో అనేక నూతన పరికరాలు వున్నాయి. కరెంటు, గ్యాసు, నీరు, టెలిఫోను తీగలు, గొట్టాల ద్వారా భూగర్భం నుండి సర్వకాలం వస్తూనే వుంటాయి.. వంట పదార్థాలు సగం వుడికించి డబ్బాల్లో సీలుచేసి అమ్మితే వాటిని వేడిచేసి తినవచ్చు. స్త్రీ పురుషులు తమ సామాన్లు తామే తెచ్చుకోవడం సర్వత్రా కన్పిస్తుంది. బస్సుల్లో, రైళ్ళల్లో స్త్రీలకు వేరే స్థానాలుండవు. వృద్ధులకు, అంగ వికలులకు మాత్రం ముందు సీట్లు కేటాయిస్తారు. కష్టపడి పనిచేసి సంపాదిస్తారే కానీ మోసం, లంచగొండి తనం, అవినీతి, కలీలు చాలా తక్కువ. వారాంతానికి విహార యాత్రలు చేయటం సర్వసామాన్యం. వేసవి శలవుల్లో లక్షల సంఖ్యలో విదేశస్తులు యూరప్ అంతా పర్యటిస్తుంటారు. ప్రపంచ ప్రఖ్యాతి గన్న హీత్ రో విమానాశ్రయం వేల సంఖ్యలో కిటకిటలాడుతూ వుంటుంది.

ఇంగ్లండులో టూరిస్టు శాఖలో 15 లక్షల మంది పనిచేస్తారు. 8 వేల కోట్లు విదేశీ మారకద్రవ్యం ఏటా వస్తుందని చెప్పారు. యాత్రికులకు సదుపాయాలు హెచ్చుగా వుంటాయి.

లండన్ మ్యూజియం అద్భుతమైనది. ఇందులో ఈజిప్షియన్ మమ్మీలు పేరెన్నిక గన్నవి. రకరకాల చిత్రాలు, బొమ్మలు, జంతువులు, ఆయుధాలు వున్నాయి. బకింగ్ హామ్ ప్యాలెస్ చాలా అందమైనది. విశాలమైన హాల్సుతో విరాజిల్లు రాజ ప్రసాదం అది. విలువైన రాజ ఆభరణాలలో, రాణి విక్టోరియా కిరీటంలో కోహినూర్ వజ్రాన్ని చూసినప్పుడు కాంతులు విరజిమ్మే ఆ విలువైన దానిని మనం పోగొట్టుకున్నామని బాధ కలిగింది. బ్రిటన్ లో మెచ్చుకోతగ్గవి, ఆచరించాల్సినవి ముఖ్యమైనవి రెండు విషయాలు. సామాజిక భద్రతా పథకం, (సోషల్ సెక్యూరిటీ స్కీము), జాతీయ ఆరోగ్య భద్రతా ప్రణాళిక (నేషనల్ హెల్తు ఇన్సూరెన్సు స్కీము). ఈ స్కీము క్రింద వృద్ధులకు రక్షణ వుంది. వారి భారాన్ని పిల్లలు చూడనప్పుడు ప్రభుత్వమే సర్వ విధాలా పోషించి అంత్యక్రియలు కూడా హుందాగా నిర్వహిస్తుంది. వయస్సు ముదిరే కొద్దీ పిల్లలు పోషిస్తారో, లేదోననే చింత వుండదు. వృద్ధాప్య రక్షణ, అంతిమ దశలకై ధనం కూడా పెట్టాల్సిన అవసరం లేదు. ఇది ప్రతి వ్యక్తికి చాలా ఊరట కలిగిస్తుంది. ఈ స్కీమ్ క్రిందనే నిరుద్యోగులకు వారానికి 45 పౌండ్ల భృతి ఇచ్చి తోడ్పడుతుంది. ఏ వ్యక్తి జబ్బు పడ్డా, యాక్సిడెంట్ జరిగినా 999కి ఫోనుచేస్తే చాలు వెంటనే అంబులెన్సుతో వచ్చి తీసుకెళ్ళి ఔషధాలు వుచితంగా ఇచ్చి వైద్య చికిత్స చేస్తారు. పండ్లు కట్టటం, కళ్లజోడు తప్ప సర్వము ప్రభుత్వం ఇస్తుంది. ఈ సదుపాయాలు భారతదేశంలో చూడగలిగే దశ ఎప్పటికి రానున్నది !

లండన్ లో అనేకచోట్ల మ్యాపులు వేసి, 'యారో మార్కులు' పెట్టి వివరంగా వ్రాసిన బోర్డులు వుంటాయి. అంతా చదువుకున్న వారే కనుక స్వయంగా ప్రదేశాలు అన్నీ చూడగలరు.

లండన్లో 6 రోజుల అంతర్జాతీయ మానవవాద నైతిక మహాసభ (1978) కార్యకలాపాలు ముగిసిన తరువాత లండన్ మహా నగర దర్శనం, స్కాట్ లండ్ పర్యటన చేశాం. ప్రసిద్ధ యాత్రా స్థలాలు కొన్ని చూశాం.

బ్రిటిషు మ్యూజియం నన్నెంతో ఆకర్షించింది. మేడం టూసా మైనపు విగ్రహాల ప్రదర్శనను తిలకించాం. ఇందులో దేశ విదేశాల నాయకుల విగ్రహాలు, ప్రఖ్యాత హంతకుల నుండి సామాన్య పౌరుల వరకు అందరి విగ్రహాలు అన్నీ సజీవంగా, సహజ స్వరూపాలతో అలరారుతూ వున్నాయి. ఆ బొమ్మలలో జీవకళ ఉట్టిపడుతున్నది. దాన్ని చూడ్డానికి రోజుకు కొన్ని వేల మంది స్వదేశస్తులు, విదేశస్తులు వస్తూ వుంటారు. అలాంటిది మచ్చుకైనా ఒకటి మనదేశంలో లేకపో యెనే అని బాధపడ్డాను.

సముద్రతీర ప్రాంతమైన ఒక పట్టణానికి వెళ్ళాం. వేసవి కాలంలో ప్రతి ఇంటివారు ఒకటి రెండు గదులు అద్దెకిచ్చి సంపాదించుకుంటారు. ఆ ఇంటి యజమానురాలిని "నీవు ఉద్యోగం చేస్తున్నావా?" అని అడిగాను. ఆమె "నేను నా భర్తను ఉద్యోగం చేయనిస్తాను" అని తమాషాగా జవాబు చెప్పింది. నిజానికి వేసవికాలం 2 నెలల్లో ఆమె తన ఇంటిలో గది అద్దెకిచ్చి అతడు సంవత్సరానికి సంపాదించిన మొత్తం కన్నా అధిక మొత్తం జమ చేయగలదట.

స్కాట్ లండ్ లో వేసవి కాలంలో కూడా విపరీతంగా వున్న బ్రిటీషు చలి చవి చూశాను. దేశంలో చర్చిలలో ప్రార్థనలకు చేరే వారి సంఖ్య స్వల్పంగా వుంది. ప్రత్యేక పండుగ దినాలలో ఉచిత మధ్యాహ్న భోజన వసతి కల్పించినా హాజరయ్యే వారి సంఖ్య స్వల్పం. కేవలం జన్మదినోత్సవాలకు, వివాహాలకు, అంత్యక్రియలకు మాత్రమే వారికి మతాధికారులు జ్ఞాపకం వస్తారు. స్కాట్ లండ్ లో బీచ్ ఒడ్డున నలుగురి పిల్లల తల్లిని చూశాను. ఆమెను వింతగా అదోరకంగా చూడటం తటస్థించిందేమో "నేను కుటుంబ నియంత్రణ పాటించను" అని ఆమె ఈ ప్రశ్నకు ఎదురు చూడకుండానే జవాబు చెప్పింది.

యూరపు బస్సుపై పర్యటించాం. 8 దేశాలకు 15 రోజుల కాలం పట్టింది. బస్సుల కంపెనీవారే హొటళ్ళలో, భోజన వసతి సౌకర్యాలను ఏర్పాటు చేశారు. దాంతో సగం బాదర బందీ వదలిపోయింది. చిన్న పట్టణాలలో పెద్ద గదులు, పెద్ద పట్టణాలలో చిన్న పడక గదులు లభ్యమయ్యేవి. బెల్జియం, లగ్సెంబర్గ్, ఫ్రాన్సు, ఆస్ట్రియా, ఇటలీ దేశాలను సందర్శించాం. పారిస్లో చైనా ప్రభుత్వం పీపుల్స్ పబ్లిషింగ్ హౌస్లో ఒక చైనా వనితను కలవడం తటస్థించింది. ఆ దేశంలోని స్త్రీల స్థితిగతుల గురించి వాకబు చేశాను. శాసనాలు సమానత్వాన్ని ప్రసాదించినా అనుభవంలో అది మృగ్యమవుతున్నదని ఆమె నిస్సందేహంగా బదులు చెప్పింది.

ఇటలీలో జేబు దొంగతనాలు ఎక్కువని మమ్మల్ని ముందుగా బెదిరించారు. కానీ అలాంటి దేమీ తటస్థించలేదు. రోమ్ నగరంలో మాకు ఒక విచిత్ర పరిస్థితి ఎదురైంది. హొటల్ లో భోజనం వడ్డించాడు వెయిటర్. కానీ మంచినీళ్ళు పెట్టలేదు. భోజనానికి కూర్చున్న వారిలో 13 దేశాల వారం వున్నాం. ఎవరికీ ఏమీ పాలుపోలేదు. చివరకు కెమిస్ట్రీ చదువుకున్న ఒకామెకు లాటిన్ పదం 'యాక్వా జ్ఞాపకం వచ్చింది. వెయిటర్ ను పిలిచి 'యాక్వా' పేరు ఉచ్ఛరించి తెమ్మని సంజ్ఞ చేసింది. వెంటనే అతను చిరునవ్వు నవ్వుతూ జలం తెచ్చి మా ఎదుట వుంచాడు.

అతని ముఖంలో, మా ముఖాలలో చిరునవ్వులు వెలిశాయి. అందరం ఆనందించాం. మానవాళి అంతా ఒకటేనని సానుభూతి అందరి యెడల వుంటుందని స్వానుభవంతో గ్రహించాను. ఫ్రాన్సులో పార్కుల్లో పూలు కోయనీయరు, లాన్ మీద

నడవరాదు. అలా చేసిన వారికి అప్పటికప్పుడు 100 ఫ్రాంక్ లు జరిమానా వేసేవారు. ఆనాటి ధర ప్రకారం అది 350 రూ॥లు. ఉద్యానవనాలు వివిధ వర్ణ పుష్పాలతో కళ కళలాడుతుండేవి. మనదేశంలో పార్కులకు అలాంటి స్థితి ఎప్పుడు రాగలదో అనే ఆలోచనలో పడ్డాను.

లండన్ నగరంలో రోడ్డు మీద చెత్తా చెదారం వుండేది కాదు. చాక్లెట్ తిన్నా 5 ఏళ్ళ పసిబాలుడు సైతం పై కాగితాన్ని మడచి పెట్టి విద్యుత్ స్తంభానికి కట్టి పెట్టి వున్న చిన్న చెత్తబుట్టలో పడేసి వెళ్ళేవాడు. రోడ్డుమీద చెత్త వేస్తే 100 పౌన్ల జరిమానా. మనదేశంలో అలాంటి పారిశుధ్య భావనలు ఎప్పుడు వస్తాయా అని కలలుగనడం సంభవించింది.

బ్రిటీషు వారు మామూలుగా మితభాషులని ప్రతీతి. అది నిజమే. కానీ వారిని సాయం కోరితే జ్ఞాపకం పెట్టుకొని సాయం చేసేవారు.

పారిస్ లో సాయంత్రపు వేళ వేల మంది స్త్రీ, పురుషులు ప్రక్కన వుండే కెఫేలలో భోజనాలు చేస్తుండే వారు. పారిస్ నగర వాసుల్లో 3వ వంతు మంది ఇంట్లో రాత్రి భోజనానికి కూడా తయారు చేసుకోరని తేలింది. మధ్యాహ్న భోజనపు సంగతి సరే సరి. వారి వారి పని ప్రదేశాలలో క్యాంటిన్ లలో తింటారట. కాకపోతే ఉదయపు ఫలహారం (బ్రేక్ ఫాస్ట్) మాత్రం ఇంటివద్ద తీసుకుంటారు. ఒక రకంగా ఆలోచిస్తే స్త్రీలకు వంటపని భారం తగ్గుతుందని ఎంతో సంతోషించాను. స్త్రీలు ఇంటి పనినుండి, వంటపని నుండి విముక్తులయినప్పుడు దేశ సామాజిక కార్యకలాపాలలో, ఆర్థిక ఉత్పాదక ప్రక్రియలో, సాంస్కృతిక వ్యాసంగాలలో తమకు నచ్చిన రీతిన వ్యవహరించగల అవకాశం కలుగుతుంది.

బ్రిటనులో 40 కి.మీ. బస్సుమీద ప్రయాణం చేసి ఒక బీచ్ ను చూశాం. ఆ ప్రదేశం 2 కొండల మధ్య వున్న ఇసుక ప్రాంతం. నిజానికి సుందరమైన ప్రదేశమే. దాని పొడవు 3 ఫర్లాంగులు, వెడల్పు 2 ఫర్లాంగులు. అందులో వేల కొద్దీ స్త్రీ పురుషులు ఆనందంతో సంతృప్తితో తిరుగాడటం గమనించాం. సుమారు 900 కి.మీ. పొడవునా సముద్రతీర ప్రాంతం మన ఆంధ్రప్రదేశ్ లో వున్నా ఇలాంటి ‘బీచ్’ను ఏర్పాటు చేసుకోలేక పోయామే, వున్న వాటిని వాడుకోలేక పోతున్నామే అని బాధపడ్డాను.

పారిస్ నగరం తీరు తెన్నులు చూచిన తరువాత దాని నిర్మాణానికి దోహదం చేసిన నెపోలియన్ మహాద్భుత చర్యలు స్ఫురణకు వచ్చాయి. అతడు కేవలం సైనిక నాయకుడే కాదు, ప్రజా జీవితాన్ని సరిదిద్దగల పరిపాలనా దక్షుడు. మతాధికారుల ప్రమేయం లేకుండా సర్వులకూ, వర్తించే శాసనాలను రూపొందించిన ఘనుడు. దేశాన్ని “డిపార్టుమెంట్లు” గా విభజించి స్థానిక పరిపాలనను సుస్థిరం చేసిన ముందు చూపు

ఆయనది. సైన్యాలు, యుద్ధాలు జ్ఞాపకం చేసుకొని మహనీయులు చేసిన మంచి పనులు స్మరించలేని దౌర్భాగ్యం మానవాళిది.

వేసవి కాలంలో బ్రిటన్ కు కోటి మంది విదేశస్తులు యాత్రికులుగా వస్తారు. వారివి వివిధ సంస్కృతులు, వివిధ నాగరికతలు. అందువల్ల కొంత కోలాహలం అస్తవ్యస్తం కనిపిస్తుంది. బ్రిటిషు స్త్రీలు సహజంగా సంయమన ప్రవర్తనతో వుండేవారు. యూరప్ నుంచి వచ్చిన కొన్ని దేశాల వారు విశృంఖలంగా సంచరించే వారు. అందువల్ల బహిరంగ ప్రదేశాలలో స్త్రీ పురుషుల కౌగిలింతలు, పరిష్వంగాలు గోచరమయ్యేవి. ఆఖరికి ఎస్కలేటర్సు మీద కూడా ముద్దు పెట్టుకుంటూ పోతారు. వాటిని, వారిని ఎవరూ పట్టించుకునే వారు కాదు. విడ్డూరంగా చూచి అసహ్యించుకోవడం గానీ ఇతరత్రా మెచ్చుకోవడంగానీ జరిగేది కాదు. ఇతరులు ఉదాసీన భావంతో సాగిపోయే వారు. నాకేమీ గగుర్పాటు గానీ, అసహ్యంగానీ కలిగేది కాదు. ఏ దేశపు ఆచార వ్యవహారాలు వారివి. అలాగే సంస్కృతి నాగరికతలు గురించి కూడా చెప్పుకోవలసి వుంటుంది. నాగరికతను, సంస్కృతిని మానవుల స్వేచ్ఛా, సమానత్వ, సౌభ్రాతృత్వ గీటురాళ్ళ మీద తరచి చూడవలసి వుంటుంది. వాటిని సమతుల్య భావనతో పరిగణించి, వాటిలోని మంచి చెడ్డలను పరిశీలించగలిగిన నాడు మానవాళి పురోగమించగలదనే విశ్వాసం నాకు కలిగింది.

ఏదేశమేగినా ఎందుకాలిడినా ముున్ముందుగా అచ్చటి స్త్రీల పరిస్థితిని పరిశీలించడం, తెలుసుకోవటం నాకలవాటు. అలాగే నేను ప్రతి దేశంలోనూ అచ్చటి స్త్రీల స్థితిగతులను గురించి వీలయినంతగా సమాచారం సేకరించే దాన్ని. నా అన్వేషణలో తేలిన విషయమేమిటంటే ఏ మారుమూల ప్రాంతానికి పోయినా ఏ అభ్యున్నతి చెందిన దేశానికి వెళ్ళినా కనిపించేది పురుషాధిపత్యం, పురుష ప్రాధాన్యత, స్త్రీల అణచివేత మాత్రమే. దేశ దేశాలకు, ప్రాంత ప్రాంతాలకు, తరతమ భేదాలు వుండవచ్చును కాని స్త్రీ పురుష సంబంధాల తీరు మాత్రం అదే. కనుక ప్రపంచ స్త్రీలు సమైక్యంగా, సంఘీభావంతో తమ పరిస్థితులు చక్కబెట్టుకోవడానికి కృషి చేస్తూ, ఆ ప్రయత్నంలో అభ్యుదయకరంగా పయనించాలనే నా భావం ధృవపడింది.

దేశపు ఎల్లలు దాటి ప్రపంచంలో కొన్ని దేశాలనయినా చూస్తే సంకుచిత జాతీయ భావం నశిస్తుంది. మన జాతి మాత్రమే గొప్పది. మన జాతి సంస్కృతి మాత్రమే మహత్తరమయినది అనే దుర్భ్రమలు తొలగిపోతాయి. విశాల దృక్పథం ఏర్పడుతుంది. మానవాళి సమైక్యత గోచరిస్తుంది. మానవ స్వభావ అవగాహన పెరుగుతుంది. ఇలాంటి పరిణామమే నాపట్ల జరిగింది. ఇదే నా విదేశీ పర్యటనానుభవం.

# 6. పేరు మార్చుకోవాలని ప్రాకులాట

"మీ అమ్మ పేరు చక్కగా అన్నపూర్ణమ్మ అని పెట్టుకుంది కదా మరి నీ పేరు "వెంకట సుబ్బమ్మ" అని పిచ్చి పేరు పెట్టిందేమిటి అమ్మమ్మా?" అని నా మనమరాలు అనుపమ ధైర్యంగా అడిగింది.

నా చిన్నప్పటినుండి నాకు కూడా పేరు మార్చుకోవాలని కుతూహలం వుండేది. ఆఖరికి మా ఇళ్లలో పని వాళ్ళు కూడా ఆనందాబాయి, సువర్ణ, మంజుల, మాలతి అని పెట్టుకుంటున్నా రని, నాది పాతకాలపు పేరు అని బాధగా వుండేది. చివరికి 1940లో పేరు మార్చుకుంటానని రామ్మూర్తిగారితో సంప్రదించగా "ఆ! పేరులో ఏమున్నది. మనిషి చర్యల్లో, నడతలో, దృక్పథంలో వుండాలి కాని, దుర్గాబాయమ్మ, అచ్చమ్మా జాన్ ముత్తు అఖిల భారత స్థాయిలో గొప్ప పేరు ప్రఖ్యాతులుగల విదుషీమణులు కాలేదా? కస్తూరి అని పెట్టుకుంటారు. ఇంట్లో గబ్బిలాల కంపు, కొందరు లెనిన్, స్టాలిన్, గాంధీ అని పెట్టుకుంటారు. కాని వారికున్న ఉదాత్త ఆశయాలు, ఆదర్శాలు వీరికి వుంటాయా" అని వాదించి నా ప్రయత్నాన్ని మాన్పించారు. ఆ తర్వాత ఆ విషయాన్ని నేనూ అంతగా పట్టించుకోలేదు. అలాగే జరిగి పోతోంది. ముఖ్యంగా నేను హేతువాదిగా మారిన తరువాత 'వెంకట సుబ్బమ్మ' అనే పేరు లోంచి 'వెంకట' అనే పదం తీసేసి 'మల్లాది సుబ్బమ్మ' అని మార్చుకున్నాను.

ఆ తరువాత మరో విమర్శ వచ్చింది. 'స్త్రీ విమోచనోద్యమ నాయకురాలై వుండి భర్త ఇంటి పేరుతో మీరు గుర్తింప బడటం మాకు అభ్యంతరకరంగా వుంది' అన్నారు. ఇకముందు 'సుబ్బమ్మ'గా పిలవబడాలనే హెచ్చరికలూ వచ్చాయి. వాటికి నా సమాధానం ఏమిటంటే పది సంవత్సరాలు నిండగానే పెళ్ళయిన నాకు ఈ విజ్ఞానం లేనందువల్ల ఆనాటి సనాతన సాంప్రదా యాల ప్రకారం పెళ్ళితోనే ఇంటి పేరు మారింది. అలా 55 ఏళ్ళు గడిచిపోయాయి. ఇన్నేళ్ళ తరువాత ఈనాడు మల్లాది తీసేసి పుట్టింటి పేరు "కొండూరి" అని పెట్టుకుంటే నేనెవరో అందరికి అర్థం కాదు. పోనీ, 'సుబ్బమ్మ' అని మాత్రమే అంటే ఊరికి అనేకమంది ఆ పేరుకల వాళ్ళు వుంటారు. అప్పుడు మీ అందరూ మరీ అయోమయంలో పడిపోతారు. విషయజ్ఞానం పూర్తిగా లేనివారు నేను ప్లీడరులాగా వాదిస్తున్నానని భావిస్తారు. నిజానికి పిల్లలకు తల్లి ఇంటి పేరే వుండాలని నేనూ తలుస్తాను.

ఒక పిల్లకు తల్లి ఎవరో అందరికి తెలుస్తుంది. తల్లి గర్భంలో నుండి పిల్ల వెలువడింది కనుక ఆ విషయమై పేచీ లేదు. తండ్రి ఎవరో తల్లి చెబితే తప్ప తెలియదు. కనుక పిల్లకు తల్లి తాలూకు ఇంటి పేరే ఉండటమే సమంజసం. అదీ గాక నవమాసాలు మోసి, కని, పెంచి, పోషించేది తల్లి. అలాంటి తల్లిని కాదని తండ్రి యింటి పేరుతో పిల్లలను పిలవడం న్యాయం కాదు.

ధర్మరాజాదులను కుంతీ పుత్రులనే వారు. భీష్ముని గంగాపుత్ర అని సంబోధించే వారు. నకుల సహదేవులను మాద్రీయులు అని పిలిచే వారు. తల్లి ద్వారా వారసత్వం వచ్చేరోజుల్లో తల్లికి ప్రాముఖ్యత ఉండేది. మాతృస్వామ్యాన్ని అణచి వేసి పితృస్వామ్యం అవతరించిన తరువాత తండ్రి ద్వారా గుర్తింపు, తండ్రి ఇంటి పేరున పిలవటం వాడుకలోకి వచ్చాయి.

ఇటీవల కొందరు భర్తతో విడాకులు పొంది మరొకరిని విప్లవ వివాహం చేసుకొని కాపురం చేస్తూ కేవలం తమ పేరుతో, ఏ ఇంటి పేరు లేకుండా చలామణి అవుతున్నారు. వారు జగత్ప్రసిద్ధులయితే ఫరవాలేదు. కాని లేకపోతే చికాకు, అయోమయం కలుగుతాయి. ఉదాహరణకు నా పేరే తీసుకుందాం.

'సుబ్బమ్మ' అని నేను నన్ను పిల్చుకుంటే అది ఎంత గందరగోళానికి దారితీస్తుందో. ఒకే ఊరిలో నలుగురు సుబ్బమ్మలు, ఒక జిల్లాలో వందల సుబ్బమ్మలు, ఒక రాష్ట్రంలో వేల సుబ్బమ్మలు వుండవచ్చు. గోపీచంద్ ఒక కథలో వెంకయ్యను గురించి వ్రాస్తూ "వెంకయ్యలు మా ఊళ్ళో కోకొల్లలు" అన్నట్లు సుబ్బమ్మలు సవాలక్ష మంది ఉంటారు. ఇంతకూ నేను చెప్పేది ఏమంటే ఎవరో ఒకరు ఇలాంటి విడ్డూరపు పని చేశారని అందరూ అలా చేయకూడదు. అలా చేస్తే పులిని చూచి నక్క వాత పెట్టుకున్నట్లవుతుంది.

భర్త ఇంటి పేరు ఎందుకు పెట్టుకోకూడదో వివరిస్తాను. ఈ రోజుల్లో విడాకులు, పునర్వివాహాలు ఎక్కువ అవుతున్నాయి. శాసనం అందుకు అవకాశం ఇస్తోంది. ఒక సరోజిని పుట్టింటి పేరు రావెల, భర్త ఇంటి పేరు దెందుకూరి అనుకుందాం. ఆమె దెందుకూరి సరోజిని అవుతుంది. ఆమె ఆ భర్తనుండి విడిపోయి, మరో పురుషుని పెళ్ళి చేసుకుందనుకోండి. అపుడు ఆమె ఆ నూతన భర్త ఇంటి పేరు 'మునిపల్లె' తగిలించుకొని వ్యవహరించాలి. అంటే ఆమె మునిపల్లి సరోజిని అవాలి. అనివార్య కారణాలవల్ల మళ్ళీ ఆమె విడాకులు తీసుకుంటే, ఆమె పుట్టింటి పేరు రావెల సరోజిని అని గాని, లేక తిరిగి పునర్వివాహం చేసుకుంటే ఆ భర్త ఇంటి పేరున 'మండవ సరోజిని' అని గాని కావాలి. ఇదెంత అసందర్భంగా ఉంటుందో ఊహించటం కష్టం కాదు. ఇటీవల భర్త పేరు తగిలించు కోవటం 'ఫ్యాషను' అయింది. పైన చెప్పిన కథను తీసుకుంటే, మొదట్లో దెందుకూరి సరోజిని వెంకట్రావు తరువాత మునిపల్లె సరోజిని భగవంతరావు అయి తరువాత 'మండవ సరోజిని విక్రమ్' అవుతుంది. ఇది ఎంత హాస్యాస్పదం!

ఇంతకు ఒక మాట స్పష్టంగా చెప్పదలచాను. ఒకవేళ నేను నా భర్తకు విడాకులిస్తే తప్పకుండా నా పుట్టింటి పేరు కొండూరి సుబ్బమ్మ అని నన్ను నేను పిలుచుకుంటాను. అపుడు పేచీ వుండదు కదా!

# 7. ఇంగ్లీషు మాట్లాడాలనే అభిలాష

ఇంగ్లీషులో మాట్లాడడం అనేది నా అభిలాషే కాదు అది నాకు అవసరమైంది కూడా. కారణం నేను నడుపుతున్న వుద్యమాలను సమీక్షించటానికి, నన్ను ఇంటర్వ్యూ చేయటానికి అనేక మంది దేశస్తులు, విదేశస్తులు కూడా వస్తూ వుంటారు. విదేశాలు వెళ్ళినప్పుడు భాష రాకపోతే చాలా పెద్ద ఇబ్బంది కలిగింది. హైదరాబాద్ రాజధాని కనుక అనేక భాషల వారితో కలిసి పని చెయ్యాల్సి వస్తోంది. ఇంకా యూనివర్సిటీ సెమినార్లు, రాష్ట్ర సదస్సులు, 'రీజినల్ కాన్ఫరెన్సులు' జరిగినప్పుడు పిలుస్తూ వుంటారు. అప్పుడు ఉపన్యసించాలన్నా, చర్చల్లో పాల్గొనాలన్నా భాషరాక చాలా చికాకు, ఇబ్బంది కలుగుతూ వుండేది. నేషనల్ పోలీసు ఎకాడమీ వారి సదస్సు పూర్తి అయి దాని ముగింపు సభలో నన్ను మాట్లాడమని 'ఫోన్ 'చేశారు. తెలుగులో చెప్పవచ్చా అన్నప్పుడు, 'లేదండి అనేక రాష్ట్రాల ఐ.జి.లు వస్తారు, వారి ప్రశ్నలకు కూడా జవాబు చెప్పాలి' అన్నారు. అదే తెలుగయితే చెప్పగలను. కాని వచ్చీరాని, పిచ్చి పిచ్చి ఇంగ్లీషులో ఎలా? అన్నాను అలా అయితే వేరొకరి పేరు చెప్పండి అనగానే నా కాళ్ళక్రింద భూమి కదిలిపోయింది. ఏ విషయమైనా అనర్గళంగా మాట్లాడగల నాకు పోలీసుల పొరపాట్ల గురించి చెప్పే అవకాశం పోయింది కదా అని చాలా ఖిన్నురాలినయి పోయాను.

నాకు వున్న లోపం ఒకే ఒకటి. మరో భాష రాక పోవటం. దానికి కారణం నా విద్య క్రమక్రమంగా (సిస్టమేటిక్)గా లేకపోవటం. స్కూల్లో కాంపోజిషన్లు వ్రాయలేదు. నెలసరి, అర్ధసంవత్సర, సంవత్సర పరీక్షలు రాసి ఎరుగను. 'ట్యూషన్లు' లేవు. కేవలం 'గైడ్ల'తో, ఇంటి చాకిరితో సతమతమవుతూ ఇంటి పట్టున చదివిన చదువు. పైగా ఇంటా బైటా అంతా తెలుగు వారే. అందువల్ల ఇంగ్లీషులో వ్రాయటం, చదవటం, మాట్లాడటంలో అసమర్ధురాలిగానే మిగిలిపోయాను. హైదరాబాదులో రెండు, మూడుసార్లు ప్రయత్నించి, ఒకసారి రెండు నెలలు సంభాషణా తరగతులకు వెళ్ళినా ఏకాగ్రత లేక వంట పట్టలేదు. అందువల్ల నేనెంతో నష్టపోతున్నాను. ఎన్నో అవకాశాలు చేజారిపోతున్నాయి. అఖిల భారత స్థాయికి ఎదగలేక పోవటానికి ఇదే ముఖ్య కారణం. నా తప్పుల తడక భాషతో నడిపిస్తున్నా అది చాలా అసంతృప్తికరంతో చేస్తున్న పని. బాధాకరంగానే వున్నది. అయినా వచ్చీరాని ఈ భాషతోనే కేరళ, బొంబాయి, మదరాసు, ఢిల్లీ, జయపూర్, కలకత్తా మహా సభల్లో ఇంగ్లీషులోనే ఉపన్యసించాను. శ్రోతలు సానుభూతితో, సాదరంగా విన్నారు. కాని నా మటుకు నాకు ఇంగ్లీషు రాకపోవటం చాలా వెలితిగానే వుంది.

చివరిగా ఒక ముఖ్య సంఘటన చెప్పి ముగిస్తాను. 1939 దరిమిలా మా అత్తగారి నస, సాధింపు రామ్మూర్తిగారి దేశాటనం నన్ను కలవరపరిచాయి. తట్టుకోలేక ఏ

ఆశ్రమంలోనో చేరి పోదామనే దృఢ సంకల్పం కలిగింది. ముఖ్యంగా గాంధీ ఆశ్రమంలో ఉండిపోదామనుకున్నా. అప్పటికి గాంధీ పేరు ప్రతిష్ఠలు మిన్నుముట్టాయి. మీరాబెన్ లాంటి స్త్రీలు కార్యకర్తలుగా పనిచేస్తున్నారు. ఒక్క పిల్లవాడే కనుక వాణ్ణి అత్తగారు బాగా చూస్తుందిలే వదిలేసి పోదామనుకున్నా. అటు దేశ సేవ చేయవచ్చు. ఇటు చికాకులు పోతాయని ధృవీకరించుకున్నా. అక్కడే జీవితాంతం వుండి పోదామనుకున్నా. ఏ భాషా రాదే! ఇటు ఇంగ్లీషురాదు, అటు హిందీ రాదు. చాలా చిన్న వయస్సు, ఎలా పోవాలి, మధ్యలో ఏమై పోతానో అనే భయంతో ఆ ఉత్సాహాన్ని, త్యాగాన్ని విరమించుకున్నా. అంటే కేవలం భాషరాని కారణమే నా జీవితం దేశ సేవకు అంకితమయ్యే అదృష్టానికి దూరం చేసింది. అలా వెళ్ళిపోతే నా జీవిత విధానం మరో రూపురేఖలు సంతరించుకునేది.

# 8. నా ఆపరేషన్ల హంగామా

'మెనోపాజ్ 'దశలో 'సివియర్ బ్లీడింగ్' వల్ల చాలా కష్టనష్టాలకు లోనపయినప్పుడు మొదలు "డి అండ్ సి 'చిన్న ఆపరేషన్ చేశారు. తగ్గలేదు. డాక్టర్ పరీక్ష చేసి ఫైబ్రాయిడ్ యుటరన్ ఉందన్నాడు. ""హిస్ట్రక్టమీ' చేయించుకున్నాను. సవ్యంగా జరిగిపోయింది. అప్పుడప్పుడూ పరీక్ష చేయించుకోమన్న డాక్టర్ సలహా ప్రకారం నాలుగవసారి వెళ్ళినప్పుడు ఒవేరియన్ సిస్టు వున్నదని (గుండ్రటి బంతి లాంటిది) దాన్ని ఆపరేషన్ చేసి తీసి వేయకపోతే కాన్సరుగా

పరిణమించవచ్చుని భయ పెట్టింది. 9-4-1976న నా కూతురు పెండ్లి జరిగింది. 12-4-1976న తిరిగి గుంటూరులో ఆస్పత్రిలో చేరాను. 13--04-1976న పొట్టకోసి ఆ ముద్దను తొలగించి 'బయాప్సీ' కి పంపారు. ఆ రిపోర్టు రాగానే ఆ విషయం ఉత్తరం వ్రాయమని ఒక మిత్రుడికి చెప్పి విజయవాడ చేరాం. పది అంగుళాల సైజులో వున్న ఆ 'సిస్టు' కమిలిపోయి కాన్సరుగా మారి చివరి దశలో వుందని, హైదరాబాద్ వెళ్ళి రేడియం ట్రీట్ మెంట్ తీసుకోమని, డాక్టర్ కాన్సర్ హాస్పటల్ కి రిఫర్ చేసిందని మా మిత్రుడు వ్రాశాడు.. ఆ ప్రమాదం కూడా రోజుల్లో వుందని తెలియజేశాడు. ఆ ఆపరేషన్ జరుగుతున్నప్పుడు నా రెండో కోడలు 'థియేటర్ లో వుండబట్టి తను చూసింది 2 అంగుళాల "ఓవరీయే" నని అన్నా అందరూ భయపడి నాతో చెప్పకుండా గుసగుసలాడటం మొదలు పెట్టారు. ఇంక హైదరాబాద్ వైద్యానికి ప్రయాణమవుతూ ఎందుకయినా మంచిదనే వుద్దేశ్యంతో నా కూతురు, కోడలు ఇద్దరూ గుంటూరు వెళ్ళి ముందు డాక్టర్ తో మాట్లాడితే 'ఐయామ్ సారీ ఎ బౌట్ యువర్ మదర్ 'అన్నదట. అయినా ఆపరేషన్ గదిలో వ్రాసిన ఫైలు తీయించి రిపోర్టు చూసారట. నాది రెండు అంగుళాలు అని, అదే రోజున జరిగిన మరో ఆమెది పది అంగుళాలని వ్రాసి వుందట. లేబరేటరీకి వెళ్ళి పరిశీలిస్తే ఆమె ఓవరీ వున్న సీసామీద నా పేరు వ్రాసి వున్నదట. ఈ పొరపాటు ఎవరు చేశారో దర్యాప్తు చేస్తే వాళ్ళ ఉద్యోగాలు ఊడిపోను. కాని డాక్టర్ క్షమాపణ చెప్పటంవల్ల ఆ పని విరమించుకున్నాం. నిజంగా కేన్సర్ ట్రీట్ మెంట్ జరిగితే పొట్టలోని లివరు, స్ప్లీను, పేగులు వగైరా అన్నీ మాడిపోయి ఆ వెంటనే చావాల్సిందే. ఆ గండం గడిచి బైటపడ్డాక మరో సంఘటన జరిగింది.

ఈ పెద్ద ఆపరేషన్ కాగానే నైనిటాల్ లో జరిగిన ఆలిండియా రాడికల్ హ్యూమనిస్టు వేసవి శిబిరానికి వెళ్ళాను. అది చాలక ఇంక ఇంట్లో ఒక్కదాన్నే కావటాన ఇంటి పనులు మీద పడ్డాయి. కాన్సర్ రిస్కు తప్పినా మరో చికాకు తప్పలేదు. ఏమయిందో ఏమో ఆపరేషన్ జరిగిన చోట కుట్లు వూడిపోయి 'ఇన్ సిషనల్ హెర్నియా' ప్రేగులు ఒక బంతిలాగా ముందుకు దూకటం జరుగుతూ వుండేది. మళ్ళీ పొట్ట తెరిచి రిపేర్ ఆపరేషన్ 29-10-1976న కాకినాడలో పెద్ద సర్జన్ చేత చేయించాం. ఆ తర్వాత

కదలకుండా వుండి పోవడంతో పొట్ట పెరిగి అలాగే వుండి పోయింది. ఆ వెంటనే జనరల్ ఎలెక్షన్స్ వచ్చాయి. బెల్టువేసుకొని బస్సుల్లో ఆ ప్రాంతాలన్నీ తిరిగి జనతాపార్టీకి పనిచేశాను. నాటి నుండి నేటివరకూ అలాగే విధి విరామం లేకుండా తిరిగి పనిచేస్తూనే వున్నాను. అంటే 4 ఆపరేషన్లు జరిగి, 5 గురు పిల్లల్ని కన్నా, ప్రతి కాన్పుకు నొప్పులు వచ్చేదాకా ఇంటిపని, వంటపని, పిల్లల పని చేస్తూనే వుండేదాన్ని. పురిటికి కావాల్సిన వస్తువులన్నీ అమర్చుకొని కనే వరకు అన్నీ నేనే చేసుకునే దాన్ని. ఆ తర్వాత పురిటి స్నానం అయిన అప్పటినుండి పసి పిల్లపని, ఎడపిల్లల పని అన్నీ స్వయంగా చక్కబెట్టకోగల శక్తి, దారుఢ్యం నాలో బాగా వుండేది. మంచి ఆరోగ్యం కలదాన్ని. 67 ఏళ్ళు నిండినా పట్టుమని పది రోజులు పడక పెట్టలేదు. అంత శక్తి నాలో ఎలా వచ్చిందో నాకే తెలియదు.

# 9. ఆర్థికంగా నా స్థితిగతులు

## ఆడంబరాలు, ఆభరణాలపై మోజు

కోర్కెలున్నప్పుడు తీరే మార్గాలు దొరకవు. లేనప్పుడు 'వద్దంటే డబ్బు' లా వెంటాడుతూ వుంటాయి. ఆ రోజుల్లో (1934) నగలన్నా, పట్టు పరికిణీలనా మహా మోజు. గుఱ్ఱపు బండి ఎక్కాలన్నా, సినిమా చూడాలన్నా ఎంతో సరదా. కానీ ఆ సరదాలు తీరే అవకాశం ఆనాడు లేదు. మా నాన్న అప్పుడప్పుడే అభివృద్ధి చెందుతున్న లాయరు. మా అందరికీ చీరాల కోమట్ల నుండి హోల్ సేల్ గా ఒక తాను – 24 గజాలు – ఆరు రూపాయలకు తెచ్చి మా అందరికీ తలా నాలుగు చొక్కాలు రెండు రంగులలో కుట్టించేవాడు. అవి వేసుకుని స్కూల్ కు వెళితే నా స్నేహితులంతా నవ్వేవారు. అయినా బెదిరిపోయేదాన్ని కాదు. కానీ ఒక ప్లీడర్ కూతురుగా గొప్పగా వుండాలనే కోరిక అంతో ఇంతో వుండేది. నగలున్నా దొంగల భయంవల్ల పెట్టుకోనిచ్చే వారు కాదు పెళ్ళికి ముందు. తీరా కాపురానికి వెళ్ళాక అత్తగారు పెట్టుకోనిచ్చినా కడుపులు, పురుళ్ళు, పిల్లల పెంపకం, ఇంటి చాకిరి, జబ్బులు వీటన్నిటివల్లా నగలు పెట్టుకునే దాన్ని కాదు. మరి కొన్నాళ్ళకు అత్తనైన తర్వాత నేను నా కొడళ్ళకు ఇచ్చేసాను. ఆ తర్వాత హేతువాదినై మంగళసూత్రంతో సహా అన్నీ తీసి వేశాను. నా పిల్లల పెళ్ళిళ్ళు ఆడంబరంగా చెయ్యలేదు. విందులు, వినోదాలు జరుపలేదు. అలాగే ఏ మీటింగుకూ ఆఖరికి గవర్నరును పిలిచినా దండలు వెయ్యకుండా సభలు జరుపుతున్నాను. మా వేదిక ద్వారా జరిపే పెళ్ళికి మాత్రం సూత్ర ప్రాయంగా రెండు దండలు, రెండు ఫోటోలతో పెళ్ళి చేస్తున్నాను. ఈనాడు నాకు వున్న వనరులతో ఎంతయినా సుఖపడవచ్చు. కాని అసలు నా మనస్సూ, దేహమూ సుఖాన్నే ఆశించవు. మరి నేనేం చేసేది. గత 30 ఏళ్ళుగా నగలన్నా, ఇతరత్రా ఆడంబరాలన్నా నాకు ఏ మాత్రం ఇష్టం లేదు. అంతేకాదు ఈ రోజుకు ఆటో కూడా ఎక్కకుండా కేవలం బస్సుల్లోనే తిరుగుతూ పనిచేస్తున్నాను. కష్టపడి ప్రతి పైసా కూడబెట్టి సంస్థలకు, 'స్త్రీ, స్వేచ్ఛ' పత్రికకు ఖర్చు పెడుతున్నాను. అంటే అదంతా నాలో కలిగిన మానసిక మార్పుకు నిదర్శనం. దానికంతకూ మూల కారణం **అసలు కష్టాలలో పుట్టి పెరిగిన వారు, దారిద్ర్యాన్ని అనుభవించిన వారు సుఖాలు వచ్చినా, సంపద కలిగినా అనుభవించలేని మానసిక దౌర్బల్యం, అనాసక్తత వారిలో జీర్ణించి వుంటుంది. వారి జీవితంలో వారికి కలిగిన దానితో తృప్తి పడగల మనో నిబ్బరం అలవాటుగా మారిపోతుంది. ఆ తర్వాత పరిస్థితులు మారినా వారి వైఖరిలో మార్పురాదు.** అందుకొక ఉదాహరణ చెప్పుకుందాం.

లెనిన్ మహాశయుడు రష్యాకు ప్రెసిడెంటు అయిన తర్వాత 40 గదులు గల గొప్ప మహల్ లో వుండమని పార్టీవారు, అనుచరులు కోరారు. అప్పుడాయన నేను నా

జీవితమంతా కేవలం రెండు గదుల్లోనే గడిపాను. ఈనాడు నన్ను మీరు ఒక బంగళాలో వుండమంటే అది నాకు 'ఆర్టిఫిషియల్'గా వుంటుంది కాని సహజ జీవితంగా వుండదు. కనుక దయచేసి నా నివాస స్థలాన్ని మార్చకండి అని చెప్పి ఆ గదుల్లోనే జీవితాంతం వున్నాడు. అలాగే సొంత పనులకు పాదచారిగా వెళ్ళడం ప్రెసిడెంటు అయిన తర్వాత కూడా ఆయన మార్చుకోలేదు. ఒకనాడు ఒక బీట్ కానిస్టేబుల్ అతన్ని నిలబెట్టి నీవెవరివయ్యా అని అడిగితే జేబులోంచి గుర్తింపు కార్డు తీసి చూపాడట.

అబ్బా ఎంతటి ఉదాత్తత అనిపిస్తుంది. ఆ మహానుభావులతో పోల్చుకోవటం కాదు కాని వ్యక్తికి చిన్ననాటి నుండి అలవాటయిన విధానాలను మార్చుకోవటం అంత తేలిక కాదు. అందువల్లే ఆనాడు పరిస్థితుల వల్ల ఆడంబరాలకు దూరమయ్యాను. ఈనాడు మానసిక వైరాగ్యం వల్ల వాటికి దూరమయి ఆనాడూ ఈనాడూ ఒకటిగానే వుండిపోయాను.

## ఆర్థికంగా నా దశలు

ఆర్థికంగా నేను మధ్యతరగతికి చెందిన వ్యక్తిని. అయినా నేను పూర్తిగా ఆధారపడి జీవించే ప్రాణిని కాను అనే సంతృప్తి నాకు వుంది. పరిస్థితుల ప్రభావంవల్ల చదివి ఉద్యోగం చేసి నెల జీతంగా సంపాదించక పోయినా నేను ఏనాడూ ఏ ఒక్కరికీ 'పేరాసైట్' (పరాన్న జీవి) లా బ్రతకలేదు అనే దానికి ఆధారాలు చాలా వున్నాయి. గత 60 ఏళ్ళుగా ఇంటి చాకిరీ చేస్తున్నా అది వరుమానం గౌరవం లేని వెట్టి చాకిరీ అని నా భాష్యం. దాని విషయమైన చర్చకు ఇది సమయం కాదు. వివాహ సమయంలో స్త్రీకి సంక్రమించిన బహుమతులు, చదివింపులు మొదలయినవి అంతా స్త్రీ ధనమని మనుధర్మశాస్త్రం వక్కాణించింది. మత ధర్మశాస్త్రాలు చట్టపరం చేశాయి. నా పెళ్ళినాడు నా తండ్రి 5 ఎకరాల సుక్షేత్రమైన మాగాణి పొలం నా భర్తకిచ్చాడు. నా మామగారు 30 తులాల బంగారం, రెండు వేలు డబ్బు ఇస్తే ఆ ధనంతో 3 ఎకరాల మాగాణి నా పేర కొన్నారు. నా తల్లిదండ్రులు నాకు 30 తులాల బంగారం (కన్య తొడుగు) కన్యాదాన సమయంలో ఇచ్చారు. ఈ పొలంమీద వచ్చే ఆదాయం నాదే కదా!

తర్వాత 1956లో ఈ పొలం 15 వేలకు అమ్మి పదివేలు యఫ్.డి.లో వేశాను. దానిమీద వడ్డీ యింకా వస్తూనే వుండేది. మిగతా 4 వేలు పెట్టి హైదరాబాద్ హౌసింగ్ బోర్డులో 9వ నెంబరు ఇంటికి అడ్వాన్సు చెల్లించాను. 1960 నుండి (ఇన్స్టాల్ మెంట్సు పోను) అంతో ఇంతో అద్దె ఆనాటి నుండి ఆనాటి వరకు వస్తూనే వుంది. ఆ ఇంటినే నా తర్వాత నా ధర్మ సంస్థలకు విల్లురాసి ఇచ్చేశాను. అత్తగారిచ్చిన నూట ఏబది తులాల బంగారంతో పాటు నాది 60 తులాలు కలిపి పిల్లలు నలుగురికి ఇవ్వగా మిగిలింది అమ్ముకొని నా పుస్తకాల ముద్రణ క్రింద ఖర్చు పెట్టాను. వాటి అమ్మకం మీద అంతో ఇంతో వస్తూనే వుంది.

1961లో హైదరాబాదు ట్రయినింగు టైము అంతా నెలకు 15 రూ॥ లు చెల్లించారు. ఆ తర్వాత జిల్లా గౌరవ కుటుంబ నియంత్రణ ప్రచారకులుగా పనిచేసినంత కాలం గౌరవ వేతనం దొరికేది. ఇంక 62 నుండి ఈనాటి వరకు పత్రికల్లో వ్యాసాలు వ్రాస్తూనే వున్నాను. ఈ రచనలు కేవలం సారస్వత కృషిగానే మిగిలిపోలేదు. కాస్తో కూస్తో పారితోషికాన్ని కూడా అందిస్తూనే వున్నాయి. అలాగే 1958 నుండి రేడియో ప్రోగ్రాములు, 1980 నుండి టి.వి. ప్రోగాములు ఇస్తూనే వున్నాను. వాటి వరుమానం వస్తూనే వుంది. ఇంక అనేక సభలకు వెళ్ళటం, సెమినార్లకు వర్కు పేపర్లు రాయటంవల్ల ఆదాయం లేకపోలేదు. ఎన్నోసార్లు ట్రయినింగు క్లాసులు నిర్వహించటంవల్ల ప్రతి లెక్చరుకు వందా, రెండొందలు ఇస్తూనే వున్నారు. ఇంక సంస్థల నిర్వహణలో గౌరవ వేతనం ఇస్తే తీసుకోటానికి వ్యతిరేకత లేదు. ఇవ్వకపోతే అడిగేది లేదు. డబ్బు కోసమే పని చెయ్యటం లేదు గదా! ఇంత కాలం నా డబ్బు, నా శ్రమ, నా టైము వెచ్చించి చేశాను. ఈనాటి పరిస్థితులు మారాయి. గ్రాంట్లు, సహాయాలు వచ్చే మార్గాలు ఏర్పడ్డాయి. వాటికైనా ఏనాడూ యాచించి ఎరుగను. నా మీద విశ్వాసంవుండి ఇస్తే తీసుకొని చేస్తున్నాను. లేకపోతే నా చేతనయింది చేస్తున్నాను. అయినా నాకు వచ్చిందంతా, నాకు ఉన్నదంతా సంస్థలకే ఇస్తున్నాను. కనుక నేను ఒక విధంగా ఏమీ లేని దాన్ని. అయినా సంపాదించుకోగల శక్తి సామర్థ్యం వున్నదాన్ని కనుక ఎంతో వున్నదాన్ని. అలా ఇంటి పని బైటపని, సంస్థల పని అన్ని చేస్తూనే అంతో ఇంతో గడించుకోగల సామర్థ్యాన్ని పొందగలిగానంటే అది అంత తేలికయిన పనికాదు. ఎవ్వరి యాజమాన్యం క్రిందపని చెయ్యకుండా అదుపూ ఆజ్ఞ లేకుండా, కేవలం స్వశక్తిని వాడి భుక్తి లేక ముక్తి అంటే ఇటు సొంతం అటు సమాజం రెంటికీ చేసి ధన్యత గడించాననేది నాకు చెల్లుతుందేమో! అంటే నేను ఇతరులపై ఆధారపడి జీవించటం లేదు అనే సంతృప్తి నాకు వుంది. అందువల్లే ఏనాడూ తండ్రిని, భర్తనూ, పిల్లల్ని యాచించి ఎరుగను. వారుగా ఒక్క జాకెట్టు ఇచ్చినా సంతోషమే, లేకపోతే ఏ బాధ లేదు. ఇది ఆర్థికంగా నా స్వవిషయం.

## నా పొదుపరితనంతో పాటు త్యాగం

ఆరోజుల్లో మా నాన్న ప్రతి ఆదివారం నాకు, మా అన్నయ్యకు ఒక కాని అంటే మూడు పైసలు ఇచ్చేవాడు. మా అన్నయ్య వెంటనే కొనుక్కొని తినేవాడు. నా నోరు వూరినా, ఏడుపొచ్చినా దిగమింగి పిసినారిగా ఆ కాని దాచుకునే దాన్ని. ఆ పిసినారి తనం, జాగ్రత్త ఈనాటికి అంతో, ఇంతో ఇంకా నాలో లేకపోలేదు. ఏదేమయినా ఆ కష్టార్జితాన్ని త్యాగం చేసి 24 అష్టపదులు (గీత గోవింద కావ్యం) భావం కాని, అర్థం కాని తెలియకుండానే నేర్చుకున్నాను. ఆనాడు సుఖజీవితం గడపాలన్నా నాటి ధనాభావం వల్ల వీలుకాక పోయింది. కాని ఈనాటికీ కష్టపడటం, పైసా పైసా దాచటం, చివరకు వేలుగా మార్చి ఏ సంస్థకో ఇచ్చేయటం తప్ప, ఏనాడూ కారు ఎక్కడం, ఖరీదయిన బట్ట

కొని కట్టడం ఎరుగనంటే నమ్మండి. ఈనాడు నా బ్యాగ్ లో వందలు వున్నా నా పీనాసి మనస్థత్వం మారలేదంటే నన్ను ఎవరూ రక్షించలేరు. 70వ పడిలో పడుతున్నా బస్సు లెక్కటం, నడిచి వెళ్ళటం, ఇంటి చాకిరి చెయ్యటం అలవాటయిపోయింది. విశ్రాంతి తీసుకుందామని వుండనే వుండదు. అది పొదుపో, పీనాసితనమో నేనే నిర్వచించలేకుండా వున్నా. అయితే ఒక్క విషయం గమనార్హం. నాకెంత కాపీనం వున్నా నాకు వున్నంతలోనే జాగ్రత్త పడతాను కాని ఇతరుల సొమ్ము ఆశించటం, వారివల్ల లాభం పొందాలనే ధ్యాస నాకు లేదు. డబ్బుగాని, వస్తువుగాని అరువు అడగటం నా డిక్షనరీలోనే లేదు. తర్వాత ఎవరికన్నా ఏదైనా ఇవ్వాలంటే డబ్బు కాని, వస్తువు గాని మరేది అయినా ఇచ్చిందాకా నిద్ర పట్టదు. అర్ధరాత్రి లేపి అయినా ఇస్తేనే నాకు ప్రశాంతత వుంటుంది. అలాగే నాకు ఎవరయినా డబ్బుగానీ, మరేదయినాగాని ఇవ్వాల్సి వున్నా ఇంకా ఇవ్వలేదే అని ఆలోచిస్తూనే వుంటా. దీనివల్ల నాకే చికాకు. అందువల్ల అప్పు ఇవ్వటానికి, పుచ్చుకోటానికి నా మనస్సు ఎప్పుడూ అంగీకరించదు. ఇక్కడొక ముఖ్య విషయం చెప్పక తప్పదు. అలా కష్టపడి, కూడ పెట్టిన ఆస్థి అంతా నా సంస్థలకు విల్లు ద్వారా అందచేశానని చెప్పటానికి చాలా గర్వంగా వుంటుంది. అంటే భర్తృహరి సుభాషితంలోని "దానము, భోగము, నాశము, పూనికతో మూడు గతులు భువి ధనమునకున్" లో దానము భోగములేనివాని ధనము నాశనానికి అర్హమవుతుందిన్నట్లే ఈ విషయంలో మాత్రమే మొదటి లక్ష్యానికి అంటే దానం చేయటానికి నేను అర్హురాలనవటం నా అదృష్టంగా భావిస్తున్నాను.

## నా వీలునామా

నా కిప్పుడు 67 సంవత్సరాలు నిండాయి. నా తదనంతరం నా ఆస్తిని గురించి 10 ఏళ్ళ క్రిందటే ఒక నిర్ణయానికి వచ్చాను. గత 40 సంవత్సరాల నుంచి నా జీవితం మహిళాభ్యుదయానికి అంకితం చేశాను. పది సంస్థలు స్థాపించి కార్యక్రమాలు నిర్వహిస్తున్నాను. అందువల్ల నా ఆస్తిపాస్తులను నా సంస్థలకే అందజేయాలని ఎంతో కాలంగా యోచిస్తున్నాను. నేను 1980లో 20 వేల రూపాయలతో 'మల్లాది సుబ్బమ్మ ట్రస్టు'ను స్థాపించి ఆనాడే రిజిష్టరు చేశాను. అలాగే మహిళాభ్యుదయ ట్రస్టును 1987లో స్థాపించాను. లక్షలు విలువచేసే నా యింటిని మల్లాది సుబ్బమ్మ ట్రస్టుకు 1-5-1991న వీలునామా ద్వారా చెందచేశాను. నాకు నలుగురు పిల్లలు, భర్తా వున్నా ఏనాటి నుంచో నా సంస్థలు, సమాజమే నా పిల్లలుగా భావిస్తూ వుండటం వల్ల వాటికే నా ఆస్తిని చెందచేయటం నా విధ్యుక్త ధర్మంగా భావించాను. అంతేకాదు అది నాకు తృప్తినీ సంతోషాన్ని కలుగ జేసింది. అలా నా చిరకాల వాంఛ నెరవేరినందుకు నాజీవితం ధన్యత గడించింది. ఈ సందర్భంగా నాతో సహకరించినందుకు నా భర్తకూ, పిల్లలకూ సర్వదా కృతజ్ఞురాలను. నా కోరిక ప్రకారమయితే ఏనాడో నా ఆస్తి ట్రస్టుకు వెంటనే

చెందచేసేదాన్ని కాని చాలా మొత్తం స్టాంపు క్రింద, పన్ను క్రింద పోతుందని వీలునామా ద్వారా చెంద చేయాల్సి వచ్చింది.

## నా ట్రస్టుకు నా వీలునామా ద్వారా సంక్రమించిన నా ఆస్తులు,

హైదరాబాద్ - మెహిదీపట్నంలో ఎం.ఐ.జి. హెచ్. కాలనీలోని 9వ నెంబరు ఇల్లు, 740 చదరపు గజాల స్థలము, అందులోగల 2800 చదరపు అడుగుల డాబా ఇల్లు, రేకులు ఇల్లు, ట్రస్టుకు చెందుతుంది. నా భర్త జీవిత కాలం అందులో నివశించటానికి మాత్రం హక్కు వున్నది. ఇతర నా చరాస్తుల మీద అధికారం ప్రస్తుతం నా భర్తకు చెందచేసినా వాటిని సద్వినియోగం చేస్తారనే విశ్వాసం నాకు వున్నది. రామ్మూర్తిగారు కూడా నా ధర్మ సంస్థల స్థాపనలో, వాటి నిర్వహణలో ఎంతో సహకరిస్తున్నారు. అంతేకాదు వారు తమ న్యాయవాద వృత్తిని కూడా త్యజించి తమ కాలాన్ని, ధనాన్ని ఈ సంస్థల అభివృద్ధికి, తద్వారా మహిళాభ్యుదయానికి వెచ్చిస్తున్నారు. కనుక నా తరువాత కూడా ఆయన నా చరాస్తులను 'మల్లాది సుబ్బమ్మ ట్రస్టు'కు చెందచేస్తారని నమ్ముతున్నాను.

గ్రామీణ స్త్రీల, కార్మిక స్త్రీల అభ్యున్నతికి మరోక మహిళా ట్రస్టును స్థాపించి ట్రస్టు పేర మూడు ఎకరాల విస్తీర్ణం కల రెండు పొలాలు కొని రిజిష్టరు చేయించడమైనది. జనవాడ ప్రాంతంలో నా పేర వున్న రెండున్నర ఎకరాల పొలాన్ని కూడా 'మహిళాభ్యుదయ ట్రస్టు'కు నా తదనంతరం చెందేటట్లుగా వీలునామా వ్రాశాను. నా వీలునామాను అమలులోకి తేవడానికి నాభర్తకు, నా పెద్ద కుమారుడికి అధికారాలు ఇచ్చాను.

# 10. తరాలు : ఆశయాలు

## తరాల అంతరం

పారిశ్రామికీకరణవల్ల గాని, శాస్త్రజ్ఞానం (సైన్సు) వల్లకాని ఈతరం యువత ఆలోచనలు, ప్రశ్నలు మా కాలపు ఆలోచనలకన్నా గొప్ప ఫలవంతంగా వుంటున్నాయి. నా కుటుంబంలో నాలుగు జనరేషన్సు వారం వున్నాం. మా అమ్మా, మా అమ్మ పిల్లలం, నా పిల్లలు, వారి పిల్లలు (మనవలు). నా పిల్లల చరిత్రకూ, మా చరిత్రకూ తేడాలు వున్నట్లే మనవల కాలం– అంటే 20వ శతాబ్దంలో 'జనరేషన్ గాప్' మాత్రమే కాదు, వైఖరుల్లో, దృక్పథాల్లో ఎన్నో మార్పులొచ్చాయి. ఇది కేవలం సైన్‌టిఫిక్ యుగం, ఎలక్ట్రానిక్ యుగమయింది. మీట నొక్కితే కొన్నివేల ఇళ్ళు, జనసమూహం, జంతుజాలం వీటిని నాశనం చేసే అణు బాంబులు, ఇతర రోబో యంత్రాలు మానవ శక్తిని మించి పనిచేస్తున్నాయి. నేను నా హయాంలో పిడకలతో వండాను. కట్టెలు, బొగ్గులు, కిరసనాయిలు, గాస్ లాంటి మార్పులు కాక ఈనాడు ఎలక్ ట్రానిక్ పరికరాలు వాడి సుఖపడుతున్నాం. ఈ దశలో నామనవలు నాలా బ్రతుకమంటే సాధ్యంకాదు. వారు పుట్టుకనుండే ఎ.సి.లు, ఫాన్స్, ఫోన్లు, జెట్ విమానాలూ వాడుతున్నారు. ఒకనాడు నా పెద్ద మనవడు కార్తీక్ ""మీ అందరికంటే నా త్యాగమే గొప్పది మామ్మా!" అన్నాడు. అర్థంకాక తికమక పడ్డా. 20 ఏళ్ళవాడు ఇలా అంటాడేమిటి? అని ఆశ్చర్యపోతూ వుండగా మీరంతా సంఘ సేవ, ఆ సేవా, ఈ సేవా ఇన్నేళ్ళుగా, అన్నేళ్ళుగా చేస్తున్నాం అంటున్నారు గదా! "నేను చూడు ఆర్మీలో చేరాను. 35 ఏళ్ళు బాధ్యతాయుతమైన జీవితాన్ని గడపాలి. ప్రాణాలొడ్డి పోరాడాలి. నూరుకోట్ల దేశ ప్రజలను రక్షించాలి. నా సేవ గొప్పదా, మీ త్యాగాలు గొప్పవా" అని ప్రశ్నించాడు. నిజమే కదా! ఏది త్యాగం, ఎవరిది అసలయిన త్యాగం అని మరోసారి ఆలోచించాల్సి వచ్చింది. కేవలం డబ్బుకోసమే కాక సమాజంకోసం, దేశంకోసం చేసే ఏ చిన్న పని అయినా త్యాగం క్రిందకే వస్తుంది కదా!

## ఒక అత్తగా నా ఆశయాలు

ఎప్పుడయితే మహిళోద్యమానికి నా జీవితం అంకితం చేశానో అప్పటి నుండి కూతురయినా, కోడలయినా, ప్రక్కవారి అమ్మాయి అయినా అంతా నాకు సమానంగానే దృగ్గోచరమయ్యే వాళ్ళు. ఈ భావం నమ్మశక్యం కాని పరమ సత్యం. కాస్తో కూస్తో అత్తగారి ఆరళ్ళు అనుభవించిన అనుభవజ్ఞురాలను. నాలా నా కోడళ్ళు బాధపడరాదనే విశ్వాసం కలిగినదాన్ని. నేను పిల్లల్ని కన్నాను. కోడళ్ళు నా పిల్లలతో తమ జీవితాలు పెనవేసుకోబోతున్నారు. ఇక ముందు నా బిడ్డల కష్ట సుఖాలలో వారు

భాగస్వాములవుతారు. నా పాత్రకు స్థానం తగ్గుతుంది. అనవసరంగా జోక్యం చేసుకున్నందువల్ల వారు సుఖపడరు. నేనూ సంతోషంగా వుండలేను. జీవితమే ఒక నాటక రంగం. అందులో కొన్ని పాత్రలు కొద్ది సేపు వుంటాయి. మరికొన్ని హెచ్చు కాలం వుంటాయి. ఏ పాత్ర నటన అయిపోతే ఆపాత్ర తెరమరుగున పడక తప్పదు. ఆ అధ్యాయం ముగియకా తప్పదు. బిడ్డలను కన్నాను, పెంచాను, విద్యా బుద్ధులు నేర్పించాను. ఆనాడు అది నా బాధ్యతగా భావించలేదు. వారి పై గల ప్రేమ అనుకోండి, వాత్సల్యం అనుకోండి, మమకారం అనుకోండి, అది బాధ్యతలను మించిన భవబంధంగా నాలో మిళితమై వుండేది. లేకపోతే మన బిడ్డల్ని అలా పెంచలేము. అయినా ఆ దశలు దాటక తప్పదు. అందువల్ల కోడళ్ళకు కొడుకులను, కూతుర్ని అల్లుడికి అప్పగించి తప్పుకున్నా. ఇది తప్పా?

ఇంకా పెనవేసుకోలేదని వారు అనుకున్నా, బాధ పడ్డా నాకు మాత్రం సంతృప్తిగా వుంది. ఏ కొడుక్కూ పైసా కట్నం పుచ్చుకోలేదు. కూతురికి ఇవ్వలేదు. నాకున్న బంగారంలో నాకు తోచినంత నలుగురికీ ఇచ్చాను. 150 తులాల బంగారం నాకు మా అత్తగారు ఇచ్చింది అంటే అది నా తర్వాత నా బిడ్డలకు చెందాలని ఆమె ఆశయం. నేనింకో అడుగు ముందుకేసి నా చావుకు, వారికిచ్చే ఆభరణాలకు లంకె ఎందుకని వారి వారి వివాహాల నాటికే ఇచ్చి హాయిగా స్వేచ్ఛాజీవినయ్యాను. నా దృష్టిలో అందరూ సమానులే. అయినా ఇదంతా తల్లిగా నా బాధ్యతే కాదు. వారికి రెక్కలొచ్చే దాకా చాలా ప్రేమగా చూచుకునేదాన్ని. అసలు ముఖ్య విషయం నేను ఏనాడూ నా కోడళ్ళను హింసించలేదు. భార్యా భర్తల మధ్య పేచీలు తేలేదు. అంతా భార్యలకే ఇచ్చారు అని పేచీ పెట్టి ఎరుగను. ఈపని చెయ్యమని ఇవి కావాలని ఇంతవరకు శాసించి ఎరుగను. దేశ దేశాల్లో వున్నా, ఇక్కడున్నా నేను మాత్రం ఒక్కలాగే వుంటున్నాను. నాయీ సహాయ నిరాకరణ వారికి నచ్చినా, నచ్చకున్నా నేనేమీ బాధపడను. ఎందుకంటే వాళ్ళను నస పెట్టడం, నన్ను వాళ్ళు మళ్ళీ అన్నారని బాధపడటం నాకు ఇష్టం లేదు. అందువల్ల ఇతరత్రా ఏమీ పట్టించుకోవటం నాధర్మం కాదని నిర్ణయించుకున్నా. ఇది అత్తా కోడళ్ళకే కాదు మా కుటుంబాలకే ప్రశాంతతను ఇచ్చింది. అంతమాత్రాన ఇబ్బందులొస్తే సహాయ సహకారాలు ఇరుపక్షాలవారు ఇచ్చి పుచ్చుకోవద్దని కాదు.

ముఖ్య విషయమేమంటే పిల్లల పెంపకం వగైరా నా జీవితంలో సగభాగం తిన్నది. ఆ తర్వాత నేనేదో సంస్కరణ, సేవారంగాల్లో లగ్నమయి పోయాను. ఇంకా ఈ కుటుంబ బాధ్యతలు వుంటే నాకూ, ఇతరులకూ తేడా ఏముంటుంది? ఈ భవబంధాలనుండి విరమించటం చాలా కష్టమయినా అందులో వున్న స్వేచ్ఛ, సంతృప్తి మనకు మరోలా లభించదు. అలా గత 25 సంవత్సరాలుగా కోడళ్ళను బాధించి గాని, తిట్టిగాని, పోట్లాడిగాని ఎరుగను. వారికి అత్తగారి ఆరళ్ళు అసలే లేవు. కోడరికం అంతకన్నా

లేదు. ఇంకా నన్ను గురించి అపార్థం చేసుకుంటే అది నా తప్పు కాదు. అయినా నన్ను అర్థం చేసుకొని గౌరవిస్తూనే వున్నారు. అయితే ఇక్కడ ఒక విషయాన్ని గురించి ముచ్చటించాల్సిన అవసరం వుంది. వివాహమయ్యే వరకు కుమారుని ప్రేమ అంతా తల్లే చూరగొంటుంది. తర్వాత అతడు తన ప్రేమను అర్ధాంగికి పంచి ఇవ్వక తప్పదు. అంటే తల్లిమీద ప్రేమ సన్నగిల్లి పోతుంది. ఇది సహజం. ఇందులో ఎవరి తప్పూ లేదు. అది జీవిత పరిణామ సూత్రం. ముఖ్యంగా పుట్టింటి ప్రేమలను, వాత్సల్యాలను సర్వస్వాన్ని ఒదులుకొని భర్త ప్రేమకోసం ఆర్రులు చాస్తుంది కోడలు. కోర్కెలు తీరని కోడలికి కోర్కెలుడిగిన అత్త అడ్డుపడి బాధించటం విజ్ఞత కాదు. ఇంత తెలిసినా తాత్కాలికంగా ఏదో పోగొట్టుకున్నాననే భావానికి లోనవుతుంది తల్లి. ఇదే జరుగుతుంది కుమార్తె విషయంలో కూడా. దానితో చాలమంది తల్లులు మనోవ్యథ చెందుతారు. విజ్ఞులు అచిరకాలంలోనే ఆబాధను తట్టుకొని, ఆలోచించుకొని, సత్యాన్ని గమనించి తదనుగుణంగా తమ ప్రవర్తనను మలుచుకుంటారు. అదే జరిగింది నా పరంగా కూడ.

# 11. సంఘసేవ

## నేత్రదానం

ఇది ఒక ప్రత్యేక పరిస్థితిలో జరిగింది. నేను ఎన్నో ఏళ్ళుగా నా కళ్ళను 'డొనేట్, చేద్దామనుకుంటూ వుండేదాన్ని. ఒక సంఘటన జరిగి స్పందించటం జరిగినప్పుడు నాకళ్ళను ఇవ్వాలనుకోవటం, తర్వాత అలా వ్రాసి ఇవ్వటం జరిగింది.

ఒకరోజు రాత్రి 9 గం॥ కు ఒక పుట్టు గ్రుడ్డి యువకుడు, ఒక యువతి రెండు దండలు, స్వీట్లు, కెమెరా, ముగ్గురు స్నేహితులను కూడా తీసుకొని వచ్చారు. వెంటనే తమకు పెళ్ళి చేయమని అడిగారు. ఇంత హడావుడిగానా అని అడిగాను. అవునండి వెంటనే జరగాలి లేకపోతే మావాళ్ళు పట్టుకెడతారని తొట్రుపాటుతో చెప్పారు. మీ పెళ్ళికి మీవాళ్ళు వ్యతిరేకించారా అని అడిగితే, అమ్మాయి తరఫునాళ్ళు ఈ గ్రుడ్డివాడిని పెళ్ళాడితే జీవితమంతా అంధకారమని తిడుతూ వేరే పెళ్ళి ఏర్పాట్లు చేస్తున్నారు. మరి అతని తరఫు వాళ్ళెందుకు పేచి పెడుతున్నారంటే, పెళ్ళయ్యాక అతన్ని ఆ అమ్మాయి హీనంగా చూస్తుందని వారు బాధపడుతూ అడ్డు చెబుతున్నారు అని వాళ్ళిద్దరు చెప్పారు. వెంటనే దండలు మార్చి ప్రమాణం చేయించాను. సాక్షి సంతకాలు పెట్టించారు రామ్మూర్తిగారు. అతను స్వీటు తీసుకొని ప్రేమతో ఆమె నోట్లో పెట్టాలని వుబలాటపడటం చూచి 'అయ్యో' అని నామనస్సు ద్రవించిపోయింది. నా వల్ల ఏ ఒక్కరికైనా చూపు వస్తే అదే పదివేలని నేనూ రామ్మూర్తిగారు మా కళ్ళు దానం చేశాం. దానికి చెయ్యాల్సిన ఏర్పాట్లు చేయడం జరిగింది. జీవితంలోనే కాక మరణించాక కూడా మనం మరోవ్యక్తికి సాయ పడాలనే తపన చాలా అవసరం కదా!

## సంఘ సేవలో స్వానుభవాలు

"సేవా రంగంలో కృషి చేద్దామనే ఆవేదన, ఉత్సాహం ఎక్కడి నుండి వొచ్చింది, ఎవరి నుండి వచ్చింది?" అని కొందరు నన్ను ప్రశ్నిస్తూ వుంటారు. రచనగానీ, సేవకానీ ఒకరు చెయ్యమంటే చేసేది కాదు, వద్దంటే మానేది కాదు. అది మనిషి ప్రవృత్తిని బట్టి ఉంటుంది. అది జీన్సు లోంచి వస్తుందో లేదో నేను చెప్పలేను. దానికి తగిన ఆధారాలు లేవు. కాకపోతే విద్యవల్ల కొంత పరిసరాల ప్రభావంవల్ల కొంత, సామాజిక పరంగా కొంత, కుటుంబ సభ్యుల ప్రభావం వల్ల కొంత నేర్చుకుంటాం. మన స్వంత బుద్ధితో ఆలోచించి ఒక మార్గాన్ని ఎన్నుకుంటాం. మానవుడు విజ్ఞాన పరుడు కనుక అతని ఆలోచనా పరంపరలే అతనిని ఒక రూపంలో మలుస్తాయి. ఒక సిద్ధాంతానికి అంకితం చేస్తాయి. అలా నేను నా అనుభవాన్నుండి కొంత, సామాజిక స్పృహతో కొంత నాభర్త సహచర్యంవల్ల కొంత ప్రభావితమై సేవా రంగాన్ని ఎన్నుకున్నాను.

సేవా దృక్పథంతో స్వచ్ఛంద సంస్థల్లో నేను మెంబరయిన మొదటి సంస్థ (1951 లో) "ది బాపట్ల ఉమెన్స్ కాటేజ్ ఇండస్ట్రీస్ కో ఆపరేటివ్ సొసైటీ". ఇది వెలగపూడి సరస్వతమ్మ గారి ఆధ్వర్యంలో స్థాపించారు. ఇందులో జాయింటు సెక్రటరీగా, ట్రెజరరుగా, జనరల్ సెక్రటరీగా 1964 వరకూ సేవ చేయడం జరిగింది. తరువాత కర్లపూడి కమలమ్మగారి శారదా

మహిళా విజ్ఞాన సమితి అధ్యక్షురాలిగా పనిచేశాను. నాటినుండి నేటి వరకు వివిధ సంఘాలలో వివిధ రూపాలలో సంఘ సేవ చేస్తూనే వున్నాను. ఏనాడు ఈ రంగంలో కాలు పెట్టానో నాటి నుండి నేటివరకు పడరాని పాట్లు పడక తప్పటం లేదు. డబ్బు, శ్రమ, సమయం అన్నీ వినియోగించి నిస్వార్థంతో సేవ చేస్తున్నా దూషణలతో పాటు వ్యతిరేకత కూడా అనుభవిస్తు న్నాను. అయినా పట్టుదలతో, కార్య దీక్షతో చేసేవారికి మన్ననలూ వుంటాయి.

"ఆరంభింపరు నీచ మానవులు, విఘ్నాయాస సంత్రస్తులై

ఆరంభించి పరిత్యజింతురు ఉరు విఘ్నాయత్తులై మధ్యముల్,

ధీరుల్ విఘ్న నిహన్య మానులగుచున్ ధృత్యున్నతోత్సాహులై

ప్రారబ్ధార్థము లుజ్జగించరు సుమీ ధృత్యున్నతోత్సాహులై'

'అన్నారు భర్తృహరి. అంటే ఏమంచి పని చెయ్యటానికైనా "అమ్మో! ఎలా చేస్తాం, చెయ్యగలమా!" అని అసలు ప్రారంభించరు ఒక వర్గం. ప్రారంభించాక వచ్చే విఘ్నాలకు తట్టుకోలేక మధ్యలో ఆపేస్తారు మధ్యములు. ఇక అతి ధైర్యంకల మూడో వర్గం మాత్రం ఎన్ని అవాంతరాలొచ్చినా ఆ పనిని ఆపకుండా కడదాకా సాగిస్తారు. జీవిత రంగంలో అన్ని దశలలోనూ పువ్వులతో పాటు ముళ్ళూ వుంటాయి. ముళ్ళు వున్నాయి కదా అని పువ్వులను నిరాకరిస్తామా? ఎండ వుంటేనే కదా నీడ విలువ తెలిసేది. ఏ రంగంలోనైనా అన్నీ సుఖాలే వుండవు, బాధలు, కష్ట నష్టాలు కూడా వుంటాయి. వాటన్నింటికి తట్టుకొని నిలబడ్డప్పుడే మనిషి విజయం సాధించగలుగుతుంది. సేవారంగంలో ఎన్నో ఆటు పోట్లు వస్తాయి. సుఖాలు సున్నా కష్టాలు మిన్న అని తెలిసి కార్యరంగాన్ని సృష్టించుకొని సాగిపోవటమే సేవా దృక్పథం. మన ఇల్లు సరిదిద్దుకోవాలంటేనే సవాలక్ష చికాకులు మనల్ని వెంటాడుతూ వుంటాయి. ఇంక సామాజిక రుగ్మతలను సరిదిద్దాలన్నా, ఒక ప్రేమ పెళ్ళి చేయాలన్నా, మరో అమ్మాయికి ఆశ్రయం ఇవ్వాలన్నా, బహిష్కరింపబడ్డ భార్యను భర్తతో కలపాలన్నా, తిరస్కరించబడ్డ పిల్లల తల్లికి భరణం ఇప్పించాలన్నా, పుచ్చుకున్న కట్నం తిరిగి ఇప్పించాలన్నా, విడాకులు తెప్పించాలన్నా ఎన్ని కష్టాలో! మరెన్ని వత్తిడులు వస్తాయో, ఎంత మంది పగబట్టి సాధిస్తారో ఊహాతీతం. అంతేకాదు

పదిమందికి పనిచేసి ఒక్కరికి సహాయం చెయ్య లేకపోతే అదే ఒక నేరంగా తీసుకొని "ఇంత మాత్రం సహాయం చేయలేని దానివి ఈ బోర్డులు ఎందుకు పెట్టావు, ఈ కార్యక్రమాలు, ఉద్యమాలు ఎందుకు చేస్తున్నావు" అని అడిగిన సందర్భాలెన్నో వున్నాయి. ఎవరి పని వారికి వెంటనే చేసి పెట్టాలి. లేకపోతే ఇష్టమొచ్చినట్టు విమర్శిస్తారు.

నా ఈ సాహస కార్యదీక్షవల్ల మతంతో తగాదా, కులంతో పేచీ, పురుషులతో నిరంతర పోరాటం జరుగుతూనే వుంది. నా పై అందరికీ కోపమే. ఆఖరికి ఏ స్త్రీల కొరకయితే ఈ సంస్థలు స్థాపించానో, ఎవరి భవిష్యత్తు పై పన్నీరు కురిపించాలని నేను నా జీవితాన్ని అంకితం చేసి పనిచేస్తున్నానో వారు సైతం నన్ను అర్థం చేసుకోలేక అనేక దూషణలు చేసి గాలి దుమారం లేపుతూ వుంటారు. సంఘ సేవ చాలా కష్టతరమయినదే కాదు, ముళ్ళ కిరీటం లాంటిది. పేరు, ప్రఖ్యాతులొచ్చాక గిట్టని వాళ్ళు ఓరాయి విసిరి అపకీర్తిపాలు చేసేవారూ వుండవచ్చు. కందుకూరి అంతటివారి ఇంటిమీద పేడ కళ్ళాపి చల్లారు. వెలివేశారు. ఆ దంపతులు పుట్టింటికి, బంధువుల ఇంటికి వెళ్ళి ఏనాడూ పట్టెడన్నం తిని ఎరుగరు. భార్య పొయ్యాక కందుకూరికి 60 ఏళ్ళు పైబడ్డ వయస్సులో కూడా ఆయనకు రంకు కట్టారు. ఇక సామాన్యుల గురించి ఏమని చెప్పాలి? ఎలా వివరించాలి?

ఇంటిపని ఎంత చేసినా బైటికెళతానంటే ఇంట్లో వారికి అసంతృప్తిగానే వుంటుంది. ఇంక బైటవారి విమర్శలు, ఈర్ష్యాసూయలు వర్ణనాతీతం. ఒక్క ఉదాహరణ చేస్తే మీకే ఆశ్చర్యం కలుగుతుంది. హైదరాబాద్ వచ్చాక 4, 5 ఏళ్ళు తగిన పనిమనిషి దొరక్క చాలా ఇబ్బందిపడక తప్పలేదు. చివరికి ఒకామె కుదిరి రేపు తప్పక పనికి వస్తానని అంగీకరించి వెళ్ళింది. నెల రోజులైనా రాలేదు. ఒకరోజు రోడ్డుమీద తటస్థపడ్డప్పుడు 'రాలేదేమమ్మా' అని అడిగితే "మీ ఇంట్లో పనిచేస్తే రక్తం కక్కి చచ్చిపోతానట. యక్షిణీదేవత పట్టి, పీడించి, ఏడ్పించి సర్వనాశనం చేస్తుందట. అసలు మీకు దేముడే లేడటగా! మూడిళ్ళు ము షెత్తుకొని అయినా బ్రతుకుతా కాని మీ ఇల్లువద్దు, మీ డబ్బు వద్దు" అని మూతి మూడు వంకరలు తిప్పింది. అంటే నేను హేతువాదినని దేవుడి పై నమ్మకం లేనిదాన్నని నామీద చాలమందికి అంత ద్వేషం వుందని నాకు అంతకుపూర్వం ఇంత బాగా తెలియదు.

నా రచనల్లో, ఉపన్యాసాలలో పురుష విమర్శ వుంటుంది. ఇది పురుషస్వామ్య సమాజం అనే నా భావప్రచారం వల్ల పురుషులకు నా మీద ఎంతో కోపం వుంది. అలాగే కులతత్వం పోవాలంటానని కులాలవారికి ద్వేషం, మతం వద్దంటే మతాల వారికి కోపం. ఇకపోతే ఏ స్త్రీల కొరకు పాటుపడుతున్నానో వారికీ నామీద కోపమే. కారణం అస్తమానం మీరు కూపస్త మండూకాలని, మీకు స్వేచ్ఛా సమానత్వాలు లేవని, మీరు వంటింటి కుందేళ్ళని అంటానని కోపం. తమకు ప్రబోధం చేసి తమ కుటుంబాల

శాంతిని విధ్వంసం చేస్తున్నానని ఆ స్త్రీలు కూడా నన్ను నిందిస్తూ వుంటారు. ఇంత వ్యతిరేకత వున్నా, ఇంకెంతోమంది మన్ననలందుతూనే వున్నాయి. ఈ సేవా ప్రవృత్తి వల్ల ఒక వంక గౌరవం మరొకవంక తిరస్కారం రెండూ వుంటాయి. వాటిని ఆనందంతో స్వీకరించగలవారే ఈ రంగంలో దిగి సేవ చేయడానికి అర్హులు.

మనమేదో గొప్పవారము మానసికంగా పై అంతస్తుకు చేరామని మనం ఇతరులను ఉద్ధరిద్దామని అనుకుంటూ సేవా కార్యక్రమాన్ని చేపడ్తే సంఘ సేవకురాలి పతనం ప్రారంభమవుతుంది. మన చదువువల్ల మనం కొంత లాభించాము. జీవితంలో తటస్తించిన అవకాశాలవల్ల, సదుపాయా లవల్ల, వనరులవల్ల మరికొంత ప్రయోజనాన్ని పొందాము, సంఘం మనకు ఎంతో మేలు చేసింది. మనం సంఘానికి ఋణపడి యున్నాము, ఆ రుణాన్ని తీర్చుకోవాలంటే, మనకన్న తక్కువగా కూడ అవకాశాలు, సమర్థత, విద్యా విజ్ఞానాలు లేని తోటి స్త్రీలకు చేయూత నివ్వడం చేయతగిన పని అని నమ్మి సేవా కార్యక్రమాన్ని ప్రారంభం చేయాలి. ఈ భావంతో సేవకు ఒడికడితే ఫలితాలు తప్పక వస్తాయి.

మరో అంశం యీ సందర్భంలో ప్రముఖంగా కన్పిస్తుంది. సమాజంలో అణచివేతకు గురి అయినవారు, ఉపేక్షకు గురి అయినవారు అనేకమంది స్త్రీలు ఉన్నారు కదా వారు అందరూ సంఘ సేవికులను, స్వచ్ఛంద కార్యకర్తలను ఎందుకు నమ్మాలి? పలువురు స్త్రీలు పనికట్టుకొని సమాజ సేవ చేస్తామని బీదల పేదల ఇళ్ళ దగ్గరకు పోతారు. వారు ఎందుకు వస్తున్నారో, ఇప్పుడే ఎందుకు వచ్చారో ఆ కష్టజీవులకు తెలియదు. కనుక సహజంగా వారు ఆ సేవా కార్యకర్తలతో కొంచెం బెరుకుగా ప్రవర్తిస్తారు. వెంటనే విశ్వసించడం కుదరదు. వారు మనల్ని నమ్మటం లేదని కార్యకర్త బాధపడి ప్రయోజనం లేదు. ఓపిగ్గా. అదే పనిగా పదిసార్లు వారి వద్దకు వెళ్ళాలి. వారి కష్ట సుఖాలను తెలుసుకోవాలి. సానుభూతితో అర్థం చేసుకోవాలి. ఈ వచ్చిన ఆమె నా మనిషి అనే భావం వారిలో కలిగేలా ప్రవర్తించాలి. ఇది వ్యూహం, ఎత్తుగడగా కాదు చేయవలసినది. నమ్మి అంకిత భావంతో నిజాయితీగా సాగించవలసిన కార్యక్రమం. అలా జరిగిననాడు ఆ శామికులు, ఆ గ్రామీణులు, ఆ బీదలు సాదలు సంఘ సేవకురాలిని సంపూర్ణంగా నమ్ముతారు. అవసరమయితే ఆమె కోసం ప్రాణాలనిస్తారు. ఆమెకోసం మాత్రమేకాదు. ఆమె ఉద్యమపరంగా సాగిస్తున్న కృషి కోసం, చివరగా తమ సంక్షేమకోసం, తమ శ్రేయస్సుకోసం. వారి విశ్వాసాన్ని చూరగొనటానికి ఇలా ప్రవర్తించాలని నేను నా స్వానుభవంలో నేర్చుకున్నాను. ఇంకా ఎన్నో నేర్చుకోవలసి ఉంది. సామాజిక కార్యకర్త నిరంతర విద్యార్థిగా ఉండాలి. కళ్ళు తెరుచుకొని, చెవులు విప్పుకొని నిర్మలమయిన మనస్సుతో నిర్దిష్ట లక్ష్యం వైపు పురోగమించాలి.

సంఘ సేవకు మొదలు తుదీ లేదు. సంఘంలోని అనేకరంగాలు అస్తవ్యస్తంగా ఉన్నాయి. అన్నీ సంస్కరణకు తగి ఉన్నాయి. బ్రహ్మాండమయిన మార్పుకు, సమూలమయిన మార్పుకు అంటే విప్లవానికి వీలయినప్పుడు తయారుగా ఉంటాయి. ఎప్పుడూ ఏదో ఒకమూల చేపట్టవలసిన పని మిగిలే ఉంటుంది. కాబట్టి పనిపూర్తి అయిపోయిందని భావించటం అవివేకం.

ప్రతి మనిషికి సంఘ సేవాసక్తి కాస్తో కూస్తో ఉంటుంది. వారు 'నాకు పనిచెప్పండి! అని వస్తుంటారు. నేను వారికి వెంటనే పని వప్పగించను. నేను చేస్తున్న పనులను వారికి తెలియజేస్తాను. వీటిలో ఏదో ఒక దానిని 'మీరు ఎంపిక చేసుకోండి, దానికోసం కృషి చేయండి, అంటాను. అంతటితో ఆగక మీరేదయినా మరో కార్యక్రమాన్ని ప్రారంభిస్తే నేను మీకు ఊతనిస్తాను, బలపరుస్తాను. మీరు ఆ బాధ్యత తీసుకుంటానంటే ఆకార్యక్రమాన్ని మాసంస్థల ద్వారా ఎత్తుకుంటాను అంటే 'నాకంత సామర్థ్యం లేదండీ' అంటారు. "పోనీ నావద్ద జరుగుతున్న పనులలో ఏదో ఒకటి మీ ఆసక్తిని బట్టి, అభిరుచిని బట్టి నైపుణ్యాన్ని సమర్థతను లెక్కలోకి తీసుకొని పనిచేయండి" అని కోరితే రేపు వస్తామని మళ్లీ రారు. వారికి సదుద్దేశ్యం లేదని అందామా? అనలేము. వాస్తవానికి వారికి సద్బుద్ధి ఉంది, చిత్తశుద్ధి ఉంది, కాని కావాల్సిన పట్టుదల లేదు. ఇది శోచనీయం. ఈ పరిణామాన్ని గురించి స్వేచ్ఛా పిపాసులు తీవ్రంగా ఆలోచించాలి.

ఇలాంటివెన్నో చేదు అనుభవాలు, తీపి స్మృతులు నా సంఘ జీవితంలో నాకు ఎదురు అవుతున్నాయి. వాటిలో కొన్నింటిని ఇక్కడ ఉటంకించటం జరిగింది. వీటిని తెలుసుకున్నం దువల్ల సమాజ సేవాసక్తులు ప్రయోజనం పొందగలరని భావిస్తున్నాను.

## వ్యక్తిగత సమస్యలు : సమాధానాలు

ఈ శీర్షికను ఆంధ్రజ్యోతి పత్రికలకు చెందిన వనితాజ్యోతి ఎడిటర్ శ్రీ నండూరి రామ్మోహనరావుగారు నాకు కేటాయించారు. ఈ శీర్షిక ప్రారంభం కాక ముందే ఆంధ్రపత్రిక నిర్వాహకులు, సంపాదకులు శివలెంక రాధాకృష్ణగారు తాము ప్రారంభిస్తున్న 'కలువబాల' అనే స్త్రీల పక్షపత్రికలో 'మహిళా వికాసం' అనే శీర్షికను ప్రవేశ పెట్టి ఆ శీర్షిక నడిపే గౌరవాన్ని నాకు వారు ఇచ్చారు. దాని అసోసియేట్ ఎడిటర్ వీరాజీ నాపట్ల ఎంతో ఆదర భావంతో వ్యవహరించి ఇప్పటికి దాదాపు 140 వ్యాసాలు ప్రచురించారు. 'కలువబాల' లో నా వ్యాసాలు 1-8-84 ప్రారంభ సంచిక నుండి ప్రతి నెలా రెండు వ్యాసాలు ప్రచురితమవుతూనే వున్నాయి.

'వ్యక్తిగత సమస్యలు : సమాధానాలు' అనే శీర్షిక పలువురు బాధిత స్త్రీలను ఆకర్షించింది. అనేక ఉత్తరాలు వస్తూ వుంటాయి. చివరికి సుబ్బమ్మ గారి అడ్రసును తెలియచేయండని వ్రాసే ఉత్తరాల సంఖ్య పెరిగింది. ఈ బాధ భరించలేక పత్రికా

నిర్వాహకులు అసోసియేట్ ఎడిటరు జొన్నలగడ్డ సత్యనారాయణగారు నా చిరునామాను అప్పుడప్పుడు ఆ 'కాలం' లో అచ్చువేయక తప్పడం లేదు. దాంతో ఉత్తరాల సంఖ్య మరీ పెరిగింది. కొన్ని ఉత్తరాలు అసమగ్రంగా ఉండటం మూలాన సరియైన సమాధానాన్ని ఇవ్వలేక సమమతమయ్యే దాన్ని. ప్రశ్నలను పంపే వారి ఊరు పేర్లు మార్చటం తప్పనిసరి. అనేకమంది స్త్రీలనేకాక పురుషులలో కొందరికి ఆసకి కలిగించటానికి ఈ 'కాలం' ఎంతో అవకాశాన్ని నాకు కల్గించింది. అధికంగా ప్రశంసా లేఖలు, చెదురుమదురుగా అధిక్షేపయుత జాబులు వచ్చేవి. మచ్చుకు రెండే రెండు సమస్యలు పరిశీలిద్దాం.

ప్రశ్న: మీరు అవివాహితులు కాబట్టే పురుష ప్రపంచాన్ని ఇంతగా ద్వేషిస్తున్నారేమో! మీకు లెటర్సు వ్రాసిన వాళ్ళలో హెచ్చుమందికి విడిపొమ్మని సలహా ఇస్తారు కదా! మీకు పెళ్ళి అయితే మీ భర్తకాని, అత్తగాని మిమ్మల్ని ఇబ్బంది పెడితే విడాకులు తప్పకుండా తీసుకొని వుండాలి కదా! మరి ఎందుకు తీసుకోలేదు. మీ అమ్మాయికి ఇబ్బంది వస్తే ఇలాగే చేస్తారా? మీ సలహాల ద్వారా సమాజాన్ని తప్పుదారి పట్టిస్తున్నారని నా భావం. విడిపడ్డ వారికి పోషణ ఒక్కటే కాదు. అందులో ఆడవారికి జీవితాంతం రక్షణ ఇవ్వగలరా? లేకపోతే ఎలా వుంటారు? వాళ్ళకు రక్షణ మీరా? వనితా జ్యో తి ద్వారా తప్పక చెప్పండి.

– ప్రియాంక, అనంతపూర్

జవాబు: 1935లో నా వివాహమయింది. విడాకులు పొందాల్సినంత అత్యాచారాలు నాపట్ల జరగలేదు. నేనే కాదు నా భర్తకూడా ఒక పురుష ఫెమినిష్టు అని నాకు తెలుసు. అందునల్ల నేను సుఖంగా ప్రశాంతంగా బ్రతకటమే కాక ఈనాడు పీడింపబడుతున్న లక్షలాది మహిళలకు నా సాహిత్యం ద్వారా, సలహాల ద్వారా, సంస్థల ద్వారా ఆత్మ స్థయిర్యాన్ని కలిగిస్తున్నానంటే నమ్మండి. నా సలహాల వల్ల ఆత్మాహుతి మానుకున్న వారు చాలామంది వున్నారు. ప్రేమించిన వాళ్ళని పెళ్ళాడిన వాళ్ళూ వున్నారు. అత్యాచారాల ఊబినుండి బైటపడ్డ వారూ అనంతంగా వున్నారు. వారు నాకు కృతజ్ఞతల ద్వారా ఈ మాటలు వ్రాస్తూ వుంటారు. మీరు రక్షకులా అన్నారు కదా! లక్షల మంది స్త్రీలను పోషించడం, రక్షణ ఇవ్వటం ఏ ఒక్కరికీ సాధ్యం కాదు. భర్త కాల్చాడని, తిట్టాడని, వెళ్ళగొట్టాడని, చంపబోతున్నాడని ఎన్నో కేసులు వస్తూ వుంటాయి. వాళ్ళ కథలు, కష్టాలు, బాధలు వర్ణనాతీతంగా వుంటాయి. గత పదేళ్ళుగా నేను కుటుంబ సలహా కేంద్రాన్ని నడుపుతున్నాను. కనుక నాకు ఆ నగ్న సత్యాలన్ని తెలుసు. అవన్నీ వింటే మీకు హృదయం ద్రవించక మానదు. అప్పుడు మీరే వార్ని విడిపడి బ్రతకమని సలహా చెప్పక తప్పదు. సుఖ సంతోషాలకు నోచుకున్న మీ బోటి వాళ్ళ కోసం కాదు నేను వ్రాసేది. బాధాసర్పదష్టులను రక్షించటం మన కర్తవ్యం అని భావించి రాస్తున్నాను. కాని అందర్ని పోషిస్తానని, రక్షిస్తానని నేను చెప్పడం లేదు. వారిని వారే రక్షించుకునేలా,

పోషించుకునేలా వారిలో ఆత్మ విశ్వాసాన్ని కలిగించటం కోసమే నేనిన్ని ఉద్యమాలు, 'స్త్రీ స్వేచ్ఛ' పత్రిక నిర్వహిస్తు న్నాను. అంతే! భర్తలచే చంపబడే వారికి, ఆత్మహత్యలు చేసుకోబొయ్యే వారికి, ఇంకేదయినా సలహా చెప్తే మీరు చెప్పండి. ఎవరి ఇష్టం వారిది, ఎవరి మార్గం వారిది. నేను మాత్రం భర్తల పాదదాసిగా బ్రతకమని చెప్పను. అయినా నా సలహా కోరిన వారికి నేను నమ్మిన సత్యాన్ని చెప్పే హక్కు నాకు వుంది. నేను ఇంటింటికీ వెళ్ళి మీ భర్తలను వదిలేయమని, చంపమని సలహా ఇవ్వటం లేదు కదా! జైలులాంటి కుటుంబ జీవితాన్ని గడపాల్సివస్తే, శాడిస్టులా హింసిస్తుంటే నేను అలాంటి భర్తతో కాపురం చెయ్యను. అదే సలహా నా కుమార్తెకు కాని, కోడలికి గాని, తోటి బాధితులకు కాని చెప్పటానికి వెనుకాడను. అసలు రక్షణ దొరుకుతుందా లేదా అని ఆలోచించి బైటకి రారు కదా! పరిస్థితులకు లొంగి దాస్యాన్ని భరించలేని వారికి, వెట్టిచాకిరి చేస్తూ, చావుదెబ్బలు తింటూ జీవించలేని వారికి, వరకట్న హింసల బాధితులకు, ఆత్మహత్యను ఆహ్వానించేవారికి విడిపడి బ్రతకమని ధైర్యంగా సలహాలిస్తూ వుంటా కాని, ముక్కు మూసుకొని మూడు నిముషాల్లో చావమని నేను చచ్చినా చెప్పను. అది నా నైజం కాదు. ఇప్పటికయినా నన్ను అర్థం చేసుకుంటారా?

ప్రశ్న: సుబ్బమ్మ గారూ! అందరికీ సలహాలందిస్తున్న మీ గురించి ఒక వ్యక్తిగత ప్రశ్న అడుగుతున్నా. మీరు మాత్రం 50 ఏళ్ళుగా భర్తతో హాయిగా వుంటూ, యవ్వనంలో తొణికిసలాడుతున్న అమాయక యువతులను విడిపడమని, భరణం అడగమని, విడాకులు కోరమని బయటికి రమ్మని ఊదర కొట్టడం సబబేనంటారాండి? బైటికొచ్చిన వారు పడే బాధలు మీరు అనుభవించలేదు. కనుకనే అలాంటి సలహాలనిస్తున్నారేమో!

**– వరలక్ష్మి, హైదరాబాదు.**

జవాబు: అలా ప్రశ్నిస్తున్నందుకు మిమ్మల్ని, ఇంకా ఇతరులను శ్లాఘిస్తున్నాను వరలక్ష్మి గారూ! ఇక వినండి నా కథ. నేను ఏనాడూ నా వ్యక్తిత్వాన్ని చంపుకొని భర్త చరణ దాసిగా బ్రతకలేదు. దెబ్బలు, తిట్లు తినలేదు. కట్నం కోసం హింసింపబడలేదు. మా ఇద్దరి మధ్య యజమాని, బానిసత్వ లక్షణాలు లేవు. ఒకర్ని ఒకరం గౌరవించుకుంటూ, ఒకరి కొకరు రెండో వారు త్యాగానికి సిద్ధపడుతూ, ఒకరి లక్ష్యాలకు, ఆదర్శాలకు మరొకరు అడ్డు పడకుండా మంచి స్నేహితుల్లా, కష్టసుఖాల్లో భాగస్వాముల్లా సంచరిస్తున్నాం. అభిప్రాయ భేదాలు అనంతంగా వున్నా, చికాకులు వస్తున్నా ఎవరిది పొరపాటో తెలుసుకుని సరిదిద్దుకుంటూ వుంటాం. ఎవరి సలహా ఉచితమో ఆ దారిన పయనిస్తున్నాం. నా భర్త పౌరహక్కుల ఉద్యమంలో పనిచేస్తుంటే నేను గౌరవిస్తున్నాను. నేను మహిళోద్యమంలో పనిచేస్తుంటే ఆ సిద్ధాంతం తనకూ ఇష్టం కనుక సహకరిస్తున్నారు. ఇలాంటి భర్తతో దాంపత్య జీవితం దుర్భరం కాదంటే ఆశ్చర్యమా? అలాంటి సత్ప్రవర్తనగల వ్యక్తిని విడిచి పెట్టాల్సిన అవసరం కలగలేదంటే అది సత్యదూరం కాదు.

ఇక నన్ను సలహా అడిగే వారిలో ఎక్కువమందికి బాధలు వర్ణనాతీతంగా వుంటున్నాయి. వాళ్ళ మొగుళ్ళు యముళ్ళన్న మాట. వారి జీవితం మహా దారుణం, వారి బ్రతుకులు కత్తిమీద సాము. వారి కుటుంబాలు నరకప్రాయాలు. వారి జీవితాలు చిగురించే ఆశలు చూపుమేరలో వుండవు. వారి అంతిమదశ చావడమో, చంపబడటమో! ఆ పరిస్థితిలో నా సలహా కోసం వస్తారు. చావడం పిరికితనమని బోధించి, విడిపడి కాస్త స్వేచ్ఛా వాయువుల్ని పీల్చుకోమని చెప్పటం నేరమా? నేనలాంటి భర్తల్ని కూడా చంపమని బోధించడం లేదు. విడిపడి స్వశక్తితో శేష జీవితాన్ని గడపమంటున్నాను. విడిపడ వారిని మీరు పోషించగలరా అని ప్రశ్నిస్తే బ్రతకటానికి మార్గాలు లేకపోలేదు. నేను సైతం మొదట్లో భార్య భర్తల్ని కలిపి సరిదిద్దటానికి ప్రయత్నిస్తా.. కుదరని పరిస్థితిలోనే విడాకులు తీసుకోమంటాను. అది తప్పా, నేరమా? మరికాస్త ఆలోచించి విమర్శించండి. మరో ముఖ్య విషయం గమనార్హం. నేను సుఖపడుతున్నా కనుక తోటి స్త్రీలు కష్టపడటం నాకిష్టమని కొందరు విమర్శిస్తుంటే, భర్తకు దూరమైన స్త్రీల కష్టాలేమిటో నాకు తెలియక పోబట్టే వారిని విడిచెయ్యమని సలహాలిస్తున్నానని మరో వర్గం వాదిస్తోంది. ఏ రంగు కళ్ళద్దాలతో చూస్తే అలా కనిపించటం వారి వారి దృష్టి దోషమే తప్ప నేను ఆలోచించి చెప్పేది నా గురించి కాదు. రచయితలు, సంఘ సేవకులు ఎప్పుడూ సమాజంలోని నైచ్యాన్ని, దుర్మార్గాన్ని, అవినీతిని క్షాళనం చెయ్యాలని తహతహలాడతారు కాని వారి స్వంత అనుభవం గురించి కానే కాదు. ఇలా అయితే అలా, అలా అయితే ఇలా అని, మీరు నా సలహాలను వక్రీకరించటం న్యాయం కాదు.

## లక్ష, తెచ్చిన మహిళా దశాబ్ది సావనీరు

"మఖలో పుట్టి పుబ్బలో పోయిన పత్రిక లెన్నో వున్నాయి. ఆగిపోయే దానికి పత్రిక పెట్టటం ఎందుకమ్మా! అందులో మహిళా మేగజైన్ ! ఎవరు కొంటారు? చదివేది ఎవ్వరు? రాసేది ఎవ్వరు? డబ్బులు ఎక్కడ తెస్తారు? ఎవరు ఇస్తారు? "అని ఒక ఎడిటర్ 'స్త్రీ, స్వేచ్ఛ' పత్రిక చూచి నామీదగల అభిమానంతో సద్విమర్శ చేశాడు. ఇక ఆ ఆలోచనలతో నా మెదడంతా వుక్కిరి బిక్కిరి అయింది. ఆయన అడిగినవన్నీ నిజమే. మరి ఎలా? అయినా అలా పుట్టి, ఇలా పెరిగి, ఇంతగా మారి, ఇన్ని సంస్థలు స్థాపించి, ఇంత సాహిత్యాన్ని సృష్టి చేసిన నేను ఈ పత్రిక నిర్వహించలేనా అనేది ఒక ప్రిస్టేజి ఇష్యూగా మారింది. అది గాక ఒక సిద్ధాంతం ప్రతిపాదించినా, ఒక ఉద్యమం స్థాపించినా ఒక గట్టి నిర్ణయం చేశాక అది వీగిపోతే ఆత్మాభిమానం దెబ్బతినడమే కాదు అనౌచిత్యం కూడా. ఆ కష్ట నష్టాలన్నీ మొదట్లోనే ఆలోచించుకోవాలి. కాని మధ్యలో జారిపోవటం సభ్యత సంస్కారం వున్న వారికి తగని పని అనేది నా నిశ్చితాభి ప్రాయం.

1990 జూన్ కు మహిళాభ్యుదయ సంస్థ స్థాపించి 10 సంవత్సరాలు నిండాయి.

గవర్నరును, ఇద్దరు వైస్ ఛాన్సలర్లు, న్యాయాధికార్లను ఆహ్వానించి దశాబ్ది సభలను జరిపి ఒక సావనీరుని తెచ్చి అందులో వచ్చే ప్రకటనల డబ్బును మూలధనంగా వుంచి దాని పై వచ్చే వడ్డీతో ఈ పత్రికను నిర్వహిద్దామని నిశ్చయించాను. ఒక 50 వేలు తేగలిగితే మహా గొప్పే అనుకొని బయలుదేరి రెండు నెలలు తిరిగితే లక్ష రూపాయలు ప్రకటనల ద్వారా, విరాళాల ద్వారా లభించాయి. నాకే ఆశ్చర్యం కలిగింది. అబ్బో! ఎంత మందికి నా మీద గౌరవం వుంది అనే ఆర్ద్రత నన్ను ఆవరించింది. మరో నెల తిరిగితే ఇంకెంత వచ్చేదో కదా! అయినా "ఆశా పాశము తాకడున్ నిడుపు లేదంతంబు రాజేంద్ర" అన్నట్లు ఆశకు అంతేముంది అని సంతృప్తి పడ్డాను. ఖర్చులు పోను వచ్చిన మొత్తాన్ని, ఇతరత్రా కలిపి పత్రికాభివృద్ధి కోసం యూనిట్ ట్రస్టులో ఒక లక్షా 50 వేలు వేశాను. ఆ వడ్డీతోనూ, చందాలతోనూ, ఎడ్వర్ టైజ్ మెంట్లతోను పత్రిక బ్రతుకుతుందనే ధైర్యంతోపాటు నా జీవితాంతం నిలుస్తుందనే సంతృప్తి నాకు కలిగింది.

ఈ సందర్భంగా ఒక నూతన అనుభూతి పొడ సూపింది. సమాజంలో ఇంకా మంచికి గుర్తింపు వున్నదని, ప్రోత్సహించే వారు వున్నారని నాకర్థమయింది. కొద్దిమంది త్యాగధనులతోనే ఇన్ని సత్కార్యాలు జరుగుతుంటే ఇంకా సహృదయుల సంఖ్య పెరిగితే సమాజ స్వరూపాలే మారి పోవా అనే ఊహ నాలో బలపడింది. కొందరనుకున్నట్లు సమాజమంతా క్రుళ్ళి పూర్తిగా పతనం కాలేదు. సమాజంలో మంచి, చెడూ రెండూ వున్నాయి. ప్రస్తుతం చెడు పాలు ఎక్కువ వుంది. అందులో అనుమానం లేదు. కాని శ్రమించి మంచిని పెంచగలమనే విశ్వాసంతో పనిచేస్తే ఫలితాలు వస్తాయని నా నమ్మకం. ఏ మంచి పనిచెయ్యాలన్నా పట్టుదల, ధైర్యం. సహనం, నీతి నిజాయితీలు కావాలి. అవి వుంటే ఎంతటి ఘనకార్యాన్ని అయినా సాధించగలం అనేది అక్షరాలా నిజం.

# 12. నేటి సమాజం

## సాంఘిక విషదంష్ట్రలలో ఎందరో మరెందరో?

"ఈ సమాజమే నన్నీ వృత్తిలోకి దింపిందండీ" అన్న ఆనాటి ఆమె పలుకులు ములుకులై నన్ను పొడుస్తూనే వున్నాయి. అదొక విషాద గాథ. నా చిన్ననాటి రోజుల్లో దేవాలయాల్లో, పండుగల్లో, పర్వదినాల్లో, తిరునాళ్ళ సమయాల్లో దేవదాసీలు చాలా అందంగా అలంకరించుకొని దేవుని ముందు నాట్యా నికి వచ్చేవారు. వారి అందము, అలంకరణ, అలవోకగా కన్నార్పకుండా చూస్తూ వుండే వాళ్ళం. గజ్జెల వడ్డాణం, వంకీలు, వజ్రాల దిద్దులు, పాపట బొట్టు, చంపస్వరాలు, రవ్వల నెక్లెసు, ముక్కు పోగు, (ముక్కెర) కాళ్ళగజ్జెలతో అపురూప గంధర్వకన్యల్లా అలంకరించుకొని, జరీ చెట్ల చీరలు ధరించి పైన సన్నని వల్లె వాటు కప్పుకొని గుఱ్ఱం బండి దిగి దేవాలయంలో ప్రవేశించి జగన్మోహినుల్లా నాట్య ప్రదర్శన చేసే వాళ్ళు. వాళ్ళకోసం దూరప్రాంతాల నుండి వచ్చే జనంతో బాపట్ల భావనారాయణ స్వామి గుడి కిటకిటలాడి పొయ్యేది. స్త్రీ, పురుషులంతా రెప్పార్పకుండా ఆ నాట్యాలను చూసే వాళ్ళు. ఆ గుడి ప్రక్క ఇంట్లోనే వుండేది మా కుటుంబం. తిరుణాళ్ళలో, పర్వదినాల్లో, పండుగ రోజుల్లో దేవుని ఊరేగింపు ముందు భాగాన జావళీలు పాడుతూ వాళ్ళు నాట్యం చేస్తుంటే మహేంద్రుని దర్బారులో రంభా ఊర్వశీ నాట్యం చేస్తున్న దృశ్యంలా, కలియుగ వైకుంఠంలా దృగ్గోచరమయ్యేవి ఆ సన్నివేశాలు. అది అసభ్యమని, అనాగరికమని నాకప్పుడు తెలియదు. ఆ తర్వాత దేవదాసీ వృత్తి నిషేధింపబడింది. అయినా వ్యభిచారవృత్తి రూపుమాపి పోలేదని మనకు తెలుసు.

మా కుటుంబం 1930లో నెలకు 8 రూ॥ అద్దెకు జండా చెట్టు ఎదురుగా వున్న పెంకుటింట్లో నా చిన్నప్పుడు వుండే రోజుల్లో మా ఎదురు ప్రాంతంలో సానివాడ వుండేది. సాయంత్రం మా అరుగుల మీద కూర్చుంటే గుఱ్ఱపు బండి దిగి విటులు 'పబ్లిగా' పోతూ వుండేవారు. ఆ రోజుల్లో సానివాడలు, భోగం వాళ్ళు, దేవదాసీలు అనే పేర్లు వినడానికి మా వాళ్ళు అసహ్యించుకొనే వాళ్ళు. మమ్మల్ని ఆ ప్రాంతాలకు పోతే మైలపడి పోతామని తిట్టే వాళ్ళు. పిల్లలతో మాట్లాడనిచ్చేవారు కాదు. నా స్నేహితురాలు పిచ్చెమ్మ, సామ్రాజ్యం అనే బోగం స్త్రీ కూతురని దానితో నాకు స్నేహమేమిటని మా వాళ్ళంతా దుమ్మెత్తి పోస్తూ వుండేవారు. మా ఇద్దరికీ ప్రాణ స్నేహం. దాన్ని చూడకుండా వుండలేక పొయ్యేదాన్ని. అది మాత్రం నాలాగా పుట్టలేదా అనే మీమాంస నాలో వుండేది. కాని నాకప్పుడు వ్యభిచారం వగైరాలంటే ఏమీ తెలియని దశ. ఆ తర్వాత వ్యభిచారం మీద ఎన్నో వ్యాసాలు రాశాను. కాని పరిశీలించలేక పొయ్యాను. 1985లో బాంబేలో రెడ్ లైట్ ప్రాంతం (కామాటిపుర) వెళ్ళి పరిశోధన చేసే అవకాశం నాకు దొరికింది. ఆంధ్ర ప్రాంతమయిన ఒంగోలు అమ్మాయిలు ముగ్గురు దొరికారు. పెళ్ళికాని దుర్దశ వల్లా,

భర్త తిరస్కారం వల్లా, ఆర్థిక ఇబ్బందుల వల్లా, ప్రేమించామని మోసగింపబడి ఇక్కడికి చేరుకున్నామని వారు చెప్పారు. అసలు అక్కడి దళారులు, మిండ గాళ్ళు మనను లోపలికి వెళ్ళనివ్వరు, ఫోటోలు తియ్యనివ్వరు, వాళ్ళతో మాట్లాడనివ్వరు కూడా. నేను వెళ్ళిన సమయంలో ఏ అడ్డంకులు లేకపోవటంవల్ల లోనికి వెళ్ళాం. మీనా అనే అమ్మాయి మాత్రం తన కథ చెప్పి ఈ సంఘమే నన్ను దుర్దశకు తెచ్చిందని వాపోయింది. మిగతావారు మొద్దుబారి పోయినందువల్ల సంతోషంగా చలాకీగా మాట్లాడారు. పైగా వారి ధోరణి వింటుంటే నా కాళ్ళ క్రింద భూమి కదలాడిపోయింది. అంటే ఆ రోజుల్లో ఈ వృత్తిలోకి వచ్చే వారి సంఖ్య పెరిగిపోతోందని, కూతుళ్ళను పంపే తండ్రులు కొందరయితే భార్యలను పంపే భర్తలు మరెందరో వున్నారని అందువల్ల వారి పోటీవల్ల తమకు వచ్చే పేసింజర్లు (విటుల) సంఖ్య, తగ్గిపోతోందని, గది అద్దె, దళారీకి, పోలీసులకు, పూలకు ఖర్చులు పోను తమకు ఒంటి పూట మాత్రమే తిండి దొరుకుతోందని వారు చెప్పసాగారు.

ఆ దృశ్యం నాకిప్పటికీ కళ్ళల్లో మెదులుతూనే వుంటుంది. 12 ఏళ్ళ అమ్మాయి మొదలు 50 ఏళ్ళ యువతి వరకు నిలబడి విటులను పిలుస్తూ వుంటారు. పెదవుల పై రంగులతో, పూలు పెట్టుకుని, స్నోలు రాసుకొని చక్కని దుస్తులు ధరించి వయ్యారం వొలకబోస్తూ, కను సైగలు చేస్తూ ముందు ముందుకొచ్చి విటుల్ని ఆహ్వానిస్తూ వుంటారు. వరండాల్లో, మేడలమీద, కిటికీల్లో వాకిళ్ళలో, రోడ్లకిరు ప్రక్కలా రెప్పార్పకుండా చూస్తూ నిలబడి వందల సంఖ్యలో వుంటారు. వాళ్ళ జీవితాలింక చిగురించబోవు. వారి పిల్లలకు భవిష్యత్తు లేదు. అయినా వారు చింతాక్రాంతులయి లేరు.

అయ్యో! ఎంత అనాగరిక దశలో మనం జీవిస్తున్నాం అని ఒళ్ళు ఝల్లుమంటూ గగుర్పొడిచింది. ఒకరోజు ఒక ఎం.ఎల్.ఎ.తో మీ రాష్ట్రంలో వ్యభిచారానికి లైసెన్సు ఇచ్చారా అని ప్రశ్నించా. ఇక్కడి పరిస్థితి మీకు అర్థం కాదు. బాంబే మహా నగరంలో ఇల్లు దొరకటం దుర్లభం. అందువల్ల ఉద్యోగార్థం ఇక్కడున్న గృహస్తులకు, బ్రహ్మచారులకు, వచ్చే పొయ్యే (పాపులేషన్) వారికి తృప్తి ఎలా దొరుకుతుందండీ! అన్నాడు చాలా తాపీగా. మరేం చెయ్యాలో బోధపడలేదు. దేవదాసి వృత్తిని 'బాన్' చేశారు. భోగం వృత్తికి, వ్యభిచార వృత్తికి శిక్షలున్నాయి. భార్యవుండగా మళ్ళీ పెళ్ళాడితే 'బైగమీ' కేసు పెట్టవచ్చు. మరి ఈ ఘోర వృత్తి నశించేది ఎలా? కేవలం కండలు, చీము, నెత్తురు అమ్ముకొని బ్రతికే తోటి స్త్రీలను రక్షించలేని మా మహిళా సంఘాలు ఎందుకు అన్న బాధ ఆనాటి నుండి నన్ను వేధిస్తూనే వుంది.

## సామాజిక రీతి

ఒకసారి మహిళాభ్యుదయ సంస్థ తరపున కాలనీ మహిళల కోర్కెల పై 15 రోజులు వంటలు, పళ్ళరసాలు, జామ్ తయారి వగైరాలు నేర్పించటానికి నేషనల్

న్యూట్రీషన్ వారిచే క్లాసులు ఏర్పాటుచేశాను. నలభై మంది స్త్రీలు ఖర్చులు భరించి రోజు క్రమం తప్పకుండా హాజరై నేర్చుకున్నారు. చివరి రోజున నేను చొరవ తీసుకొని "అమ్మా మన ప్రక్కనున్న (హమాలీ స్లమ్) 200 కుటుంబాలను దత్తత చేసుకున్నాము. అక్కడ దానికి యునిసెఫ్ వారు ఆర్థిక సహాయాన్ని అందిస్తామన్నారు. ఆ ప్రాంతపు స్త్రీలు, మనమూ కలిసి ఆ వాడ కుటుంబాలకు ఆరోగ్యం, విద్య, ఆర్థికంగా బ్రతుకు తెరువులాంటి వాటికి ఇతోధికంగా సేవ చేద్దాం. మీలో మాకు సహకరించే వారు ఒకరిద్దరు ముందుకు వస్తే కృతజ్ఞురాలిగా వుంటా" నని హెచ్చరిక చేశాను. చెప్పకూడదు కాని ఒక్కరికి మొహంలో సంతోషం గాని, వికసింపుగాని, ఉత్సాహం కాని మచ్చుకయినా కనిపించలేదు. పోనీలే వారినెందుకు కించపరచాలని తమాయించుకొని "న్యూట్రిషన్ వారు సబ్బులు, ఫినాయిల్, షాంపూలు నేర్పిస్తామని, తినుబండారాలు, స్వీట్సు డిమాన్‌స్ట్రేట్ చేస్తామని ఫోను చేశారు. మీరు వస్తారా" అని అడిగానో లేదో వెంటనే ముప్పయి మందికి పైగా లేచి "ఎప్పుడండి? వెంటనే పిలిపించండి" అని ఆతృతగా అడిగారు. అంతేకాదు మాకు కుట్టు సెంటరు కావాలని, మాకు టైపు పని నేర్పించమని, మాకు సంగీతం నేర్పిస్తారా, మాకు బ్యూటీ క్లినిక్స్ పెడతారా, ఇంగ్లీషు నేర్పించుతారా అంటూ మీ సంస్థలో ఎప్పుడూ ఒకటయ్యాక మరొకటి నిర్వహిస్తూ వుంటే మేము తప్పక వస్తామండి అని ఉప్పొంగిపోతూ ఉద్బోధించారు. వీటికయితే చందాలు కూడా కడతామండి అంటూ కుర్చీల్లోంచి లేచి వచ్చి నా చేతులు పట్టుకున్నారు. మరి ప్రతి నెలా నేను నిర్వహిస్తున్న శిక్షణా తరగతులకు భోజనం పెట్టి, మేధావుల చేత గత ఆరు ఏళ్ళుగా అనేక విషయాలు బోధిస్తుంటే హాజరయ్యే వారి సంఖ్య రాను రాను తగ్గిపోతోంది. వాటిని నిర్వహించటం అత్యంత కష్టతరం అయిపోతోంది. అసలు నా ఆలోచన, సిద్దాంతం లేక ప్రచారాల లోపమా, అవి ఎందుకూ పనికిరాని దశలో పయనిస్తున్నాయా? మరి నేను వారు కోరిన విద్యలు వారికి నేర్పటానికి నా సర్వశక్తులూ వినియోగించాలా? లేక నా మార్గంలోనే పయనించాలా అనేది ప్రశ్నగానే మిగిలిపోయింది. "మీకు కొండంత అండదండలు మా వల్ల దొరుకుతాయి. అప్పుడు మీ కాలం, డబ్బు, శ్రమ నూరు రెట్లు లాభిస్తాయి. మీరు మా గురించి ఆలోచించకుండా, కుంటి వాళ్ళను, గ్రుడ్డి వాళ్ళను, అనాధలను, భర్తృ తిరస్కృతులను, భర్తృ పరిత్యక్తులను ఆదరిస్తామనడం, ఏదో ఒరిగిస్తామనటం శుద్ధ దండగండీ. అదంతా వాళ్ళ పురాకృత సుకృతం. తోలు క్రింద గీతల్ని (బ్రహ్మ రాతల్ని) మార్చటానికి మీరు కర్తలా? "అంటూ నా చుట్టూ చేరి " అసలు వాళ్ళను మనం రక్షించగలమా? మీ పిచ్చి కాకపోతే. ఇన్నాళ్ళు మీకు బోధించే అవకాశం దొరక్క మాలో మేము వితర్కించుకుంటూ వుండే వాళ్ళం." అంటూ ఉవ్వెత్తున లేచారు. ఇప్పుడు నాకు సమాజపు రూపు రేఖలు పూర్తిగా అవగతమయ్యాయి. అంటే వాళ్ళ కోర్కెలు తీర్చటానికి, వాళ్ళకు ఆర్థికంగా అవకాశాలు కల్పించటానికి మన సర్వశక్తులూ ధారపోసి చెయ్యాలి. బాగుందీ వారి ధోరణి! " కన్నమ్మకే వాపి తిన్నమ్మకే వాపి అన్నట్లు" ఉన్న వారి వనరులు

పెంచటానికి నేను సాధనాన్ని కావాలి అన్న మాట. కొందరు స్టేటస్ సింబల్ కోసం ఇంగ్లీషు మాట్లాడాలనుకునే వారికి అవన్నీ నేను ఏర్పాటుచేసి పెట్టాలి. జీవనాధారం వద్దని కాదు, కానీ మనం కేవలం ఈ పరోపకార పరాయణత్వాలకే పుట్టలేదు కదా! ఆహార నిద్రా మైధునాలలోనే మనకు జీవితాలు ధన్యత గడించవు కదా! ముఖ్యంగా మధ్యతరగతి, ధనవంతుల ఆలోచనలు, చూపులు, లక్ష్యాలు గమనార్హం. దర్జాలు, దర్పాలు పెంచుకోవడమే జీవిత పరమావధి కాదు. 'పరోపకారార్ధమిదం శరీరం' అన్న దృష్టి రానంతవరకు పట్టు చీరెలు, నగలు, విలాస వస్తువుల వ్యామోహం పోదు. త్యాగం అనే రెండక్షరాలలోనే వుంది ఆత్మ స్థయిర్యం, ఆత్మ వికాసం, ఆత్మ సంతృప్తి కూడా. ఒక్క పది శాతమయినా పరోపకారానికి వెచ్చించని జీవితాలు వ్యర్థం అనేది నా ఫిలాసఫీ.

## విచిత్ర ధోరణులు, వింత మనస్తత్వాలు

నీ ముక్కున మసి వుందంటే నీ కొంగుతో తుడవమంటున్నారు ప్రజలు. సంఘ సేవ అంటే మా ఇంటి చుట్టూ తిరుగు, మా సేవ చెయ్యమంటున్నారు జనాలు. ఇలాంటి అనుభవాలు ఎన్నో వున్నాయి. ఒక పట్టణంలో చక్కెర ఫ్యాక్టరీలు వున్నాయి. వాటి మీద జనరల్ మేనేజరు వట్టి జల్సారాయుడట. ఆరోజు నైట్ డ్యూటీ వున్న ఆఫీసర్లు, వర్కర్లు ఎవరో తెలుసుకొని వాళ్ళ ఇళ్లకెళ్ళి ఆడవాళ్ళతో సాంగత్యం చేయడం, సరసాలాడటం అతనికి సరదా (హాబి). ఆడవాళ్ళు ఈ విషయాలు భర్తలతో చెబితే వాళ్ళు తమను పరిత్యజిస్తారేమో అన్న భయంతో చెప్పేవారు కాదట. తెలిసిన భర్తలు వెళ్ళి అతని పై రిపోర్టు ఇస్తే వాళ్ళని నష్టపరుస్తాడని హడలి పోతున్నారని అందువల్ల అతని ఆగడాలు మితిమీరి పోతుంటే కొందరు వర్కర్లు ఎలాగోలా హైదరాబాదులో మేనేజింగు డైరెక్టరుతో విన్నవించుకుంటే ఆ ఆఫీసర్ని మరొక ప్రాంతంలోని ఫ్యాక్టరీకి తరలించాడు. అక్కడా అదే పని కొనసాగించాడు. కనుక మీరువచ్చి పై ఆఫీసరుతో మాట్లాడి ఆ స్త్రీల మానప్రాణాలను కాపాడమని ఇద్దరు కార్యకర్తలు మళ్ళీ వచ్చి నన్ను అడిగారు. మీ ఆడవారు ఒక 20, 30 మంది ముందుకు వస్తే నేను వారికి సహాయ పడగలను అని చెప్పాను. "అది దుస్సాధ్యమండి, మా కుటుంబాలకే అపఖ్యాతి, అయినా ప్రయత్నిస్తాం' అని చెప్పి వెళ్ళారు కానీ మరలా రాలేదు. అంటే దాని అర్థం వారు శ్రమపడలేరు. ఖర్చు పెట్టలేరు సరే! నిలబడవచ్చు గదా? ఉద్యమంలో పనిచేస్తున్న పాపానికి అన్నీ నేనే చేయాలనడం మంచిది కాదేమో! అది వీలేనా? అది ఫలిస్తుందా? అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నా అసలు మన సామాజిక దృక్పథంలో మార్పు వస్తుందా? అనే మరో ప్రశ్న మళ్ళీ తయారయింది. ఇలాంటిదే మరో సంఘటన చెప్పబోతున్నాను. మురికి వాడలలోని బీద ప్రజలు డబ్బు ఖర్చు పెట్టి శుభ్రం చేయించుకోలేరు, వారికి నేర్పి వస్తే శుభ్రంగా వుంచుకుంటారని మేము వెళ్ళి బాగుచేసి వస్తే, ఆ వార్త చదివిన ఒక మహా ధనవంతురాలు "ఆ ప్రాంతాలేనా? రండి, మా ఇంటిముందు చూడండి! ఎంత గలీజుగా

వుందో, మరి మీరెందుకు పట్టించుకొని శుభ్రం చేయించరు?" అని ధీమాగా అడిగింది. "మళ్ళీ కూరలు గల్ఫ్ దేశాలకు పంపుతున్నారు. మరి మీలో స్పందన చచ్చిపోయిందా?" అని మరో ఇల్లాలు ప్రశ్నించింది.

ఇటీవల గత అయిదేళ్ళ నుండి దారి తప్పి ప్రవర్తిస్తున్న భర్తను తన ఇంటికి నేను వెళ్ళి మార్చమని ఫోనులో అడిగింది ఒకామె. అంతవరకు సబబే. కానీ నేను పనిగట్టుకొని వెళ్ళి ఫిర్యాదు చేసిన ఆమె ఇంటికి వెళ్ళి "ఏమయ్యా! నీవు బంగారంలాంటి భార్యను నిరాదరణ చేసి మరో స్త్రీతో కులుకుతున్నావట కదా" అని నేనెలా అడగాలి? నేను ఆమె ఇంటికి వెళ్ళినపుడు ఆమె కనీసం కళ్ళు తుడుచుకుంటూ ఇంట్లోకి పోయినా అపుడు ఏదో చొరవ చేసుకొని మాట్లాడగల్గుతాను. ఆ మాట ఆమెతో చెప్పాను. "నేను మానవతినండి, నేను అలా చేయలేను" అని ఆమె ఖండితంగా చెప్పింది. మరి ఎలా ఆమెకు సహాయం చేయడం? చెయ్యనందుకు నన్ను విమర్శించడం నానా మాటలు అనటం ఎందుకో?

ఇంకొక అమ్మాయి "ఏమండీ! నేను ఈ క్షణంలో నా భర్తతో విడిపోనా? త్వరగా చెప్పండి, అని ఫోనులో అడిగింది. "అమ్మా! దాంపత్యం అంత తేలికగా తెంచుకునేది కాదు. ఏదయినా వచ్చి మాట్లాడితే తగిన సలహా ఇవ్వగలను" అని చెప్పాను. "నేను ఇల్లు వదిలివచ్చే అవకాశం లేదు" అని ఆమె బదులు పలికింది. "ఈ రోజు కాకపోతే ఇంకో రోజు రండి" అన్నాను. "అదీ వీలు పడదు" అని గట్టిగా మాట్లాడింది. "పోనీ భర్త ఇంటలేనప్పుడు రారాదా అని సూచించాను. "అమ్మో! అంత పనా!" అంటూ ఫోను పెట్టేసింది..

మరో కేసు – ఒకామె భర్త మొదటి భార్యను వదిలేసి ఆమెకు లక్ష రూపాయల భరణం ఇచ్చి, ఆ దాంపత్య ఫలితంగా కలిగిన పిల్లవానిని పెంచుతున్నాడట. ఆ పిల్లవాని పెంపకం విషయంలో అతనికి, తనకూ తగాదాలు వచ్చాయట. విడిపోదాం అని భర్త అన్నాడట. తనూ అంగీకరించిందట. కాకపోతే మొదటి భార్యకు ఇచ్చినంత భరణం తనకూ ఇప్పించమని ఆమె డిమాండు. ఆమె కేసు వింటూ వుంటే ఆమెదే పొరపాటు అని నాకు తోచింది. అలా పట్టుపట్టడం తప్పు. నీ భర్త ఉదారుడు కనుక మొదటి భార్యకు ఇచ్చినంత ఇవ్వకపోయినా నీకు తగినంత ముట్ట చెపుతాడు. పైగా మొదటి భార్య వద్ద కూతురు వుంది. ఆమె పోషణ భారం వహించింది. నీకు పిల్లలు లేరు. నీవు అంత మొత్తం భరణంగా ఆశించవద్దు" అని హితవు చెప్పాను. దానికి ఆమె ఉగ్రురాలయింది. "కుటుంబ సలహా కేంద్రం" అని బోర్డు ఎందుకు పెట్టుకున్నావని ఆక్షేపణగా అడిగింది. "పోనీలే అజ్ఞానం" అని నేను మారు పలకలేదు. నెల రోజుల తరువాత ఆమె తండ్రి వచ్చి ''మా పిల్లకు భారీగానే భరణం ఇచ్చాడు ఆమె భర్త' 'అని చెప్పి వెళ్ళాడు. అప్పుడప్పుడు కొందరు భర్త పరిత్యక్తలు, భర్తృతిరస్కృతులు, భర్తృవిహీనులు

వచ్చి తమకు ఆశ్రయం, బ్రతుకు తెరువు చూపమని వస్తూ వుంటారు. వీలయితే వారికి ఏదో ఒకదారి చూపటానికి ప్రయత్నం చేస్తూ వుంటాను. కొందర్నిహోమ్సులో వుంచటానికి మాట్లాడి ఏర్పాటు చేస్తాను. అక్కడ చేరిన స్త్రీలు కనీసం వెళ్ళిపోయేటప్పుడు నాకు చెప్పకుండానే వెళ్ళిపోతూ వుంటారు. అలాగే అనేకమందికి మా వివాహవేదిక తరపున తల్లిదండ్రులు కాదని నెట్టివేసిన వారికి, విడాకులు పొందిన వారికి ప్రేమ వివాహాలు నేను బాధ్యత వహించిచేసి ఆ తర్వాత వచ్చే సమస్యలను సైతం భరిస్తూ వుంటా. కొందరయితే ఆ తర్వాత వచ్చి సుఖంగా వున్నామని కూడా చెప్పరు. నేను వారిని అడిగేది కేవలం ఒక్క ఫోటో మాత్రమే. అది కూడా ఇవ్వనివారు పిల్లాపాపలతో సుఖంగా వుంటూ కనీసం ఎప్పుడయినా రాకపోకలు, ఆఖరికి ఫోను కూడా చెయ్యనివారు లెక్కకు మిక్కుటంగా వుంటున్నారు. ఇదంతా ఎందుకంటే సమాజంలో వుండే అనాసక్తత, అజ్ఞానం, అవివేకాలే దానికి కారణం. పైగా 99 మందికి సహాయం చేసి ఒక్కరికి కాదన్నా, వారు నానా మాటలు అడిగి పైగా ఆ సుబ్బమ్మ గారు వట్టి మాటల మూటేకాని ఏ సహాయం చెయ్యరని ప్రచారం సాగిస్తారు. ఇలాగని మానుకుందామా అంటే అది సేవలో భాగంగా పరిగణిస్తేనే ఈ రంగంలో పనిచేయ్యగలమేమో! ఇలా వుంటాయి వివిధ మనస్తత్వాలు. తాముగా తమకు సహాయం చేసుకోవటానికి కాస్త కూడా ఉద్యుక్తులు కాని తరుణులు, సులభంగా అర్జంటుగా సలహాలు కోరే సతులు, అహేతుకమైన డిమాండ్లను చేసే అతివలు ఎందరో తటస్తిస్తున్నారు. కాదంటే, మరో మాటంటే "ఇదేనా మీ సంఘ సేవ" అంటూ అవహేళన చేస్తూ వుంటారు.

సంఘ సేవ చేయాలనేది ఒక ఆర్తి, ఒక బలవత్తరమైన వాంఛ. అది ఆ మనిషి యొక్క వ్యక్తిత్వంలో భాగం. నిరంతరం ఆ భావం వెన్నాడుతూనే వుంటుంది. కనుక పొగడ్తలకు తెగడ్తలకు చలించరాదని తెల్సుకున్నాను. ఒక్కసారిగా పొంగిపోవటం, కృంగిపోవటం కూడని చర్యలు. నిశ్చలంగా నిబ్బరంగా, కృత నిశ్చయంతో మంచిది అనుకున్న దానిని చేసుకుంటూ పోవడమే నాకర్తవ్యంగా భావించుకున్నాను. నాకు ఈ భావనను కలిగించి, ఈ గుణపాఠాన్ని అందించిన అమాయక స్త్రీలకు నేను సర్వదా రుణపడివున్నాను.

# 13. సినిమా ప్రపంచం

## ఫిల్మోత్సవం

టైము చాలక నానా అవస్థలు పడటం వల్ల దరిదాపు 20 ఏళ్ళుగా సినిమాలు చూడటం మానేశాను. అయినా మహిళోద్యమం పై కొన్నేళ్ళుగా పనిచేస్తూ ఉండడంవల్ల ఫిల్మోత్సవ్ 1986 జనవరిలో హైదరాబాద్ లో జరిగితే నేను స్త్రీలకు సంబంధించిన సినిమాలను చూడడం సంభవించింది. ఆ వారం అంతా వర్ధమాన దేశాల స్త్రీల సమస్యలను చిత్రించే సినిమాలను చూచి సమీక్ష చేసి పత్రికలకు, రేడియోకు పంపమని నాకు ప్రవేశ పత్రాన్ని పంపారు నిర్వాహకులు. వాటిని ఓపికగా పరిశీలించి చూచినప్పుడు నా హృదయం ఎందుకో తల్లడిల్లిపోయింది. ముఖ్యంగా బ్రెజిల్, లెబనాన్, అర్జెంటయినా, కొలంబియా, నైజీరియా, శ్రీలంక, చిలీ, చైనా దేశాల చిత్రాలన్నీ కుటుంబ పరమయినవేగాక స్త్రీల నిరాదరణ, నిరసన, ఇంటా బయటా వెట్టి చాకిరీ, అత్యాచారాలు పెక్కు రూపాల చిత్రీకరణకు సంబంధించినవి.

'నైట్ క్లబ్బుల్లో' అర్థ నగ్నంగా నృత్యం చేసే నాట్యకత్తెను పతిత అంటాం. కాని భర్త త్రాగుబోతయినందువల్ల ఆమె ఆ వృత్తిలో ఇల్లు గడిపే చిత్రం కథ 'ఇండియా కేబరా'. పాలస్తీనా, లెబనాన్ దేశాలలో యుద్ధాల్లో, విప్లవాల్లో అష్టకష్టాలు పడి త్యాగాలు చేశారు స్త్రీలు. యుద్ధాలు ముగిసాక స్త్రీ అస్వతంత్రురాలయ్యే ''లెయిలా అండ్ ఉల్వ్యున్'. ఒక భూస్వామి చెల్లెలు పాలేరును పెళ్ళాడితే ఆ భూస్వామి అతనిని చంపిస్తాడు 'ది ఫ్రెండ్సు' అనే సినిమాలో. హింసా ప్రవృత్తి, 'శాడిస్టు' స్వభావం కల ఒక దుర్మార్గుడు 'మోనికా' అనే ఒక యువతిని మానభంగం చేసి ఆమెను చిత్రహింసలు పెట్టేది చాలక తన స్నేహితులచేత రోజు ఆమెను మానభంగం చేయించేవాడు. ఆ బాధలు భరించలేక మోనికా ఆ ముగ్గురు దుర్మార్గులను ఆ గదిలోనే హత్య చేస్తుంది. 'బ్రూటల్ 'అనే ఈ చిత్రం హృదయ విదారకంగా ఉంది.

ఈ సినిమాలన్నీ మహిళా దర్శకులచేత చిత్రీకరించబడటం గొప్ప విశేషం. అయినా చిత్ర నిర్మాణంలో, మార్కెటింగులో మహిళలకు ప్రోత్సాహం ఉండటం లేదని చిత్రాల పై జరిగిన చర్చల్లో ఆరోపణ వచ్చింది. దీంట్లో నిజం లేకపోలేదు. చిత్రంలోని విలువలనుబట్టి దాని అంతస్తు నిర్ణయించాలిగాని దానిని తీసింది పురుషుడా, స్త్రీయా అనే చూపు అనారోగ్యమని, అనభిలషణీయమని నా భావం. ఏది ఏమయినా పితృస్వామ్య వ్యవస్థలో స్త్రీల దృక్పథం వేరుగా ఉంటుంది కనుక సర్వసాధారణంగా స్త్రీలే స్త్రీల చిత్రాలను సమర్ధవంతంగా నిర్మించగలరనే నా అభిప్రాయం ఈ చిత్రాలు చూచాక గట్టి పడింది.

## సినిమాల్లో నా నటనానుభవం

అది నాజీవితంలో మరో మరపురాని రోజు. ఉషాకిరణ్ మూవీస్ వారు "ఓ భార్యకథ', సినిమా తీస్తున్నారు. అందులో హీరోయిన్ జయసుధ. ఆమె ప్రేమా పటేల్ పాత్ర ధారిణి. ఒక మహిళా పత్రికను నిర్వహిస్తున్నది. ఆమెకు జర్నలిస్టు అవార్డును ఇచ్చి సన్మానించే దృశ్యాన్ని చిత్రీకరించడానికి మహిళాభ్యుదయ సంస్థను, ప్రత్యేకంగా నన్ను ఆహ్వానించారు. ప్రేమా పటేల్ ఫెమినిస్టు, తిరుగుబాటు మనస్తత్వం కలది. భర్తచేత మోసగించబడి అతన్ని వదలి పోతుంది. అలాంటి పాత్ర వుంది కనుకనే నన్ను పిలిచారు. నేనూ అంగీకరించాను. నేను ఆమెను గురించి సభలో చెప్పి, స్పెషల్ ఆఫీసర్ భార్యచేత ''ఆంధ్ర మహిళా సంఘం' పేరుతో శాలువకప్పి సన్మాన పత్రాన్ని సమర్పించే దృశ్యం చిత్రీకరించారు. నేను సినిమాలో నటించిన మొదటి ఘట్టం అది. నేను ఐదో క్లాసు చదువుతున్నప్పుడు రామదాసు నాటకంలో తానీషా పాత్రవేసి, స్త్రీ హితైషిణి వార్షికోత్సవాల్లో చెమ్కీకోటు ధరించి నటించాను. తిరిగి ఆరవ తరగతిలో హరిశ్చంద్ర నాటకంలో హరిశ్చందుడిగా నటించి పద్యాలు వగైరా చదివి స్కూల్ వార్షికోత్సవం నాడు అందరిని మెప్పించగలిగాను. సత్యవంతుడిగా, ధృవుడిగా, సక్కుబాయిగా అలా చిన్న చిన్న పాత్రలతో అంతమైన ఆ రంగం యాభయి ఏళ్ళ తర్వాత మళ్ళీ ఈనాడు ఒక సోషల్ వర్కర్ గా, ఫెమినిస్టుగా నటించి, సందేశం ఇవ్వటం ఒక విధంగా ముదావహం.

ఆ వరవడిలో, ఆ అనుభవంతో మళ్ళీ మరో అవకాశం ఇచ్చారు. అది ఒక పల్లెటూరి టీచర్ పాత్ర. ఒక బాలుడి జీవితంలో ఎన్నో తెరలు అడ్డుపడి చివరికి బ్రతుకు తెరువుకోసం పడ్డ పాట్లలో విద్యా అవకాశాలు ఎలా లభించలేదో, సమాజం, గ్రామం, స్కూలు, కుటుంబం అన్నీ. అతన్ని ఎలా అసహాయుణ్ణి చేశాయో చిత్రించే బాలల ఫిలిం అది. దాని పేరు "భద్రం కొడుకో". కుటుంబరావు గారి ఆధ్వర్యంలో చిత్రించబడ్డది ఈ చిత్రం. అందులో ఒక చిన్న పాత్ర నాది. అయినా బాలల దుర్భర శ్రమ జీవితం మీద చిత్రం కనుక దానిలో పాల్గొని నావంతు సహకారాన్ని అందించగలిగాను. ఇంకా సహనం, నల్లపూసలు, తాళికట్టిన శుభవేళ అనే సినిమాల్లో కూడా ఇలాంటి చిన్న పాత్రల్లో నటించాను.

ఈ చిత్రాలలో ఒక విచిత్రముంటుంది. కొన్ని దృశ్యాలు తీశేటప్పుడు బాగానే వుంటుంది. కాని ఎన్ని దృశ్యాలు, (ఫ్రేములు) ఎడిటింగ్ వాతపడకుండా తప్పించుకుంటాయో! ఏది ఏమయినా చిత్రంలో నటించే అవకాశం మటుకు వచ్చింది. అసలు మానవ జీవితమే ఒక నాటక రంగం. అందులో ఎన్నో పాత్రలు, వారి జీవితానుభవాలను నటన ద్వారా వెలిబుచ్చుతాయి. కొందరయితే అద్భుతంగా నటించి మెప్పించ గలుగుతారు. ఏదయినా నాభావాలకు తగ్గ పాత్రలు కనుకనే నేను భాగస్వామ్యం వహించగలిగాను.

# 14. ఆత్మ పరిశీలన

## సాహిత్యాభిరుచి

వృత్తి రీత్యా మేము బాపట్లలో వున్నప్పుడు విశ్వనాధవారు, జమ్మలమడక, పిలకా గణపతి శాస్త్రిగారు, స్వామి శివశంకర్, అయ్యంకి వెంకట రమణయ్య లాంటి సాహితీ వేత్తలు జరిపే సభలకు వెళ్ళే అవకాశం కలిగింది. రామ్మూర్తిగారికి రాజకీయాలేకాక, సాంఘిక సేవా, సంస్కరణ భావాలతోపాటు సాహిత్యాభిమానం కూడా వుండేది. బాపట్లలో సాహితీ మిత్రులు సాహిత్య లిఖిత పత్రికను నడపడం జరిగింది. ఆ పత్రికలో కొత్త రచయితలకు అవకాశం ఇచ్చి వ్రాయించేవారు. వాటిపై చర్చలు జరిపేవారు. అష్టావధానాలు, భువన విజయంలాంటి సన్నివేశాలు చూడడంవల్ల మొదట్లో కొద్ది కొద్దిగా సారస్వతాభిలాష కలిగింది. కళావని అనే నాటక సంస్థ గంగాధరరావు గారు స్థాపించారు. దానికి వారు అధ్యక్షులుగా, రామ్మూర్తిగారు సెక్రటరీగా, మరికొంతమంది సాహిత్యాభిమానుల సహకారంతో నాటకాలు వ్రాయించడం, వేయించటం, పోటీలకు పంపడం జరుగుతూ వుండేది. మా ఇంట్లో రిహార్సల్సు జరుగుతూ వుండేవి. ఆ ప్రభావం నా మీద కూడా కొంత లేకపోలేదు. ఇంకా 1960లో బాపట్ల రచయితల సంఘ స్థాపన జరిగింది. ప్రతి ఆదివారం సమావేశాలు జరిపేవాళ్ళు. పోలాప్రగడ, ఊటుకూరి, పాంచాలి,

ఆచార్యులు లాంటివారు హాజరయ్యేవారు. క్రొత్తగా కథ, పద్యం, గద్యం, వ్యాసం వ్రాసేవాళ్ళంతా తమ, రచనలు చదివి వినిపించడంవల్ల కొంతగా కొంత ఆసక్తి పెంచుకున్నాను. తద్వారా అభివృద్ధి గడించాననేది నగ్న సత్యం. మరో ముఖ్య విషయం మా అత్తగారు భారత, భాగవతాలు, పంచదశ, సీతారామాంజనేయ సంవాదం, ఆధ్యాత్మ రామాయణం, శంకర భాష్యం లాంటివి రోజూ 4, 5 గంటలు చదివి శిష్యులకు బోధించటం, వారంతా చర్చలు జరపడం, వేదాంత శ్రవణం జరపడం మా ఇంట్లో నేను కాపురానికి వెళ్ళిననాటి నుండి జరుగుతూనే వుండటంవల్ల వద్దన్నా, కాదన్నా అవి నా కర్ణకుహరాల్లోకి జారబడటంవల్ల నాలో కొంత సారస్వతాభిలాష ఆలోచనా కలిగాయి. 1935 నుండి 1940 లోపల తెలిక భాషలో క్రొవ్విలి నవలలు, జంపన కథలు ముఖ్యంగా డిటెక్టివ్ నవలలు చౌక ధరలకు లభ్యమయ్యేవి. అవి జనాన్ని చదివించేవి. సంగీత, సాహిత్య, చిత్రలేఖనాలన్నింటిలో అంతో ఇంతో అనుభవం వుంటే వారిని సారస్వత కృషీవలులంటారు. నాకు కాస్త సంగీతం ఇంకాస్త సాహిత్యం మాత్రం తెలుసు. నేను విజయవాడలో స్థిరపడ్డాక పత్రికా వగైరాలు స్థాపించాక, ఎ.ఐ.ఆర్.లో నా ప్రసంగాలు పెరిగాక, ఫిల్ము సొసైటీ అధ్యక్షురాలిగా పేరు ప్రఖ్యాతులు వచ్చాక క్రొత్త సినిమాలకు ప్రీవ్యూలకు ఆహ్వానించటం జరిగేది. ఆ మర్నాడు ఆ పిక్చర్ పై సభ పెట్టి అభిప్రాయాలు

సేకరించి చర్చలు జరిపేవాళ్ళు. పత్రికలవారు మా ఫోటోలతో సహా క్రొత్త సినిమాలు గురించి ప్రచురించేవాళ్ళు. నేను 2,3 సార్లు ఆ సినిమాలను ఘాటుగా విమర్శించటం జరిగింది. కేవలం డబ్బు సంపాదన కోసం ఆడవాళ్ళను పతి పాదదాసిగా చిత్రిస్తున్నారని, అంగాంగ ప్రదర్శనలు, రేపు సీనులు, బూతు పాటలు పెట్టి స్త్రీల మాన మర్యాదలను, వ్యక్తిత్వాన్ని వమ్ము చేస్తున్నారని ఘాటుగా కొన్ని సినిమాలను విమర్శించా. కథలో కావాలని స్త్రీని ఒక ఆట బొమ్మగా చిత్రిస్తుంటే స్త్రీలే ఆ సినిమాలను చూచి ఆనందిస్తున్నారని అన్నానని ఆ తర్వాత డైరక్టర్లూ, ప్రొడ్యూసర్లూ నన్ను ఆహ్వానించడం మానుకున్నారు. అయినా మన భావాలను మార్చుకోలేము కదా! అందువల్ల నాకు కలిగిన నష్టం ఏమీ లేదు అని నా దృఢ విశ్వాసం. ఈ తరహా అనుభవాలవల్ల ఆ తర్వాత సారస్వతాభిమానం పెరుగుతూ వచ్చిందే కాని ఏమాత్రం నశించి పోలేదనే దానికి బోలెడన్ని తార్కాణాలు వున్నాయి. ఆనాటి నా అనుభవాలే నా సాహిత్యాభిరుచికి బీజాలు అయి నాచేత సాహిత్య సృష్టి చేయించాయి.

## నాయకత్వ లక్షణాలున్నాయా?

వైవిధ్యంతో కూడిన వ్యక్తులు అప్పుడప్పుడూ తటస్థ పడుతూ వుంటారు. అంటే మీటింగులకు రావటం, ప్రశ్నలు అడగటం, సంస్థల్లో మెంబర్లుగా చేరమని చెప్పటం, స్త్రీ స్వేచ్ఛ పత్రికలో రాస్తామని అడగటం, ఉపన్యాసాలకు పిలవమనడం చాలా కాలంగా జరుగుతున్నది. వారందరికీ నామీద గౌరవం వుందా, నేను నడిపించే సంస్థల పై ఆసక్తి వుందా అనేది ఒక ఆలోచనీయాంశం. కొందరు నన్ను సర్వే చేద్దామని వస్తారు, లోపాలు గమనిద్దామని మరికొందరూ, ఏదయినా నేర్చుకుందామని కొందరు వచ్చి ఏదీ చెయ్య లేక, ఇమడలేక పోతారు. కారణం తమకు వెంటనే పేరు ప్రతిష్టలు రావడం లేదని బాధ. నేను వారికంటే ఎందులో గొప్ప, తను తక్కువేమిటి అనే 'ఇన్ ఫీరియారిటి కాంప్లెక్సు' కలిసి వారిలో పనిచేసే సహనం నశిస్తుంది. అయినా ఇన్ని అవధులను దాటివచ్చి పనిచేసే వారు కొందరు కలిసి పనిచేస్తూనే వున్నారు.

అసలు నాయకత్వ లక్షణాలు నాలో లోపించడంవల్లనా లేక సంఘీభావం చిన్నప్పటినుండి వ్యక్తుల్లో కొరవడటం వల్లా, భావ సామీప్యం లేనందువల్లా, సంస్థల్లో క్రియాశీల సభ్యులు పెరగటం లేదనే సందేహం నన్ను పీడిస్తున్నది. అసలు పది మందినీ కలుపుకోగల శక్తి, పనిచేయించగల సత్తా నాకు లేదేమో! నాయకత్వమంటే అందరినీ ఒకేలా చూడటం, అందరికీ తలలో నాలుకలా, గౌరవ ప్రదంగా సంచరించగల సమర్ధత ఆర్గనైజరుకు వుండాలి. తాను ముందుగా శ్రమపడి చేస్తూ వారిలో ఉత్సాహాన్ని, ఆసక్తిని, కార్యదీక్షతను కలిగించాలి. సభ్యులందరి సమస్యలను వారి వారి ఆలోచనలను పరిగణించి, వారికి మన సహాయ సహకారాలు అందివ్వగలగాలి. వారిలో ఒకరై వారిచేత

మన్ననలనంది, వారిని కార్యోన్ముఖులను చేయగలగాలి. ఆ శక్తి సామర్థ్యాలు కొందరికే వుంటాయి. నాపట్ల అవి లోపించాయని చెప్పుకోటానికి బాధ అయినా చెప్పక తప్పదు. అందువల్ల బరువు, బాధ్యతలు హెచ్చు భాగం నేనే భరించక తప్పటం లేదు. నా తర్వాతనయినా నాపది సంస్థల నిర్వహణ భారాన్ని మోసేవారు వున్నారా అని ప్రశ్నించుకున్నప్పుడు వస్తారని ఆశగల ఆశావాదిని నేను. ఒకవేళ రాకపోయినా బాధలేదు. నా జీవితంలో ఏమి చేశాను. ఏమి సాధించాననేదే నాకు తృప్తి నిస్తుంది. అసలు ఈ సంస్థలు స్థాపించమని, నా ఆస్తి, నా ఇల్లు ఇచ్చి చాకిరీ చేయమని నన్ను ఏఒక్కరూ అడగలేదు, బలవంతపెట్టలేదు. ఆ మహత్కార్యానికి మరొకరికి బాధ్యతా లేదు, బంధమూ లేదు. పైగా ఎవరో వచ్చి నాతోగాని, నా తర్వాత కాని చేస్తారని యోచించి స్థాపించలేదు. అందువల్ల తరువాత ఆలోచన నా తరువాత వారిది కాని నాది కాదు. ఒక్కమాటగా చెప్పాలంటే అందరూ అన్ని రంగాలలో ఉద్ధండులు కావటం కష్టం. కొందరు సంస్థలు నిర్మించగలరు; కొందరు పైకాన్ని వసూలు చెయ్యగలరు.

మరికొందరు కార్యభారాన్ని మోయగలరు. వారి వారి వైఖరిని బట్టి వుంటాయి. ప్రతి మనిషిలో కొంత మాత్రమే మంచి గోచరిస్తుంది. నాయకత్వం విషయమై నాకున్న సందేహాల చర్చ చదువరులకే వదిలివేస్తున్నాను.

## విస్మరించలేని నాలోని లోపాలు

ప్రతి మనిషిలోనూ కొన్ని మంచి, కొన్ని చెడు లక్షణాలు వుంటాయి. ఏ మనిషీ పరిపూర్ణ వ్యక్తి కాలేదు. కాని తన లోపాలను గ్రహించి సరిదిద్దుకో గలిగిన వ్యక్తి ఉన్నతుడు కాగలడు. తెలిసో తెలియకో ప్రతి ఒక్కరం ఎన్నో పొరపాట్లు చేస్తాం. అది మానవ సహజం. అలాగే నాలో కూడ కొన్ని లోపాలు వున్నాయి. పాపం పోవటం అనే దానిలో నాకు నమ్మకం లేకపోయినా నాలోని లోపాలు చెప్పుకుంటే కొంతవరకు మానసిక భారం తగ్గవచ్చు.

ఒక వ్యక్తి చేసే కొన్ని పొరపాట్లు, ఆమెకు వున్న దురుద్దేశ్యాలు, స్వార్థాలు మరో మనిషిని కొంతకాలం బాధిస్తాయి. మరికొన్ని అవతల వారిని కడదాకా వేధిస్తూనే ఉంటాయి. ఇది ఒక చర్యకు ప్రతిచర్య. అంటే నడవడి వల్ల మూర్ఖత్వం వల్ల, తత్సంబంధితులు రెండు విధాల బాధపడతారు. అంటే తాత్కాలికంగా బాధించేవి కొన్ని, అనాలోచితంగానో, ఆలోచించియో లేక నాస్వార్థం వల్లనో బాధవల్లనో మరికొన్ని. నావల్ల బాధపడింది చాలా దగ్గరవారు, నా శ్రేయస్సు కోసం త్యాగం చేసినవారు అయిన నాభర్త రామ్మూర్తిగారు, మా అత్తగారు. నావల్ల జరిగిన తప్పుకు వారిద్దరూ శిక్ష అనుభవించారు.

మొదటినుండీ రామ్మూర్తిగారు తన జీవితాన్ని సమాజ సంక్షేమానికి, దేశ శ్రేయస్సుకు వినియోగిద్దామనే లక్ష్యం కలిగిన ఉన్నత వ్యక్తి. అలాంటి ఆ మనిషిని మామూలు వ్యక్తిగా ఎంచి వివాహం చేశారు వారి తల్లిదండ్రులు. ఆ తర్వాత నేను కూడా ఆయనను మామూలు వ్యక్తిగానే భావించి కుటుంబ జీవితానికి, సంపాదనకు అంకితమయ్యేలా చేశాను. నాకప్పటికి సామాజిక సృహ లేనందువల్ల అలా జరిగింది. పెళ్ళాడిన నేరానికి ఇద్దరు పిల్లలతో సరి పెట్టుకుందామని ఆయన అన్నా నేను నలుగురిని కన్నాను. అధికమైన వ్యయ ప్రయాసలకు లోనుచేసి కేవలం నాకోసం, పిల్లలకోసం నేను ఆయన్ను వాడుకున్నాను అనే అశాంతి నన్ను దహించి వేస్తూనే వుంది. నాకు జ్ఞానోదయం అయ్యేటప్పటికి సమయం మించిపోయింది. అలా ఆయన జీవితంలో అర్ధభాగం వ్యర్ధమయిపోయింది. అప్పటికీ ఆయన తన భావాలను చంపుకోకుండా యధోచిత సేవ చేసి ధన్యత గడించారు. ఆ తర్వాత ఇద్దరం కలిసి చేస్తున్నాం. కానీ జరిగిన నష్టాన్ని ఎవరూ పూరించలేరు కదా! " గతం నాస్తి నకర్తవ్యం" అన్నారు. ఆనాటి నా పరిధి అంతవరకే. నాకెవ్వరూ సామాజిక స్పృహను కలిగించకపోవడమే దానికి కారణం. అందరినీ సర్వసంగ పరిత్యాగం చేయమంటే చెయ్యగలరా? ఆ మహా పరిత్యాగం గౌతమ బుద్ధుడే చేయగలిగాడు. పరుల కోసం బతికే వారిని శాసించటం, బాధించటం, ముఖ్యంగా దేశానికి, సమాజానికి ఉపయోగపడాల్సిన వ్యక్తిని నాకూ, నా కుటుంబానికి పరిమితం చేయటం నేరం. అసలు సామాజిక స్పృహ వున్నవాళ్ళే అతి తక్కువ. అలాంటివారిని వేళ్ళమీద లెక్కించవచ్చు. అత్యల్ప సంఖ్యలో వున్న అలాంటి వ్యక్తులకు అవకాశం ఇవ్వకపోవడం నిజంగా చెప్పాలంటే అదొక సామాజిక ద్రోహం. అలాంటి ద్రోహం నేను చేశాననే బాధ నాలో జిజ్ఞాస కలిగినప్పటినుండి పడుతూనే వున్నా. ఏది ఏమైనా తెలిసో తెలియకో నేచేసిన అలాంటి నష్టానికి పరిహారం లేదు.

అలాంటిదే మరో ద్రోహం నావల్ల జరిగిందని నాకు తెలుసు. అది మా అత్తగారి పట్ల. ఆమె నాకోసం ఎంతో త్యాగం చేసింది. చాకిరీ చేసింది. ఆస్తిపాస్తులందించింది. మంచిగా చూచేది. ఇన్ని మంచి లక్షణాలు వున్న ఆమెలో ఒకే ఒక లోపం వుంది. చాలా నస పెట్టి సాధిస్తూనే వుండేది. ఇంకా మెదిలితే బిగుసుకుపోయి మాట్లాడేది కాదు. ఆమాత్రం సహించలేక పోవటం నా కించితత్వానికి నిదర్శనం. ఆమె వయస్సు మళ్ళాక, భర్త పోయాక పది సంవత్సరాలు పూర్తిగా నా వశమయింది. బ్రాహ్మలకు, వేదాంతులకు ధర్మం చేసి పుణ్యం సంపాదించుకోవాలనే ధ్యాస ఆమెకు అంతిమ దశదాకా వుండేది. అలా ఎంతోకాలం చేసిన అలవాటు ప్రకారం యాచకులు రాగానే 'అమ్మా 10 రూపాయలు ఇవ్వు' అనేది. నాకు చెడ్డకోపం వచ్చేది. ఇంతకాలం ఇచ్చిన దానాలు, సంపాదించుకున్న పుణ్యం చాలదా అని బాధపడుతూ కోపంగా ఇచ్చేదాన్ని. ఆమె తన డబ్బంతా నాకిచ్చి నన్ను పదో పరకో అడిగితే అదేదో మహా త్యాగంలా చూచేదాన్ని.

అది మానవ నైజమో, లోభమో! ఏమైనప్పటికీ నా కిప్పటికీ తలచుకుంటే ఆదృశ్యం కళ్ళకు కట్టినట్టుగా, నాగుండెను మెలి పెడుతూనే వుంటుంది. పరోక్షంగా ఆమె మరణానికి నేనే బాధ్యురాలినేమో అనిపిస్తుంది. చట్టపరంగా దానికి శిక్ష లేపోయినా, నైతికంగా నాలో నేను కుమిలిపోతూ వున్నాను.

ఆమె పోయేనాటికి 18 ఏళ్ళు నిండాయి. ఆమె మంచాన పడ్డప్పుడు సేవ చేయలేక ఇతరపనుల వత్తిడివల్ల విసిగి వేసారి పోయాను. అప్పటికి 40 ఏళ్ళు అసిస్టెంటుగా, కోడలిగా భయ భక్తులతో ఆమె అధికారానికి లోబడి సేవ చేశాను, చాకిరీ చేశాను. ఇంక విసిగి వేసారిపోయింది నా ప్రాణం. ఆమె త్వరగా చనిపోతే బాగుండును అని కూడా ఒక్కోసారి అనిపించేది. శ్రద్ధగా పోషణ, ప్రేమ, గౌరవం, మంచిమాట, ఆదరణ అన్నీ నాలో నశించిపోయాయి. ఏదో అంతో ఇంతో పెట్టడమే కాని రాను రాను ఆమెను బ్రతికించుకోవాలనే ఆకాంక్ష తగ్గిపోయింది. నేను తప్ప ఆమెకు మరెవ్వరూ లేరు. పెట్టానో, తిట్టానో అడిగేవాళ్ళు లేరు. అపేక్ష వున్నా నన్ను నమ్మి కొడుకు పట్టించుకునేవారు కాదు. కాకపోతే మలమూత్రాలు శుభ్రం చేసేవారు. అదైనా నేను అసహ్యించు కుంటానని. ఏది ఏమయినా సర్వశక్తులు ఉడిగి నా చేతుల్లో చిక్కాక నేనే ఆమె సమాధికి కారణం అయ్యానేమో! అలా నా స్వార్థానికి బలి అయిన ఆమె నన్ను శిక్షించకపోయినా నామనస్సే నన్ను నేటికీ పీడిస్తూనే వుంది. ఏం చేసేది, నాకూ శక్తి తగ్గింది. ఉద్యమాలు, పత్రిక, సేవా కార్యక్రమాల బాధ్యతలు పెరిగినందువల్ల నాలో సహనం చచ్చిపోయింది.

ఈ సందర్భంగా నాలో వున్న మరో రెండు దుర్లక్షణాలను చెప్పదలిచాను. మొదటిది అవతలి వ్యక్తిలోని లోపాలను బాగా పరిశీలించటం నాలో హెచ్చుగా వుంటుంది. ఇతరులలో మంచిని మాత్రమే చూసి చెడును వదిలెయ్యమని ప్రతి నూతన సంవత్సరం ప్రమాణం చెయ్యటం, తర్వాత విస్మరించడం జరుగుతూనే వుంది. నా మరో చెడ్డ అలవాటువల్ల నేను, నా ఆత్మీయులు అందరూ బాధపడుతూనే వున్నాం. అదేమిటంటే నాకేదైనా సహాయంగాని, వస్తువులు కావాలంటే ఎవరినీ అడగటానికి నోరు రాదు. నా అవసరాన్ని కనుక్కొని వాళ్ళే చెయ్యాలని మాత్రం బాగా వుంటుంది. అలా వాళ్ళు చెయ్యకపోతే తల్లడిల్లిపోతా. పోనీ ఈపని చెయ్యమని అడగను. ఏ కారణంగానైనా వాళ్ళు కాదంటే ఇక జన్మలో అడగలేని దురభిమానం కలదాన్ని. అడక్కుండా చెయ్య లేదనే అసహనం ఒకటి. అడిగితే వాళ్ళకు చాతకాక చేయలేక పోయినా, ఇష్టం లేక చేయలేకపోయినా చాలా కాలం వరకు పరితపించటం, ఈ రెండూ నా వ్యక్తిత్వానికి తగని లక్షణాలు అని తెలుసు నాకు. ఇంత చిన్న చిన్న విషయాలను సీరియస్ గా తీసుకోవటం నాబోటి వారి హోదాకు తగదని తెలిసినా ఈ లక్షణాన్ని మార్చుకోలేక పోతున్నాను. అందుకే పుర్రెతో పుట్టిన బుద్ధి పుడకలతో గాని పోదు అంటాము. మొత్తంమీద నాకు విశాల హృదయం లేదు. అసహనం లేకపోలేదు. నేను నేర్చుకోవాల్సిన మంచి

లక్షణాలు ఎన్నో మిగిలిపోయాయి. తర్వాత మరో కించితత్వం నాలో చోటు చేసుకున్నది. కొన్ని రకాలైన సహాయాలు కొంత మందికి చేస్తూ వుంటా. వాటివల్ల వారు ఎంతో అంత లాభం పొందుతూ వుంటారు. అంతవరకూ నాకు సంతోషమే. కానీ వారు నాకు కృతజ్ఞత చెప్పలేదని, పని అయిపోయాక నన్ను విస్మరించారని అనుకుంటూ వుంటాను. కుడిచెయ్యి చేసిన సహాయం ఎడమ చేతికి తెలియకూడదనే సూక్తిని నమ్మినప్పుడు ఆ భావం నాకెందుకు రావాలి. ఇష్ట పూర్వకంగా చేసిన పని త్యాగంకాని, ప్రతి ఫలాపేక్ష కాదు కదా! ఈ దుర్లక్షణాలను ఎంత తరిమి కొట్టినా పూర్తిగా నశించటం లేదని నాకు తెలుసు. ప్రతి నూతన సంవత్సరం విశాల హృదయంతో, ఉదాత్త భావాలతో జీవిత రధాన్ని నడిపిస్తానని ఎన్ని ప్రతినలు తీసుకుంటూ, డైరీలో రాస్తాను. కాని ఎప్పుడో అప్పుడు, ఎక్కడో అక్కడ పప్పులో కాలువేసి పడిపోతుంటా. అయ్యో అనుకొని బాధపడుతూ వుంటా. ఏనాటికయినా పరిపూర్ణ వ్యక్తిని అవుతానో లేదో అనే నిరాశ నన్ను చుట్టుముట్టి వేధిస్తూనే వుంది. ఆ విధి నిర్వహణకై ప్రయత్నం సాగుతునే వుంది. ఉన్నతోన్నత వ్యక్తిని కావాలనే ఆసక్తి, రాగ ద్వేషాలకు అతీతంగా జీవించాలనే నాదీర్ఘకాల కోర్కె ఫలించ లేదంటే నాలో చిత్తశుద్ధి లేదేమో! ఒక వ్యక్తి తన వ్యక్తిత్వాన్ని మలుచుకోవాలంటే అది తనమీదనే ఆధార పడివుంటుంది కాని సమాజం, దేశం, వ్యక్తులు అడ్డు వచ్చారని వాదు వేయటం అపభ్రంశమని తెలుసుకొన్నాను. కనుక మార్చుకోగలననే ఆశ ఇంకా వుంది.

# భాగం – IX

# కృతజ్ఞత

# 1. నా వెన్నుతట్టి లేపిన ఆ మహిమాన్వితుడు

"మిమ్మల్ని ఇంత మహోన్నత ఉద్యమానికి పురిగొల్పి, మీకు వెన్ను తట్టిన ఆ మహా మనీషి ఎవరమ్మా" అన్న ఒక సాహితీ వేత్త ప్రశ్నకు ఆ మహనీయుని గురించి వివరించటం నా విధ్యుక్త ధర్మంగా భావించి విన్నవించుకుంటున్నాను.

అది 54 ఏళ్ళ అనుబంధం. విడతీయరాని భవ బంధం. అందులో ఎన్నో కలతలు రావచ్చు, కొట్లాటలు జరగవచ్చు, విడివడిపోదాం అనేదాక పోవచ్చు, మాటలు మూగ పోవచ్చు, ఉపవాసాలు వుండవచ్చు, ఒకటేమిటి నాటినుండి నేటివరకు ఎన్నో సుఖాలు, మరెన్నో పేచీలు, ఇంకెన్నో చికాకులు వచ్చాయి. అవి దాంపత్య జీవితంలో అందరికి వచ్చిపోయే సుడిగుండాల లాంటివే. అవి రాకపోతే అది అసలు దాంపత్య జీవితమే కాదేమో! షడ్రుచులలో చేదుకూడా వున్నట్లు. కాకరకాయ ఎంతో చేదు అయినా ఇష్టపడని వారు లేరు కదా!

నా జీవిత నౌక నడకలో ఒక నిస్వార్థ, స్త్రీ విమోచనోద్యమ అభిమాని అయిన పురుషుడు నా జీవిత భాగస్వామి కావటం నా అదృష్టం అనక తప్పదు. నన్ను చూసి అసూయపడే స్త్రీలు ఎందరో వున్నారని నాకు తెలుసు. అది వారి నిజమయిన ఆవేదనే కాని కుళ్ళు మాత్రం కాదు. తమకు రామ్మూర్తిగారి లాంటి భర్త లభిస్తే, అంతటి సహాయ సహకారాలు తమ భర్తలు తమకు అందిస్తూ వుంటే తామూ నాకంటే గొప్ప సేవాధురీణులు అవగలమని, రచయితలుగా తయారయ్యే వారమని వారి తపన. అది నిజం కూడాను. సర్వ సాధారణంగా ఉద్యమాలు నడిపినా, సంస్థలు స్థాపించినా, రాజకీయ పార్టీలు, సభలు, సమావేశాలు లాంటి ఏ రంగంలోనైనా పురుషులే సారధ్యం వహించటం జరుగుతుంది. ఆఖరికి ఉద్యోగాల్లో సైతం తామే గొప్ప పదవిలో వుండాలని వాంఛిస్తారు. వివాహంలో, విద్యలో, కుటుంబ నిర్వహణలో, సంతానం పై యాజ మాన్యం ఒకటేమిటి సర్వ రంగాలలో ఆధిక్యత అంతా పురుషులదే. ఇక పేరు ప్రతిష్టలన్నీ తమకే దక్కాలని, గౌరవాలు, మన్ననలు, సత్కారాలు తమ పరం కావాలనే వాంఛ పురుషులలో ప్రబలంగా వుంటుంది. తాము అధిపతులుగా వుండాలనే ధ్యేయం, పట్టుదల పురుషులకు అత్యధికంగా వుంటుంది. స్త్రీలలో కూడా తాము తక్కువ అనే భావం అంతర్లీనంగా వుంటుంది అనేది పచ్చి నిజం. స్త్రీలు ఉద్యమాలలో, ఊరేగింపులలో, ప్రదర్శనలలో, తిరుగుబాట్లలో ముందుగా వుండి పోరాటాలు సాగిస్తారు. తీరా విజయాలు సాధించాక స్త్రీలను వంట ఇళ్ళలోకి నెట్టి పురుషులు ప్రముఖ స్థానాలు పొందుతూ వుంటారు. అందుకే ప్రతిగొప్ప వ్యక్తి వెనుక ఒక త్యాగశీలి అయిన స్త్రీ వుంటుంది అనేది ఒక నానుడి. అది అక్షరాలా నిజం. వారు తమ వ్యక్తిత్వాన్ని, త్యాగాన్ని, కీర్తి ప్రతిష్ఠలను చంపుకొని భర్తలను సుప్రసిద్ధులను చేస్తారు. ఆఖరికి రాజకీయాలలో కూడా ముఖ్య భూమికలు – అంటే మంత్రిపదవులకు, అసెంబ్లీ, పార్లమెంటు స్థానాలకు పురుషులే అర్హులు అనే నమ్మకంతో

స్త్రీలు వాటి జోలికి పోరు. ఇదంతా జరుగుతున్న రాజకీయ గాథ. చరిత్ర; నిజమైన కథ. అందరికీ తెలిసిన నిత్య సత్యం. ఇది తరతరాల స్త్రీల పరాజయ గాథ.

ఈ సిద్ధాంతం, ఆచరణ రామ్మూర్తిగారి విషయంలో విభేదిస్తుంది. ఆయన దృష్టిలో మంచిపని ఎవరు చేసినా సహాయ పడాలి. వారిని ప్రోత్సహ పరచాలనే తపన ఆయనకు వెన్నతో పెట్టిన విద్య. పుట్టుకతో వచ్చిన సహజ లక్షణం. ఆయన తన భార్యగా నేను చేసే పనిమీద అభిమానంతో మహిళోద్యమాన్ని బలపరచటం లేదని నాకు మాత్రమే తెలుసు. సామాజికాభ్యుదయానికి మహిళాభ్యుదయం అవసరమనే ధ్యేయంతో ఈ పనిచేస్తున్నారు. అంతేకాదు అస్థవ్యస్థంగా వున్న ఈనాటి వ్యవస్థ మారాలని నమ్మే వారిలో రామ్మూర్తిగారు ఒకరు. ముఖ్యంగా మార్పు రావాలంటే సమాజంలో సగ భాగమయిన స్త్రీలు మారనిదే అసలైన మార్పు రాదని వారి వాదన. అందువల్ల అజ్ఞానంతో, అవిద్యతో కొట్టు మిట్టాడుతూ నిద్రాణమై వున్న మహిళాలోకానికి జాగృతి, చైతన్యం కలిగించాలని, తద్వారా జాతి అభివృద్ధి, దేశాభ్యుదయాన్ని సాధించాలని ఆయన ఆవేదన. అది హ్యూమనిస్టు ఫిలాసఫీలో ముఖ్య భూమిక. ఆయన పక్కా ప్రజాస్వామిక వాది. నన్ను ఇలా చేయి, అలా వుండు అని ఏనాడూ శాసించి ఎరుగరు. తన నడవడి వల్లా, నైతిక శక్తివల్ల ధీశక్తివల్ల త్యాగం వల్ల, ప్రక్కవారిని ప్రతిభావంతులుగా మలచగల మహా మనీషి అని ప్రస్తుతించటం అతిశయోక్తి కాదు. ఆయన సాహచర్యం వల్ల ఆకర్షించబడ్డ నేను సహ కార్యకర్తగా మారాను కాని, ఆయన నన్ను హేతువాదిగా, హ్యూమనిస్టుగా, మహిళా కార్యకర్తగా, రచయితగా వుండి పని చేయమని ఏనాడూ ఆదేశించలేదు. అలా పోరాడి, భయ పెట్టి ఈ పనులన్నీ నాచేత చేయిస్తే ఇంతకాలం ఇన్ని పనులు ఇంతటి అంకిత భావంతో అకుంఠిత దీక్షతో చేసేదాన్ని కాదు. నా ఇష్టపూర్వకంగా సనాతన భావాలు విడనాడి ఆధునిక విధానాలలో పయనించే దాన్నీ కాదు. నాలో మార్పు వచ్చాక ఆయన నాకు తనపూర్తి సహాయాన్ని, విద్వత్తును, ధనాన్ని, కాలాన్ని వినియోగించి పరహితార్థం కొరకు ముఖ్యంగా మహిళోద్ధరణకు సేవా దృక్పథంతో తన సహాయ సహకారాల్ని అందిస్తున్నారు.

"ఎలాగూ ఆమె మహిళోద్యమాన్ని నెత్తిన వేసుకొని చేస్తున్నది కదా!.ఒక హ్యూమనిస్టుగా నేను కోరేది కూడా అదే కదా! "అని ఆయన భావం. ప్రతి పురుషుని వెనక ఒక స్త్రీ వుంటుంది కదా! అలాగే ప్రతి మహోన్నత వ్యక్తి అయిన స్త్రీ వెనక పురుషుడు వుండి సహాయం చేస్తే తప్పేమిటి?" అనే దృష్టితో ఆమెకు తోడ్పడుదాం అని నిర్ణయించుకున్నారు. అదీగాక మహోద్యమమయిన ఈ మహిళోద్యమానికి ఒకరిద్దరు కృషి చేస్తే సరిపోయ్యే విషయం కాదు అనే ధ్యేయంతోనే ఈ నా కార్యక్రమాలన్నింటిలో ఆయన విశేష పాత్ర వహించటం జరిగింది. అలా గత నలభై ఏళ్ళుగా ఇద్దరం కలిసి చేస్తున్నాం. ఇంకా ఒక్క మాటలో చెప్పాలంటే నన్ను్ ప్రాజెక్టు' చేసి తాను వెనక వుండి

తన సర్వశక్తులూ ధారపోయటం రామ్మూర్తిగారి ప్రత్యేక విశిష్టత. అదీ ఇదీ అననేల ఆయన నిర్వహించని పాత్ర లేదు. చేయని పనిలేదు. అంతే కాదు పూర్తికాలం వినియోగించే నిమిత్తం ప్లీడరు వృత్తి మాని, ఆదాయాన్ని సహితం లెక్క చేయక కాలం, ధనం, శ్రమ నా పది సంస్థల అభివృద్ధికి వినియోగిస్తున్న మహా మహిమాన్వితుడు. మానవతావాది, అఖిల భారత రాడికల్ హ్యూమనిస్టు సంఘ మాజీ అధ్యక్షుడు, అఖిల భారత హేతువాద సంఘ ఛైర్మన్, పి.యు.సి.యల్. లీడరు అయిన రామ్మూర్తిగారి రుణం తీరేది కాదు. అది అక్షరాలతో వర్ణించేది అసలే కాదు. అదే అలాంటి రామ్మూర్తిగారే నా వెన్ను తట్టి ఇంతటి మహెూద్యమానికి నన్ను అంకితం చేసిన మహా పురుషులు అని వేరే చెప్పాల్సిన పని లేదు.

# 2. రామ్మూర్తిగారి వ్యక్తి చిత్రణ

ఏ మనిషీ పరిపూర్ణ మానవుడు కాలేడు. అది మానవ లక్షణం. ప్రకృతి ధర్మంకూడా. మంచి చెడూ రెండింటి సమ్మిశ్రమమే మానవాళి. దుర్మార్గ ప్రవృత్తి హెచ్చుగా వున్నవారిని దానవులని, సన్మార్గ ప్రవృత్తి అధికంగా కలవారిని దేవతలని వర్ణిస్తాం. ఆ దృష్టితో ఆలోచిస్తే రామ్మూర్తిగారిలో లోపాలు లేకపోలేదు.

ముమ్ముందుగా నన్ను ఒక మానవవాదిగా, హేతువాదిగా, మహిళోద్యమ కార్యకర్తగా, సంఘ సేవాభిలాషిణిగా మార్చే ప్రయత్నం చెయ్యకపోవటం పెద్ద లోపం. వినకపోతే అది నాలోపం అనాలి. వినని వారి కథలెన్నో వుండవచ్చు. నా అంతట నేను ఆలోచించి ఆ వూబిలోంచి బైట పడేటప్పటికి పుణ్యకాలం గడిచి పోయిందనే వ్యధ నన్ను ఆజన్మాంతం వెన్నాడుతూనే వుంది. నన్ను కుటుంబానికి బలి చేశారేమోననే బాధకూడా లేకపోలేదు. రామ్మూర్తిగారికి అంతో, ఇంతో ఆలోచన వుంది, విజ్ఞానం వున్నది, దృఢ సంకల్పం వున్నది. తార్కికంగా ఆలోచించగల మేధస్సు వుంది. శర పరంపరగా వ్రాయగల శక్తి వుంది. ఎవరో పోరాడి, వెంటపడి తరిమి నానా హంగామా చేస్తే గాని వ్రాసే అలవాటు లేదు. ఆంధ్రోద్యమ చరిత్ర, తదితర గ్రంధాలు అతి కష్టం మీద వెలువడ్డాయన్నది అక్షరాల నిజం. ఏ ఉద్యమం చేపట్టినా ఏదో కారణంతో మధ్యలో వదిలేయడం మరో లక్షణం. రాడికల్ హ్యూమనిస్టు ఉద్యమం, హేతువాద, జనతంత్ర సమాజ్, పి.యు.సి.యల్., పార్టీ రహితం, సెక్యులరిజం లాంటి అనేక నేషనల్ ఉద్యమాలన్నీ చేసిచేసి వదిలేయడం ఆయన దృష్టిలో అతి తేలిక. అలాగే స్థానిక కార్యక్రమాలు స్కూల్ మేనేజర్, బ్యాంకు డైరెక్టర్, బార్ అసోషియేషన్ ప్రెసిడెంట్, రోటరీ పదవులు ఒకటేమిటి ఆఖరికి 'పోర్టు వెల్ ఫేరు' (సూర్యలంక) 'ఓల్డ్ బాయిస్', నాటక కళా సమితి సెక్రటరీ ఏదీ పూర్తిగా జీవిత భాగంగా చేసిన పాపాన పోలేదు. ఇలా చెప్పుకుంటూ పోవాలంటే ఇంటర్ నేషనల్ నుండి తాలూకా కుటుంబ నియంత్రణ కమిటీ వరకు చెయ్యని పని లేదు, చేపట్టని కార్యక్రమం, చేయలేని పని లేదు, నిలబడ్డ సంస్థ లేదు. ఎలక్షన్లు వస్తే పార్లమెంటుకు పోటీ చేసి ఓడిపోయినారు. బాధ లేదు. కాని ఏచిన్న పదవిలో నిలబడి ఇమడలేక పోవటం, మరొకరికి చెయ్యటం, మధ్యలో మానుకోవటం, చేసినంత కాలం అసిధారా వ్రతంలా చెయ్యటం ఆయన పద్ధతి. నాయకత్వ లక్షణాలు అసలే లేవు. ఒక్క పైసా అయినా వసూలు చెయ్యలేని లక్షణం ఆయన ప్రత్యేకత. అసలు ప్రతి రంగంలో, కార్యక్రమంలో ఎవరికో ఒకరికి నాయకత్వం అంటగట్టి వెనకనుండి పూర్తి సహాయం, చాకిరీ– అదయినా నూరుపాళ్ళు కమిట్ మెంట్ తో చెయ్యటం ఆయన నైజం. కీర్తి దాహం లేదు, ధన వ్యామోహం లేదు, పదవీ వ్యామోహం లేదు కాని, తన జీవితంలో ఇది సాధించానని చెప్పుకునే ఘనకార్యం లేదే అని నా బాధ. అన్ని హంగులూ వున్న మనిషి మరెంతో పేరు ప్రఖ్యాతులు గడించగల సామర్థ్యం వుండి, ఎవరికో సాయ

పడటం తప్ప తనకంటూ ఏమీ మిగుల్చుకోలేదు. పోనీ నేను సాయం చేయించుకోకుండా వూరుకుంటే అప్పుడయినా తనకోసం చేసుకుంటారని మానుకొని పరిశీలించా. షరా మామూలే. ఎవరో రావటం, ఏదో చేయించుకొని పోవటం జరిగేది. ఇక నా సంస్థలయినా బాగుపడతాయని నేనే తన సహాయాన్ని పూర్తిగా తీసుకోవటం గత 15 ఏళ్ళుగా జరుగుతున్న నగ్న సత్యం. ఇలాంటి అండదండలు నాటి నుండి నేటివరకు అందిస్తూనే వున్నారు. ముఖ్యంగా ముక్కు సూటిగా పోవటం ఆయనకు అలవాటు. నమ్మిన సిద్ధాంతాలను పాటించటంలో వెనుకంజ లేదు. బంధువులయినా, పిల్లలయినా, నేనయినా మా పొరపాట్లను, లోపాలను వెలికి తీసి ముఖాన్నే చెప్పటం ఒక విధంగా మంచిదే అయినా చేదు నిజాలను స్వీకరించగల సహనం అవతలి వ్యక్తిలో వుండాలి గదా! అందువల్ల ఆయన మీద గౌరవం వున్నా అనేకమంది ఆయనకు దూరమయి పోతున్నారేమో అనిపిస్తుంది. అయినా ఆయన సహించగలరు. ముఖ ప్రీతి మాటలు, పొగడ్తలు, భట్రాజీయం ఆయన 'డిక్షనరీలో లేనే లేవు. ఎవరిమీద అయినా ఆయనకు సదభిప్రాయం ఏర్పడితే, కృతజ్ఞతాభావం ఆయన మనస్సులో మెదిలితే వాటిని బహిర్గతపరిచే సద్గుణమూ ఉంది. తను పొరపాటు చేస్తే క్షమాపణ కోరే స్వభావమూ వుంది. అయితే మరీ సన్నిహితులకు పదే పదే కృతజ్ఞతలు చెప్పటం ఆయనకు అలవాటు లేదు. నిర్మొహమాటం, నిష్పక్షపాతం వుండటం వల్లనే సహచరుల గౌరవాన్ని పొందుతున్నారు కాని ప్రేమాభిమానాలు పొందలేకున్నారు.

అవతలి వ్యక్తిలోని దుర్గుణాలను విడిచి సద్గుణాలను శ్లాఘించగల సహృదయంగల వ్యక్తి రామ్మూర్తిగారు. అయితే అవినీతి పరుడితో, అబద్ధీకుడితో, స్వార్థపరునితో మనస్సు విప్పి మాట్లాడ లేని బలహీనత కూడా వుంది. చాతనయినంత వరకు ఇతరులకు సహాయ పడటం అనే తన లక్షణం గత యాభై ఏళ్ళుగా గమనిస్తూనే వున్నాను. నాకంటే నూరు రెట్లు త్యాగ లక్షణం రామ్మూర్తిగారిలో వుందనేది నిజం. కష్టాల్లో వున్న వారిని దయగా చూడటం, స్పందించటం సహాయం చెయ్యటం వారిని చూచి ద్రవించడం, ఆదుకోవటం ఆయన సహజ లక్షణాలు. బాధ్యతలను విస్మరించని నిక్కచ్చి మనిషి న్యాయవాద వృత్తిలో కూడా రాజీలు చెయ్యటం, ముందుగానే కేసు గెలవదని చెప్పటం తన లక్షణం. శక్తిలేని క్లయింట్ల నుండి వారిని పీడించి లాక్కోవడం వారికి చేతకానిపని. దరిదాపు మానవ విలువలలోని 90 శాతం తన నిత్య జీవిత విధానంలో ఆచరిస్తున్న మహా గొప్ప వ్యక్తి రామ్మూర్తి గారు. అలాంటి వ్యక్తులు ఏ లక్షకో ఒకరికంటే వుండరంటే మీరు అతిశయోక్తి అనుకుంటారేమో కాని నాకు ఏమీ 'పార్షియాలిటీ' లేదు. పరిశీలించి చూస్తే మీకే తెలుస్తుంది. ఒక్క మాటలో చెప్పాలంటే నాది బాల్య వివాహమయినా రామ్మూర్తిగారి లాంటి వ్యక్తి నా జీవిత భాగస్వామి కావటం వల్లనే నా జీవితం ధన్యత గడించింది.

# 3. భర్త తోడ్పాటు అనౌచిత్యమా?

ప్రతి గొప్ప పురుషుని వెనుక ఒక స్త్రీ ఉంటుంది అని ఒక 'క్రెడిట్' ఆమె కివ్వటం ఆమె చేత చాకిరి చేయించుకోవటం పరిపాటి అయింది. ఆమె ఎంత ప్రతిభావంతురాలయినా ఆమె భర్త వెనుకనే ఒదిగి ఉండాలనే భావం ప్రబలంగా వుంది. అసలు ఆ మాటకు వస్తే స్త్రీ వెనుక పురుషుడు ఉండరాదనే భావం ఇమిడి వున్నాయి. అతడు ఆమెకు అండదండలు అందించటం ఏదో పెద్ద నేరమయినట్లు, అలా చేయటం అతని పురుషకారానికి భంగకరమయినట్లు వర్ణిస్తారు.

నేను నా భర్తకు 35 ఏళ్ళు అడుగడుగునా సహాయం చేశాను. నా వ్యక్తిత్వాన్ని చంపుకున్నాను. ఆయన ప్రతిభను పెంచాను. గత 15 ఏళ్ళుగా రామ్మూర్తిగారు నా సంస్థలకు, ఉద్యమానికి సహాయం అందిస్తుంటే అదేదో అద్భుతం, వింత అనే దృష్టితో ఎందుకు ఆలోచించాలో అర్థం కావటం లేదు. నేను ఎప్పుడయితే ఆత్మకథ వ్రాయటానికి పూనుకున్నానో నిజాయితీగా నా మనోభావనలను వ్యక్తం చేయటానికి ఒప్పుకున్నట్లే. అలాగే నా జీవిత రహస్యాలను అనేకం బహిర్గతం చేశాను. అయినా ఒక్క ప్రశ్న నన్ను వేధిస్తున్నది ఇటీవల. దానిని ప్రస్తావించకుండా వదలి వేయడం ఉచితం కాదు.

బురదలో పుట్టాను, పద్మంలాగా సుగంధాన్ని విరజిమ్మక పోయినా ఒక పుష్పంగా మనగల్గాను. ఈ పరిణామంలో అనేక శక్తులు, పరిస్థితులు నాకు దోహదం చేశాయి. అనేకమంది వ్యక్తులు నాకు తోడ్పడ్డారు. వారిలో ముఖ్యులు నా సహచరుడు రామ్మూర్తిగారు. ఈ అంశాన్ని పదే పదే పాఠకులకు విసుగు జనించేటంత వరకూ – చెప్పాను. నేను కృతజ్ఞతా ప్రదర్శనలో ఎవరికీ తీసిపోను. అయితే నా వర్తమాన స్థితికి ఎక్కువ మంది స్త్రీ, పురుషులు నాకన్నా రామ్మూర్తిగారిని ఎందుకు అభినందిస్తున్నట్లు? స్త్రీలకు తోటి స్త్రీని అభిమానించటం ఇష్టం లేకనా? ఈ ప్రశ్నలు నన్ను ఉక్కిర బిక్కిరి చేస్తున్నాయి. ఇవి కేవలం నా వ్యక్తిగత జీవితానికి సంబంధించినవి కావు. సమాజం యావత్తును కలవర పెట్టాల్సిన కీలక భావాలకు సంబంధించినవి కనుక చెప్పక తప్పదు.

1935లో నా పెళ్ళి జరిగింది. 1937లో కాపురానికి వచ్చాను. అప్పటికే రామ్మూర్తిగారు కమ్యూనిస్టుగా చలామణీ అయ్యే వ్యక్తే. అప్పుడు నేనొక అనామకురాలిగా ఆయనకు ఎన్నో విధాల సహాయం చేసేదాన్ని. ఉద్యమాల నిర్వహణకు వేలకు వేలు ఖర్చు పెడున్నా, తన తల్లి బంగారం అమ్మి 1946లో రాడికల్ డెమెక్రాటిక్ పార్టీ నిధికి విరాళం యిచ్చినా, ఇల్లు వాకిలీ పట్టకుండా తిరిగినా, కాణీ సంపాదించకున్నా నేను ఆయనను పల్లెత్తుమాట అనలేదు. నలుగురు పిల్లలను పెంచుకుంటూ, అత్తమామలకు సేవలు చేసి మెప్పిస్తూ తనకు ఏ విధంగాను అడ్డు రాకుండా అవకాశాలు కల్పించాను. హ్యూమనిస్టు ఉద్యమంలో రాష్ట్ర పెద్దలలో ఒకరయినారు. అసెంబ్లీ ఎన్నికల్లో స్వతంత్ర

అభ్యర్థులను బలపరిచి పని చేశారు. 1967లో పార్లమెంటు ఎన్నికల్లో పోటీ చేశారు. బాపట్ల పట్టణంలో అనేక సంస్థల్లో గౌరవ పదవులను నిర్వహించారు. నేను చిన్న చిన్న సంఘాలలో పనిచేస్తూ రోజుకు 18 గంటలు పనిచేస్తూ ఆయనకు ఇబ్బంది లేకుండా జీవితాన్ని గడుపుకొని పోయాను. ఇలా 1973 వరకు సాగింది. నా ఇన్నాళ్ళ కృషితో ఆయన తన ఉద్యమాలలో అఖిల భారత స్థాయికి ఎదిగారు, గణనీయమయిన స్థానాలను పొందారు. ఆయన అభ్యున్నతికి నేను పరోక్షంగానయినా ఏమీ దోహదం చేయలేదా? దీనిని తోటి స్త్రీ పురుషులు ఎందుకు గమనించరు? నేను 36 ఏళ్ళు చేసిన అవిరళ శ్రమకు విలువ లేదా? అది TAKEN FOR GRANTED అన్నటు నేను విధిగా చేయాల్సిన నా బాధ్యతా? స్త్రీ తన పురుషుని అభ్యున్నతికి పాటు పడింది అనేది గుర్తింపుకు నోచుకోవలసిన అవసరం లేదా? నాదంతా అదృశ్యశ్రమ కొబోలు! ఈ భావాన్ని సామాన్యీకరణ చేస్తే అసలు స్త్రీలదంతా అదృశ్యశ్రమే. భర్త ఉన్నతికి కారకురాలని భార్యను పేర్కొనటానికి అంత తటపటాయింపు ఎందుకు? గతి లేక, విధి లేక, తప్పని సరిగా అంగీకరించటం వేరు, మనస్ఫూర్తిగా ఒప్పుకోవటం వేరు. సంతోషంతో, ఆనందంతో స్త్రీల శ్రమను, ప్రయాసను, కృషిని పరిగణన లోనికి తీసుకునే కాలం ఎప్పుడు వస్తుందో?

ఈ ప్రశ్నలకు సమాజం – కనీసం జాగృతి చైతన్యం కల స్త్రీ, పురుషులు – జవాబులను అన్వేషించి ప్రకటించ గల్గిన నాడు ప్రజాభ్యుదయం, దేశాభ్యుదయం సిద్ధిస్తాయి. స్త్రీ పురోగమనం నేరమా? పురుషుని వెనుక స్త్రీ వుండాలా? భర్త తోడ్పాటు అనౌచిత్యమా? చివరగా నాబాధ ఏమిటంటే భర్తకు భార్య ఎన్నేళ్ళు సేవ చేసినా విలువలేదు. కాని భర్త భార్యకు అదయినా ప్రజాహిత సేవలో తోడ్పాటునిస్తే దానికి ఇంత హంగామా అనవసరం. 'రామ్మూర్తిగారే చేశారు' అని కొందరు, 'ఆయన వల్లే మీరు ఎదిగారు' అని కొందరు అనటం అంత బాగా లేదు. అగ్ని వుంటేనే ఆజ్యం పోసి మంట చేస్తాం. అదే నా విషయంలో జరిగింది.

# భాగం – X

# అనాగరిక దశ నుండి ఆధునికత వైపు



అభ్యుదయ వివాహం



బ్రిటీషు హ్యూమినిస్టు
హారీ రో స్టోప్స్ (1990)




జర్మనీ దేశపు వాల్టర్ హాన్‌తో




'స్త్రీ విఎమోచన' ప్రారంభిస్తున్న
వి.ఎం. తార్కుండే (1986)




కె.ఆర్. మల్లాది (సుబ్బమ్మ ట్రస్టు)



బార్బారా స్మోకర్
(1989) నేషనల్ సెక్యులరు సొసైటీ



మల్లాది సుబ్బమ్మ
(షష్టి పూర్తి సమయంలో)



ఎం.వి. రామమూర్తి
(సుబ్బమ్మ జీవిత సహచరుడు)




కుటుంబం



మనుమలు, మనుమరాండ్రు



బుల్లి మనుమరాలితో



తెలుగు విశ్వవిద్యాలయ సన్మానం (1988)



దుర్గాబాయ్ అవార్డు (1986)




ఇంగ్లండులో ఎం.వి.ఆర్.
షష్టిపూర్తి రోజున





స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా సన్మానం



రచయిత్రులతో (1983)



అఖిల భారత హేతువాద మహాసభ
(ఢిల్లీ) 1989




అభ్యుదయ వివాహం
(పొన్నలూరి దంపతులు)




'స్త్రీ విముక్తి' ప్రణాళిక విడుదల సందర్భంగా
వీణా మజుందార్‌తో (1989)



అత్యాచార నిరోధ మహాసభ (1990)




ఆం.ప్ర. కుల నిర్మూలన : వివాహసభ




దశాబ్ది ఉత్సవాలు
(సందేశాలు చదువుతున్న స్వాతి)



ఉత్తర ఫోటోగ్రాఫరు ప్రేమకు ఆటోగ్రాఫ్

# 1. నేను నేనుగా ఎలా రూపొందాను?

ఒక్క మాట చెప్పక తప్పదు. సాంఘిక దృక్పథం సమసమాజ భావన, రాజకీయ అవగాహన నా భర్తనడవడి, శక్తివల్ల నేను ఆకర్షింపబడితే, విశాల హృదయం, దూరదృష్టి నా తండ్రి నడతవల్ల పుణికి పుచ్చుకున్నాను. కందుకూరి, దుర్గాబాయ్, గోరా, ఎం.ఎన్. రాయ్ లాంటి వారి సేవా దృక్పథంవల్ల నాలో కార్యసాధనకు నాంది ప్రస్తావన జరిగింది. ఆ రోజుల్లో శరత్ సాహిత్యం, చలం కథలవల్ల స్త్రీల బాధలు కొంతగా కొంత అవగతమయ్యాయి. విద్య కోసం, స్వేచ్ఛ కోసం, నేను పడ్డ ఆరాటమే, నా పాట్లే నన్ను పూర్తిగా మహిళాభ్యుదయానికి పురికొల్పాయి. అలా ఆనాడు మహిళాభ్యుదయం, హేతువాదం, హ్యూమనిజాల కార్యక్రమాలకు ఒక వేదికగా జీవించదలచాను. ఆ ఉద్యమాలను చేపట్టిన నాడు నిజంగా ఇంత మాత్రమయినా చెయ్యగలుగుతానని, ఇన్ని సంస్థలు స్థాపిస్తానని, ఇంత ఫలవంతంగా కార్యక్రమాలు నెరవేరుస్తాననే దృఢ విశ్వాసం లేదు. దీనికి రెండు కారణాలు చెప్పకపోతే నేనొక విధంగా కృతఘ్నురాలి నవుతాను. నే చేపట్టిన కార్యరంగం చాలా కష్టమయిందని నాకు తెలుసు. దానికి అనేక అడ్డంకులొస్తాయని కూడా తెలుసు. నాలో నిరాశా నిస్పృహలు పొడచూపినప్పుడల్లా నా భర్త నాకు కొండంత ధైర్యాన్ని ఇవ్వటం, సలహాలు సంప్రదింపులు అందివ్వటం, లెక్కలు, రిపోర్టులు, ఉత్తరాలు, వ్రాసి పెట్టటం నా సాహిత్యాన్ని ఎడిట్ చెయ్యటం, కొన్ని సందర్భాలలో 'సినాప్సిస్' వ్రాసి పెట్టటం, అనేక పత్రికలు చదివి న్యూసు చెప్పటం లాంటివి ఒకటేమిటి సర్వ విధాలా సర్వ రంగాల్లో నాకు తోడునీడయి నిలిచి నన్నింతదాన్ని చేశారు.

ఇక రెండో విషయం నాలో అసంతృప్తి, స్తబ్ధత, నిస్తేజం, కలిగినప్పుడల్లా కందుకూరి ఆత్మకథ నన్ను ఉత్సాహపరిచేది. ఒక్కగా నొక్క వ్యక్తి జబ్బు మనిషి. ఆర్థిక సంపత్తి, అంగబలంలేని వ్యక్తి కేవలం ఒక బడిపంతులుగా ఆనాటి అనాచారపు సాంఘిక విషవ్యవస్థ మీద ధ్వజం ఎత్తి అన్ని ఘనకార్యాలు చేసి ఘనత వహించగలిగినప్పుడు ఈనాడు కొంత సానుభూతి, సమరస భావం, ఆర్థికవనరులు వున్నప్పుడు మనం సాధించలేనిదేముంది అనే ఆశావాదం నాలో ప్రవేశించి నాకు ఆత్మస్థయిర్యం కలిగించేది. ఆ దృక్పథంతోనే ఆ లక్ష్యసాధనతోనే ఈ రంగంలో ప్రవేశించి తృప్తిని పొందగలుగుతున్నాను.

ఈ 20 శతాబ్దంలో సైతం, సైన్సు ఇంతగా అభివృద్ధి చెందిన ఈ తరుణంలో కూడా మహిళాభ్యుదయం అంటే అది ఏటికి ఎదురీత అయినా ఒక తాత్విక దృక్పథంతో ఈ కార్యసాధనకు పూనుకున్నానని, కొంత విజయాన్ని సాధించగలిగాననే తృప్తి నాకు కలిగింది. అంతవరకు కృతకృత్యురాలినే.

# 2. జర్నలిస్టు నెలా అయ్యాను

ఒక ప్రత్యేక పరిస్థితిలో నేను జర్నలిస్టు నయ్యాననేది వాస్తవం. ఏ పదవి వాంఛించినా, ఏ నాయకత్వం, కోరినా, ఏ ఘనకార్యం సాధించాలన్నా తెల్లారేసరికి కాలేము. కొంత కృషి చెయ్యాలి. కొంత విజ్ఞానం వుండాలి. ఎంతో ధైర్య స్థయిర్యాలు కావాలి. ఇంకెంతో అనుభవం గడించాలి. శ్రమ పడాలి. అప్పుడే ఒక స్థాయి, స్థానం లభిస్తాయి. మా రోజుల్లో ఏ కొద్దిమందో తప్ప స్త్రీలు రచయితలుగా రాణించే వారు కాదు. కవయిత్రులుగా పేరు పొందే వారు కాదు. 1962లో 'ఫామిలీ వెల్ ఫేర్ వర్కర్సు ట్రయినింగు' పొందే సమయంలో ఆ సందర్భంగా వచ్చీ రాని ఇంగ్లీషులో అధ్యాపకులను ప్రశ్నలడగటం వారు ప్రశ్నిస్తే జవాబులు చెప్పటం, ప్రేమలతా గుప్తా లాంటి గొప్ప వారెవరైనా వస్తే మాట్లాడటం వారికి తెలుసు. తోటి అమ్మాయిలతో ప్రగల్భాలాడుతూ నేను వక్తను, జర్నలిస్టును కూడా అని ఒక రోజు గొప్ప చెప్పుకున్నా. కాని ఎక్కడ వ్రాశాను, ఎప్పుడు వ్రాశాను, ఏం వ్రాశాను, అనే ఆలోచనలు నాలోనూ, వారిలోనూ ప్రబలిపో యాయి. ఇక తట్టుకోలేక ఏదో ఒకటి వ్రాసి ఏ పత్రికలోనే ప్రచురింప జెయ్యాలనే ఆకాంక్ష పెరిగిపోయింది. అప్పటికి అయిదు ఏళ్ళుగా కుటుంబ మిత్ర అనే మాసపత్రికను మా అసోసియేషన్ వారు నడుపుతున్నారని నాకు తెలుసు. ఆ పాత 'జర్నల్సు' కొన్ని తెచ్చి చదివి ఆ వెంటనే ఒక చిన్న కథ 'దేవుడిచ్చిన పిల్లలు' అని, 'తిక్క కుదిరింది' అని మరో స్కెచ్ రాశా. కాని వాటికి తలా తోకాలేదు. ఇక నాలో తహ తహ పెరిగిపోయి నేను దీనావస్థలో పడిపోయా. పరువు పోయేలా వుంది ఎలా? ఏం చేసేది? అక్కడి నా నెచ్చెలులెవ్వరికి తెలుగు భాష మీద, సాహిత్యం మీద ఎలాంటి అథారిటీ లేదు. దారి తెన్ను తెలియని నేను కుటుంబమిత్ర ఎడిటరు పోలవరపు శ్రీహరిరావుగారి ఇంటికి వెళ్ళి మీరు ఈ రెండూ ఎలాగయినా ప్రచురించాలని కోరాను. ఆయన రామ్మూర్తిగారి మిత్రుడే కాదు నా మీద చాలా గౌరవంగల వ్యక్తి. ఆ వెంటే వాటిని ఎడిట్ చెయ్యటమంటే దరిదాపు తానే వ్రాసి పూర్తి చేశాడు. నా కథలలోని భావాలకు మాత్రం శాశ్వతత్వం వుంది. మొదటి కథలో ఒక తల్లి పిల్లల్ని దేవుడిచ్చాడని కంటూ పోవడం చివరికి అగాధంలో పడిపోవటం. రెండవది పిల్లల సంఖ్యను అదుపులో పెట్టుకుందామని భార్య బ్రతిమాలినా వినని సనాతన వాది అయిన భర్తకు తెలియకుండా దొంగతనంగా వెళ్ళి భార్య ఆపరేషన్ చేయించుకున్న స్కెచ్. ఈ రెండూ వెంట వెంట జంట కవుల్లా రెండు పత్రికల్లో వచ్చాయి. ఇక బాంబు పేలింది. హాస్టలంతా దద్దరిల్లి పోయింది. 'అమ్మో! సుబ్బమ్మగారో! అంటూ ప్రతిధ్వనించి పోయింది నా పేరు. నా పెద్ద కుమారుడు ఆ సమయంలో ఉషా కంపెనీలో ఇంజనీరుగా హైదరాబాదులో పనిచేస్తూ వుండేవాడు. ఒకనాడు మా హాస్టలుకొస్తే ఈ పత్రికలు రెండూ వాడికి ఇచ్చా. ఇక వాడి ఆశ్చర్యానికి అంతు లేదు. తట్టుకోలేక 'అమ్మా ! ఇవి నిజంగా నువ్వే వ్రాశావా?" అని అడిగేశాడు.

ఇంక నాలో అసహనంతో పాటు పట్టుదల కూడా పెరిగి ఎలాగయినా నేను ఈ స్థాయికి రావాలి. లేకపోతే పరువు దక్కదు అనిపించింది. అంతే కాదు 'నేను ఎందుకు వ్రాయకూడదు? ఈ వయస్సులో బైటికొచ్చి చదువుకుంటున్న నేను స్వయం కృషి వుంటే ఏదయినా సాధించగలను' అనే భావం బలపడింది. ఆ తర్వాత చాలా కష్టపడి, రామ్మూర్తిగారితో చర్చించి వ్రాసిన నా వ్యాసాలు దిద్దించి ఎప్పటికప్పుడు చిన్న చిన్న పత్రికలకు పంపుతూ వుండే దాన్ని. క్రమేపి వట్టిగొండ విశాలాక్షి నడిపే 'ప్రజావాణి', 'రాడికల్ హ్యూమనిస్టు' 'సమీక్ష' 'సుభాషిణి' లాంటి వాటిల్లో వస్తూ వుండేవి. ఆ తర్వాత 1964 నుండి ఆంధ్రజ్యోతి దినపత్రికలో, ప్రతిమంగళవారం వెలువడే 'వనితావాణి'కి తరుచుగా పంపుతూ వుండేదాన్ని. వరకట్నాలు, కుటుంబ కలహాలు, అధిక ధరలు, ఆడవారి సమస్యలు లాంటివి ఏది పంపినా ప్రచురించే వారంటే అదంతా నండూరి రామ్మోహనరావు గారి ఆదరణ, ప్రోత్సాహలేననేది తథ్యం. అలా వారి అదరాభిమానాలవల్లే నేను ఈనాడు ఇంతగా అభివృద్ధి చెందానని చెప్పుకోవటానికి సంతోషిస్తున్నాను. ఆ విధంగా వారికి నేను ఆజన్మాంతం రుణపడి వుంటాను.

వ్రాసేదంతా రచనే అయినా కవి, రచయిత, సాహితీవేత్త, నవలాకారుడు, కథకుడు అనే పదాలకు అర్థాలు వేరుగా వుంటాయి. పత్రికల్లో మాస, పక్ష, దిన, వార పత్రికల్లో వ్రాసే వారిని, ముఖ్యంగా పత్రిక నడిపే వారిని 'జర్నలిస్టులు' అంటారు. అలాగే సావనీర్లు, షష్టిపూర్తి సంచికలు, స్కూళ్ళ వార్షికోత్సవ సంపుటాలు, మెమోరియల్ వాల్యూమ్స్, సంస్థల వార్షిక సంచికలు లాంటివెన్నో వున్నాయి. పత్రికారచన మూడు రకాలు. వర్కింగు జర్నలిజం, ఫ్రీలాన్సు జర్నలిజం, అభిప్రాయ పత్రికలను నడపటం. మొదటి రెండు వృత్తిగా జర్నలిజాన్ని నిర్వహించే వారిని వర్కింగు జర్నలిస్టులంటారు. కుతూహలంతో, జిజ్ఞాసతో, స్పష్టమైన అవగాహనతో ఒక విషయాన్ని తర్కించి అప్పుడప్పుడూ అనేక పత్రికల్లో వ్రాసేవారిని స్వచ్ఛంద రచయితలు (ఫ్రీలాన్సు జర్నలిస్టులు) అంటారు. వీరు పారితోషికం ఇస్తే పుచ్చుకుంటారు. లేకపోతే బాధపడరు. పత్రిక లక్ష్యానికి భిన్నం లేకుండా వైవిధ్యంతో కూడిన వ్యాసాలను వ్రాసే వారిని కూడా జర్నలిస్టులు అంటారు. సహజంగా దాన్ని వృత్తిగా స్వీకరించే వారిని, విలేఖరులను, వార్తలను సేకరించే వారిని, సంపాదకులను కూడా అలాగే అంటారు. దరిదాపు ఈ విధమైన రీతులన్నీ చేసిన దాన్ని కనుక నేనూ ఒక జర్నలిస్టును అనుకుంటే పొరపాటు కాదేమో!

వికాసం మాసపత్రికకు పబ్లిషర్ నే కాక మేనేజింగు ఎడిటరుగా పది సంవత్సరాలు నడిపి కొంత అనుభవం గడించాను. ఆంధ్రదేశంలో ఎంతో పేరెన్నికగన్న మహిళా మాసపత్రిక 'వనిత' లో 'దాచేస్తే దాగని సత్యం' శీర్షిక క్రింద వ్రాశాను. ఇంకా మహిళా సమస్యలపై అనేకం ప్రచురింపబడు తూనే వున్నాయి. అలాగే తెలుగు పక్షపత్రిక "కలువబాల" మొదటి సంచిక నుండి అంటే గత ఎనిమిదేళ్ళుగా నెలకు రెండు ఆర్టికల్సు

వ్రాస్తూనే వున్నాను. 'వనితా జ్యోతి లో 'వ్యక్తిగత సమస్యలు: సమాధానాలు' శీర్షిక క్రింద అయిదేళ్ళుగా నా సమాధానాలు వెలువడుతూనే వున్నాయి. ఎన్నో మరెన్నో పత్రికలలో, మహిళా స్పెషల్సులో గత 30 ఏళ్ళుగా రాస్తూనే వున్నాను. ప్రచురణ జరుగుతూనే వున్నాయి.

తెలుగు విశ్వవిద్యాలయం వారు రెండు రోజులు నిర్వహించిన జర్నలిజం సెమినారులో నేను మహిళా పత్రికల పై ప్రసంగించాను. మారుతున్న సమాజంలో మహిళా పాత్రికేయులు (ఉమెన్ జర్నలిస్టు అండ్ ఛేజింగ్ సొసైటీ) మీద.రెండు రోజులు తిరుపతిలో మహిళా యూనివర్సిటీ వారు జరిపిన సెమినార్‌కు నన్ను 'రిసోర్సు పర్సన్' గా ఆహ్వానించారు. ఈ రంగంలో ఎంతో అంత అనుభవం వుండబట్టే గదా అనే తృప్తి నాకు ఈనాటికి కలిగింది. వైవిధ్యంతో కూడిన ఈ అనుభవం నాకు ఉపకరించింది. ఈనాడు ఒక మహిళా మాసపత్రిక 'స్త్రీ స్వేచ్ఛ'ను స్థాపించి నిర్విఘ్నంగా ప్రచురించ గల్గుతున్నానంటే అదంతా అనేకమంది ఆదరాభిమానాలు నా పట్ల వుండబట్టే. నేను జర్నలిజాన్ని వృత్తిగా స్వీకరించకపోయినా పత్రికలు నిర్వహిస్తూ పూర్తి కాలాన్ని వినియోగించడం మూలాన నేను విశిష్టమైన మూడవ కోవలోకి చేరాను. ఔత్సాహిక పత్రికా రచయిత అనే దశ దాటి అసలైన పత్రికా రచయితగా రూపొందాను.

సమాజానికి బాధ్యత వహించే వ్యక్తిగా, తోటి ప్రజానీకాన్ని హెచ్చరించే ప్రబోధకురాలిగా పత్రికా నిర్వహణతోపాటు పత్రికా సంపాదకత్వాన్ని చేపట్టాను. ఈ బాధ్యతా నిర్వహణలో కష్టసుఖాలు, వడిదుడుకులు వస్తాయిని నాకు తెలుసు. విమర్శలు, దూషణలు అనేకం రాక తప్పదు. వాటిని మనో నిబ్బరంతో ఎదుర్కొనగల ధైర్య స్థయిర్యాలు రావాలి. వాటిని సంతరించుకుని క్రమక్రమంగా వృద్ధి చేసుకుంటున్నాను.

పత్రికా సంపాదకత్వ కార్యభారాన్ని నెత్తిన వేసుకున్న వ్యక్తి– పెద్ద పత్రికగాని, చిన్న పత్రికగాని బరువు బాధ్యతలతో శ్రమించక తప్పదు. దేశ శ్రేయస్సు కోసం జరగాల్సిన పనులను నిర్వర్తించాల్సిన విధులను తన సంపాదకీయాలలో పేర్కొనేటప్పుడు ఆ కొలది కాలం ఆ వ్యక్తి దేశ ప్రధానమంత్రి పదవిలో పరకాయ ప్రవేశం చేసి వ్యవహరించాల్సి వుంటుంది. వీలైనంతవరకు అత్యధిక సమాచారాన్ని తెలిసికొనగలిగినప్పుడే ఆ ప్రయత్నంలో సఫలీకృతం కావడానికి అవకాశం వుంటుంది. అలాగే మహిళా పత్రిక సంపాదకురాలు ప్రపంచ స్త్రీలతో తాదాత్మ్యం చెంది తన మనోఫలకంలో వారి శ్రేయస్సును స్థిర ప్రతిష్ఠ చేసుకుని ప్రబోధానికి ప్రారంభం చేయాలి. 'నేను చేసిన సూచనలు, నేను ప్రతిపాదించే ప్రణాళికలు ఎలాగూ ఎవరూ ఆమోదించరు, ఆమోదించినా చేపట్టరు', అనే నీరస భావంతో ఆచరణ యోగ్యంకాని పథకాలను తర్కానికి నిలవని ఆలోచనలను సంపాదకులు వెలువరించ బూనటం అర్ధరహితం, నీతి బాహ్యం కూడాను. సాధారణంగా వందల సంఖ్యలో చదువరులున్న పత్రికా సంపాదకురాలు బాధ్యతతో ఇలా

తలపోసినపుడు, ఇలా ప్రవర్తించినపడు చూచే వారికి, ఆమె మాటలు వినే వారికి ఆమె రచనలు చదివే వారికి హాస్యాస్పదంగా తోచవచ్చును. కానీ పరిస్థితులు అనుకూలిస్తే, పాఠకుల సంఖ్య పెరిగితే పత్రిక సమాదరణీయం అయితే దాని ప్రభావానికి చందాదారుల సంఖ్యకు పొంతన లేక దాని ప్రతిష్ఠ పెరిగితే అప్పుడు ఆ చిన్న పత్రిక సంపాదకులకు ప్రజలు 'బ్రహ్మరథం' పడతారు. ఈ సందర్భంలో శ్రీ గోర్వాల సంపాదకత్వాన వెలువడిన 'ఒపీనియన్', రమేష్ థాపర్ సంపాదకత్వాన ప్రచురించబడుతున్న 'సెమినారు. ఇలాంటి పత్రికలకు మచ్చుతునకలు. అందువల్ల పత్రిక చిన్నదా, పెద్దదా అనే దానికన్నా 'సంపాదకులెవరు?' అనేది ప్రాధాన్యత వహిస్తుంది. ఇలాంటి ఉదాహరణలు వున్నాయి కదా అని పత్రికా పాఠకుల సంఖ్యను పెంచటం విజ్ఞులు మానరు, మానకూడదు.

ఏదైనా పత్రిక ప్రబోధ కార్యక్రమానికి మహత్తర సాధనం. అలాంటి ఆయుధాన్ని వాడి సమాజంలోని అవిద్యను, అజ్ఞానాన్ని, మౌఢ్యాన్ని పారద్రోలి దుర్మార్గుల దుశ్చర్యలను ఎండగట్టి, అన్యాయం ఎడల అసహనం కలుగజేసి, ప్రజా శ్రేయస్సును వృద్ధి చేయగలగడం నాకు కలిగిన 'అదృష్టంగా' భావిస్తున్నాను. నేను ఇలా జర్నలిస్టుగా పరిణామం పొందడం నాకు గర్వకారణం.

# 3. రేషనలిస్టుగా ఎలా పరిఢవిల్లాను?

అసలు నేనెలా హేతువాదినయ్యానో చెప్పాలంటే దానికొక పూర్వచరిత్ర వుంది. అదంతా రాసే ఒక చిన్న ఉద్గ్రంధమవుతుంది. ఆ శీర్షిక పేరుతో 1976లో 'చార్వాక" అనే పత్రికలో ఒక వ్యాసం వివరంగా వ్రాసి పంపాను. అసలు నే పుట్టినిల్లు, మెట్టినిల్లు పక్కా సనాతన సంప్రదాయాలకు నిలయాలు. కులాచారాలు, వంశాచారాలు, మత విధులు, వ్రతాలు, పూజలు, మొక్కుబళ్ళు, ఆడా మగ తేడాలు మాకు ఉగ్గుపాలతో నేర్పిన బ్రహ్మ విద్య లాంటిది. పెద్దలు ఆచరించేవన్నీ చూసి నేర్చుకునేవి కొన్ని, హితబోధల వల్ల ఆచరించేవి అనేకం. ఇంక ఊపిరి సలపకుండా ఇంటా బైటా సర్వే సర్వత్రా' – ఇందు గలదు అందు లేదు అనే సందేహం లేకుండా – సనాతన ఆచారాల మూసలో బిగింపబడ్డ నేను ఒక జడురాలినిగా, పరమ అగమ్య గోచరంగా 30 ఏళ్ళు గడిపాను. నేను చేయని వ్రతం, నోము, పూజలు లేవు. ఈ జన్మలోనే కాక పది జన్మల వరకు సుమంగళిగానే చావాలని జన్మజన్మలకూ ఈ భర్తే కావాలని ఒక నోము, ఆరోగ్యంతో, సిరి సంపదలతో, బిడ్డా పాపలతో కలకాలం వర్ధిల్లాలని మరో వ్రతం, రకరకాల పూజల చుట్టూ నా జీవితం ఒక విషవలయంలా పెనవేసుకొని వుండేది. ఉదయాన లేస్తూనే మంగళ సూత్రాలు కళ్ళకు అద్దుకొని మంచం దిగిన నేను దీపం వెలిగాక అది చూచి మళ్ళీ సూత్రాలు తాకి, చాకిరి అంతా పూర్తిచేసుకొని రాత్రి పదింటికి మంచం ఎక్కేదాన్ని. ముందు భర్తను, తర్వాత భగవంతుని ధ్యానించి నిద్రించే దాన్ని. ఇది నా దినచర్య. ఆ పరిధి దాటి పోయినా, ప్రశ్నించినా ఆ రోజుల్లో ఇక పుట్టగతులు వుండేవి కావు. ముఖ్యంగా "కురూపియైనా, రోగిఅయినా, జడుడయినా, నపుంసకుడైనా పడతికి ఇహ పర సాధనమా పతియే తల్లీ! "అనే ఆ భావ పరంపరలో నేను పుట్టి పెరిగాను.

మా అత్తగారు మహా నిష్ఠాగరిష్ఠురాలు, అద్వైత వేదాంత శిఖామణి. స్వాముల వారిని, గురువులను సేవించి తరించాలనేదే ఆమె ధ్యేయం. నేను కూడా ముక్తి పొందాలని, తద్వారా కుటుంబం స్వర్గతుల్యం కావాలనే తపనతో నాకు మంత్రోపదేశం చేయించింది. ప్రపంచ జ్ఞానం లేని నేను జన్మతరిస్తుందని, పునర్జన్మ రాహిత్యం కలుగుతుందని ఉ ప్పొంగిపొయ్యా. పాతివ్రత్య ధర్మాలను పాటించిన నేను ఈ ఉపదేశానికి ఉబ్బి తబ్బిబ్బయి పొయ్యా! కాని ఆ గురుశుశ్రూషలు, సేవలు, బోధలు వింటూ వుంటే జుగుప్స కలుగుతూ వుండేది. తను, ధన మనఃప్రాణాలు గురువుకు సమర్పించాలని, గురుద్రోహం చేస్తే పంచ మహా పాపాలు చుట్టుకుంటాయని మా 'బాధ' గురువు (అంటే శిష్యులను సన్మార్గాన నడిపే వారిని బోధ గురువులని, తమ స్వార్థం కోసం వక్ర మార్గాన నడిపే వారిని బాధ గురువులని చమత్కరిస్తారు) ఒకసారి అన్నాడు. మరోసారి, మా ఆశ్రమానికి వచ్చి ప్రశాంత వాతావరణంలో తత్వబోధలు వినాలని శాసించాడు. ఆ వాక్కులు వింటూంటే గుండెదడ పుట్టేది. మహా భోగి, చండశాసనుడు అయిన ఆయన బోధలు, చర్యలు విడ్డూరంగా వుండేవి.

"గురుదేవులు సర్వసంగ పరిత్యాగులమ్మా ! మోక్షం విషయంలో భర్త ఆజ్ఞ అవసరం లేదమ్మా! నీ బిడ్డల్ని కంటికి రెప్పలా కాపాడుతా. ఆశ్రమానికి వెళ్ళిరమ్మని బుజ్జగించింది కల్లా కపటం ఎరుగని మా అత్తగారు. తీరని రాజకీయాలతో, దేశ సేవలో మునిగిపోయిన నా భర్త గారికి తల్లిమీద అమిత గౌరవం వుండటం వల్ల ఏమీ పట్టేది కాదు. ఇక నా పరిస్థితి కుడితిలో పడిన ఎలుకలా అయింది. గురువు రమ్మంటున్నాడు. అత్తగారు పొమ్మంటున్నది. పిల్లలు చిన్నవారు మాయా మర్మాలెరుగని మామగారు. ఇక శిష్యులంతా జన్మ చరితార్థం కావాలంటే సర్వం పరిత్యాగం చేయాలమ్మా! మన పూర్వజన్మ సుకృతం కొద్దీ శంకరాచార్యులు వారే దిగిన ఈ రూపంలో సాక్షాత్కరించి మనకు బాధలు లేకుండా జన్మరాహిత్యం చేస్తున్నారు. నీ మీరు అనుగ్రహం కలిగి అలా సెలవిచ్చారు. కాని పుట్టెడు రత్నరాసులిచ్చినా రమ్మని ఆజ్ఞాపించని గురుపుంగవులు. మేమే వారి వెంటబడి పోతున్నాం. మీరు వెంటనే వెళ్ళి మహా మంత్రోపదేశం పొంది, బోధలు సద్గతి పొంది ఇరు వంశాలను పునీతం చేయమని నా వెంట పడ్డారు శిష్య వర్గమంతా.

అప్పుడు నాలో సంచలనం కలిగింది. ఆలోచించి వితర్కించుకున్నా. ఇదంతా కృత్రిమమని గ్రహించా. నా జీవితం సర్వ నాశనం కాబోతుందని తెలుసుకున్నా. భయం పోయింది. జాగృతి కలిగింది. ఆ తర్క వితర్కమే నాలో హేతువాద బీజాన్ని నాటింది. ఇదంతా 'హంబగ్' అనిపించింది. మొదటినుండి ఆ జడదారి మాటలు, భోగలాలసత, పట్టుపరుపులు, దోమతెరలు, వెండి కమండలాలు, ఆస్తులు, అంతస్తులు చూస్తుంటే నాకు రోతగా వుండేది. పైగా ఆ రోజుల్లో నాకు ఒంటెడు నగలు వుండేవి. దీనికంతటికి కారణం నా అజ్ఞానం, అవివేకం, ఐశ్వర్యం అని గ్రహించుకున్నాను. జపాన్ని గంగలో కలిపా. గురుత్వాన్ని నాశనం చేశా. సంప్రదాయాలకు గుడ్ బై చెప్పా. హేతువాదిగా మారిపోయా. అప్పటి వరకూ ఎంత గొప్ప సనాతనాచారాలను పాటించానో ఎంత భక్తితత్వం నాలో పొంగి పొరలిపోయేదో, ఎంత శుశ్రూష చేసేదాన్నో ఎంత పాతివ్రత్యాన్ని పాటించానో, ఎందరు దేవుళ్ళకు మ్రొక్కుకునే దాన్నో ఆ తర్వాత అంతటి విరుగుడు, నైరాశ్యము, వైరాగ్యము నన్ను ఆవహించాయి. అప్పటికయినా వివేకాన్ని పొందగలిగానంటే అదంతా ఆ గురువుగారి మహాత్యమే. ఒక విధంగా ఆలోచిస్తే నాకు నాస్తిక మార్గాన్ని, హేతుత్వాన్ని, ఆలోచనను ప్రసాదించింది ఆ మహానుభావుడే. అందువల్ల ఆయన మీద నాకు పగ, ద్వేషం, ఏహ్యాభావం కలుగపోగా చిరస్మరణీయుడయ్యాడు. అలా ఆ గురుత్వంపోయి హేతుత్వం నాలో పాతుకుపోయింది. ఇలాంటి సంఘటనలు మామూలుగా మహిళలు బహిర్గతపరచరు. కారణం తమ మీద అపనింద వస్తుందని భయం. ఏది ఏమయినా ఆయన్ని తిట్టి సాధించి చేసేది లేదు. అలాంటివారు అత్యధిక సంఖ్యలో వున్నారు. వారికి వయస్సులో చిన్న వారు, డబ్బున్న వారు, అందమయిన ఆడవారు శిష్యులుగా కావాలి. ఇదొక దోపిడీ విధానం. కనుక అనుభవజ్ఞులైన ఆడవారు

ఏమీ ఎరుగని అమాయక స్త్రీలకు జరుగుతున్న అన్యాయాలను, మోసాలను, కృత్రిమాలను వెలికితెచ్చి బహిర్గతపరచి తోటివారికి తోడ్పడి వారిలో అజ్ఞానాన్ని రూపుమాపటం ప్రధమ కర్తవ్యం. కేవలం తాము హేతువాద జీవితాన్ని గడిపితే చాలదు. తమ నడత ద్వారా తక్కిన వారిని మార్చగలగాలి. వారే శిసలైన హేతువాదులు.

## హేతువాద సభలలో

ఎప్పుడయితే హేతువాదిగా మారానో అప్పటినుండి హేతువాద సభలలో ఉపన్యసించడం మొదలయింది. శిక్షణా తరగతులలో "స్త్రీలు – హేతువాదం" మీద కాసులు నిర్వహించటం జరుగుతూనే వుంది. రాష్ట్ర హేతువాద సంఘానికి గత 12 ఏళ్ళుగా వైస్ ప్రెసిడెంటుగా వుంటూ హేతువాద ప్రచారం సాగిస్తూనే వున్నాను. ఇంక ఆలిండియా హేతువాద సంఘానికి కార్యనిర్వాహక సభ్యురాలిగా వున్నాను. అనేక రాష్ట్ర సభలు, అఖిల భారత సభల్లో పాల్గొనటం, తీర్మానాలు ప్రవేశ పెట్టడం నాటినుండి నేటివరకూ జరుగుతూనే వుంది. హేతువాదం మీద పుస్తకాలు, కరపత్రాలు, వ్యాసాలు అధిక సంఖ్యలో వ్రాసి ప్రచురించాను.

హేతువాదిగా నా చరిత్ర చెపుతున్నపుడు ఒక ఆసక్తికరమైన అంశాన్ని పేర్కొనక తప్పదు. భారత హేతువాద సంఘం 1949లో మద్రాసులో స్థాపింపబడింది. కాగా 1979 నుండి రాజకీయంగా తీవ్రవాద మార్క్సిస్టు భావాలు కలవారు ఆం.ప్ర. హేతువాద సంఘంలో పనిచేయ ప్రారంభించారు. సిద్ధాంతం పై నమ్మకం కలిగి చేరారో లేక ఎత్తుగడగా చేరారో అనేది తేలని విషయం. ఏదయినా తత్ఫలితంగా హేతువాద సంఘం ఒకటి కాస్త రెండు అయి, రెండల్లా మూడయి చివరకు రెండు అయినాయి. భారత హేతువాద సంఘానికి (IRA) అనుబంధంగా వున్న మా ఆం.ప్ర. హేతువాద సంఘం మొదటిది కాగా తీవ్రవాద మార్క్సిస్టు భావాలు కల ఆం.ప్ర. హేతువాద సంఘం రెండవది. మొదటి దాంట్లో నేను ఉపాధ్యక్ష పదవిలో ఉన్నాను అని మునుపే వ్రాశాను. రెండు సంఘాల మధ్య పొత్తు లేదు, పైగా సిద్ధాంత రీత్యా పోటీ. నిర్మాణం విషయంలో వేరు వేరు. ఈ పరిస్థితుల్లో రెండవ సంఘం వారు తమ రాష్ట్ర మహాసభలో ప్రసంగించమని నన్ను కోరారు. నేను అంగీకరించాను. ఈ విషయం తెలిసి మా భారత సంఘ అధ్యక్షులు, రాష్ట్ర సంఘ పెద్దలు నేను ఆ మహాసభలో మాట్లాడరాదని పేచీ పెట్టారు. మా సంఘ పెద్దల అభిప్రాయాలు నాకు నచ్చలేదు. చివరకు క్రమశిక్షణ పేర నేను ఎదుటి వారి మహాసభకు పోవటం మానుకున్నాను. అయినా ఇప్పటికీ నా సంఘ పెద్దల అభ్యంతరం పొరపాటనే నాకు తోస్తుంది. సంఘటిత ఉద్యమ కార్యకర్తకు ఇలాంటి చిక్కులు తప్పవేమో!

# 4. ఫెమినిస్టునెందుకయ్యాను?

నేనొక ప్రముఖ ఫెమినిస్టును ఎలా అయ్యాను అని అడిగే వారి సంఖ్య అత్యల్పం కాదు. హాస్యం చేసేవారు కొందరు, కోపంతో మండిపడేవారు మరి కొందరు, తిట్టుగా ఎత్తిపొడిచేవారు ఇంకొందరూ వున్నారంటే వారి దృష్టిలో నేను పురుష ద్వేషినని, స్త్రీ పక్షపాతినని, కుటుంబ శాంతి విధ్వంసకురాలినని, పవిత్రమైన వివాహ బంధాన్ని త్రుంచి వేస్తానని కొందరి అభిప్రాయం. పరోక్షంగా నామీద,నిందలు మెండుగా వున్నాయి. అంతేకాదు నేనొక విప్లవ కారిణినని అనేకమంది భావం. నక్సలైట్లు కొందరినే హతమారుస్తుంటే నేను సగభాగమైన పురుష జాతినే నిర్వీర్యులను చేస్తున్నాననే అపఖ్యాతి నా పట్ల హెచ్చు స్థాయిలో వుంది. నన్ను అర్థం చేసుకోని వారు నన్నేమని తిట్టినా బాధలేదు. తెలిసిన వారు సైతం కావాలని నిందారోపణలు చెయ్యటం నన్నే కాదు మహిళాలోకాన్నే నిందించటం కాదా అని ప్రశ్నిస్తున్నాను. అసలు ఫెమినిస్టులన్నా, ఫెమినిజం పేరు విన్నా మండిపడిపోతారు, వివాహ వ్యవస్థనే విధ్వంసం చేస్తారని, విచ్చలవిడిగా స్వైర విహారం చేస్తారని, వారిని తాటకి, లంఖిణి, శూర్పణఖల్లాంటి వారిగా, హిప్పీలుగా చిత్రీకరిస్తూ, అసూయాద్వేషాలు విరజిమ్ముతూ ఎంతో అసహనాన్ని మరెంతో క్రోధాన్ని కొంతమంది ప్రదర్శిస్తూ వుంటారు. ఈ రకంగా విమర్శించే వారిలో స్త్రీలు కూడా వున్నారనేది గమనార్హం.

స్వేచ్ఛా సమానత్వం ప్రాతిపదికగా గల మానవ విలువలతో ఉద్భవించిన ఫ్రెంచి విప్లవ చైతన్యంతో ఆవిర్భవించిన ఆలోచనా ధోరణికి రూపకల్పనే ఫెమినిజం. మొదట్లో ఓటు హక్కు కోసం పోరాటాలు జరిపింది ఫెమినిస్టులే. బ్రిటిషు మహిళల అశేష త్యాగాలతో లభించిన ఓటు హక్కు వారితో పాటు భారత స్త్రీలకు కూడా లభించడం విస్మరించరాని సత్యం. దరిమిలా ఫెమినిజం ఆర్థిక హక్కుల పై పోరాటాలు సలిపింది. ప్రాతినిధ్యంలో భాగస్వామ్యానికై ఏళ్ళతరబడి అలజడులు జరుపుతున్నారు ఫెమినిష్టులు. ఈనాడు స్త్రీ పురుష అసమానతను లైంగికత ప్రాతిపదికగా చర్చించే ధోరణిదాకా ఎదిగారు. మహిళా దశాబ్దానంతరం ఇంటి పనిలోను, పిల్లల పెంపకంలోను స్త్రీ పురుషులిద్దరూ భాగస్వామ్యం వహించాలనే పోరాటం ప్రబలంగా సాగిపోతోంది. లింగభేదంవల్ల మా వ్యక్తిత్వాన్ని కించపరిస్తే సహించేది లేదు అని ఎలుగెత్తి చాటుతోంది ఈనాటి ఫెమినిజం. అలా స్త్రీ యొక్క పరిపూర్ణ జీవితాన్ని సంస్కరించేదే అసలయిన ఫెమినిజం. అంతే కాదు వ్యక్తిత్వం, వ్యక్తి వికాసం, ఆత్మాభిమానాన్ని, ఆకాంక్షిస్తుంది ఫెమినిజం. అంటే శారీరక, మానసిక, రాజకీయ రంగాలన్నింటా పూర్తి స్వేచ్ఛా సమానత్వాలను వాంఛించేదే శిసలైన ఫెమినిజం.

నన్ను నా భర్త నానా హింసలు పెట్టబట్టే నాలో క్రౌర్యం, ద్వేషం, పగకలిగి పురుష జాతి విధ్వంసానికి పూనుకున్నానని ఒక పెద్దమనిషి సూటిగా అడిగాడు. నేను భర్తవల్ల ఇక్కట్లు పడ లేదు. కాని ఆనాటి సమాజం, పుట్టినిల్లు, మెట్టినిల్లు నన్నొక

ఆడదానిగా, అసహాయురాలిగా, అణచబడ్డ జాతి మనిషిగా, పురాణకాలపు మహిళగా మాత్రమే మలిచాయి. అది నాకే పరిమితం కాదు. నా బాల్యపు రోజుల్లో మహిళలందర్ని అలాగే చూసేవారు. ఇంకా హింసలు కూడా పెట్టేవారు. అలాంటి పరిస్థితి మనదేశంలోనే కాదు. యావత్ప్రపంచంలో నిండి వుంది. అలాంటి వాతావరణంలో పుట్టి పెరిగిన నేను, ఎన్నో అడ్డంకులకు, అవరోధాలకు బలిఅయ్యాను. జీవితంలో ఎన్నో అవకాశాలు పోగొట్టుకున్నాను. విద్యకు నోచుకోలేదు. ఇక ఉద్యోగం గురించి ఆలోచించే అవకాశమే లేదు. కేవలం ఒక తల్లిగా, భార్యగా మిలిగిపోక తప్పలేదు. అలా అజ్ఞానాంధకారంలోకి, మూఢ విశ్వాసాల ఊబిలోకి నేను నెట్టి వేయబడ్డాను. అలా ఆనాడు అహరహం పరిస్థితుల ప్రభావానికి తలవంచక తప్పని నేను, స్వేచ్ఛ కోసం అలమటించి పోయేదాన్ని. క్రమేపి మానవ విలువలు తెలిసికొన్నా. అవి గుర్తించిన వారు బందీలుగా మనలేరు కదా! ఆ ప్రభావంవల్ల నాలో మార్పు కలిగి తద్వారా నా గురించేకాక తోటి స్త్రీల పరిస్థితి గురించి కూడా ఆలోచించడం మొదలు పెట్టాను. వారు పురుషాధిపత్యం వల్ల, సాంఘిక దురాచారాల వల్ల, తమలోని అజ్ఞానం వల్లా తొక్కబడుతున్నారని, పరిస్థితుల ప్రభావానికి తల ఒగ్గక తప్పడం లేదని గ్రహించాను. అవకాశం లభించగానే ముందుగా నా శృంఖలాలను త్రెంచుకొని వెంటనే ఫెమినిష్టునయ్యాను. ఇదంతా నా స్వానుభవంవల్లా, లోకానుభవంవల్లా జరిగిన పరిణామం. ఒక్క మాటలో చెప్పాలంటే నా స్వయంకృషితో అనాగరిక దశనుండి ఆధునిక దశకు ఎదగగలిగానంటే ఒక స్త్రీగా నాటి నా పరిస్థితులే నన్ను ఒక ఫెమినిష్టుగా మలిచాయి.

## హ్యూమనిస్టు ఫెమినిజం

ఫెమినిస్టుగా మారిన నేను నా ఫెమినిజానికొక ప్రత్యేక సిద్ధాంతాన్ని రూపొందించాను. దానికి 'హ్యూమనిస్టు ఫెమినిజం' అని పేరు పెట్టాను. అంతకుముందే పలు విధాలైన ఫెమినిజాలు అంటే లిబరల్ ఫెమినిజం, మార్క్సిస్టు ఫెమినిజం, సోషలిస్టు ఫెమినిజం, రాడికల్ ఫెమినిజం, కల్చరల్ ఫెమినిజం అనేవి అమల్లో వున్నాయి. వాటిలోని మంచి చెడులను పర్యవేక్షించి, క్షీర నీరన్యాయంగా విభజించి వాటిలో ఆచరణయోగ్యమైన వాటిని ఏర్చి కూర్చి సమన్వయ పరచాను.

లిబరల్ ఫెమినిజంలోని పెట్టుబడిదారీ విధానాన్ని కాదని సాంఘిక, ఆర్థిక, రాజకీయ సాంస్కృతిక రంగాలలో ప్రతిపాదించిన స్త్రీ పురుష సమానత్వాన్ని నేను గౌరవిస్తాను. రాజకీయ పార్టీలకు అనుబంధంగా కాకుండా, సాధారణ పోరాటానికి అనుబంధంగా కాక మహిళోద్యమం స్వతంత్ర ప్రతిపత్తి కలిగివుండాలనే సోషలిస్టు ఫెమినిజాన్ని ఆమోదిస్తాను. ఆర్థిక సమానత్వం సాధించే పోరాటం ద్వారా మాత్రమే స్త్రీ విముక్తి సిద్ధిస్తుందనే మార్క్సిస్టు వాదాన్ని నిరసిస్తూ మహిళలకు ఆర్థిక స్వాతంత్ర్యం హెచ్చుగా

వుండాలని నేను వాంఛిస్తున్నాను. పురుషజాతి లైంగిక దౌర్జన్యాన్ని నిరసించే రాడికల్ ఫెమినిజాన్ని మెచ్చుకుంటున్నాను. అయితే అందులో ప్రముఖ పాత్ర వహించే పురుష ద్వేషాన్ని మాత్రం సమర్ధించను. స్త్రీకి మాత్రమే ఉత్తమ గుణాలున్నాయనే సాంస్కృతిక (కల్చరల్) ఫెమినిజాన్ని కాదని స్త్రీ పురుషులిద్దరిలో ఉత్తమ గుణాలుంటాయని వాదిస్తున్నాను.

నేను నిర్వచించే ఫెమినిజానికి 'హ్యూమనిస్టు ఫెమినిజం' అని పేరు పెట్టాను కదా! వాస్తవికత పై ఆధారపడి, సమగ్ర పరిశీలనవల్ల పుట్టి, సమ్యక్ దృక్పథంతో విలసిల్లే హ్యూమనిష్టు ఫెమినిజాన్ని నేను ప్రతిపాదిస్తున్నాను. ఇంటిపని, పిల్లల పెంపకం ఆమెకే కేటాయించడం అక్రమమని, స్త్రీ పురుషుల మేధా సంపత్తిలో తేడాలు, వ్యత్యాసాలు లేవని ఇది వక్కాణిస్తుంది. మార్క్సిస్టు ఫెమినిస్టుల వలె స్త్రీ విమోచనోద్యమాన్ని రాజకీయ ఆర్థిక పోరాటాలకు బలి చెయ్యదు. కేవలం భావాల మార్పువల్ల సమస్యలు పరిష్కారం కావు కనుక భావ విప్లవాన్ని సామాజిక పరివర్తనా కార్యక్రమాన్ని ఏకకాలంలో సాగించాలంటుంది. వర్గ పోరాటం పేరుతో సీ విమోచనోద్యమాన్ని అణచి పెట్టడం తప్పు. అలాగే స్త్రీ విమోచన పేరుతో సమాజంలోని దోపిడి పద్ధతులను గుర్తించక పోవడం పొరపాటు. సామాజిక, ఆర్థిక, రాజకీయ, సాంఘిక రంగాలన్నింటా స్త్రీ విమోచనకు అరిమరికలు లేకుండా కృషి చేయమని ఉద్బోధించేదే, సమగ్ర స్త్రీ సంక్షేమాన్ని వాంఛించేదే హ్యూమనిష్టు ఫెమినిజం. ఇతర ఫెమినిష్టు సిద్ధాంతాల లోపాలను విసర్జించి వాటిలోని ఆచరణ యోగ్యమయిన వాటిని ఏర్చి కూర్చి ఒక నూతన ఫెమినిస్టు సిద్ధాంతాన్ని రూపొందించాను. స్త్రీల సమస్యలు సామాజిక సమస్యలు కనుక స్త్రీ పురుషులిద్దరినీ అవి బాధిస్తున్నాయని నా నిర్వచనం. తాము హెచ్చు అని పురుషులు భావించటం అంటే వారికి ప్రజాస్వామ్య యొక్క స్వరూప స్వభావాలు అర్థం కావటం లేదని నా భావం. అందువల్లల నా స్త్రీ విముక్తి ఉద్యమం ఫలితంగా స్త్రీ పురుషులిద్దరికీ ఒకే విధమైన స్థాయీ, హెూదా లభిస్తాయన్న మాట. స్త్రీ విముక్తిలోనే పురుష వ్యక్తిత్వ వికాసం ఇమిడి ఉంది. ఆ లక్ష్యంతోనే అంటే స్త్రీ పురుషులకు స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు సమానత్వ ప్రాతిపదిక పై కావాలని నేను ఫెమినిస్టుగా కృషి చేస్తున్నాను.

# 5. నేనెలా హ్యూమనిస్టు నయ్యాను

హ్యూమనిజాన్ని నేను నా జీవిత తత్వంగా స్వీకరించ గలిగానంటే దాని విశిష్టతను గురించి అది ఈ నాటికీ ఎంత వరకు ఉపకరిస్తుందో ముమ్మొందుగా పేర్కొనక తప్పదు. స్వేచ్ఛా పథం. సత్యాన్వేషణ, తాత్విక చింతన, ఆధునికత, శాస్త్రీయ దృక్పథం హ్యూమనిజం ప్రాతిపదికలు. మానవుడు హేతువాది కనుక నీతివాదిగా మనగలడు. అందువల్ల తర్కానికి అనుభవానికి ప్రాతిపదికగల నీతికి అగ్రస్థానం ఇస్తుంది హ్యూమనిజం. స్వేచ్ఛ, వ్యక్తి వికాసాలే సంఘ శ్రేయస్సుకు కొలమానమని అది నిర్వచిస్తుంది. ప్రజాస్వామ్యం పరిపాలనలోనే కాక మానవ సంబంధాలలో జీవిత విధానంలో కూడా ముఖ్య పాత్ర వహించాలంటుంది.

ఆర్థికమే పునాది అని సాంఘిక, రాజకీయ, సాంస్కృతిక, తాత్విక రంగాలు ఉపరితలాలని వాదించే కమ్యూనిజాన్ని కాదని ఆర్థికత కెంత ప్రాముఖ్యత కలదో భావాల బలిమికి కూడా అంత విలువా వున్నదని నిర్వచించేదే నవ్యమానవవాదం. ఈ విలువలన్నింటికీ మానవుణ్నే కేంద్రంగా స్వీకరిస్తుంది. అది వ్యక్తి వాదాన్ని గౌరవిస్తుంది. మానవుల సర్వతోముఖ వికాసానికి దోహదం చేస్తుంది. అంటే అన్ని రకాల దోపిడీలను, అణచివేతలను ప్రతిఘటిస్తుంది. నవ సమాజానికి నాంది పలుకుతుంది. అంతే కాదు అది కులతత్వాన్ని నిరసిస్తుంది. హెచ్చు తగ్గులను తేడాలను త్రోసి రాజంటుంది. అందులో మహిళాభ్యుదయం, హేతువాదం కూడా ఇమిడి వున్నాయి. మానవ జీవిత సర్వతోముఖ వికాసానికి అది ఒక సమగ్రమైన 'ఫిలాసఫీ'. ఈ తాత్విక చింతన 1956 నాటికి ఏమాత్రం తెలియని నేను ఒక ఫెమినిస్టుగా మారటానికి, రేషనలిస్టు కావటానికి మూలం హ్యూమనిజమే.

మానవవాద ఉద్యమంలో ఒక భాగం మహిళోద్యమం. అది కుల, మత, జాతి భేదాలను పాటించదు. పార్టీ రహిత ప్రజా స్వామ్యం దాని ధ్యేయం. కుటుంబ నియంత్రణను అది బలపరుస్తుంది. సెక్యులరిజం యొక్క ఆవశ్యకతను సమర్థిస్తుంది. అన్ని రకాల స్త్రీ పురుష తేడాలను తిరస్కరిస్తుంది. మానవుణ్ణి కేంద్రంగా స్వీకరించి అతని/ఆమె సర్వతోముఖ వికాసానికి ప్రాధాన్యమిచ్చే రాడికల్ హ్యూమనిజానికి నా జీవితం పెనవేసుకోవడం వల్లనే నేను ఈనాడు నా జీవిత కథ రాసుకోగల స్థితికి చేరుకున్నానని చెప్పుకోవడానికి నేనెంతో గర్వపడుతున్నాను.

ఈ సందర్భగా నన్ను ఒక పక్కా హ్యూమనిస్టుగా మార్చిన ముఖ్య సంఘటన చెప్పక తప్పదు. 1954వ సంవత్సరంలో ఎమ్.ఎన్.రాయ్ వర్ధంతి సభ పెట్టారు రాడికల్ హ్యూమనిస్టులు. నన్ను "రాయ్: స్త్రీలు" అనే విషయం పై మాట్లాడమని నా పేరు కరపత్రంలో వేశారు. నాకు అప్పటికి స్త్రీలకు సమస్యలున్నాయనిగాని, అవి పరిష్కరించాలని

గాని తెలియదు. ఆడదంటే అణుకువగా ఉండాలని, భర్తకు, అత్తమామలకు సేవ చేస్తూ పతివ్రతగా కడతేరాలని మా అమ్మమ్మ చేసిన బోధలు నమ్మిన దాన్ని. పూజలు, వ్రతాలు, నోములతో ఇంటెడు చాకిరీ చేస్తూ ఉత్తమ గృహిణిగా మన్నన లందుకుంటున్న రోజులవి. ఒక వంక భర్త రాజకీయ కార్యక్రమాలు, సామాజిక సమస్యల పై చర్చలు జరుపుతుంటే మరొకవంక అత్తమామలు వేదాంత చర్చలు, ఉపనిషత్తులు, బాష్యాల పై మీమాంసలు జరుపుతుండేవారు. ఈ ఉత్తర, దక్షిణ ధృవాల మధ్య ఆనాడు నేనొక అజ్ఞాన, అమాయక, అయోమయ జీవిని.

నా పేరు ప్రచురించిన నేరానికి రాయ్ వ్రాసిన 'భారతనారి ఆదర్శం' లోని సారాంశాన్ని రామ్మూర్తిగారు తెలుగులో చెప్పారు. అదంతా ఒక వారం 'బైహార్టు' చేసేశా. సరిగ్గా వేదిక ఎక్కుతుంటే నాకాళ్ళు వొణికాయి. నా నాలుక తడారిపోయింది. నిలువు గ్రుడ్లు పడ్డాయి. చెమటలు తుడుచుకుంటూ బిక్క మొఖంతో కుర్చీలో కూలబడ్డా. నా పరిస్థితిని, నా వాలకాన్ని గమనించిన మిత్రులు "చూచి చదవండి" అని మెల్లిగా అన్నారు. ఉక్రోషం వచ్చింది. ఊపిరి బిగబట్టి మేష్టారి ముందు స్టూడెంటులా ఆ పాఠాన్ని ఒప్పచేప్పేశా. కంఠస్థమని తెలియని ప్రేక్షకులు 'ఆహా ! పరవాలేదు, బాగానే ఉందంటూ' చప్పట్లు కొట్టారు. గండం గడచి బైట పడ్డా.

ఆ రాతంత్రా దీర్ఘంగా ఆలోచించా. ఆ పాఠ్యాంశం క్రమేపి నా సొంతమైపోయింది. సముద్రం లోని అలల్లా ఉవ్వెత్తున లేస్తున్న ఆ పదాలు, ఆ పోకడలు నన్ను కలవర పరచాయి. ఆ బట్టీయాన్ని అంటే రాయ్ భావాలను మళ్ళీ మళ్ళీ నెమరేసుకున్నా. "ఇంతవరకు కుటుంబాలలో శాంతి వుంటున్నదంటే అది స్త్రీకి వ్యక్తిత్వం లేని శాంతి "అన్నాడు. అంటే ఆ శాంతిని స్మశాన శాంతిగా నిర్వచించాడు. స్త్రీ గృహ దేవత, త్యాగమూర్తి అంటూ పొగడటం ఆమె దాస్యానికి బంగారు పూత పూయడమేనని అధిక్షేపించాడు. ఆమె బానిసత్వాన్ని, ఉంపుడుగత్తెలాంటి స్థాయిని పత్నీ ధర్మాలంటూ ఆమెకు 'బ్రెయిన్ వాష్' చేశారని నిరూపించాడు. ఈ పురుషాధిక్య భావాలను తమవిగా నమ్మిన మహిళలు వారి బంగారు సంకెళ్ళకు వారే మురిసిపోతున్నారని హెచ్చరించాడు. సగభాగమైన స్త్రీలు బానిసలుగా, కేవలం బిడ్డల్ని కనే యంత్రాలుగా జీవించడం అన్యాయం, అక్రమమని ఆరాటపడ్డాడు. కన్య పై తండ్రికి వుండే హక్కును భర్తకు ధారపోయడమే నేటి వివాహ తంతుగా అభివర్ణించాడు. వారిని కేవలం సెక్సు సింబల్స్‌గా వాడుకునే హక్కు ఎవరికీ లేదన్నాడు. సామరస్యం లేనప్పుడు విడిపోయే హక్కు స్త్రీకి వుండాలని ఆ గ్రంథం ద్వారా 1935లోనే అంత ఘాటుగా హెచ్చరించాడు. ఇలాంటివి ఎన్నో మరెన్నో ఎమ్.ఎన్. రాయ్ ప్రవచించిన ఈ భావాలన్నీ ఆ రాత్రంతా నాలో ప్రతిధ్వనించాయి.

నాలో జిజ్ఞాస ప్రారంభమయింది. 'మాకు తెలియకుండానే దాస్యాన్ని గౌరవంగా స్వీకరిస్తున్నామా? లేక తెలిసే వుంటున్నామా? ఆడదంటే అలా తలుపు చాటునుండి

మాట్లాడాలి. ఇలా తలవొగ్గి సంచరించాలి అనే ఆంక్షలు ఆచారాలు బోలెడున్నాయి కదా! వాటిని మనసారా జీర్ణించుకుని ఆచరిస్తున్నాం కదా! కుమారి శతకంలో నుండి "పడతికి ఇహపర సాధనమా పతియే కుమారి" అని మా తెలుగు మాష్టారు అర్థం చెప్పాడు కదా! రాయ్ ఆ భావాలకు వ్యతిరేక చేస్తున్నాడా? మరి మేమేం చెయ్యాలి? అనే ఆవేదన నన్ను భయ కంపితురాల్ని చేసింది. కేవలం స్త్రీల అసహాయ స్థితికి, అజ్ఞానానికి ద్రవించి మానవతతో ఆ పుస్తకం వ్రాసాడని కనిపించింది. అంతవరకు అసలు స్త్రీలకు అన్ని సమస్యలున్నాయని కాని, అవి సంస్కరించాలని కాని తెలియకుండా కూపస్థ మండూకాల్లో జీవిస్తున్నామనే సంచలనం నాలో చోటుచేసుకునుంది. వెంటనే నాకు జ్ఞానోదయమయింది. గాఢాంధకారంతో పడివున్న స్త్రీ జాతిలో రాయ్ వెలిగించిన జ్యోతే ఈ గ్రంథం. ఎప్పటికయినా ఆ 'భారత నారి ఆదర్శం' అనే గ్రంథం తెలుగులోకి అనువదించాలనే పట్టుదల పెరిగింది. 1985 నాటికి ఆకోర్కె నెరవేరింది. ఆ తెలుగు తర్జుమాకు రామ్మూర్తిగారి సహాయం నాకు చాలా దక్కింది. లేకపోతే ఆ పని జరిగేది కాదు ఏది ఏమయినా రాయ్ మహా మేధావి అని, దూరదృష్టి కలవాడని, సంక్షోభంలో పడి కొట్టుమిట్టాడుతున్న సమాజాన్ని, దేశాన్ని ప్రగతి పథాన నడిపించాలంటే సగభాగమైన స్త్రీ జాతి బానిసత్వాన్ని త్రుంచి వారిలో విజ్ఞాన జ్యోతిని వెలిగించి తద్వారా జాతినుద్ధరించాలని విశ్వసించాను. రాయ్ భావాల బలిమి వల్లనే నేను నా జీవితాన్ని హ్యూమనిస్టు ఉద్యమానికి అంకితం చేసుకొన్నానని ఆ మార్గాన్నే పయనిస్తున్నానని నిస్సందేహంగా చెప్పుకోగల స్థాయికి ఎదగ గలిగాను.

## హ్యూమనిస్టు సంఘాలలో; సభలలో

ఆ తర్వాత ఆంధ్రాలో సెక్రటరీ, ప్రెశిడెంటు లాంటి ఉన్నత పదవులను, ఆలిండియాలో నేషనల్ కమిటీ మెంబరులాంటి కొన్ని పదవులను స్వీకరించాను. సభలు సమావేశాలు, సెమినార్లు జరపుతూనే వున్నాను. ముఖ్యంగా 1978లో ప్రపంచ హ్యూమనిస్టు సభలకు వెళ్ళి పాల్గొనే అవకాశం నాకు లభించటం అదొక మహా గొప్ప 'యోగమని' చెప్పుకోగల్గుతున్నాను. చివరగా ఒక్కమాట, ఆనాటినుండి, ఈనాటి వరకు మహిళోద్యమానికి సేవ చేయటానికి ముఖ్య కారణం నేనొక ప్రముఖ హ్యూమనిస్టును కావడమే.

# 6. నేను

## ఎస్కేపిస్టును కాను

బాధ్యతలను తప్పించుకునే మనిషిని 'ఎస్కేపిస్టు' అంటారు. బాధ్యతలను నేను విస్మరిస్తున్నానని నా పై అపనిందలు మోపేవారు లేకపోలేదు. వారిని గురించి, వారి ఆరోపణలను గురించి కొద్దిగా ముచ్చటించవలసిన అవసరం కలుగుతుంది. తాము కొడుకు కోడళ్ళ సేవకు, మనుమలు, మనవరాండ్ర చాకిరికి అంకితమై తలమునకలవుతూ నేను కుటుంబ విషయాలు పట్టించుకోకుండా బాధ్యతలను తప్పించుకుంటున్నానని ప్రచారం సాగించే వారున్నారు. నామీద వున్న ద్వేషంతో క్రౌర్యంతో వారు అలా ప్రవర్తించడం లేదు. కేవలం వారి అలసత్వాన్ని సమర్ధించుకునే నిమిత్తం అలా చెబుతున్నారు. లేకపోతే, పరిచారికలు వున్నవారు, వనరులు సాధన సంపత్తి కలవారు ప్రజా సేవలో జొరబడక పోవడానికి సంజాయిషీ ఇవ్వడం కష్టం. అందుకని కుటుంబ భారాన్ని తామే మోస్తున్నట్లు చెబుతూ ఇతరులు బాధ్యతలను తప్పించుకున్నట్లు మాట్లాడతారు. పతి దేవుని సేవయే పరమార్ధమని, అత్తమామల సేవయే అమరత్వమని, మనుమల పోషణే మంచిపని అని వారు ప్రచారం చేయక తప్పడం లేదు. ఎవరు ఏపని చేసినా అది వారి ఇష్టాయిష్టాల పై ఆధారపడుతుంది. ఎవరూ ఎవరిని శాసించబూనటం లేదు. కాకపోతే తమ అశక్తతను కప్పి పుచ్చుకోవడానికి ఇతరులను తప్పుపట్టడం క్షంతవ్యం కాదు.

67వ సంవత్సరంలో నడయాడుతున్న నేను ఇప్పటికీ కుటుంబ బాధ్యతలు నెరవేరుస్తూనే వున్నాను. అత్యవసర పరిస్థితులలో కుటుంబ సభ్యులను ఆదుకుంటూనే వున్నాను. కాకపోతే సమాజమే నా కుటుంబమనే విశాల దృష్టి అలవడిన నాటినుండి సమీప కుటుంబీకుల యెడ శ్రద్ధ తగ్గినమాట వాస్తవమే. కొడుకు బాగోగులు చూడటానికి కోడలున్నది, కూతురు శ్రేయస్సును రక్షించడానికి అల్లుడున్నాడు. సంతానం పెద్దవారై సంపాదనా పరులై యుక్తాయుక్త జ్ఞానం కలవారై తమ చిన్ని కుటుంబాల బరువు బాధ్యతలను మోయగలిగినప్పుడు వారిని వారి మానాన వదలి పెట్టడం అసమంజసం కాదు.

గ్రామీణ స్త్రీల సంక్షేమాన్ని, శ్రామిక స్త్రీల శ్రేయస్సును నేను కాంక్షించడం లేదని వాటికోసం కృషి చేయడం లేదని నా పై నీలాపనిందలు నిండుగా వస్తున్నాయి. ప్రప్రథమంగ మధ్య తరగతిలో ప్రబోధ కార్యక్రమాన్ని కేంద్రీకృతం చేయటంవల్ల ఇలాంటి ఆరోపణకు అవకాశం వచ్చింది. గ్రామీణ స్త్రీలను ప్రభావితం చేయాలంటే విషయం తెలిసిన కార్యకర్తలు కావాలి. విద్యా, విజ్ఞానం వున్నవారిని కార్యకర్తలుగా తయారుచేయడం తేలిక, అవసరం కూడాను. దేశంలో అత్యధిక సంఖ్యలో వున్న శ్రామికులు మూగజీవులు.

వారిలో నిరక్షరాస్యత మెండు. అందువల్ల వారికి సమాచారం సరిగా అందదు. అంతేగాక సమాజంలోని 'అగ్ర' వర్ణాలవారి సంస్కృతి, 'అగ్ర' వర్గాలవారి నాగరికత ఇవి రెండూ పాటకపు జనాన్ని కూడా ప్రభావితం చేస్తున్నాయి. ఈ 'అగ్ర' వర్ణ 'అగ్ర' వర్గ సమాజాల విలువలను మానవ సమాజం తమదిగా చేసుకుంటుంది. సమాజంలో అణచివేతకు, దోపిడీకి గురి అవుతున్న శ్రామిక లోకం అభ్యున్నతి మార్గాన పయనించే దశలో 'సంస్కృతీ కరణ' (Sanskritization) పేర తమకన్నా, 'ఉన్నతుల' ఆచార వ్యవహారాలను, సామాజిక రీతులను, ఆలోచనలను తమవిగా చేసుకుంటున్నారు. అందువల్ల జమిందారీ యుగపు జాడ్యాలను, బూర్జువా భావాలను ఛేదించవలసిన అవసర ఎంతైనా వుంది. ఈ సంప్రదాయ సరళిని కొంతవరకైనా బ్రద్దలు కొట్టితే తద్వారా జాగృతిని పొంది చైతన్యాన్ని అలవరచుకున్న స్త్రీల సాయంతో శ్రామిక వర్గంలోనికి, గ్రామీణ ప్రజానీకంలోనికి చొచ్చుకుని పోవడం తేలిక అవుతుంది. ఇలాంటి పరిణామ ప్రక్రియనే చేపట్టాను. కాని దీని అంతరార్థం అవగతంకాని కాంతా లోకం నన్ను నా చర్యలను అవగాహన చేసుకోలేక పోయింది.

సామాజిక రుగ్మతలను నివారించడానికి సామాజిక సంస్కరణకు పూనుకున్నాను. కుల నిర్మూలనలోద్యమం, అభ్యుదయ వివాహ ప్రోత్సాహం, కుటుంబ నియంత్రణ ప్రచారం నా సామాజిక కృషికి నిదర్శనాలు. శ్రామిక మహిళా సేవ ద్వారా ఆర్థిక సహాయానికి పూనుకోవడం, వృత్తివిద్యా ప్రణాళికకు రూపాన్నివ్వాలని సంకల్పించడం ఆర్థిక కార్యక్రమంలో భాగాలు. అశేషంగా గ్రంథాలను, కరపత్రాలను వ్రాసి సారస్వత వ్యాప్తి చేయటం, సాంస్కృతిక అనాచారాలపై దాడి చేయడం నా సాంస్కృతిక కృషికి మచ్చుతునకలు. దేశంలోని పౌరులలో ఒకరిగా నాకున్న బాధ్యతను శక్తి కొలదీ నిర్వర్తించాను. ఓటర్లకు ప్రబోధం చేయడం, ప్రత్యామ్నాయ పథకాన్ని సూచించడానికి సాహసించి పోటీ చేయడం, రాజకీయ అవినీతిని రూపుమాపే రాజకీయ క్షాళనోద్యమంలో పాలు పంచుకోవడం, ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడినప్పుడు ధైర్యంగా నిలబడి కాపుకాయడం ఇవన్నీ నా బాధ్యతాయుత ప్రవర్తనా రీతులే.

నేను ఎన్నో బాధ్యతలను నెరవేరుస్తున్నా 'ఎస్కేపిస్టు'ను అని పరోక్షంగానైనా సూచించటం తీరని అపచారం.

## నే నెవరు? నా ఫిలాసఫీ ఏమిటి?

అసలింతకూ నేనెవరుగా జీవించాలనుకున్నాను. ఏం చెయ్యాలని ఊహించాను. ఎవరికోసం తపించాను? ఎంతవరకు కృతకృత్యురాలినయ్యాను? ఏం సాధిద్దామనుకున్నాను ఏం జరిగింది? నా ధ్యేయం సేవా దృక్పథమా? సాహిత్య ప్రచారమా? సంస్థాగత కార్యక్రమమా లేక ప్రబోధాత్మకమా? ఏ ప్రక్రియ నా అభిరుచికి

సన్నిహతం? మరి ఏ ప్రక్రియద్వారా నా ప్రచారం ప్రారంభమైంది? అసలింతకూ నాధ్యేయం, లక్ష్యం ఏమిటి? మరి సాధించిందేమిటి? అనే తాత్వికచింతన అప్పుడప్పుడూ నన్ను కలవరపరుస్తూ వుంటుంది. మొదటెలా ప్రారంభించాను? కడకేమి జరిగింది? ఈ పరిణామంలో ఎన్నో ఆటు పోట్లు, మరెన్నో సుడిగుండాలు, ఇంకెన్నో సంక్షోభాలు, విమర్శలు, మరచిపోలేని అభినందనలు. కొన్ని సంఘటనలు నన్ను ప్రోద్బలపరిచాయి. కొన్ని క్రుంగదీసిన సన్నివేశాలు కూడా వున్నా వాటిని నెట్టేసి ఎప్పటికప్పుడు ముందుకు సాగిపోగలిగే నిబ్బరం, ధైర్యం, ఆలోచనా వుండబట్టే అంతో ఇంతో అభివృద్ధి పొందగలిగాను. ఆడదానికి చదువెందుకు అని అడ్డుపడిన సమాజాన్ని అధిగమించడం ఆ రోజుల్లో అంత తేలిక కాదు. ఆడదానికి ఉద్యోగమా అని అధిక్షేపించే సమాజాన్ని త్రోసిరాజని హైదరాబాదు వెళ్ళి శిక్షణ పొంది ఆ తర్వాత గౌరవప్రదమైన ఉద్యోగాన్ని నిర్వహించాను. ఆడది పిల్లల్ని కనటానికే పుట్టిందనే ఆచారాన్ని కాలదన్ని కుటుంబ నియంత్రణను అమలు పరిచాను. కుల మతాచారాలను స్త్రీలే పోషించాలి అనే అర్యోక్తిని కించపరచి కులతత్వాన్ని ఛేదిస్తూ ఉద్యమాలు నిర్వహించా. మత ధర్మాలను మన్నించటం, పోషించడం స్త్రీ ధర్మాలలో ముఖ్యమన్న ధర్మ శాస్త్రాలను నిరసించి మతాతీతమైన సెక్యులర్ విధానాలను పాటించాను, ప్రచారం చేశాను. స్త్రీకి వ్యక్తిత్వం వుండరాదని ఆమె పరాధీనగా తనువు చాలించాలన్న మను స్మృతిని విమర్శిస్తూ స్వేచ్ఛా జీవిగా జీవిత రథాన్ని నడుపుకుంటూ దానికి ఎదురయ్యే అడ్డంకులను అధిగమించాను. తోటి స్త్రీ లోకానికి స్వేచ్ఛా సమానత్వాలు సాధించమనే హెచ్చరికలు అందిస్తున్నాను. సర్వరంగాలలో మానవ విలువలు కాపాడుకోగల హ్యూమనిస్టులుగా జీవించమని ప్రోద్బలపరిచాను. ఇలా మనగల్గటానికి మౌలికమైన కారణమేమిటి? అని ప్రశ్నిస్తే ఒకప్పుడు నాకు డబ్బు పైన, నగల పైన, ఆస్తుల పైన, పేరు ప్రఖ్యాతుల పైన వ్యామోహం మిక్కుటమే కాని వీటిని మించినదేదో వుందని అది మానవుణ్ణి ఉత్కృష్టజీవిని చేస్తుందనే భావం నన్ను అనవరతం దహించివేస్తూ వుండేది. అంతేకాదు తన అభివృద్ధి, తన సౌఖ్యం కోసం జీవించటం సర్వసామాన్యం. తనతోపాటు తనతోటి వారికి సాయపడాలనే తపన మానవత్వానికే మచ్చుతునక. అది మన కర్తవ్యం కూడా. ఈ మానవ విలువలలో నమ్మకమున్న నేను ఆ త్రోవనే పయనించాలని నిశ్చయించుకున్నాను. అలా నా ఆలోచనలన్నీ ఫలించాయి.

ప్రతి మనిషి ఒక విలక్షణమైన వ్యక్తి అయినా ఎవరి ప్రత్యేకత వారిది, ఎవరి సుగుణాలు వారివి. ఎవరి ప్రతిభ వారిదే, ఎవరి ప్రజ్ఞ, వారిదే, చివరికి ఎవరి బలహీనత వారిదే కనుక ఒక వ్యక్తిని అవగాహన చేసుకోవాలంటే ఆ వ్యక్తి యొక్క స్వరూప స్వభావాలను, చర్యా ప్రతి చర్యలను పరిగణనలోకి తీసుకోవాలి. అప్పుడే ఆ వ్యక్తిని సరిగ్గా విలువ కట్టగలం. హ్యూమనిస్టునని చెప్పుకున్నా రేషనలిస్టునని పేర్కొన్నా, ఫెమినిస్టునని ప్రకటించుకున్నా, ఎస్కేపిస్టును కానని రుజువు చేసుకున్నా, ఇన్ని చెప్పినా,

ఎంత చెప్పినా చెప్పాల్సింది మరేదో వుందనిపిస్తుంది. నా జీవిత చరిత్ర పూర్తిగా చదివిన వారికి నా ఆశయాలు, ఆకాంక్షలు, లక్ష్యాలు, ఆశలు, ప్రజా విశేషాలు, అసమర్థతలు అన్నీ అవగతమవుతాయి. ఇంకను నేనెవ్వరో మీరు నిర్ధారించుకోలేక పోతే, సమ్యక్ ధృక్పధంతో పరిశీలన చేసి ఒక్క మాటలో చెప్తాను. నేను మరెవ్వరో కాదు నేను నేనే!

## నా భవిష్యత్తు గురించి

ఒక విధంగా ఆలోచిస్తే సాహసమే నాజీవిత విధానమేమో అనిపిస్తుంది. మరొక విధంగా ఆలోచిస్తే నాబాల్య యవ్వనాలు ఒక తమాషా కథగా తోస్తుంది. మరి నాలక్షణాలేమిటి అని సర్వే చేస్తే నాలో కొంత జాగృతి, చైతన్య కలిగినప్పటినుండి ఎనలేని ధైర్యం ఆత్మ విశ్వాసం కలిగాయి. అనుకున్న పని చెయ్యటం, చేసింది చెప్పటం, దానినే ఆచరించటం అలవర్చుకున్నాను.

పట్టుదల, ధైర్యం, సాహసం ఈ మూడు లక్షణాలు నాలో మూర్తీభవించి వున్నాయి. ఎవరన్నా విమర్శిస్తారని భయం లేదు. ఏమి చేసిందని గుసగుసలాడతారనే సంకోచం లేదు. ఉన్నదేదో వున్నది లేనిదేదో లేదు. కాని నమ్మిన సిద్ధాంతాన్ని ప్రచారం చెయ్యటానికి వెరపు లేదు. అందువల్ల ఎగతాళి చేస్తారనే పిరికితనం అసలే లేదు. అనేకానేక భావాల సంపుటి నాకథ. ఇందులో ఎన్నో రకాలయిన భావాలు, సిద్ధాతాలు వున్నాయి. ఇదొక విధమయిన కలగూర గంప. ఎంతో కొంత పనికి వస్తుందనీ, ఎవరికి కావాల్సింది వారు స్వీకరిస్తారనే ఆత్మ స్థైర్యం నాకు వుంది. అందువల్లనే నా ఆత్మ కథ వ్రాయటానికి పూనుకున్నాను. దీన్ని మీరు ఎలా అర్ధం చేసుకున్నా మీమీద నాకు ఎనలేని కృతజ్ఞత వుంటుంది. ఎందుకంటే ఈ కథంతా చదివి నేనెవరో తెలుసుకున్నారు కనుక.

ఇక్కడో శపథం చేస్తున్నాను. ఇకముందు నాశక్తి యుక్తులను, వనరులను, చివరికి అసరమయితే నాప్రాణాన్ని సైతం స్త్రీ సంక్షేమానికి వినియోగించాలనే కృతనిశ్చయానికి వచ్చాను. ఇంతవరకు చేసినదానికన్నా చెయ్యబోతున్న కార్యరంగం మరింత పటిష్టంగాను, శాశ్వతంగాను నిలబడగల కార్యదీక్షను చేబూనాలనే ఆకాంక్ష నాలో పెనవేసుకు పోయింది. అంటే సంఘసేవలో తల్లులను, పిల్లలను, అక్క చెల్లెళ్ళను భాగస్వాములను చేసి వారిని స్వశక్తిపై ఆధారపడగల స్థితికి తేవడమే నాకర్తవ్యమని భావిస్తున్నాను. ఆకార్యభారాన్ని నెరవేర్చడమే నా అంతిమ ఆదర్శం.

## ఇది ఆత్మస్తుతి అంటారా?

నా దృష్టిలో ఇది ఆత్మ స్తుతి కాదు. పరనిందా కాదు. గత 40 ఏళ్ళుగా అంతో ఇంతో తపనపడి పనిచేస్తున్నాను; విమర్శలు సహిస్తున్నాను, కష్టాలు భరిస్తున్నాను. ఏ కొద్దిమందో నావల్ల మేలు పొందవచ్చు. కొన్ని సందర్భాలలో నా కార్యక్రమాల వివరణలలో

'నేను చేసున్నానని, చెప్పక తప్పదు. అదంతా నా ఆత్మస్తుతి కోసమని ఆక్షేపించేవారు వుండవచ్చు. 'నేను', 'నావల్ల' పదాలు వాడకుండా నాకథ ఎలా చెప్పగలను? అది నా స్వోత్కర్షగా వారు నన్ను విశ్లేషించుకోవచ్చు. అది అవతలి వారి నైజానికి నిదర్శనం. ప్రతి వ్యక్తికి అనేక లక్షణాలు ఉంటాయి. సేవా దృక్పథం, పట్టుదల, నిర్భీతి, నిస్వార్థం, త్యాగం, విద్వత్తు అన్నీ గాని కొన్నిగానీ వుంటాయి. వారు చేస్తున్నపని వారు చేశామని చెప్పుకోవడం అసహజం కాదు. జీవిత కథ వ్రాసేటప్పుడు అందులో నాకథ చెప్పేటప్పుడు 'నేను' అని చెప్పుకోకుండ ఎలా సాగుతుంది? అది స్వంత డబ్బా అని విమర్శిస్తే దానికి బాధ్యత నాదికాదు.

"అల నన్నయ్యకు లేదు, తిక్కనకు లేదు అస్మత్ బ్రాహ్మీమయ మూర్తి శిష్యుడగుటం జేసి" అన్నారు విశ్వనాథవారు. అంటే నేను శిష్యుడవటం వల్లనే చెళ్ళపిళ్ళ వారి కీర్తి ప్రతిష్టలు ఇనుమడించాయని చెప్పుకోగల ధైర్యం, ధీశక్తి ఎందరికుంటుంది? ఒక విధంగా అది నిజం కాదా? ఉదాత్తతలో విద్వత్తులో గురువుని మించిన శిష్యుడయినప్పుడు ఆమాట అనడం ఆత్మస్తుతి ఎందుకవుతుంది? వినయం, భక్తి, గౌరవం లేక కాదు. ఎంతటి ఆత్మ స్థయిర్యం వుంటే అంత మాట అన్నాడు అనేది ఒక కొలమానం. అసలు ఆయనలో ఆ విద్వత్తు వున్నదా, లేదా అన్నది చూడాలి కాని, అది పాండిత్య ప్రకర్షణ, ఆత్మస్తుతి అనడం అర్థరహితం. ఒక్కొక్కరు ఒక్కొక్క విధానంలో వ్రాస్తారు. ఉపన్యాసాలు ఇస్తారు. అవి వారి వారి పోకడలనుబట్టి వుంటాయి. ముక్కు తిమ్మన్న ముద్దు ముద్దుగా ఏడ్చెను, అల్లసాని పెద్దన అలవోకగా ఏడ్చెను భట్టుమూర్తి భళ్ళున ఏడ్చెను అంటారు. అంటే వారి వారి సాహితీ రీతులు, పోకడలు అలా వుంటాయి. అలాగే నాచరిత్ర వ్రాసే విధానంలో నా ఉపన్యాస ధోరణిలో 'నా', 'నేను' అనే పదాలలో నా గురించి రావచ్చు. అంతగా నామీద సద్భావం వుంటే నన్ను గురించి 'స్టడీ' చేయడం తప్పుకాదు. కాని అది సద్విమర్శ కావాలి.

ఆత్మకథలో ఉత్తమ పురుష వాడక తప్పదు. నా ఆలోచనలు, భావాలు, అపోహలు, సంకల్పాలు, ప్రయత్నాలు, కార్యాచరణలు ప్రవర్తనలో లోటుపాట్లు, నావల్ల ఇతరులకు కలిగిన మేలు, కీడులు అన్నింటినీ గురించి వ్రాయాలి కదా! నా ప్రేరకాలు, ఉద్దేశ్యాలు, దౌర్జన్యాలు, సద్గుణాలు, దుర్గుణాలు అన్నీ చోటు చేసుకోవాలి. అంతేకాదు చదువరి ఆశించేది స్పష్టంగా వుంటుంది. కార్యాచరణకు గడంగిన నేను, జీవయాత్ర సాగిస్తున్న నేను పై విషయాలవల్ల, అంశాలయెడ ఎలా స్పందిస్తున్నానో చదువరి తెలుసుకోవాలని ఆశించడం సహజం, న్యాయం కూడాను. దానిని విశదీకరించే క్రమంలో నేను 'నేనుగా' కన్పించాలి. చేతనైనంతవరకు ఆ కృషి చేయడంలోనే ఈ ఆత్మకథ పుట్టింది. 'నా'తో నిండి నిబిడీకృతమయింది. ఎక్కడయినా అతిగా నన్ను పొగడుకున్నానని మీకు కన్పించినా లేక తోచినా ఆత్మకథ నిర్దేశించే ప్రయత్న ఫలితమని పాఠకులు సాదరంగా గ్రహించగలరని ఆశిస్తున్నాను.

## సందేశం

ఇంతకూ మీరు మాకిచ్చే సందేశమేమిటని అనేక సభలలో అడుగుతున్నారు కనుక ఇన్నేళ్ళ నా అనుభవం మీద నేను ఇపుడు చెప్తున్నాను.

ఏ వ్యక్తి అయినా తాను ఒక ఘనకార్యం చేయాలని తల పెడితే అది తప్పక నెరవేరుతుంది అది జయించలేకపోయామంటే ముఖ్యంగా అది మన ప్రయత్నలోపమే కాని దానికి మరో కారణం వుండదు. ఇది నా జీవితానుభవం నుండి నేర్చుకున్న మొదటి సత్యం. చదువుకోవాలని పట్టు పట్టడం, హేతువాదిగా బ్రతకాలనుకోవడం, వ్యక్తిత్వం, స్వేచ్ఛా, సమానత్వాలు నిలబెట్టుకోవాలనుకోవడం మహిళాభ్యుదయానికి మార్గదర్శకత్వం వహించాలనుకోవడం, సంస్థలను నిర్మించి తద్వారా స్త్రీ హిత కార్యక్రమాలు నిర్వహించాలనుకోవటం, సాహిత్యం ద్వారా ప్రబోధించడం లాంటివి నా పట్టుదలకు పడికట్టు రాళ్ళు; నిదర్శనాలు.

అంతే కాదు చిన్నప్పటినుండి పెద్ద పెద్ద సభలలో నేను ముఖ్య అతిథిగా ఆహ్వానించబడాలని, రాష్ట్ర సదస్సులకు పిలిపించుకోవాలని, రిసోర్సు పర్సన్ గా ఆహ్వానించబడాలని, యూనివర్సిటీ వారిచే కొనియాడబడాలని ఆశలు నాలో నిగూఢంగా వుండేవి. అవి కోర్కెలుగానే మిగిలిపోతాయేమోనని వ్యధ చెందుతూ వుండేదాన్ని. అవి ఉన్నత మేధావులకు పెద్ద పెద్ద డిగ్రీల వారికే పరిమితంగా వుంటాయని నాబోటి వారికి అందని ఫలాలనే భావం నన్ను వేధిస్తూ వుండేది. కాని నా సర్వశక్తులూ ధారపోసి, నా మేధస్సుకు పదును పెట్టి, నా కాలాన్ని వెచ్చించి నేను గత 40 ఏళ్ళుగా పడ్డ శ్రమకు ఫలితం దక్క లేదనుకోవటం భ్రమ. అయితే ఆ శ్రమ అంతా పేరు ప్రతిష్టల కోసమే గాని, నిజమైన సేవా దృక్పథంతో కాదని మీరు భావించినా తప్పులేదు. ఎంతటి వాడికి కూడా తన విద్వత్తును, మహత్తును గుర్తించిన వ్యక్తులు ఉంటే ఆనందమనండి, గర్వమనండి, అభివృద్ధికి సోపానమనండి, ఏదో ఒక విధమయిన తృప్తి, సంతోషం, వుంటుంది. కొంతమంది బైట పడతారు. మరికొంతమంది లోపలే ఆనందిస్తారు. కొంతమంది "ఈ సత్కారాలు, బిరుదులు అంటే నాకు వ్యామోహం లేదండీ! అసలు నేను వద్దు బాబూ అంటున్నా తప్పదని బలవంతం చేశారు" అనే వారూ లేక పోలేదు. అసలు డాక్టరేట్ ప్రదానం, పద్మ విభూషణ్ మీకు ఏనాడో రావాల్సిన గుర్తింపు, ఈనాటికైనా ఫలానా సంస్థ వారు మిమ్మల్ని గుర్తించి ఇవ్వడం వల్ల వారిని వారే గౌరవించుకున్నట్లుంది. అంటూ పొగడుతూ వుంటే అది నిజమని నమ్మటం మన అవివేకమని నా నమ్మకం. మనకే ఆ గౌరవాలు, సన్మానాలు, గుర్తింపులు పారితోషికాలు వద్దనుకుంటే, అంత అతీతుల మనుకుంటే మరొకరికి ఇస్తారు కదా! అసలు గుర్తింపుకోరని వారు ఉత్తములు, పనిచేస్తూ గౌరవం పొందాలనుకోవడం మధ్యముల స్వభావం, అసలు పనిచేయకుండా

గుర్తింపు పొందాలనుకునేది అధముల లక్షణం. నేను రెండో దశ నుండి ప్రథమ దశకు చేరే దెప్పుడో!

వ్యక్తి కోరేది ఆనందం. అది ఎలా వస్తుందంటే కొందరు డబ్బు కోరుకుంటారు. మరి కొందరు సేవా దృక్పథంతో పనిచేస్తారు. ఇంకొందరు కేవలం పేరు ప్రతిష్టల కోసమే చేస్తారు. తను తిన్నది, తనకున్నది, తన కోసం సంపాదించేది గొప్ప కాదు. నిల్వ చేయటం, అనుభవించటం, బిడ్డలకు ఇవ్వటం లాంటివి సర్వ సాధారణం. అంతటితో ఆనందం, తృప్తి వుండరాదు. సమాజమే తన కుటుంబమని, బాధితులే తన బిడ్డలనే భావం కలిగిన నాడు ఈర్ష్యా అసూయా, ద్వేషం, పగ చల్లారి పోతాయి. అప్పుడు మనలో కలిగేది అద్వితీయానందం. ఎలా చేసినా, ఏది చేసినా మన చర్యలు, ఆలోచనలు, లక్ష్యాలు ఇతరులు గుర్తించలేదు అనుకోవడం మన భ్రమ. ప్రతివారు వారి వారి అభిరుచులను బట్టి స్వీకరించ గలుగుతారు. అందరం త్యాగాలు చేస్తున్నామని చెప్పుకుంటే చాలదు. చేసి చూపించాలి. మనది మైనపు వత్తిలాంటి జీవితం. మైనం కరిగి పోతూనే వుంటుంది. అది దాని స్వభావం. అంటే మానవ జీవితం ఇతరులకు వెలుగునిస్తూ తాను హరించి పొయ్యే మైనపువత్తిలా కరిగిపోగల స్ఫూర్తి, మనలో జ్వలించాలి. అలాంటి వారి జీవితమే ధన్యత గడిస్తుంది. అందుకొరకై మనం తీరని ఆవేదనతో ఆర్తితో ముందడుగు వెయగలగాలి. చిత్తశుద్ధితో చేసే పనికి శాశ్వతత్వం వుంటుందనే భావం నాకుంది. దానికి వారసత్వం' – లేక "ఫాలోయింగు' వెతుక్కుంటూ వస్తుంది. మన మంచి చెడూ మన తదనంతరం బాగా బైట పడతాయి. అంతేకాదు. మన ఎదుట భట్రాజీయం కాదు కావాల్సింది. మన వెనుక మనల్ని గురించి వచ్చే విమర్శ గుర్తించాలి.

నా కొకటి అనిపిస్తుంది. అది తలచుకుంటే నిజంగా చాలా బాధగా వుంటుంది. నేను సమాజానికి చేసింది అత్యల్పం. నాకు దక్కిన ఘనత అత్యధికం. చేసిన సేవ ఒక్క శాతం వుందేమో! దానికే ఇంత పేరు ప్రఖ్యాతులు రావడం చాలా అన్యాయం. ఇక్కడ మరో ఆలోచన కూడా వస్తుంది. ఇంతమంది చేత మన్నన పొందుతున్నానంటే ఇంత మాత్రం కూడా చేసేవారు ఈ సమాజానికి కరువవుతున్నారేమో అని కూడా అనిపిస్తోంది. అది అక్షరాలా నిజం.

చివరిగా నా సందేశం ఒకటే – నా అనుభవం ద్వారా నే తెలుసుకున్నది, నా కథ ద్వారా మీకు చెప్పతలుచుకున్నదీ – అదే. మంచి పనులు, గొప్ప పనులు, పది కాలాలపాటు నిలిచేవి మనం చేసి మన జీవితానికొక సార్ధకత, మనకొక తృప్తినిచ్చే పని అదెంత భారమయినా దృఢ సంకల్పం వుంటే చెయ్యగలం. అసలు మనను ఎవ్వరూ కుర్చీ మీద కూర్చో పెట్టి గౌరవించి ఘనకార్యాలు చెయ్యమని చెప్పరు. అలాంటి అవకాశం లభించటం అంత తేలిక కాదు. పై పెచ్చు అనేక అవాంతరాలు వస్తాయి. వాటిని

అధిగమించి ముందడుగు వెయ్యటం మన ప్రథమ కర్తవ్యం. వారు సహాయం చెయ్యలేదని, వీరు అవకాశం ఇవ్వలేదని, మరొకరు విసుక్కున్నారని ఆలోచించి ప్రయోజనం లేదు. ఎవరో వచ్చి మనల్ని ఉద్ధరిస్తారని, అందలం ఎక్కిస్తారని ఆశించటం శుద్ధ తప్పు. ముందుగా ఎవరూ చేయూత నివ్వరు కనుక మన కోసం మనమే ఆ స్తోమతు సంపాదించుకోవాలి. అంటే అందుకు తగిన ధైర్యము, చొరవ తీసుకొని ముందడుగు వేయాలి. ముందుగా విజ్ఞానాన్ని సంపాదించుకొని తర్వాత పట్టుదలతో కార్యరంగంలోకి దూకాలి. భర్తగాని, భార్యకాని మరొకరు కాని తమను మించి ఆలోచించ లేరు. తమను కాదని మరొకరిని ప్రోత్సహించలేరు. మనం పూర్తిగా నిమగ్నమయి పోయినప్పుడు మాత్రం కొంతగా కొంత సహకరిస్తారు. కనుక నా ఈ అనుభవాల్లో నేనేర్చుకున్న దానిని మీ కందిస్తున్నాను. పిల్లలు వద్దన్నారని, భర్త వ్యతిరేకిస్తున్నాడని ఆలోచిస్తూ కూర్చుంటే ఏ పనీ చెయ్యలేము. మనం బైట ప్రపంచంలో తిరుగుతుంటే వారికి కొన్ని కష్టాలు వుంటాయి. అనుక్షణం వారికి సపర్యలు చెయ్యలేము. అందువల్ల వత్తిడి వస్తుంది. అంత మాత్రాన లొంగిపోరాదు. ఏది ఏమయినా మనకు మనమే ఉద్యమించాలి.

కేవలం పేరు ప్రతిష్టల కోసం సత్కార్యాలు, సేవా కార్యక్రమాలు చేసే వారి గురించి ఇక్కడ ఉటంకించాలని కాదు. ఎవరెస్టునధిరోహించటానికి ఒక జీవిత కాలం పడుతుంది. ఎంతో శ్రమపడి ప్రాణాలొడ్డి ఆ పనిచేసి జయించిన వ్యక్తికి, ఆనందం, ఉత్సాహం రావద్దని మనం అనగలమా? ఐన్ స్టీన్ లాంటి గొప్ప గొప్ప సైంటిస్టులకు తాము ఆశించిన ఫలితం దక్కినప్పుడు వారు ఉప్పొంగి పోరా? అలాంటి అద్భుతాలు నెరవేర్చిన వారికి ఒక విధమయిన తృప్తి కలగటం ప్రకృతి ధర్మం, మానవ లక్షణం.

నేనేమి చెయ్యగలను అనే నిరుత్సాహం మానవుణ్ణి క్రుంగదీస్తుంది. చేతనయిన మంచి పని, అది ఎంత చిన్నదయినా, చేసుకుంటూ పోవడమే మన లక్ష్యం కావాలి. ఎంత చీకటిలో నయినా ఒక చిన్న దివ్వె ఎంతో అంత వెలుగు నివ్వటం సహజం. ఆ దృష్టితో ఆలోచిస్తే ఆ పురోగమనమే మనకు వెయ్యి ఏనుగుల బలాన్ని ఇస్తుంది. ఆదోరకమైన తృప్తినిస్తుంది. ఎవరో చేస్తారని ఆశిస్తే అది ఎండమావి అవుతుంది. కనుక మనకు మనమే దూసుకు పోవటం వల్లనే అడ్డంకులను అధిగమించి ముందడుగు వెయ్యగలం. ఏ మంచి పని అయినా ఆలస్యం లేకుండా అదే పనిగా ఆలోచించకుండా కొనసాగించాలనేది నా సందేశం.

## ఆలస్యం అమృతం విషం

ఎంత గొప్ప ఆలాపన అయినా ముక్తాయింపు తప్పదు. ఎంత గొప్ప కావ్యమయినా ముగింపు తప్పదు. ఎంత గొప్ప మహానదయినా సముద్రంలో కలిసి పోక తప్పదు. అలాగే నా ఆత్మకథ ప్రస్తుతానికి సమాప్తమవుతున్నది. నేను చేసిన ఘనకార్యాలవల్ల

చదువరులకు ఉద్వేగం, ఉత్సాహం, ఆర్తి ఉద్భవిల్లి తద్వారా వారిలో జిజ్ఞాస, సామాజిక స్పృహ కల్గి వారు ప్రజా ఉద్యమాలలో భాగస్వాములు కావటానికి, ప్రజాసమస్యలను తీర్చి దిద్దటానికి, త్యాగం చెయ్యటానికి, పరుల శ్రేయస్సుకై పరితపించటానికి వ్రాశాను. కాని కేవలం నేనే త్యాగశీలిని, సేవా తత్వం గల దాన్ని అని పొగుడుకోవటానికి వ్రాయలేదు. అలా అయితే అది శుద్ధ తప్పు. నాకంటే ఎందరో ఎన్నో రంగాలలో ఘన కార్యాలు సాధించిన వారున్నారు. వారిని చూచి నేను సిగ్గు పడాలి. కనుక నా జీవితకథ చదివిన వారికి స్పందన కలిగి తామూ జిజ్ఞాసాపరులు కాగలగాలి. అదే నా చివరి కోరిక.

1924లో నే పుట్టినప్పుడు దేశం చాలా అస్థవ్యస్థంగా వుంది. వర్ణాశ్రమ ధర్మాలొకవైపు, కుల మత ఛాందసాలు మరొకవైపు, సనాతనాచారాలు, మూఢ విశ్వాసాలు, కుళ్ళిపోయిన కుల వ్యవస్థ, పరుషాధిపత్యంతో విలసిల్లే కుటుంబ వ్యవస్థ, భరింపరాని అంటరానితనం, ఊబిలో దిగిపోయిన మహిళా లోకం, హెచ్చు తగ్గులున్న నిచ్చెన మెట్ల సమాజం, తెల్లవారికి దాస్యం వహిస్తున్న రాజకీయ వ్యవస్థ, ఒక వంక స్వదేశ సంస్థానాలు, మరొకవైపు జమిందారీ పరిపాలన, భూస్వామ్యాధికారం, పెట్టుబడిదారీ విధానం, విదేశాల బెదిరింపులు ఇన్ని రకాలయిన విచ్చు కత్తుల మధ్య నలిగిపోతున్న భారతదేశ విముక్తికి పాటుపడుతున్న దేశ భక్తులైన లాల్, బాల్, పాల్ లాంటి వారు హతమయినారు. అప్పుడే గాంధీ యుగం (ERA) మొదలయి విజృంభిస్తున్న తరుణం. స్వాతంత్ర్యానంతరం ఆ పాత స్మృతులన్నీ చెరిగి అనేక మార్పులొచ్చాయి. అలాగే ఆనాటి స్త్రీ స్థానం కేవలం ఒక మట్టి బొమ్మ లాంటిది. క్రమేపీ ఆమె స్థాయి ఒక ప్రాణమున్న జీవి స్థాయికి ఎదిగింది. అప్పుడు చండశాసనులయిన భర్తలను స్త్రీలను దయగా చూడమన్నారు. ఆ తర్వాత ఆమె ద్వితీయ శ్రేణి వ్యక్తిగా ఎదిగింది. ఇది మూడవ దశ. ఈనాటి స్త్రీ రక్షణకు కొన్ని చట్టాలు, హక్కులూ ఆమెకు సంక్రమించాయి. కాని వాటిని అందుకోలేని అసమర్థత ఆమెను ఆవరించి వుంది. తరతరాల చీకటి తొలగిపోవాలంటే ఒక్కసారిగా వెలుగును చూడలేము కదా! అందువల్లే ఆడవారి హత్యలు, ఆత్మహత్యలు, అత్యాచారాలు అధికస్థాయిలో జరుగుతున్నాయి. ఈ దారుణాలు ఎలా మార్చగలము అనే దానికి నా తుది విజ్ఞప్తి ఒక్కటే. ఈనాటి సమస్యలను ధైర్యంగా ఎదుర్కొనండి, ఆత్మహత్యలకు ప్రయత్నించకండి. సమస్యలకు పరిష్కారం మరణం కాదు. కావాల్సింది గుండె ధైర్యం, ఎదురీత, ఐకమత్యం. మన కాళ్ళమీద మనం నిలబడ గలిగితే సగం సమస్యలు సమసిపోతాయి. అది లేనప్పుడు మనల్ని కాపాడే వారు ఎవ్వరూ వుండరు.

ఏం చేయాలి అని ఏ స్త్రీ మరొకరిని అడగవలసిన అగత్యం లేదు. తన వ్యక్తిగత పురోగమనాన్ని, సామాజికాభ్యుదయాన్ని కాంక్షించే స్త్రీ తన ఆసక్తిని, అభిరుచులను, ప్రవేశాన్ని, శక్తియుక్తులను, అవకాశాలను అన్నింటిని లెక్కలోకి తీసుకొని తన

కార్యరంగాన్ని నిర్ణయించుకోవాలి. సామాజిక, కౌటుంబిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక, తాత్విక, లైంగిక రంగాలలో కనీసం దేనినో ఒక దానిని ఆమె ఎంపిక చేసుకోవాలి. మరీ ప్రతిభావంతురాలయితే సమాజంలోని అనేకరంగాలలో కృషి చేయవచ్చు. ఈ కృషికి ఐకమత్యంతో ఉద్యమించడమే భారత స్త్రీల కర్తవ్యం. ఇప్పటికే స్త్రీ జాతి చాలా నష్టపోయింది. ఆలస్యం అవాంఛనీయం.

## వెనుక చూపు

జరిగిన జీవిత గమనాన్ని పరిశీలిస్తుంటే ఎన్నో పొరపాట్లు, తప్పిదాలు, అసంకల్పిత చర్యలు గోచరిస్తున్నాయి. చేసిన మంచి స్వల్పం, చేయవలసినది అనల్పం. ఆశయాలు దొడ్డవే; కాని ఆచరణ వాటిని అందుకోలేక పోయింది. కొద్దిపాటి మంచి కనిపిస్తేనే పొంగిపోయిన ఈ సమాజం, కాస్త మేలు జరిగితేనే సంతోషించిన ఈ సమాజం నన్ను ఎంతో ఆదరించింది. సమాజపు పరిగణనకు, సన్మానాలకు తాత్కాలికంగా ఉబ్బితబ్బిబ్బయినా అంత ఉబలాటం శ్రేయస్కరం కాదని విజ్ఞుల ప్రవచనాలు, సహచరుల ఉద్బోధలు నన్ను మేల్కొల్పాయి. అన్నీ వున్న విస్తరి అణిగిమణిగి వుంటుందనే సత్యం నాకు వినయాన్ని నేర్పింది. ఆ బాటన జీవిత పయనం సాగించు కోవాలనే తపన హెచ్చయింది. కాని మిత్రులొకరు అన్నట్లు నేను "ఆలస్యంగా బ్రద్దలయిన అగ్ని పర్వతాన్ని". నిద్రాణమై వున్న అసంతృప్తి, ఆక్రోశం నాలో ఉద్ధృత స్వభావాన్ని పెంచి పోషించాయి. సుడులు తిరుగుతూ సాగిపోయే వాగులాగా ఊపుగా నడయాడాను. గంభీర నదీ ప్రవాహం లాగా సంచరించడం అలవరచుకోవాలి. నిశ్చలత్వం, నిస్సంగత్వం నా జీవితంలో చోటు చేసుకుంటే నేను ధన్యాత్మురాలినే అవుతాను.

నా జీవిత రహస్యాలను వెలికి తీసి తెలియజేశాను కనుక నా మనోభారం చాలావరకు తగ్గిపోయింది. కనీసం నేను తెలిసి చేపట్టే చర్యల వల్లనయినా ఇతరులకు బాధ కలగకుండా సాయపడగలిగితే అదే నా జీవితానికి సార్థకత.

# భాగం – XI

# స్పందన : ప్రతి స్పందన

# 1. సమర్పణ

నిన్నటిదా మొన్నటిదా ఈ మన సాహచర్యం. అయిదున్నర దశాబ్దాల అనుబంధం, అందులో ఎన్నో మధుర క్షణాలు, మరెన్నో ఆనంద సన్నివేశాలు, ఎన్నో కలతలు, చింతలు, చికాకులు, చిరు చేదుల జల్లులు, మాట పట్టింపులు, మడత పేచీలు, మళ్ళీ అంతలోనే సయోధ్యలు, స్నేహామృత వర్షాలు.

ఎటు చూసినా,
స్త్రీ జాతికి కడగళ్ళు
సమస్యల విష వలయాలు
పీడన తాడన ప్రహరణాలు
వ్యధిత బాధామయ గాధలు

కసి పెరిగింది
మసక పుట్టింది
కోపం ముదిరింది
తాపం హెచ్చింది

ఎవడా దుర్మార్గుడు
ఎవడా దుర్జనుడు
ఎక్కడదీ ఈ అన్యాయం
ఎప్పటిదీ ఈ దౌర్జన్యం
కాల్చి వేస్తాను, మాడ్చి వేస్తాను

కాపురుష లక్షణాన్ని
కటికతనాన్ని
కార్పణ్యపు చేతలను
నా మహోజ్వల కోపాగ్నికి
సమిధగా బలిగా
పురుష దురహంకారాన్ని పూంజీవాదాన్ని
కట్టెదుట నిల్పితివయ్యా రామయ్యా!

స్త్రీ జాతి జీవిత నౌకకు
జెండా చూపాను

దిక్సూచినై నిలచాను
చుక్కాని నడిపాను
స్త్రీ శృంఖలాల విచ్ఛేదన యజ్ఞంలో
అడుగడుగున తోడుగా నీవు
నా కీర్తి వెనుక నా కందిన గౌరవాల వెనుక
నిశ్శబ్దంగా నిలిచి వున్నావు నీవు
సంసార సాగర మధనంలో
సామాజిక మారణ సంఘర్షణలో
భయానక భీషణ సమరంలో
వెన్నెముకగా నిలిచావు నీవు

నిన్ను మించిన కీర్తి నాకిచ్చి
నా వెనుక నుండి స్ఫూర్తినిచ్చి
నీ అండ దండల నందించి
నీతిగ నిల్చింది నీవే రామయ్య!

చీరెలీయవచ్చు
నగలీయ వచ్చు
ఆస్తులీయ వచ్చు
అమృతంబీయ వచ్చు
అందల మెక్కించవచ్చు
సర్వస్వ మీయ వచ్చు
తనకు మించిన పేరు
ఇప్పించగలరె నీవె గాక

నను కన్నందుకు నా కన్న వారికి
నే కన్నందుకు నే కన్న వారికి
నిను కన్నందుకు నీ కన్నవారికి
సమ్మోద మిచ్చిన మహిళా లోకానికి
తీర్చు కున్నాను రుణము సంతృప్తిగాను

రూకలివ్వవచ్చు రొక్క మీయవచ్చు
సాంగత్య మీయవచ్చు సంతోష మీయవచ్చు

సంపద నీయవచ్చు సంతృప్తి నీయవచ్చు
తీరగలదే నీ రుణం రామయ్యా!

హో! తెలిసెన్!
ఆ పరమ రహస్యం, మరి చెప్పనా?
నామాట నిలవాలి, నీ కోర్కె తీరాలి
శేష జీవితాన్ని పరహితార్థమ్ము కొరకు పంచి పెట్టి
తను ధన మనః ప్రాణాలు స్త్రీ విముక్తికి ధారపోసి,
మహిళోద్యమ సేవ చేస్తానని, నా వాగ్దానం నిలుపుకుంటానని
నీ ఆశయాలు నెరవేరుస్తానని
మాట ఇస్తున్నానయ్యా రామయ్యా!

నా అభిమానానికి, అనురాగానికి
నా కృతజ్ఞతకు సూచికగా
నా కృతిని, జీవిత స్మృతిని
జీవిత భాగస్వామిని
నీ కందిస్తున్నాను రామయ్యా!

# 2. నిర్ధార్యమాణం

– ఎం.వి. రామమూర్తి

నిజాయితీగా రాసిన ఆత్మకథ చదివితే ఒకరకంగా చాల 'నష్టం' కలుగుతుంది. చదువరిలోని నిజాయితీ పెల్లుబుకుతుంది. తన జీవితంలో నాగరికత పేర, సంస్కృతి పేర అణచివేయబడిన సత్యాలు వెలికి వస్తాయి. అసుఖమయినందు వల్లనో, మరెందువల్లనో ఎదుటికి రానీయని ఆలోచనలు భూగర్భ జలాల లాగ అవకాశం రాగానే దూసుకొని వచ్చి దర్శనమిస్తాయి. అదే ప్రక్రియ నాపట్ల జరిగింది.

తన విద్యాసక్తి ఇరువది యొక్క సంవత్సరాలు అణిగిపోవటానికి నేను కారణభూతుణ్ణి అని సుబ్బమ్మ గారు తమ ఆత్మకథలో రాసారు. ఆయన అలా ఎందుకు చేశారో యిప్పటికీ నాకు సంపూర్ణంగా తెలియదని రాసారు. అలా ఎందుకు జరిగిందో, దానికి నేను ఎంతవరకు బాధ్యుల్లో నాకు తెలుసు. ఇప్పుడయినా చెప్పలేకపోతే నేను దోష భావంతో ఆజన్మాంతం కుమిలిపోవలసి వస్తుంది. తప్పు చేసినవ్యక్తి ఎప్పటికయినా తప్పును ఒప్పుకొని తనవల్ల కలిగిన నష్టాన్ని పూడ్చ ప్రయత్నం చేయటం వివేకవంతుడయిన మానవుని లక్షణం..

ఆమెలో విద్యపట్ల జ్వలించే ఆర్తిని అంచనా వేయలేక పోవటం ప్రధమ దోషం. కేవలం నా వ్యక్తిత్వ వికాసాన్ని మాత్రమే లెక్కలోకి తీసుకొని ఆమె పురోభివృద్ధిని పట్టించుకోకపోవటం ద్వితీయ దోషం. సమిష్టి కుటుంబ ఐక్యతను దృష్టిలో పెట్టుకొని, స్వార్థపరంగా మాత్రమే ఆలోచించి ఆమె విద్యాభ్యాసాన్ని నిలిపి వేయించటం తృతీయ దోషం. నేను చేసిన ఇన్ని తప్పులవల్ల ఆమె వ్యక్తి వికాసం రెండు దశాబ్దాలకు పైగా వాయిదా పడ్డది..

సుబ్బమ్మ గారు ఈనాడు పేరెన్నికగన్న వ్యక్తిగా రూపొందారు. అనేకమంది స్త్రీ పురుషులు ఆమె అభ్యున్నతికి నేను కారణభూతుణ్ణని భావించి నన్ను అభినందిస్తుంటారు. పురుషులు అలా తలపోయడంలో ఆశ్చర్యం లేదు. పురుష జాతి ఎంతగా నాగరికతను అలవర్చుకున్నా ఎంతగా సంస్కృతిని సంతరించుకున్నా, తర తరాలనుండి నిక్షిప్తమై ఉన్న అహంకార భావాన్ని విడనాడలేదు. పురుష సహాయం లేనిదే ఏ స్త్రీ అభ్యుదయ మార్గాన పయనించలేదని పురుషుల ప్రగాఢ విశ్వాసం. అలా భావిస్తే వారికి తృప్తి, ఊరట. మరి స్త్రీలు ఎందుకు అలా యోచన చేస్తున్నారనేది మీమాంస. పురుషాధిపత్య సమాజంలో, పురుష ప్రాధాన్య సమాజంలో పురుషజాతి విలువలను పుణికి పుచ్చుకొని తమదిగా చేసుకున్న స్త్రీ సముదాయం అలా ఆలోచించడంలో ఆశ్చర్యం లేదు కదా! ఇంతకూ ఈ అభినందనలను విని చేయని పనికి వచ్చిన ఈ మెచ్చుకోలును తాపీగా హుందాగా స్వీకరించటం సబబేనా? కాదు, కానేరదు. అదే విషయాన్ని నేను గ్రహించాను.

ఆమెలో ఆర్తి జ్వాలగా లేచింది. మంటకు తోడ్పడే గాలి లాగ నేను సాయపడ్డాను అని సమాధానం చెప్పేవాణ్ణి. ఇది వినయ ప్రదర్శన అని వారు తలపోసేవారు. ఆ భావాన్ని వారు ప్రకటించడం కూడా పదే పదే జరిగేది. తమలోని కృతజ్ఞతాభావం వల్లనో, తమ సహచరుని మంచితనాన్ని కించపరచరాదనో ఆమె వారికి వంత పాడేది.

అసలు సంగతిని గురించి ఆకళింపు చేసుకుందాం. చదువుపట్ల ఆమెకున్న ఆకాంక్ష ఇరువది పైగా సంవత్సరాల వరకు ఆరిపోకుండా వుండడం నిజానికి ఆమెలోని విశేషగుణమే. ఎండిన పుల్లలతో ఎవరయినా మంటను లేపగలరు మరోమంట సాయంతో. తడిసిపోయిన కట్టె పుల్లలను ఎవరయినా మండించగలరా? ఇంకా లోతుగా ఆలోచిస్తే ఈ పోలిక తప్పని తేలుతుంది. సుబ్బమ్మ గారు తడిసిన భాస్వరం. పొడిగాలి వస్తే తడి యారిన భాస్వరం వలె ఆమె జ్వలించింది. ఆమె నివురు గప్పిన నిప్పు అని కూడా అనడం పొరపాటే అవుతుంది. ఆమె నికార్సు భాస్వరం. మండే స్వభావాన్ని నిక్షిప్తం చేసుకోగలగటం ఆమె నైజం..

"ఇంతవరకు విన సొంపుగానే ఉంది. మీ తదుపరి నడతకు సంజాయిషీ ఏమిటి?" అని ప్రశ్నించారనుకోండి. వాస్తవానికి అలాంటి ప్రశ్నను ఎవరూ వేయలేదు. అడగని ప్రశ్నకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత నాకున్నది. మనిషి దోషభావంతో కుమిలిపోతున్నప్పుడు తనవల్ల ఇతరులకు, అందులోను ముఖ్యంగా సన్నిహితులకు, జరిగిన నష్ట కష్టాలకు బాధ్యతను ఒప్పుకొని అలాంటి బాధ అవతల వారికి ఇక జరగకుండా జాగ్రత్త పడతాడు, వీలయితే నష్ట పరిహారం ఏదో రూపంలో చెల్లించుకుంటాడు. నేను అలాగే చేశాను. ఆమె చదువుకు, ఆమె అభ్యున్నతికి అడ్డు పడలేదు సరికదా వీలయినంత సాయం చేశాను. సుబ్బమ్మ గారి 'ఆధునిక స్త్రీ' అనే పేరుగల పుస్తకంలో 'నేను' అనే వ్యాసంలో 'ఎందువల్లనో రామ్మూర్తిగారు నావిద్యాభ్యాసాన్ని ప్రోత్సహించ లేదు' అని ఆమె రాసారు. ఆ పుస్తకంలో శుభకాంక్షలు అందిస్తు "రామ్మూర్తిగారు ఈశ్వర చంద్ర విద్యాసాగరు కన్నా గొప్పవారు" అని నార్ల వారు ఎందుకన్నారో! ఈ వాక్యాన్ని చదివిన నాకు చెమటలు పోశాయి. హుటాహుటిన వారి ఇంటికి వెళ్ళి నమస్క వినయంగా కూర్చున్నాను. చిన్నబోయిన నావదనం చూచి వారు "ఏమిటి విశేషం. ప్రశ్నించారు. నా వ్యథ వెలువరించాను. "పెద్దలు నన్ను ఈశ్వర చంద్ర విద్యాసాగర్‌తో పోల్చి పొగడడమా? అర్థం కావటం లేదు" అని వాపోయాను. ఆయన నవ్వి భార్య సులోచన గారిని పిలిచి ఈశ్వర చంద్ర విద్యాసాగర్ గారి జీవిత కథ పుస్తకాన్ని తెప్పించి ఆ పుట తీసి "చదువు" అన్నారు. ఈశ్వర చంద్ర విద్యాసాగర్ ఆ కాలంలో తనభార్యను విద్యావంతురాలిని చెయ్యాలని ప్రయత్నిస్తే తన తల్లి అభ్యంతరం పెడితే మానుకున్నాడని వ్రాసి వుంది ఆ పుస్తకంలో. "పైకి చదవండి" అన్నారు నార్ల వారు. చదివాను. "సుబ్బమ్మగారు గట్టిగా చదువుకు పట్టుపడితే మీరు కాదనలేదు

కదా!" అన్నారు. ఈ వాస్తవ సంఘటన నా స్మృతి పథంలో ఇప్పటికీ మెలగుతున్నది.

1958 నుండి ఇప్పటివరకు నావంతు సాయం నేను సుబ్బమ్మగారికి చేస్తూనే వున్నాను. ఇది చూచి చాలమంది ఆమెను అపార్థం చేసుకుంటున్నారు. ఆమె నన్ను వాడుకుంటున్నారని వారి భావం. చేసిన తప్పుకు ప్రతిచర్యగా మాత్రమే నేను ఈ పనికి పూనుకుంటున్నాను. ఆధ్యాత్మిక వాదులు అయితే దీనిని 'ప్రాయశ్చిత్తం' అని నామకరణం చేసేవారు. హేతువాదులం దీనిని 'తప్పు సరిదిద్దు కోవటం అంటాం'. మరో విచిత్రమైన క్లిష్ట సమస్య ఇందులో ఇమిడి ఉంది. మహిళోద్యమ వ్యాప్తికి సుబ్బమ్మ గారు తగిన కార్యకర్త కాగలరని నేను అచిరకాలంలోనే గ్రహించాను. ప్రజోద్యమాలలో, యువత ఉద్యమాలలో నిరాశకు లోనయిన నేను మహిళోద్యమం పట్ల మొగ్గు చూపే తరుణంలో యీ జ్ఞానోదయం నాకు కలిగింది. మరింత ఉత్సాహంతో, పట్టుదలతో ఆమెకు నాతోడ్పాటు అందించాను. సాయం చేస్తానంటే స్వీకరించని వారు అరుదు. సుబ్బమ్మ గారు కూడా ఈ సూత్రానుసారులే. తరువాత అలవాటుగా నా సాయాన్ని ఆమె డిమాండ్ చేసే స్థాయికి చేరారు. ఇటీవల నాకు దాపురించిన వృద్ధాప్యంవల్ల రుగ్మతవల్ల – ఈ డిమాండు పట్ల తార్కికంగా నాకు సుముఖత వున్నా, చిరు చిరాకు నాలో ఉత్పన్నమయింది. ఈ స్థితిని చూచి ఆమెను మరీ అపార్థం చేసుకోసాగారు ఇతరులు. చేయని పనికి ఆమె పై అనవసర నేరారోపణ అది! "ఈ కథంతా చెప్పడం ఎందుకు? మీ ఆవిడను స్తోత్రం చెయ్యటానికా?" అని ఎవరయినా ప్రశ్నిస్తే, (అలా యింతవరకు ఎవరూ అనలేదు. అసలు ఈ విషయాన్ని నేను ఇంత వివరంగా చెస్తే కదా వారు అనగల్గేది?) "కాదు, నిజాన్ని దాచటం ఇష్టం లేక "అని జవాబు చెప్పతలిచాను. నామనసులో మాటలు చెప్పి నా ఆవేదనను కొంత చల్లార్చుకున్నాను.

ఇక నా మనోవ్యథ సంగతి ముచ్చటిస్తాను. 1978లో నేనూ, సుబ్బమ్మ గారూ యిద్దరం యూరపు పర్యటన చేశాం కదా! విమానం ఎక్కేటప్పుడు, దిగేటప్పుడు దేశాల ఎల్లలను దాటేప్పుడు, దేశాలలో ప్రవేశించేటప్పుడు ప్రయాణీకులు వివరాలతో విషయ సేకరణ కార్డులు రాసి యివ్వాల్సి ఉంటుంది. అందులో ప్రయాణీకుని పేరు, తండ్రి పేరు లేక భర్త పేరు, చిరునామా, పుట్టిన తేదీ, పుట్టిన వూరు, అన్ని సమగ్రంగా రాసేవాళ్ళం. సుబ్బమ్మ గారు పుట్టిన వూరు "పోతార్లంక, రేపల్లె తాలూకా, గుంటూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్, ఇండియా" అని వ్రాసేవారు ఆమె. ఇదంతా చూస్తున్న నాకు మనస్సు పరి పరివిధాల పొయ్యేది. ఎక్కడ పోతారలంక, ఎక్కడి లండను ప్రపంచ మానవవాద సభలో ప్రాతినిధ్యం అని విస్తుపోయేవాణ్ణి. నా ఆలోచనలలో తళుక్కున మెరుపు మెరిసింది. మానవ సమాజ పరివర్తనా క్రమంలో ఈమె ఉత్తమస్థాయి పాత్ర నిర్వహించగలదని తోచింది. అంతే! ఆమె కృషిని ద్విగుణీకృతం చేసుకుంటో సాగిపోతుంటే పొంగి పొయ్యాను. 1986నుండి ఆమెకు గుర్తింపు వచ్చింది. పేరు ప్రఖ్యాతులువచ్చాయి.

మహిళోద్యమ కార్యకర్తల్లో, పార్టీయేతర్లలో పరిగణన వచ్చింది. సన్మానాలకు నోచుకోవడం, సారస్వత సృష్టి చేయడం, సేవారంగం విస్తరింప జేసుకోవడం, నిద్రాణమైన స్త్రీ జాతిని తన వక్తృత్వంతో మేల్కొలపడం సాగింది. ఈ పరిణామానికి మురిసిపోయాను. కాని ఏదో అసంతృప్తి నన్ను వెన్నాడుతూనే వుంది. ఆమె ఉత్తమురాలు కాలేదని నాబాధ. తను పూర్తికాలాన్ని ఆమె తమ ఆదర్శం కోసం లక్ష్యం కోసం వినియోగించవచ్చును. తమధనాన్ని, సంపాదనను వాటికోసం వెచ్చించవచ్చును. త్యాగాలు చేయవచ్చు. ఇన్ని చేసినా ఏదో వెలితి గోచరించేది. అదియేదో నాకే తెలియకుండా వుంది ఇన్నాళ్ళు. ఇప్పుడు ఆమె ఆత్మకథ చదివాక నాబాధ స్వరూపం నాకు అవగత మయింది. ఆమె ఈర్ష్యాసూయలను జయించ ప్రయత్నిస్తున్నా పొగడ్తలకు ఉబ్బిపోవటం, తెగడ్తలకు బాధపడటం మానలేదు అని తోచింది. ఉత్తముల స్థాయిని అందుకోవలసిన ఆమె మధ్యముల స్థాయిలో ఈనాటికి ఉండటం శోచనీయం. ఇది నావ్యథ. అయితే దీనికి కారకులు ఎవరు? సమాజమా? ఆమెయా? ఆమె బాల్య దశయా? ఆమెకు అడ్డు ఆటంకాలు కలుగ జేసిన కుటుంబీకులా? తరువాత ప్రోత్సాహాన్నిచ్చినా సకాలంలో సాయం చెయ్యని వ్యక్తులా? ఎవరో ఒకరు, ఏ ఒక్కరో దీనికి కారకులా? ఏదయినా ప్రస్తుత పరిస్తితి పరిశీలిస్తే నాకు మిగులుతున్నది తీరని వ్యథ.

సుబ్బమ్మగారిని గురించి రాద్దామని మొదలు పెట్టి నన్ను గురించి రాసేసాను కదా! బహుశః ఉపాధి (శరీరం) ఉన్నంతకాలం ఎంతవారయినా “నేను, నా” అనే వాటిని అధిగమించటం సాధ్యం కాదేమో!

# భాగం – XII

# అనుబంధం

# 1. తెలుగు గ్రంథాలు

1. ఆం.ప్ర. మహిళోద్యమం
2. హైందవం : స్త్రీలు
3. ఇస్లాం : స్త్రీలు
4. క్రైస్తవం : స్త్రీలు
5. సమస్యలు, సంస్కరణలు
6. మహిళా దశాబ్దం
7. స్త్రీ విమోచన
8. ఓ మహిళా ముందుకు సాగిపో
9. వనితాలోకం
10. మనం : మన సంస్కృతి
11. బానిసా కాదు, దేవతా కాదు
12. స్త్రీల పై అత్యాచారాలు
13. మత ధర్మ శాసనాలు : మహిళలు
14. స్త్రీల హక్కులు : సమస్యలు
15. బంగారు సంకెళ్ళు
16. హేతువాదం : స్త్రీలు
17. లైంగిక విప్లవం
18. వివాహం : నేడు, రేపు
19. మహిళా వికాసం : శ్రమ, ఉద్యోగం
20. వివాహం సంతానం కోసమేనా?
21. వరకట్న విశ్లేషణ
22. స్త్రీల లైంగికత : లైంగిక స్వేచ్ఛ
23. అశ్లీలం : అసభ్యత
24. వంశాంకురం
25. ప్రేమ + సెక్స్ = నీతి
26. వెలిగిన జ్యోతి
27. కాంతి కిరణాలు
28. చీకటి వెలుగులు
29. ఈ దేశం నాదేనా?
30. విషాద గాథలు
31. మాతృత్వానికి మరో ముడి
32. స్త్రీ విముక్తి – నూతన సిద్ధాంతం
33. స్త్రీ, స్వేచ్ఛ (89, 90, 91)
34. వ్యభిచారం ఎవరి నేరం
35. భావ వాహిని
36. భారత నారి ఆదర్శం
37. మహిళలపై దౌర్జన్యం
38. వ్యక్తిగత సమస్యలు – సమాధానాలు
39. వైవాహిక కుటుంబ సలహాలు
40. ఆధునిక స్త్రీ
41. విముక్తి ఉద్యమాలు–మహనీయులు
42. తల్లే పిల్లని చంపితే ...
43. ఏది అశ్లీలం?
44. మారుతున్న సమాజం : మహిళలు
45. మహిళాభ్యుదయం
46. మహిళ : నాడు, నేడు, రేపు
47. సామ్రాజ్ఞి రుద్రమదేవి
48. తరతరాల స్త్రీ పరాజయగాథ
49. మత సమాజాలు : మహిళలు
50. పాతివ్రత్యం నుండి ఫెమినిజం దాకా (ఆత్మకథ)

## 2. తెలుగు కరపత్రాలు

1. స్త్రీలకు ప్రత్యేక సమస్యలు వున్నాయా?
2. మానవ హక్కులు : మహిళల హక్కులు
3. స్త్రీల హెూదా : వివక్ష
4. వరకట్న మరణాలు : శిక్షలు
5. స్త్రీల పై అత్యాచారాలు
6. మతం : మూఢ విశ్వాసాలు
7. మత సమాజాలు : మహిళలు
8. మత ధర్మశాసనాలు : మహిళలు
9. కుల సంకెళ్ళు
10. వివాహ వ్యవస్థ
11. ఆడది : వంటపని, ఇంటిచాకిరి
12. ఇల్లాలి ఇంటి పేరు ఎందుకు మారాలి?
13. ప్రేమ వివాహాలు సఫలత చెందాలంటే
14. సామాజిక పరిణామం
15. జాతీయ సమైక్యత
16. హేతువాదం
17. హ్యూమనిజం : స్త్రీ విమోచన
18. స్త్రీ విముక్తి నూతన సిద్ధాంతం
19. కామన్ సివిల్ కోడ్ : స్త్రీలు
20. సెక్సు అపోహలు
21. సాహిత్యంలో స్త్రీ పాత్ర చిత్రణ
22. మహిళా దశాబ్దం : సాధించిన విజయాలు
23. ప్రపంచ స్త్రీల స్థితిగతులు : పోరాటాలు
24. మహిళోద్యమ చరిత్ర : అభివృద్ధి
25. మహిళాభ్యుదయానికి మహిళా పత్రికలు
26. వివాహం : దాంపత్య జీవితం
27. ప్రజాస్వామ్య వ్యవస్థ : స్త్రీలు
28. మాతృత్వం : శిశుపోషణ : కుటుంబ నియంత్రణ
29. ప్రజోద్యమాలు : మహిళోద్యమాలు
30. ఫెమినిజం అవసరమా?
31. లైంగిక విప్లవం
32. స్త్రీ స్వేచ్ఛ : యుటోపియా
33. సమానతా నువ్వెక్కడ?
34. అతివల పై అఘాయిత్యాలు, స్వచ్ఛంద సంస్థల ప్రతిఘటనలు
35. మహిళా జాగృతి : చైతన్యం
36. మూఢనమ్మకాలు నశించేదెలా?

## 3. ఇంగ్లీషులో భాషాంతరీకరణలు

## TRANSLATIONS INTO ENGLISH

1. WOMEN TRADITION& CULTURE (STERLING)
2. ISLAM & WOMEN (STERLING)
3. SAGA OF WOMEN'S STRUGGLE
   (INDIAN ATHEIST PUBLISHERS, DELHI)
4. WOMEN'S LIBERATION
   (MALLADI PUBLICATIONS, HYDERABAD)
5. HUMAN RIGHTS & WOMEN'S RIGHTS
   (ALL INDIA WOMEN'S CONFERENCE)
6. ATROCITIES ON WOMEN (A.I.W.C.)
7. PERSONAL LAWS (A.I.W.C.)

## 4. మళయాళంలో భాషాంతరీకరణలు

## (TRANSLATIONS INTO MALAYALAM)

1. SAGA OF WOMEN'S STRUGGLE
   (INDIAN ATHEIST PUBLISHERS) IAP)
2. HUMAN RIGHTS & WOMEN'S RIGHTS (IAP)
3. ATROCITIES ON WOMEN (IAP)
4. PERSONAL LAWS (IAP)

# 5. భేటీలు

| వరుస సంఖ్య | తేదీ | పత్రిక | రిమార్కులు |
|---|---|---|---|
| 1 | 19-8-80 | 'ఈనాడు' | తెలుగు దినపత్రిక |
| 2 | 4- 3-84 | 'దక్కన్ క్రానికల్ ' | ఆంగ్ల దినపత్రిక |
| 3 | 15-9-85 | 'ఆంధ్రభూమి' | తెలుగు దినపత్రిక |
| 4 | 10-11-86 | 'ఉదయం' | తెలుగు దినపత్రిక |
| 5 | 29-7-87 | 'కావ్యజ్యోతి' | తెలుగు మాసపత్రిక |
| 6 | 18-8-87 | 'కారవాన్' | ఇంగ్లీషు మాసపత్రిక |
| 7 | 25-5-88 | 'స్వాతి' | తెలుగు వారపత్రిక |
| 8 | 8- 9-89 | 'ఉదయం' | తెలుగు దినపత్రిక |
| 9 | 24- 9-89 | 'ది హిందు' (అభిప్రాయం) | ఇంగ్లీషు దినపత్రిక |
| 10 | 4-12-89 | 'జాగృతి' | తెలుగు వారపత్రిక |

## 6. జీవిత చిత్రణలు

| వరుస సంఖ్య | పత్రిక | వివరం |
|---|---|---|
| 1 | మాట్రిమోనియల్ | ఆంగ్ల పక్షపత్రిక |
| 2 | ఫెమిన | ఆంగ్ల మాసపత్రిక |
| 3 | ఇండియన్ ఎక్స్ ప్రెస్ | ఆంగ్ల దినపత్రిక |
| 4 | దక్కన్ క్రానికల్ | ఆంగ్ల దినపత్రిక |
| 5 | ఆంధ్రప్రభ | తెలుగు దినపత్రిక |
| 6 | ఆంధ్రభూమి | తెలుగు దినపత్రిక |
| 7 | ఆంధ్రపత్రిక | తెలుగు వారపత్రిక |
| 8 | వనిత | తెలుగు మాసపత్రిక |
| 9 | వనితా జ్యో తి | తెలుగు మాసపత్రిక |
| 10 | ఉమన్స్ ఈరా | ఆంగ్ల మాసపత్రిక |
| 11 | బ్యూటిఫుల్ ఉమన్ | ఆంగ్ల మాసపత్రిక |
| 12 | ఔల్ (వృద్ధ స్త్రీల సంఘపత్రిక) యు.ఎస్.ఎ. | ఆంగ్ల మాసపత్రిక |
| 13 | న్యూ హ్యూమనిస్టు (బ్రిటను) | ఆంగ్ల మాసపత్రిక |

# 7. సన్మానాలు : సత్కారాలు

| వరుస సంఖ్య | తేదీ | సంస్థ | ప్రదేశం | రిమార్కులు |
|---|---|---|---|---|
| 1 | 27-11-86 | 'అభినందన' | హైద్రాబాదు | దుర్గాబాయ్ దేశ్ ముఖ్ అవార్డు సన్మాన పత్రం, మొమెంటో |
| 2 | 10-01-87 | ఆలిండియా ఉమెన్స్ కాన్ఫరెన్స్ డైమండ్ జూబ్లీ మహాసభ | గ్వాలియర్ | నగదు, మొమెంటో |
| 3 | 18-03-88 | తెలుగు విశ్వవిద్యాలయం ముఖ్యమంత్రి శ్రీ ఎన్.టి. రామారావు సన్మానించారు "ఆం. ప్ర. మహిళోద్యమం (1860-1983)" పుస్తకానికి | హైద్రాబాదు | రూ. 3,000 నగదు బహుమతి |
| 4 | 12-03-89 | ప్రజాలోచన వేదిక, (ఉప్పల గోపాలరావు) దాసరి అనసూయమ్మ అవార్డు | హైద్రాబాదు | రూ. 1,000 నగదు సన్మాన పత్రం మొమెంటో |
| 5 | 28-12-83 | ఆంధ్ర మహాసభ | బొంబాయి | శాలువా మొమెంటో |
| 6. | డిసెంబర్ 1982 | ఓల్డ్ ఉమెన్స్ లీగ్ (వెక్సలర్) | హైద్రాబాదు | లాకెట్ |
| 7. | 13-02-62 | ఉపాధ్యాయినులు, మిత్రులు కుటుంబ నియంత్రణ గౌరవ ప్రబోధకురాలిగా నియామకం జరిగినప్పుడు | బాపట్ల | కుటుంబ నియంత్రణ కార్యకర్తగా |

| | | | | |
|---|---|---|---|---|
| 8 | 13-01-88 | 'అభినందన', హైద్రాబాద్ ద్వాదశ కవయిత్రులకు సన్మానం | హైద్రాబాద్ | రచయిత్రిగా |
| 9 | 18-11-88 | సిటీ సెంట్రల్ లైబ్రరీ హైద్రాబాదు 'లేడీస్ డే' సన్మానం | హైద్రాబాదు | ఒక రచయిత్రిగా |
| 10 | 10-12-89 | మెహిదీ పట్నం వెల్‌ఫేర్ అసోసియేషన్ | హైద్రాబాదు | సీనియర్ సిటిజనుగా |

# 8. రేడియో ప్రసంగాలు

| వరుస సంఖ్య | తేదీ | విషయం | ప్రదేశం | రిమార్కులు |
|---|---|---|---|---|
| 1 | 15-1-1971 | సామాజిక రంగంలో ఆత్యయిక పరిస్థితి – కుటుంబ నియంత్రణ | విజయవాడ | భేటి |
| 2 | 26- 7-81 | 'ఇది నా సమస్య' శీర్షిక | హైద్రాబాదు | ప్రశ్నలు సమాధానాలు |
| 3 | 27 - 9-81 | 'ఇది నా సమస్య' | " | ప్రశ్నలు సమాధానాలు |
| 4 | 15- 3-82 | దేవుడిచ్చిన పిల్లలు | " | కథ |
| 5 | 9-5-82 | ఇది నా సమస్య | " | ప్రశ్నలు సమాధానాలు |
| 6 | 27- 6-82 | ఇది నా సమస్య | " | ప్రశ్నలు సమాధానాలు |
| 7 | 29-8-83 | స్త్రీల దృక్పథం మారుతుందా? | హైద్రాబాదు | |
| 8 | 22-1-84 | విడాకులు ఆడవాళ్ళ సమస్యేనా? | " | |
| 9 | 29-10-84 | పిల్లల మానసిక సమస్యలు | " | |
| 10 | 2-11-84 | ఇందిరా గాంధీ | " | శ్రద్ధాంజలి |
| 11 | 19-6-83 | మహిళా సంక్షేమానికి కుటుంబ పరిమితి | " | |
| 12 | 16-3-86 | ప్రపంచ మహిళల స్థితి | " | |
| 13 | 3-9-86 | ఉన్నవ లక్ష్మీబాయమ్మ | " | స్వాతంత్ర్య సమర యోధుల కార్యక్రమం |
| 14 | 4-11-86 | సంక్షేమానికి ప్రజా సహకారం | " | సంక్షేమపథం కార్యక్రమంలో కల్తీలమీద |
| 15 | 24-5-86 | తెలుసుకో నీహక్కులు | " | |
| 16 | 17-2-88 | చిన్నకుటుంబతత్వం | " | |
| 17 | 16-6-86 | వివాహం పిల్లలకోసమేనా? | " | కుటుంబ నియంత్రణ |
| 18 | 2-5-87 | మంట కలిసిన మానవత్వం | " | నాటకం |
| 19 | 19-5-89 | " | " | పునఃప్రసారం |

| | | | | |
|---|---|---|---|---|
| 20 | 15-5-85 | సహకారోద్యమం స్త్రీలు సహకారోద్యమ సెమినార్లలో | ” | రిపోర్టు |
| 21 | 7-1-90 | యువత ఆలోచనల పై నా విమర్శ | ” | జీవన సౌరభం కార్యక్రమం |
| 22 | 14-1-90 | వివాహ ఎన్నిక ఎవరు చేయాలి? అనే విషయంపై యువత చెప్పిన అభిప్రాయాలపై నా విమర్శ | ” | ” |
| 23 | 21-1-90 | ప్రేమ వివాహాలపై యువత ఆలోచనలపై నా సమీక్ష | ” | సమీక్ష |
| 24 | 16-3-91 | వివాహ వ్యవస్థ | ” | |
| 25 | 12-5-91 | గ్రామీణ స్త్రీలకు జాగృతి | ” | |

**(బి) హైద్రాబాద్ రేడియోలో చర్చలలో పాల్గొనుట**

| వరుస సంఖ్య | తేదీ | విషయం | ప్రదేశం |
|---|---|---|---|
| 1 | 29-10-77 | యువతులకు ముందుగా కావలసింది విద్యా, ఉద్యోగమా? లేక వివాహమా? | హైద్రాబాదు |
| 2 | 14-12-77 | మనం ఎవరికి బానిసలం? | |
| 3 | 16-1-78 | మనం ఎవరికి బానిసలం? | |
| 4 | 1-7-78 | సినిమాల్లో స్త్రీ చిత్రణ | |
| 5 | 11-3-79 | వివాహంలో సమస్యలు | |
| 6 | 9-10-79 | కుటుంబ సంక్షేమం ప్రబోధం, పారితోషికం | |
| 7 | 1-1-80 | వివాహ వయోపరిమితి | |
| 8 | 17-2-80 | పిల్లల్లో వైజ్ఞానిక దృక్పథం | |
| 9 | 24-8-80 | స్త్రీలపై అత్యాచారాలు | |
| 10 | 3-9-80 | వివాహ వయోపరిమితి? | |
| 11 | 9-3-81 | ధరలను అదుపుచేయడం ఎలా? | |
| 12 | 19-7-81 | మంత్రితో చర్చ | |
| 13 | 12-5-82 | ఇతరులతో ప్రత్యేక కార్యక్రమం | |
| 14 | 29-7-82 | గ్రామలక్ష్మిలో | |
| 15 | 21-11-82 | సంఘ సేవ ఈనాడు సాధ్యమా? | |
| 16 | 13-6-84 | మన వివాహవ్యవస్థ : నాడు - నేడు | |
| 17 | 19-11-85 | కుటుంబ సంక్షేమం; స్వచ్ఛంద సంస్థలు | |

| | | |
|---|---|---|
| 18 | 25-10-87 | రైల్వే స్త్రీ ప్రయాణీకుల సమస్య |
| 19 | 24-10-88 | కొత్త శతాబ్దానికి స్వాగతం |
| 20 | 17-5-88 | మగ సంతానం పై మక్కువ |
| 21 | 18-7-88 | కుల వ్యవస్థను తొలగించడమెలా? |
| 22 | 28-8-88 | జాతీయ సమైక్యత: స్త్రీల బాధ్యత |
| 23 | 26-11-88 | సంఘ సేవలో స్త్రీలు |
| 24 | 24-12-88 | సమస్యలు : పరిష్కారాలు |

**(సి) మహిళా సంఘాల కార్యక్రమాలు**

| వరుస సంఖ్య | తేదీ | సంస్థ | ప్రదేశం | రిమార్కులు |
|---|---|---|---|---|
| 1 | 1960 | బాపట్ల ఉమెన్స్ కో ఆపరేటివ్ కాటేజ్ ఇండస్ట్రీస్ సొసైటీ | విజయవాడ | |
| 2 | 4-3-1970 | శ్రీ శారదా మహిళా విజ్ఞాన సమితి | బాపట్ల | |
| 3 | 21-4-70 | శ్రీ శారదా మహిళా విజ్ఞాన సమితి, బాపట్ల | విజయవాడ | రంగవల్లి కార్యక్రమం |
| 4 | 3-7-70 | ప్లాన్డ్ పేరెంట్ హుడ్ | హైద్రాబాదు | మహిళా కార్యక్రమం |
| 5 | 12-5-82 | మహిళాభ్యుదయ సంస్థ కార్యక్రమం | హైద్రాబాదు | రంగవల్లి |
| 6 | 12-2-84 | స్త్రీలు: ఉద్యోగాలు (సెమినారు రిపోర్టు) మహిళాభ్యుదయ సంస్థ | హైద్రాబాదు | |
| 7 | 11-12-85 | వరకట్నాల పై చర్చ మహిళాభ్యుదయ సంస్థ | హైద్రాబాదు | కదంబ కార్యక్రమం |
| 8 | 22-10-86 | స్త్రీలు : శాంతి సెమినారు రిపోర్టు మహిళాభ్యుదయ సంస్థ | హైద్రాబాదు | స్త్రీలకార్యక్రమం |
| 9 | 16-4-89 | మహిళాభ్యుదయ సంస్థ కందుకూరి సంచికా కార్యక్రమం | హైద్రాబాదు | ” |
| 10 | 24-4-91 | 'మన ఉద్యమాలలో మహిళా ప్రగతి' మహిళాభ్యుదయ సంస్థ తరఫున కార్యక్రమం | హైద్రాబాదు | రంగవల్లి కార్యక్రమం |

## 9. టి.వి.

| వరుస సంఖ్య | తేదీ | పత్రిక | రిమార్కులు |
|---|---|---|---|
| 1 | 2-1-81 | స్త్రీల పై అత్యాచారాలు | చర్చ |
| 2 | 17-1-81 | వరకట్న సమస్యలు | |
| 3 | 15-2-83 | నేటి సమాజంలో స్త్రీకి భద్రత వుందా? | చర్చ |
| 4 | 12-10-84 | వివాహంలో సమస్యలు ఇందిరాగాంధీ మరణం పై సంతాపం | సంతాప సందేశం |
| 5 | 3-11-84 | మహిళాభ్యుదయం | |
| 6 | 23-7-85 | ఏది అశ్లీలం | మోడరేటర్ |
| 7 | 8-10-85 | రైలు ప్రయాణాల్లో స్త్రీ సమస్యలు | చర్చ |
| 9 | 30-10-85 | అతిధిదేవోభవ | చర్చ |
| 10 | 16-11-85 | వరకట్న మరణాలు | అభిప్రాయం |
| 11 | 13-6-86 | మహిళలు-చట్టాలు | ప్రసంగం |
| 12 | 5-9-86 | వరకట్న మరణాలు- శిక్షలు | చర్చ |
| 13 | 24-11-86 | జాతీయ సమైక్యత | ప్రసంగం |
| 14 | 24-11-87 | జాతీయ సమైక్యత | మోడరేటర్ |
| 15 | 17-12-87 | మహిళల హోదా | చర్చ |
| 16 | 4-2-88 | వివాహ వ్యవస్థ | ప్రసంగం |
| 17 | 17-1-90 | ప్రసార భారతి స్వాతంత్ర ప్రతిపత్తి | అభిప్రాయం |
| 18 | 9-5-90 | నా గురించి ఇంటర్వ్యూ | |
| 19 | 19-6-90 | అట్టడుగు వర్గాల అభివృద్ధికి అంబేద్కరు | చర్చ |
| 20 | 15-11-90 | నెహ్రూ పై స్త్రీల ప్రభావం | చర్చ |
| 21 | 25-3-91 | అంబేద్కరు-సాంఘిక విప్లవం | చర్చ |
| 22 | 16-5-91 | ఎన్నికలు: స్త్రీల పాత్ర | చర్చ |

# 10. సంచికలలో వ్యాసాలు

| వరుస సంఖ్య | తేదీ | పత్రిక |
|---|---|---|
| 1 | 28-3-84 | 'విడాకులు - స్త్రీల సమస్య'<br>వనిత ఉగాది ప్రత్యేక సంచిక |
| 2 | 30-3-80 | కనుపర్తి వరలక్ష్మమ్మస్మారక సంచిక |
| 3 | 28-2-81 | వెంకటరమణ కాలనీ మహిళాసభ<br>వారి వార్షిక 'సంచికలో' మహిళా<br>సంఘాలు-మహిళలపాత్ర' వ్యాసం |
| 4 | 14-3-81 | వెంగళరావు నగర్ లేడీస్ క్లబ్<br>మూడవ వార్షికోత్సవ సంచికలో<br>'మహిళల ప్రత్యేక సమస్యలున్నాయా?' వ్యాసం |
| 5 | 9-7-82 | మహిళ విభాగ్ వారి సంచికలో<br>'స్త్రీలు- సంస్కృతి : సాంప్రదాయం |
| 6 | 7-5-85 | మలక్ పేట మహిళా సమాజం<br>రజతోత్సవ సంచికలో 'సాంఘిక,<br>ఆర్థిక పురోభివృద్ధిలో స్త్రీల పాత్ర' |
| 7 | 25-10-85 | ఆంధ్ర యువతిమండలి<br>గోల్డెన్ జూబ్లీ సావనీరు సంచికలో<br>'రాజకీయాల్లో స్త్రీలు' |
| 8 | 19-5-87 | ఓల్టేజ్ వెల్ ఫేర్ వారి సెంటర్ వారి<br>సంచికలో 'మహిళా సంఘాలు-వృద్ధ మాతలు' |
| 9 | 3-6-87 | ప్రత్తి శేషయ్య షష్టిపూర్తి సంచికలో |
| 10 | 18-8-88 | విజయవాడ మాంటిస్సోరి మహిళా కళాశాల సావనీరులో<br>'స్వాతంత్ర్యానంతరం స్త్రీల అభివృద్ధి సమస్యలు' |
| 11 | 27-8-84 | తుంగభద్రా మహిళా సంఘంవారి సంచికలో<br>'జాతి పునరుజ్జీవనంలో స్త్రీ పాత్ర' |
| 12 | 29-4-85 | ఏకశిలా అప్పర్ ప్రైమరీ స్కూలు వార్షిక సంచికలో నా సందేశం |
| 13 | 1989 | వృద్ధ మహిళా శ్రమం వారి సంచికలో వ్యాసం |
| 14 | 31-10-81 | 'జాగృతి' దీపావళి ప్రత్యేక సంచికలో 'బజారున పడిన మాతృమూర్తి' |
| 15 | 11-6-84 | యాదవ్ కమ్మెమోరియల్ వాల్యూమ్ లో<br>'మానవ విలువలుమహిళల డిమాండ్లు' ఇంగ్లీషులో |
| 16 | 25-12-90 | అంతరంగిణి సావనీర్ |

# 11. సెమినార్లలో పరిశోధనా పత్రాలు

| వరుస సంఖ్య | తేదీ | విషయం | నిర్వాహకులు |
|---|---|---|---|
| 1 | 11-3-79 | కుల నిర్మూలన- స్త్రీలు | కుల నిర్మూలనా సంఘం |
| 2 | 19-1-80 | స్త్రీల హోదా | |
| 3 | 17-3-81 | సంఘ సేవకుల సమస్యలు | |
| 4 | 21-3-81 | ఉమెన్స్ లిబరేషన్ | |
| 5 | 4-4-81 | సంఘ సేవకుల సమస్యలు | |
| 6 | 7-3-82 | వర్ణాంతర వివాహాలు | |
| 7 | 23-8-82 | గ్రామీణ స్త్రీల అభివృద్ధి | |
| 8 | 14-3-83 | స్త్రీలు-సాంఘిక భద్రత | జాతీయ మహిళాసమాఖ్య |
| 9 | 19-6-83 | గ్రామీణాభివృద్ధిలో యువజనుల పాత్ర | లెస్లీసహాని |
| 10 | 25-6-83 | | ఫామిలీ ప్లానింగ్ బ్యూరో |
| 11 | 13-8-83 | నాట్యకళ- స్త్రీలు | సిద్ధేంద్ర నాట్య కళాసమితి కూచిపూడి నాట్యకళాసమితి |
| 12 | 7-3-84 | ది రోల్ ఆఫ్ వాలంటరీ ఆర్గనైజేషన్, మహిళా మండల్స్ | హెల్త్ పాపులేషన్ అండ్ ఉమెన్ వెల్ ఫేర్ |
| 13 | 15-3-84 | ఏ నీడ్ ఫర్ ఉమెన్స్ పర్స్ పెక్టివ్ | స్కూల్ ఆఫ్ సోషల్ సైన్సు |
| 14 | 14-7-84 | తెలుగునాటకరంగం | విశ్వసాహితీవారి ఆధ్వర్యంలో |
| 15 | 22-9-84 | కమ్యూనల్ రైట్స్ | రజనీ కొఠారి, ఎం.వి.ఆర్ సంయుక్తంగా |
| 16 | 30-2-85 | ఉద్యోగుల సంక్షేమం | ఆంధ్ర యువతి మండలి |
| 17 | 18-12-85 | ప్రపంచ మహిళల స్థితి | హోంసైన్స్ కాలేజి |
| 18 | 12-4-86 | స్త్రీ విద్య | ప్రకాశం సంస్థ |
| 19 | 3-8-86 | నేటి పరిస్థితులు- స్త్రీల సమస్యలు | ప్రియదర్శినీ మహిళా అకాడమి. |

| | | | |
|---|---|---|---|
| 20 | 15-8-86 | నేటి సాహిత్యంలో స్త్రీ పాత్ర చిత్రణ | ప్రగతి సాంస్కృతిక రంగం, శ్రీకాకుళం |
| 21 | 1-3-87 | వరకట్న అత్యాచారాలు | స్త్రీ, శిశు సంక్షేమశాఖ |
| 22 | 27-9-87 | ఉమెన్ అండ్ దేర్ రోల్ ఇన్ క్రియేటింగ్ ఎన్విరాన్ మెంట్ | కర్నూలువారు |
| 23 | 25-1-87 | అశ్లీలం : అసభ్యత | మహిళాభ్యుదయ సంస్థ, స్త్రీ విమోచన |
| 24 | 24-4-88 | సమాజం - సాహిత్యం మహిళ | సిద్ధిపేట |
| 25 | 30-4-88 | జాతీయ సమైక్యత - స్త్రీలు | |
| 26 | 7-5-88 | ది రోల్ ఆఫ్ వాలంటరీ ఆర్గనైజేషన్స్ ఇన్ సోషల్ డెవలప్ మెంట్ | ఎన్.ఐ.ఎస్.ఏ. |
| 27 | 5-11-88 | ఉమెన్ అండ్ మీడియా | స్త్రీ మేళా |
| 28 | 12-11-88 | ది రోల్ ఆఫ్ వాలంటరీ ఆర్గనైజేషన్స్ | స్త్రీ మేళా |
| 29 | 20-11-88 | గ్రామీణ స్త్రీల పరిస్థితి | ప్రకాశం ఇన్ స్టిట్యూట్ |
| 30 | 26-11-88 | సమాన హక్కుల పోరాటంలో మహిళల హక్కులు | |
| 31 | 24-12-88 | ఉమెన్ ఏ మల్టీనేషనల్ ఆర్కిటెక్ట్ | లైనెస్ క్లబ్ |
| 32 | 27-1-89 | సోషల్ ఈవిల్స్ | గజ్వేల్ తాలుకా యువజన సంఘంవారు నెహ్రూ యువకేంద్రంవారు |
| 33 | 19-2-89 | ఉమెన్ రోల్ ఇన్ ప్రసెంట్ సొసైటీ | |
| 34 | 28-2-89 | | ఎన్.ఐ.ఎస్.ఏ ఏషియన్ అకాడమి రూరల్ డెవలప్ మెంట్ ఆఫ్ సోషల్ ఏక్షన్ |
| 35 | 16-6-89 | ది ప్రిపరేషన్ ఆఫ్ స్పెషల్ ప్రైమరీ ఫర్ ఉమెన్ | |
| 36 | 8-7-89 | స్త్రీల పై అత్యాచారాలు, వరకట్న మరణాలు | ఆర్య మహాసభ |
| 37 | 8-7-89 | అత్యాచారాలు | హైద్రాబాదు జిల్లా మహిళా మండలుల సమాఖ్య |

| | | | |
|---|---|---|---|
| 38 | 17-10-89 | ది రోల్ ఆఫ్ ఉమెన్ ఇన్ ఇండియా | సోషల్ వెల్ ఫేర్ బోర్డు |
| 39 | 19-10-89 | ఉమెన్ జర్నలిస్ట్ ఇన్ ఛేంజింగ్ సొసైటీ | పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం |
| 40 | 3-12-89 | ది రైట్స్ ఆఫ్ ది గరల్ చైల్డ్ | హైదరాబాద్ యూనివర్సిటీ |
| 41 | 26-2-90 | బాలికల హక్కులు | ఆనంద్ నగర్ మహిళామండలి |
| 42 | 27-2-90 | రోల్ ఆఫ్ ఉమెన్ ఇన్ నేషన్ బిల్డింగ్ | పద్మావతి మహిళా కళాశాల |
| 43 | 9-6-90 | బాలికల సమస్యలు పరిష్కార మార్గాలు | మహిళా దక్షత సమితి |
| 44 | 5-1-90 | ది రోల్ ఆఫ్ ది ప్రెసెంట్ సిస్టం ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ ఇన్ ది డెవలప్‌మెంట్ ఆఫ్ ఉమెన్ పవర్ | ఆంధ్ర మహిళా సభలు |
| 45 | 14-7-90 | ప్రస్తుత కల్లోల పరిస్థితుల్లో రచయితల పాత్ర | కృష్ణాజిల్లా రచయితల సంఘం |
| 46 | 7-8-90 | స్త్రీల సమస్యలు | కాంగ్రెస్ మహిళా విభాగ్ |
| 47 | 11-8-90 | ఉమెన్' ఎక్స్ ప్లాయ్ టేషన్ చిల్డ్రన్' ఎక్స్ ప్లాయ్ టేషన్ డ్రగ్ ఎడిక్షన్ | కౌన్సిల్ ఫర్ సోషల్ కన్సర్న్ |
| 48 | 12-10-90 | ఉమెన్ అండ్ మీడియా | స్త్రీ మేళా సందర్భంగా |
| 49 | 1-6-91 | సోషల్ రిఫార్మ్ మూవ్ మెంట్ అండ్ ఉమెన్స్ లిబరేషన్ ఇన్ ఎ.పి. | మధురై యూనివర్సిటి |

## 12. ప్రశ్నలు - సమాధానాలు

| వరుస సంఖ్య | తేదీ | పత్రిక | రిమార్కులు |
|---|---|---|---|
| 1 | 1-8-87 | "వనితా జ్యో తి' మాసపత్రికలో ప్రశ్నలు- సమాధానాలు 1987 ఆగస్టునెల నుంచి ప్రారంభమయి నేటివరకు కొనసాగుతున్నాయి | |

## 13. మహిళా వికాసం

| | | |
|---|---|---|
| 1 | 1-8-84 | 'మహిళా వికాసం' శీర్షికన 'కలువబాల' పక్ష పత్రికలో వ్యాస పరంపర ప్రారంభమై 1984 సంచికనుండి ప్రారంభమైన ఇప్పటివరకు 100కు పైగా వ్యాసాలు వస్తూనే వున్నాయి. |

## 14. పత్రికల్లో వ్యా సాలు

### (1) తెలుగు వైజ్ఞానిక మాసపత్రిక

| | | |
|---|---|---|
| 1 | 1-7-89 | ఏది అశ్లీలం, ఏది అసభ్యం ఎవరు నిర్ణయించాలి? |
| 2 | 31-10-89 | వివాహ వ్యవస్థాపరిణామం |
| 3 | 1-12-90 | సహజీవనం : సన్నిహితత్వం |
| 4 | 1-5-91 | మానవ హక్కులు : మహిళల హక్కులు, బాలికల హక్కులు |

### (2) ప్రసారిత త్రైమాస పత్రిక

| | | |
|---|---|---|
| 1 | 29-8-84 | మహిళా సిద్ధాంతాలు |
| 2 | 9-2-88 | సాహిత్యంలో స్త్రీ పాత్ర చిత్రణ |
| 3 | 29-10-88 | సహజీవనంలో ఆధునిక పోకడలు |

## (3) సమీక్ష మాసపత్రిక

| | | |
|---|---|---|
| 1 | ఫిబ్రవరి '64 | 'పాట్నా' సభ |
| 2 | 29-11-64 | సరోజినీ నాయుడు |
| 3 | డిసెంబరు '64 | కాంగ్రెస్ మహిళాసభ |
| 4 | సెప్టెంబరు 65 | మహిళల కర్తవ్యం |

## (4) తెలుగు విద్యార్థి మాసపత్రిక

| | | |
|---|---|---|
| 1 | 8-3-82 | స్త్రీ విద్య పై పునఃపరిశీలన |
| 2 | 31-10-82 | అణ్వాయుధ ఉన్మాదం-మానవ విలువల విధ్వంసం |
| 3 | 30-6-83 | హిందూ వారసత్వ బిల్లు - ఒక పరిశీలన |
| 4 | 8-12-85 | ఆమె శరీరం పై హక్కు ఆమెదే |
| 5 | 19-7-84 | నేటి వివాహాలు - తీరు తెన్నులు |
| 6 | 3-9-85 | సహకారోద్యమం-స్త్రీలు |
| 7 | 1-12-85 | రచయితల కర్తవ్యం జాతి భవితవ్యం |
| 8 | 3-3-86 | వర్ధమాన దేశాల మహిళాచిత్రాలు |
| 9 | 2-7-86 | ప్రపంచ దేశాల స్త్రీల చిత్రాలు |
| 10 | 3-11-86 | చట్టాలకు కట్నాలు పోతాయా? |
| 11 | 3-2-88 | సాహిత్యం - సామాజిక స్పృహ |

## (5) ఇండియన్ ఎక్స్ ప్రెస్ ఇంగ్లీషు దినపత్రిక

| | | |
|---|---|---|
| 1 | 11-1-84 | స్త్రీలకు ఉద్యోగాలు |
| 2 | 27-4-84 | మదర్ థెరెసా |

## (6) దక్కన్ క్రానికల్ ఇంగ్లీషు దినపత్రిక

| | | |
|---|---|---|
| 1 | 20-3-84 | మహిళా సంఘాల కార్యక్రమాలు |

## (7) రాడికల్ హ్యూమనిస్టు ఇంగ్లీషు మాసపత్రిక

| | | |
|---|---|---|
| 1 | 27-4-84 | విడాకులు స్త్రీల సమ స్యేనా? |
| 2 | 23-8-84 | భారతనారి ఆదర్శం |
| 3 | 30-11-84 | ఆస్తిహక్కు |
| 4 | ఫిబ్రవరి 89 | హ్యూమనిస్టు ఫెమినిజం |
| 5 | నవంబరు 90 | బాలికల హక్కులు |
| 6 | 3-5-91 | ఆధునికం- సనాతనం |

## (8) ఆంధ్రజ్యోతి దిన పత్రిక

| | | |
|---|---|---|
| 1 | 19-11-63 | కుటుంబ నియంత్రణ |
| 2 | 10-12-63 | పెరుగుతున్న ధరలు - కరుగుతున్న బ్రతుకులు |
| 3 | 31-12-63 | కుటుంబ నియంత్రణ - అపోహలు |
| 4 | 31-12-64 | కుటుంబ నియంత్రణ కొన్ని అపోహలు |
| 5 | 9-2-64 | పాట్నా సభ సమీక్ష |
| 6 | 18-2-64 | వరకట్న సమస్య - పరిష్కార మార్గాలు |
| 7 | 24-3-64 | కుటుంబ నియంత్రణ ప్రభుత్వ కర్తవ్యం - ప్రజల విధులు |
| 8 | 28-4-64 | కుటుంబ కలహాలు |
| 9 | 25-10-64 | ఆంధ్రప్రదేశ్ మహిళా సభపై సమీక్ష |
| 10 | 16-2-65 | స్త్రీలకు ప్రత్యేక సమస్యలున్నాయా? |
| 11 | 7-8-65 | కుటుంబ నియంత్రణ ప్రచారకుల ఇబ్బందులు |
| 12 | 12-1-88 | పరస్పర గౌరవం, బుద్ధివుంటే పెళ్ళి తంతు ఎందుకు? |

| | | |
|---|---|---|
| 13 | 1-3-88 | ఆడవారి పై రకరకాల అత్యాచారాలు |
| 14 | 3-5-88 | ప్రకృతికి వికృత భాష్యం |
| 15 | 9-8-88 | స్త్రీలు ఎందుకు బానిసలు? |
| 16 | 1-11-88 | భవిష్యత్ మహిళ |
| 17 | 24-5-90 | కుహనా మహిళోద్యమ ప్రచారకులనుండి ఉద్యమాన్ని కాపాడండి |
| 18 | 2-8-90 | దాంపత్య జీవితంలో ఆధునికత |
| 19 | 6-12-90 | అమాయకత్వమా? స్త్రీ జాతి పై విద్వేషమా? |
| 20 | 1-2-91 | స్త్రీల సమస్యలు : ఫెమినిస్టు ధోరణులు |
| 21 | 28-2-91 | వేశ్యావృత్తిని అరికట్టలేమా? |

## (9) ఉదయం దిన పత్రిక

| | | |
|---|---|---|
| 1 | 27-6-85 | ఇంటి చాకిరీకి విలువకట్టే షరాబు ఏడి? |
| 2 | 18-10-85 | వరకట్న మరణాలు |
| 3 | 31-3-86 | క్రైస్తవ స్త్రీలు |
| 4 | 9-11-86 | కన్నీరు కార్చనీయకండి (విలేజి మహిళా శీర్షికలో) |
| 5 | 21-12-87 | భారతనారి : నాడు- నేడు- రేపు |
| 6 | 25-1-88 | రిజర్వేషన్స్ అవసరమే |
| 7 | 30-11-88 | విధవల పరిస్థితి |
| 8 | 9-3-90 | ఎన్నికలలో స్త్రీల భాగస్వామ్యం - ప్రపంచ మహిళ |

## (10) ఆంధ్రభూమి దినపత్రిక

| | | |
|---|---|---|
| 1 | 6-2-82 | స్త్రీలు - సంస్కృతి, నాగరికత |
| 2 | 23-3-82 | స్త్రీ విమోచన సాధ్యమా? |
| 3 | 16-5-89 | ఆ దంపతులే వీరు (కందుకూరిపై వ్యాసం) |

| | | |
|---|---|---|
| 4 | 9-6-89 | వివాహం, దాంపత్యం, ప్రేమ, సెక్స్ |
| 5 | 28-7-89 | ఫెమినిజం అవసరమా? |
| 6 | 11-5-90 | సూడో ఫెమినిజమే బానిసత్వం |
| 7 | 1-1-91 | ఫెమినిస్టు ప్రెస్ కావాలా? |
| 8 | 22-3-91 | సనాతన ఆధునికత్వాలలో స్త్రీ హెూదా |

## (11) ఆంధ్రపత్రిక దినపత్రిక

| | | |
|---|---|---|
| 1 | 27-12-81 | 'స్త్రీ పురుష బేధాలు ఎందుకు?' |
| 2 | 12-4-82 | మహనీయుడు ఎం.ఎన్.రాయ్ |
| 3 | 27-7-82 | 'నేటి స్త్రీల ప్రధాన సమస్యలూ - పరిష్కార మార్గాలు' (ఈ వ్యాసానికి నాల్గవ బహుమతి 700 రూపాయలు వచ్చింది) |
| 4 | 2-8-83 | ఆడవారి ఆస్తి హక్కు (ఈ వ్యాసానికి ప్రధమ బహుమతి వెయ్యి రూపాయలు వచ్చింది) |
| 5 | 2-5-88 | గురుతుల్యులు రమణమ్మ గారు |
| 6 | 7-2-86 నుండి 13-2-86 వరకు | ఫిల్మోత్సవ్ మహిళా చిత్రాలు - ఒక సమీక్ష |

## (12) కృష్ణా పత్రిక దిన పత్రిక

| | | |
|---|---|---|
| 1 | 15-8-84 | కామన్ సివిల్ కోడ్ (వారపత్రికలో) |
| 2 | 29-2-85 | మనలోమాట (వార పత్రికలో) |

## (13) ఆంధ్రప్రభ దిన పత్రిక

| | | |
|---|---|---|
| 1 | 15-8-90 | స్వాతంత్ర్యానంతరం స్త్రీల పరిస్థితి |
| 2 | 25-8-90 | నూరేళ్ళ వృద్ధి, పోరాటం |
| 3 | 31-8-90 | స్త్రీల సమస్యలు అవగాహన |
| 4 | 4-9-90 | బాలికల సమస్యలు |

## (13) ఆంధ్రప్రభ దిన పత్రిక

| | | |
|---|---|---|
| 1 | 15-6-83 | స్త్రీలకు ఆస్తి హక్కు బిల్లు - ఒక పరిశీలన |
| 2 | 21-4-84 | మహిళలు - సిద్ధాంతాలు |
| 3 | 12-1-86 | నైరో, మహిళా మహాసభలు |

## (14) ఈనాడు దినపత్రిక

| | | |
|---|---|---|
| 1 | 15-10-19 | ఘోరమైన ఆరోపణ |

## (15) వనిత మాసపత్రిక

| | | |
|---|---|---|
| 1 | 28-3-84 | విడాకులు - స్త్రీల సమస్య |
| 2 | 29-1-85 | నా తొలి రచన అనుభవాలు |
| 3 | 1-4-88 | తప్పెవరిది (దాచేస్తే దాగని సత్యం శీర్షికలో) |
| 4 | 1-7-88 | తప్పెవరిది? - శిక్ష ఎవరికి? (దాచేస్తే దాగని సత్యం శీర్షికలో) |
| 5 | 1-9-88 | ఇది ఒక శశి కథ |

## (16) కుటుంబ మిత్ర మాసపత్రిక

| | |
|---|---|
| జూలై 1963 | తిక్క కుదిరింది (నాటకం) |
| జనవరి ‘64 | కుటుంబ నియంత్రణ ప్రభుత్వ విధి - ప్రజల కర్తవ్యం |
| ఏప్రిల్ ‘64 | పాట్నా సభ |
| అక్టోబరు ‘64 | కుటుంబ నియంత్రణ - అపోహలు |
| జనవరి ‘65 | ఎలాంటి కుటుంబం కావాలి |
| జూలై 65 | కుటుంబ నియంత్రణ ప్రచారంలో సాధక బాధకాలు |

## (17) ప్రజాశక్తి దిన పత్రిక

| | | |
|---|---|---|
| 1 | 10-10-81 | మహిళా దశాబ్దంలో మన స్త్రీలు |
| 2 | 23-11-81 | స్త్రీలలో హేతుత్వ దృష్టి |

## (18) హేతువాదం మాసపత్రిక

1 2-11-82 ఇరాన్ స్త్రీల ఇక్కట్లు

## (19) నాస్తికయుగం మాస పత్రిక

1 22-7-82 ఖామైనీ పరిపాలనలో స్త్రీల పరిస్థితి

2 4-9-82 ఇరాన్ - స్త్రీలు

## (20) హేతువాది మాసపత్రిక

1 4-3-89 గ్రామాలలో మూఢ విశ్వాసాలు

2 1-12-89 మళ్ళీ మనువు పునర్జన్మా?

3 1-12-90 అత్యున్నత న్యాయమూర్తి అనుచిత ప్రసంగం

## (21) న్యూ హ్యూమనిస్టు మాసపత్రిక

1 29-7-84 మానవ హక్కులు - మహిళల కోర్కెలు

2 2-4-91 ప్రజాస్వామికంలో పౌరుని పాత్ర

## (22) చార్వా క మాసపత్రిక

1 ఆగస్టు 1976 మూఢ విశ్వాసాలు - స్త్రీలు

# 23. వివిధ పత్రికలు

| | | | | | |
|---|---|---|---|---|---|
| 1 | 'గీటురాయి' | 18-1-88 | నుండి | 7 | వ్యాసాలు |
| 2 | 'బీదల బాధలు' | 7-3-88 | ” | 4 | ” |
| 3 | 'సౌజన్య' | 27-10-85 | నుండి | 1 | వ్యాసాలు |
| 4 | 'మహిళావాణి, | 14-2-85 | ” | 1 | ” |
| 5 | 'కదలిక' | 1-2-87 | ” | 1 | ” |
| 6 | 'శ్రీవాణి' | 15-5-87 | ” | 1 | ” |
| 7 | 'పొదుపు సమాచార్' | 31-8-87 | ” | 1 | ” |
| 8 | 'విశ్వరచన' | 13-7-88 | ” | 2 | ” |
| 9 | 'రాజధాని' | 7-12-88 | ” | 2 | ” |
| 10 | 'హైద్రాబాద్ సమాచార్' | 14-12-88 | ” | 1 | ” |
| 11 | 'స్రవంతి' | 31-1-89 | ” | 1 | ” |
| 12 | 'లిటరసీ హౌస్' వారి మాసపత్రిక | 30-6-89 | ” | 1 | ” |
| 13 | 'ప్రజావాణి, | ఫిబ్రవరి '64 | ” | 1 | ” |
| 14 | 'వాహిని | 14-2-64 | ” | 1 | ” |
| 15 | 'గ్రామోద్యోగి' | జూన్ '65 | ” | 1 | ” |
| 16 | 'సుభాషిణి' | | | 1 | ” |
| 17 | 'చిత్రభూమి' | 3-3-82 | ” | 1 | ” |
| 18 | 'భావన వ్యా' | 1982 | ” | 1 | ” |
| 19 | 'కోరిక' | 23-3-84 | ” | 1 | ” |
| 20 | 'ఆదివారం' | 29-9-81 | ” | 1 | ” |

# 15. మహా సభలు - సదస్సులు

| వరుస సంఖ్య | తేదీ | స్వభావం | రిమార్కులు |
|---|---|---|---|
| 1 | 1963 మే | స్వచ్ఛంద సంస్థలు మద్రాసు ప్రాంతీయ మహాసభ | పాల్గొనుట |
| 2 | 1962 | ఆంధ్ర మహిళాసభ రజతోత్సవ సభ | ” |
| 3 | 1962 | స్వచ్ఛంద సంస్థల సభ విజయవాడ | ” |
| 4 | 9-12-63 | కుటుంబ నియంత్రణ శిబిరం | ” |
| 5 | జనవరి ‘64 | అఖిల భారత కుటుంబ నియంత్రణ మహాసభ పాట్నా | ” |
| 6 | నవంబరు ‘64 | రాష్ట్ర కుటుంబ నియంత్రణ సదస్సు | ” |
| 7 | నవంబరు ‘64 | ప్రాంతీయ కుటుంబ నియంత్రణ సమావేశం | ” |
| 8 | అక్టోబరు ‘66 | ప్రాంతీయ కుటుంబ నియంత్రణ మహాసభ - గుంటూరు | ప్రసంగం |
| 9 | 26-11-79 | అఖిలభారత స్టడీ అఖిల భారత హేతువాద అధ్యయన శిబిరం | అఖిలభారత స్టడీ క్యాంప్‌లో పాల్గొనుట |
| 10 | 23-5-80 | హేతువాద అధ్యయన శిబిరం | ప్రసంగం |
| 11 | 23-10-80 | బొంబాయి హేతువాద సభ | పాల్గొనుట |
| 12 | 27-12-80 | అఖిల భారత హేతువాద సభ - బొంబాయి | ” |
| 13 | 9-5-81 | ఆం.ప్ర. హేతువాద సభ రాజమండ్రి | ఉపాధ్యక్షులు |
| 14 | 20-11-82 | హేతువాద శిక్షణా తరగతులు | ప్రసంగం |
| 15 | 21-12-82 | హేతవాద అధ్యయన శిబిరం | ప్రసంగం |
| 16 | 14-5-83 | రాష్ట్ర హేతువాద మహాసభ | పాల్గొనుట |
| 17 | 15-5-83 | రాష్ట్ర హేతువాద కమిటీ | ఉపాధ్యక్షులు |
| 18 | 12-5-84 | కేరళ రాష్ట్ర హేతువాద మహాసభ | ఉపన్యాసం |
| 19 | 7-12-84 | భిలాయ్ హేతువాద సభ | ” |
| 20 | 8-12-84 | మధ్య ప్రదేశ్ హేతువాద మహాసభ | ” |
| 21 | 1-6-85 | అఖిలభారత హేతువాద మహాసభ ఢిల్లీ | పాల్గొనుట |
| 22 | 2-6-85 | రాష్ట్ర హేతువాద సభ | ” |
| 23 | 13-6-87 | హేతువాద సభ - గుంటూరు | ప్రసంగం |
| 24 | 27-1-90 | హేతువాద సభ - ఢిల్లీ | ఇ.సి. సభ్యురాలు |
| 25 | 31-12-84 | రాడికల్ హ్యూమనిస్టు సభ | ఉపన్యాసం |
| 26 | 7-1-86 | రాష్ట్ర రాడికల్ హ్యూమనిస్టుసభ | రాష్ట్రసంఘ అధ్యక్షులు |
| 27 | 17-10-86 | అఖిలభారత రాడికల్ హ్యూమనిస్టు మహాసభ | స్వాగతోపన్యాసం |

| | | | |
|---|---|---|---|
| 28 | 15-1-87 | రాష్ట్ర హ్యూమనిస్టు మహాసభ | రాష్ట్ర సంఘ అధ్యక్షులు |
| 29 | 27-1-90 | రాడికల్ హ్యూమనిస్టుసభ | పాల్గొనుట |
| 30 | 18-5-81 | కుల నిర్మూలనా సంఘం సమావేశం | ప్రసంగం |
| 31 | 14-11-81 | అఖిలభారత రచయితల సమావేశం | కవితా పఠనం |
| 32 | 12-5-84 | రాష్ట్ర యుక్తివాద సభ- కేరళ | ప్రసంగం |
| 33 | 25-7-85 | ఐ.సి.ఎస్.ఎస్.ఆర్. కుటుంబ నియంత్రణ వర్కుషాపు | " |
| 34 | 14-9-85 | ప్రకాశం జిల్లా రచయితల ద్వితీయ మహాసభ | " |
| 35 | 12-10-85 | యువ రచయితల ఐదవ రాష్ట్ర మహాసభ | " |
| 36 | 24-3-86 | మహిళా దశాబ్దం - సాధించిన విజయాలు - సింపోజియం | ప్రసంగం |
| 37 | 2-10-86 | కుల నిర్మూలన రాష్ట్రసభ | పాల్గొనుట |
| 38 | 11-1-87 | అఖిలభారత మహిళా సమావేశం | " |
| 39 | 30-8-87 | అవేర్ సంస్థవారి ప్రధమ మహిళా శిక్షణా శిబిరం | వక్త |
| 40 | 26-3-88 | రాడికల్ హ్యూమనిస్టు వర్కుషాపు | వర్కు పేపర్ |
| 41 | 28-5-88 | యునిసెఫ్ వారి ఆధ్వర్యంలో కార్యకర్తల శిక్షణ శిబిరం | ఉపన్యాసం |
| 42 | 24-9-88 | భారతీయ యువజనమోర్చా సదస్సు (స్త్రీల పై అత్యాచారాలు) | |
| 43 | 3-12-88 | లెస్లీ సహానీ మహిళా క్యాంపు | వక్త |
| 44 | 16-1-89 | రూరల్ ఇండియన్ సోషల్ ఇంజనీర్స్, కుటీర్ (శిబిరం) | ముఖ్య అతిధి |
| 45 | 5-3-89 | లయనెసెస్ ప్రాంతీయ మహాసభ | " |
| 46 | 15-7-89 | స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా స్త్రీ శక్తి - హైద్రాబాద్ | వక్త, సన్మానం |
| 47 | 4-2-90 | సోషల్ వర్క్ కాలేజీలో వర్కుషాపు | ప్రసంగం |
| 48 | 7-3-90 | బాలికల హక్కులు- సెమినారు | వర్కు పేపరు |
| 49 | 16-3-90 | మహిళాభివృద్ధి, నాగార్జున యూనివర్సిటీ | ఉపన్యాసం |
| 50 | 6-8-80 | స్త్రీకి రక్షణలేని సమాజం సెమినారు | ప్రసంగం |
| 51 | 18-9-80 | గాంధీ - స్త్రీలు - సెమినారు | హైద్రాబాదు |
| 52 | 23-11-80 | ప్రపంచ మహిళాసభ, కోపెన్ హాగన్ | చర్చలో పాల్గొనుట |
| 53 | 7-8-82 | మహిళోద్యమం-మహిళా సంఘాలు- సెమినారు, వరంగల్లు | వర్కు పేపరు |

| | | | |
|---|---|---|---|
| 54 | 31-3-85 | స్త్రీలకు ఉద్యోగాలు - సెమినారు | వర్కు పేపరు |
| 55 | 18-4-84 | ప్రజలు-పార్లమెంటు అభిప్రాయవేదిక | |
| 56 | 7-3-86 | సాహిత్యం-సమాజం, సెమినారు | ప్రారంభోత్సవం |
| 57 | 20-10-86 | స్త్రీలు-శాంతి, సెమినారు | ప్రసంగం |
| 58 | 10-9-87 | సతీ సహగమన నిరసన సదస్సు | అధ్యక్షత |
| 59 | 14-9-89 | స్త్రీలు- లైంగిక స్వేచ్ఛ సెమినారు | వర్కు పేపరు |
| 60 | 19-3-90 | వరకట్నం అసమానత, సెమినారు, విజయవాడ | డైరెక్టర్ |
| 61 | 30-3-90 | స్త్రీల పై అత్యాచారాల నిరోధం రాష్ట్ర సదస్సు | ఆహ్వానసంఘ అధ్యక్షత |
| 62 | 10-10-90 | ఒకే వ్యవహార సంహిత | ఉపన్యాసం |
| 63 | 13-11-90 | మహిళాభ్యుదయ సంస్థ దశాబ్ది ఉత్సవం | పుస్తకావిష్కరణ |
| 64 | 15-10-83 | వివాహం-నేడు-రేపు సెమినారు | వర్కు పేపరు |
| 65 | 11-4-76 | రాష్ట్ర హేతువాద సదస్సు | వక్త ప్రసంగం |
| 66 | 31-5-76 | అఖిలభారత హ్యూమనిస్టు స్టడీ క్యాంపు-నైనిటాలు | ప్రసంగం |
| 67 | 2-5-78 | స్త్రీలు - జనతాపార్టీ, జనతా పార్టీ క్యాంపు | ప్రసంగం |
| 68 | 3-5-78 | రేషనలిస్టు స్టడీ క్యాంపు స్త్రీలు - హేతువాదం | ఉపన్యాసం |
| 69 | 12-6-78 | హ్యూమనిస్టు స్టడీ క్యాంపు కారంచేడు (కుటుంబ నియంత్రణ ప్రజాస్వామ్యం) | " |
| 70 | 4-6-19 | రేషనలిస్టు స్టడీ క్యాంపు విజయవాడ (స్త్రీలు : హేతువాదం) | |
| 71 | 13-4-91 | 'స్త్రీలు- రాజకీయాలు' సింపోజియం | " |
| 72 | 27-1-91 | మహిళా దక్షతవారి మ్యారేజ్ లా అండ్ మెయిన్ టెనెన్స్' సెమినారు | " |
| 73 | 2-3-91 | 'స్త్రీల పై అత్యాచారాలు' సెమినారు | అధ్యక్షత |
| 74 | 26-4-91 | మహిళా జాగృతి శిక్షణా శిబిరం | అధ్యక్షత |
| 75 | ఆగష్టు 91 | స్త్రీల అధికార పోరాట రాష్ట్ర సదస్సు | |
| 76 | ఆగష్టు 91 | మధురై యూనివర్సిటీ అఖిలభారత మహాసభ | |

# 16. వివాహాలు

## (ఎ) వికాస కేంద్రంలో జరిగిన కొన్ని వివాహాలు

| వరుస సంఖ్య | తేదీ | వధూవరుల పేర్లు |
|---|---|---|
| 1 | 25-11-79 | అంజనీకుమారి, కనకదుర్గా ప్రసాద్ |
| 2 | 13-4-80 | వరలక్ష్మి, యాదగిరి |
| 3 | 19-8-80 | లక్ష్మీ భాస్కరి, జి. ప్రసాదు |
| 4 | 9-6-31 | సుశీల, ఈశ్వరయ్య |
| 5 | 5-9-81 | సత్యవతి, వి.ఎస్. రావు |
| 6 | 10-12-81 | లక్ష్మీ భవాని, చిదంబర ప్రసాదు |
| 7 | 7-12-82 | హేమలత, మోహన్ రావు |
| 8 | 22-1-83 | రజని, పుల్లారావు |
| 9 | 18-2-83 | మతాంతర వివాహం |
| 10 | 30-11-83 | శ్యామల, రాజమౌళి |
| 11 | 24-1-84 | బాల, మల్లిక్ |
| 12 | 8-2-84 | బాల సుమిత్ర, ఈశ్వర్ పిళ్ళే |
| 13 | 11-3-84 | అనురాధ, విజయకుమార్ |
| 14 | 10-4-84 | అనురాధ, రఘురామ్ |
| 15 | 6-8-84 | మార్తరాణి, రాఘవులు |
| 16 | 2-12-84 | లలిత, సత్యనారాయణ |
| 17 | 26-3-85 | వీణ, నాగేశ్ |
| 18 | 28-5-86 | జి. వరకుమారి, ఎ. ముత్తన్న |
| 19 | 31-10-86 | లక్ష్మి, ప్రభాకరరావు |
| 20 | 21-12-86 | లలిత, గోపాల్ |
| 21 | 29-6-87 | ఎస్. రాజ్యలక్ష్మి, డా॥ ఎస్. విజయకుమార్ |
| 22 | 31-7-87 | అంబిక, దామోదరం |
| 23 | 9-8-87 | రమాదేవి, రమేష్ |
| 24 | 28-9-87 | శరత్ కళ, వెంకట్రామ్ రెడ్డి |
| 25 | 15-2-88 | మిచేల్, అరుణకుమార్ |
| 26 | 5-3-88 | మాధవి, సుధాకర్ |
| 27 | 24-6-88 | గుత్తా విజయలక్ష్మి, మద్దాలి సుబ్రహ్మణ్యేశ్వరరావు |
| 28 | 9-8-88 | టీనా, ప్రదీప్ |
| 29 | 13-12-88 | బి. లలిత, ఎం. త్యాగరాజన్ |
| 30 | 18-8-89 | రాజ్యలక్ష్మి, సోమయాజులు |

| | | |
|---|---|---|
| 31 | 5-10-89 | చంద్రకళ, మహేశ్వరం |
| 32 | 6-10-89 | గీతా గంగాధరన్, ఎన్. శ్రీ కుమార్ |
| 33 | 21-11-89 | ముస్లిం స్త్రీ, క్రిస్టియన్ అబ్బాయి |
| 34 | 17-2-90 | పార్వతి, పొన్నలూరి రాఘవేంద్రరావు |
| 35 | 26-10-90 | కె. జయశీల, వై. శ్రీనివాసులు |
| 36 | 22-11-90 | ఎ. జలజకుమారి, వీరేశ్ కుమార్ |
| 37 | 24-1-91 | బి. ఉమామహేశ్వరి, గడియారం ధృవకుమార్ |

## (బి) ఇతర ప్రదేశాల్లో

సికిందరాబాద్, హైదరాబాద్, తాండూరు, మహబూబ్ నగర్ మొదలైన చోట్ల

## 17. ఉద్యమాలు కార్యక్రమాలు

1. ప్రత్యేక ఆంధ్రోద్యమం
2. జె.పి. ఉద్యమం
3. కుల నిర్మూలనోద్యమం
4. కుటుంబ నియంత్రణం
5. ప్రజాస్వామ్య పరిరక్షణ
6. మహిళోద్యమం
7. హేతువాదం
8. నాస్తికం
9. పార్టీ రహితం
10. ఓటర్ల ప్రబోధం
11. వివాహ సంస్కరణ
12. వైవాహిక సలహా
13. శ్రామిక మహిళా సేవ
14. వృద్ధ మహిళా సేవ
15. ఉపేక్షిత స్త్రీలకు అండ
16. గ్రంథాలయం
17. ప్రబోధం
18. భావవ్యా ప్తి

## 18. సభలు : ఉపన్యాసాలు

1. హేతువాద ఉద్యమాలు

2 రాడికల్ హ్యూమనిస్టు సభలు

3. మహిళోద్యమ సభలు

హొ4. కుటుంబ నియంత్రణ సభలు

5 ఆంధ్రోద్యమసభలు

6 పాఠశాల వార్షికోత్సవ సభలు

7 మహిళా సంఘాల వార్షికోత్సవాలు

8 రాజకీయ సభలు

9 సాహిత్య సభలు

10 కుల నిర్మూలన సభలు

11 ఇతరాలు

# అభిప్రాయాలు

## మహిళోద్యమానికి మారు పేరు
## మల్లాది సుబ్బమ్మ గారు

**- పోలు సత్యనారాయణ**

సుబ్బమ్మ గారిని పరిచయం చేయడమంటే ఏమిటి అనేదొక పెద్ద ప్రశ్న. ఆంధ్రదేశంలో సుబ్బమ్మ గారి పేరు వినని వారుండరు. ఆవిడ రచనలు చదవని వారుండరు. ఒక్క మాటలో చెప్పాలంటే సుబ్బమ్మ గారి గాలి సోకని స్త్రీ పురుషులెవ్వరూ ఆంధ్రదేశంలో లేరు. సుబ్బమ్మ గారిని పరిచయం చేయడమంటే గత 10, 15 సంవత్సరాల నవీనాంధ్ర దేశంలో ఉవ్వెత్తున లేచిన మహిళోద్యమాన్ని, సంస్థలను పరిచయం చేయడంగా నేను భావిస్తున్నాను. అంతేగాక నేటి తెలుగునాట సాగుతున్న పౌర హక్కుల ఉద్యమాన్ని, హేతువాద ఉద్యమాన్ని, లౌకికవాద ఉద్యమాన్ని, నవ్యమానవ ఉద్యమాన్ని కూడా కొంతవరకు చెప్పడం జరుగుతుంది. వాటి రూపు రేఖలను, స్వరూప స్వభావాలను పరిచయం చేయడం జరుగుతుంది. ఆమె మహిళాభ్యుదయ వాది కాదు, స్త్రీ, స్వేచ్ఛా వాది కాదు, ప్రధానంగా ఆమె ప్రజాస్వామిక వాది, హేతువాది, లౌకికవాది, నవ్యమానవ వాది ఇన్ని రకాలుగా ఆమె వ్యక్తిత్వం కనబడుతుంది. ఆమెది బహుముఖ రూపం.

ఇంతకూ సుబ్మమ్మ గారు ఈనాడు తనని గురించి మహిళోద్యమ వాదిగా, స్త్రీ స్వేచ్ఛావాదిగా అనుకుంటున్నారు. అందుకే ఆమె తనని మహిళోద్యమవాది అనే వ్రాసుకుంటుంది. కొంతకాలం వరకూ మల్లాది సుబ్బమ్మగా వున్న ఆమె పేరు మహిళోద్యమ వాది మల్లాది సుబ్బమ్మగా రూపాంతరం చెందింది. ఆమె తన జీవితకాలమంతా మహిళోద్యమానికే వెచ్చించాలని నిర్ణయించుకుని అలాంటి దీక్షబూనింది. ఎన్నో రంగాలుండగా ఆమె ఈ రంగాన్నే ఎందుకు, ఈ మార్గాన్నే ఎందుకు ఎన్నుకుంది? ఇది మహిళోద్యమ మార్గం. చాలా కష్టమైనది, క్లిష్టమైంది కూడా. ఆమె తన జీవితంలో తన తోటి స్త్రీలు అనుభవిస్తున్న బాధలను చూసి స్పందించింది. జనాభాలో సగభాగంగా వున్న తోటి స్త్రీలలో చైతన్యం లేదు. వాళ్లలో స్ఫూర్తి లేదు, స్పందన లేదు. ఆ అభాగ్యులు అంధకారంలో వంటింట్లోనో, పడకటింట్లోనో గడపడం కళ్ళారా చూసి తన జీవితాన్ని స్త్రీ జనాభ్యుదయానికే వినియోగించాలని నిర్ణయించుకుంది. అంటే మహిళాభ్యు దయం ప్రజాభ్యుదయంలో ఒక భాగం కాబట్టి ఎక్కువగా నొక్కు పెట్టింది.

అందుకనే గత నలభయి సంవత్సరాలుగా స్త్రీల స్వేచ్ఛా సమానత్వాల కోసం వారి సమైక్యత కోసం నిరంతరం కృషి చేస్తున్నారు.

స్త్రీ అభ్యుదయాన్ని సాధించడానికి ఏం చేయాలి అనే దానికి ఆమె మూడు మార్గాలు సూచిస్తారు. తన ఆత్మకథలో కూడా ఈ విషయం వ్రాసుకున్నారు. ఒకటి, సంస్థలు స్థాపించి వాటి ద్వారా మహిళాభ్యుదయాన్ని సాధించడం. రెండు, దేశమంతా తిరిగి ఉపన్యాసాల ద్వారా వారిని చైతన్యవంతుల్ని చేయడం. మూడు, సాహిత్యాన్ని సృష్టించి దాని ద్వారా స్త్రీ, పురుషులో సమానత్వాన్ని, చైతన్యాన్ని పెంపొందించడం. ఈ మూడింటిలో ఏ ఒక్క మార్గాన్నో కాక ఈ మూడు మార్గాలను చేపట్టింది. అటు రకరకాలైన సంస్థలు స్థాపించింది. ఇటు ఆంధ్రదేశమంతా తిరిగి కొన్ని వేల ఉపన్యాసాలిచ్చి, తర్వాత సాహిత్య సృష్టి చేసి 50 పుస్తకాలు, 40 కరపత్రాలు, ఇంగ్లీషులో 5, 6 పుస్తకాలు ఇప్పటి దాకా ప్రచురించింది. సుబ్బమ్మ గారు చేసిన సాహిత్య కృషి చెప్పుకోదగ్గది. కథల్ని, నవలల్ని, కవితల్ని రచించడమే కాక రెండు పత్రికలను స్థాపించి, నిర్వహించి వాటి ద్వారా చైతన్యాన్ని తేగలిగింది. సుబ్బమ్మగారు, రామ్మూర్తిగారు 1974లో 'వికాసం' (వికాసం పేరులోనే వున్నది వారి వికాస స్ఫూర్తి) అనే పత్రిక స్థాపించారు. రామ్మూర్తిగారు సంపాదకులుగా వుంటే సుబ్బమ్మ గారు ప్రింటరు, పబ్లిషరుగా వున్నారు. అది పెట్టిన సంవత్సరానికే అత్యవసర పరిస్థితుల్లో రామ్మూర్తిగారిని అరెస్టు చేసి రాజమండ్రికి పంపడం జరిగింది. అప్పుడు సుబ్బమ్మ గారు ఎడిటరు బాధ్యతల్ని కూడా చేపట్టారు. అప్పుడే ఆమె ఎంతో కష్టపడింది. ఎంతో మందికి వ్రాసి రచనలు తెప్పించి, అత్యవసర పరిస్థితి పై గట్టిగా పోరాటం జరిపింది. జె.పి. విజయవాడ వచ్చినప్పుడు వారి ప్రసంగాలని ఏర్పాటుచేసి తన పత్రిక ద్వారా చేయవలసిన కృషి ఆమె ఆనాడు చేసింది. తర్వాత రామ్మూర్తి గారిని హైదరాబాదు జైలుకు మారిస్తే ఆయన్ని రోజూ చూడవచ్చు, ఆయన సహాయ సహకారాలు పొందవచ్చు అనే ఉద్దేశ్యంతో 1977 జనవరిలో హైదరాబాద్ మకాం మార్చడం జరిగింది. తర్వాత మరొకసారి అత్యవసర పరిస్థితి రాలేదు. ఈనాడు మరో పత్రిక 'స్త్రీ స్వేచ్ఛ' నడుపుతున్నారు. ఇది మూడు వసంతాల సుబ్బమ్మ గారి బిడ్డ. ఈ బిడ్డ మీద ఆమెకి ఎంతో అనురాగం, ఆపేక్ష. ఆమె ఎన్నోసార్లు చెప్పింది. ఈ పత్రిక మహిళాభ్యుదయానికి ఒక ప్రతీక కావాలని, దానికోసం అహర్నిశలు కష్టపడుతుంటారు. ఆదా చేసిన ప్రతి ఒక్క పైసా ఆనాడు 'వికాసం' మీద ఈనాడు 'స్త్రీ స్వేచ్ఛ' మీద పెట్టడం ఆమె అలవాటు చేసుకుంది. పరిశోధనా సంస్థల్లో విశ్వవిద్యాలయాలలో మేధావులుగా చలామణీ అవుతున్న చాలామంది ఈ "సుబ్బమ్మ గారు నిన్నగాక మొన్న హైదరాబాద్ వచ్చి ఏదో స్త్రీ ఉద్యమమని, స్త్రీ విమోచన అని,మహిళాభ్యుదయమని రకరకాల పేరులతో కార్యక్రమాలు చేపడుతుంది. కానీ ఈ ఉద్యమాల వెనుక, కార్యక్రమాల వెనుక, ప్రణాళికలు వెనక ఏమైనా సైద్ధాంతిక భూమిక వుందా?" అని ప్రశ్నించడం జరిగింది. నాకు తెలుసు

ఈ ప్రశ్నలు విన్నాక ఆమెలో ఏదో మధనం ప్రారంభమైంది. అప్పుడు ఆమె, రామ్మూర్తి గారు అహర్నిశలు కృషి చేసి, ప్రపంచంలోని సాహిత్యాన్నంతా చదివి ఒక వినూత్న సిద్ధాంతాన్ని మనముందుకు తేగలిగారు. అదే మానవవాద స్త్రీ విమోచన సిద్ధాంతం. దాన్నే సుబ్బమ్మ గారు ఇంగ్లీషులో 'హ్యూమనిష్టు ఫెమినిజం' అన్నారు. అంతర్జాతీయ మహిళోద్యమం తర్వాత, మహిళాభ్యుదయానికి సంబంధించి అనేక రకాల వాదాలు, సిద్ధాంతాలు మన ముందుకు వచ్చాయి. లిబరల్ ఫెమినిజం, రాడికల్ ఫెమినిజం, సోషలిస్టు ఫెమినిజం అనే పేర్లతో అవి రకరకాల భావాలు, సిద్ధాంతాలు కలవి. వీటిని క్షుణ్ణంగా చదిని, విశ్లేషించి, మధించి ఈ కొత్త సిద్ధాంతాన్ని రూపొందించారు. ఈ పుస్తకాన్ని మహిళాభ్యుదయవాది వీణా మజుందారనే ఆమె ఆవిష్కరించారు. ఈ సిద్ధాంతంలో మూడు భాగాలున్నాయి. ఇది ఒక రకంగా బృహత్ గ్రంథం (Mag opus) అనుకుంటాను. ఒకటి వ్యూహం (ప్లాన్) రెండు ఎత్తుగడలు (స్ట్రాటజీస్) మూడు కార్యక్రమాలు (ప్రోగ్రామ్). వ్యూహాలకి ఆధారం రెండు ప్రధానాంశాలు. ఒకటి స్త్రీకి స్వేచ్ఛా సమానత్వాలు లేకపోవడానికి ముఖ్య కారణం సమాజం. రెండో అంశం పురుష దురహంకారం, పురుషాధిపత్యం. ఈ రెండు అంశాలు ఆ వ్యూహంలో అంతర్లీనమై వుంటాయి. తర్వాత ఎత్తుగడల విషయానికొస్తే పురుషులు, స్త్రీలు సమానంగా ఈ ఉద్యమాన్ని చేపట్టాలి. అప్పుడే మహిళాభ్యుదయం సాధ్యమవుతుంది. దీనికోసమని పురుషులను మూడు రకాలుగా విభజించారు. ఒకటి అభ్యుదయవాదులు, ప్రగతి కాముకులు. రెండు అభివృద్ధి వ్యతిరేకులు, నిరోధకులు. మూడు అజ్ఞానంలో, అంధకారంలో డోలాయమాన స్థితిలో వుండే వారు. ఈ రెండో రకం వారిని వక కంట కనిపెట్టి వారి పై యుద్ధం ప్రకటించాలి. మొదటివర్గం వారి సహాయం పొందాలి. మూడో వర్గం వారిపట్ల సానుభూతి చూపి వారిని ఉత్తేజితుల్ని చేయడానికి శాయశక్తులా కృషి చేయాలంటారు. ఇక మూడో అంశంలో ప్రధానమైనది కార్యక్రమం (ప్రోగ్రామ్). ఈ ప్రోగ్రామ్ ని ఆరు ఉపభాగాలుగా విభజించారు. సాంఘికంగా, ఆర్థికంగా, సాంస్కృతికంగా, రాజకీయంగా, లైంగికంగా, కౌటుంబికంగా వీటి క్రింద ఏఏ కార్యక్రమాలు చేపడితే స్త్రీలు ముందంజ వేస్తారో, మహిళాభ్యుదయం వీలవుతుందో చక్కగా వర్ణిస్తారు.

ఎన్నో సంస్థలు పెట్టారు. వారు పెట్టిన మొదటి సంస్థ మహిళాభ్యుదయ సంస్థ. తర్వాత అభ్యుదయ వివాహ వేదిక. కులాంతర మతాంతర భాషాంతర వివాహాలు చేయడం దాని కార్యక్రమం. ఈ వేదిక మీద ఇప్పటి దాకా చాలా పెళ్ళిళ్లు చేయడం జరిగింది. ఈ మధ్య స్త్రీ విమోచన శిక్షణా కేంద్రాన్ని కూడా సుబ్బమ్మ గారు పెట్టారు. సుబ్బమ్మ గారింటికి పోతే అక్కడ ఓ 12 బోర్డులు మీకు కనబడతాయి. అక్కడ ఎప్పుడూ ఏదో ఒక రకమైన స్త్రీ కార్యక్రమం నడుస్తూ వుంటుంది. బాధితులైన ఎంతో మంది

స్త్రీలు మీకు కనబడతారు. ఇలా రకరకాలుగా మహిళాభ్యుదయానికి సుబ్బమ్మ గారు ఏదో ఒక కృషిని చేస్తూనే వుంటుంది. సుబ్బమ్మ గారి ఆత్మకథతో వారి జీవిత కథ పూర్తికాదు. ఇది ఒక అసంపూర్ణమైన కార్యక్రమం నా దృష్టిలో. రామ్మూర్తిగారు, సుబ్బమ్మ గారు ఆధ్యాత్మిక దృష్టితో కాదు, పారమార్ధిక దృష్టితో కాదు, శాస్త్రీయ దృష్టితో వారిద్దరూ సహవాసులు, సహచరులు.

# స్త్రీ విమోచనోద్యమానికి పెట్టని కోట

**– డా॥ దేవులపల్లి రామానుజరావు**

సుబ్బమ్మ గారు హేతువాది, మానవతావాది. స్త్రీ విమోచనా కార్యక్రమాలను చాలా సమర్థవంతంగా నిర్వహించింది. తన ఆత్మకథ పుస్తకం చాలా ప్రతిభావంతంగా వ్రాసినారు. ఇందులో ఆంధ్రదేశ విషయాలు, ఆనాటి పరిస్థితులు, రామ్మూర్తిగారి రాజకీయాలు, వారు తనకు తోడుగా ఎలా నిల్చినారో, ఆమె తన వ్యక్తిత్వాన్ని ఎలా రూపొందించుకున్నారో అన్నీ చాలా చక్కగా వివరించారు. ఇది చాలా సంతోషకరమైన విషయం. ఈ విషయంలో సుబ్బమ్మ గారిని ఇంతగా ప్రోత్సహించిన రామ్మూర్తిగారిని కూడా నేను అభినందించవలసిందే. విద్యాసాగర్ గారు తమ సతీమణికి విద్య చెప్పించవలెననుకున్నారట. అప్పుడు అతని తల్లి ఒప్పుకోలేదు. అందుకని ఆమెకు చదువు చెప్పించలేదు. కానీ రామ్మూర్తి గారు ఈ విద్యాసాగర్ కంటే గొప్ప పని ఏమి చేసినారంటే ఆయన సుబ్బమ్మ గారికి విద్య చెప్పించి, ప్రతిభావంతంగా చేసి, అన్ని విషయాలలో ఆమెకి అండదండగా నిలిచినారు. సుబ్బమ్మ గారు అనేక ఉద్యమాలు చేపట్టారు. ఆంధ్ర దేశంలో స్త్రీ విమోచనోద్యమానికి వారు పెట్టని కోటగా నిలిచారు. పాతివ్రత్యం అంటే ఏమిటో ఈ పుస్తకంలో వివరించారు. 'పాతివ్రత్యం నుండి ఫెమినిజం దాకా' అనే ఈ పుస్తకంలో పాతివ్రత్యానికి, ఫెమినిజానికి తేడా ఏమిటో చక్కగా వివరించారు. వారు ఫెమినిస్టుగా మారడం చాలా బాగుంది అనుకునే వారిలో నేనూ ఒకణ్ణి. ఈ విధంగా కార్యక్రమాలు అన్నింటికీ ఈ పుస్తకం ప్రతిబింబంగా వుంటుంది. సుబ్బమ్మ గారు నన్ను ఆశీర్వదించమని అన్నారు. కానీ నేనింతవరకు ఎవరినీ ఆశీర్వదించలేదు. ఎవరి నుంచి ఆశీర్వచనాలు పొందలేదు. అందుకని ఇప్పుడు ఆశీర్వచనాలు కాకుండా సుబ్బమ్మ గారికి అభినందనలు అందిస్తున్నాను.

# నిజాన్ని నిర్భయంగా అక్షరబద్ధం

**– యం.ఎస్. రెడ్డి**

(అధ్యక్షులు, ఆం.ప్ర. రాష్ట్ర చలనచిత్ర అభివృద్ధి సంస్థ)

పలువురు ప్రముఖుల ఆధ్వర్యంలో జరిగే ఆ సాహితీ వైభవంలో పాలు పంచుకొనే అవకాశం లేక – కార్యక్రమం దిగ్విజయం కావాలని కోరుకుంటూ – నిజాన్ని నిర్భయంగా అక్షరబద్ధం చేసే మీ కలం విలువను మీ ఆత్మకథ మరింత పెంచగలదని ఆశిస్తున్నాను.

# క్రియాశీలి

**– సూర్యదేవర రాజ్య లక్ష్మమ్మ**

రాజస్థాన్‌లో మనువు విగ్రహ ప్రతిష్టాపన సందర్భంగా మనువును దుష్ట మేధావి అని ఆమె సంబోధించడం నాకు అప్పుడు కొంత బాధ అనిపించింది. తర్వాత ఆమె కార్యక్రమాలు చూస్తుంటే ఆ తీవ్రత, స్త్రీల విషయంలో ఆ ఆతృత అన్నీ తెలిసి ఆ మాట అనడం న్యాయమేనేమో అనిపించింది. మనువు విగ్రహం పెట్టినప్పుడు చాలా బాధపడ్డారు ఆమె. తర్వాత సతీసహగమనం మీద ఉద్యమం నడిపారు. సామాన్యంగా ఈ రోజుల్లో స్త్రీలు భర్తల పేరు తగిలించుకుంటున్నారు. స్త్రీ స్వాతంత్ర్యం అని మహిళా సంఘాల్లో, సభల్లో వాదిస్తూనే భర్తల పేరుతోగాని మాట్లాడరు. కాని ఆమె మల్లాది సుబ్బమ్మ ఆమె పేరుతోనే కార్యక్రమాలు చేస్తున్నారు. రామ్మూర్తిగారు స్త్రీ ఉద్యమంలో ప్రతి దానిలో అంతర్లీనంగా వుండి ఆయన ఎంతో సహాయం చేస్తూ వచ్చారు. అసలు సుబ్బమ్మగారి గూర్చి చెప్పాలంటే ఆమె సంస్థలు చూస్తుంటే స్త్రీ సమస్యల పరిష్కారానికి ఆమె విప్లవ రూపం దాల్చిందా అన్నట్లు వుంటుంది. ఆమె వాడే భాష మేమూ ఉపయోగించాం గానీ ఆమె ఒక్కొక్కప్పుడు కటువుగా వాడే భాష చూస్తుంటే ఆమె పురుషద్వేషి అని అనిపిస్తుంది. కాదు, ఆమె ఆవేదన అలా పలికిస్తుంది అని అర్థం అవుతుంది. ఒక సామాన్య స్త్రీ ఇంతింతై వటుడింతై అన్నట్లు ఈ 20 సంవత్సరాలలో మేము చూస్తుండగానే ఆమె అనేక సంస్థలు పెట్టి వాటి నిర్వహణకు కృషిచేస్తూ అనాథ స్త్రీలకు గానీయండి, మరే ఇతర అనేక ఇబ్బందులు పడుతున్న స్త్రీల కొరకు గానీయండి ఆమె కృషి చేస్తూ వచ్చారు. కానీ వంద మాటలకంటే ఒక క్రియ ముఖ్యం. ఆ విధంగా క్రియారూపంగా చేస్తున్నటువంటి స్త్రీ మూర్తి మల్లాది సుబ్బమ్మ గారు. స్త్రీల హక్కుల గురించి గానీ మరి ఏదైనా చెప్పేటప్పుడు వారు సూటికి నూరుపాళ్ళు చేసి నిరూపించిన వ్యక్తి.

విద్యాసాగర్ గారూ, వీరేశలింగంగారు వితంతు వివాహాలు తీసుకున్నారు. ఇక రామస్వామి చౌదరిగారు, తాపీ ధర్మారావుగారు మూఢనమ్మకాల మీద దెబ్బకొడుతూ అనేక పుస్తకాలు రచించారు. కానీ మన సుబ్బమ్మ గారు స్త్రీల కోసం సంబంధించిన ప్రతి సమస్య మీద ఒక విప్లవ కారిణిగా పోరాడుతూనే వున్నారు. దానికి తగ్గట్టుగా సంస్థలు పెట్టి పనిచేస్తూ వున్నారు. సుబ్బమ్మ గారిని మనమంతా ఆదర్శంగా తీసుకుంటున్నాము. ఆమె శక్తియుక్తులు, ఆశయాలు మనం విన్నాం. మనం వెనకటి గొప్పలు చెప్పుకోవడంకాదు.దుర్గాబాయ్ పేరు చెబితే అపరదుర్గా అన్నట్లుగా ఎంతో ఉత్సాహం ఆనందం పుట్టుకొచ్చేవి. ఆ తర్వాత స్వాతంత్ర్యానంతరం సుబ్బమ్మగారు చేస్తున్న కృషి చూస్తుంటే దుర్గాబాయమ్మ గారు జ్ఞాపకం వస్తూ వుంటారు. వారిని వారి కుటుంబాన్ని మనం ఆదర్శంగా తీసుకోవాలి.

# సహచరులుగా సంఘ సేవ

**- ప్రొ॥ ఆర్.వి.ఆర్. చంద్రశేఖరరావు**

ఈ పుస్తకం ఆవిష్కరిస్తున్న సమయంలో, ఇంతటి మహావ్యక్తిని గౌరవిస్తున్న సమయంలో వారి చెంతనడిచి, ప్రక్క నడిచి అనుసరించడం కాదు. ఒకరి వెనక ఇంకొకరు నడిచినపుడు భారతీయ వరుస (ఇండియన్ ఫైల్) అంటారు. వీరిద్దరూ ఇండియన్ ఫైలులాంటివారు కాదు ఇద్దరూ కూడా సంఘ సంస్కరణ విషయంలో, భార్యాభర్తల విషయంలో అలా చెట్టాపట్టాలేసుకోవడం అనేది చాలా సమంజసం. అలాంటి వారికి రామ్మూర్తిగారు, సుబ్బమ్మగారు ప్రతీకలు. మన ఆంధ్రదేశంలో నాకు తెలిసినంతవరకు భార్య భర్తలుగా దుర్గాబాయ్ గారు దేశ్ ముఖ్ గారు, సరస్వతి గారు గోరా గారూ, సుబ్బమ్మగారు రామ్మూర్తిగారు అలా కనిపిస్తారు. వీరిలో రెండు జంటలు మానవతావాదం, హేతువాదం, నాస్తికవాదంతో కూడా సంఘ సంస్కరణకు పూను కున్న వారు. ఈ పుస్తకం చదువుతుంటే మనకు ఒక సిద్ధాంతపరమైన ప్రేరణ, ఉత్తేజం కలుగుతుంది. అదేమిటంటే సాంప్రదాయ సరళిని మార్చుకుని, ఆధునికతను అలవరుచుకోవా లంటే, సంఘ సంస్కరణ చేయాలంటేమానవతావాదం అనేటటువంటి సైద్ధాంతికపరమైన ప్రేరణ మనకి కనిపిస్తుంది. అయితే స్త్రీ విమోచనోద్యమ, కుల నిర్మూలన, వరకట్న నిషేధ, కులాంతర వివాహాలు ఇవన్నీ కూడా మానవతా వాదం, భౌతిక వాదం, నాస్తిక వాదంతోనే చేయాలనేటటు వంటి దానితో కొందరు నాలాంటి వాళ్ళు ఒప్పుకోరు. ఎందుకంటే సంఘంలో మనిషి పుట్టిన తరువాత వైదికంగా వున్నటువంటి వాళ్ళు, దైవం వున్నాడని నమ్మేవారు - శంకరాచార్యలాంటి వారు 'సత్కర్మ సంవర్ధితః' సత్కర్మను పెంపొందించుకోవడమే జీవిత లక్షణం, ఆధ్యాత్మిక లక్షణం కూడా అదేనని అన్నారు. వీరు చేసిన కృషి అనంతం. ఎన్నో సంస్థలు స్థాపించారు. ఎన్నో ఉద్యమాలు నడిపారు. ఎన్నో ప్రయోగాలు చేశారు. సుబ్బమ్మ గారిని అప్పుడప్పుడు కలుసుకోవడం, వారు చేసిన ఉద్యమాలను చదవడం, వినడం, మీటింగుల్లో కలుసుకోవడం నేను చేస్తూనే వున్నాను. ఇటువంటి వ్యక్తులు చాలా అరుదు. వారి సేవలు మనకు అందిస్తూ ఈ పుస్తకంలో వారు సామాజిక అన్వేషణ చేశారు. వారి యొక్క తీక్షణమైన దృక్పథం తీసుకుంటే ఈ పుస్తకంలో వారు వ్రాసిన ఒక సంఘ మార్పు ఎలాగైతే సంస్కరణకు దారితీస్తుందో మనకు కనిపిస్తుంది. ఇప్పుడు మధ్యతరగతి కుటుంబాలలో అత్తా కోడలు కలిసి వుండేటువంటి పరిస్థితి లేదు. లేనప్పుడు అటు అత్తకి, ఇటు కోడలికి కూడా చాలా సమయం దొరుకుతున్నది. స్త్రీల జోక్యం, స్త్రీల సంక్షేమం, సంస్కరణ, విప్లవం వీటికి విశ్రాంతి కాలం చాలా అవసరం, పనికి వస్తుందని కూడా అనిపిస్తుంది. స్త్రీలకు దొరికిన ఈ విరామ కాలవే పాశ్చాత్య స్త్రీలు మహిళోద్యమంలో జోక్యం

కలుగచేసుకోటానికి అవకాశం యిచ్చింది. ఇటువంటి వాటివల్ల ప్రేరణ పొంది ఇంకా అనేకమంది పైకి వచ్చి చేయడానికి వీరు నాంది వేసారనే చెప్పాలి. సమున్నత స్థాయికి చెందిన పురుషులు, స్త్రీలు వీరి యొక్క సేవచేత, చేపట్టిన కార్యక్రమాలవల్ల ప్రభావం చెంది ఇంకా సంఘ సంస్కరణ కొంతగానైనా పూర్తిగావించి దానికి పునాదులు వేస్తారని నమ్ముతున్నాను.

## ఏదైతే చెప్తారో అది చేస్తారు ఏదైతే చేస్తారో అది చెప్తారు

**- పిరాట్ల వెంకటేశ్వర్లు**

సుబ్బమ్మ గారి సిద్ధాంతాలకు, మాకు సామరస్యం లేదు కాని సహజీవనం వున్నది. సుబ్బమ్మ గారి పుస్తకాలు లక్ష కాపీలు అమ్ముడు పోయి వుండవు. ఒక వెయ్యి, రెండు వేల కాపీలు మాత్రమే అమ్ముడుపోయి వుంటాయి. కానీ అవి కూడా అన్ని ఎక్కువ అమ్ముడు పోయినాయంటే ఆంధ్ర దేశంలో మహిళా ఉద్యమంలో ఎంతటి చైతన్యం నెమ్మది నెమ్మదిగా పెరుగుతున్నది అనడానికి ఒక ఉదాహరణ.

సహజంగా ఆత్మకథ వ్రాయటంలో ఒక ఇబ్బంది వున్నది. ఎవరికైనా ఇతరుల కథలను గురించి వ్రాయడం తేలిక. ఇతరులను గురించి మనకేదైనా ప్రయోజనమున్నదైతే వారిని పొగడవచ్చు. లేదంటే వారిని గురించి వారి లోపాలను గురించి చెప్పవచ్చు. కానీ ఆత్మకథలో వున్నటువంటి లోపాలను కొద్దిగా చెబితే అమ్మో ఈమె ఎంతెంత చేసిందో పొరపాట్లు చాలా కొద్దిగానే చెప్పుకుంది అంటారు. నిజంగా చేసిన మంచి పనిని కాస్త చెప్పినప్పటికీ చూశారా ఈమె తనంతట తానే డబ్బా కొట్టుకుంది అనేటువంటిది కూడా వుంది. కానీ సుబ్బమ్మ గారు ఈ ఆత్మకథ అనేటటువంటి దాంట్లో సాహిత్యంలో తళుకులను, బెళుకులను చూపించకుండానే ఒక సరదాగా మనందరం చదువుకోవడానికి వీలుగా సహజమైన శైలిలో వ్రాశారు. ఇందులో ఒక సుమారు 30, 40 సంవత్సరాలుగా ఆంధ్రలో మహిళోద్యమం ఎలా పెరిగిందీ, మహిళల స్థితిగతులు ఏ విధంగా వున్నాయి, క్రమేణా ఎలా మెరుగవుతున్నాయి అనేది ఈ ఆత్మకథ చదివినప్పుడు అదొక మహిళా ఉద్యమ చరిత్రగా కనబడుతుంది.

సుబ్బమ్మ గారితో నా పరిచయం జయప్రకాష్ ఉద్యమంలో రామ్మూర్తిగారు జైల్లో వున్న ప్పుడు, మేమంతా ఇంకా జైళ్ళు నింపాలని ప్రయత్నాలు చేస్తున్న రోజుల్లో ఒకరోజు సుబ్బమ్మగారింటికి వెళ్ళాను. సరాసరి వెళ్ళిపోయి (అప్పటికే అక్కడ పోలీసులు వున్నారు)"సుబ్బమ్మ గారు మీరెందుకు సత్యాగ్రహం చేసి జైలు కెళ్ళకూడదు" అని అడిగాను. "నేను కూడా జైలుకెళితే 'వికాసం' పత్రిక ఆగిపోతుంది. రామ్మూర్తిగారు నడుపుతూ జైలుకి వెళ్ళారు. ఆ పత్రికను నేను నడపాల్సిన బాధ్యత వుంది" అన్నారు ఆమె. రామ్మూర్తిగారు నిర్వహిస్తూ మధ్యలో ఆగిపోయినటు వంటి ఒక ఉద్యమాన్ని తనంతట తాను ముందుకు వచ్చి నడిపించాలనేటటువంటి ఆమె వ్యక్తిత్వం మొదటిసారి నాకు అవగతమైంది. సుమారు 16 ఏళ్ళ నుండి వాళ్ళిద్దరినీ చూస్తుంటే నాకేమనిపిస్తుందంటే, వాళ్ళిద్దరిచేత సత్యనారాయణ వ్రతం చేయించి సమారాధన చేయించాలనిపిస్తుంది. సత్యనారాయణ వ్రతం ఎందుకు చేస్తామంటే సత్యాన్ని పలకండి, మనోవాక్కాయ కర్మలచేత దానిని ఆచరించండి, మీరేదైతే చెప్తారో అదే చెయ్యండి, చేస్తారో అదే చెప్పండి అనేది

చెప్పడానికే ఈ వ్రతం చేస్తారని మన పెద్దలు అంటారు. కనుక వారిద్దరి జీవితంలో కూడా నంబర్ టూ అకౌంట్ లేదక్కడ, నెంబర్ టూ లైఫ్ కూడా లేదక్కడ. ఒకరికి చెప్పకూడనటువంటి విషయం వుండదు. పొద్దున లేచి ఏం చేస్తారో, ఏం చెప్తారో ఇద్దరికీ తెలుసు. వారి జీవితం ఒక తెరిచిన పుస్తకం. కానీ ఈ విధంగా ఏదైతే చెబుతున్నారో, ఏదైతే చేస్తున్నారో దానికి ప్రతీకగా ఆదర్శవంతులుగా వారు నాకు కనిపిస్తున్నారు. ఈ ఆత్మకథలో నాకు చిన్న లోపం ఏమనిపించిందంటే ఆమె రామ్మూర్తిగారి గురించి, వారి ఆదర్శ దాంపత్యం గురించి వ్రాస్తూ అసలైన దాంపత్యం అంటే ఏమిటి అని చెబుతూ అంతమాత్రాన అభిప్రాయభేదాలు రావని కాదు అని అంటారు. అదే విధంగా వీరిద్దరి మధ్య వచ్చిన విషయాలను కూడా ప్రస్తావన చేస్తే, అది చదివి మనంకూడా బహుశా తగాదాలు వస్తే ఈ విధంగా సర్దుకుపోవాలి కదా అని తక్కిన వాళ్ళకి కూడా బాగుంటుందేమో అని నాకనిపిస్తుంది. ఎందుకంటే తన ఆత్మకథ ద్వారా ఒక సందేశాన్ని ఇవ్వాలనుకున్నారు. కాబట్టి ఈ విషయం కూడా వ్రాస్తే బాగుంటుందని నాకనిపించింది.

తన సాహిత్యం గురించి ఒక మాట అంటారు. తన సాహిత్యం తప్పక మన్ననలను పొందక తప్పదు అని. ఇది ఎంతో ఆత్మ విశ్వాసంతో, ఎంతో అనుభవంతో చెప్పిన మాట. అలా ఇది ప్రజల మన్ననలను తప్పనిసరిగా పొందటమే కాదు. సుబ్బమ్మ గారు వ్రాసిన ఈ పుస్తకాలను భావితరాల వారు అధ్యయనం చేసి అనుసరించే వారు వస్తారు. అయితే సుబ్బమ్మ గారి పుస్తకాన్ని గురించి మంచి చెప్పుకునే వాళ్ళకంటే చెడు చెప్పుకునే వారు ఎక్కువమంది వున్నారు. అలాంటి వారు సుబ్బమ్మ గారి పుస్తకాలు చదివితే ఆడవాళు ్ళ కాపురాలు చెయ్యరు, లేచిపోతుంటారు అంటుంటారు. నేను అన్నాను "ఆమె ఎక్కడ కూడా విచ్చల విడిగా తిరగమని చెప్పలేదు, ఒక భర్తని కాదు 10 మంది భర్తలని చేసుకోమని చెప్పలేదు. అలాగే పురుషునిక్కూడా ఒక భార్యకాదు పది మందిని చేసుకోమని చెప్పలేదు. ఏదైతే మనిషి సహజంగా అనుసరించాలో దానిని మాత్రమే చెప్పారు.

అయితే రామ్మూర్తి గారు "ఆమె ఆత్మకథ చదివాక నా బాధ స్వరూపం నాకు అవగతమయింది. ఆమె ఈర్ష్యాసూయలను జయించ ప్రయత్నిస్తున్నా పొగడ్తలకు ఉ బ్బిపోవడం, తెగడ్తలకు బాధపడటం మానలేదు అని తోచింది. ఉత్తముల స్థాయికి అందుకోవలిసిన ఆమె మధ్యముల స్థాయిలో ఈనాటికి వుండటం శోచనీయం. ఇది నా వ్యధ." అని రాస్తూ "సుబ్బమ్మ గారిని గురించి రాద్దామని మొదలు పెట్టి నన్ను గురించి రాసేసాను కదూ! బహుశః ఉపాధి (శరీరం) వున్నంతకాలం ఎంతవారయినా 'నేను, నా' అనే వాటిని అధిగమించటం సాధ్యం కాదేమో!" అన్నారు. అయితే ఆమెకి సన్నిహితులుగా వున్నారు కనుక ఆమె మధ్యములుగా వున్నారని ఆయన కనిపించిందేమో

గానీ, నిజానికి ఆమెను దూరం నుంచి చూసే సరికి, దగ్గర నుంచి చూసే వారికి ఆమె ఉన్నతుల స్థాయికే ఎదిగిందని - పరిశీలించిన వారికి - చాలా స్పష్టంగా అవగతమవుతుంది. తమ యొక్క పుస్తకం చదవడం ద్వారా, తమ యొక్క జీవితం ద్వారా అనేకమంది అనుసరించడానికి మార్గదర్శకులైనటువంటి వారు ఇద్దరూ.. సుబ్బమ్మ గారు తన ఆత్మకథ వ్రాస్తూ అందులో సగభాగం రామ్మూర్తిగారి కథ గురించి కూడా వ్రాసేసారు. అయితే రామ్మూర్తిగారు వ్రాయాల్సిందే. ఎందుకంటే రామ్మూర్తిగారు చేపట్టిన ఉద్యమాలు, ఆ ఉద్యమాలలో వచ్చిన మార్పులు, పరిణామాలు ఇవన్నీ కూడా భావితరాల వారు తెలుకోవలసిన అవసరం వున్నది. ఇవాళ ఆ ఉద్యమాలు ఎంతవరకు వున్నాయి అనేది కాదు. కానీ మానవ మేధస్సు, మానవ జీవనం అనే పరిణామంలో అనేక ఉ ద్యమాలు రావడం అనేది సహజం. ఆ ఉద్యమాల ప్రభావం ఏ విధంగా వుంది, ఆ ఉ ద్యమాలు నడపడానికి ఏ విధంగా ప్రయత్నాలు చాలు అనేటటువంటి చరిత్ర రామ్మూర్తిగారి ద్వారా రావలసిన అవసరం వున్నది. కనుక ఇద్దరి గురించి వచ్చినటువంటి పుస్తకంలో, మహిళా ఉద్యమాన్నే కాదు, మానవ వికాసానికి తోడ్పడేటటువంటి ఒక అమూల్యమైన తన యొక్క ఆత్మకథలో తన యొక్క అనుభవైక వేద్యాన్ని రంగరించి మనకందించిన సుబ్బమ్మగారిని మీ అందరి తరఫున మొత్తం మానవాళి తరఫున అభినందిస్తున్నాను.

# పచ్చి మట్టిలో పెరిగిన వృక్షం

(ప్రసంగ పాఠ సారాంశం),

**– డా॥ సి. నారాయణరెడ్డి**

మట్టిలో వున్న వేళ్ళు అంతవరకే ఆగిపోకుండా, వేళ్ళు తన్నుకున్నటువంటి మొక్క ఒక వృక్షంగా మారితే ఆ క్రమ పరిణతి ఏమిటో సుబ్బమ్మ గారి జీవితం చెబుతుంది. నేను మొన్ననే నా కవితలో అన్నాను ఎంత రాచ మొక్కయినా... రాచ మొక్కన్నాను... మొక్కల్లో కూడా కొన్ని రాయల్ మొక్కలు వుంటాయి. ఫారిన్ పేర్లు, లాటిన్ పేర్లుంటాయే అవి రాచమొక్కలు. మన వేపచెట్టు, తుమ్మ చెట్టులా కాకుండా మంచి మంచి పేర్లుంటాయి. ఎంత రాచమొక్కయినా సిమెంటులో మొలవదురా అన్నాను. సుబ్బమ్మ గారనే మొక్క పచ్చిమట్టిలో మొలిచింది. అయితే అంతటితోనే ఆగిపోకుండా ఆమెకు జరిగిన దోహదంతో ఆమె వృక్షంగా మారింది. చివరికి ఒక వృక్షం తాను పెరిగి వాతావరణానికి ఆరోగ్యం పంచినట్లుగా, ఆశ్రితులకు నీడనిచ్చినట్లుగా, కోరుకున్న వారికి పూలు ఫలాలు ఇచ్చినట్లుగా సుబ్బమ్మ గారు అనే ఒక వృక్షం మళ్ళీ మల్లాది సుబ్బమ్మ అనే ట్రస్టుకే తనకున్న కాస్త సంపదను అర్పణం చేయడం చెట్టు తనకున్న జీవసారాన్ని మళ్ళా వేళ్లకందించినటువంటి గొప్ప విషయంగా నేను భావిస్తున్నాను.

వీరి జీవితంలో, వీరు సాధిస్తున్న వ్యక్తిత్వంలో తమ అభిప్రాయాలను క్రోడీకరిస్తూ చెప్పింది హేతువుతోనే మనిషిని సంస్కరించవచ్చు అని. అంధ విశ్వాసాలను నిరసించాలనే అభిప్రాయంతో చెప్పారు. వారు ఆదర్శానికి ఆచరణ రూపం ధరించారు. సుబ్బమ్మ గారి వ్యక్తిత్వానికి పట్టిన అద్దం ఈ గ్రంథం. ఈ గ్రంథాన్ని విడిగా చూడలేం మనం. సుబ్బమ్మ గారి జీవిత రేఖ అందులో పలికింది. అందులో నగిషీలు లేవు, అలంకారాలు లేవు, శైలి సామ్యత లేదు, శైలి వైవిధ్యం లేదు. సుబ్బమ్మ గారు ఎలా మాట్లాడారో చచ్చినట్లు ఆ గ్రంథం అలా మాట్లాడింది. కాబట్టి ఆ దృష్టితో సుబ్బమ్మ గారి వ్యక్తిత్వం దానికి అద్దం పడుతుంది. సుబ్బమ్మ గారి వ్యక్తిత్వం ఎలాంటిదంటే పత్తి పువ్వు రాలిపోయి కాయవుతుంది. ఆ కాయ చిట్లుతుంది. కాయ చిట్లితే పత్తి అవుతుంది. సుబ్బమ్మ గారు నవ్వితే నాకు చిట్లిన పత్తికాయలా అనిపిస్తుంది. గాంధీజీ బోసి నవ్వులాగా, చిట్లిన పత్తికాయలోని పత్తిలాగా వుండి అది ఒక ఆదర్శంగా నిలిచింది. దేశం మానం కాపాడాడు బోసినవ్వు గాంధీజీ, దేహం మానం కాపాడుతుంది పత్తి పువ్వు. ఈ రెంటి యొక్క సమన్వయం సుబ్బమ్మ గారి వ్యక్తిత్వం.

# సిసలైన మానవ వాది

(ప్రసంగ పాఠ సారాంశం)

**– ఆవుల సాంబశివరావు**

సుబ్బమ్మ గారిని ఎరిగి వుండటం అంటే వక అగ్నిశిఖను ఎరిగి వుండటం. ఒక ఉద్యమ కర్తను, సాహసురాలిని ఎరిగి వుండటం. ఏ కార్యమైనా ఆలోచించి, అందులోని మంచిచెడులను నిర్ణయించుకుని, కార్యక్షేత్రంలోకి దిగిన తరవాత దేనికీ వెనకాడనటువంటి సాహసవంతురాలు ఆమె.

హేతువాదం మొట్టమొదట ఆమె గారిని ఆకర్షించింది. ఆకర్షించిందే తడువు హేతువాదాన్ని ఆమె ఆవలంబించింది. జీవితంలో అమలు జరిపింది. చాలామందికున్నటువంటి క్లిష్ట సమస్య, పరీక్ష ఇదే. అభిమానం వుంటుంది. కొంతలో కొంత నమ్మకం వుంటుంది. ఆచరణకు వచ్చేటప్పటికి చాలా కష్టమైన విషయం. ఆమెలో ఏ రకమైన సందేహం లేదు. ఆమె హేతువాదాన్ని నమ్మింది. అక్షరాలా జీవితంలో దాన్నే ఆచరించింది. అదీ ఆమె గొప్పతనం. హేతువాదంలోంచి మానవవాదంలోనే తరువాత మెట్టు. ఆ తర్వాత జరిగిన ఆమె ఉద్యమమంతా హేతువాదంలోంచి మానవవాదం అనేటటువంటిది అమలు జరిగితే ఏ విధంగా వుంటుందో మనిషి ఏ విధంగానైతే తీరుతెన్నులు, తన వ్యక్తిత్వాన్ని దిద్దుకుంటాడో దానికి నిదర్శనంగా, ఆదర్శంగా సుబ్బమ్మ గారు నిలిచింది. శిసలైన మానవవాది ఆమె.

ఏదిబడితే అది ప్రపంచంలో వున్న సమస్యలన్నింటినీ భుజాన వేసుకోవడమనేది ఏ వ్యక్తికీ సాధ్యం కాదు. గాంధీగారు అనేక సమస్యలు తీసుకున్నారు. సుబ్బమ్మగారు జనాభాలో సగంగా వున్నటువంటి మహిళల దుస్థితి ఆమెకు మొట్టమొదట కనిపించింది. ఇదిగో దీనిని నేను నా మొట్టమొదటి జీవిత కర్తవ్యంగా తీసుకుంటాను. నేను ఇన్ని ఏళ్ళుగా సంపాదించుకున్నటువంటి హేతువాద పరిజ్ఞానం, మానవవాద పరిజ్ఞానంతో మొత్తం మహిళలను ఉద్ధరించే ప్రయత్నంలో, స్త్రీ, విమోచన ఉద్యమంలో నేను చేస్తాను అని అక్కడినుండి స్త్రీ, విమోచన ఉద్యమం ఆమెకు నిత్య కార్యక్రమం అయింది. నిత్యమే కాదు అనుక్షణం అదే అయింది. అదే ఆరాటం స్త్రీ విమోచన, అదే పోరాటం.

ఆత్మకథకు, జీవిత కథకు తేడా ఏమిటంటే ఆత్మకథలో ఏ సంఘటనకు తను ఏ విధంగా స్పందించింది, ఏ విధంగా మారింది అనేటటువంటిది వారి అంతరంగంలో నుంచి వస్తుంది అది అందులో వస్తుంది. అందుకే ఆమె ఆత్మకథ వ్రాసింది. అటువంటి జేగీయమానమయినటువంటి కార్యకర్త జీవితం ఇది. అది మనందరికీ ఆసక్తిని కలిగించి,

స్ఫూర్తిని కలిగించేటటువంటి కథ అవుతుందని మనకు తెలుసు. ఇటువంటి తన ఆత్మకథను ఒక ఉద్యమం, ఒక పోరాటం జరిపి విజయాన్ని సాధించిన వ్యక్తి తన కథను మనముందుంచినందుకు సుబ్బమ్మ గారిని మనసారా అభినందిస్తూ, ఆమెకు ఇంకా ఎన్నో విజయాలు చేకూరాలని ఆమెకు నా శుభాకాంక్షలు అందజేస్తున్నాను.

# మహిళా కంచుకంఠం మల్లాది సుబ్బమ్మ

**– జ్వాలాముఖి**

వీరేశలింగం పంతులుగారు ఆత్మకథ ఎంత గొప్పగా వ్రాశారో వీలునామా అంతకన్నా గొప్పగా వ్రాశారు. ఆ వీలునామాలో వారు ఒక వాక్యంలో తల్లడిల్లిపోయారు. అది స్వాతంత్ర్యోద్యమ కాలం. "'నిజమే మీరంతా దేశానికి స్వాతంత్ర్యం కావాలని ఉవ్విళ్ళూరుతున్నారు. ఎనలేని త్యాగాలు చేస్తున్నారు ప్రశంసనీయమే. కానీ స్వాతంత్ర్య ఉద్యమం జరుగుతున్న సమయంలో కాని, ఆ తర్వాత స్వాతంత్ర్యం వచ్చాక కాని మీ ఇంట్లో వుండే స్త్రీల విముక్తి సంగతి ఏమిటి?" అని మొత్తం తెలుగుజాతి సంస్కృతికి ఒక శేష ప్రశ్నను ఆయన వదిలిపోయారు. ఆ ప్రశ్నకు సమాధానం కనుక్కోవడానికి చాలామంది తమ శక్తియుక్తులా ప్రయత్నం చేశారు. సుబ్బమ్మగారి దగ్గరికి వచ్చేటప్పటికి మౌలికంగా సమాజంలో ఈ తాత్విక చింతనలో గణనీయంగా మార్పు వచ్చింది. మిక్కుటమయిన ఆకాంక్షతో నేను చదువుకోవాలి, చదువుకోవాలి, అని మీరు తపన పడ్డారు. ఈ దేశంలో వుండేటటువంటి సమస్యలన్నీ చదువుకునే వారివి. చదువురాని వాళ్ల వల్ల కాదు. చదువుకంటే సంస్కారం గొప్పది. అది మీకు అబ్బింది. సభాముఖంగా మీకు జోహార్లు అర్పిస్తున్నాను. ఆ వీరేశలింగంగారు వదిలిపోయిన మీ ఇంట్లో వుండేటటువంటి స్త్రీ సంగతి ఏమిటి అనే ప్రశ్నకు తాను సమాధానం కనుక్కోవాలనేటటువంటి తపనలాంటిది ఆమెకు ప్రేరణగా ఒక రకమైనటువంటి శేష ప్రశ్నకు వారసత్వంగా ఆమెకు సంక్రమించింది. అందుకే వారికి ప్రాతస్మరణీయులుగా నిలిచినటువంటి వారు వీరేశలింగం పంతులుగారు. ఎప్పుడు మనసు వికలంగా వున్నా, ఏ సమస్యకు పరిష్కారం దొరక్కపోయినా అప్పుడు వీరేశలింగం గారి గ్రంథాన్ని ముఖ్యంగా ఆత్మకథని పేజీలు తిప్పడం, ప్రేరణ పొందడం, స్ఫూర్తిని తెచ్చుకోవడం ఆమెకి పరిపాటి అయింది. అది ఆమె పరిపూర్ణ వ్యక్తిత్వవికాసానికి దోహదపడింది.

కాపురానికి వెళ్ళిన తొలి రోజుల్లో ఎదురొచ్చిన సమస్యలు ఆమెను నిలదీశాయి. సరే మనకు తెలుసు, మతం తాత్విక చింతనగా వున్నంత కాలం సమాజానికి పెద్ద నష్టం చేయదు. మతం రాజకీయ శక్తిగా, వ్యాపారంగా మారిననాడు అది జీవితాన్ని కల్లోలపరుస్తుంది. సమాజాన్ని కుంటుపరుస్తుంది. మొత్తం ప్రపంచాన్నే కలవరపరుస్తుంది. మానవుడు 20 శతాబ్దాలుగా సాధించిన నాగరికతను కూడా విచ్ఛిన్నం చేస్తుంది అనేది గత సంవత్సరంలో మనం చూశాం. ఒక మహాత్ములు వారికి గురూపదేశం చేయడానికి వచ్చారు. సాక్షాత్తూ అత్తగారే వెళ్లి గురూపదేశం పొంది రమ్మని అన్నా కానీ అతని కాలక్షేపానికి చెప్పిన వాటిల్లో గురువుగారికి తను, ధన, మన ప్రాణాలు సమర్పించుకోవాలనే బోధలు విని తనువు సమర్పించుకోవడమేమిటి అనే దాని దగ్గర

నుంచి ఆమె కొక ప్రశ్న మొదలయింది. అదే 'పాతివ్రత్యం నుండి ఫెమినిజం దాకా'. ఇక అప్పటి నుంచి ఆమె ప్రశ్నించుకోవడం మొదలు అయింది.

ఎవరైనా ప్రపంచాన్ని, సమాజాన్ని విమర్శించదలుచుకున్న వారు ఆత్మ పరిశీలన చేసుకోవడం అవసరం. అది ఆమె తనకు తానుగా తాను చేసిన తప్పిదాలకు అద్దంగా నిలబడ్డారు. ఎవరైనా ఇతరులకు అడ్డంగా నిలబడవచ్చుగాని, ఒక సమాజ చరిత్రకు అర్థంగా నిలబడవచ్చుగాని, తనకు తానుగా అద్దంగా నిలబడి తను చేసిన మంచి చెడులను బేరీజు వేసుకుని, అయితే దోషి కాకపోతే కొంచెం మంచి అని రెండు రూపాలుగా ఆమె సమాజం ముందు నిలబడే సంస్కారాన్ని సంతరించుకున్నారు. మొదటిది, తన గురువుగారి ఉపదేశంవల్ల తిరుగుబాటు ధోరణిరావటం, ఆ తర్వాత అన్నిటికంటే ముఖ్యంగా సరే ఆమే చెప్పుకున్నారు నాలుగు కారణాలని. హైదరాబాదుకు కుటుంబ నియంత్రణ శిక్షణకు రావడం అది చదువుగా ఉపయోగపడిందే గానీ ఆలోచన క్రమంలో ఒక మార్పుకు దోహద పడింది గోరాగారి ప్రసంగాలు వినడం, గోరా గారి అధ్యయన తరగతులలో పాల్గొనడం. కానీ అక్కడక్కడ ఆమెకు అసంతృప్తి వెన్నాడింది. ఆ తర్వాత హ్యూమనిస్టు ఉద్యమం, రాయ్ ఉద్యమం. భారతదేశంలో భారతీయ సంస్కృతి గురించి చాలామంది ఆలోచించారు. వివేకానందుడూ ఆలోచించాడు. గాంధీ ఆలోచించాడు. గాంధీ ఎప్పటికీ కూడా భారతదేశాన్ని గతంతో ముడి పెట్టటానికి ప్రయత్నం చేశాడు. గతం యొక్క భారాన్ని తిరిగి ప్రస్తుతం ఆవహింపజేసేటట్లుగా చేశాడు వివేకానందుడు. ఇవి నేనన్నమాటలు కాదు ఆవుల గోపాలకృష్ణమూర్తి గారన్న మాటలు. కానీ రాయ్ ఈ దేశంలో వున్న ప్రతిదాన్ని గురించి మౌలికంగా ఆలోచించిన మౌలిక తాత్విక చింతకుడు. కాబట్టి భారతనారి గురించి వున్న అపోహలన్నిటిని గురించి ఆలోచించడానికి ఆయన చాలా గట్టిగా కృషిచేశాడు. ఆ పుస్తకం ఆమెను ఆమె మెదడును తొలిచి పారేసి గతం నుంచి ప్రస్తుతానికి లాగి ఇవతల పడేసింది. ఇది చాలా గొప్పదైనటువంటి మౌలికమైనటువంటి మార్పు. సరే అయితే ఇన్ని తెలిసాక నేనేం చేయాలి? చేయడానికి నేను, నేను అనేటటువంటి భావం ఆమెను పట్టి నేను నుంచి మొదలై నేనుతో సమాప్త మవుతుంది ఆమె ఆత్మకథ. ఇందులో ఆమె సమిష్టితత్వంలో లీనమయ్యే నేను. ఈమె తన మూడు అంశాలు తన మార్గాలుగా తీసుకొంటుంది. ఒకటవది ఈ ప్రపంచంలో ముఖ్యంగా భారతదేశంలో భారతీయ సమాజంలో స్త్రీ ఎందుకు దీనావస్థలో వుంది? ఎందుకు వంటింటి కుందేలుగా వుంది? ఎందుకు అబలగా వుంది? ఆమె మీద విరుచుకు పడుతున్నటు వంటి బైటి ప్రపంచం యొక్క దాష్టికం, ఇంట్లో వుండేటటువంటి క్రూరం ఈ రెండింటితో ఆమె ఎలా పోరాడాలి? పోరాడాలంటే తగిన అవగాహన కావాలి. దాన్నే ఆమె ప్రచారం అంటే బాగా విద్యా ప్రచారం, బాగా అభిప్రాయాల ప్రచారం, సిద్ధాంతాల ప్రచారం ద్వారా ప్రజలను ప్రబోధితుల్ని చేయాలి.

ముఖ్యంగా స్త్రీ జాతిని ప్రబోధితుల్ని చేయాలనేది ఆలంబన సూత్రంగ గ్రహించింది. రెండవది, సమస్యలు మనకన్నా ముందే, మనం అంతా తయారై ముందుకు వస్తే, మనమంతా ఆందోళన చేసే వరకు ఆగవు. ఇంకా కొత్త కొత్త సమస్యలు వస్తాయి.

దాష్టికమైనటువంటి ఈ సొసైటీ ముందు ఒక ఆందోళన చేయాలి. ఒక ఉద్యమం చేపట్టాలి. 'ఒక్కరూ నీ కేక విని 'ఓ' యనకున్నా ఒక్కడవే నీ ఒక్కడవే కదిలిపో' కాబట్టి నీ ఒక్కడివే, వినకపోనీ గానీ, అది ఎంత చిన్నదైనా కానీ మీరు బయటకు రావాలి. ఈ మౌనాన్ని బద్దలుకొట్టాలి. ఈ సోమరితనాన్ని బ్రద్దలు కొట్టాలి. ఈ పట్టించుకోని తనాన్ని ఆమూలాగ్రం పెరికి వేయాలి. ఇది చాలా గొప్ప నిర్ణయం. చాలామంది చదువుకుంటాం, థీసిస్ రాస్తాం, పరిశోధనా వ్యాసాలు రాస్తాం. కార్యాచరణ కావాలి. ఆందోళన అవసరం. ఇది ఒక ఆలంబన సూత్రంగా ఆమె ఆవహించుకుంది. మూడవది, సరే, మనకు అభిప్రాయాలు ఉన్నాయి. ప్రచారం చేస్తాం. మనకు జ్ఞానం వచ్చింది. చైతన్యాన్ని కలిగించడానికి ప్రయత్నం చేస్తాం. నిజమే మనకు కొంత చైతన్యం వుంది ఉద్యమిస్తాం. కానీ నీ ఒక్కడివేనా? నీ ఒక్కడివే ఉద్యమిస్తే అది నీతోనే అంతమై పోతుందే! కాబట్టి నీతో ఉద్యమించే వాళ్ళు, నీ లాగా బాధపడే వాళ్ళు మిగతా వాళ్ళందరినీ సమీకరించి ఒక తాటిమీదకి తేవాలి. అది నిర్మాణాత్మక సంఘటన. ఈ మూడు అంశాలను అంబేద్కర్ చెప్పాడు తన యొక్క ఉద్యమంలో. ఆ మూడు అంశాలని ఆమె స్వీకరించింది. Education, Agitation, organisation ఈ మూడింటిని ఆమె ఒక చోట త్రిమూర్తులు ఒకటైనట్లుగా చేపట్టింది. ఎక్కడైనా ఆంధ్రదేశంలో కంచు కంఠం ఖంగుమందంటే ఎవరో కాదు తెలుగుదేశంలో తెలుగు మహిళ, 40 సం.ల తెలుగు మహిళ యొక్క వికాస చరిత్రను మూర్తీభవించే మహిళా కంచు కంఠం మరెవ్వరో కాదు ఆమె మల్లాది సుబ్బమ్మ గారు. అది కూరగాయల ఉద్యమం కానీయండి, పౌర హక్కులు కానీయండి, ఇంకే ఉద్యమం కానీయండి, అది అన్యాయం కాని, అక్రమం కానీ, దుర్మార్గం గానీ ఇంకేదైనా కానీయండి. ఆమె ముందుకు వచ్చి చేసేటటువంటి ఆ నిర్మాణం గొప్పది. మంచి సంస్థలు స్థాపించి అందులో చాలామందికి ఆశ్రయం కల్పించింది. బహుశ సాహిత్యకంగా ఆమె వ్రాసిన విషాద గాథలు అందరూ చదివి తీరాలి. మిగతావి చదివినా చదవకపోయినా ఇవి మాత్రం చదవాలి. విషాదగాథలు ఒక్కొక్కరూ వచ్చి చెప్పినవి. మగవాడి దుఃఖం తెలిసిపోతుంది. వాడు ఏడుస్తాడు, నటిస్తాడు. స్త్రీలు ఈ సమాజం యొక్క దౌష్ట్యం వలన కనిపించని కన్నీరు కారుస్తారు. నడయాడే కన్నీటి కుండల్లా వుంటారు. వాళ్ళ సమస్యల్ని అర్థం చేసుకోవాలి. మనలో వున్నంత చైతన్యం వారిలో వుండదు. అన్నీ పటాపంచలు చేస్కుని రమ్మంటే రారు. అనేక రకాల బాధలతో సతమతమవుతుంటారు. అలాంటి గాథలు ఎన్నో ఈ పుస్తకంలో ఉదహరించారు. కాబట్టి ఆమెలో కనిపించేటటువంటి గొప్పవైన లక్షణం బాధ్యతతో కృషి చేయటం. తరువాత హేతువాదం,

ఆ తర్వాత ఫెమినిజం. ఈ ఫెమినిజం అనేటటువంటిది కొంచెం అభారతీయంగా కనబడుతుంది. కాని ఒక మాట, మహిళా ఉద్యమమే మంచిది మనకు. అది ఆత్మ విశ్వాసానికి, చైతన్యానికి సంబంధించింది. సంస్కృతికి సరిపడేది. ఈ ఫెమినిజం అనేది పాశ్చాత్య దేశాలలో వచ్చిన ధోరణులు కాదు. అవి అభివృద్ధి చెందినటువంటి దేశాలు. అది వికృతంగా అభివృద్ధి చెందినటువంటి సమాజం. అది కుటుంబాలు విచ్ఛిన్నమై పోతున్నటువంటి సమాజం. కాబట్టి అలా కుటుంబాలు విచ్ఛిన్నమై పోతున్న సమాజంలో ఫెమినిజం ఒక పోలికేక, వెర్రి కేక. కానీ కుటుంబాలు విచ్ఛిన్నం చేయటానికి వీలులేనటువంటి రాజకీయ అవసరం మనకున్నది. ఎవరైనా విడాకులు తీసుకుంటే అభ్యంతరం లేదు. కానీ సమాజానికి ఉపయోగపడితే. లేకుంటే అది వ్యక్తిగతమైంది. కాబట్టి ఈ ఫెమినిజాన్ని అన్ని ఫెమినిజాల్లో వున్న మంచి లక్షణాలని తీసుకుని ఆమె అంబేద్కర్ ఇండియన్ కాన్స్టిట్యూషన్ తయారు చేసినట్లుగా హ్యూమనిస్టు ఫెమినిజాన్ని సిద్ధాంతీకరించారు. ఇది ఒక బాధ్యతతో, ఒక నిర్మాణంలో వచ్చిన అనుభవంతో చేసిన పని. కానీ ఆమెయే ఇంకొక సందర్భంలో బాధపడ్డారు. ఎక్కడికి వెళ్ళి స్త్రీలకు పురుషాధిక్య ప్రపంచం గురించిగానీ స్త్రీలు పడే బాధల గురించి గానీ చెప్తామంటే సహజంగా వారు పడే కష్టాలున్నాయి. చదువుకున్న స్త్రీలకు వారి సమస్యలున్నాయి. చదువులు వచ్చి రాని వాళ్ళు, నిత్య సమస్యలతో సతమతమయ్యేవారు – వాళ్ళు వచ్చి కుట్టుపని నేర్పుతారా, టైపు నేర్పుతారా అని అడుగుతున్నారని ఆమె మధన పడింది. క్రియాశీల సభ్యులు రావడం లేదని మధన పడింది. ఇక్కడ మీరు మీ 40 ఏళ్ళ జీవిత చరిత్రని ఒక్కసారి ప్రశ్న వేసుకోవాలి. కారణం వీరేశలింగం పంతులుగారి దగ్గరకి వెళ్ళండి. ఆయన తాను ఎవరికైనా పునర్వివాహం చేస్తే తాను వ్రాసిన ఏ పుస్తకానికి వచ్చిన 15 రూపాయలు ఆ దంపతులకే ఇచ్చే వారు. కాబట్టి సాంఘిక ఆదర్శం వెనుక ఒక ఆర్థికమైన పునాది వుండాలి. కాబట్టి దేశంలో వున్న సమస్యలన్నీ కేవలం సాంఘిక సమస్యలు కావు. కేవలం మతపరమైనవి కావు. ఈ దేశం యొక్క సాంస్కృతిక పరమైన సమస్యలన్నీ కూడా ఆర్థిక పరమైనవి. స్త్రీ, ఇంత నీచంగా చూడబడటానికి కారణం ఫ్యూడల్ సమాజం యొక అవశేషం. ఫ్యూడల్ సమాజాన్ని నిర్మూలించకుండా ఫ్యూడల్ సంస్కృతిని నిర్మూలించడం సాధ్యమా?

అయితే అంతవరకూ చేతులు కట్టుకుని కూర్చోవాలా. రమీజా, చావవలసిందేనా. హసీనా చావవలసిందేనా, కాదు, కాదు. మీరు చేయవలసింది మొత్తం ఫ్యూడల్ సమాజ నిర్మూలనలో అంతర్లీనంగా సాంస్కృతిక పోరాటమేగానీ దానికి బాహిరమైనటువంటిది మాత్రం కాదని సవినయమైనటువంటి మనవి. అందుకే ఆ అంతఃకరణతోనే ఏమన్నారో తెలుసా? సమసమాజం కావాలన్నారు. అందుకొరకు ప్రయోజనాత్మకంగా మీలో ఒక ఆశారేఖ వుండి వుండాలి. ఎక్కడ చలం విఫలమయ్యాడో ఎక్కడ వీరేశలింగం

విఫలమయ్యాడో, ఎక్కడ పెరియార్ విఫలమయ్యాడో, అక్కడ మనం వుండి పోదామంటే మీ మనవలు మిమ్ము క్షమించరు. అంతకంటే ముందుకు రావాలి. ఇంకా రెండు అడుగులు ముందుకు రావాల్సిన అవసరం వుంది. ఇంకా చాలా క్రూరంగా సమాజం పతనం కావడానికి సిద్ధంగా వుంది. ఎందుకంటే ఆర్థిక సంక్షోభం పెరిగే కొద్దీ జీవిత విలువలన్నీ పాడై పోతాయి. చెల్లా చెదురయి పోతాయి. సువ్వే మిస్తావు బామ్మా ఏమి తీసుకొచ్చావు అనే ఇచ్చి పుచ్చుకునే ఇచ్చకాల సంబంధాలే నిలబడబోతున్నాయి మధ్య తరగతి కుటుంబాలలో. కాబట్టి దీనికి భిన్నంగా ఆలోచించాలి అని ఈనాడు మీరంతా ఆలోచించాలి. ఎవరైనా ఒక రంగంలో చాలా కృషిచేస్తే ఆ రంగంలో నిష్ణాతులౌతారు. ఇంకొకరు ఇంకో రంగంలో చేస్తే గొప్ప ఇంజనీరు గానో, డాక్టరుగానో, గొప్ప కవిగానో, కళాకారుడుగానో కావచ్చు. కానీ ఎవరైతే తమది తిరిగి ఆ సమాజానికి దత్తం చేస్తూ, ఆ ప్రజలకు సేవ చేస్తే వాళ్ళు ప్రజల మనిషి అవుతారు. ఆ కోవలో ముందుకు నడిచిన సుబ్బమ్మ గారికి ధన్యవాదాలు, అభినందనలు చెబుతున్నాను.

ఇంకొక విషయం కూడా ఒక హెచ్చరికగా తీసుకోవాలి. మన మహా పురుషుల మంచి కోర్కెల మూలంగా సమాజం మారదు. సమాజంలో మార్పును కోరే వారూ, దానిని వ్యతిరేకించే వారు, స్వార్థపరులు, పరహితార్థం కోరే జనులు వీరి మధ్య నిత్యం జరిగే సంఘర్షణలలో నుంచి అభ్యుదయం చెందేటటువంటి వికాసమే అది మార్పుకు కారణమవుతుంది. కాబట్టి ఆ క్రమంలోనే మనం చేసే సాంఘిక సంస్కరణలు గానీ చేపట్టే ఉద్యమాలు గానీ ఆ మార్గంలో పోయినట్లయితే సమాజానికి చాలా మేలు కలుగుతుంది.

అలాగే మీరు ఇన్నాళ్ళు చదువుకున్న వాళ్ల గురించి, మధ్య తరగతి వాళ్ళను గురించి చేశారు. చేయడం తప్పుకాదు, చేయాల్సిన అవసరం వుంది. అందులో నుంచి కార్యకర్తలు వస్తారు కానీ గ్రామీణ స్త్రీల కోసం ఏదైనా తల పెట్టి, వృత్తి శిక్షణ లాంటిది చేపట్టి ఆ మార్గంలో కృషి చేస్తే చాలా బాగుంటుంది. మనకు పరిధులు విధించుకుందాం. ఏదైనా రాజకీయంగా ఆలోచించండి. రాజకీయానికి సంబంధించిన ఆర్థికమైన దృక్పథం కలగందే, పరిపూర్ణత వుండదేమో! ఎందుకంటే మీరు వేసుకున్న ప్రశ్న "ఎందుకు ముందుకు రావడం లేదు నా తర్వాత రావాల్సినంత మంది రావడం లేదే, కుట్టు నేర్పుతారా అనే గానీ ఉద్యమానికి సంబంధించి ఎందుకు రావడం లేదు? ఈ ప్రశ్నని మరీ మరీ ఆలోచించకుంటే తగిన సమాధానం రావడానికి అవకాశం వుంటుందని నా అభిప్రాయం. 40 ఏళ్ళ తన జీవిత చరిత్రలో తెలుగు మహిళ జీవితాన్ని చిత్రించిన సుబ్బమ్మ గారికి నా ధన్యవాదాలు.

# ఆత్మ కథావిష్కరణాంజలి

ఓ మహనీయ మానినీ!
మధుర మంజుల భాషిణీ
నారీ ఉద్యమ విహారిణీ
మానవతా విప్లవ కారిణీ
మహెూన్నత సంజీవనీ
అందుకొమ్ము
ఆత్మకథావిష్కరణాంజలులు
విప్లవ భావరంజనీ
విజ్ఞాన గని సర్వస్వినీ
వచనా క్రియ భంజనీ
విమోచనా ప్రక్రియ ధారిణీ
అందుకొమ్ము
ఆత్మకథావిష్కరణాంజలులు
సర్వజన ప్రియ మహితా ఉద్యమదాతా
పావన ప్రపంచ ఉత్సాహ ప్రోత్సాహ ప్రదాతా
మహిళా పునరుజ్జీవన సంగీత సంధాతా
మల్లాది మాణిక్య ప్రసాద మాంధాతా
అందుకొమ్ము
ఆత్మకథావిష్కరణాంజలులు
మహిళాభ్యుదయ నాయికగా
అభ్యుదయ వివాహ వేదికాదాయిగా
స్నేహజన ప్రియబాంధవిగా
నారీ ప్రపంచ కలికి తురాయిగా

అందుకొమ్ము
ఆత్మకథావిష్కరణాంజలులు
స్త్రీ స్వేచ్ఛా జననీ!
సత్యాన్వేషిణీ!
సంస్కరణాభిలాషిణీ!!
నిర్మల నిష్కళంక నిస్వార్థ
నిరుపమాన జీవన సేవాపయనంలో
అడుగు అడుగునా ఆహ్వానాలే
మెట్టు మెట్టునా సన్మానాలే
ఆహ్వాన సన్మాన సత్కారం
పరంపర దొంతరలలో
నవ్యమై
భవ్యమై
దివ్యమై
సమసమాజ నిర్మాణ యజ్ఞంలో
కీర్తి ప్రతిష్ఠలతో దివిటీలా వెలుగుతున్న
విరామ మెరుగని వినీలమూర్తీ
అందుకొమ్ము
ఆత్మకథావిష్కరణాంజలులు

**– ఝాన్సి**

అరువది ఏడేండ్ల వయస్సులో మహిళోద్యమానికి అహరహం శ్రమించే కార్యకర్త సుబ్బమ్మ గారు. మహిళోద్యమ సారధి. స్త్రీ జనోద్ధరణయే ఆమె ప్రాణం. మానవవాద ఫెమినిజమే ఆమె ఊపిరి. ధైర్యం, సాహసం, పట్టుదల, నిబద్ధతలే ఆమెకు బలం.

నలుబది ఏండ్లుగా తన తోటి స్త్రీ లోకానికి యధోచిత సేవ జేస్తూ, మహిళల్లో జాగృతిని, చైతన్యాన్ని రేకెత్తించే ఉద్యమం ఆమె భావవాహిక, ఆచరణ శీలతకు నిదర్శనం.

మహిళోద్యమానికి అవసరమైన సాహిత్యాన్ని, సారస్వతాన్ని ఇతోధికంగా సృష్టి చేసిన ఘనత ఆమెది. వ్యాసం, విమర్శ, నవల, కథ, బాల సాహిత్యం, వయోజన సారస్వతం ఇవన్నీ ఆమె చేపట్టిన సాహితీ రూపాలు.

ఆమె వక్త. సంఘ సంస్కర్త, కులాతీత మతాతీత కట్నరహిత వివాహాలను ప్రోత్సహించి జరిపించడం ఆమె ప్రత్యేకత. స్త్రీ విమోచన కార్యకర్తలకు శిక్షణ యివ్వటం ఆమె విశిష్టత. ప్రబోధకురాలిగా సహకార్యకర్తలను ఉ త్తేజపరచటం ఆమె నైజం.

స్త్రీల సర్వతోముఖ వికాసమే ఆమె లక్ష్యం. ఆర్థిక స్వావలంబనం, అధికార ప్రాప్తి, హక్కుల అనుభవం, స్వేచ్ఛ స్త్రీలకు అందుబాటులోకి రావాలని ఆమె ఆకాంక్ష. అందుకోసం పది సంస్థలను, రెండు ధర్మ సంస్థలను స్థాపించిన నిర్మాణోద్యమ కార్యకర్త. మహిళలకు విజ్ఞానాన్ని, వివేకాన్ని అందించే 'స్త్రీ స్వేచ్ఛ' పత్రిక ఎడిటరు.

నిరంతర విద్యార్థిగా, క్రియాశీల కార్యకర్తగా మనుగడ సాగించడమే ఆమె ఆదర్శం.

# పాతివ్రత్యం నుండి ఫెమినిజం దాకా

ఆత్మకథ

మల్లాది సుబ్బమ్మ

